యువభారతం

– పింగళి పాండురంగారావు

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

YUVA BHARATHAM

By
Pingali Pandurangarao

ePublications: 2024

Published by

Sri J. Syamala Rao, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

Pingali Pandu Ranga Rao
M.A.(Eng)., M.A.(P.A)., B.Ed.,
Principal (Rtd.)
A.B.M. Degree College, Ongole.
C.M.B.C. Degree College (Women), Ongole.
A.B.M. Degree College, Kavali.

Phone : 08592-232126
Cell : 94405 54114
"Srirangadhamam"
8-71, Lawyerpet,
ONGOLE - 523002
kripanidhiom@gmail.com

తొలి పలుకు

తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి. ఈ నానుడిని నిజంచేస్తూ ద్రాక్షాపాకంలా సాగిన మహాభారతాన్ని మీ ముందుంచి రసాస్వాదనకై ఆహ్వానిస్తున్నాను.

భారతీయ సాహిత్యంలో మహాభారతం యొక్క స్థానం మహోన్నతమైంది. దీనిని పంచమవేదం అని పిలుస్తారు. వేదాలవలె మహాభారతానికి కూడ మహా ఆదరణ ఉంది. ఇందులో ధర్మార్థకామమోక్షములను పురుషార్థముల నిరూపణ జరిగింది.

అష్టాదశ పురాణాలను, వేదవేదాంగాల యుక్తంగా మహాభారతంలో చూస్తే, సమానంగా వుంటాయని తెలుస్తుంది. వేదవ్యాస విరచితమైన మహాభారతం విశ్వవిఖ్యాతమై అలరారుతోంది. ఇందులో 1,00,217 శ్లోకాలున్నాయి. శ్రీ మహావిష్ణువు అంశగల వేదవ్యాస మహర్షిని కృష్ణద్వైపాయనుడని పిలుచుకుంటాం. ఈయన ఒక రాశిగా వున్న వేదాలను నాలుగుగా పరిష్కరించి, అష్టాదశ పురాణాలను, మహాభారత, భాగవతాలను రచించి భారతావనిని అఖండ విజ్ఞానదాయినిగా రూపొందించిన మహానుభావుడు.

ఈ గ్రంథాన్ని తెలుగులోనికి అనువదించిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రెగడ కవిత్రయంగా సుప్రసిద్ధులు. వీరు ముగ్గురూ కలిసి 18 పర్వాలను అనువదించారు.

ఇందులో వైదిక మరియు లౌకిక విషయాలన్నీ ఇమిడి ఉంటాయి. వేదాంత సహిత ఉపనిషత్తులు, వేదముల యొక్క ఆచరణ, చరిత్ర, పురాణాలు, భూతభవిష్యద్వర్తమాన కాలాల వృత్తాంతాలు, వృద్ధాప్యం, మృత్యువు, భయం, వ్యాధులు మొదలగువాటి భావాభావ నిర్ణయాలు, ఆశ్రమవాసుల ధర్మాలు, పురాణాల సారం, తపస్సు, బ్రహ్మచర్యం, పృథ్వి, చంద్రుడు, సూర్యుడు, గ్రహాలు, నక్షత్రాలు, యుగముల వర్ణన, వాటి పరిమాణాలు మున్నగునవి ఎన్నియో ఇందు నిక్షిప్తమై వున్నాయి.

విశ్వసాహిత్యంలోనే అనుపమానమైనదని, ఉత్కృష్టమైనదని ఘనకీర్తినార్జించిన, శ్రీకృష్ణుడే స్వయంగా అర్జునునకు బోధించిన భగవద్గీత అందులోని భీష్మ పర్వం నుండియే వెలువడింది. భక్తి, జ్ఞాన, కర్మల వర్ణన మనకు మరెచ్చటనూ లభ్యం కాదు, కేవలం భగవద్గీతలో తప్ప.

ఆయా పర్వాల్లో వర్ణాశ్రమ ధర్మం, రాజధర్మం, ఆపద్ధర్మం, దానధర్మం, శ్రాద్ధధర్మం, స్త్రీధర్మం మరియు మోక్షధర్మం మున్నగు వివిధ ధర్మములను గురించి విస్తృతంగా పరిజ్ఞానం లభిస్తుంది. ఇది గొప్ప విశేషం.

... 2.

:: 2 ::

వేదవ్యాస మునీంద్రులు పలికిన కొన్ని మాటలను విందామా!

“ఇందులో చర్చించని అంశం ప్రపంచంలో మరెచ్చటనూ చర్చించబడ లేదు. వేదవేదాంగాలు, అష్టాదశ పురాణాలు, మరియు ధర్మశాస్త్రాల అధ్యయనం వల్ల ఎలాంటి జ్ఞానం ప్రాప్తిస్తుందో, అంతటి జ్ఞానం కేవలం మహాభారత అధ్యయనం వల్ల కలుగుతుంది. ఏ రకంగానైతే సముద్రాల్ని, హిమాలయాలను రత్నాల గనులు అని అంటున్నామో, అదే విధంగా మహాభారతంలోని ఉపదేశములు రత్నాలగనులు అనుబడును. ఎవరైతే ఏకాగ్రచిత్తంతో మహాభారత గ్రంథాన్ని అధ్యయనం చేస్తారో, వారికి నిస్సందేహంగా మోక్షం ప్రాపిస్తుంది.”

వేదవ్యాసులవారు ఈ గ్రంథ రచనకు పూనుకోవడానికి గల కారణం కూడ మనం తెలుసుకోవాలి.

“వేదాలు చదరవరాదనే నిషేధమున్న స్త్రీలు, శూద్రులు, పతిత బ్రాహ్మణులు మున్నగువారు మహాభారతము చదివిన యెడల, వేద జ్ఞానము అలవడునట్లు అందులో వేద జ్ఞానము నిక్షిప్తం చేసి పెట్టి, వారికి మార్గం సుగమం చేశారు.”

మరొక విశేషమేమంటే.. ఈ గ్రంథాన్ని విద్యాబుద్ధులకు భాండాగారమైన శ్రీగణేశుడు ఎడతెరిపి లేకుండా మూడు సంవత్సరములు వ్రాసి పూర్తిచేశాడు. అందుకే ప్రపంచంలోనే ఇది బృహత్తర గ్రంథంగా వాసికెక్కింది.

ఇందులో వందలాది కథలు, ఉపకథలు మరియు చిత్రవిచిత్ర సంఘటనల వర్ణనలు అనేకం ఉన్నాయి. అందులో నేటి సమాజానికి ఉపయోగపడేవీ ఉన్నాయి. ఈ చరాచర ప్రపంచంలో కేవలం మానవకోటికి మాత్రమే మహాభారతం చదవటానికి, వినటానికి అధికారం ఉంది. ఇందులో తటస్థపడిన ఉత్తమోత్తోమ ఉపదేశాలను ఆచరణలో పెట్టినయెడల లోకకళ్యాణం తథ్యమని చెప్పుటలో అతిశయోక్తి లేదు.

ఈ మహారచనకు పూనుకోవడం నావంటి అల్పజ్ఞునకు తగని కార్యం. కాని ఈశ్వర కృపావిశేషంతోనే స్వామి అనుగ్రహిస్తూ వస్తున్న శక్తి, జ్ఞానం ఆధారంగానే ఇప్పటి వరకు నా రచనలు కొనసాగుతూ వస్తున్నాయి. ఇటీవల “‘మహర్షి వాల్మీకి మహిళలు” అనే గ్రంథం రూపొందింది. ఈ గ్రంథానికీ శ్రీవారే “యువభారతం” అనే నామకరణం చేయించి, నాచే ముగింపచేశాడు.

భారతదేశంలో మహాభారతం బాగా ప్రాచుర్యం పొందిన ఇతిహాసం. అశాశ్వతమైన మానవ శరీరం గురించి, మంచి చెడు కర్మలను గురించి, వాటి ఫలితాల గురించి ఈ ఇతిహాసంలో అత్యంత అద్భుతంగా వివరించ బడ్డాయి. అర్జునుని గురించి మనకు తెలియని 10 రహస్య విషయాలు, మేధ, ధైర్యం, సౌందర్యం కలగలిసిన ఎన్నో ఉత్తమమైన స్త్రీమూర్తులు మనకు కన్పిస్తారు. స్త్రీలు కూడ శౌర్య పరాక్రమాలతో ఎలా జీవించారో

... 3.

తెలుసుకోవచ్చు. రామాయణంలో రావణుని భార్యయొక్క ఆశ్చర్యకరమైన కథ ఆనాటి పురాషాధిక్య సమాజంలో నిర్భయంగా తమ గళాన్ని వినిపించిన స్త్రీపాత్రలను చూస్తే, వీరు అసలు ఆ కాలంలో పుట్టవలసిన వారు కాదు అనిపిస్తుంది. ఈ పాత్రలు మనకు నిర్భయంగా భావాన్ని వ్యక్తం చేయడాన్ని ధైర్యం, విశ్వాసాన్ని, అంకితభావాన్ని నేర్పుతాయి. మహాభారతంలో అత్యంత అందమైన, అద్భుత మేధ, సౌందర్యం కలగలిసిన స్త్రీమూర్తులు ఎందరో!

ప్రథమంగా శ్రీకృష్ణ భగవానుని ధ్యానిస్తూ, గోవింద నామాన్ని కీర్తిద్దాం.

1. గోవిందా హరిగోవిందా –
2. గోకుల నందన గోవిందా,
3. శ్రీనివాసా గోవిందా –
4. శ్రీ వేంకటేశా గోవిందా,
5. వేంకటరమణా గోవిందా,
6. సీతానాయక గోవిందా –
7. శ్రితపరిపాలక గోవిందా,
8. అనాధరక్షక గోవిందా –
9. ఆపద్బాంధవ గోవిందా,
10. కరుణాసాగర గోవిందా –
11. శరణాగతనిధి గోవిందా,
12. కమలదళాక్షా గోవిందా –
13. కామితఫలదా గోవిందా,
14. ధరణీనాయక గోవిందా –
15. దినకరతేజా గోవిందా,
16. పద్మావతిప్రియ గోవిందా –
17. ప్రసన్నమూర్తీ గోవిందా,
18. అభయమూర్తీ గోవిందా –
19. ఆశ్రితవరదా గోవిందా,
20. శంఖచక్రధర గోవిందా –
21. శార్ఙ్గగదాధర గోవిందా,
22. విరజాతీరస్థ గోవిందా –
23. విరోధిమర్దన గోవిందా,
24. సాలగ్రామా గోవిందా –
25. సహస్రనామా గోవిందా,
26. లక్ష్మీవల్లభ గోవిందా –
27. లక్ష్మణాగ్రజా గోవిందా,
28. కస్తూరితిలకా గోవిందా –
29. కాంచనాంబరా గోవిందా,
30. గరుడవాహనా గోవిందా –
31. గానవిలోలా గోవిందా,
32. వానరసేవిత గోవిందా –
33. వారధిబంధన గోవిందా,
34. అన్నదాన ప్రియ గోవిందా–
35. అన్నమయ్యవినుత గోవిందా,
36. ఆశ్రితరక్షక గోవిందా –
37. అనంతవినుతా గోవిందా,
38. వేదాంతనిలయా గోవిందా –
39. వేంకటరమణా గోవిందా,
40. ధర్మస్థాపక గోవిందా –
41. ధనలక్ష్మీప్రియ గోవిందా,
42. స్త్రీపుంరూపా గోవిందా –
43. శర్వాణీసుత గోవిందా,
44. ఏకస్వరూపా గోవిందా –
45. లోకరక్షక గోవిందా,
46. వేంగమాంబసుత గోవిందా –
47. వేదాచలస్థిత గోవిందా,
48. వజ్రకవచ ధర గోవిందా–
49. వసుదేవతనయ గోవిందా,
50. వైజయంతిధర గోవిందా–
51. వేంకటనాయక గోవిందా,
52. బిల్వపత్రార్చిత గోవిందా –
53. బిక్షుకసంస్థిత గోవిందా,
54. బ్రహ్మాండరూపా గోవిందా –
55. భక్తరక్షకా గోవిందా –
56. నిత్యకళ్యాణ గోవిందా –
57. నీరజనాభా గోవిందా,
58. హథీరామప్రియ గోవిందా–
59. హరిసర్వోత్తమ గోవిందా,
60. జనార్ధనమూర్తి గోవిందా–
61. జగత్పతీ హరి గోవిందా,
62. అభిషేకప్రియ గోవిందా–
63. ఆపన్నివారణ గోవిందా,
64. రత్నకిరీటా గోవిందా–
65. స్వయంప్రకాశా గోవిందా–
66. సర్వకారణా గోవిందా,
67. నిత్యశుభప్రద గోవిందా–
68. నిత్యకళ్యాణ గోవిందా,
69. ఆనదరూపా గోవిందా–
70. ఆద్యంతరహిత గోవిందా,
71. ఇహపరదాయక గోవిందా–
72. ఇభరాజరక్షక గోవిందా,
73. పరమదయాళో గోవిందా–
74. పద్మనాభ హరి గోవిందా,
75. గరుడాద్రివాస గోవిందా–
76. నీలాద్రినిలయా గోవిందా,
77. అన్జనాద్రీశ గోవిందా–
78. వృషభాద్రీశా గోవిందా,
79. తిరుమలనాయక గోవిందా–
80. తులసీమాలా గోవిందా,
81. శేషాద్రినిలయా గోవిందా–
82. శ్రేయోదాయక గోవిందా,
83. శాంతాకారా గోవిందా–
84. వైకుంఠవాసా గోవిందా,
85. భృగుమునిపూజిత గోవిందా–
86. రమాదిరహితా గోవిందా,
87. బ్రహ్మాండరూపా గోవిందా–
88. పుణ్యస్వరూపా గోవిందా,
89. శ్రీచక్రభూషణ గోవిందా–
90. నందకధారి గోవిందా–
91. ఇరునామధారి గోవిందా,
92. భాగశీతల గోవిందా–
93. భక్తవత్సలా గోవిందా,
94. పద్మావతీశా గోవిందా–
95. పద్మమనోహర గోవిందా,
96. ఆనందనిలయా గోవిందా–
97. ఆనందరూపా గోవిందా,
98. నాగేంద్రభూసణ గోవిందా–
99. మంజీరమండిత గోవిందా,
100. తులసిమాలప్రియ గోవిందా–
101. దివ్యసుదేహా గోవిందా,
102. శ్రీరమాలోల గోవిందా–
103. శ్రీస్మితవదనా గోవిందా,
104. శ్రీనిర్మలాకార గోవిందా–
105. మహేంద్రవినుతా గోవిందా–
106. మహానుభావా గోవిందా–
107. మహాలక్ష్మీనాథ గోవిందా–
108. శ్రీ వేంకటేశా గోవిందా.

... 4.

ఆయన భార్యలైన రుక్మిణి, సత్యభామ, తరువాత గంగాదేవి, సత్యవతి, గాంధారి, కుంతీ దేవి, ద్రౌపది, హిడింబి, దేవయాని, దమయంతి, సావిత్రి, సుభద్ర మరియు శకుంతలను గురించి యధాశక్తి వివరించానని భావిస్తున్నాను. సహృదయ పాఠకులు స్వీకరించ ప్రార్థన.

నా రచనా వ్యాసంగంలో, నన్ను సదా ఉత్సాహపరుస్తూ, ఈ గ్రంథానికి అక్షరాశీస్సులను ప్రసాదించిన మహా మాన్యవర్యులు, సుప్రసిద్ధ సాహితీమూర్తి, మహామహోపాధ్యాయ, శిరోమణి, వాచస్పతి డా॥ సముద్రాల లక్ష్మణయ్య గార్కి పాదాభివందనాలు.

ఈ కార్యక్రమాలన్నింటిలో తన వంతు పరిపూర్ణ సహకారాన్ని ప్రేమాభిమానాలతోఅందిస్తున్న మాన్య ఆత్మీయ మిత్రులు శ్రీమాన్ ఎన్. రఘుకుమార్‌గార్కి నా కృతజ్ఞతా పూర్వక అభివాదములు.

ఏ విద్వాంసుడైతే భారతంలోని ప్రతి పర్వమును ఇతరులకు వినిపిస్తాడో, లేక చదవటానికి అందుబాటులోనికి తెస్తాడో, అట్టివారి పాపములన్నీ తొలగిపోతాయి. అట్టివారు స్వర్గాధిపత్యం గ్రహించటానికి, బ్రహ్మభావం అందుకోవడానికి అర్హులై ఉంటారు. ఈ మహాభారత చరిత్రను ఎవరు భక్తిపూర్వకంగా వింటారో, చదువుతారో, వారిని శ్రీ, కీర్తి, విద్యాప్రాప్తి వరిస్తాయి. భారతాన్ని భారతీయ యువత తప్పక చదివి ఉన్నత స్థితిని ప్రాప్తించుకోవాలనేదే నా ఈ రచనా లక్ష్యమని మనవి. ఈ గ్రంథాన్ని శ్రీహరి దివ్యచరణములకు పూజాపుష్పంగా సమర్పించుకొంటున్నాను.

శుభం భవతు

శరణాగతుడు,

పింగళి పాండురంగ రావు

SIROMANI, VACHASPATI, MAHAMAHOPADHYAYA
Dr. SAMUDRALA LAKSHMANAIAH, M.A.
SPECIAL OFFICER (Retd.)
Purana-Itihasa Project
Tirumala Tirupati Devasthanams

Off. : 0877 - 2264305
Res: 0877 - 2230679

TIRUPATI - 517 507

Date : .....

నివేదన

వ్యాసగిరాం నిర్యాసం సారం విశ్వస్య భారతం వందే।

వ్యాసభగవానుని వాక్కుల సారాంశమూ, జగత్సారమూ అయిన భారతానికి ప్రణమిల్లుతున్నాను.

వేదవాఙ్మయానికి అనుబంధంగా పురాణాలూ, ఇతిహాసాలూ ఆవిర్భవించాయి.

'ఇతిహాస పురాణాభ్యాం వేదం సముప బృహయేత్' అన్నట్లు ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింప జేయాలి. వ్యాస విరచితమైన అష్టాదశ పురాణాలూ సుప్రసిద్ధాలే. అట్లే ఇతిహాసాలలో ఉత్తమమైనది మహాభారతం. 'మహత్త్వాద్భారవత్త్వాచ్చ మహాభారత ముచ్యతే' అన్న విధంగా మహాగ్రంథం కాబట్టి, బరువైనది కాబట్టి దీనికి మహాభారతం అనే ప్రసిద్ధి కల్గింది. 'భరత వంశజుల చరిత్ర' అని కూడా చెబుతారు.

మూడు దశలలో 'జయ' మనీ, 'భారత'మనీ, 'మహా భారత'మనీ ఈ గ్రంథరాజం రూపు దిద్దుకున్నదనీ, లక్ష శ్లోకాలతో కూడిన ఈ యితిహాసం 'పంచమ వేద'మన్న ప్రఖ్యాతికి పాత్రమైనదనీ అభిజ్ఞుల కథనం.

శాఖోపశాఖలుగా విస్తరించిన మన ప్రాచీన వాఙ్మయం ప్రధానంగా భారత మూలకంగానే విస్తృత వ్యాప్తి పొందింది. గద్య కావ్యాలుగా, పద్య కావ్యాలుగా, చంపూ ప్రబంధాలుగా, దృశ్య కావ్యాలుగా – ఇలా ఎన్నో రీతుల విస్తృతి జెందిన భారతాంతర్గతమైన ఉపాఖ్యానాలూ, ఆఖ్యానాలూ నేటికీ చలనచిత్రాది రూపాలతో వ్యాప్తి పొందుతూనే వున్నాయి. అందుకే –

'ఇతిహాసోత్తమాదస్మా జ్జాయన్తే కవిబుద్ధయః' అని కవుల బుద్ధులు రసవత్తరమైన రచనలు కావించడానికి భారతమనే ఈ శ్రేష్ఠమైన ఇతిహాసమే కారణమని పెద్దలు పేర్కొన్నారు.

మానవ జీవితంతో ముడివడిన అంశాలన్నీ మహాభారతంలో ప్రస్తావించబడ్డాయి. ప్రస్తావించడమే కాక మన జీవితగతిని సరి అయిన మార్గంలో నడిపించుకోవడాని కవసరమైన ప్రబోధాలు గూడా ఇందులో సమకూర్చడమయింది.

'యన్న భారతే తన్న భారతే' అన్న సూక్తి సువిదితమే. 'ఏది భారతంలో లేదో, అది భారతావనిలో లేదు' అని పై సూక్తి యొక్క భావం. ఈ సూక్తిని ఈ క్రింది శ్లోకం ఇంకా సుస్పష్టంగా వివరిస్తున్నది.

'ధర్మే చార్థేచ కామేచ మోక్షే చ భరతర్షభ।
య దిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్॥'

ధర్మం, అర్థం, కామం, మోక్షం – అనేవి నాలుగు పురుషార్థాలు. మన మనుగడ ఈ నాలుగింటితోనూ దృఢంగా ముడివడియున్నది. అందువల్ల వాటికి సంబంధించిన సమగ్రమైన పరిజ్ఞానం మన కవసరమై యున్నది. ఆ జ్ఞానాన్ని అందించే ఉత్తమమైన గ్రంథాలలో అగ్రగణ్యమైనది మహాభారతం.

‘త్రిభిర్వర్షై స్సదోత్థాయీ కృష్ణద్వైపాయనో మునిః।
మహాభారత మాఖ్యానం కృతవానిద ముత్తమమ్॥’ (ఆది. 56-32)

అన్నట్లు మూడు సంవత్సరాల కాలం సదా జాగరూకుడై వుంటూ వ్యాస భగవానుడు ఈ ఉత్తమమైన భారతాఖ్యానాన్ని రచించాడని తెలుస్తున్నది.

ఇంచుమించు రెండు వేలా ఐదు వందల సంవత్సరాలకు పూర్వమే ఈ మహాగ్రంథం రూపొందిందని పరిశోధకుల అభిప్రాయం. గుప్తకాలానికి చెందిన ఒక శిలాశాసనంలో దీన్ని ‘శతసాహస్రీ సంహితా’ అని పేర్కొనడ మైనది. ఇందులో లక్ష శ్లోకాలున్నాయని దీన్ని బట్టి గ్రహించవచ్చు.

కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన యోగాలను సమన్వయాత్మకంగా బోధించిన ఉపనిషత్సారమైన భగవద్గీత భారతంలోని ఒక భాగమే. ప్రస్థాన త్రయములో అది ఒకటిగా వినుతి కెక్కింది.

‘యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో ద్విజః।
న చాఖ్యాన మిదం విద్యాన్నైవ స స్యాద్విచక్షణఃఁ॥’ (ఆది - అధ్యా-2)

అంగాలతోనూ, ఉపనిషత్తులతోనూ కూడిన వేదాలను గ్రహించినవాడైనా ఈ మహాభారతాఖ్యానాన్ని తెలుసుకోనివాడు విచక్షణుడు కాజాలడని భావం.

శ్రుత్వా త్విదముపాఖ్యానం శ్రావ్యమన్య న్న రోచతే।
పుంస్కోకిల గిరం శ్రుత్వా రూక్షా ధ్యాంక్షస్య వాగివ॥’

కోకిలయొక్క మధురమైన ధ్వనిని విన్నవానికి కాకి కూత కర్ణకఠోరమై వినిపించినట్లు ఈ మహాభారతం విన్న తరువాత మరొకటి వినుటకు రుచించదని తాత్పర్యం.

భారతంలో భిన్న భిన్న మనస్తత్వాలు గల పాత్రలు గోచరిస్తాయి. గీత ప్రతిపాదించినట్లు దైవీ ప్రవృత్తి-ఆసురీ ప్రవృత్తి అనే ఉభయవిధ ప్రవృత్తులు గలవారు ఇందులో కనిపిస్తారు. దైవీ సంపద ముక్తికీ, ఆసురీ సంపద బంధానికీ కారణ మవుతాయి. అందుచేత దైవీ ప్రవృత్తి నలవరచుకొని ఉత్తమమైన మనుజ జన్మను ధన్యం చేసుకోవాలని భారతం బోధిస్తున్నది.

భారతంలో వివిధ మనస్తత్వాలు గల వారున్నారు. ధర్మరాజులోని ధార్మికత్వం ఆశ్చర్యం కల్గిస్తుంది. అట్లే దుర్యోధనాదుల దౌష్ట్యానికి కల్గిన దుష్ఫల మెలాంటిదో చక్కగా ప్రదర్శిత మయింది.

అభిజ్ఞులందరూ మహాభారతాన్ని లోకోత్తరమైన ధర్మశాస్త్రంగా సంభావించారు. ఈ విషయమై ఈ క్రింది వ్యాసుని ప్రబోధం గమనార్హం.

‘న జాతు కామాన్న భయాన్న లోభాత్ - ధర్మం త్యజే జ్జీవితస్యాపి హేతోఃఁ।
ధర్మో నిత్యః సుఖదుఃఖే త్వనిత్యే - జీవో నిత్యో జీవహేతు స్త్వనిత్యఃఁ॥’

కామం వల్ల గాని, భయం వల్ల గాని, లోభం వల్ల గాని, చివరికి జీవితం కొరకు గాని, ధర్మాన్ని త్యజించ రాదు. ధర్మం నిత్యమైనది, సుఖదుఃఖాలు అనిత్యాలు. జీవుడు నిత్యుడు, జీవహేతువు అనిత్యం.

ధర్మాన్ని కడకు నెట్టి, అర్థకామాలకు ప్రాధాన్యమిచ్చేవారి నుద్దేశించి వ్యాసుడు –

'ఊర్ధ్వబాహు ర్విరౌమ్యేష న చ కశ్చి చ్ఛృణోతి మే।
ధర్మాదర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్యతే॥'

బాహువులు పైకెత్తి ఉద్ఘోషిస్తున్నాను. ఒక్కడూ నా మాట వినడం లేదు. అర్థకామాలు, ధర్మం వల్లనే సిద్ధిస్తాయి. అలాంటి ధర్మాన్ని ఎందుకు సేవించరు?

శాంతిమయమూ, సుఖప్రదమూ అయిన జీవనం వైపు నడక సాగించవలసిన ఆవశ్యకతను ఈ పంచమ వేదంలో వ్యాసమహర్షి చక్కగా ప్రతిపాదించినాడు. అందలి పరమార్థాన్ని గ్రహించవలసిన అవసర మెంతైనా వున్నది.

ప్రస్తుతం అధ్యాపక శ్రేష్ఠులుగానే కాక గ్రంథరచయితగా కూడా విఖ్యాతి గాంచిన శ్రీ పింగళి పాండురంగ రావుగారు రచించిన 'యువభారతం' అన్న భారత సమాలోచనాత్మకమైన గ్రంథరాజం ఒకటి ఆవిర్భవించడం ముదావహం. వారి కలంనుండి కొన్ని దశాబ్దాల కాలంగా గ్రంథాలు అవిశ్రాంతంగా వెలువడుతూనే వున్నాయి. ఆ గ్రంథాలు గూడా ఆధ్యాత్మిక – ధార్మిక – సాంస్కృతికాంశాలతో కూడినవే గాని పుక్కిటి పురాణాలు కావు. రామాయణ – భాగవత – భారతాదులగు మన ప్రాచీన సారస్వతానికి చెందిన గ్రంథాల నన్నింటినీ వారు కూలంకషంగా మథించి అందలి సారాంశాలను సులభ సుందరమైన వ్యావహారిక భాషలో పాఠకులకు అందిస్తున్నారు.

జీవితంలో 8 దశాబ్దాలు పూర్తి అయినా – సారస్వతాభిరుచి ఏమాత్రం కుంటువడకుండడం వీరిలో చూస్తున్నాము. శ్రీ పింగళి వారి సాహిత్య వ్యవసాయం ప్రతి సంవత్సరం ఏవో కొన్ని కొంగ్రొత్త గ్రంథ ఫలాలను సమాజానికి ప్రసాదిస్తూనే ఉన్నది. ఇది యేడుకొండల వాడి దయాఫలమే అని వారు సదా భావిస్తారు. కర్తృత్వం భగవానునిదే కాని తనది కాదన్న గీతా సిద్ధాంతాన్నే త్రికరణ శుద్ధిగా వారు విశ్వసిస్తున్నారు.

ఈ రచనలో పంచమ వేదమైన మహాభారత కథను సంగ్రహంగా అందిస్తూ, అందలి వైశిష్ట్యాన్ని రమణీయంగా ప్రతిపాదించడంలో వారు కృతకృత్యులయ్యారు. 'యువభారతం' అన్న నామకరణం సముచితమై యున్నది. భారత ప్రబోధాలను ముఖ్యంగా యువకులు గ్రహించాలి. అవి యువకులలో ప్రేరణ గల్గించాలి. ఈ విషయాన్నే శ్రీ వివేకానందులు పలుసార్లు తమ ప్రసంగాలలో నిర్దేశించి యున్నారు.

త్వరలో శ్రీ పింగళివారి రచనలు శతాధిక సంఖ్యను అతిక్రమించ గలవు. వారి గ్రంథాల నన్నింటినీ 'శ్రీ పింగళి పాండురంగ రావుగారి సంపూర్ణ గ్రంథావళి' అన్న పేరుతో ఒకే పరిమాణంలో ముద్రించి భావితరాలకు అందచేయవలసిన అవసర మెంతైనా వున్నది.

సప్తగిరీశ్వరుడు వారికి ఆయురారోగ్యాలు పూర్ణంగా ప్రసాదించి పై కార్యాన్ని గూడా సఫల మగునట్లు అనుగ్రహించు గాక!

ఈ నాల్గు మాటలు 'నివేదన' రూపంలో ఇక్కడ వ్రాయడానికి అవకాశ మిచ్చిన శ్రీ పాండురంగరావు గారికి కృతజ్ఞుడను.

సముద్రాల లక్ష్మణయ్య

క్యాంప్: హైద్రాబాద్
8-3-2021

యువ భారతం

1. ఆదిపర్వం

శ్రీమన్నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణునికి, నరోత్తముడైన అర్జునునకు, లీలలు ప్రకటించే సరస్వతీ దేవికి మరియు మహా వక్త అయిన వ్యాసమహర్షికి నమస్కరించి .....

అంతఃకరణముపై విజయం సాధించు మహాభారతాన్ని ప్రతి భారతీయుడు, ముఖ్యంగా యువజనులు తప్పక చదువవలసి వుంది.

సూతవంశ శ్రేష్ఠుడైనటువంటి ఉగ్రశ్రవుడు (పౌరాణికుడు) ఒక పర్యాయం నైమిశారణ్యానికి వచ్చాడు. అక్కడ కులపతియైన శౌనకుడు 12 సం॥ల సత్సంగ యజ్ఞం చేస్తున్నాడు. ఉగ్రశ్రవుని చూచినటువంటి ఆశ్రమవాసు లందరూ ఆయనను చుట్టుముట్టి చిత్ర విచిత్ర కథలను చెప్పమని కోరారు. ఉగ్రశ్రవుడు అందరికీ నమస్కరించి, వారు చూపిన ఆసనముపై సుఖాసీనుడైనాడు. ఒక ఋషి ఉగ్రశ్రవుణ్ణి ఎక్కడినుండి వచ్చారు అని అడిగాడు. అందుకు ఉగ్రశ్రవుడు సమాధానంగా – నేను జనమేజయుడు చేస్తున్న సర్పయాగానికి వెళ్ళి, అక్కడ శ్రీకృష్ణద్వైపాయనుడు (వేదవ్యాసుడు) రచించిన గ్రంథంలో అనేక విషయాలను వైశంపాయనుడు చెప్తూ ఉండగా విన్నాను' అని చెప్పాడు. అన్ని తీర్థక్షేత్రాలను దర్శించుకొని ఇపుడు మీ దగ్గరకు వచ్చాను అని అన్నాడు. మీరందరూ బ్రహ్మనిష్ఠాగరిష్ఠులు కనుక మీరు ఏమి చెప్పమంటారో సెలవియ్యండి అని కూడా అన్నాడు.

అపుడు నైమిశారణ్య మునులు ఇలా అన్నారు. "సూతనందనా! వేదవ్యాస మహర్షి రచించిన, న్యాయసమ్మతమై, వేదయుక్తమై సంపూర్ణ భరత వంశము యొక్క చరిత్ర కలిగి ఉన్నదేదో, దేనినైతే వేదవ్యాసుని అనుజ్ఞతో వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడో, అటువంటి పుణ్యమయ, వేదమయ అంశాలను చెప్పండి." ఆ ఋషుల కోరిక మేరకు ఉగ్రశ్రవుడు ఇలా చెప్పడం ప్రారంభించాడు.

శ్రీకృష్ణ భగవానుడే ఆదిదైవం. ఆయనే అంతర్యామియై, సర్వేశ్వరుడై, సమస్త యజ్ఞములకు భోక్తయై, పరమ సత్యస్వరూపుడై, ఓంకారస్వరూపుడై, బ్రహ్మయై ఉన్నాడు. ఆ మంగళాకారునికి, సర్వవ్యాపకునికి, ఆ నయనమనోహరునకు నమస్కరించి, వేదవ్యాస మహాభారతాన్ని వర్ణించి చెప్పాడు.

ఈ జగత్తు జ్ఞానరహితమై, శూన్యమై, అంధకారబంధురమైనపుడు ఒక గొప్ప అండాకారంలో ఒక వస్తువు ఉత్పన్నమైంది. సమస్త ఉత్పత్తికి అదే మూలకారణం. అందులోనుండి లోక పితామహుడైన ప్రజాపతి బ్రహ్మ వెలువడ్డాడు. ఆ తరువాత సప్త ఋషులు, పదనలుగురు మనువులు ఉత్పన్నమైనారు. ఆదిత్యుడు, వసువులు, యక్షులు, పిశాచాలు, బ్రహ్మర్షులు, రాజర్షులు, నీరు, భూమి, గాలి, ఆకాశం, దిశలు, సంవత్సరం, ఋతువులు, మాసాలు, అయనాలు, దిశలు, దివారాత్రాలు ఇలా ఈ జగత్తులో ఉన్న సమస్తం ఆ అండాకారం నుండి వచ్చినవే. కాలక్రమంలో వంశాలు, అందులో కురు, యదు, భరత, ఇక్ష్వాకు మున్నగునవి వున్నాయి, ఏర్పడ్డాయి. ఈ వంశముల నుండి జన్మించిన అనేకులు సృష్టి కార్యాన్ని కొనసాగించారు.

భగవానుడైన వేదవ్యాసుడు సమస్త లోకాల్ని, మూడు కాలాల రహస్యాల్ని, వేదరహస్యాల్ని పరిపూర్ణంగా తెలిసినవాడై వున్నాడు. తన తపస్సు, బ్రహ్మచర్య ప్రభావంతో వేదములను విభజించుటయే కాకుండా, మహాభారత

గ్రంథ నిర్మాణాన్ని తన మనసులోనే రచించుకొని వున్నాడు. ఇంత జ్ఞానాన్ని తన శిష్యులకు ఎలా చేర్చాలనే తీవ్ర ఆలోచనలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకొన్న బ్రహ్మ లోకహితం కోరి వ్యాసుని వద్దకు వచ్చాడు. స్వాగత సత్కారాల తర్వాత వ్యాసుడు వినమ్రంగా బ్రహ్మతో ఇలా అన్నాడు. "దేవా! నేనొక మహాకార్యాన్ని మనసులో రచించుకొన్నాను. అందులో అనేక లౌకిక, వైదిక విషయాలను పొందుపరచాను. ఉపనిషత్తులు, చరిత్ర, పురాణాలు, తపస్సు, బ్రహ్మచర్యము మున్నగు ఎన్నో విషయాలు వున్నాయి. సూర్యచంద్రులు, గ్రహాలు, దేవతలు వంటి అద్భుత విషయములు సమకూర్చాను. కాని నా మనోగ్రంథాన్ని వ్రాయుటకు ఎవరూ లభించక చింతిస్తున్నాను."

అందుకు బ్రహ్మ ఇలా అన్నాడు. "ఓ మహర్షి! నీవు శ్రేష్ఠ మునుల కంటే ఘనుడవు. తత్త్వజ్ఞాన సంపన్నుడవు. మీ కార్యాన్ని మించిన కార్యాన్ని ఎవరూ చేయలేరు. మీ గ్రంథాన్ని రచించటానికి మీరు గణేశుని స్మరించండి." అని చెప్పి తన లోకానికి వెళ్ళిపోయాడు. వేదవ్యాసుడు గణేశుని స్మరించగనే గణేశుడు ప్రత్యక్షమైనాడు. వ్యాసుడు పూజాదికాలు నిర్వహించి, తాను చెప్తుంటే, గణేశుని వ్రాస్తుండమని చెప్పాడు. ఒక్క క్షణం కూడ ఆగకుండా చెప్తుంటేనే నేను వ్రాయగలను అని గణేశుడు వ్యాసునితో చెప్పాడు. అర్థం చేసుకొంటూ వ్రాయమని వ్యాసుడు కోరాడు. గణేశుడు సరేనన్నాడు. కాని కొన్ని శ్లోకాలు అంతుపట్టేవి కావు. గణేశుడు కూడా సర్వజ్ఞుడే కనుక ఒక క్షణం అర్థవిచారం చేసినంతలో వ్యాసుడు తన మనస్సులోనే అనేక శ్లోకాలు రచించుకొనేవాడు.

ఈ మహాకార్యం ఎంత మహనీయమైనదంటే – ఎవరైతే శ్రద్ధతో ఈ గ్రంథాన్ని చదువుతారో, వారి పాపాలు నశిస్తాయి. కారణమేమంటే – ఇందులో దేవతలు, బ్రహ్మజ్ఞుల పవిత్ర కర్మల వర్ణన ఉన్నది.

సనాతన పురుష భగవానుడైన శ్రీకృష్ణుని కీర్తనలు అసంఖ్యాకంగా ఉన్నాయి. సత్యం, అమృతం ఈ గ్రంథం యొక్క శరీరం. దేవతలే ఈ గ్రంథ మహత్తత్వాన్ని వేదములతో సమానమని నిర్ధారించారు. అందుకే ఇది పంచమవేదంగా ప్రసిద్ధి కెక్కిందని గర్వించాలి.

ఉగ్రశ్రవుడు ఇలా చెప్పాడు. "ఓ ఋషులారా! పరీక్షిత్తు కుమారుడైన జనమేజయుడు కురుక్షేత్రంలో తన సోదరులతో పాటు ఒక గొప్ప యజ్ఞం చేస్తున్నాడు. ఆ సమయంలో అక్కడికి ఒక కుక్క వస్తే, దానిని ఆ సోదరులు కొట్టి తరిమారు. కుక్క ఏడుస్తూ తల్లి దగ్గరకు వెళితే, ఎందుకు ఏడుస్తావు, ఏదో తప్పు చేసి వుంటావు అని తల్లి అన్నది. 'ఏమీ చేయలేదు, ఆ సోదరులు నన్ను కొట్టారు' అని అన్నది. తల్లి బాధపడుతూ కోపంతో ఆ యజ్ఞశాలకు వెళ్ళి ఎందుకు కొట్టారని అడిగితే ఎవరూ జవాబు చెప్పలేదు. తల్లి కోపంతో 'మీకు అకస్మాత్తుగా ప్రమాదం సంభవించుగాక' అని శపించింది. దేవతల తల్లి కుక్క అయిన సరమ ఇచ్చిన శాపానికి జనమేజయుడు భయపడ్డాడు. యజ్ఞం పూర్తి అయిన తర్వాత ఈ సంకటాన్ని రూపుమాపుటకు ఒక యోగ్యుడైన పురోహితుని కోసం అన్వేషించసాగాడు. చివరకు సోమశ్రవుడు అనే పురోహితుడు లభించాడు. ఆ పురోహితుణ్ణి సోదరులకు చూపించి, ఈయన చెప్పినట్లు చేయండి అని చెప్పి, తాను తక్షశిలపై దండయాత్రకు వెళ్ళిపోయాడు.

ఆ రోజుల్లోనే అయోధ ధౌమ్యుడనే ఋషికి ఆరుణి, ఉపమన్యుడు, వేదుడు అనే ముగ్గురు శిష్యులుండే వారు. గురువు ఆరుణిని పొలము పనికి వినియోగించేవాడు. అతని కర్తవ్య పరాయణతకు సంతసించి, నాటినుండి ఉద్దాలకునిగా పిలువబడెదవని, వేద వేదాంగాలు కరతలామలకమౌతాయని చెప్పగా, శిష్యుడు వెళ్ళిపోయాడు. రెండవ శిష్యుడు ఉపమన్యుడు భిక్షను, ఆవుపాలను, పాలనురుగును స్వీకరించుటను మానివేశాడు. ఆకలికి తాళలేక జిల్లేడు ఆకులు తిని, చూపు కోల్పోయి ఒక బావిలో పడిపోయాడు. గురువుగారు వచ్చి అడుగగా

విషయం చెప్పాడు. చూపు వచ్చుటకు అశ్వనీ దేవతలను స్తుతించమని గురువు చెప్పగా, శిష్యుడు ప్రార్థించాడు. వారు ప్రత్యక్షమై ఔషధం ఇచ్చి తినమన్నారు. గురువు అనుమతి లేనిదే తిననని చెప్పగా, దేవతలు సంతసించి, శిష్యునికి కంటి చూపు ప్రసాదించారు. శిష్యుడు వెళ్ళి గురువుగారితో అన్ని విషయాలు చెప్పగా, గురువు సంతోషించి, వేదాలు, ధర్మశాస్త్రాలు అన్నీ వాటంతట అవే నీకు కరతలామలకమౌతాయని ఆశీర్వదించి పంపించాడు.

మూడవ శిష్యుడు వేదుడు గురుసేవలో అనేక శ్రమలు అనుభవిస్తూ గురువు కృపను సంపాదించినందున, గురువు అతనిని నీవు సర్వజ్ఞుడవు కాగలవని ఆశీర్వదించి పంపించివేశాడు.

బ్రహ్మచర్యము వీడి గృహస్థుడైన వేదునికి ముగ్గురు శిష్యులున్నారు. తన శిష్యులకు కఠినమైన పనులు చెప్పేవాడు కాదు. ఉదంకుడు అనే శిష్యుడు కనబరచిన సదాచార పాలనకు సంతోషించి, యిక వెళ్ళవచ్చని ఆశీర్వదించాడు గురువు. గురుదక్షిణ ఏదైనా ఇస్తానని చెప్పగా, అమ్మగారిని అడగమన్నాడు. పౌష్యరాజుగారి భార్య చెవికుండలాలు తీసికొని రమ్మని కోరిన అమ్మగారి కోరిక ప్రకారం ఉదంకుడు కష్టపడి వెళ్ళి ఆ రాణిగారిని అడుగగా, ఆ శిరోమణి కుండలాలు ఇస్తూ, 'తక్షకుడనే నాగరాజు ఈ కుండలాలను దొంగిలించాలని చూస్తున్నాడు జాగ్రత్త' అని చెప్పి పంపింది.

ఉదంకుడు ప్రయాణిస్తుండగా, వెనుక ఒక పాము వస్తూ పోతూ ఉన్నట్లు తోచింది. నీరు త్రాగేందుకు ఉదంకుడు కుండలాలను ప్రక్కనపెట్టి వెళ్ళగానే, ఆ పాము ఈ కుండలాలు తీసికొని అదృశ్యమైంది. నాగరాజే ఆ పని చేశాడని భావించి, ఉదంకుడు ఇంద్రుని సాయంతో కుండలాలను సాధించి, గురుపత్నికి ఇచ్చాడు.

ఉదంకుడు హస్తినాపురం చేరేసరికి జనమేజయుడు తక్షశిలను జయించి వచ్చాడు. అపుడు ఉదంకుడు జనమేజయునితో ఇలా అన్నాడు. "మహారాజా! మీ తండ్రిని తక్షకుడు కాటువేయగా, రక్షించడానికి వస్తున్న కాశ్యపుని త్రిప్పి పంపివేశాడు. మీరు అందుచేత సర్పయాగం చేయండి. ఆ అగ్నిలో పడి ఆ పాపాత్ముడు మసైపోవాలి. ఆ విధంగా మీరు మీ తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకోగలరు. నేనూ సంతోషిస్తాను."

శౌనకుడి కోరిక మేరకు ఉగ్రశ్రవుడు సర్పయాగంలో నాగరాజు తక్షకుని రక్షించిన ఆస్తేక ఋషి యొక్క కథను ఇలా వివరించాడు.

"సత్యయుగంలో దక్ష ప్రజాపతికి ఇద్దరు కుమార్తెలున్నారు. వారి వివాహం కశ్యపునితో చేశారు. భార్యల వలన ప్రసన్నుడైన కశ్యపుడు వారిని వరాలు కోరుకోమన్నాడు. కద్రువ వేయిమంది పుత్రులు కావాలని కోరగా, వినత ఇద్దరు పుత్రులనే కోరుకొంది. తథాస్తు అని కశ్యపుడు అడవులకు వెళ్ళిపోయాడు.

సమయం వచ్చినపుడు కద్రువ వేయి గ్రుడ్లు, వినతకు రెండు గ్రుడ్లు పెట్టారు. దాసీజనం వాటిని భద్రపరచారు. సమయం పూర్తయిన తర్వాత కద్రువ పెట్టిన వేయి గ్రుడ్లనుండి వేయి మంది పుత్రులు బయటకు వచ్చారు. వినతకు కుమారులు జనించలేదు. వినత ఒక గ్రుడ్డును చిదమగా, తొడలు లేకుండా అనూరుడు అనే ఒక అపరిపక్వ బాలుడు గ్రుడ్డునుండి బయటకు వచ్చి 'నీ సవతికి నీవు దాసిగా ఉందువు గాక ' అని తల్లిని శపించాడు. నీవు నీ రెండవ కుమారుని వికృతునిగా చేయకపోతే అతడే నీకు శాపవిముక్తి కలిగిస్తాడు. ఇలా చెప్పి, వినతాపుత్రుడు, ఆకాశంలోకి ఎగిరిపోయిన అనూరుడు సూర్యునికి సారధిగా చేరాడు.

ఒకసారి కద్రువ మరియు వినత కలిసి తిరుగుతుండే సమయంలో అందంగా, మనోహరంగా, దృఢంగా ఉండే ఉచ్చైశ్రవమనే అశ్వాన్ని చూచి మాట్లాడుకొంటూ వున్నారు."

ఇంతలో మహర్షి శౌనకుడు ఉగ్రశ్రవుని ఆ అశ్వం ఎలా అమృత మథన సమయలో ఉద్భవించిందో చెప్పమని కోరుతాడు. అపుడు ఉగ్రశ్రవుడు ఆ విషయాన్ని ఇలా చెప్పసాగాడు.

"దేవతలందరూ మేరుపర్వతంపై చేరి అమృతాన్ని ఎలా అందుకోవాలో తెలుపమని నారాయణుని ప్రార్థించారు. అపుడు నారాయణుడు ఇలా అన్నాడు. 'మంధర పర్వతాన్ని సముద్రంలో దింపి, వాసుకి అనే గొప్ప సర్పాన్ని కవ్వంగా చేసుకొని, సముద్ర జలరాశిని మధించాలి. ఆ పని దేవతలు, రాక్షసులు కలిసి చేయాలి.' అని చెప్పాడు. కాని వారిరువురి వల్ల కాలేదు. మంధర పర్వతాన్ని కదిలించలేక పోయారు. చివరకు శేషునాగు సాయంతో పెకలించారు. సముద్రుడు దయచూపి కచ్ఛపరాజును మంధర పర్వతం మోయడానికి ఏర్పాటు చేశాడు. రాక్షసులు వాసుకి ముఖం వైపు, దేవతలు తోకవైపు పట్టుకొని మధించ సాగారు. కాని ఇరువర్గాలవారు బలహీనమైనారు. నారాయణుడు దీనిని గుర్తించి దేవతలకు బలము, తేజస్సు ప్రసాదించగా, వారు మిక్కిలి ఉత్సాహంగా మధించగా, మొదటగా చంద్రుడు ఉద్భవించాడు. తర్వాత వరుసగా లక్ష్మీదేవి, సురాదేవి, ఉచ్చైశ్రవము, కౌస్తుభ మణి మరియు కల్పతరువు, ఇంకా కామధేనువు కూడా అవిర్భవించి ఆకాశ మార్గంలోనే దేవలోకాన్ని చేరారు.

తరువాత ధన్వంతరి ప్రత్యక్షమై తెల్ల కమండలంలో అమృతం తీసికొనిరాగా, రాక్షసులలో కోలాహలం మొదలైంది. ఆ తరువాత నాల్గు తెల్లని దంతములు గల ఐరావతమనే ఏనుగు రాగా, దానిని ఇంద్రుడు తీసికొన్నాడు. చివరగా కాలకూట విషం బయటకు రాగా, దాని వేడిమికి లోకాలు తల్లడిల్లాయి. బ్రహ్మ కోరిక మీద శంకరుడు ఆ కాలకూటాన్ని త్రాగివేశాడు. పార్వతి తన పతిచేస్తున్న పనిచూసి, విష్ణువును ప్రార్థించగా, ఆయన దానిని శివుని కంఠంలోనే నిలిపివేశాడు. ఆ కారణంగా శివుని కంఠం నల్లగా మారిపోయింది. అందుకే ఆయన నీలకంఠుడైనాడు. రాక్షసుల కలకలం మధ్య విష్ణు భగవానుడు మోహినీ (స్త్రీ) రూపంలో అక్కడకు రాగా, ఆమె రూపవిలాసాలకు మోహితులై అమృతభాండాన్ని మోహినికిచ్చేశారు. దేవతలందరికి అమృతపానం చేయిస్తుండగా, రాహువు అనే రాక్షసుడు దేవతల వేషభూషలతో అమృతం త్రాగబోతుండగా, కంఠం దిగకముందే, సూర్యచంద్రుల సూచన మేరకు విష్ణుభగవానుడు తన చక్రంతో వాని తల నరికివేశాడు. అప్పటినుండి సూర్యచంద్రులు మరియు రావుహు మధ్య వైమనస్యం మొదలైంది.

విష్ణు భగవానుడు మోహినీ రూపం వదలివేసి, దేవతలతో కలిసి రాక్షసులను తరిమివేశాడు. ఇదే సముద్ర మధనం యొక్క కథ.

ఇక మనం కద్రువ, వినతల సంగతి, గరుడుని ఆవిర్భావం గురించిన విశేషాలు తెలుసుకొందాం.

వీరిద్దరు ఇంతకు ముందు ఉచ్చైశ్రవమనే అశ్వం తెల్లరంగులో వున్నదని భావించారు. దాని తోక కూడ నిజానికి తెలుపే. దాని తోక నలుపు రంగని కద్రువ పందెం వేసింది. వీరిలో ఎవరు ఓడితే వారు మరొకరికి దాసిగా ఉండాలని పందెం కాశారు. తెల్లవారగనే చూచి నిర్ణయించుకొందాం అనుకొన్నారు. కాని రాత్రి కద్రువ తన వందమంది పుత్రులను పిలిచి, వారిని ఆ అశ్వము యొక్క తోకకు చుట్టుకొని దానిని నలుపురంగుగా మార్చమని, లేకపోతే జనమేజయుని సర్పయాగంలో చనిపోతారని చెప్పింది. శాపానికి భయపడి ఆ కుమారులు

తోకను చుట్టుకొని నలుపురంగుగా మార్చారు. తెల్లవారి చూడగా తోక నల్లగా కనబడ్డ కారణంగా వినత కద్రువకు దాసి అయింది.

కాలం పూర్తి అయినందున, గరుడుడు గ్రుడ్డులోనుండి వెలుపలికి వచ్చాడు. అతని శక్తి, దీప్తి విలక్షణంగా ఉన్నది. పుట్టగానే ఆకాశమునకు ఎగిరాడు. దేవతలు భయపడి అగ్నిదేవుని శాంతించమని ప్రార్థించారు. అపుడు అగ్నిదేవుడు ఇలా అన్నాడు. "ఓ దేవతలారా! ఆ తేజోమూర్తిని నేను కాను. అతడు నాగుల నాశకుడు, దేవతల హితైషి, రాక్షస శత్రువు. కనుక భయడకండి. వెళ్ళి కలుద్దాం" అని వెళ్ళి గరుడుని స్తుతించారు. గరుడుడు ప్రసన్నుడై తన తేజస్సును తగ్గించుకొంటానని, భయపడవద్దని వారితో చెప్పగా దేవతలు సంతోషంగా వెళ్ళిపోయారు.

ఒకరోజు కద్రువ వినతతో ఇలా అన్నది. "నేను, నా కుమారులు సముద్రంలో నున్న ఒక అందమైన ప్రదేశాన్ని చూడాలనుకుంటున్నాం." ఈ మాట వినగానే గరుడుడు కద్రువ, వినత మరియు నాగులను తన వీపుపై మోసుకొని వెళ్ళివచ్చాడు. ఆ తర్వాత గరుడుడు తన తల్లియైన వినతను తాను ఎందుకు ఇలా సర్పములకు బానిసగా ఉండాలి అని అడిగాడు. అందుకు వినత ఇలా చెప్పింది. 'నాయనా! కుట్రతో నన్ను కద్రువ తన దాసిగా చేసికొంది."

గరుడుడు సర్పముల వద్దకు వెళ్ళి 'మా బానిసత్వం పోవాలంటే మీకు ఏం కావాలి' అని అడిగితే, సర్పములు తమకు అమృతం తెచ్చిపెట్టమని అడిగాయి. 'అదే మా కోరిక' అని అన్నాయి.

గరుడుడు సర్పముల కోరిక మేరకు అమృతం కొరకు బయలుదేరుతూ, తల్లిని "అమ్మా! నాకేమిటి ఆహారం" అని అడిగాడు. 'సముద్రంలో నిషాదులున్నారు. వారితో నీ ఆకలి తీర్చుకో' అని తల్లి చెప్పింది. కాని గరుడుని ఆకలి తీరలేదు. తరువాత తండ్రియైన కశ్యపుని వద్దకు వెళ్ళి తన ఆకలి సంగతి చెప్పగా, 'నాయనా! ఇక్కడికి దగ్గరలోనే ఒక గొప్ప సరోవరం వున్నది. ఒక ఏనుగు, ఒక తాబేలు అన్నదమ్ములైనా కలహించుకొంటూ ఆ సరోవరంలోనే ఉన్నాయి. వాటిని తిని నీ ఆకలి తీర్చుకో' అని అన్నాడు. తండ్రి మాట ననుసరించి సరోవరానికి వెళ్ళి తన కాలిగోళ్ళతో ఏనుగును, తాబేలును పట్టుకొని వేగంగా వెళ్ళిపోసాగాడు. ఎక్కువ ఎత్తులో వున్న చెట్టుకొమ్మపై కూర్చొని తిననారంభించగా ఆ బరువుకు కొమ్మ విరిగిపోసాగింది. అక్కడ వాలఖిల్య ఋషులు తపస్సు చేసుకొంటూ వున్నారు. దీన్ని గమనించి గరుడుడు ఆ కొమ్మను ముక్కున కరచుకొన్నాడు. ఈ స్థితిని ఆలోచించిన కశ్యపుడు మునులతో గరుడుని శుభకార్యాన్ని గురించి చెప్పగా, అ ఋషులు ప్రసన్నులై హిమాలయాలకు వెళ్ళిపోయారు. గరుడుడు కూడ గంధమాదన పర్వతంపై కూర్చొని ఆ రెంటినీ తృప్తిగా భుజించాడు. ఆ తర్వాత ఆ పర్వతంపై నుండి ఎగిరాడు. ఆ ప్రభావానికి అనేక ప్రమాదములు సంభవిస్తుండగా, ఇంద్రుడు బృహస్పతి వద్దకు వెళ్ళి కారణం అడిగాడు. 'ఓ ఇంద్రా! వాలఖిల్య ఋషుల ప్రభావంతో గరుడుడు అమృతం కొరకు వస్తున్నాడు. అతను కోరిన మేరకు ఏ రూపాన్నైనా పొందగలడు. అతనికి అమృతం తీసికొని పోయే బలం ఉంది.' అని చెప్పగా, వెంటనే ఇంద్రుడు అమృత భాండము యొక్క రక్షకులను హెచ్చరించాడు. వారు వెంటనే దానిని రక్షించడం మొదలుపెట్టారు.

గరుడుని ప్రచండ వేగానికి ధూళి పైకిగిరి చీకట్లు క్రమ్ముకొన్నాయి. ఇంద్రుడు వాయుదేవుని సాయంతో వెలుగులు వచ్చేటట్లు చేశాడు. దేవతల దాడులను లెక్కచేయకుండా, గరుడుడు అమృత భాండం చేరాడు. ఆ భాండం చుట్టూ మంటలు ఎగిసి పడుతున్నాయి. అపుడు గరుడుడు వంద నోళ్ళు సృష్టించి, వాటితో నదీజలాన్ని

పీల్చి, అగ్నిని చల్లార్చాడు. ముందుకు సాగుతుండగా, భాండం చుట్టూ ఒక చక్రం తిరుగుతున్నట్లు గమనించాడు. తన సూక్ష్మశరీరంతో లోపలికి ప్రవేశించాడు. లోపల పొంచి వున్న మహా సర్పములను గరుడుడు తన ముక్కతో పొడిచి చంపాడు. చుట్టు తిరుగుతున్న చక్రాన్ని ముక్కలు చేసి, అమృతభాండాన్ని తీసికొని తన గమ్యానికి బయలుదేరాడు గరుడుడు.

ఇంతలోనే గరుడునికి విష్ణు భగవానుని దర్శనమైంది. అమృతం తాగాలనే కోరిక ఏదీ లేకుండా పయనిస్తున్న గరుడుని చూచి, సంతోషించి, ఏదైనా వరం కోరుకోమని విష్ణువు చెప్పాడు. 'దేవా! మీ ధ్వజంలో నేనుండాలి. అమృతం తాగకుండానే నేను అమరుణ్ణి కావాలి.' ఈ రెండు వరాలు కోరగా, శ్రీమహావిష్ణువు తథాస్తు అన్నాడు. తర్వాత గరుడుడు కూడ విష్ణువును వరం కోరమని అడిగితే, 'నీవు నాకు వాహనంగా ఉండా'లని విష్ణువు అన్నాడు. సరేనని తన గమ్యానికి బయలుదేరాడు గరుడుడు.

అంతలో ఇంద్రుడు తేరుకొని, గరుడునిపై వజ్రాయుధం ప్రయోగించాడు. గరుడుడు నవ్వుతూ, 'ఇంద్రా! నాకేమీ కాదు. ఏ ఋషి యొక్క వెన్నెముకచే ఇది రూపొందిందో, ఆయన గౌరవార్థం నేను నా ఒక ఈకను విసర్జిస్తున్నాను.' అన్నాడు. ఇంద్రుడు ఆశ్చర్యపడి ఇలా అన్నాడు. 'ఓ గరుడా! నేను నీ స్నేహం కోరుకొంటున్నాను. నీ బలమెంతో చెప్పు' అనగా, 'నీవు నా మిత్రుడను అన్నావు కనుక నేను చెప్తాను విను. మానవలోకమును, ఈ దేవలోకమును నేను నా ఒక్క రెక్కపై మోసుకు పోగలను.' ఇంద్రుడు వరమివ్వదలచగా, గరుడుడు తనకు బలమైన సర్పాలను ఆహారంగా ఇవ్వమని అడిగాడు. ఇంద్రుడు తథాస్తు అన్నాడు.

ఇంద్రుడు అమృత కలశం కోరగా, గరుడుడు దీన్ని నేను సర్పముల వద్ద పెట్టుట వరకే నా విధి, తర్వాత నీవు దొంగిలించవచ్చు.' అని అన్నాడు. ఇంద్రుని వద్ద వీడ్కోలు తీసికొని, సర్పముల వద్దకు చేరి, అమృత కలశమును వారి వద్ద వుంచి, స్నానం చేసి, సేవించండి అని చెప్పి వెళ్ళిపోయాడు గరుడుడు. పాములు స్నానానికి వెళ్ళటం గమనించి, ఇంద్రుడు కలశం తీసికొని పోయాడు. తిరిగి వచ్చిన పాములు తమ గత పాపములకు ప్రాయశ్చిత్తము జరిగినదని భావించి, దుఃఖించాయి.

ధర్మనిరతుడైన శేషనాగు గొప్ప తపస్సు చేసి, బ్రహ్మను మెప్పించాడు. తపస్సు కారణం గురించి బ్రహ్మ అడుగగా, శేషనాగు 'దేవా! తల్లియైన కద్రువ, సోదరులైన నాగుల ప్రవర్తన ఇష్టం లేక నేను తపస్సు చేసుకొంటున్నాను.' అని తెలిపాడు. అప్పటినుండి బ్రహ్మ ఆజ్ఞ మేరకు భూభారమును మోయసాగాడు. జనమేజయుడు చేయబోవు సర్పయాగం నుండి తమను రక్షించుకొనుటకు, వాసుకి నాయకత్వంలో చర్చలు మొదలయ్యాయి. తుదకు, వాసుకి తండ్రియైన ఆస్తేకునితో మాట్లాడ దలచారు.

ఆస్తేకుని జన్మవృత్తాంతం తెలుసుకొందాం.

పూర్వం జరత్కారుడు అనే ఋషి ఉండేవాడు. అతడు బ్రహ్మచర్యంతో తపస్సులో ఉండేవాడు. పెళ్ళి తలంపు లేనేలేదు. కాని తన పితృదేవతలు స్వర్గం నుండి నరకానికి పడిపోవడం చూచాడు. తాను వివాహం చేసుకోక పోవడం వల్లనే వారికి ఈ దుర్గతి పట్టిందని భావించి, వివాహం చేసుకోవాలనుకున్నాడు. కాని ముసలివాడు, శుష్కించి వున్నవాణ్ణి వివాహం చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. చెట్లు, పుట్టలను బట్టి తిరిగాడు. ఈ సంగతి విన్న ఒక పాము, వాసుకి వద్దకు వెళ్ళి చెప్పింది. వాసుకి తన చెల్లెలైన జరత్కారును ఒక

భిక్షగా ఆ ఋషికి సమర్పించింది. ఈ భార్యాభర్తల పేరు అలా ఉంటానికి కారణం జర అంటే క్షీణించిన, కారు అంటే వారు. ఈ జరత్కారుల సంతానమే ఈ ఆస్తేకుడు అని తెలుసుకొందాం.

పరీక్షిత్తు చనిపోయిన విధానాన్ని, జనమేజయుని సర్పయాగాన్ని గూర్చి తెలుసుకొందాం.

పరీక్షిత్తు మహారాజు గొప్ప ధర్మాత్ముడు. మంచి పరిపాలకుడు కూడా. ఒకరోజు వేటకు వెళ్ళి జింకను వేటాడగా, అది తప్పించుకు పోయింది. అలసిపోయిన పరీక్షిత్తుకు శమీకుడు అనే మౌనముని కన్పించాడు. ఆ ముని తనకు సమాధానం చెప్పనందుకు ఆగ్రహించి, చచ్చిపడి వున్న ఒక పామును పరీక్షిత్తు ఆ ముని మెడలొ వేసి వెళ్ళిపోయాడు. ఆ మౌన ఋషి కుమారుడు శృంగి విషయం తెలుసుకొని కోపంతో పరీక్షిత్తును ఇలా శపించాడు. "ఏడు రోజులలో తక్షకుని కాటుతో రాజు చనిపోవు గాక!" విషయం తెలుసుకొన్న పరీక్షిత్తు తనకు కావలసిన రక్షణ చర్యలు తీసికంటూ కశ్యపుని కోసం కబురు పంపాడు. ఏడవ రోజు తక్షకుడు మార్గ మధ్యంలో కశ్యపుని చూచి ఎక్కడకు వెళుతున్నావని అడిగాడు. తక్షకుని కాటుకు బలికాబోతున్న రాజు దగ్గరకు వెళు తున్నానని కశ్యపుడు చెప్పాడు. నా వేటునుండి తప్పించుకోవడం ఎవరి వల్ల కాదు అని తక్షకుడు చెప్పాడు. అక్కడు ఉన్న చెట్టును తన కాటుతో కాల్చివేశాడు. కాని కశ్యపుడు తన తపోబలంతో దానిని మళ్ళీ చిగురింపచేశాడు. తక్షకుడు ఆశ్చర్య పడ్డాడు. తక్షకుడు కశ్యపుని ప్రలోభ పెట్టసాగాడు. రాజునుండి ధనం కోసం వెళుతున్నాను, నీవు ఆ ధనం ఇస్తానంటే తీసుకొని నేను వెళ్ళిపోతాను అని కశ్యపుడు అన్నాడు. తక్షకుని నుండి ఆ ధనం తీసికొని కశ్యపుడు వెనుదిరిగాడు. ఈ విషయమంతా వినిన జనమేజయుడు దాని మూలమేమని ప్రశ్నించాడు. మంత్రులంతా ఇలా చెప్పారు. "మహారాజా! తక్షకుడు చెట్టును మాడ్చివేసినపుడు, ఆ చెట్టు గుబురులో ఒక మనిషి ఉన్నాడు. తర్వాత కశ్యపుడు ఆ చెట్టును పూర్వ రూపానికి తీసికొని రాగా, అందులో ఉన్న మనిషి కూడ జీవించాడు. ఆ మనిషి నుండే ఈ సంగతులన్నీ సేకరించాం." అన్నారు.

జనమేజయుని సర్పయాగం గురించి తెలుసుకొందాం.

జనమేజయుడు యాగ నిమిత్తమై, అన్ని ఏర్పాట్లు చేయించాడు. వేదజ్ఞులైన వారి ద్వారా యాగాన్ని ప్రారంభించాడు. ఋత్విజులందరు నల్లని వస్త్రాలు ధరించి, మంత్రాలతో హవనం చేస్తున్నారు. పాములన్నీ వణికి పోతున్నాయి. ఆ జ్వాలల్లో పడి మసి అయిపోతున్నాయి.

ఈ యజ్ఞానికి చండభార్గవుడు హౌత. కౌత్సుడు ఉద్గాతగా, జైమిని బ్రహ్మగా మరియు పింగళుడు ఆధ్వర్యుడుగా వున్నారు. శిష్య సమేతంగా వ్యాసుడు, ఉద్దాలకుడు, శ్వేతకేతువు మొదలైనవారు సభ్యులుగా నిలిచారు. భయంకరమైన సర్పములన్నీ అగ్నిగుండంలో పడి భస్మమై పోతున్నాయి. తక్షకుడు భయపడి ఇంద్రుని శరణు వేడి, ఇంద్రుని భవనంలోనే వుండడం మొదలు పెట్టాడు.

ఈ విధంగా అనేకమైన సర్పాలు చనిపోవడంతో వాసుకి కలతచెంది చెల్లెలు జరత్కారు వద్దకు పోయి ఈ ప్రమాదం నుండి రక్షించమని కోరాడు. జరత్కారు కొడుకైన ఆస్తేకుని పిలిచి, సర్పయాగాన్ని నిలిపి వేయించమని ఆదేశించింది. ఆస్తేకుడు యజ్ఞశాలకు వెళ్ళగా, ద్వారపాలకులు అతనిని లోనికి వెళ్ళనివ్వ లేదు. వెలుపలినుండే యజ్ఞాన్ని ప్రస్తుతించడం విని, జనమేజయుడు ఆస్తేకుని లోనికి ప్రవేశపెట్టమని చెప్పాడు. ఆస్తేకుడు లోనికి వళ్ళి మహారాజును, ఋత్విజులను అందరినీ ప్రస్తుతిస్తూ, స్తుతించడం మొదలుపెట్టాడు. చిన్నవాడైనా ఆస్తేకుడు ప్రతిభాశాలి అని అందరూ పొగడారు. అతను కోరుకున్న వస్తువాహనాలు ఇవ్వవచ్చన్నారు. అపుడు జనమేజయుడు

ఇలా అన్నాడు. "ఋత్విజులారా! తొందరగా యజ్ఞం పూర్తిచేయండి. తక్షకుడు వెంటనే వచ్చే విధంగా మంత్రోచ్చారణ చేయండి." అపుడు ఋత్విజులు 'రాజా! తక్షకుడు ఇంద్రుని శరణు కోరాడు." అన్నారు. రాజు "అయితే ఇంద్రునితో సహా రప్పించం"డని వారిని కోరాడు. హోత అగ్నిలో ఆహుతి వేశాడు. తక్షణమే ఇంద్రుడు, తక్షకుడు ఆకాశంలో రాసాగారు. ఇంద్రుడు భయపడి పారిపోసాగాడు. అపుడు ఋత్విజులు 'రాజా! మీరు తలంచిన కార్యం నెరవేరుతోంది. కనుక మీరు ఈ ఆస్తేకుడు కోరిన వరం ఇవ్వండి" అన్నారు. తక్షకుడు అగ్నిగుండంలో పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇదే సరియైన సమయమని తలంచి, వెంటనే యాగం ఆపుచేయించమని, మిగిలిన సర్పములను నిలుపమని కోరాడు ఆస్తేకుడు. జనమేజయుడు కొంచెం దుఃఖితుడైనాడు. ఆస్తేకుడు కోరినట్లు చేయక తప్పలేదు. ఇంద్రుడు తక్షకుని వదలిపెట్టి పారిపోగానే తక్షకుడు స్పృహ కోల్పోయాడు. అగ్నిగుండంలో పడిపోబోతున్న తక్షకుని ఆస్తేకుడు ఆగిపో అని మూడుసార్లు అరిచాడు. ఆ విధంగా తక్షకుడు బ్రతికిపోయాడు.

జనమేజయుడు యాగం సమాప్తి కాగా, ఋత్విజులకు బంగారాన్ని కానుకలుగా సమర్పించాడు. ఆస్తేకుని కూడా బాగా సత్కరించి, తాను చేయబోవు అశ్వమేధ యాగానికి ఆహ్వానించి, పంపించివేశాడు. ఆస్తేకుడు మామ వాసుకి దగ్గరకు వెళ్ళి, తల్లియైన జరత్కారు దగ్గరకు వెళ్ళి జరిగినదంతా చెప్పాడు. ఈ విశేషాలు తెలుసుకున్న వారికి ఏ ప్రమాదమూ రాదు అని గ్రహింతుము గాక!

----ooooo----

వేదవ్యాసుని అనుజ్ఞ మేరకు వైశంపాయనుడు జనమేజయునకు మహాభారత కథ చెప్పడం ప్రారంభిస్తాడు ఇలా – "మహాభారతం చెప్పటం నాకూ మిక్కిలి ఆనందదాయకమైనదే. జనమేజయుడు సర్పయాగం తలపెట్టగానే వేదవ్యాసుడు అక్కడికి వెళ్ళాడు. జనమేజయ మహారాజు, సభాసదులందరూ సేవించి, బంగారు సింహాసనంపై ఆసీనులను చేసి ఇలా అడిగాడు – "దేవా! కౌరవులకు, పాండవులకు మధ్య వైరం ఎందుకు ఏర్పడిందో చెప్పండి." అపుడు వేదవ్యాసుడు వైశంపాయనుని వైపు తిరిగి 'నానుండి మొత్తం కథను నీవు విన్నావు గదా! ఆ కథను ఈయనకు తెలియజేయి." అన్నాడు. అపుడు వైశంపాయనుడు గురువు వ్యాసునకు నమస్కరించి, సభనుద్దేశించి ఇలా చెప్పడం ప్రారంభించాడు. "ఈ మహాభారత కథను చెప్పినవారు, విన్నవారు దేవతల సమానులవుతారు. ఇది వేదతుల్యమైనది. ఇందలి విషయాల్ని గొప్ప ఋషులు మెచ్చుకొన్నారు. ఈ గ్రంథాన్ని దానం ఇస్తే, భూమండలాన్ని దానం చేసిన ఫలితం లభిస్తుంది. ధర్మార్థకామమోక్షములకు సంబంధించిన విషయాలు ఇందులో మిక్కుటంగా వున్నాయి. ఇందులోలేని అంశం మరెచ్చటను లేదు. కనుక భక్తిశ్రద్ధలతో వినండి."

వైశంపాయనుడు ఇలా అన్నాడు. "జమదగ్ని కుమారుడు పరశురాముడు 21 సార్లు భూమిపైనున్న క్షత్రియుల నందరినీ హతమార్చాడు. తర్వాత క్షత్రియ వంశ రక్షకులైన తాపసులు మళ్ళీ క్షత్రియులు ధర్మపాలనను చేయుటకు సాయపడ్డారు. రాజులు సుపరిపాలన చేయసాగారు. ప్రజలు సుఖంగా ఉన్నారు. దేవలోకంలో దేవదానవుల యుద్ధం జరిగి, దానవులు భూలోకంలో వారి వారి రూపాల్లో జన్మించి, ముల్లోకాలలో అలజడి సృష్టించడం ప్రారంభించారు. దానితో అశాంతి నెలకొంది. రాక్షసులు రాజులుగా మారి జనాన్ని పీడించసాగారు. శేషనాగుకు, కచ్ఛపమునకు భూమి భారంగా మారి ఇబ్బంది పడ్డారు. భూమాత ఈ విషయాన్ని బ్రహ్మకు విన్నవించింది. బ్రహ్మ అపుడు దేవతలను, గంధర్వులను, అప్సరసలను పిలిచి, మీమీ అంశలతో భూలోకంలో జన్మించండని చెప్పాడు. తర్వాత బ్రహ్మతో సహా దేవతలందరు వైకుంఠంలోని నారాయణుని దగ్గరకు వెళ్ళారు. ఇంద్రుడు మహావిష్ణువును స్తుతించి, భూభారం తగ్గించాలని, అందుకు అవతార మెత్తమని ప్రార్థించగా, అందుకు

శ్రీమహావిష్ణువు తథాస్తు అన్నాడు. దానవులు కూడ మానవ రూపాల్లో జన్మించారు. వారిలో జరాసంధుడు, హిరణ్యకశిపుడు, శిశుపాలుడు, భగదత్తుడు, కంసుడు, దుర్యోధనదుశ్శాసనులు మున్నగువారు ముఖ్యులు. దేవాంశతో భీష్ముడు, ద్రోణుడు, సాత్యకి, పంచపాండవులు, అభిమన్యుడు మున్నగువారు జన్మించారు. శూరసేనుడి కుమార్తె అయిన పృథను కుంతిభోజునకు దత్తత ఇచ్చారు. చిన్న వయస్సుగల పృథ అక్కడికి వచ్చు ఋషులకు సేవ చేస్తూ ఉండేది. ఒకసారి దుర్వాస ముని ఈమె సేవలకు సంతసించి ఒక మంత్రం చెప్పాడు.. దాని ప్రభావంతో కోరుకున్న దేవుడు ప్రత్యక్షమై పుత్రుని ప్రసాదిస్తాడు. ఆమె సూర్యుని అందాన్ని చూసి, ఆయనను తలచుకోగా వెంటనే సూర్యదేవుడు వచ్చి చేసిన గర్భస్థాపన ఫలితంగా కవచకుండలాలతో కర్ణుడు జన్మించాడు. కళంకం తొలగించుకోవడానికి ఆ బిడ్డను ఒక పెట్టెలో పెట్టి ఆమె నదీప్రవాహంలో వదిలివేసింది. అతిరథునకు లభించిన ఆ బాలుడే కర్ణుడైనాడు. దానకర్ణుడిగా పేరుగాంచాడు. ఇంద్రుడు మారువేషంలో వచ్చి కర్ణుని కవచకుండలాలు అడిగితే కర్ణుడు సంతోషంగా ఇచ్చివేశాడు. అతని దానగుణానికి మెచ్చి ఇంద్రుడు సంతసించి, ఒక శక్తి ఆయుధాన్ని కర్ణునికి ప్రసాదించాడు.

నారాయణ భగవానుని అంశతో వాసుదేవుడుగా శ్రీకృష్ణుడు జన్మించాడు. బలరాముడు శేషుని అంశతో జన్మించాడు. ఈ రకంగా దేవతలు, దానవులు, గంధర్వులు, అప్సరసలు తమ తమ అంశలతో మానవరూపాల్లో జన్మించారు.

జనమేజయుడు చాల విషయాలు తెలుసుకున్నాడు. కురువంశాన్ని గురించి చెప్పమని వైశంపాయనుని కోరాడు. అప్పుడు వైశంపాయనుడు ఈ విధంగా చెప్పడం ప్రారంభించాడు.

"జనమేజయా! కురు వంశ ప్రవర్తకుడిగా దుష్యంతుడు ఖ్యాతి గాంచాడు. విశాల సామ్రాజ్యాన్ని జనరంజకంగా పరిపాలించాడు. అస్త్రశస్త్ర విద్యలలో నిపుణుడై, విష్ణువంతటి శక్తియుక్తులు కలిగి, సూర్యసమాన తేజస్సుతో, సముద్ర గాంభీర్యంతో, భూమాతంతటి క్షమాశీలియై ప్రసిద్ధి చెందాడు.

దుష్యంతుడు ఒక రోజు తన తురంగ బలాలతో దట్టమైన అడవిలోనికి వెళుతూ వుండగా, ఒక ఆశ్రమాన్ని గమనించాడు. ఆ ఆశ్రమం శోభాయమానంగా ఉంది. ఆ ఆశ్రమ ప్రాంగణంలో అగ్నిహోత్ర జ్వాలలు ప్రజ్వరిల్లుతూ ఉన్నాయి. తనతో వచ్చిన మంత్రిని, పురోహితుని బయటనే నిలిపి, తానొక్కడే ఆశ్రమంలోనికి ప్రవేశించాడు. లక్ష్మీసమాన సౌందర్యవతియైన ఒక కన్య తపస్విని దుష్యంతుని చూచి స్వాగతం పలికింది. సర్వాంగ సుందరి యైన ఆమెను చూచి దుష్యంతుడు సుందరీ! నీవెవరు? మీ నాన్నగారెవరు? అని అడిగాడు. శకుంతల తన మదుర స్వరంతో ఇలా చెప్పింది. "రాజా! నేను కణ్వ మహర్షి కుమార్తెను." దుష్యంతుడు ఆశ్చర్యపడి 'మహా గొప్ప బ్రహ్మచారియైన కణ్వ మహర్షికి నీవెలా కుమార్తెవవుతావు' అని అడిగాడు. అపుడు శకుంతల "మహారాజా! పరమపూజ్యులైన మా తండ్రిగారు నా జన్మవృత్తాంతాన్ని నాకు చెప్పారు. ఒకసారి పరమ ప్రతాపవంతుడైన విశ్వామిత్రుడు తపస్సు చేస్తున్న సమయంలో, ఆయన తపోభంగం కోసం ఇంద్రుడు మేనకను పంపగా, వారి కలయిక వలన నేను జన్మించాను. నన్ను వనంలో వదలిపెట్టి, వారిరువురూ వెళ్ళిపోగా అడవిలో ఉన్న శకుంతల పక్షులు, మృగముల బారినుండి నన్ను రక్షించినందున నా పేరు శకుంతలగా స్థిరపడింది. ఆ తర్వాత నన్ను కణ్వమహర్షి తీసుకొని వచ్చి పోషిస్తున్నారు. ఆ విధంగా ఆయన నా తండ్రి అయినా"రని చెప్పింది.

దుష్యంతుడు అంతా విని, ఇలా అన్నాడు. "ఓ కళ్యాణీ! నీవు చెప్పిన విషయము ననుసరించి నీవు క్షత్రియ కన్యవు. అందుచేత ఓ సుందరీ! నేను నిన్ను గాంధర్వ రీతిలో పెండ్లి చేసుకోవాలనుకుంటున్నాను."

అన్నాడు. తనకు కాబోయే కుమారుడే యువరాజు కావలెనని శకుంతల విధించిన షరతుకు దుష్యంతుడు అంగీకరించినందున, వారిరువురు గాంధర్వ రీతిలో వివాహం చేసుకొన్నారు. త్వరలోనే నిన్ను రాజధానికి తీసుకొని వెళతాను అని చెప్పి, తన గుర్తుగా ఒక అంగుళీయకమును ఆమె వ్రేలికి తొడిగి, దుష్యంతుడు ఒక్కడే రాజధానికి వెళ్ళిపోయాడు. ఆశ్రమమునకు చేరుకొన్న కణ్వునికి శకుంతల జరిగిన విషయం చెప్పుటకు సంకోచించింది. కాని త్రికాలదర్శియైన కణ్వ మహర్షి శకుంతలను ఆశీర్వదించి, నీకు కలుగబోవు కుమారుడు చక్రవర్తియై, ప్రజాపాలన చేయునని చెప్పాడు. కొంతకాలానికి శకుంతలకు కుమారుడు జన్మించాడు. దేవకుమారుని లాగ ఉన్న ఆ కుమారుడు ఆరు సంవత్సరముల ప్రాయానికే క్రూరమృగాలను శాసించు స్థాయికి ఎదిగిపోయాడు. క్రూరమృగాలను పట్టి బంధించేవాడు. ఆ తరువాత కొంతకాలానికి కణ్వ మహర్షి శకుంతలను కుమారునితో సహా దుష్యంతుని వద్ద వదలి రమ్మని తన శిష్యులను తోడిచ్చి హస్తినాపురానికి పంపాడు. దారిలో శకుంతల దుష్యంతుడు తమ వివాహమునకు గుర్తుగా యిచ్చిన అంగుళీయకమును నదిని దాటే సమయంలో నీటిలో జారవిడుచుకుంది.

కుమారునితో కలిసి రాజసభకు చేరుకొన్న శకుంతల దుష్యంతుని ఉద్దేశించి, “ఓ రాజా! ఇతడు మీ కుమారుడు, దేవతుల్యుడు. మీరు చేసిన ప్రతిజ్ఞ ననుసరించి, ఇతనిని యువరాజుగా చేయండి.” అన్నది. కాని దుష్యంతుడు “ఓ తపస్వినీ! నీవెవరో నాకు తెలియదు. నీతో నాకు ధర్మార్థ కామ సంబంధమేమీ లేదు.” అన్నాడు. ఈ మాటలు విన్న శకుంతల నిశ్చేష్టురాలై దుఃఖాన్ని మ్రింగుకొని “మహారాజా! మీరు మీ మనస్సాక్షిని తిరస్కరించకండి. ఆ సమయంలో నేనొక్కతెనే ఉన్నానుకోకండి. సర్వాంతర్యామి అన్నీ చూడగలడని తెలుసుకోండి. సూర్యుడు చూస్తున్నాడు, వాయువు, అగ్ని, అంతరిక్షం, పృథ్వి, జలము, హృదయము, యమరాజు, దినము, రాత్రి, సంధ్యా మరియు ధర్మం ఇవన్నీ శుభాశుభ కర్మలను గమనిస్తూనే ఉంటాయి. మన గాంధర్వ వివాహాన్ని గుర్తు చేసుకోండి. భార్యవల్లనే ధర్మార్థకామమోక్షాలు సిద్ధిస్తాయి. రోగగ్రస్తుడైనపుడు, ఆపదలో భార్య సహాయకారిగా నిలుస్తుందన్న విషయం మరువకండి. ఈ కుమారుని చూడండి. అచ్చు మీలాగనే ఉన్నాడు. జాతక కర్మల ననుసరించి, ఒక వంద అశ్వమేధ యజ్ఞములు చేయునని ఉన్నది. మీరు నన్ను స్వీకరించకున్నా ఫరవాలేదు. ఈ కుమారుని స్వీకరించండి.” అన్నది. అపుడు దుష్యంతుడు ఇలా అన్నాడు. “ఓ శకుంతలా! నీవలన నాకు కుమారుడు కలిగెనని నేను అనుకోను. మీరు ఆడవారు. తరచుగా అబద్ధాలాడుతుంటారు. మిమ్మల్ని నమ్మటానికి వీలుకాదు. వెళ్ళిపో”. శకుంతల “ఓ రాజా! కపటపు మాటలు చాలించు. ఒక వేయి అశ్వమేధ యాగాలు చేసినను, ఒక్క సత్యవాక్యముతో సమానము కాదు. అసత్యమాడుటచే నేను నీతో ఉండజాలను. నీవు ఈ కుమారుని ఆదరించినా, లేకున్నా ఈ కుమారుడే భూమండలాన్ని పరిపాలించగలడు’ అని శకుంతల అక్కడినుండి వెళ్ళసాగింది.

విశేషమేమంటే – సరిగ్గా అదే సమయంలో ఋత్విజులను, పురోహితులను, ఆచార్యులను, మంత్రులను మరియు రాజైన దుష్యంతుని సంబోధిస్తూ ఆకాశవాణి ఇలా పలికింది – “ఓ రాజా! నీ కుమారుని దగ్గరకు తీసికో. శకుంతలను అవమాన పరచకు. నీవే కదా గర్భాదానం చేసింది. శకుంతల చెప్పేదే సత్యం. నీ కుమారునికి భరతుడు అని పేరు పెట్టు.”. ఆకాశవాణి మాటలు విన్న దుష్యంతుడు ఆనంద పులకితుడై మంత్రులతో, పురోహితులతో ఇలా అన్నాడు. “ఆకాశవాణి మాటలు విన్నారు కదా! శకుంతల చెప్పిన మాటలను నేను వెంటనే స్వీకరిస్తే, నా ప్రజలు సందేహిస్తారని, నేను శకుంతలతో దురుసుగా ప్రవర్తించాను. అంతే!” అని కుమారుని దగ్గరకు తీసుకొని, కౌగలించుకొని ఆనందాన్ని ప్రకటించాడు దుష్యంతుడు.

శకుంతలను ధర్మానుసారముగా సత్కరించి ఇలా అన్నాడు. "దేవీ! నీతో నాకు గల సంబంధం ఎవరికీ తెలియదు. కావున వీరెల్లరు నిన్ను రాణిగా ఒప్పుకోవడానికి నేను క్రూరంగా ప్రవర్తించాను. మనమిద్దరం ప్రేమికులం" అంటూ దుష్యంతుడు తన ప్రాణప్రియను దగ్గరకు తీసికొన్నాడు.

నిశ్చిత శుభతరుణంలో భరతునకు యువరాజ పట్టాభిషేకం జరిగింది. కణ్వమహర్షి భరతునిచే అశ్వమేధ యాగం చేయించాడు. భరతుడు సువిశాల సామ్రాజ్యాన్ని సుభిక్షంగా పరిపాలించి, కీర్తి ప్రతిష్ఠలు వృద్ధి చేసుకొన్నాడు. భరతుని పేరుతోనే మన దేశము యొక్క పేరు భరతదేశమైంది.

అరణ్యవాసం చేస్తున్న ధర్మరాజు వద్దకు ఒక రోజు మహర్షి బృహదశ్వుడు వచ్చాడు. ఆ మహర్షికి ధర్మరాజు తన బాధలన్నింటిని చెప్పుకొని, నాలాటి దురదృష్టవంతుడుండడని అన్నాడు. మహర్షి చిన్నగా నవ్వి 'లేకేమి, నలదమయంతులు కూడ అనేక కష్టాలు పడ్డారు' అన్నాడు. అపుడు ధర్మరాజు మహర్షిని ఆ వృతాంతం చెప్పమని కోరాడు.

మహర్షి ఇలా చెప్పనారంభించాడు.

"ధర్మజా! పూర్వం నిషధ దేశాన్ని నలుడు పరిపాలిస్తూ వుండేవాడు. అతడు గుణవంతుడు, పరమ సుందరుడు, సత్యవాది, జితేంద్రియుడై అందరికీ ప్రియమైన వాడుగా, వేదవేత్తగా శోభిస్తూ ఉన్నాడు. సర్వగుణ సంపన్నుడై, పరాక్రమవంతుడై విక్రమిస్తూ ఉన్నాడు. ఆ రోజుల్లోనే భీష్మకుడు అనే రాజు విదర్భ దేశాన్ని పరిపాలిస్తుండేవాడు. భీష్మకునకు ఒక్కగానొక్క కుమార్తె పేరు దమయంతి. దమయంతి లక్ష్మీదేవిలా రూపవతి. విశాల నేత్రాలతో అలరారుతున్నది. దేవతలలో గాని, యక్షులలో గాని దమయంతి అంతటి అందగత్తె లేదు.

ఆ కాలంలో విదర్భ నుండి నిషధ దేశానికి, నిషధ నుండి విదర్భ దేశానికి రాజోద్యోగులు కూడ వస్తూ పోతూ వుండేవారు. వారి మధ్య సయోధ్య ఎక్కువగానే ఉండేది. అందులో కొందరు దమయంతి సౌందర్యాన్ని గురించి నలునికి చెపుతుండేవారు. మరికొంతమంది నలుని గుణసంపదను గురించి దమయంతికి చెప్పసాగారు. ఈవిధంగా వారిరువురి మధ్య ప్రేమ అంకురించింది.

ఒకరోజు నలుడు తన ఉద్యానవనంలో విహరిస్తూ, అక్కడ హంసలను చూచి, వాటిలో ఒక హంసను తన చేతిలోనికి తీసుకొన్నాడు. ఆ హంస మానవ భాషలో తనను విడిచిపెట్టమని కోరుతూ, దానికి ప్రతిగా తాను విదర్భ దేశానికి వెళ్ళి దమయంతికి మీ గురించి చెప్పి, మిమ్మల్ని వివాహం చేసుకొనేట్లు చేస్తానని చెప్పింది. నలుడు నవ్వుకొంటూ ఆ హంసను వదలివేశాడు. ఆ హంసలన్నీ గుంపుగా ఎగురుకుంటూ, విదర్భ దేశానికి వెళ్ళి దమయంతి దగ్గర వ్రాలాయి. వాటిని పట్టుకోవడానికి దమయంతి ప్రయత్నించగా, ఒక హంస ఇలా అన్నది. "ఓ దమయంతీ! నిషధ దేశాధీశుడైన నల మహారాజు పురుష శ్రేష్ఠుడు. నీవు స్త్రీలలో రత్నానివి. మీ ఇద్దరి కలయిక అమోఘంగా ఉంటుంది" అన్నాయి. దమయంతి ఎంతో సంతోషపడి, నలుని దగ్గర కూడా ఇలాగే చెప్పండి అని హంసలను పట్టుకొనే ప్రయత్నాన్ని మానివేసింది.

ఇంతలో విదర్భరాజైన భీష్మకుడు దమయంతి యొక్క స్వయంవరాన్ని ప్రకటించాడు. భూలోకంలోని రాజులందరు విదర్భకు బయలుదేరారు. ఇంద్రాది దేవతలు నారదుని ద్వారా ఈ విషయం తెలుసుకొని విదర్భకు బయలుదేరారు. నలుడు కూడ స్వయంవరానికి ప్రయాణమైనాడు. సూర్యచంద్రప్రభలతో వెలిగిపోతున్న నలుని

చూచిన ఇంద్రాది దేవతలు తమకు దూతగా వ్యవహరించమని కోరారు. నలుడు సరేనన్నాడు. మా దేవతలలో ఒకరిని వరించమని దమయంతికి చెప్పమని వారు కోరారు. నలుడు ఆశ్చర్యంతో నేను కూడా స్వయంవరానికే వెళుతున్నానని చెప్పాడు. కనుక కుదరదన్నాడు. నీవు సత్యవ్రతుడవు కనుక నీవు దూతకార్యము నిర్వహించవలసిందేనని వారు ఒత్తిడి తెచ్చారు. నీవు నిరాటంకంగా అంతఃపురలోనికి వెళ్ళగలవు అని కూడ చెప్పారు. ఇంద్రుడు చెప్పిన విధంగానే నలుడు నిరాటంకంగా దమయంతి దగ్గరకు చేరాడు.

ఈ అందగాడైన నలుని చూచి చెలికత్తెలు ఆశ్చర్యపోయారు. దమయంతి కూడ ఆనందపడింది. దూతగా వచ్చిన విషయం నలుడు వివరించాడు. అపుడు దమయంతి నేను మిమ్మల్ని తప్ప వేరొకరిని వరించనని గట్టిగా చెప్పింది.

స్వయంవర మండపంలో నలునితో పాటు ఇంద్రాది దేవతలు కూడ నలుని రూపంలోనే కూర్చొన్నారు. అందరూ నలుని రూపంతో వున్నారు. దమయంతికి దిక్కుతోచలేదు. ఆమె దిక్పాలాది రాజులందరిని వేడుకొనగా వారు కనికరించి, తమ తమ నిజరూపాలను ప్రదర్శించారు. దమయంతి సంతోషించి, నలుని వరించింది. నలుడు సంతోషంతో దమయంతి చాతుర్యాన్ని అభినందించాడు. దేవతలు అందరూ నలునికి కానుకలుగా వరములిచ్చారు. ఇంద్రుడు యజ్ఞములో తన దర్శనమగునట్లు, అగ్ని నలుడనుకున్న చోట తానావిర్భవించునట్లు, యముడు పాకశాల ప్రావీణ్యముండునట్లు, వరుణుడు, నలుడు కోరుకున్న చోట జలముద్భవించునట్లు వరము లిచ్చి అదృశ్యమయ్యారు.

ఆ తరువాత నలుడు దమయంతితో పాటు నిషధ దేశానికి చేరుకొని, అశ్వమేధయాగము చేసి, ఒక కుమారుని, ఒక కుమార్తెను పొందాడు.

ఇదిలా వుండగా, ఇంద్రాది దేవతలు తిరుగు ప్రయాణంలో కలి హడావుడిగా వెళుతుండడం గమనించారు. అతనిని ఆపి ఇంద్రుడు ఎక్కడికి పోతున్నావని అడగగా, దమయంతి స్వయంవరానికి పోతున్నానని చెప్పాడు కలి. ఇంద్రుడు నవ్వి, దమయంతి నలుని స్వయంవరం వ్యవహారమంతా చెప్పాడు. కలి ఆగ్రహోదగ్రుడై 'నేను నలుని రాజ్యచ్యుతుని చేసి, దమయంతిని వేరు చేస్తా'నని చెప్పి, నలుని రాజధానిలోకి ప్రవేశించి సమయం కోసం ఎదురు చూడసాగాడు. 12 సంవత్సరాలు గడిచాయి. ఒకరోజు శుచికాని నలునిలో కలి ప్రవేశించాడు. మరొక వేషంలో నలుని సోదరుడైన పుష్కరుని వద్దకు వెళ్ళి, నలునితో పాచికలాడి, రాజ్యాన్ని కైవసం చేసుకోమని ప్రోత్సహించాడు. ద్వాపరంలోని పాచికలుగా మారి పుష్కరునకు అనుకూలించాడు. పదే పదే పాచికలాటకు రమ్మని పుష్కరుడు నలుని కోరినా నలుడు తిరస్కరిస్తూ వచ్చాడు. చివరకు నలుడు అంగీకరించేవరకు తన ప్రతిపాదనను పుష్కరుడు వదలలేదు. శనిప్రభావంతో నలుడు పాచికలాటలో ఓడిపోయాడు. తన పిల్లలను విదర్భ దేశానికి పంపించి వేశాడు. దమయంతి మాత్రం నలునితోనే వుంటానని పట్టుపట్టింది.

ఏకవస్త్రంతో రాజధానిని వదలి బయటకు వచ్చిన నలుడు దమయంతితో పాట అడవిలో బంగారు రెక్కలున్న పక్షులను చూచాడు. వాటిని పట్టుకొంటే, కాస్త బంగారం లభిస్తుందని, దానితో కొంతకాలం పాటు జీవనం సాగించవచ్చని తలచి, తన అంగవస్త్రాన్ని వాటిపైకి విసిరాడు. ఆ పక్షులు నలుని ఉద్దేశించి, 'ఓయీ నలుడా! మేము పక్షులం కాము, నిన్ను రాజ్యచ్యుతిని చేసిన పాచికలం" అంటూ ఆ అంగవస్త్రంతో పాటు ఆకాశానికెగిరిపోయాయి. ఉన్న ఒక వస్త్రం కూడా పోవడంతో, దమయంతి తన చీరలో సగం చించి ఆయనకు యిచ్చింది. ఆ తర్వాత వారు నడుచుకొంటూ, ఆ అరణ్యంలో ఒ కూడలిలాంటి ప్రదేశానికి చేరారు. నలుడు

దమయంతితో ఏ మార్గం ఎటు పోతుందో చెప్పసాగాడు. ఆ సంకేతాన్ని అర్థం చేసుకొన్న దమయంతి, మిమ్మల్ని వదిలి వెళ్ళనని చెప్పింది. ఇలా ఇద్దరూ ఒక ధర్మశాలలో బస చేశారు. నలుడు ఇలా అనుకున్నాడు.

ఎలాగూ తాను లేని పక్షంలో దమయంతి తన పుట్టింటికి వెళుతుందనే ఆశతో నలుడు అర్ధరాత్రి సమయంలో ఆమెను ఒంటరిగా వదిలి వెళ్ళిపోయాడు. మెళుకువ వచ్చిన తర్వాత దమయంతి నలుడు కనిపించనందున నిరాశాపరురాలైంది. వెదకసాగింది. దుఃఖంతో ఉన్మాదావస్థలో ఉన్న దమయంతిని కొండచిలువ మ్రింగడానికి ప్రయత్నించినా ఆమె స్పృహలోకి రాలేదు. ఈ దృశ్యాన్ని చూచిన వేటగాడొకడు వచ్చి కొండచిలువను ముక్కలు చేసి దమయంతిని రక్షించాడు. ఆమె అందాన్ని చూచి ఆమెను మోహించిన వేటగాడు తన కోర్కెను తీర్చమని ఆమెను బలవంత పెట్టసాగాడు. కాని ఆమె తన పాతివ్రత్య మహిమతో వాడిని శపించి చంపివేసింది.

మరల నలుని వెదుకుతూ బయలుదేరింది. తర్వాత ఒక ఋషుల బృందం కనిపించగా, వారికి తన వృత్తాంతమంతా నివేదించి, తనను రక్షించమని కోరింది. వారు ఆమెతో 'నలుడు మళ్ళీ నిన్ను చేపట్టి, రాజ్యపాలన చేసేలా చూస్తా'మని చెప్పి అదృశ్యులైనారు. దమయంతికి ఆశ్చర్యం వేసింది. ఆ తర్వాత ఒక వర్తకుల గుంపు అక్కడకు వచ్చింది. వారితో పాటు, వారి సాయంతో దమయంతి చేది దేశపు రాజైన సుబాహుని రాజ్యానికి చేరింది. ఆమె వీధిలో నడుస్తుండగా, కిటికీలో నుండి ఆమెను గమనించిన రాజమాత దమయంతిని తనవద్దకు పిలిపించుకొన్నది. అక్కడ దమయంతి నియమపూర్వకంగా, స్వేచ్ఛగా ఉండసాగింది.

దమయంతిని వదలిపెట్టి వెళ్ళిన నలునకు అడవిలో ఒకవైపు దావాగ్ని కనిపించింది. ఆ కార్చిచ్చునుండి "నల మహారాజా! రక్షించు" అన్న కేక వినిపించింది. నలుడు ఆ శబ్దం విని ఆ దిశకు వెళ్ళగా, అక్కడ కర్కోటకుడనే సర్పరాజు కనిపించాడు. దానిని రక్షించగా, అడుగులు లెక్కిస్తూ నడవమని కోరాడు. పది అడుగులు లెక్కించగానే సర్పరాజు అతనిని కాటువేయడంతో. ఆ విషం కారణంగా నలుని రూపం మారిపోయింది. అపుడు కర్కోటకుడు "ఓ రాజా! నీకు ఏ శత్రుభయము లేదు. నీవు బాహుకుడుగా పేరు మార్చుకొని, అయోధ్య రాజైన ఋతుపర్ణుని కొలువులో రథసారథిగా చేరు. ఆ రాజు నీకు మిత్రుడు కాగలడు. నీవు అతనిని అశ్వవిద్య నేర్పు. పాచికలాటలో మెళకువలను అతడు నీకు నేర్పుతాడు." అని చెప్పి అదృశ్యుడయ్యాడు. అలాగేనని అయోధ్యకు వెళ్ళి, ఋతుపర్ణుని కొలువులో బాహుకుడనే పేరుతో రథసారథిగా చేరాడు. ఈ బాహుకుని అశ్వశాలాధ్యక్షునిగా నెలకు పదివేల బంగారు నాణాల జీతమిస్తూ నియమించాడు ఋతుపర్ణుడు. వారిద్దరూ మంచి మిత్రులైనారు.

నలదమయంతులు విడిపోయిన విషయం విదర్భ రాజైన భీష్మకునికి తెలిసి, చాల విచారించాడు. తర్వాత చురుకుగా ఉండే కొందరు బ్రాహ్మణులకు ఆమె ఆచూకీ కనిపెట్టమన్నాడు. అలా ఆచూకీ తెలియజేసి వారికి పదివేల గోవులిస్తానని ప్రకటించాడు. ఆ బ్రాహ్మణులలో సుదేవుడనే బ్రాహ్మణుడు చేది రాజధానిలోని రాజమహలులో వున్న దమయంతిని గుర్తించాడు. విషయం తెలుసుకొన్న రాజమాత వివరాలు అడిగి తెలుసుకొని దమయంతిని గట్టిగా కౌగిలించుకొని ముద్దాడింది. "బిడ్డా! నీవు నా చెల్లెలి కుమార్తెవు" అని ఎంతో సంతోషంతో ఆమెకు అనేక కానుకలిచ్చి, పల్లకి తెప్పించి, కొందరు కాపలాదారులతో విదర్భకు పంపింది. దమయంతిని చూచి భీష్మకుడు ఎంతో సంతోషించాడు. ప్రకటించిన ప్రకారం సుదేవునికి 10 వేల గోవులతో పాటు ఒక గ్రామాన్ని, వలసినంత ధనాన్ని ఇచ్చి పంపాడు.

ఆ తర్వాత నలుని వెదకటానికి దమయంతి బ్రాహ్మణులను పంపింది. జనమున్న చోట ఏ మాటలు

అనవలెనో అన్నీ చెప్పి పంపింది. పర్ణాదుడను బ్రాహ్మణుడు అయోధ్య రాజైన ఋతుపర్ణుని కొలువులో రథసారథిగా వున్న బాహుకుడు రాజుతో మిత్రుడుగా వ్యవహరిస్తుండడం చూచి దమయంతికి విషయం చెప్పాడు.

దమయంతి ఈ పర్యాయం సుదేవుని ఋతుపర్ణుని దగ్గరకు పంపి, రేపే దమయంతి స్వయంవరం అని చెప్పి, విదర్భకు రమ్మని ఋతుపర్ణునికి ఆహ్వానం పంపింది. దానిలో అంతరార్థం ఏమంటే – బాహుకుడే నలుడైన పక్షంలో మాత్రమే ఋతుపర్ణుని విదర్భకు నిర్ణీత సమయానికి తీసికొని రాగలడు. వాయువేగంతో రథాన్ని నడపటం నలునకు వెన్నతో పెట్టిన విద్య. మరెవ్వరికీ ఇది సాధ్యం కాని పని. విషయం తెలుసుకున్న ఋతుపర్ణుడు బాహుకునితో రేపే నన్ను విదర్భకు చేర్చేందుకు రథం సిద్ధం చేయమని చెప్పాడు. సరేనని బాహుకుడు అక్కడినుండి కదిలాడు.

బాహుకుని ఆలోచనలు పలువిధాలుగా పరుగెత్తుతున్నాయి. పక్షివలె అతని రథం కొండలను, కోనలను అధిగమించి ముందుక సాగుతోంది. ఋతుపర్ణుడు రథాన్ని ఆపమని కోరగా, 'రాజా! అది ఇక్కడికి ఒక యోజన దూరంలో ఉంది' అని బాహుకుడు చెప్పాడు. ఆశ్చర్యపడిన రాజు తన గణిత విద్యను ప్రదర్శించాలని తలచి ఈ మామిడి చెట్టుకు లక్ష ఆకులు, వేయి పండ్లు వున్నాయని బాహుకునకు చెప్పాడు. బాహుకుడు వాటిని నిర్ధారణ చేయడం చూచి ఆశ్చర్యపడ్డాడు. ఋతుపర్ణుడు ఇలా అన్నాడు. 'ఓ బాహుకా! నీవు నాకు మంచి మిత్రుడవు. గణిత విద్యవలెనే నేను పాచికల మర్మము కూడ చెప్పగలను. ఈ రెండు విద్యలు నీకు నేర్పిస్తాను. నీవు నాకు అశ్వసారథ్యంలో మెళకువలు నేర్ప"మని కోరాడు.

ఋతుపర్ణుని నుండి బాహుకుడు పాచికల మర్మం తెలుసుకోగానే, అతని శరీరంలో దాగిన కలి బయటకు వచ్చేశాడు. కర్కోటకుడు కాటువేయగా శరీరంలోకి ప్రవేశించిన విషం దిగిపోయింది. ఈలోగా రథం విదర్భలోనికి ప్రవేశించింది. ఈ రథం యొక్క చప్పుడు విని, ఇది నల చక్రవర్తి రథం చప్పుడు లాగానే వున్నదని దమయంతి నిర్ధారించుకొంది.

స్వయంవర వృత్తాంతం తెలియని భీష్మకుడు ఋతుపర్ణుని ఆహ్వానించి కుశలప్రశ్నలు వేసి ఆతిథ్యం ఇచ్చాడు. స్వయంవర ఛాయలు కనపడక పోవడంతో ఋతుపర్ణుడు కూడ మిన్నకుండిపోయాడు.

బాహుకుని కనిపెట్టే నిమిత్తం, దమయంతి కేశిని అనే దాసిని పంపింది. కేశిని తిరిగి వచ్చి ఇలా చెప్పింది. "అమ్మా! ఆ బాహుకుడు తలచిన చోట నీటిని, అగ్నిని సృష్టిస్తున్నాడు".

ఈ మాటలు విన్న దమయంతి బాహుకుడు నలుడేనని నిశ్చయించుకొని, తన ఇద్దరు పిల్లలను బాహుకుని చెంతకు పంపింది. ఆ పిల్లలను గుర్తించిన బాహుకుడు, వారిని తనవద్ద కూర్చుండబెట్టుకొని ముద్దాడుతున్నాడు. మరి కాసేపటి తర్వాత దుఃఖించసాగాడు. ఆ తర్వాత కేశినితో "ఈ పిల్లలు నా పిల్లల వలెనే ఉన్నారు. అందుచేతనే నాలో దాగిన పితృప్రేమ పెల్లుబికింది. అయినప్పటికి కేశినీ, నీవు పలుమార్లు ఇలా నా వద్దకు రాకూడదు." అన్నాడు.

ఈ జరిగిన విషయాలన్నీ కేశిని దమయంతికి చెప్పగా, తన తల్లితో చెప్పి బాహుకుని తన అతఃపురానికి రప్పించింది. దమయంతిని చూడగానే బాహుకుడు దుఃఖంతో ఏడ్వసాగాడు. దమయంతి కూడ కన్నీళ్ళపర్యంతమైంది. నలుడు అపుడు ఇలా అన్నాడు. "దమయంతీ! నేను కావాలని రాజ్యం కోల్పోలేదు. అలాగే అడవిలో కూడా నిన్ను

ఒంటరిదాన్ని చేయడానికి కారణం, నీవు నీ పుట్టింటికి చేరతావనే ఆశతోనే చేశాను. ఇవన్నీ కలి ప్రభావం వల్ల జరిగిన పని" అని కర్కోటకుని తలచుకొని తన నిజారూపాన్ని పొందాడు.

నలదమయంతులిద్దరూ పరస్పర గాఢపరిష్వంగంలో మునిగి తేలారు. ఆ తరువాత పుష్కరునితో పాచికలాడి, అతనిని ఓడించి, తన రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని, ప్రజారంజకంగా రాజ్యపాలన చేశాడు నలుడు.

ఇక మనం రాజర్షి శంతనుడి కథ, భీష్మ ప్రతిజ్ఞ గురించి తెలుసుకుందాం.

పూర్వం మహాభిషుడనే రాజు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేసి స్వర్గాన్ని ప్రాప్తించుకున్నాడు. అక్కడ బ్రహ్మను పరిచర్య చేయడానికి రాజర్షులు, దేవతలు వచ్చి వున్నారు. అప్పుడు గంగాదేవి కూడ వచ్చింది. వాయువు గంగ యొక్క తెల్లటి వస్త్రాన్ని తొలగించాడు. ఆ దృశ్యాన్ని చూడలేక అందరూ తలలు వంచుకున్నారు. కాని మహాభిగుడు మాత్రం రెప్పవేయకుండా ఆమె అందాన్ని గమనించాడు. అది గమనించిన బ్రహ్మ గంగతో నీవు మర్త్యలోకంలో జన్మిస్తావని శపించాడు. మహాభిషుడు కూడ పురువంశరాజైన ప్రతీపునకు జన్మించాలని నిర్ణయించుకున్నాడు. అలాగే ప్రతీపునికి కుమారుడై శంతనుడు అనే పేరుతో ఖ్యాతిగాంచాడు. కొంతకాలానికి శంతనుని రాజుగా చేసి, ప్రతీపుడు అరణ్యాలకు వెళ్ళిపోయాడు.

ఒకరోజు వేటకు వెళ్ళిన శంతనుడు గంగానదీ తీరంలో ఒక అందమైన స్త్రీని చూచాడు. ఆమెపై కోరిక పెంచుకొని తన ప్రేమను ఆమెకు తెలిపాడు. అపుడు గంగ "రాజా! మీ కోరికను నేను సమ్మతిస్తున్నాను. కాని ఎప్పుడూ నా మాట కాదనరాదు. అలా అంటే నేను వెళ్ళిపోతాను." అని చెప్పింది.

ఇది ఇలా ఉండగా, వశిష్టుని శాపం వల్ల శంతనుని ద్వారా గంగకు అష్టవసువులు జన్మించారు. గంగ చేత గంగలో విసిరివేయబడి, శాపవిమోచనం పొందారు. అష్టమ వసువైన భీష్ముని కూడ గంగలో వేయుటకు సిద్ధపడిన సమయంలో శంతనుడు వారించగా, గంగ తన దారిన వెళ్ళిపోయింది. కాని శంతనుడు ఆమెను ఇలా అడిగాడు. "ఈ వసువులకు వశిష్ఠుడు ఎందుకు శాపమిచ్చాడు? అష్టమ వసువైన ఈ పుత్రుడు ఈ లోకంలోఎందుకు ఉండాలి?" అపుడు గంగాదేవి ఇలా చెప్పింది. "వశిష్ఠుడు వరుణుని కుమారుడు అతడు మేరు పర్వతం దగ్గర ఆశ్రమంలో ఉండేవాడు. కామధేనువు కుమార్తె నందిని వశిష్ఠుని దగ్గర ఉండేది. ఒకరోజు వసువులు తమ భార్యలతో విహారానికి వెళ్ళారు. అక్కడ నందినిని చూచి, 'ద్యౌ' అను వసువు భార్య ప్రేరణతో ఇతర వసువులతో కలిసి ఆ ఆవును తరలించుకొని పోయారు. ఆ కారణంగా వశిష్ఠుడు వారిని శపించాడు. దీనికి ముఖ్య కారకుడైన 'ద్యౌ' అనే వసువు భూలోకంలో ఉండేటట్లు చేశాడు." ఆ విధంగా ఆ వసువే భీష్ముడని గ్రహించాల్సి వుంది.

గంగ తనను విడిచి వెళ్ళినందుకు బాధపడుతున్న శంతనుడు ఒకరోజు వనవిహారానికి వెళ్ళినపుడు జీవనదిలో నీరు తక్కువగా వుండడం గమనించాడు. కొంతదూరంలో ఒక బాలుడు తన అస్త్రవిద్యతో ప్రవాహాన్ని అడ్డుకుంటున్న దృశ్యం చూసి ఆశ్చర్య పడ్డాడు. బాలుడు అంతర్ధానమయ్యాడు. శంతనుడు ఆ బాలుని కోసం వెదుకుతుండగా గంగాదేవి ఆ బాలునితో సహా అతనికి ఎదురైంది. ఆమె శంతనునితో 'ఈ బాలుడు మన ఎనిమిదవ సంతానం. ఇతని పేరు దేవవ్రతుడు. అతడు వశిష్టుని వద్ద సకల విద్యలు నేర్చుకొన్నాడని, ఇంద్రుడు, బృహస్పతి, శుక్రాచార్యుడు, పరశురాముడు వంటి ప్రతిభాశాలుర వద్ద సకల శాస్త్రాలు అభ్యసించాడని, ఇతనిని మీరు తీసుకు వెళ్ళండి" అని చెప్పింది. శంతనుడు సంతోషంతో కుమారుని రాజధానికి తీసుకొని వచ్చి పట్టాభిషేకం చేశాడు. కాని శంతనునికి సాంసారిక జీవితం మీద మాత్రం విరక్తి కలగలేదు.

మరొకసారి, శంతనుడు యమునానదీ తీరానికి వెళ్ళాడు. ఒక దేవకన్య లాంటి కన్య కనిపించగా, నీవెవరు అని అడిగాడు. నేను నిషాద రాజకుమార్తెను అని ఆమె చెప్పింది. సుగంధభరితురాలైన ఆ కన్యను మోహించి నిషాద రాజును కలిసి, ఆ కన్యను తనకిచ్చి వివాహం జరిపించమని శంతనుడు కోరాడు. నిషాదరాజు సరేనంటూ ఒక షరతు విధించాడు. ఈ కన్యకు కలిగే కుమారునికే రాజుగా పట్టాభిషేకం చేయాలన్నాడు. కాని ఈ షరతుకు శంతనుడు అంగీకరించలేక బాధపడుతున్నాడు. తండ్రి శంతనుని అనారోగ్య కారణం తెలుసుకొన్న దేవవ్రతుడు (భీష్ముడు) నిషాద రాజు వద్దకు వెళ్ళి ఆమె కుమారునికే పట్టాభిషేకం జరుగుతుందని చెప్పి ఒప్పించాడు. కాని నిషాదునికి అనుమానం ఏమంటే భీష్ముడు పెళ్ళిచేసుకుంటే, జన్మించే కుమారులు రాజ్యార్హులవుతారని. దీనికి దేవవ్రతుడు ఒక భీషణ ప్రతిజ్ఞ చేశాడు. "నేను వివాహం లేకుండా బ్రహ్మచర్యాన్ని పాటిస్తాను." అప్పటినుండి దేవవ్రతుడు భీష్ముడనే పేరుతో వాసికెక్కాడు. దేవతలు పూలవర్షం కురిపించాడు. దానికి సంతసించి శంతనుడు భీష్మునికి అతడు కోరుకొన్నపుడే అతనికి మరణం సంభవిస్తుంది అని వరం ఇచ్చాడు.

ఇలా శంతనునకు నిషాద రాజకుమార్తె సత్యవతితో వివాహమై, ఆమె ద్వారా చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడనే కుమారులు కలిగారు. వారు పెద్దవారు కాకముందే శంతనుడు చనిపోయాడు. భీష్ముడు చిత్రాంగదుని రాజును చేశాడు. చిత్రాంగదుడు గొప్ప పరాక్రమశాలి, బలగర్వంతో ఎవరినీ లెక్కచేసేవాడు కాదు. ఎందరో రాజులపై యుద్ధం చేసి గెలిచాడు. కాని చిత్రాంగదుడనే గంధర్వరాజుతో దీర్ఘకాలం జరిగిన యుద్ధంలో, గంధర్వరాజు మాయోపాయంతో చిత్రాంగదుని చంపివేశాడు.

ఆ తర్వాత భీష్ముని ఆజ్ఞ ప్రకారం విచిత్రవీర్యుడు రాజైనాడు. ఆ రోజుల్లోనే కాశీరాజు తన ముగ్గురు కుమార్తెలకు స్వయంవరం ప్రకటించాడు. సత్యవతి అనుమతితో విచిత్రవీర్యునికి వివాహం చేయాలనే ఆలోచనతో కాశీకి వెళ్ళాడు భీష్ముడు. భీష్ముడు వృద్ధుడని గోలచేసి, చివరకు రాకుమారులతో యుద్ధం జరిగినా, వారు భీష్ముని గెలవలేక పోయారు. భీష్ముడు అంబ, అంబిక, అంబాలిక అనే ముగ్గురినీ తీసికొని వచ్చి విచిత్రవీర్యునికి సమర్పించాడు. అంబ తాను సాళ్వరాజును ప్రేమించానని, తనను వదిలివేయమని కోరగా, భీష్ముడు అంబను వదిలివేసి, మిగతా ఇద్దరితో విచిత్రవీర్యునికి వివాహం జరిపించాడు. కాని విచిత్రవీర్యుడు కామాంధుడై, నిరంతరం కామవాంఛలో నిమగ్నుడవడం చేత క్షయవ్యాధిగ్రస్తుడై మరణించాడు. సత్యవతి భీష్ముని వంశరక్షణ చేయమని కోరగా, తాను ఆజన్మబ్రహ్మచారినని, బ్రహ్మ పదవి ఇచ్చినా కూడా తన ప్రతిజ్ఞను విడువలేనని భీష్ముడు చెప్పాడు. సత్యవతి అంతటితో ఆ విషయం ముగించి, వేదవ్యాసుని స్మరించగా, వ్యాసుడు వచ్చాడు. సతవ్యవతి ఇలా అడిగింది. "విచిత్రవీర్యునకు సంతానం లేకపోవడంతో, నీవు వారి క్షేత్రాల్లో సంతానాన్ని ఉత్పన్నం చేయగలవా?" అందుకు వ్యాసుడు అంగీకరించి, అంబిక ద్వారా ధృతరాష్ట్రుని, అంబాలిక ద్వారా పాండురాజును ఉత్పన్నం చేశాడు. కాని ఆ తల్లుల అపచారం కారణంగా, ధృతరాష్ట్రుడు గుడ్డివాడుగాను, పాండురాజు తెల్లని శరీరంతో జన్మించారు. ఆ తర్వాత అంబిక ప్రేరణతో, ఆమె దాసి వేదవ్యాసుని ద్వారా విదురునకు జన్మనిచ్చింది.

ఇక ధృతరాష్ట్రుడు మొదలైనవారి విశేషాలను తెలుసుకొందాం.

నిజానికి కురువంశం ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుని వల్ల వృద్ధి చెందింది. దేశమంతా సత్యయుగంలా విలసిల్లుతోంది. భీష్ముడు శ్రద్ధగా ధర్మ రక్షణ చేస్తున్నాడు. ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు అస్త్రశస్త్ర విద్యలను నేర్చుకొన్నారు. ధృతరాష్ట్రుడు మిక్కిలి బలవంతుడైనాడు. పాండురాజు ధనుర్ధరుడైనాడు. విదురుడు

ధర్మజ్ఞుని యైనాడు. ధృతరాష్ట్రుడు గుడ్డివాడు, విదురుడు దాసీపుత్రుడు బలహీనుడు కావడంతో పాండురాజకు రాజ్యాధికారం దక్కింది.

గాంధారితో ధృతరాష్ట్రునికి వివాహం జరిగింది. గాంధారి సోదరుడు శకుని గాంధారిని హస్తినకు తీసికొని వచ్చాడు. గాంధారి తన సద్గుణముల చేత అందరి ప్రశంసల నందుకొంది. పాంచాల రాకుమారి కుంతి మిక్కిలి సాత్వికురాలు, సుందరి, గుణవతి. స్వయంవరంలో ఆమె పాండురాజును వరించింది. వివాహం చేసుకొంది. భీష్ముడు పాండురాజుకు మద్రరాజు శల్యుని సోదరియైన మాద్రితో వివాహం జరిపించాడు. దేవకుడు అనే రాజు దగ్గర వున్న శతరూప అనే ఒక సుందర యువతిని విదురునికి ఇప్పించి, పెండ్లి చేశాడు.

భీష్ముని అనుమతితో పాండురాజు దిగ్విజయ యాత్రకు బయలుదేరి మగధ, కాశి, విదేహ మరియు పుండ్ర రాజ్యాలను జయించి, అపార ధనాన్ని, వజ్రవైఢూర్య గోమేధికాలను తెచ్చి భీష్మునికి, సత్యవతికి సమర్పించి, వారిని సంతృప్తి పరచాడు.

ఒకసారి వేదవ్యాసుడు హస్తినకు వచ్చి గాంధారిని కలిశాడు. ఆమె సేవలకు సంతుష్టుడై వరము కోరుకోమన్నాడు. బలవంతులైన వందమంది పుత్రులను ఇవ్వమని గాంధారి కోరుకొంది. తథాస్తు అని వ్యాసుడు వెళ్ళిపోయాడు. గర్భవతిగా వున్న గాంధారి కనక ముందే కుంతి ధర్మరాజును కన్నది. ఆ తర్వాత ఆమెకు భీముడు జన్మించాడు. గాంధారి గర్భవతిగా వున్నప్పుడు కుంతి సేవలు చేయలేక పోయింది. ఆ సమయంలో ఒక వైశ్య కన్య సేవలు చేసింది. ఫలితంగా ఆమెకు యుయుత్సుడు అను సద్గుణసంపన్నుడైన కుమారుడు జన్మించాడు. అశుభాలతో జన్మించిన దుర్యోధనుని విడిచిపెట్టమని విదురుడు కోరినా కూడా, ధృతరాష్ట్రుడు పుత్రవాత్సల్యం చేత ఆ పని చేయలేదు.

ధృతరాష్ట్రుని సంతానంలో పెద్దవాడు దుర్యోధనుడు, తర్వాత యుయుత్సుడు, వరుసగా దుశ్శాసనుడు, దుస్సహుడు మున్నగు నూరుమంది కుమారులు. వీరంతా శూరవీరులే. వీరందరికి ధృతరాష్ట్రుడు మంచి కన్యలతో వివాహం జరిపించాడు. కుమార్తె అయిన దుస్సలను జయద్రథుడనే రాజుకిచ్చి వివాహం జరిపించాడు.

పాండవుల జననం, పాండురాజు పరలోక యాత్ర గురించి తెలుసుకొందాం.

ఒకరోజు పాండురాజు అడవిలో వేటాడుతుండగా, ఒక పొద చాటున రెండు జింకలు మైథున క్రియలో ఉన్నట్లు చూచాడు. వాటిపై బాణాన్ని వేసి, గాయపరచాడు. అపుడు ఆ జింకలు ప్రాణాలు విడుస్తూ నీవు నీ భార్యతో కలిసిన సమయంలో మరణం పొందుతావు అని శపించాయి. ఈ శాపానికి మిక్కిలి చింతించిన పాండురాజు, తాను సన్యాసం తీసికొంటానని కుంతితో చెప్పాడు. మాద్రికి కూడ అన్ని విషయాలు చెప్పాడు. మీరు లేకుండా మేము వుండలేమని, మీతోపాటే మేము వస్తామని వాళ్ళు చెప్పారు. వారి కోరికను మన్నించి పాండురాజు వారితో పాటు గంధమాదన పర్వతం వద్దకు చేరుకొన్నాడు. అక్కడ వున్న ఋషులు, సిద్ధులు ఈ కుటుంబంపై ఎంతో ప్రేమ చూపారు.

ఒకరోజు పాండురాజు తనకు పుత్రులు లేరని చింతిస్తూ వున్నపుడు, ఋషులు పాండురాజుతో 'ధర్మాత్మా! మీకు దేవతలతో సమానులైన పుత్రులు జన్మిస్తారు' అని అన్నారు. దీని అంతరార్థం తెలియక, కుంతితో మాట్లాడాడు. అపుడు కుంతి ఇలా చెప్పింది. 'ఆర్యపుత్రా! నేను చిన్నతనంలో దుర్వాసమునికి సేవలందించిందులకు ఆయన

నాకు మంత్రోపదేశం చేశారు. ఆ మంత్రాన్ని ఉచ్చరించి, నేను ఏ దేవుని తలిస్తే ఆ దేవుని ద్వారా సంతానం పొందే అవకాశం వుం'దని చెప్పింది. అపుడు పాండురాజు కుంతితో యమధర్మరాజును గురించి, శమదమధర్మజ్ఞుడైన పుత్రుని కనమని కోరాడు. ఆమె ఆవాహన చేయగా యమధర్మరాజు వచ్చి ఏమి కావాలో కోరుకోమన్నాడు. తనకు కుమారుని ప్రసాదించమని వేడుకొంది. ఆయన వరప్రసాదిగా సత్యవాదియైన యుధిష్ఠురుడనబడే కుమారుడు జన్మించాడు. అతడే ధర్మరాజు అని కూడా పిలవబడ్డాడు.

కొన్ని రోజుల తర్వాత మళ్ళీ పాండురాజు బలశాలియైన కుమారుని కనమన్నాడు. ఆమె వాయుదేవుని ఆవాహన చేయగా, ఆయన వరం వల్ల మహాబలశాలియైన భీముడు జన్మించాడు. అదేరోజు అపశకునాల మధ్య గాంధారికి కల్కి ఆవాహనతో దుర్యోధనుడు కుమారుడుగా జన్మించాడు. అదేరోజు పుట్టిన బకాసురుడు, జరాసంధుడు, కీచకుడు అనువారందరు అమిత బలవంతులుగా వున్నారు. కొన్ని రోజుల తర్వాత ఒక తలమానికమైన ధనుర్ధరుడు కావాలని, పాండురాజు తపస్సు చేశాడు. కుంతి ఆవాహన ద్వారా ఇంద్రుడు ప్రత్యక్షమై అర్జునుని ప్రసాదించాడు. మాద్రికి సంతానం లేనందున, పాండురాజు కుంతిని మాద్రికి కూడ సంతానం కలగజేయమని కోరాడు. కుంతి సూచన మేరకు మాద్రి అశ్వినీ కుమారులను తలవగా, వారు అందమైన నకుల సహదేవుల్ని ప్రసాదించారు. ఇలా పంచపాండవుల జననం పూర్తి అయింది.

ఇక వసంత ఋతువు వచ్చింది. పాండురాజు వనంలో తిరుగుతూ ఉన్నాడు. మాద్రి సర్వాలంకార భూషితయై అక్కడికి వచ్చింది. పాండురాజు మోహావేశంతో ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడు. ఆమె భయపడింది. పాండురాజు మైథున క్రియకు తలపడగానే, శాపప్రభావంతో మరణించాడు. మాద్రి ఏడ్వటం ప్రారంభించింది. కుంతి కూడ వచ్చింది. ఎంతచెప్పిన వినలేదని మాద్రి కుంతికి చెప్పింది. భర్తను అనుసరించడానికి ఇద్దరూ పోటీ పడ్డారు. చివరకు పిల్లల సంరక్షణ చూడమని కుంతితో చెప్పి, మాద్రి చితిపై కెక్కింది.

అక్కడ వున్న మహర్షులందరూ పాండురాజు మరణానికి చింతించి, పాండురాజు అస్థికలను, తల్లిని, పిల్లల్ని, హస్తినకు తీసికొని పోవ సంకల్పించారు. వీరిని చూచిన హస్తినాపురవాసులు దుఃఖంతో, దర్శనం చేసుకొన్నారు.

భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు, సత్యవతి, గాంధారి, దుర్యోధనుడు మున్నగువారు అందరూ చేరారు. భీష్ముడు మున్నగువారు వచ్చారు. ఋషులు నమస్కరించారు. మహర్షులలో ఒకరు లేచి, అక్కడ జరిగిన విషయాల నన్నింటిని వివరించాడు. వినిన వారందరు ఆశ్చర్యపడ్డారు. ధృతరాష్ట్రుడు విదురుని పిలిచి, రాజలాంఛనాలతో పాండురాజు అంత్యక్రియలు జరిపించాడు.

కర్మకాండ అనంతరం, సత్యవతి చింతిస్తూ ఉండగా, వేదవ్యాసుడు వచ్చి, 'ఓ తల్లీ! దిగులు పడి లాభం ఏముంది? భూభారం పెరుగుతోంది. ధర్మాచరణ లోపిస్తోంది. నీవు యోగినివి అయిపో. ఇక్కడినుండి వెళ్ళిపో' అనగా సత్యవతి సమ్మతించి, అంబ, అంబాలికలకు విషయం చెప్పి, తపస్సు చేసుకోవడానికి వెళ్ళి అక్కడనే మరణించింది.

పాండవులు బాల్యదశలో ఉండడం చేత అరమరికలు లేకుండా, దుర్యోధనాదులతో ఆడుతూ, పాడుతూ అన్నింటా మిన్నగా వుండేవారు. భీముడు మిగతా వారినందరిని ప్రతి ఆటలో చిత్తుచిత్తుగా ఓడించేవాడు. కాని శత్రుభావం లేకుండా, పోటీపడటమే ననుకునేవాడు భీష్ముడు. కాని అప్పటికే దుర్యోధుననిలో శత్రుభావం

నాటుకు పోయింది. ద్వేషభావం పెంచుకొన్నాడు దుర్యోధనుడు. పాండవుల నందరిని తుదముట్టించాలని తలంచాడు. ఎన్ని రకాలుగా వారిని పడేయాలా అని ఆలోచనలతో ఉండేవాడు.

జలక్రీడలకు ఏర్పాట్లు చేసిన దుర్యోధనుడు, విషం కలిపిన ఆహారాన్ని భీమునికి కొసరి కొసరి తినిపించాడు. అలసిన భీముణ్ణి గంగానదిలో ఎత్తిపడేశాడు కూడ. కాని భీముడు నాగలోకం చేరాడు. అక్కడి సర్పాలు భీముని కాటువేయగా, అతని శరీరంలోని విషమంతా బయటకు వచ్చి తెలివి వచ్చింది. తనను కాటువేస్తున్న పాములను చంపడం ప్రారంభించాడు. ఇది తెలుసుకొన్న వాసుకి సర్పం భీముని వద్దకు వచ్చింది. తనతో తీసుకువెళ్ళి అమృతసమానమైన రసాన్ని త్రాగించి శయ్యపై పరుండబెట్టింది. జలక్రీడ తర్వాత పాండవులు, కౌరవులు హస్తినకు వెళ్ళిపోయారు. భీముడు వారితో రాకపోయేసరికి కుంతి భయపడి, వారిని భీముని గురించి అడిగింది. విదురునికి కబురు పంపించగా, విదురుడు వచ్చి మంచి మాటలు చెప్పి, దుర్యోధునని అడిగి లాభంలేదని భావించాడు. వేదవ్యాసుని పలుకుల ప్రకారం కుంతి కుమారులకు దీర్ఘాయువు వుంది, చింతింప పనిలేదన్నాడు విదురుడు.

అక్కడ నాగలోకంలో భీముడు రసం జీర్ణం కాగానే లేచాడు. నాగులు ఇలా అన్నారు. 'భీమసేనా! నీవు త్రాగిన రసంతో నీకు పదివేల ఏనుగుల బలం వచ్చింది' అని చెప్పి, స్నానం చేయించి, తెల్లని వస్త్రాలు ధరింపజేసి సాగనంపారు.

భీముడు వచ్చి తల్లికి, ధర్మరాజుకు దుర్యోధనుడు చేసిన దుర్మార్గపు పనుల గురించి వివరించాడు మనం ముందుకాలంలో పరస్పరం రక్షించుకొంటూ వుండాల్సిన అవసరం ఉందన్నాడు ధర్మరాజు. మరొకమారు భీముని ఆహారంలో విషం కలిపించినా, ఆ ఆహారాన్నే తిని భీముడు జీర్ణం చేసికొన్నాడు. ఇలా విషప్రయోగం వల్ల లాభంలేదని దుర్యోధనుడు ఇతరమైన దుర్మార్గపు పనులు చేసి, వారిని చంపాలని యోచన చేయడం మొదలుపెట్టాడు. రాకుమారులు కేవలం ఆటపాటలతోనే కాలక్షేపం చేయడం గమనించి, ధృతరాష్ట్రుడు వారికి ధనుర్విద్యను నేర్పించడానికి కృపాచార్యులను నియమించాడు.

వీరికి ఎవరెవరు ధనుర్విద్య ఎలా నేర్పారో, రాకుమారుల శిక్షణ ఎలా జరిగిందో తెలుసుకొందాం.

శరద్వంతుడు అనే ధనుర్వేదజ్ఞుడు ఇంకా కొన్ని అస్త్రశస్త్రాలను సంపాదించుకోవాలనే తలంపుతో తపస్సు ఆరంభించాడు. ఇతని తపోభంగం చేయడానికి ఒక దేవకన్యను పంపాడు ఇంద్రుడు. నిగ్రహం కోల్పోతామేమోననే భయంతో శరద్వానుడు పారిపోతుండగా, వీర్యస్ఖలనం జరిగి, అదిపడిన స్థలాన్ని బట్టి విభజించబడి ఒక కుమారుడు, ఒక కుమార్తె జన్మించారు. వారే కృప మరియు కృపి అని పిలువబడ్డారు. ఆ కృపయే కృపాచార్యుడై, కురుపాండవులకు మొదటి గురువైనాడు. భరద్వాజుడు ఒకసారి గంగా స్నానానికి వెళుతున్న సమయంలో ఒక అప్సరసను చూసి స్ఖలించాడు. ఆ వీర్యాన్ని ఒక దోనెలో భద్రపరచుట ద్వారా ద్రోణుడు జన్మించాడు. ద్రోణుడు కృపిని వివాహం చేసుకోగా వారికి అశ్వత్థామ జన్మించాడు. అతడు చిరంజీవి.

జమదగ్ని కుమారుడైన పరశురాముడు ఏది అడిగినా అది దానం చేస్తాడని తెలుసుకొని ద్రోణుడు ధనుర్వేద సంబంధ జ్ఞానాన్ని తనకు దానం చేయమంటాడు. పరశురాముడు తథాస్తు అని అన్నాడు. ద్రోణుడు పేదరికాన్ని తొలగించుకోవడానికి దృపద మహారాజు వద్దకు వెళితే, అక్కడ ఆయనకు అవమానం జరుగుతుంది. రాజుకు రాజు స్నేహితుడౌతాడు కాని సేనానికి ఎలా స్నేహితుడవుతాడని చెప్పి అతనిని వెళ్ళగొట్టాడు.

ఒకరోజు ధర్మరాజు మున్నగు రాకుమారులు బంతి ఆట ఆడుతుంటే, బంతి వెళ్ళి ఒక బావిలో పడింది. ఎలా తీయాలో తెలియని స్థితిలో వారుండగా ద్రోణుడు అక్కడకు వచ్చాడు. ఒక బాణ ప్రయోగంతో బంతిని, ఉంగరాన్ని బయటకు తీశాడు. రాకుమారులు సంతసించి, ఏమి కావాలో చెప్పండి అని అడిగితే, ఈ విషయం భీష్మునికి చెప్పండి అని ద్రోణుడు వారితో అన్నాడు. భీష్ముడు సంతోషించి ద్రోణుని రాకుమారులకు గురువుగా నియమించాడు.

ఆ విధంగా ద్రోణుడు ద్రోణాచార్యుడై రాకుమారులకు అస్త్రశస్త్ర విద్యలు నేర్పించాడు. పాండుపుత్రులకు, కౌరవ రాకుమారులకు ద్రోణాచార్యుడు ధనుర్వేదాన్ని క్షుణ్ణంగా నేర్పుతున్నాడు. వారికి అస్త్రములతో శిక్షణ ఇస్తుండేవాడు. ఆ శిక్షణలో విదేశ రాజకుమారులు, కర్ణుడు కూడా ఉండేవాడు. ద్రోణులకు తన కుమారుడు అశ్వత్థామపై మిక్కిలి ప్రేమ ఉండేది. కడవలలో నీరు నింపుకొని తెచ్చే విద్యలో అర్జునుడు అశ్వత్థామను మించిపోయేవాడు. చీకటిలో కూడా బాణాలు వేయగల సామర్థ్యములో నీకంటే ఎవరును ధనుర్విద్యలో ప్రవీణులు లేరన్నది సత్యం అని ద్రోణుడు అర్జునునితో అన్నాడు.

ఒకరోజు రాకుమారులందరు అడవికి వెళ్ళారు. వారి సరుకులు మోసుకురావడానికి ఒక వ్యక్తి మరియు ఒక కుక్క అనుసరిస్తూ ఉండేవారు. ఆ కుక్క ఏకలవ్యుడు సాధన చేస్తున్న స్థలానికి వెళ్ళింది. అంతకు పూర్వమే ఏకలవ్యుడు ద్రోణుని వద్ద శిష్యరికం చేయాలని తలంచితే, కుదరనందున, ఆయన విగ్రహాన్ని తానే ఏర్పాటు చేసుకొని అభ్యసించేవాడు. ఆ కుక్క తనకు ఆటంకం కలిగించగా, ఏకలవ్యుడు ఏడు బాణాలను దాని నోటిలో నాటాడు. ఇంత గొప్పవిద్యను గమనించిన అర్జునుడు మొదలైన రాకుమారులు ఏకలవ్యుని నీవెవరవు అని అడిగితే, నేను ఏకలవ్యుడను. ద్రోణాచార్యుని శిష్యుడను అని చెప్పాడు. అర్జునుడు ఆచార్యునితో ఈ విషయం చెప్పాడు. తనకంటే విలుకాడు అని చెప్పాడు. అపుడు ఆచార్యుడు అర్జునుని తీసుకొని ఏకలవ్యుని వద్దక వచ్చాడు. ఏకలవ్యుడు ద్రోణాచార్యుని రాక గమనించి, ఆయనకు నమస్కరించి, పూజించి, ఎదురుగా మౌనంగా నిల్చుకొన్నాడు. ద్రోణుడు అతనిని గురుదక్షిణ ఇమ్మని కోరాడు. ఏదికోరినా ఇస్తాననగానే, ఆచార్యుడు అతని కుడిచేతి బొటనవ్రేలును ఇమ్మనగానే, ఏకలవ్యుడు ఆ వ్రేలిని నరికి గరువుకు సమర్పించాడు. దానితో ఏకలవ్యుని గొప్పదైన బాణవిద్య అంతరించిపోయింది.

ఒకరోజు ద్రోణుడు ఒక సజీవ పక్షిని ఒక చెట్టు గుబురులో పెట్టించి, ధర్మరాజును పిలిచి ఆ పక్షి మెడను కొట్టవలెనన్నాడు. ధర్మరాజు ఎంతకూ బాణం వేయకపోయేటప్పటికి, ఏమి చూస్తున్నావని అడిగాడు ద్రోణుడు. ధర్మరాజు చెట్టును, కొమ్మలను, ఆకులను, పక్షిని చూస్తున్నానన్నాడు. అది విని ద్రోణుడు ధర్మరాజును తప్పించి, మిగతా రాకుమారులను కూడ చూడమన్నాడు. అందరూ అలాగే చెప్పారు. కాని అర్జునుడు మాత్రం ఆ పక్షిని మాత్రమే చూడగలిగి, దానిని తన బాణంతో కొట్టగలిగాడు. అనగా దృష్టి లక్ష్యం వైపే ఉండాలి, అపుడే విజయం చేకూరుతుందని భావించాలన్నాడు ద్రోణుడు.

ఒకరోజు ద్రోణాచార్యుడు గంగాస్నానానికి వెళితే, ఆయనను ఒక మొసలి పట్టుకొంది. తాను రక్షించుకోగలిగినా కూడా రక్షించండని కేకలు వేశాడు. అందరికంటె ముందు అర్జునుడు వచ్చి గురువును కాపాడాడు. ద్రోణుడు అపుడు ప్రేమతో 'అర్జునా! నీకు బ్రహ్మశిర అనే అస్త్రాన్ని ఇస్తున్నాను. దాన్ని సామాన్యుల మీద ప్రయోగించవద్దు' అని అన్నాడు. ఇక రాకుమారులందరు విద్యాభ్యాసాన్ని ముగించగా, అస్త్రవిద్యా కౌశలాన్ని ప్రదర్శించుటకు ఒక రంగమండప నిర్మాణం చేయించమని, ధృతరాష్ట్రుడు విదురుని కోరాడు. రంగమండప

నిర్మాణం జరిగింది. రాకుమారులందరు తమ తమ బాణవిద్యను ప్రదర్శించారు. భీముడు, దుర్యోధనుడు ద్వంద్వ యుద్ధం ప్రారంభించారు. భీకర పోరాటం సాగుతోంది ఇద్దరి మధ్య. పరిస్థితి చేయిదాటిపోకుండా ద్రోణుడు అశ్వత్థామను పిలిచి ముష్టియుద్ధాన్ని ఆపించాడు.

ద్రోణాచార్యుడు ఇపుడు అర్జునుని అస్త్రకౌశల్యాన్ని చూడండి అని చెప్పాడు. అర్జునుడు రంగభూమి మధ్యలోకి వచ్చి, ఆగ్నేయాస్త్రాన్ని, వారుణాస్త్రాన్ని, వాయవ్యాస్త్రాన్ని, పర్జన్యాస్త్రాన్ని, భీమాస్త్రాన్ని, పర్వతాస్త్రాన్ని ఇలా మహా విలయాలను సృష్టించి, అంతర్ధానాస్త్రంతో అంతర్ధానం అయిపోయాడు. కాని మరుక్షణమే రథంపై నేల మీదకు వచ్చాడు. వీటిని చూచిన కర్ణుడు ద్రోణాచార్యుని అనుమతితో ఆ వింతలన్నింటిని తానూ ప్రదర్శించాడు. అపుడు దుర్యోధనుడు కర్ణుని మిత్రునిగా వుందామని చెప్పాడు. కర్ణుడు తనకు అర్జునునితో ద్వంద్వయుద్ధం చేయాలని ఉందని చెప్పాడు. కర్ణుడు సూతపుత్రుడు కనుక అర్జునుడు ఇష్టపడక పోయినను ద్రోణాచార్యుల అనుమతితో ద్వంద్వ యుద్ధానికి సిద్ధపడ్డాడు. కాని, కృపాచార్యుడు, 'ఓ కర్ణా! అర్జునుడితో నీవు యుద్ధం చేయాలంటే నీ పరిచయం కూడా అవసరమే కదా!' అని అన్నాడు. తల్లిదండ్రుల గురించి చెప్పమన్నపుడు కర్ణుడు నిరాశకు లోనైనాడు. వెంటనే దుర్యోధనుడు లేచి, 'నేను కర్ణుని అంగరాజుగా పట్టాభిషేకం చేస్తున్నా'నని చెప్పాడు. అప్పటికే సూర్యాస్తమయమైంది. కనుక దుర్యోధనుడు, కర్ణుడు కలిసి వెళ్ళిపోయారు. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు పాండవులతో పాటు వారి నివాసాలకు వెళ్ళిపోయారు.

కురుపాండవుల విద్యాభ్యాసం ఇలా ముగిసింది కనుక ద్రోణాచార్యుడు ఇపుడు నేను గురుదక్షిణ అడుగవచ్చును కదా! ఆ దక్షిణ ఏమనగా యుద్ధంలో ద్రుపదుని ఓడించి, పట్టి తెచ్చి నాకివ్వండి అని అన్నాడు. రాకుమారు లందరు ఎంతో ఉత్సాహంతో ముందుకు వచ్చారు. ఇది తెలుసుకొన్న ద్రుపద రాజు సేనలతో వచ్చి, ఆక్రమణదారులపై బాణవర్షం కురిపించాడు. దుర్యోధనుడు, వికర్ణుడు, దుశ్శాసనుడు, సుబాహుడు మున్నగువారు ఎంత పోరాడినా లాభం లేకపోయింది. పాంచాల దేశపు ప్రజలు కూడ వచ్చి తరిమి కొట్టడంతో కౌరవ సమూహం పరాభవంతో పాండవుల దగ్గరకు వచ్చారు. పాండవులు ద్రోణునికి నమస్కరించి, భీముడు ముందు నడువగా, అర్జునుడు అనుసరించాడు.

భీమసేనుడు భయంకర యుద్ధం చేయసాగాడు. అర్జునుడు ద్రుపదుని వైపు వెళ్తుండగా సాత్రాజిత్తు అడ్డువచ్చాడు. కాని అర్జునుడు వివిధములైన ప్రయత్నాలతో ద్రుపదుని పట్టుకొని, ద్రోణాచార్యుని వద్దకు తీసికొని వచ్చాడు. ద్రుపదుడు దుఃఖించాడు. అపుడు ద్రోణుడు ద్రుపదునితో "నిన్ను తెప్పించాను. భయపడకు. నీకు ప్రాణభయం లేదు. మనం మిత్రులుగానే కలిసి వుందాం." అని చెప్పాడు. ద్రుపదుడు సంతసించాడు. ద్రోణుడు అతనికి విముక్తి కలిగించి, కాంపిల్య నగరాన్ని ద్రుపదునికి ఇచ్చి, అతనినుండి అహిచ్ఛత్రా నగరాన్ని తీసుకొన్నాడు.

యుధిష్ఠిరునికి యువరాజ పదవి – వారణావత ప్రయాణం గురించి తెలుసుకొందాం.

ద్రుపదుని జయించిన తర్వాత ఒక సంవత్సరంలో ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరుణ్ణి యువరాజుగా పట్టాభిషేకం చేశాడు. యువరాజుగా ప్రజల మన్ననలను చూరగొన్నాడు యుధిష్ఠిరుడు. భీముడు బలరాముని వద్ద గద, రథ, కత్తియుద్ధాలు నేర్చుకొన్నాడు.

ఒకసారి సభాభవనంలో ద్రోణాచార్యుడు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! అగస్త్య మహర్షి శిష్యుడైన అగ్నివేశుని వద్ద నేను శిష్యరికం చేశాను. నీకిచ్చిన బ్రహ్మశిర అస్త్రాన్ని నా గురువు నాకు ప్రసాదించిందే. నాతో

నీవు పోరాడవలసి వస్తే, నిస్సంశయంగా పోరాడు. సహదేవుడు బృహస్పతి దగ్గర నీతిశాస్త్రం నేర్చుకొన్నాడు. నకులుడు యుద్ధవిద్యలో ఆరితేరాడు. పలు రాజ్యాలను జయించాడు. సంపద నార్జించాడు. కీర్తి నలుదెసలా విస్తరించింది." ఈ విషయాలను గ్రహించిన ధృతరాష్ట్రుడు అసూయతో కరణికుణ్ణి పిలిచి ఏంచేస్తే మంచిదని అడిగాడు. కరణికుడు ఇలా చెప్పాడు. "రాజా! శత్రువులను అన్నివేళలా కనిపెట్టి ఉండాలి. నష్టపరుస్తూ వుండాలి. శత్రువు బలమైన వాడైతే మాయోపాయంతో లొంగదీసుకోవాలి. రాజు పిరికివాడైతే భయపెట్టాలి. వీరుడైతే నమస్కరించాలి. పిసినారిని తొక్కేయాలి. సమానస్థాయివాడైతే పరాక్రమం చూపించాలి. ఏది ఏమైనను శత్రువును మాత్రం చంపి తీరవలసిందే. ఒక కథ కూడ చెప్తాను, విను. ఒక నక్కకు నలుగురు స్నేహితులున్నారు. నక్కకు తెలివితో పాటు స్వార్థం కూడ వుంది. పులి, ఎలుక, తోడేలు మరియు ముంగిస వీరు ఆ నక్కకు మిత్రులు. పులి ఎంత వేటాడినా జింక లభించడం లేదు. నక్క ఉపాయం ఆలోచించి, జింక పడుకొని ఉన్నపుడు ఎలుకను పోయి జింక కాలు కొరకమ్మది. దానితో పులి సులభంగా జింకను చంపివేసింది. ఆ చంపిన జింకను ఆరగించటానికి ముందు నక్క అందరినీ స్నానం చేసి రమ్మన్నది. అప్పటిదాకా తాను కాపలా ఉంటానన్నది. పులి స్నానం చేసి వెంటనే వచ్చినపుడు విచారంతో నక్క ఇలా అన్నది. "ఓ మిత్రమా! ఎలుక తాను సంపాదించిన దాన్ని తినటానికి అందరు వచ్చారని గొప్పలు పలుకుతున్నది. కనుక నేను మాత్రం తినను" అన్నది. అభిమానంతో పులికూడ తిననిని వెళ్ళిపోయింది. అప్పుడే ఎలుక వచ్చింది. దానితో 'మిత్రమా! ముంగస ఏమన్నదో తెలుసా? పులి చంపడంతో జింక మాంసంలో విషం కలిసింది. కనుక నేను తినను. ఆకలి వేస్తే ఎలుకనైనా తింటాను కాని, దానిని తినను" అన్నది. ఈ విషయం వినగానే ఎలుక పారిపోయింది. తర్వాత తోడేలు వంతు వచ్చింది. దానితో నక్క ఇలా అంది. "మిత్రమా! ఈరోజు పులి నీమీద కోపంతో ఉంది. ఆడపులితో రాబోతోంది." ఈమాట వినగానే తోడేలు అక్కడినుండి పరుగెత్తి పోయింది. చివరగా ముంగిస వచ్చింది. దానితో నక్క 'నీకు ధైర్యం ఉంటే, నాతో పోరాడి జింక మాంసం తిను. అందరూ నీతో పోరాడి ఓడిపోయి వుంటే, నేను మాత్రం ఎలా పోరాడగలను?" అన్నది ఆమాట విని తోడేలు నక్కతో పోరాటం యిష్టం లేక వెళ్ళిపోయింది. నక్క తుదకు సంతసించి, జింక మాంసం చాల రోజులు తిన్నది. ఈ కథ చెప్పిన కరణికుడు, శత్రువులు బలవంతులు కనుక జాగ్రత్తగా ఉండమని, ఏదైనా ఆలోచన చేయమని చెప్పి వెళ్ళిపోయాడు.

పాండవుల ప్రజాభిమానానికి దుర్యోధనుడు ఈర్ష్య వహించి, ధృతరాష్ట్రుని వద్ద తన అక్కసు వెళ్ళగ్రక్కాడు. పాండవులను వారణావతం పంపమని దుర్యోధనుడు ధృతరాష్ట్రుని కోరాడు. వారణావతం ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం. అక్కడి ప్రజలు పాండవులను ప్రేమిస్తున్నారి భ్రమ కలిగించి, వారిని అక్కడికి వెళ్ళేలా వ్యూహం పన్నిన దుర్యోధనుడు, ధృతరాష్ట్రుని బలవంత పెట్టసాగాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు పాండు కుమారులను పిలిచి, "ప్రియతములారా! వారణావతాన్ని గురించి ప్రజలు మిక్కిలి శ్లాఘిస్తున్నారు. మీరుకూడ వెళ్ళి అక్కడ దానధర్మాలు మున్నగునవి చేయండి. జాతరలో పాల్గొనండి. కొన్ని రోజులుండి తిరిగిరండి." అన్నాడు. ధృతరాష్ట్రుని అంతరంగాన్ని గ్రహించిన యుధిష్ఠిరుడు నిస్సహాయుడై భీష్మ, ద్రోణులకు, గాంధారికి చెప్పి, కుంతితో సహా పాండవులు వారణావతానికి బయలుదేరారు.

పాండవులు వారణావతంలో పడ్డ అగచాట్లు తెలుసుకొందాం.

పాండవులు వారణావతం వెళ్ళడంతో, దుర్యధనునికి సంతోషం వేసింది. తనకు విశ్వాసపాత్రుడైన, మంత్రియైన పురోచనుణ్ణి పిలిచి, వారణావతంలో పాండవులకు ఒక లక్క యింటిని నిర్మించు. వారందరు

అందులో ఆహుతి అయ్యేటట్లు జాగ్రత్తగా నిర్మించు' అని చెప్పాడు. ఈ లక్క యింటి సందేశం నెమ్మదిగా విదురుని నుండి ధర్మరాజుకు చేరింది. చాల జాగ్రత్తగా ఉండాలని సందేశం వచ్చింది.

వారణావత ప్రజలు పాండవులను మిక్కిలి ఆదరించారు. విరోచనుడు లక్క యింటిని పూర్తిచేసి, పాండవులను అందులోనికి చేర్చాడు. విదురుడు తన ఆప్తుడు, సొరంగం త్రవ్వకంలో నిపుణుడైన వానిని పాండవుల వద్దకు పంపాడు. అతడు యుధిష్ఠిరుని వద్దకు వచ్చి తాను వచ్చిన పని చెప్పాడు. పాండవులు అన్ని పనులు రహస్యంగా చూస్తూవున్నారు. దగ్గరలో అడవిని కూడ చూస్తున్నారు భవిష్యత్తులో తలదాచుకోవడానికి.

ఇది ఇలా ఉండగా, ఒక రోజు బ్రాహ్మణులకు భోజనం ఏర్పాటు చేసింది. అదే సమయంలో ఒక భిల్లుజాతి మహిళ బిడ్డలతో భోజనం కోరింది. వాళ్ళు అక్కడనే నిద్రించారు. ఆరోజు రాత్రే భీముడు ముఖద్వారానికి నిప్పు పెట్టి, సొరంగం నుండి తల్లిని, సోదరులను తీసికొని పోసాగాడు. ఆ లక్క ఇంటిలోనే పురోచనుడు మసైపోయాడు. పురజనులందరు విషయం తెలుసుకొని దుర్యోధనుణ్ణి ఘోరంగా దూషించడం మొదలుపెట్టారు.

సొరంగం ద్వారా బయటకు వచ్చి, పాండవులు గంగాతీరంచేరుకొన్నారు. అప్పటికే ఎదురుగా పంపిన నావికుడు సిద్ధంగా వున్నాడు. ఒక నావపై వారిని ఆవలి తీరానికి చేర్చాడు. అది రాత్రి. ఆకలి, దాహం. ఏంచేయాలో తెలియడం లేదు. దగ్గరలో చెరువు కోసం భీముడు వెళ్ళాడు. భీముడు నీరు తీసుకొని వచ్చేసరికి, అందరూ పడుకొని వున్నారు. వారిని లేపడం కూడ మాని కాపలా కాస్తూ వున్నాడు.

హిడింబాసుర మరియు బకాసుర కథ విందాం.

పాండవులు గాఢనిద్రలో వుండగా, దగ్గరలో చెట్టుపై హిడింబాసురుడు అనే రాక్షసుడు కూర్చొని వున్నాడు. వాడు మహా క్రూరుడు,, మాంసభక్షకుడు. అలా నరవాసన రాగానే, తన చెల్లెలు హిడింబిని పిలిచి, ఆ మానవులను చంపితెచ్చి నా ఆకలి తీర్చు అని అన్నాడు. హిడింబి పాండవులను సమీపించి, కాపలా వున్న భీముణ్ణి చూసింది. ఈ సింహంలా వున్నవాణ్ణి వివాహం చేసుకుంటే జీవితాంతం సుఖంగా గడపవచ్చుననుకొన్నది. వెంటనే మానవ స్త్రీ రూపంలో అందంగా భీముని సమీపించింది. భీమునితో ఇలా అన్నది. "మా అన్న మిమ్మల్ని చంపి తీసికొని రమ్మన్నాడు. ఇక్కడ అంతా రాక్షసులే. నేను మిమ్మల్ని రక్షించగలను. కాని నీ మీద నాకు మోహం కలిగింది. పారిపోదాం రా' అని అన్నది. అందుకు భీముడు 'మాకొచ్చిన ప్రమాదమేమీ లేదు. నాముందు ఎవరూ నిలువలేరు. నీవు అందంగానే వున్నావు. కాని నీవు వెళ్ళిపో' అన్నాడు. హిడింబి ఎంతకూ రానందున, హిడింబాసురుడు స్వయంగా తానే ఆక్రమణకు రాగా, భీముడు భయంకర స్వరంతో ఆగిపో అని హెచ్చరించాడు. అలా అంటూనే వాని చేయి లాగిపారేశాడు. ఇలా యుద్ధ భీభత్సానికి పాండవులు లేచిచూస్తే, అక్కడ అందమైన యువతి నిలబడి వుంది. హిడింబి జరిగినదంతా పాండవులకు వివరించింది. అర్జునుడు తాను చూచుకొంటానని చెప్పినా వినకుండా, భీముడే వానిని చంపేశాడు.

తర్వాత పాండవులు ముందుకు సాగగా, హిడింబి కూడా వారిని అనుసరించింది. కుంతితో 'అమ్మా! నేను భీముని ప్రేమించాను. దయచూపండి. మీకు ఏ సహాయమైనా చేయగలను. నన్ను కరుణించకపోతే, నాకు మరణమే శరణ్య'మని చెప్పింది. అది విని ధర్మరాజు "ఓ హిడింబీ! నీవు చెప్పేది ఉచితంగానే వున్నది. నీవు సూర్యాస్తమయం వరకు భీముని సేవలో ఉండవచ్చు." అని అన్నాడు. భీముడు పుత్రోదయం వరకు హిడింబితో వుంటాను, తర్వాత ఉండను అని చెప్పగా, అన్నిటికి హిడింబి సమ్మతించి, దివ్యవేషధారణతో, భీముని తీసికొని,

ఆకాశమార్గంలో, దివ్యభూములో ఇష్టమొచ్చిన రీతిలో విహరింపసాగింది. వారిద్దరికి సమయానుకూలంగా ఒక గొప్ప శక్తిమంతుడు, మాయలలో సిద్ధహస్తుడైన పుత్రుడు జన్మించాడు. వాడే ఘటోత్కచుడు.

ఘటోత్కచుడు పాండవులంటే అమిత ప్రేమతో ఉండేవాడు. వారినుద్దేశించి, 'మీరు నాకు పూజ్యులు. మీ సేవకు నేను సదా సిద్ధంగా వుంటాను' అని అన్నాడు. అపుడు కుంతి 'నాయనా! నీవు కురువంశ సంతానానివే. భీముడంతటి వాడవు. సమయం వచ్చినపుడు సాయం చేయవచ్చు లే' అని అన్నది. అపుడు ఘటోత్కచుడు, 'నానమ్మా! నేను రావణుడు, ఇంద్రజిత్తు లాంటి పరాక్రమవంతుణ్ణి. నన్ను స్మరించినంత మాత్రాన్నే, మీ ఎదుట ఉండగల'నని చెప్పి తల్లితో సహా వెళ్ళిపోయాడు.

ఇంతలో వేదవ్యాస మహర్షి వచ్చి, దగ్గరలో వున్న నగరానికి వెళ్ళండి, అంతా శుభమే జరుగుతుందని చెప్పి వెళ్ళిపోయాడు.

పాండవులు అప్పుడు ఏకచక్రపురానికి వెళ్ళి, ఒక బ్రాహ్మణుని ఇంటిలో ఉండసాగారు. భిక్షాటన చేసి తెచ్చిన ఆహారంలో సగం భీమునికి పెట్టి, మిగతా సగం అందరూ తినేవారు.

ఒకరోజు అందరూ బయటకు వెళ్ళారు. ఆ సమయంలో కుంతి, భీమసేనుడు మాత్రం ఇంట్లో వున్నారు. అనుకోకుండా కేకలు వినిపించాయి. కుంతి వెళ్ళి విషయం తెలుసుకోగా, ఆమెకు ఆ బ్రాహ్మణులు చెప్పిన ప్రకారం ఆ ఊరి బయట బకాసురుడు అనే రాక్షసుడు వున్నాడు. వాడు ఊరిమీద పడి మనుషులను తింటుంటే, గ్రామస్తులు వాడితో ఒక ఒప్పందం చేసుకొన్నారు. ఆ ఒప్పందం ప్రకారం ఊరివారందరూ కలిసి అతనికి ప్రతిరోజూ బండెడు అన్నం, ఒక మనిషి మాంసం ఆహారంగా పంపాలి. అలా ఊరిలో వంతులవారీగా ఇస్తుండేవారు. ఆరోజు ఈ బ్రాహ్మణుల వంతు వచ్చిందట. అదీవారి ఏడుపుకు కారణం. కుంతి వారిని ఓదార్చి, ఈరోజు నా కుమారుడు వెళ్తాడని చెప్పింది. చెప్పిన విధంగా, ఊరివారిచ్చిన ఆహారం తీసుకొని భీముడు బకుని వద్దకు బయలుదేరాడు. కాని ఆహారం చూసేసరికి భీముడికి నోరూరింది. తనకోసం తెచ్చిన ఆహారాన్ని భీముడు తినడం చూచి, బకాసురుడు రెచ్చిపోయాడు. ఇద్దరి మధ్య యుద్ధం జరిగి, చివరకు భీముడు బకాసురుణ్ణి చంపేశాడు. బకాసురునికి తోడుగా వచ్చిన ఇతర రాక్షసులను కూడా భీముడు చంపేశాడు. దెబ్బతిని పడివున్న మిగిలినవారితో, మానవుల జోలికి వెళ్ళరాదని శాసించాడు. అందుకు రాక్షసులందరూ అంగీకరించారు. అలాగే ఏకచక్రపురవాసులందరూ కూడా మిక్కిలిగా సంతోషించి, పాండవులకు బ్రహ్మరథం పట్టారు.

ధృష్టద్యుమ్నుని గురించి, ద్రౌపది పుట్టుక గురించి తెలుసుకొందాం.

బకాసురుని చంపిన తర్వాత కూడా పాండవులు అక్కడే ఉంటూవున్నారు. ఒకరోజు ఒ సదాచార బ్రాహ్మణుడు ఆ ఇంటికి రాగా పాండవులు ఆ బ్రాహ్మణునికి సేవచేశారు. ఆ తర్వాత ఆయనకు తెలిసిన విశేషా లడుగగా, ఆ బ్రాహ్మణుడు ద్రుపదరాజు గురించి ఇలా చెప్పాడు.

ద్రోణాచార్యుని కోరిక మేరకు పాండవుల ద్వారా పాంచాల రాజు ద్రుపదుని గర్వభంగం జరిగిన తర్వాత ద్రుపదుడు ప్రతీకారేచ్ఛతో పలు ఆలోచనలు చేయసాగాడు. అపుడు యాజుడు మరియు ఉపయాజుడు అనే ఇద్దరు తాపసులు తటస్థపడ్డారు. వారికి సేవచేస్తూ, ద్రుపదుడు ఇలా అన్నాడు. "మునులారా! ద్రోణాచార్యుని చంపగల పుత్రుని నాకు లభించే యజ్ఞం నా చేత చేయించండి. మీకు ఒక కోటి ఆవులను దానం చేస్తాను." యాజుడు సమ్మతించి అనుకూలంగా యజ్ఞం చేయించాడు. ఫలితంగా ఆ యజ్ఞకుండంలో నుండి కిరీటంతో,

కవచంతో ఒక తేజోమయుడైన పురుషుడు ఆవిర్భవించాడు. దానిలోనుండే ద్రౌపది కూడ జన్మించింది. ఆమె సర్వాంగసుందరంగా ఉంది. ఆకాశవాణి పేర్కొన్నట్లు వారి పేర్లు ధృష్టద్యుమ్నుడు, కృష్ణగా పెట్టడం జరిగింది. ద్రుపదరాజ పుత్రిక కాబట్టి ద్రౌపదిగా ప్రసిద్ధిచెందింది. నల్లగా వున్నందున కృష్ణ అని, పాంచాలరాజు పుత్రిక కాబట్టి పాంచాలి అని ఆమె పిలవబడింది.

ఈలోపు వేదవ్యాసుడు పాండవుల దగ్గరకు వచ్చాడు. పాండవులు ఆయనకు సత్కారాలు ముగించిన తర్వాత, వ్యాసుడు అనేక విషయాలు చెపుతూ, ద్రౌపది జన్మవృత్తాంతం కూడా చెప్పనారంభించాడు.

"పాండుపుత్రులారా! పూర్వం ఒక ఋషికి సుందరి మరియు గుణవతియైన కుమార్తె వుండేది. కాని ఆమె పూర్వజన్మల కర్మలను బట్టి ఆమెను ఎవరూ భార్యగా ఇష్టపడలేదు. దుఃఖించిన ఆమె శంకరుని గురించి తపస్సు చేసింది. శంకరుడు ప్రసన్నుడై వరం కోరుకోమనగా, ఆమె సర్వగుణ సంపన్నుడైన భర్తను కోరుకొంది. ఆమె 'పతి' అనే మాటను ఐదుసార్లు ఉచ్చరించింది. శంకరుడు ఆమెకు ఐదుగురు భర్తలు కాగలరని చెప్పాడు. నాకు ఒక భర్త చాలునని కోరగా, కాదు కాదు నీవు ఐదుసార్లు ఉచ్చరించావు కనుక నీకు ఐదుగురు భర్తలు కాగలరని చెప్పాడు.

కాలాంతరాన ఆమెయే ద్రుపదుని యజ్ఞవేదికనుండి ఆవిర్భవించిన దేవకన్య. ఆమె మీకు భార్య కాగలదు. కనుక మీరు పాంచాల నగరానికి వెళ్ళండి, అన్నీ శుభాలే కలుగుతాయని చెప్పి వ్యాసుడు వెళ్ళిపోయాడు.

వ్యాసుని ఆజ్ఞ మేరకు పాడవులు పాంచాల దేశానికి తరలివెళ్ళారు. అర్జునుడు ముందుగా దివిటీ పట్టుకొని నడువగా మిగతావారు అనుసరించారు. వారు తీర్థస్థలం దాటుతుండగా చిత్రరథుడనే గంధర్వరాజు తన స్త్రీలతో గంగానదిలో జలవిహారం చేస్తున్నాడు. గంధర్వరాజు పాండవులను గమనించి, అక్కడినుంచి వెళ్ళిపొమ్మన్నాడు. అర్జునుడు వినకపోవడంతో చిత్రరథుడు విషపు బాణాన్ని ప్రయోగించాడు. అర్జునుడు తన దివిటీతోనే వాటిని ఎదుర్కొన్నాడు. ఆ తరువాత అర్జునుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించి, అంగారవర్ణుని (చిత్రరథుని పూర్వనామం) బందీచేసి, ధర్మరాజు దగ్గరకు తీసుకొనివచ్చాడు. అతని భార్య ప్రాధేయపడటంతో ధర్మరాజు వారిని విడిచిపెట్టాడు. అపుడు గంధర్వుడు అర్జునునితో, "అర్జునా! తపతీనందనా! నేను ఓడిపోయాను. మిమ్మల్ని నా స్నేహితులుగా చేసుకొని, మాయా యుద్ధ మెళుకువలు మీకు ఇస్తున్నాను. ప్రతి కుటుంబానికి ఒక పురోహితుడుండాలి" అని అన్నాడు.

అపుడు అర్జునుడు "ఓ గంధర్వరాజా! నేను కుంతీపుత్రుడను. నన్ను తపతీనందనుడని ఎందుకు అన్నావో వివరించు' అని అడిగాడు. అపుడు గంధర్వరాజు, "అర్జునా! సూర్యుని కుమార్తె తపతి. ఈమె సావిత్రి యొక్క చిన్న చెల్లెలు. తపస్సు చేయుటచే తపతి అనబడింది. అంతటి రూపవతియైన కన్య దేవతలలో కాని, అప్సరసలు, యక్షులలో కాని ఎక్కడా లేరు.

ఆ కాలంలోనే పురువంశపు రాజుగా సంవరణుడు ఉండేవాడు. అతడు గొప్ప సూర్యభక్తుడు, మహా బలవంతుడు. ఒకరోజు ఆ రాజు వేటకు వెళ్ళినపుడు ఒక కన్యను చూచాడు. సంవరణుడు ఆమెను "ఓ సుందరీ! నీవెవరవు? ఇక్కడ ఎందుకున్నావు?। అని అడుగగా, ఆమె ఏ జవాబు చెప్పకుండా మెరుపుతీగలా అదృశ్యమయింది. ఆమెను వెదుకుతూ, ఎక్కడా కనపడనందున నిశ్చేష్టుడైనాడు.

సంవరణుడు స్పృహ తప్పడం చూచిన తపతి అతని దగ్గరకు వచ్చి తన మధుర మందహాసంతో, 'రాజా! లే, లే. మీలాంటి సత్పురుషులు ఇలా కాకూడదు.' అన్నది. మధుర స్వరంతో పలికిన పలుకులు విన్న సంవరణుడు లేచి, 'ఓ సుందరీ! నా ప్రాణాలు నీచేతిలో వున్నాయి. నీవు లేకుండా నేను జీవించలేను. నన్ను కటాక్షించు. గాంధర్వ వివాహానికి సమ్మతించు.' అనగానే తపతి 'ఓ రాజా! నేను సూర్యపుత్రికను. స్వతంత్రించలేను. మీరు సూర్యుని ఒప్పించి, నన్ను గ్రహించండి. మీతో పెళ్ళికి నాకెలాంటి అభ్యంతరం లేదు' అని చెప్పి, తపతి ఆకాశమార్గాన వెళ్ళిపోయింది.

సంవరుణిని గాలిస్తూ వచ్చిన మంత్రి, ఇతరులు ఆయనను చూచి సంతోషించారు. మంత్రిని మాత్రమే దగ్గర వుంచుకొని, మిగతావారిని దూరంగా వెళ్ళమని చెప్పి, వశిష్ఠ మహర్షిని ధ్యానించాడు. వెంటనే వశిష్ఠ మహర్షి ప్రత్యక్షమై, విషయం తెలుసుకొని, సంవరణుని కోరిక మేరకు సూర్యుని ఒప్పించాడు. సూర్యుడు తన కుమార్తె తపతిని వశిష్ఠుని వెంట పంపాడు. విధిపూర్వకంగా వారికి పాణిగ్రహణ సంస్కారం జరిగిపోయింది. అర్జునా! ఆ రకంగా తపతి గర్భవతియై 'కురు'కు జన్మనిచ్చింది. అప్పటినుండే కురువంశం మొదలైంది. ఆ కారణంగానే నిన్ను తపతీ నందనుడని పిలిచాను.

అర్జునుడు అపుడు గంధర్వరాజును, పూర్వరాజుల పురోహితుడైన వశిష్ఠుని గురించి చెప్పమని అడిగాడు.

గంధర్వరాజు ఇలా చెప్పాడు. "మహర్షి వశిష్ఠుడు బ్రహ్మయొక్క మానసపుత్రుడు. ఆయన భార్య అరుంధతి. విశ్వామిత్రుడు వశిష్ఠుని వందమంది పుత్రుల మరణానికి కారకుడైనాకూడా, బలం గలిగిన వాడై వుండికూడా, విశ్వామిత్రునిపై ప్రతీకారం తీర్చుకోలేదు.

"వశిష్ఠ, విశ్వామిత్రుల మధ్య వైరం ఎలా ఉత్పన్నమైంది?" అని అర్జునుడు అడిగాడు. ఆయన ఇలా చెప్పాడు. "అర్జునా! విశ్వామిత్రుడు కన్యాకుబ్జరాజు. ఒకరోజు మందీమార్బలంతో వేటకు వెళ్ళి అలసిపోయి వశిష్ఠుని ఆశ్రమానికి చేరుకున్నాడు. వశిష్ఠుడు కామధేనువు నందిని సహాయంతో వారికి పంచభక్ష్యాలు సమకూర్చాడు. విశ్వామిత్రుడు ఆ నందినిని దొంగిలించాలనుకున్నాడు. ఆ ఆలోచన రాగానే, నందని కోపంతో వారిని పారద్రోలింది. తపోశక్తితో ఏదైనా సాధించవచ్చని విశ్వామిత్రుడు తపస్సుకు వెళ్ళాడు.

అర్జునా! ఒకరోజు కల్మాషపాదుడనే రాజు వేటకై అడవికి వెళ్ళాడు. ఇరుకు మార్గంలో నడుస్తుండగా, శక్తి అనే వశిష్ఠ కుమారుడు ఎదురుగా వస్తున్నాడు. ఎవరూ తప్పుకోకపోవడంతో కల్మాషపాదుడు కోపంతో కత్తి తీశాడు. శక్తి ముని ఆగ్రహించి, రాజును రాక్షసుడై పోదువు గాక! అని శపించాడు. అలాగైతే, నా రాక్షస గుణంతో నిన్నే ముందు తింటాను అని శక్తి మునిని ఆరగించివేశాడు. ఈ విషయం తెలుసుకున్న విశ్వామిత్రుడు కింకర అను రాక్షసుణ్ణి కల్మాషపాదునిలో ఆవహించమని చెప్పాడు. ఆ ప్రభావంతో కల్మాషపాదుడు వశిష్ఠుని మిగతా 99 మంది పుత్రులను తినేశాడు. దీనిలో విశ్వామిత్రుని పాత్ర ఉందని తెలిసి కూడా, వశిష్ఠుడు సమర్థుడై వుండికూడా విశ్వామిత్రుని మీద పగతీర్చుకో లేదు.

ఒకరోజు వశిష్ఠుడు ఆశ్రమానికి తిరిగి వస్తున్న సమయంలో, వెనుదిరిగి చూడగా ఆయన వెనక ఒక స్త్రీ వుంది. ఆమె శక్తి ముని భార్య. వశిష్ఠుడు వేదాధ్యయనం చేస్తున్నదెవరు అని ఆమెను అడిగాడు. గర్భంలో వున్న మీ మనుమడు అని చెప్పింది.

ఇంతలోనే కల్మాషపాదుడు ఒక చెట్టు కొమ్మపైనుండి దిగి వీరిని తినటానికి వచ్చాడు. వశిష్ఠుడు హుంకరించి, మంత్రజలం వాడిపై చల్లగా ఆవాహన అయిన రాక్షసుడు అంతరించి, కల్మాషపాదుడు మామూలుగా మారిపోయాడు. కల్మాషపాదుడు కృతజ్ఞతతో వశిష్ఠునికి నమస్కరించి వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళకు ఆ స్త్రీ గర్భం నుండి తేజోవంతుడైన పరాశరుడు జన్మించాడు.

అర్జునుడు గంధర్వరాజును ఒక పురోహితుని సూచించమని అడిగాడు. ఈ అడవిలోనే ధౌమ్యుడనే తాపసి వున్నాడు, అతనిని మీరు పురోహితునిగా నియమించుకోండి అని గంధర్వరాజు చెప్పాడు. అర్జునుడు కృతజ్ఞతగా తనవద్ద వున్న ఆగ్నేయాస్త్రాన్ని అతనికిచ్చి సంతోషపెట్టాడు. పాండవులు ధౌమ్యుని వద్దకు వెళ్ళి తమకు పురోహితునిగా వుండమని ప్రార్థించగా, ధౌమ్యుడు అందుకు సమ్మతించాడు.

ద్రౌపది స్వయంవరం : పాండవులతో ద్రౌపది పెండ్లి విషయం తెలుసుకుందాం.

పాండవులు కుంతీసమేతంగా పాంచాల దేశపు రాజు ద్రుపదుని రాజధానికి వెళ్తుండగా, కొందరు బ్రాహ్మణులతో వేదవ్యాసుడు వస్తూ కనిపించాడు. నగరం సమీపించగానే పాండవులు ఒక కుమ్మరిదాని ఇంటిలో ఆశ్రయం పొందారు.

ద్రౌపదిని అర్జునుడు వరించాలని ద్రుపదుని కోరిక. అందకే కష్టసాధ్యమైన, సామాన్యులకు సాధ్యపడనటువంటి ధనస్సును, లక్ష్యాన్ని ఏర్పరచాడు. స్వయంవర దినోత్సవాన, పాండవులు బ్రాహ్మణులతో పోయి, వారి స్థానాల్లో ఆసీనులయ్యారు. దేవాంగనలా పుష్పశోభలతో అలంకరించబడిన ద్రౌపది పూలమాలతో సభాప్రాంగణంలోకి వచ్చింది.

ధృష్టద్యుమ్నుడు చెల్లెలు ద్రౌపది ప్రక్కన నిలబడి గంభీర స్వరంతో రాకుమారులనుద్దేశించి ఇలా అన్నాడు. “వీరులారా! ఇది ధనుస్సు. ఆ బాణములతో పైనున్న లక్ష్యమును ఐదు బాణాలకు ఎక్కువ కాకుండా, వలయాకారంలో తిరుగుతున్న మత్స్యం మీ లక్ష్యం. ఎవరు ఛేదిస్తే, ఆ వీరునికి నా చెల్లెలు అర్ధాంగి కాగలదు.’ ఈ స్వయంవరానికి దుర్యోధనుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, యుయుత్సుడు మున్నగు బలశాలులు వచ్చారు. ఇంకా శకుని, అశ్వత్థామ, విరటుడు మున్నగువారు కూడ వచ్చారు. దేవతలు, గంధర్వులు విమానాల్లో వచ్చి చూస్తున్నారు. బలరాముడు, శ్రీకృష్ణుడు మొదలైన యదువీరులు కూడ చూచుటకు వచ్చారు. ప్రారంభంలో దుర్యోధనుడు, శల్యుడు మున్నగువారు ప్రయత్నించి విఫలులైనారు. కర్ణుడు లేచి బాణం సంధిస్తున్న సమయంలో ద్రౌపది లేచి నేను సూతపుత్రుని వరించను అని చెప్పింది. కర్ణుడు నిరాశతో ధనుస్సును వదలివేశాడు. శిశుపాలుడు, జరాసంధుడు కూడ విఫలులైనారు. కాని బ్రాహ్మణ సమాజంలో కూర్చొని వున్న అర్జునుడు సింహంలా నడుస్తూ వచ్చి, ధనుస్సుకు ప్రదక్షిణం చేసి, మనసులో శంకరునికి, కృష్ణునికి నమస్కరించుకొని, క్షణకాలంలో ఐదు బాణాలను ఏకకాలంలో సంధించి, మత్స్యాన్ని ఛేదించాడు. అర్జునునిపై పూలవర్షం కురిసింది. అర్జునుడు విజయం సాధించాడు.

స్వయంవరంలో ఒక బ్రాహ్మణునికి ద్రౌపదిని ఇచ్చి వివాహానికి నిశ్చయించుకొన్న ద్రుపదునిపై రాజులంతా కోపంతో ఉన్నారు. వీరి చేష్టలను గమనించిన అర్జునుడు, భీముడు ద్రుపదుని మధ్యలోకి వచ్చారు. కర్ణుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడి బాణవిద్యా కౌశలాన్ని చూచి కర్ణుడు కూడా ఆశ్చర్యపోయాడు. అతడు అర్జునునితో ‘ఓ బ్రాహ్మణ కుమారా! పరశురాముడో, ఇంద్రుడో మారువేషంలో నాతో యుద్ధం చేస్తున్నట్లుంది.

నేను తట్టుకోలేక పోయాను. నన్ను ఒక్క అర్జునుడు, ఇంద్రుడు మాత్రమే జయించగలరు. నీవెవరవు?' అని అడిగితే అర్జునుడు 'ఓ కర్ణా! నేను సకలశాస్త్ర రహస్యాల్ని తెలుసుకున్నవాడిని. బ్రహ్మ, ఇంద్రాస్త్రాల మీద నాకు అభ్యాసం వుంది." అని అనడంతో కర్ణుడు యుద్ధం నుండి తప్పుకొన్నాడు.

మరొకవైపు భీముడు శల్యుడు ఢీకొంటున్నారు. అందరూ వీక్షించసాగారు. భీముడు తన యావత్ శక్తిని వినియోగించి, శల్యుని పడవేశాడు. అలసిన శల్యుడు ఇక లేవలేక పోయాడు.

యుద్ధం చేయడం వల్ల ఏ ప్రయోజనమూ లేదని శ్రీకృష్ణుడు రాజులకు హితబోధ చేశాడు. రాజులు యుద్ధాన్ని విరమించుకొని భీమార్జునులతో సహా ద్రౌపదిని తీసికొని తమ నివాసమైన కుమ్మరి ఇంటికి వెళ్ళారు. అక్కడ అర్జునుడు అమ్మతో "అమ్మా! ఈరోజు ఈ భిక్ష తెచ్చాము" అనగా లోపలినుండే ఆమె అనాలోచితంగా 'మీ అయిదుగురు ఉపభోగించండి' అని కుంతి అన్నది. ద్రౌపదిని చూచిన తరువాత ఆశ్చర్యపడి, ధర్మరాజును సమీపించింది. వేదవ్యాసుడు అన్న మాటలు ధర్మరాజుకు గుర్తుకు వచ్చాయి. నిజమే, ద్రౌపది మా అందరి భార్య కాగలదన్నాడు. శ్రీకృష్ణుడు, బలరాముడు కూడ వచ్చి పలుకరించి వెళ్ళారు. ధృష్టద్యుమ్నుడు వేగుల సాయంతో వీరి లక్షణాలను పసికడుతూ వున్నాడు.

వారిలోని రాజలక్షణాలు ద్రుపదునికి చెప్పాడు. ద్రుపదుడు తన పురోహితుణ్ణి పంపి పాండవులను పిలిపించుకున్నాడు. ద్రుపదుడు వారిని అడుగగా, మేము పాండవులమే, నిజమేనని వారు అంగీకరించారు.

ఆ తర్వాత వ్యాసుడు అక్కడకు వచ్చాడు. ఆయనకు నమస్కరించి, ద్రుపదుడు తన ధర్మసందేహాన్ని చెప్పాడు. వ్యాసుడు బదులుగా ద్రౌపది జన్మ వృత్తాంతం చెప్పి ఒప్పించాడు. ఆనాడే దివ్యమైన ముహూర్తం అని చెప్పి, ద్రౌపదికి పాండవులతో వివాహం జరిపించాడు.

ఇక పాండవులు ఇంద్రప్రస్థానికి చేరి, రాజ్యపాలన చేసుకోవడం తదితర విషయాలను తెలుసుకొందాం.

హస్తినాపురంలో దుర్యోధనుడు మరియు కర్ణుడు ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళి పాండవులను ఎలా హింసించాలనే ఆలోచనలో పడ్డారు. అపుడు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు. "ఈ విషయం మన ముగ్గురం ఆలోచించేది కాదు. భీష్మ, ద్రోణ, విదురుల్ని పిలిపించి, వారితో సమాలోచనలు చేయాల్సిందే, వారిని పిలిపించి, పాండవులకు ఎలా న్యాయం చేయాలో చెప్పమంటే భీష్ముడు వెంటనే వారి అర్ధ రాజ్యం వారికిచ్చేయాలని అన్నాడు. ద్రోణుడు, విదురుడు కూడా భీష్ముని సమర్థించారు.

ద్రుపదుని రాజ్యంలో ఉన్న పాండవులను, ద్రౌపదిని గౌరవంగా తీసికొని రావాలని విదురునితో ధృతరాష్ట్రుడు చెప్పాడు. విదురుడు వారిని హస్తినాపురానికి తీసుకొని వచ్చాడు. పాండవులకు అర్ధరాజ్యంగా ఖాండవ ప్రస్థానాన్ని ఇస్తున్నట్లు చెప్పాడు. అక్కడ వారు రాజ్య నిర్మాణం చేసుకొని ఇంద్రప్రస్థం అనే పేరుతో కొత్త రాజధానిని వైభవంగా తయారుచేసుకొన్నారు అల్పకాలంలోనే.

ఒకరోజు నారదుడు ఇంద్రప్రస్థానికి వస్తే, పాండవులు సత్కరించారు. నారదుడు వారిని ఏకాంతంలోకి పిలిచి ఇలా అన్నాడు. "వీర పాండవులారా! మీకు ద్రౌపది ఏకపత్ని యైనందున, మీరు కొన్ని నియమాలు ఏర్పరచుకోవాలి. మీకు ఇది పూర్తిగా అర్థం కావాలంటే సుందుడు మరియు ఉపసుందుల కథ చెప్తా. వినండి.

పూర్వకాలంలో రాక్షస వంశానికి చెందిన సుందుడు, ఉపసుందుడు అనే ఇద్దరు సోదరులుండేవారు. వారి భావాలన్నీ ఒకే రీతిగా వుండేవి. త్రిలోకాలను జయించాలని ఆశపుట్టి, వారు వింధ్యాచలంపై తపస్సు చేయసాగారు. వారి తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. వారు ఈ ప్రపంచంలో ఎవరిచేత కానీ, వస్తువుచే కాని తమకు మరణం లేకుండా వుండే వరం కోరుకున్నారు. బ్రహ్మ తథాస్తు అని, తన లోకానికి వెళ్ళిపోయాడు. తర్వాత ఈ సోదరులు ఇద్దరు చెలరేగిపోవడం ప్రారంభించారు.

రాజర్షులను, బ్రహ్మర్షులను పట్టుకొని సర్వనాశనం చేశారు. ఆశ్రమాలను కూలద్రోశారు. భయపడిన ఋషులు అడవుల్లో, కొండల్లో దాగుకొని ఉన్నా కూడా వీళ్ళు వెళ్ళి వాళ్ళను చంపేసేవారు. ఈ దుర్మార్గపు స్థితిని గురించి ఋషులు బ్రహ్మకు మొరపెట్టుకొన్నారు. అపుడు బ్రహ్మ విశ్వకర్మను పిలిచి ఒక త్రిలోక సుందరిని అవతరింప జేయమని, ఆ విశిష్ట అవతారానికి తిలోత్తమ అను పేరు పెట్టి, బ్రహ్మ నీ కళాకౌశలం చూపమని సుందోపసుందుల దగ్గరకు పంపాడు.

ఒకరోజు సుందోపసుందులు త్రాగి జోగుతూ వుండటం తిలోత్తమ గమనించి, తన వయ్యారాలతో వారిని కవ్వించింది. వారిద్దరూ ఆమెవెంట పరుగెత్తుకుంటూ వచ్చి తిలోత్తమ చేతులను పట్టుకొని, ఈమె నా భార్య అంటే నా భార్య అని ఇద్దరూ తగాదా పడ్డారు. ఇద్దరూ ఒకరితో ఒకరు గదలతో తలపడ్డారు. వారిద్దరు మత్తులో ఒకరినొకరు చంపుకున్నారు." ఇలా వారి కథ చెప్పి, నారద మహర్షి వారితో ఇలా అన్నాడు. "ఓ పాండునందనులారా! సుందోపసుందులు శరీరాలు వేరైనా ప్రాణం ఒకటిగా ఉండేవారు. కాని స్త్రీమూలంగా వారు కలహించుకొని చనిపోయారు. అలాంటి స్థితి మీకు రాకుడ'దని నా ఆశ. మరొక విషయం నియమిత కాలం తీరిన వెంటనే ద్రౌపదికి కన్యత్వం వచ్చేస్తుంది. కాబట్టి ఆమె పతివ్రతగానే పిలవబడుతుంది." వెంటనే పాండవులు మహర్షి ఎదుటనే కొన్ని నియమాలు పెట్టుకొన్నారు. నియమిత సమయం వరకు ద్రౌపది ఎక్కడ వుంటే, అక్కడికి మరొక సోదరుడు వెళ్ళరాదు. ఒకవేళ ఎవరైనా ఈ నియమానికి భంగం కలిగిస్తే, వారు 12 సం॥లు తీర్థయాత్రలు చేయాలి." ఇది విని నారద మహర్షి సంతసించి వెళ్ళిపోయాడు.

కాని, ఒకసారి అర్జునుడు నియమభంగం ఎలా, ఎందుకు చేశాడో, ఫలితమేమిటో తెలుసుకుందామా!

పాండవులు తాము ఏర్పరచుకొన్న నియ నిబంధనల మేరకే, ద్రౌపదితో సుఖిస్తూ ఉన్నారు. ఒకరోజు ఒక బ్రాహ్మణుడు తన గోవులను ఎవరో దొంగిలించుకు పోతున్నారని ఆక్రందన చేశాడు. అర్జునుడు అతనికి అభయమిచ్చి, ధనుర్బాణాలు తీసుకోవడానికి, ధర్మరాజుతో ద్రౌపది ఏకాంతంగా వున్న గదిలోకి వెళ్ళి ధనుర్బాణాలు తీసికొన్నాడు. ఇలా అర్జునుడు నియమభంగం కావించాడు. ఆలమందలు విడిపించి, బ్రాహ్మణునికి సాయపడ్డాడు. నియమభంగం చేత తాను 12 సం॥ తీర్థయాత్రలకు వెళ్ళడానికి అనుమతివ్వాలని అర్జునుడు ధర్మరాజును కోరాడు. దీనిని తీవ్రంగా పరిగణించ పనిలేదని ధర్మరాజు చెప్పినా, అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు. వేదవేదాంగ మర్మజ్ఞులు మరియు ఎందరో ఆయన వెంట వెళ్ళారు. అనేక పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ హరిద్వార్‌కు చేరుకొన్నారు.

ఒకరోజు అర్జునుడు గంగాస్నానం చేస్తుండగా ఉలూచి అనే నాగకన్య అతనిని తన లోకానికి తీసుకొని వెళ్ళింది. ఎక్కడికి తెచ్చావు నన్ను అని అర్జునుడు అడిగితే, "నా పేరు ఉలూచి, నిన్ను ప్రేమిస్తున్నాను, నా కోరిక తీర్చకపోతే, బ్రతకను." అని అన్నది. అర్జునుడు ఆ రాత్రంతా అక్కడే గడిపి, తెల్లవారి వెళ్ళిపోయాడు. జలచరముల వల్ల భయముండదనే వరం పొంది వెళ్ళిపోయాడు.

ఆ తరువాత అర్జునుడు మణిపురం చేరుకున్నాడు. అక్కడ చిత్రాంగద అను సర్వాంగ సుందరిని మోహించి, ఆమె తండ్రి చిత్రవాహనుడను రాజుకు పరిచయం చేయమని, తనకు జన్మించబోయే కుమారుడే రాజు అవుతాడనే ఒప్పందంతో చిత్రాంగదను పెండ్లి చేసుకొన్నాడు. కుమారుడు జన్మించిన తర్వాత అర్జునుడు మళ్ళీ బయలుదేరాడు.

అర్జునుడు తర్వాత అగస్త్య, సౌభద్ర, భారద్వాజ తీర్థాలను దర్శించాడు. అక్కడ స్నానం చేయబోగా అక్కడి ఋషులు అడ్డుకున్నారు. కాని ముందుగా సౌభద్ర తీర్థంలో దిగాడు. ఒక మొసలి వచ్చి పట్టుకొంది. దానిని బలంగా బయటకు లాగేసరికి, అది ఒక సౌందర్యవతిగా మారింది. అర్జునుడు అపుడు ఆ సుందరాంగి వృత్తాంతం అడుగగా, "అర్జునా! నేను కుబేరుని అప్సరసను. ఒకనాడు నేను నా స్నేహితురాళ్ళతో కుబేరుని వద్దకు వెళ్తూ దారిలో ఒక తాపసిని ఆటపట్టించబోగా, ఆయన మమ్మల్ని మొసళ్ళుగా పడివుండమని శపించాడు. శాపవిమోచనం గురించి నారద మహర్షి నడుగగా, అర్జునుని ద్వారా మీకు శాపవిమోచనం అవుతుందని చెప్పాడు. మిగతావారికి కూడ విమోచనం కలిగించండి అని అడుగగా, ఉలూచి వల్ల లభించిన వరప్రభావంతో, మిగతావారిని కూడ రక్షించి ముందుకు సాగాడు.

అర్జునుడు మళ్ళీ ఒకసారి మణిపురం వెళ్ళి, చిత్రాంగదను చూచి, తమకు జన్మించిన కుమారునికి భభ్రువాహనుడని పేరు పెట్టి గోకర్ణం వెళ్ళాడు. అక్కడినుండి ప్రభాసతీర్థానికి చేరేసరికి, శ్రీకృష్ణుడు కూడ అక్కడికి వచ్చివున్నాడు. ఆ నరనారాయణులు ఇద్దరూ చివరకు ద్వారకా నగరానికి చేరుకున్నారు. ఇద్దరూ ఎంతో సంతోషంగా కాలం గడవసాగారు. యాదవులు జరిపే ఉత్సవానికి కూడ ఇద్దరూ వెళ్ళారు. అక్కడ కృష్ణుని చెల్లెలు సుభద్ర ఉంది. ఆమె సౌందర్యానికి అర్జునుడు ముగ్ధుడై చూస్తూ వుండటం శ్రీకృష్ణుడు గమనించి, అర్జునునితో ఇలా అన్నాడు."అర్జునా! ఇక్కడ స్వయంవర ఆచారం ఉంది. కాని నిన్ను సుభద్ర వరిస్తుందని నేను అనుకోను. క్షత్రియ ధర్మం ప్రకారం బలపూర్వకంగా తీసికొని పోవడమనే వీలు ఉంది. నీకు ఈ రెండవ సూత్రం అనుకూలిస్తుది." అని అన్నాడు.

ఒకరోజు సుభద్ర పర్వతం మీద పూజ ముగించుకొని తిరిగి వచ్చే సమయంలో, అర్జునుడు ఆమెను తన బంగారు రథంపై కూర్చుండబెట్టుకొని నగరం వైపు వెళ్ళిపోయాడు. యాదవులకు తెలిసి యుద్ధానికి సిద్ధమైనారు. అపుడు కృష్ణుడు, "అర్జునుడు మనల్ని అవమానించ లేదు. మన వంశ గౌరవాన్ని చూచియే సుభద్రను అపహరించాడు. మిత్రభావంతో అర్జునునికి స్వాగతించడమే శ్రేయస్కరం" అని తన అన్న బలరామునితో అన్నాడు. అప్పుడు యాదవ వీరులందరు సుభద్రార్జునుల వివాహం ఘనంగా జరిపించారు. కొంతకాలం ద్వారకలోనే వుండి, 12 సం॥ల కాలం పూర్తి అయిన తర్వాత సుభద్రతో కలిసి అర్జునుడు ఇంద్రప్రస్థం చేరుకొన్నాడు. కొంతకాలానికి, సుభద్రకు జన్మించినవాడే అభిమన్యుడు. వేదాధ్యయనం తర్వాత అర్జునుడే అన్ని విద్యలు అభిమన్యునికి నేర్పించాడు. కృష్ణునితో సామ్యమును గడించాడు. ద్రౌపది వల్ల పాండవులకు అయిదుగురు పుత్రులు జన్మించారు. వారు క్రమంగా ప్రతివింధ్యుడు, సుతసోముడు, శుభకర్ముడు, శతానీకుడు మరియు శ్రుతసేనుడు అను పేర్లతో వాసికెక్కారు.

ఇంద్రప్రస్థంలో ధర్మరాజు పరిపాలన జనరంజకంగా సాగుతోంది. ఒకరోజు అర్జునుడు కృష్ణునితో యమునానదికి జలవిహారానికి వెళ్ళాడు. వారి సౌకర్యానికి ఘనమైన ఏర్పాట్లు జరిగాయి. కృష్ణార్జునులు ఉల్లాసంగా ఉన్నారు. ఇంతలో అక్కడికి బంగారు రంగుతో మెరుస్తూ, జటజూటములు గల ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. ఆ తేజోమూర్తిని చూచిన కృష్ణార్జునులు లేచి నిలబడ్డారు. ఆ బ్రాహ్మణుడు ఇలా అన్నాడు."మహావీరులారా! మీరిద్దరు ఈ ప్రపంచంలో తిరుగులేని మహావీరులై వున్నారు. నేను అనిల దేవుణ్ణి, భోజనప్రియుణ్ణి. మిమ్మల్ని

భిక్ష అడుగుటకు వచ్చాను.' అన్నాడు. వెంటనే కృష్ణార్జునులు ఎలాంటి భోజనమో చెపితే, తెచ్చిపెడతామన్నారు. నాకు మామూలు భోజనం అవసరం లేదు. నేను అగ్నిని కనుక నాకు అలాంటి భోజనమే కావాలి. నాకు ఈ ఖాండవ వనాన్ని దహించాలని ఉంది. కాని ఈ వనంలో తక్షకుడు వున్నాడు. ఇంద్రుడు ఆయనకు రక్షకుడు. నేను ఈ వనాన్ని దహించాలనుకున్నప్పుడల్లా, ఇంద్రుడు కుండపోత వర్షం కురిపిస్తున్నాడు. ఆ కారణంగా నేను కడుపు నిండా తినలేకపోతున్నాను. అందుకే మీ శరణు కోరాను. మీరు అస్త్రవిద్యా పారంగతులు. కనుక నేను భోజనం చేసేటప్పుడు వర్షం పడకుండా చూడండి, చాలు." అని అన్నాడు.

అపుడు జనమేజయుడు ప్రాణులతో నిండిన ఖాండవ వనాన్ని అగ్నిదేవుడు ఎందుకు దహించాలనుకొన్నాడు అని అడిగాడు.

వైశంపాయనుడు ఇలా చెప్పాడు. "పూర్వకాలంలో శ్వేతకి అనే గొప్ప రాజుండేవాడు. అతని యజ్ఞములు చేయించలేక ఋత్విజులు అలసి పోయేవారు. ఋత్విజులు లభించనందున, శ్వేతకి తపస్సు చేసి, శంకరుని మెప్పించి, ఒక మహాయజ్ఞాన్ని 12 సం॥లు చేయించాడు. ఆ కారణంగా ఆ రాజు స్వర్గం చేరుకున్నాడు. ఈ 12 సం॥లు అగ్నిదేవుడు నెయ్యి త్రాగి త్రాగి ఆయనకు అగ్నిమాంద్యం పట్టుకుంది. జీర్ణశక్తి నశించింది. బ్రహ్మకు విన్నవించుకొని, ఈ వనాన్ని దహించటానికి అనుమతి తీసుకొన్నాడు. ఏడుసార్లు ప్రయత్నించినా, వీలుపడలేదు. మళ్ళీ బ్రహ్మను కోరగా, కృష్ణార్జునుల శరణు కోరమని చెప్పాడు."

బ్రాహ్మణ వేషంలో వున్న అగ్నిదేవునితో అర్జునుడు ఇలా అన్నాడు. 'నా దగ్గర దివ్యాస్త్రాలున్నాయి. కాని ధనస్సు, రథం లాంటివి లేవు." అప్పుడు అగ్నిదేవుడు వెంటనే అక్షయ తూణీరం అనే అమ్ముల పొదిని, గాండీవం అనే ధనస్సును, రథాన్ని అర్జునునికి ఇచ్చాడు. శ్రీకృష్ణునికి పాంచజన్యం అనే శంఖాన్ని, సుదర్శనం అనే చక్రాన్ని ఇచ్చాడు.

కృష్ణార్జునుల అనుమతితో అగ్నిదేవుడు దావానలాన్ని రగిలిస్తూ చెలరేగి పోయాడు. ఖాండవ వనం మసై పోతుండగా, దేవతలు ఇంద్రుని వద్దకు వెళ్ళి విన్నవించుకున్నారు. ఇంద్రుడు వర్షం కురిపించసాగాడు. అర్జునుడు తన కౌశలంతో నీటి ధారలను ఆపేశాడు. కృష్ణార్జునులు ఇద్దరూ ఇంద్రుని ఎదుర్కొని, అగ్నిదేవునికి సాయం చేశారు. ఇంద్రుడు మహాకోపంతో శ్రీకృష్ణార్జునుల వైపు వజ్రాయుధాన్ని ప్రయోగిస్తూ "వీరిద్దరూ తక్షణమే మరణించెదరు." అని ఎలుగెత్తి అరిచాడు. అదే సమయంలో ఆకాశవాణి "ఓ ఇంద్రా! నీ మిత్రుడు తక్షకుడు కురుక్షేత్రానికి వెళ్ళాడు. నీవు కృష్ణార్జునులను ఓడించలేవు. వారు అజేయులు." అన్నది. ఈ మాటలు విని ఇంద్రుడు తన యుద్ధాన్ని ఆపి వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

ఖాండవవనం పూర్తిగా దగ్ధమై పోయింది. మయుడు పారిపోవటం చూచి శ్రీకృష్ణుడు చక్రాన్ని ఎత్తాడు, వెనుక అగ్నిదేవుడు తరిమితే, మయుడు "ఓ వీర అర్జునా! నీ శరణు కోరుతున్నాను. నీవు తప్ప నన్నెవరూ రక్షించలేరు.' అన అనగా అర్జునుడు 'భయపడకు' అని అన్నాడు. శ్రీకృష్ణుడు, అగ్నిదేవుడు ఆగిపోయారు. మయుడు రక్షించబడ్డాడు. అగ్నిదేవుని ప్రార్థించిన అశ్వసేన సర్పము, నాలుగు సారంగ పక్షులు బ్రతికాయి. వీటి తండ్రి మందపాలుడు అనబడే పెద్ద పక్షి అగ్నిదేవుని ప్రార్థించాయి.

-o0o-

2. సభాపర్వం

మయసభ ఏర్పాటు – నారద మహర్షి ప్రవచనాలు :

శ్రీకృష్ణుని దగ్గర అర్జునుడు కూర్చొని వున్నాడు. మయాసురుడు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! శ్రీకృష్ణ చక్రం నుండి, అగ్నిదేవుని జ్వాలల నుండి మమ్మల్ని రక్షించారు. మీకు ఎలాంటి సేవ చేయాలో చెప్పండి." అర్జునుడు బదులుగా, "ఓ అసురా! నా సేవ వినియోగించుకొని నాకు మేలు చేశావు. నీవు వెళ్ళవచ్చు" అన్నాడు. కాని మయాసురుడు ఇలా పట్టుపట్టాడు– "కుంతీపుత్రా! మీరు మీ స్థాయికి తగ్గట్లు చెప్పారు. నేను విశ్వకర్మ అనే ప్రసిద్ధ శిల్పిని. నా సేవలు స్వీకరించండి. 'నీ సేవను నేను స్వీకరించలేను నేను చేసిన సాయానికి ప్రతిఫలంగా. కృష్ణుని అడుగు" అన్నాడు అర్జునుడు. అపుడు శ్రీకృష్ణుడు "ఓ మయాసురా! నీవు ధర్మరాజు కోసం ఒక సభా భవనాన్ని నిర్మించి ఇవ్వు. నీవు నేర్పరివి కనుక ఆ భవనాన్ని దేవతలు, చతుర శిల్పులు మెచ్చుకొనేటట్లు'గా వుండాలి.' అని చెప్పి, మయుణ్ణి తీసుకొని అర్జునునితో సహా కృష్ణుడు, ధర్మరాజు దగ్గరకు వెళ్ళాడు. ధర్మరాజు కూడా సమ్మతించడంతో పదివేల మూరల చతురస్రాకార నేలను కొలవటం జరిగింది భవన నిర్మాణం కోసం. శ్రీకృష్ణుడ పాండవలనుండి వీడ్కోలు తీసుకొని ద్వారక వెళ్ళాడు. యదువీరుల స్వాగతాన్ని స్వీకరించి, శ్రీకృష్ణుడు నేరుగా రుక్మిణి యొక్క అంతఃపురంలోకి వెళ్ళాడు.

అర్జునుని అనుమతితో మయుడు మైనాక పర్వతం పైకి వెళ్ళి, అచ్చట తాను మునుపు పెట్టి ఉంచిన దేవదత్త శంఖాన్ని, గదను తీసుకొని వచ్చి అర్జునునకు, భీమునకు ఇచ్చాడు. తర్వాత 14 నెలల్లో ఒక దివ్యభవనాన్ని నిర్మించి ధర్మరాజుకు తెలిపాడు. ధర్మరాజు సంతసించి, 10 వేల మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టించి, గోవులను దానం చేశాడు. వేదవ్యాసుడు, జైమిని, యాజ్ఞవల్క్యుడు మొదలైన ఋషులను స్వాగతించాడు. నారద మహర్షి వచ్చాడు. దేవతలు కూడ ఆ మహర్షిని పూజించారు. ఆ మహర్షి ధర్మరాజును ఆశీర్వదించగా, నారదుడు లేచి నమస్కరించి, యోగ్యమైన ఆసనంపై కూర్చోబెట్టాడు. నారదుడు పాండవులకు ధర్మార్థ కామమోక్షములపై ఉపదేశించ ప్రారంభించాడు ఇలా – "ధర్మరాజా! ధర్మార్థ కామాల కొరకు ప్రత్యేక సమయాన్ని కేటాయించారుకదా! రాజులైన వారికి వ్యాఖ్యాన శక్తి, వీరత్వము, మేధావితనము, పరిణామదర్శిత నీతి నిపుణత మరియు కర్తవ్యాకర్తవ్య వివేకము అను ఆరు గుణాలు కలిగి ఉండాలి. దీనికి తోడు మంత్రము, ఓషధి, ఇంద్రజాలము, సామము, దానము, దండము మరియు భేదము అను ఉపాయాలు కూడ అనుసరించాలి. అంతేకాదు,, మీ మంత్రులలోనే మీవలెనే జ్ఞాన వృద్ధులై, తెలివిగలవారై, పుణ్యాత్ములై, కులీనులై, అందరిని ప్రేమించే స్వభావం కలవారై ఉండాలి. మీ సేనాపతులు తేజోశీలురై, బుద్ధిమంతులై, వీరులై, పవిత్రులై, స్వామిభక్తి కలిగి, చతురులై ఉండాలి. మనలో ఉన్న ఆరు దోషాలు నిద్ర, సోమరితనం, నిర్లక్ష్యం, భయం, క్రోధం, మృదుత్వం, దీర్ఘకాలిక ప్రణాళికలను విడిచి పెట్టాలి.' అన్నీ వినిన తరువాత, ధర్మరాజు ఆ ఉపదేశాలను పాటిస్తామని చెపుతూ – "దేవా! మీరు అన్ని లోకాల్ని దర్శిస్తుంటారు కదా! ఈ మయసభను మించిన నిర్మాణాన్ని ఎక్కడైనా చూశారా? దయచేసి తెలుపమని అడుగగా, నారదుడు మానవలోకంలో ఇంతటి భవనం ఉన్నదని నేను వినలేదు, చూడలేదు. బ్రహ్మ, ఇంద్రుని, కుబేరుని యొక్క భవనాలు లౌకికంగానే కాక, అలౌకిక కళలతో కూడి ఉంటాయి." అని అన్నాడు.

పితృలోకంలో మా తండ్రి పాండురాజు కనిపించాడా అని ధర్మరాజు నారదుని అడిగితే, "ధర్మరాజా! రాజసూయ యాగం చేసి హరిశ్చంద్రుడు ఇంద్రలోకంలో ఉండగా, మీ తండ్రి చూశారు. ఈ మానవ లోకానికి

వస్తున్న నాతో మీకు సందేశం పంపారు. అ సందేశం ఇలా ఉంది. "ఓ ధర్మరాజా! నీ సోదరులు నీతోనే ఉన్నారు. భూమండలాన్ని జయించే శక్తి నీకున్నది. నీవు నా కుమారుడవు. నాకొరకు నీవు రాజసూయ యాగాలు చేస్తే, నేనుకూడ ఇంద్రలోకంలో హరిశ్చంద్రుని వలె ఆనందిస్తాను." అనేది ఆ సందేశం. ఈ సందేశాన్ని మీకు చేరుస్తానని, మాట ఇచ్చాను కూడ. కనుక మీరు మీ నాన్నగారి ఆశు నెరవేర్చండి. దానివలన మీకుకూడ ఉన్నత స్థాయి లభిస్తుంది. ఈ పనిలో అడ్డంకులు వస్తాయి. ముందే ఆలోచించుకోండి. అన్ని వర్ణాలవారిని సంతోష పెట్టండి. నాకు అనుమతిస్తే, నేను ద్వారక వెళ్ళి శ్రీకృష్ణుని దర్శించుకొంటాను." అని నారదుడు చెప్పి, తోటి ఋషులతో కలిసి వెళ్ళిపోయాడు.

ఇక జరాసంధుని గురించి, అతని వధను గురించి తెలుసుకొందాం.

ధర్మరాజు, నారదుడు వెళ్ళిన తర్వాత, రాజసూయ యాగం గురించి, మంత్రులతో, సామంతులతో, సోదరులతో ముచ్చటించ సాగాడు. చివరగా శ్రీకృష్ణుని వద్దకు ఒక దూతను పంపాడు ధర్మరాజు. శ్రీకృష్ణుడు రాగా ధర్మరాజు ఇలా చెప్పాడు. "కృష్ణా! నేను రాజసూయ యాగం చేయాలనుకొంటున్నాను. నావల్ల అవుతుందో లేదో చెప్పు." అని అడిగాడు.

సమాధానంగా శ్రీకృష్ణుడు "మహారాజా! నీవు సకల సద్గుణ భూషితుడవు. మీరు ఆ యజ్ఞానికి అర్హులు. మీకు అన్నీ తెలుసు. అడిగారు కనుక చెప్తాను.

ఈ సమయంలో మగధ రాజైన జరాసంధుడు రాజులందరిని ఓడించి, వారిని బంధించి, వారిచే సేవలు చేయించుకొంటున్నాడు. అతనికి బలరాముడు, శిశుపాలుడు కూడ లోబడినారు. భగదత్తుడు మీ తండ్రికి స్నేహితుడు, బలశాలియై కూడ అతని అధీనంలో ఉన్నాడు. జరాసంధుని సైన్యాన్ని మూడువందల సంవత్సరాలు కోతకోసినా అందరూ చావరు. శంకరుని ఉపాసనే అందుకు కారణం. అతడు కూడ ఆ రాజుల సహాయంతో రాజసూయయాగం చేయుటకు సిద్ధంగా ఉన్నాడు. కనుక ముందు వాని దగ్గర బందీలుగా ఉన్న రాజులను విడిపించటం ముఖ్యం. ధర్మరాజా! ప్రథమంగా నీవు జరాసంధుని వధించడం అవసరం. మీరు అన్నీ ఆలోచించి, నిర్ణయించుకోండి." అని చెప్పగా, ధర్మరాజు ఇలా అన్నాడు. "శ్రీకృష్ణా! నీవంటి వారు ఈ భూమండలంలో ఎవరూ లేరు. నేను జరాసంధునికంటె బలశాలినని చెప్పలేదు. నా ఆలోచన ప్రకారం, నీవు, బలరాముడు, భీముడు లేదా అర్జునుడు ఎవరో ఒకరు జరాసంధుని వధించగలరు. ప్రస్తుతం ఏమి చేయాలో సెలవివ్వు." అని అన్నాడు.

ధర్మరాజు మాటలు విన్న భీమసేనుడు ఇలా అన్నాడు. "సోదరా! కృష్ణుని దగ్గర నీతి వుంది, నాలో బలం ఉంది, అర్జునునిలో విజయం సాధించగల అర్హత, నేర్పు వుంది. మేం ముగ్గురం కలిసి జరాసంధుని హతమారుస్తాం."" అపుడు శ్రీకృష్ణుడు "ఓ రాజా! మీలో జయించే తత్వం వుంది. తపోశక్తి ఉంది. అన్ని గుణాలు సమృద్ధిగా ఉన్నాయి. కాని జరాసంధునిలో బలం అనే ఒక్క గుణమే ఉంది. అతడి వద్ద వున్న 56 మంది రాజులు కూడ అసంతృప్తితోనే ఉన్నారు వారిని కూడ చంపాలనుకొంటున్నాడు. కనుక జరాసంధుని వధ అనివార్యం." అప్పుడు ధర్మరాజు "శ్రీకృష్ణా! జరాసంధుడు అసామాన్యుడని తెలిసి కూడ నేను నా స్వార్థం కొరకు మిమ్ము, భీమసేనుని ఎలా వినియోగించ గలను? మీరందరు నా కళ్ళు, మిమ్మల్ని వదిలి ఎలా బ్రతకగలను? యజ్ఞం చేయాలనే తపన నాకు లేదు. ఆ నిర్ణయానికి వచ్చాను." అన్నాడు. అర్జునుడు "ఓ సోదరా! నేను సర్వసన్నద్ధంగా ఉన్నాను. రాజసూయం కారణంగా జరాసంధుణ్ణి వధించి, ఆ రాజులను విడిపిస్తే, మన కీర్తి వర్ధిల్లగలదు." అని అన్నాడు.

అపుడు శ్రీకృష్ణుడు "ధర్మరాజా! అర్జునుడు వీరోచితంగా మాట్లాడాడు. విధి, నీతి ననుసరించి యుద్ధం చేయాలి. గెలిస్తే ఈ లోకం, విఫలమైతే పరలోకం రెండూ సమ్మతమే కదా!" అని చెప్పాడు. అందుకు ధర్మరాజు జరాసంధుని గురించిన వివరాలు చెప్పమని కృష్ణుని అడిగాడు.

శ్రీకృష్ణుడు ఇలా చెప్పసాగాడు. "ధర్మరాజా! పూర్వం మగధ రాజ్యాన్ని బృహద్రధుడను రాజు పాలించేవాడు. అతడు వీరుడు, ధనవంతుడు, శక్తిసంపన్నుడు, తేజోశాలిగా ఉన్నాడు. అతడు కాశీరాజు కుమార్తెలను పెండ్లాడి, సమదర్శిగా ఉంటానని మాట ఇచ్చాడు.

బృహద్రధునకు సంతానం కలగని కారణంగా, చండకౌశిక ఋషిని దర్శించుకున్నాడు. ఋషి వరం కోరుకోమన్నాడు. కుమారునిమ్మని కోరాడు. అదే సమయంలో చెట్టుపై నుండి ఒక పండు ఋషి ఒడిలో పడింది. ఋషి ఆ పండును రాజుకిచ్చాడు. రాణులు చెరిసగం తినగా, వారు గర్భవతులైనారు. రాజు సంతోషించాడు. వారిద్దరు సగం సగం శిశువులను కన్నారు. రాణులకు భయం వేసి, దాసీల చేత ఆ సజీవ శిశువులను బయట పడవేయించారు.

ఓ రాజా! ఆ రాజ్యంలో 'జర' అనే రాక్షసి ఉండేది. రక్తమాంసాల రుచి తెలిసినది కావున శిశువు యొక్క రెండు భాగాలను కలిపి, తీసికొని వెళ్ళాలనుకుంది. అలా కలపగానే, మహాబలుడైన రాకుమారునిగా మారిపోయాడు ఆ శిశువు. ఆ బాలుడు ఏడ్వసాగాడు. ఆ శబ్దం విని రాజు, రాణులు చూడటానికి వచ్చారు. ఆ రాక్షసి మానవ స్త్రీగా మారి "రాజా! ఈ మీ కుమారుణ్ణి తీసుకోండి. నేను రక్షించాను. రాణులు ఆ శిశువును అందుకొన్నారు. రాజు రాక్షసిని అడుగగా, రాక్షసి 'నేను జర అనే రాక్షసిని, మీ బాలుని మీకు అప్పగించాను' అని అదృశ్యమై పోయింది. రాజు ఆ బాలునికి జరాసంధుడు అని నామకరణం చేశాడు.

కొంతకాలానికి చండకౌశికుడు తిరిగి వచ్చి, బృహద్రధునితో ఇలా అన్నాడు. 'ఓ రాజా! నీ కుమారుడు తేజోశాలి, ధీశాలి. దేవతల అస్త్రాలు కూడ అతనిని ఏమీ చేయలేవు. జరాసంధుని ఆరాధిస్తే, పరమేశ్వరుడే ప్రత్యక్షమౌతాడు' అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత బృహద్రధుడు జరాసంధునికి పట్టాభిషేకం చేసి, సతీసమేతంగా అడవికి వెళ్ళిపోయాడు." అని చెప్పి, "ఓ ధర్మరాజా! కంసుడు నాశనమైనాడు. ఇపుడు జరాసంధుని మరణమాసన్నమైంది. దేవదానవులు కూడ వానిని చంపలేరు. కాని నేను అనుసరించే నీతి, భీముని బలము, అర్జునుని రక్షణ కలిసి జరాసంధుని చంపగలవు." అని అన్నాడు.

ధర్మరాజు "శ్రీకృష్ణా! నీవు మా స్వామివి. మేము నీ ఆశ్రితులం, సేవకులం. నీ కోరిక ప్రకారమే కానివ్వు" అని అన్నాడు.

ఆ తర్వాత కృష్ణుడు, భీముడు, అర్జునుడు మగధకు ప్రయాణమైనారు. మగధ రాజధానికి చేరుకోగానే, ఒక బురుజును పగలగొట్టి, వీరు ముగ్గురు తాపసుల వేషంలోలోనికి వెళ్ళారు. శ్రీకృష్ణ భీమర్జునులు నిశ్చయంగా జరాసంధుని దగ్గరకు చేరారు. వీరిని చూచి జరాసంధుడు వీరికి సత్కారం చేశాడు. పిదప జరాసంధుడు వారిని "ఓ బ్రాహ్మణులారా! మీరు విపరీతంగా కన్పిస్తున్నారు. సింహద్వారం గుండా కాకుండా బురుజును పగలగొట్టి వచ్చారు. ధనుస్సును ధరించిన లక్షణాలు ఉన్నాయి. మీరు ఎవరో, ఏ కోరిక కోరను వచ్చారో చెప్పండి." అని అడిగాడు. అపుడు శ్రీకృష్ణుడు గంభీర స్వరంతో "స్నాతక వేషంలో బ్రాహ్మణ, క్షత్రియులు, ధీరులు ఎవరైనా ఉండవచ్చు. వీరులు శత్రువుల వద్దకు సింహద్వారం గుండా రారు."' అని అన్నాడు. జరాసంధుడు "నన్ను

ఎందుకు శత్రువుగా భావిస్తున్నారు?"" అని అడిగాడు. శ్రీకృష్ణుడు 'రాజా! నీవు మంచిరాజువై ఉండి కూడ నిరపరాధులైన రాజులను హింసించుట నేరం కాదా? క్షత్రియులకు మేలు చేయాలని, నిన్ను చంపాలని మేము వచ్చాము. మేము బ్రాహ్మణులం కాము. నేను శ్రీకృష్ణుణ్ణి, వీరిద్దరు భీమార్జునులు. బంధితులైన రాజులను విడిచి పెట్టు, లేదా మాతో యుద్ధం చేసి పరలోకానికి వెళ్ళు. అంతే" అని గద్దించాడు.

అందుకు జరాసంధుడు 'ఓ వాసుదేవా! నేను ఏ రాజులను జయించకుండా తీసుకొని రాలేదు. నీకు భయపడను. విడిచి పెట్టను. మీ ముగ్గురే కాదు, ఎవరు వచ్చినా భయం లేదు." అని వెంటనే జరాసంధుడు తన కుమారునికి పట్టాభిషేక ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపించాడు.

శ్రీకృష్ణుడు జరాసంధునితో 'నీవు ఎవరితో యుద్ధం చేస్తావు?' అని అడుగగా భీమునితోనని అతడు చెప్పాడు. 'భీమసేనా, రా, నీతో యుద్ధం చేసి ఓడిపోయినా కీర్తి మిగులుతుంది.' అన్నాడు. భీమసేనుడు శ్రీకృష్ణుని అనుమతితో రంగంలోకి దిగాడు. వారిద్దరూ ఒకరికొకరు పాదాభివందనం చేసుకొన్నారు. ఇద్దరూ ఒకరినొకరు ఢీకొన్నారు. దానిని చూచుటకు పురవాసులు వచ్చారు. ఇద్దరూ ఆకలిదప్పులు మాని భీకర యుద్ధాన్ని 13 రోజులు చేశారు. 14వ రోజు రాత్రికి జరాసంధుడు బలహీనుడైనాడు. అపుడు శ్రీకృష్ణుడు భీమునితో 'నీలో దైవ, వాయుబలాలు రెండూ ఉన్నాయి. రెండింటినీ ఒక్కటిగా చేసి చూడు' అగానే భీముడు వానిని నేలకేసి బాదాడు. పలుభంగిమలలో చరిస్తూ, భీముడు జరాసంధుని శరీరాన్ని రెండు ముక్కలుగా చీల్చి, విరుద్ధ రీతిలో వాటిని అవతల పడవేశాడు. ముక్కలు అతుకు పడక శరీరం మరణించింది. జనం ఈ భయంకర దృశ్యం చూచి పరుగులు పెట్టారు.

జరాసంధుని మృతదేహాన్ని అంతఃపుర ద్వారం దగ్గర పెట్టి జరాసంధుని రథముపై, బందీలుగా వున్న రాజుల వద్దకు వెళ్ళి వారిని విడిపించాడు. ఆ రాజులు విడుదలై సంతోషిస్తూ, మీకు మేం ఏమి చేయగలం? అని శ్రీకృష్ణార్జునులను అడిగారు. అపుడు శ్రీకృష్ణుడు "రాజులారా! ధర్మరాజు రాజసూయ యాగం చేయబోతున్నాడు. మీరందరు సహకరించండి." అని అనగానే, వారందరు సంతోషంతో సమ్మతించారు.

ఈ ముగ్గురు ఇంద్రప్రస్థం చేరుకోగా, ధర్మరాజు మిక్కిలి సంతోషించాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజు అనుమతి తీసుకొని వెళ్ళిపోయాడు.

ఇక పాండవుల దిగ్విజయ యాత్ర గురించి తెలుసుకొందామా!

ఒకరోజు భీమార్జున నకుల సహదేవులు దిగ్విజయ యాత్రకు అనుమతి ఇవ్వమని ధర్మరాజును కోరారు. సైన్యంతో ఒక్కొక్కరు ఒక్కొక్క దిశకు వెళ్ళమని ధర్మరాజు వారికి చెప్పాడు. భీముడు తూర్పు దిశకు వెళ్ళాడు. ముందుగా పాంచాల దేశ రాజు సహధర్ముడు భీమునితో బాహుయుద్ధం చేసి ఓడిపోయాడు. కాని అతని పరాక్రమాన్ని మెచ్చుకొని, భీముడు అతనిని తన సేనాధిపతిగా నియమించుకొన్నాడు. తరువాత విదేహాధిపతి బృహద్బలుని, దశార్ణ దేశ రాజు దీర్ఘయజ్ఞుని సునాయాసంగా ఓడించి ముందుకు సాగాడు భీముడు. మిథిలా దేశాన్ని జయించి, కిరాతరాజులను వశపరచుకొన్నాడు. చాలమంది రాజులు స్వయంగానే లొంగిపోయారు. వారు సమర్పించిన సంపదను తెచ్చి, ధర్మరాజుకు సమర్పించాడు భీముడు.

అర్జునుడు ఉత్తర దిక్కుకు బయలుదేరాడు. కాలకూట, కళింగ దేశాలను సునాయాసంగా వశం చేసికొన్నాడు. శాకల ద్వీప రాజు పోరాడి, నిలువలేక ఓడిపోయాడు. భగదత్తునితో 8 రోజులు యుద్ధం చేశాడు.

తరువాత కూడ అర్జునుని వీరోచిత పోరాటం చూచి, భగదత్తుడు ఇలా అన్నాడు. 'ఓ మహారాజా! నీవు ఇంద్రుని కుమారుడవు కదా! నీ పరాక్రమం గొప్పగా ఉంది. ఇంద్రుడు నాకూ స్నేహితుడే, నేను అంతటి శక్తివంతుణ్ణి. అందుచేత నేను నీతో యుద్ధం చేయను. నీ కోరిక చెప్తే నేను తీరుస్తాను.' అన్నాడు. అందుకు అర్జునుడు 'మా సోదరుడు ధర్మరాజు రాజసూయ యాగం చేయబోతున్నాడు. నా సోదరుడు చక్రవర్తి కావాలి. కనుక మీరు కప్పం కట్టండి.' అన్నాడు. అపుడు భగదత్తుడు 'అర్జునా! ధర్మరాజు కూడ నాకు ప్రియుడే! నీకోరిక తీరుస్తాను. ఇంకేమైనా వుంటే అడుగు.' అని అన్నాడు. అపుడు అర్జునుడు భగదత్తునికి కృతజ్ఞతలు చెప్పి, ముందుకు సాగాడు.

క్రమంగా మోచాపురం, వాసుదేవం మరియు సుధామంలను వశం చేసుకొన్నాడు. కాశ్మీరులో లోహితుడు అనే రాజును అధీనంలోకి తెచ్చుకొన్నాడు. సగర్త రాజు శరణాగతుడైనాడు. హిమాలయాలపై విజయకేతనం ఎగురవేసి, సైన్యాన్ని నిలిపాడు. తర్వాత మానస సరోవరం చేరాడు. ఋషుల ఆశ్రమాలను దర్శించుకొని, చుట్టుప్రక్కల ప్రాంతాలను వశం చేసికొన్నాడు. తరువాత హరివర్షాన్ని జయించాలని అక్కడికి వెళ్ళాడు. అక్కడి మహావీరులందరూ స్వయంగా లొంగిపోయి, ధనరాసులు సమర్పించుకొని, అర్జునుని సాగనంపారు.

సహదేవుడు కూడ సైన్యంతో దక్షిణ దిక్కుకు వెళ్ళాడు. మధుర, మత్స్య దేశాలను జయించాడు. రుక్మి మరియు భీష్మకుని వద్దకు రాయబారులను పంపి, తన పక్షం చేసుకొన్నాడు. తర్వాత లంకాధిపతియైన విభీషణుని వద్దకు దూతను పంపగా, అతడు ఆమోదించాడు. రాజులు సమర్పించిన కానుకలను తెచ్చి ధర్మరాజుకు అర్పించాడు.

రాజసూయ యాగం ప్రారంభం, విశేషాలు, శ్రీకృష్ణునికి అగ్రపూజ మున్నగు విషయాలను తెలుసుకొందాం.

దిగ్విజయ యాత్రలతో ధర్మరాజు కోశాగారం నిండిపోయింది. ఇదే యజ్ఞ ప్రారంభానికి మంచి సమయమని అందరూ చెప్పారు. అప్పటికే శ్రీకృష్ణుడు కూడ ఇంద్రప్రస్థానికి చేరాడు. ధర్మరాజు వెంటనే తన సోదరుల తోడ్పాటుతో ధౌమ్యుడు, వేదవ్యాసుడు మరియు ఇతర ఋషులతో పాటు శ్రీకృష్ణుని వద్దకు చేరాడు. రాజసూయ యజ్ఞానికి అనుమతి కోరాడు. యాగదీక్ష తీసికోమని శ్రీకృష్ణుడు చెప్పాడు.

వేదవ్యాస మహర్షి బ్రహ్మగా, సుసాముడు ఉద్గాతగా, యాజ్ఞవల్క్యుడు ఆధ్వర్యుడుగా, ధౌమ్యుడు హోతగా యాగ నిర్వహణకు నిశ్చయించుకొన్నారు. ధర్మరాజు యజ్ఞదీక్ష తీసికొన్నాడు. భీష్ముని, ధృతరాష్ట్రుని తీసికొని వచ్చుటకు నకులుని హస్తినకు పంపారు. అనేక రాజాధిరాజులు ఇంద్రప్రస్థానికి వచ్చారు. వసతులు కల్పించారు అందరికి. ద్రోణుడు, విదురుడు, దుర్యోధనుడు, కర్ణుడు, అశ్వత్థామ, భగదత్తుడు, శ్రీకృష్ణుడు మున్నగువారు తమకు తామే వసతులను సమకూర్చుకున్నారు. అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

యజ్ఞాంతంలో సత్కారమునకు యోగ్యులైన మహర్షులను, బ్రాహ్మణులను, యజ్ఞశాల యొక్క అంతర్వేదిలోనికి అనుమతించారు. నారద మహర్షితో సహా ఎందరో రాజర్షులతో ప్రాంగణం శోభాయమానంగా వెలుగొందుతోంది.

నారద మహర్షి అంతరంగంలో ఆలోచనలు ఎక్కువగా ఉన్నాయి. కారణం సర్వవ్యాపకడు, అంతర్యామియైన నారాయణుడు సామాన్య బ్రాహ్మణులతో పాటు కూర్చొని వున్నాడు. భీష్ముడు, ధర్మరాజుతో సర్వశ్రేష్ఠుడికి మొదటి పూజ అందించమని చెప్పాడు. ఎవరో మీరే చెప్పండని ధర్మరాజు భీష్ముని అడిగాడు. ఇక్కడ ఉన్నవారిలో తేజోవంతుడు, దేదీప్యమానంగా వెలుగొందువాడు శ్రీకృష్ణుడే గదా అని చెప్పాడు. అపుడు శ్రీకృష్ణునికి విధివిహితంగా

అర్ఘ్యప్రదానం చేయబడింది. దానిని శ్రీకృష్ణుడు స్వీకరించాడు. దానితో అక్కడ ఆనందమే ఆనందం.

శ్రీకృష్ణుని అగ్రపూజను శిశుపాలుడు వ్యతిరేకించడం, అతని విశేషాలు, మరణం గురించి తెలుసుకొందాం.

చేది రాజు శిశుపాలుడు శ్రీకృష్ణుని అగ్రపూజను వ్యతిరేకించాడు. భీష్ముని, ధర్మరాజును దోషులుగా తేల్చాడు. కృష్ణుడు అనర్హుడన్నాడు. పాండవులకు రాజ్యకాంక్ష నశించలేదన్నాడు. కృష్ణుడు రాజు కాదు, వృద్ధుడు కాదు, వేదవ్యాసుని మరచారా, భీష్ముడుండగా కృష్ణుని పూజించడమేమిటి, మహామహులుండగా, కృష్ణ పూజ మహాపాపం కాదా, ఓ ధర్మరాజా! నివు కృష్ణ పూజచేసి ధర్మవిరహితుడవైనావు అని ఏమేమో మాట్లాడాడు.

శ్రీకృష్ణుని ఉద్దేశించి కూడ, పాండవులు తెలివితక్కువ పనులు నీవు సమర్థించవద్దు. నీవు ఆతిథ్యానికి తగనివాడవని తెలిసి ఎలా స్వీకరించావు, నపుంసకునకు పెళ్ళి, గ్రుడ్డిదానికి అద్దం చూపినట్లుంది ఈ పూజ' అని అన్నాడు.

వెంటనే ధర్మరాజు, భీష్ముడు కల్పించుకొని, "శిశుపాలా! నీవు చెప్పేది సరిగా లేదు. శ్రీకృష్ణుడు త్రిలోకాల్లో శ్రేష్ఠుడు. వేదములలో అగ్నిహోత్రం, ఛందస్సులో గాయత్రి, మానవులలో రాజు, నక్షత్రాల్లో చంద్రుడు, పక్షులలో గరుడపక్షి ఎలా శ్రేష్ఠమైనవో, అలాగే త్రివిధ గతులలో శ్రీకృష్ణుడే సర్వశ్రేష్ఠుడైన వాడు." అని అన్నారు.

తర్వాత సహదేవుడు మిగతా బ్రాహ్మణులకు, క్షత్రియులకు పూజచేయగా, పూజా కార్యక్రమం సమాప్తమైంది.

కాని శిశుపాలుని క్రోధం కట్టలు తెంచుకొంది. నేను సేనాధిపతిగా ఉంటాను. అందరూ యుద్ధానికి సిద్ధం కండి అని అన్నాడు.

ఈ మాటలు విని భయపడిన ధర్మరాజు భీష్ముని అడుగగా, 'ఏమీ భయం లేదు. సింహం ఎదురు నిల్చున్నపుడే, కుక్క మొరిగేది, అలాగే శ్రీకృష్ణుడు మౌనంగా ఉన్నంతవరకే, ఈ రాజుల కేకలు' అని అన్నాడు.

శిశుపాలుడు ఈ మాటలకు ఆగ్రహించి, 'సిగ్గులేదా భీష్మాచార్యా! గర్వపోతు అయిన శ్రీకృష్ణుని ప్రశంసిస్తుంటే, నీ నాలుక ముక్కలు కాలేదా? ఏదో పక్షిని, గుర్రాన్ని, ఎద్దును చంపాడంటే, అదేమి గొప్ప? గోవర్ధన పర్వతాన్ని ఎత్తాడంటే, అదేమైనా అలౌకిక విషయమా? పూతనను చంపినవాడు ధర్మవంతుడా? భీష్మా! నీవు నీచుడవు. దుష్కర్మలు చేశావు. కాశీకన్యలను అపహరించుట నీకు ధర్మమా? నీవు మూర్ఖుడవు. ఈ కృష్ణుడు భీమార్జునులను తీసుకొని వెళ్ళి జరాసంధుని అంతం చేశాడు.' అని అన్నాడు. భీష్ముడు అడ్డుకున్నాడు. 'వదలిపెట్టు, నేను మసిచేస్తాను భీముణ్ణి' అని శిశుపాలుడు హుంకరించాడు, హెచ్చరించాడు.

భీష్మ పితామహుడు శిశుపాలుని గురించి ఇలా చెప్ప నారంభించాడు. 'ఈ శిశుపాలుడు చేది రాజవంశంలో పుట్టాడు. పుట్టుకతోనే మూడు కళ్ళు, నాలుగు భుజాలున్నాయి. ఎవరు ఎత్తుకోగానే, అదనంగా ఉన్న కన్ను మరియు భుజాలు తొలగిపోవునో అతనిచే చంపబడతాడు. తల్లి ఇతనిని ఎత్తుకోమని చాలమందిని కోరింది. ఒకసారి కృష్ణుడు, బలరాముడు వచ్చారు. శ్రీకృష్ణుని చేతికివ్వగానే, ఆ కన్ను, భుజాల తొలగిపోయాయి. శిశు పాలుని తప్పులు క్షమించమని తల్లి కృష్ణుని అర్థించింది. సరే వంద తప్పుల వరకు క్షమిస్తానని శ్రీకృష్ణుడు అభయ మిచ్చాడు. భీమసేనా! ఈ మూర్ఖుడు కొన్ని క్షణాల్లో చనిపోబోతున్నాడు' అని చెప్పినది శిశుపాలునికి అర్థం కాలేదు. ఇంకా 'ఓ కృష్ణా! నిన్ను ఈ పాండవులను తుదముట్టిస్తాను' అని పట్టరాని కోపంతో ఊగిపోతున్న శిశు పాలుని చూచి, శ్రీకృష్ణుడు సభ నుద్దేశించి, 'ఓ రాజులారా! ఇతడు మమ్మల్ని శత్రువుల్లా చూస్తున్నాడు. యాదవులను

నాశనం చేయాలనుకున్నాడు. భోజరాజును యిబ్బంది పెట్టాడు. యజ్ఞం చేస్తున్నపుడు అశ్వాన్ని దొంగిలించి, భభ్రు యొక్క భార్యను మోహించి బలవంతంగా తీసికొని వెళ్ళాడు. భద్రను మారువేషంలో వచ్చి దొంగిలించాడు. ఈ విషయాలు నన్ను బాధించేవే. ఎంతో అహంకారంగా వాగాడు. నేను సహించలేను' అనగా వినిన శిశుపాలుడు ఇంకా హుంకరించగా, శ్రీకృష్ణుడు చక్రాన్ని స్మరించాడు. చక్రం చేతికి రాగా, 'ఓ రాజులారా! నేను వీని తల్లికి ఇచ్చిన వరాన్ని బట్టి 100 తప్పులు క్షమించాను. ఇక శిక్షించక తప్పదంటూ శ్రీకృష్ణుడు చక్రాన్ని ప్రయోగించాడు. చక్రం శిశుపాలుని శిరస్సును ఖండించింది. అందరూ శ్రీకృష్ణుని స్తుతించారు. రాజసూయ యాగం ముగిసింది.

వేదవ్యాస మహర్షి భవిష్యత్తును గురించి ఏమి చెప్పాడో తెలుసుకుందాం.

యాగం దిగ్విజయంగా ముగిసింది. రాజులందరు వీడ్కోలు తీసికొని వెళ్ళిపోతున్నపుడు భీమార్జునులు వారిని కొంతదూరం తోడుగా వెళ్ళి సాగనంపారు. తర్వాత శ్రీకృష్ణుడు, కుంతి మరియు పాండవుల దగ్గర వీడ్కోలు తీసుకొని ద్వారాకకు ప్రయాణమైనాడు.

దిగ్విజయంగా దుర్లభమైన యాగం పూర్తి కావడంతో, వేదవ్యాస మహర్షి శిష్యులతో పాటు ధర్మరాజు దగ్గరకు వచ్చాడు. ధర్మరాజు, సోదరులందరూ నిలిచి నమస్కరించి, పూజాదికాలు నిర్వహించారు. వ్యాసమహర్షి బంగారు సింహాసనంపై కూర్చొని, పాండవులనూ కూర్చోమని ఆదేశించాడు. వ్యాస మహర్షి 'కుంతీనందనా! చక్రవర్తి పదవిని అధిష్ఠించావు. ప్రజలకు మేలు చేయి. నన్ను అనుమతిస్తే, వెళ్ళివస్తాను.' అన్నాడు.

ధర్మరాజు వ్యాసుని ఒక సందేహం అడిగాడు. శిశుపాలుని వధ తర్వాత చాల ఉత్పాతాలు జరిగాయి. వాటి పర్యవసానమేమిటో తెలుపుతారా?' అని అడిగాడు. వేదవ్యాసుడు 'ఓ రాజా! అవన్నీ 13 సం॥ల తర్వాత జరిగే భయంకర యుద్ధానికి సంకేతాలే. దుర్యోధనుడు చేసే అపరాధాలకు నీవే కారణభూతుడవై, భీమార్జునుల కోపాగ్నిలో సమస్త క్షత్రియులు చనిపోతారు." అని చెప్పాడు.

ఇంద్రప్రస్థంలో యాగం ముగిశాక కూడ దుర్యోధనునికి శకునితో పాటు మయసభలో చేసిన వికృత చేష్టలకు పరాభవం జరిగింది. అసహనంతో దుర్యోధనుడు శకునితో 'మామా! పాండవుల ఔన్నత్యాన్ని చూచి శరీరం దహించుక పోతోంది. ప్రాయోపవేశమే నాకు ఇక గతి' అని దుఃఖించాడు. శకుని విని 'దుఃఖించకు. నీవెంట మేమందరం వున్నాం. భూమండలాన్నే నీవు జయించగలవు' అని అన్నాడు. 'పాండవులను జయించితే భూమండలాన్నే జయించినట్లవుతుంది కాని ఎలా?' అని దుర్యోధనుడు అడిగాడు. అందుకు పాచికలున్నాయిగా, ఆటలో మనం గెలుస్తాం, వాళ్ళు ఓడిపోతారు.' అని శకుని అన్నాడు.

ఇలా దుర్యోధనుడు, శకుని హస్తినకు వచ్చారు. శకుని ధృతరాష్ట్రునితో 'మహారాజా! ఒక ముఖ్య విషయం. దుర్యోధనుడు శోకంతో తేజస్సును కోల్పోతున్నాడు. అది శత్రుజనిత శోకం' అని అన్నాడు. ధృతరాష్ట్రుడు అడుగగా, దుర్యోధనుడు 'నాన్నా! నేను పాండవుల వున్నతిని భరించలేకుండా ఉన్నాను. నిద్రాహారాలు లేవు. ఇంద్రుని, కుబేరుని వాళ్ళు మించి పోయారు. నాకు శాంతి లేదు.' అని అనగా శకుని, దుర్యోధనుడు ఇద్దరూ ధృతరాష్ట్రునితో 'పాండవులను పిలిపించి, పాచికలాడి, మనం గెలుస్తాం, ఆ పని చేయండి' అని అడిగారు ధృతరాష్ట్రుని. విదురుని సలహా అడిగితే, ఆట వద్దని ధృతరాష్ట్రునితో చెప్పాడు. ధృతరాష్ట్రుడు విరమించుకోమని చెప్పినా దుర్యోధనుడు వినకుండా, 'నాన్నగారూ! నేను మయసభలో అవమానానికి గురయ్యాను. అందరూ

నవ్వారు. నా హృదయం మండుతోంది. శోకసముద్రంలో చిక్కి శల్యమై పోతున్నాను' అని అన్నాడు. ధృతరాష్ట్రుడు అనేక విధాల నచ్చ చెప్పటానికి ప్రయత్నించాడు. 'పాండవులను ద్వేషించవద్దు, అనర్థం జరుగుతుం'దన్నాడు. దుర్యోధనుడు 'నాన్నగారూ! నాకు రెండే మార్గాలున్నాయి. ఒకటి పాండవుల ధనాన్ని నేను చేజిక్కించుకోవడం, లేదంటే చనిపోవడం' రెండవది నాకు అనుకూలంగా వున్నది' అన్నాడు. 'నీ ప్రాణంతో ముడిపెడుతున్నావు కనుక నీ ఇష్టం' అని ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో అన్నాడు. తర్వాత పశ్చాత్తాపపడి లాభంలేదని కూడా సలహా ఇచ్చాడు. తాను పుత్రవాత్సల్యంతో వివేకం కోల్పోతున్నందుకు చింతిస్తున్నాననుకొన్నాడు ధృతరాష్ట్రుడు.

కాని పుత్రవాత్సల్యం గాడి తప్పింది. అశుభములకు కొదువ వుండదు. అపుడు ధృతరాష్ట్రుడు సైనికులను పిలపించి, వారిని ఇలా ఆజ్ఞాపించాడు. "మీరు వెంటనే 'తోరవాస్ఫటికమ"ను భవనాన్ని నిర్మించండి. వెయ్యి స్తంభాలుండాలి. సువర్ణంతో వంద ద్వారాలుండాలి. భవనం పొడవు వెడల్పు ఒకటిన్నర మైళ్ళుండాలి." రాజాజ్ఞ మేరకు అనతికాలంలోనే సర్వాంగసుందరంగా ఆ భవనం నిర్మించబడింది. ధృతరాష్ట్రుడు, విదురుని పిలిచి, ఇంద్రప్రస్థం వెళ్ళి పాండవులను ఈ 'తోరవాస్ఫటికము'ను చూడటానికి, అందులో పాచికలాడుటకు ఒప్పించి, పిలుచుకొని రా అని ఆజ్ఞాపించాడు. విదురుడు అయిష్టంగానే వెళ్ళాడు. విషయం ధర్మరాజుకు వివరించాడు. శకునితో పాచికలాట ప్రమాదకరమని తెలిసినా కూడా ధర్మరాజు పాండవులు హస్తినకు వచ్చారు. అందరూ కలిసి రెండవరోజు సభాభవనానికి వెళ్ళారు. పాచికలాడుటకు దుర్యోధనుని పక్షాన శకునిని ఏర్పాటు చేసికొన్నాడు దుర్యధనుడు. ఆట ప్రారంభమైంది. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, విదురుడు అందరూ కూర్చొని వున్నారు. కాని వారి మనసుల్లో దుఃఖం ఉంది. మణిమయ హారాల దగ్గరనుండి సువర్ణ రాసులను పందెం కాయసాగారు ఇరుపక్షాలవారు. ఆట భయంకరంగా సాగుతోంది. విదురుడు ధృతరాష్ట్రుని ఆటను నిరోధించమని అడిగాడు, దుర్యోధనుని వల్ల కురు వంశం నశిస్తుందని, పాండవులతో విరోధము నాశనమునకు కారణమవుతుందని చెప్పాడు. దుర్యోధనుడు ఆవేశంతో 'ఓ విదురా! నీవు శత్రుపక్షంలో ఉన్నావు. నీ అవసరం మాకు లేదు. వెళ్ళిపో' అని అన్నాడు. శకుని ఆటలో ధర్మరాజు ఆస్తినంతను కాజేశాడు. ఆటలో రాజ్యాన్ని, తమను కూడా పందెంగా పెట్టి ఓడిపోయారు పాండవులు, ధర్మరాజు. తుదకు ద్రౌపదిని కూడ పందెంలో ఓడిపోయాడు ధర్మరాజు. ధృతరాష్ట్రుడు ప్రతినాయకులైన దుశ్శాసన కర్ణులు అట్టహాసంగా నవ్వసాగారు. విజయానందంలో శకుని చిందులు వేయసాగాడు.

కౌరవ సభలో ద్రౌపది ఎలా అవమానాల పాలైందో ఇకముందు తెలుసుకొందాం.

దుర్యోధనుడు విదురుని పిలిచి "ద్రౌపదిని వెంటనే సభలోకి తీసికొని రా. దాసీజనంతో కలిసి వుంటుంది." అపుడు విదురుడు 'మూర్ఖుడా! సింహాల్లాంటి పాండవుల కోపానికి బలికాకు, నాశనమై పోతావు. కౌరవ వంశ నాశనానికి నీవు కారకుడవవుతావు' అని అన్నాడు. ఆ మాటలు వినిపించుకోకుండా దుర్యోధనుడు దుశ్శాసనుని పిలిచి ద్రౌపదిని తీసికొని రమ్మన్నాడు. అతడు ద్రౌపదిని సభలోనికి ఈడ్చుకొని వచ్చాడు. అది చూచి కర్ణుడు, శకుని సంతోషించారు. కాని సభ నిశ్శబ్దమైపోయింది.

అపుడు ద్రౌపది 'ఈ పాపులు ధర్మరాజును అన్యాయంగా ఓడించారు. ధర్మరాజు ఓడిపోయి, నన్నెలా పందెంలో కాయగలరు? తన్నోడి నన్నోడెనా, నన్నోడి తన్నోడెనా? ఈ ప్రశ్నకు సభ సమాధానం ఇవ్వాలి' అని కోరింది.

సభాసదులు మౌనులై ఉండగా, వికర్ణుడు మాత్రం ద్రౌపదికి సహాయంగా నిలిచాడు. కర్ణుడు 'పాండవుల, ద్రౌపదితో సహా అందరి బట్టలు తీసివేయ'మని దుశ్శాసనుని కోరాడు. పాండవులు తామే తీసివేసి వున్నారు.

దుశ్శాసుడు ద్రౌపది వస్త్రాలు తొలగించడానికి సిద్ధపడ్డాడు. అది గమనించి, ద్రౌపది శ్రీకృష్ణుని ప్రార్థించసాగింది. 'నీ శరణు కోరుతున్న నన్ను రక్షించు' అని ఎలుగెత్తి అరిచింది.

శ్రీకృష్ణుడు ఎవరికీ చెప్పకుండానే వచ్చి గుప్తరూపంలో వస్త్రాలు ఇచ్చి, ద్రౌపదిని సురక్షిత పరచాడు. సభాసదులందరు సంతోషించి, దుశ్శాసనుని దూషించసాగారు.

ఈ దుశ్చర్యను చూచిన భీముడు కోపంతో గర్జిస్తూ, 'ఓ రాజులారా! రానున్న రణంలో దుశ్శాసనుని రొమ్ము చీల్చి, వాడి వేడి రక్తం త్రాగుతాను' అని శపథం చేశాడు. రాజుల ప్రశంసల నందకున్నాడు. దుర్యోధనుడు భీముని రెచ్చగొట్టాలని, తన తొడను చూపగా, భీముడు 'ఓ దుర్యోధనా! రానున్న యుద్ధంలో నీ తొడలు విరగ గొట్టగలను అని బిగ్గరకా కేకలు వేశాడు. ఈ జూదం ఇలా అన్యాయంగా జరిగినందుననే భీముడు అలా క్రోధంతో ఊగిపోవాల్సి వచ్చిందని విదురుడు అన్నాడు. అదే సమయంలో అనేక అపశకునములు కలుగగా, గాంధారి భయపడింది. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు మంగళమగు గాక అన్నారు. విదురుడు, గాంధారి ధృతరాష్ట్రునికి విషయాన్ని వివరంగా చెప్పారు. ధృతరాష్ట్రుడు దుర్యోధనుని గట్టిగా దూషించాడు. ద్రౌపది పరాభవాన్ని కోరుకొంటే, కౌరవ వంశం నాశనమౌతుందని హెచ్చరించాడు. అపుడు ధృతరాష్ట్రుడు పశ్చాత్తాప హృదయంతో ద్రౌపదిని ఓదార్చి వరాలు కోరుకోమన్నాడు. అపుడు ద్రౌపది, ధర్మజ, భీమ, అర్జున, నకుల, సహదేవులను దాస్యం నుండి తొలగించమని కోరింది. ఇంకేమైనా కోరుకోమంటే ద్రౌపది సున్నితంగా తిరస్కరించగా, కర్ణుడు ఆమె తెలివితేటలను ప్రశంసించాడు. ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో 'ధర్మజా! నీ సంపదనంతా తీసికెళ్ళి పరిపాలన చేసుకో, నీకు కళ్యాణమగుగాక! అని దీవించగా, పాండవులందరూ సంతోషించి ఇంద్రప్రస్థానికి చేరుకున్నారు.

రెండవసారి కపట జూదం, పాండవుల వనవాసం గురించి తెలుసుకొందాం.

ధృతరాష్ట్రుడు పాండవుల అన్ని కోర్కెలు తీర్చి పంపగా, దుర్యోధనుడు, శకుని మున్నగు దుష్టుల బుద్ధి విషపూరితమైంది. ధృతరాష్ట్రుడు పాండవులకు వరాలు ఇచ్చిన విషయం తెలుసుకొని దుర్యోధనుడు, శకుని, కర్ణుడు కలిసి, ధృతరాష్ట్రుని వద్దకు వచ్చారు. వినయంతో వారు ఇలా అన్నారు. "మహారాజా! మేము ద్రౌపదిని అవమానించాము. ఇప్పుడు పాండవులు నాగుపాములు. మమ్మల్ని ప్రాణాలతో వదలరు. కనుక వారితో మళ్ళీ పాచికలాడించి, అరణ్యవాసం, అజ్ఞాతవాసాలకు పంపకపోతే మేము ప్రాణాలను కోల్పోవలసి వస్తుంది. ఇది చాల అవసరం. ఆటలో ఓడితే వారు అరణ్యవాసం 12 సం॥ తర్వాత మరో సంవత్సరం అజ్ఞాతవాసం, మధ్యలో పట్టుబడితే మరో 10 సంవత్సరాలు అరణ్యవాసం అనుభవించాలి. కాబట్టి జూదమునకు అనుమతి ఇవ్వండి." ధృతరాష్ట్రుడు అంగీకరించి, దూతను పంపమన్నాడు. ఋషులందరు గాంధారి ఎంత వారించినా, ధృతరాష్ట్రుడు పుత్రవాత్సల్యం వల్ల పట్టు వీడలేదు. దూత మాటను వినిపించగా, మరల పాండవులు అంతా దైవాధీనమని భావిస్తూ, తిరిగి హస్తినకు వచ్చారు. శకుని ధర్మరాజుతో షరతులను చెప్పాడు. సభాసదులు వారించినా, ఆట ప్రారంభమైంది. పాండవులు ఓడిపోయి, అడవులకు వెళ్ళుటకు సిద్ధపడ్డారు. భీష్మద్రోణుల వద్ద శలవు తీసుకొని కుంతికి చెప్పి బయలుదేరారు.

తన కుమారుల వల్ల పాండవులకు జరుగుతున్న అన్యాయాలకు ధృతరాష్ట్రుడు బాధపడుతూనే వున్నాడు. విదురుని పిలిచి పాండవులు ఎలా ఉన్నారని అడిగాడు. అపుడు విదురుడు 'మహారాజా! నీ కుమారుల మోసం చేత పాండవులు అడవుల పాలైనారనేది లోకం ఎరిగిన సత్యం. ధర్మరాజుతో సహా పాండవులు ప్రవర్తిస్తున్న

తీరుతో నీ కుమారులు భస్మమై పోతారనేది సత్యం. ద్రౌపది శోకిస్తూ కౌరవుల మరణానంతరం జరుగబోవు కర్మకాండకు ఇది సంకేతమని ధౌమ్యుడు సామమంత్రగానం చేస్తూ, హెచ్చరిస్తున్నాడు. పాండవుల అరణ్యవాసానికి దుఃఖిస్తూ, ప్రజలు మీవారిని దూషిస్తున్నారు.'

అదే సమయంలో నారద మహర్షి అకస్మాత్తుగా వచ్చి దుర్యోధనుని అపరాధ ఫలితంగా నేటినుండి 14వ సంవత్సరాన కురువంశ నాశనం జరుగుతుంది." అని చెప్పి వెళ్ళిపోయాడు. దుర్యోధన, శకుని, కర్ణుడు ద్రోణాచార్యుని శరణు వేడారు. అపుడు ద్రోణుడు 'పాండవులు దేవతల పుత్రులు. వారిని ఎవరూ చంపలేరు. మీరు జాగ్రత్తగా ఉండండి." అని చెప్పాడు. ఈ మాటలు విన్న ధృతరాష్ట్రుడు 'విదురా! ద్రోణుడు చెప్పింది వాస్తవం. కనుక అడవుల్లో వారికి కష్టం లేకుండా చూడండి.' అని శోకంతో కృంగిపోయాడు. సంజయుడు కూడ 'రాజా! అన్యాయం చేసి ఇప్పుడెందుకు దుఃఖం?' అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు 'సంజయా! పాండవులకు అన్యాయం చేసి ఎవరూ సుఖపడరు, నేను పుత్రవాత్సల్యంతో ఈ అనార్థనికి కారకుడైనాను. అంతే' అని శోకించాడు.

-o0o-

3. అరణ్య పర్వం

పాండవులు అరణ్యవాసానికి వెళ్ళారు.

శౌనక మహర్షి ఉపదేశాలను గురించి తెలుసుకొందాం.

పాండవులతో పాటు అరణ్యానికి ఇంద్రసేనుడు మొదలైన 14 మంది సేవకులు, వారి భార్యలతో కలిసి పాండవులను అనుసరించారు. పాండవుల వనవాస వార్తతో ప్రజలు భీష్మ ద్రోణాదులను కూడ నిందించ సాగారు. ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మరాజు వారిని ఉద్దేశించి "ప్రజలారా! మీరు తిరిగి వెళ్ళండి. హస్తినలో మీవారి మంచిని చూచుకోండి" అని నచ్చచెప్పి పంపించి, గంగానది దగ్గరకు చేరి ఆ రాత్రి గడిపారు. పాండవులను అనుసరిస్తున్న కొంతమంది బ్రాహ్మణులను కూడ ధర్మరాజు వెళ్ళిపొమ్మని ప్రార్థించాడు. కాని వారు పాండవులతోనే ఉండుటకు నిశ్చయించుకొన్నట్లు చెప్పారు.

ఆత్మజ్ఞాని శౌనకుడు ఇలా చెప్పాడు. "ధర్మరాజా! ఈ సంపద, యవ్వనం, అందం అన్నీ అనిత్యాలే. జ్ఞానులకు కష్టాలు రావు. మానసిక దుఃఖమే శారీరిక కష్టానికి ప్రధాన కారణం." అనగా ఈ బ్రాహ్మణుల పోషణము ఎలాగని మాత్రమే ఆలోచిస్తున్నానని ధర్మరాజు చెప్పాడు. శౌనకుడు 'రాజా! మీరు సత్పురుషులు గనుక ఇతరుల మేలే కోరుకొంటారు. దుష్టులు ఇతరులది లాక్కొంటారు. మీరు నియమాలతో సిద్ధి ప్రాప్తించుకొంటే, మీకు వారి భరణ-పోషణ చేయగల శక్తి వస్తుంది.' అన్నాడు. ఈ ఉపదేశము పొందిన పాండవుల పురోహితుడైన ధౌమ్యుని వద్దకు వచ్చి ఈ బ్రాహ్మణులను పోషించగల శక్తి ఎలా వస్తుందని అడిగాడు. ధౌమ్యుడు 'రాజా! సూర్యుని వలననే సమస్త ప్రాణులు రక్షింపబడుతున్నాయి. అందుచేత నీవు సూర్యభగవానుని శరణు వేడుకో, తత్ఫలితంగా నీవు వారి పోషణ చేయవచ్చును.' అని చెప్పి, సూర్య ఆరాధన పద్ధతి చెప్పి, సూర్యునికి గల 108 పేర్లు ఎప్పాడు. ఈ 108 పేర్లను ఉటంకిస్తూ, సూర్య నమస్కారం చేస్తూ, శరణు అన్న పక్షంలో అన్ని కోరికలు నెరవేరుతాయి.

ధౌమ్యుడు చెప్పినట్లుగానే, ధర్మరాజు భాస్కరుని స్తుతించగా, సూర్యుడు ప్రసన్నుడై ఆయన ముందు ప్రత్యక్షమయ్యాడు. సూర్యుడు ధర్మరాజుతో 'ఏమి వరం కావాలో కోరుకో' అనగా, ధర్మరాజు బ్రాహ్మణులను పోషించగల శక్తిని ప్రసాదించమన్నాడు. సూర్యుడు ఒక రాగి పాత్రను (అక్షయ పాత్ర) ఇస్తూ, 'ద్రౌపది ఎంత సామగ్రి తయారు చేసి ఇందులోపెట్టినా, తాను వడ్డించిన కొద్దీ అక్షయంగానే ఉంటుంది' అని చెప్పి అదృశ్యమయ్యాడు. ఈ విధంగా ధర్మరాజు ఆ బ్రాహ్మణుల ఆకలి తీర్చే శక్తిని సంపాదించాడు. ఆ తరువాత వారు కామ్యక వనానికి వెళ్ళారు.

పాండవులు వనవాసానికి వెళ్ళిన తరువాత, ధృతరాష్ట్రుడు విదురుని పిలిపించుకొని, భవిష్యత్తు ఎలా ఉంటుందని అడిగాడు. అపుడు విదురుడు, "రాజా! పాండవుల రాజ్యం వారికిచ్చి వేయండి. ద్రౌపదిని అవమానించినందుకు దుశ్శాసనునిచే క్షమాపణ చెప్పించండి. ఇలా చేయకపోతే పాండవులు మీ కుమారులను రానున్న యుద్ధంలో చంపేస్తారు. ధృతరాష్ట్రుడు విదురుని మాటలకు ఆగ్రహించి వెళ్ళిపొమ్మన్నాడు. విదురుడు పాండవుల వద్దకు చేరగా, ధృతరాష్ట్రుడు మళ్ళీ సంజయుని పంపి, విదురుని వెనుకకు పిలిపించుకున్నాడు.

ఒకరోజు మైత్రేయ మహర్షి ధృతరాష్ట్రుని వద్దకు రాగా, దుర్యోధనుడు మంచి మాటలు చెప్పమని

కోరాడు. అపుడు ఆ మహర్షి "దుర్యోధనా! నీవు పాండవులకు హాని చేయకు, వారివి సత్యప్రతిజ్ఞలు' అని చెప్పుచున్నంతలోనే, దుర్యోధనుడు ఆగ్రహించడం చూచి, మహర్షి రానున్న యుద్ధంలో భీముడు నీ తొడలు విరుగ గొట్టు గాక! అని శపించాడు.

పాండవులు విశ్రాంతి లేకుండా నడుస్తూ, రాత్రి అయ్యే సమయానికి కామ్యక వనంలోనికి చేరుకోనున్న సమయంలో భయంకర ఆకారంతో గర్జిస్తున్న కిమ్మీరుడనే రాక్షసుని చూచి ద్రౌపది మూర్ఛిల్లింది. ధౌమ్యుడు మంత్రపఠనంతో ఆ రాక్షసుని మాయలను తొలగించాడు.

కిమ్మీరుడు, 'నేను బకాసురుని సోదరుడను. హిడింబాసురుడి స్నేహితుడను, నేనిప్పుడు భీముని చంపేస్తా"నని అంటూ ఒక చెట్టును పెకలించి, భీమునిపై విసిరాడు. ఇద్దరి మధ్య పోరు భయంకరంగా సాగుతోంది. భీముడు తన బలాన్ని ఉపయోగించి, కిమ్మీర రాక్షసుని చంపివేశాడు.

శ్రీకృష్ణుడు కామ్యక వనానికి రాగానే పాండవులు సంతోషించారు. శ్రీకృష్ణుడు వారితో "ఈ భూమి దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణుని రక్తం త్రాగుతుంది. రానున్న యుద్ధంలో వారిని చంపక తప్పదు.' అన్నాడు. అపుడు ద్రౌపది కృష్ణునితో ఇలా అన్నది. 'కృష్ణా! నీవు నన్ను నాలుగు కారణాలుగా రక్షించవలసి ఉంది. ఒకటి నీవు నా సంబంధీకుడవు కావడం, రెండు నీవు అగ్నిగుండంనుండి జన్మించడం, మూడు నేను నీ ఇష్టురాలను కావడం, నాలుగు నీపై నాకు అందరికంటె ఎక్కువ అధికారం వుండడం.' అపుడు శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. 'కళ్యాణీ! నీవు శోకించకు. నీవు ఎవరిపై క్రోధం కలిగి ఉంటావో వారే కాదు, వారి భార్యలు, భర్తలు కూడా దుఃఖించక తప్పదు. నీవు పట్టపురాణి వవుతావు" అని, ధర్మరాజువైపు చూచి 'మీరు జూదం ఆడేవేళ నేను ద్వారకలో ఉన్నాను. శల్యుడు ద్వారకలో భీభత్సాని సృష్టించి వెళ్ళిన సంగతి తెలుసుకొని వెళ్ళి వానిని చంపి వచ్చినంతలో ఇక్కడ ఈ అనర్థం జరిగిపోయింది. నేను అక్కడ లేకపోవడం చేతనే మీరు ఓడి ఇలా అరణ్యాల పాలయ్యారు. రాబోయే కాలంలో మీకు మంచే జరుగుతుంది' అని చెప్పి, ద్వారకకు వెళ్ళిపోయాడు.

ధర్మరాజు తన సోదరులతో పుష్పఫల శోభితమై, ఋషుల ఆశ్రమాలున్న మంచి ప్రదేశాన్ని వెదకమని చెప్పగా, అర్జునుడు మంచి ప్రదేశాన్ని వెదకి ధర్మరాజుకు చెప్పాడు. ఆ ప్రదేశంలో అందరూ విడిది చేశారు. ఆ రోజుల్లో మహాముని మార్కండేయుడు పాండవుల ఆశ్రమానికి వచ్చాడు. వీరిని చూచిన మహర్షి 'మీ పరిస్థితి చూస్తే, శ్రీరామచంద్రుడు జ్ఞప్తికి వస్తున్నాడు. వనవాసం, అజ్ఞాతవాసం సురక్షితంగా పూర్తికాగానే, రాజ్యలక్ష్మి మీకు దక్కుతుంది' అని చెప్పాడు.

ఒక రోజు దాలభ్య మని కూడ ధర్మరాజు వద్దకు వచ్చాడు. "ధర్మరాజా! మీరిచ్చటికి వచ్చినప్పటి నుండి, ఈ ద్వైతవనంలో భృగువు, అంగీరసుడు, వశిష్ఠుడు మున్నగు ఋషులందరు ఏకమై ఇక్కడి శోభను వృద్ధి చేస్తున్నారు. మీ యశస్సు చిరకాలం వర్ధిల్లుతోంది. అక్కడ ఉన్న వేదవ్యాసుడు, నారదుడు, పరశురాముడు మొదలైన వారు దాలభ్య మునిని, ధర్మరాజును ప్రశంసించారు.

తమ దుస్థితికి బాధపడుతూ పాండవులు, ద్రౌపది ఒక చోట చేరి ముచ్చటించుకొంటూ వున్నారు. ద్రౌపది ధర్మరాజు, అతని సోదరుల సహనశక్తిని ఎద్దేవా చేసింది. అపుడు ధర్మరాజు క్రోధాన్ని అదుపులో ఉంచుకోవాలి, దానికి వశం కాకూడదని అన్నడు. అపుడు ద్రౌపది మీలాంటి ఆర్యపుత్రులు సుఖాలకు దూరంగా ఉంటారు, అందుకే నేను దుఃఖపడుతూ వుంటాను అని అన్నది. ధర్మరాజు అపుడు "ఓ ద్రౌపదీ! నేను నా

కర్తవ్యాన్ని నిర్వహిస్తానే కాని ఫలితాన్ని ఆశించను' అని అన్నాడు. భీముడు ఇది విని నేడే కౌరవులతో యుద్ధానికి సమ్మతించండి అన్నాడు. సాహసంతో పనులు నెరవేరవని ధర్మరాజు అంటుండగా వేదవ్యాస మహర్షి అక్కడకు వచ్చాడు.

వేదవ్యాసుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'ధర్మరాజా! నీలో ఉన్న అనేక సుగుణాలు నాకు తెలుసు. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ మున్నగు వారి వల్ల నీకు భయముందని నాకు తెలుసు.' అని చెప్తూ, ధర్మరాజును ఏకాంత స్థలానికి తీసుకొని వెళ్ళి, అక్కడ ప్రతిస్మృతి మంత్రమును బోధించాడు. ధర్మరాజు ఆ మంత్రమును జపించ సాగాడు. ఒకరోజు ధర్మరాజు అర్జునుని ఏకాంతానికి తీసుకొని వెళ్ళి, ఆ మంత్రాన్ని బోధించాడు. తర్వాత 'ఓ అర్జునా! నీవు ఉత్తర దిశగా ప్రయాణించి, ఈ మంత్రాన్ని జపిస్తూ, తపస్సు చేయి' అన్నాడు. అందరి అనుమతి తీసుకొని అర్జునుడు ఉత్తర దిక్కుకు ప్రయాణమైనాడు. హిమాలయంలోని గంధమాదన పర్వతానికి ఏరుకొన్నాడు. 'అచ్చటనే నిలబడి పో' అనే పెద్ద శబ్దం వినవచ్చింది. అర్జునుడు అటూ ఇటూ చూడగా ఒక చెట్టు క్రింద ఒక తపస్వి వున్నాడు. ఆ తపస్వి 'ఓయీ! నీవెవరు? ధనుర్బాణాలతో ఎందుకు వచ్చావు? ఇక్కడ అస్త్రాలతో పనిలేదు. శాంతికాముకులకే ఈ స్థలము. నీ ధనుర్బాణాలను విడిచి పెట్టు' అని చెప్పినా, అర్జునుడు వినలేదు. అపుడు ఇంద్రుడు ప్రత్యక్షమై 'అర్జునా! నీవు శంకరుని దర్శనం కొరకు ప్రయత్నం చేయి, అన్నీ లభిస్తాయి' అని చెప్పి అంతర్ధానమైనాడు.

అర్జునుని తపస్సుకు మెచ్చి, భిల్లుజాతి యువకుడి రూపంలో పార్వతితో సహా అర్జునుడి వద్దకు వచ్చే సమయానికి తపస్సులో వున్న అర్జునుని చంపటానికి సూకర రూపంలో ఉన్న దానవుణ్ణి చూచాడు. అది గమనించిన అర్జునుడు, శంకరుడూ ఇద్దరూ సూకరంపైకి బాణ ప్రయోగం చేయగా, అది చనిపోయింది. అర్జునుడు ఆ భిల్లు జాతి యువకుని చూస్తూ 'ఎందుకు వధించావు?' అని అడిగి, 'నిన్ను ప్రాణాలతో వదలను' అని అన్నాడు. భిల్లుడు సవాలు విసిరాడు. క్రోధించిన అర్జునుడు వానిపై బాణవర్షం కురిపించాడు. భీకర యుద్ధం జరిగింది. అర్జునుని ఆయుధాలన్నీ అయిపోయాయి. ఆగ్రహించిన అర్జునుడు ధనస్సుతోనే శంకరుని తలపై కొట్టబోయే సరికి, భిల్లు వేషంలో వున్న శంకరుడు ఆ ధనస్సును లాక్కొన్నాడు. అర్జునుడు ప్రయోగించిన వాటినన్నింటిని శంకరుడు లాక్కొన్నాడు. అర్జునుడికి శంకరునికి మధ్య మరల యుద్ధం సాగింది. శంకరుని ప్రహారాలకు అర్జునుడు అచేతనంగా పడిపోయాడు. కొంతసేపటికి వెలివి వచ్చినవాడై, అర్జునుడు ఒక వేదికపై శంకరుని ప్రతిష్ఠించి, పూజలు చేశాడు. పూలు చల్లాడు. ఆ పూలు భిల్లు ఆతి యువకునిపై పడటం చూచి, అర్జునుడు శాంతచిత్తుడై నిజం గ్రహించి, గౌరీశంకరునికి ప్రణామం చేశాడు.

శంకరుడు ప్రసన్నుడై వరం కోరుకోమన్నాడు. అర్జునుడు పాశుపతాస్త్రం కావాలన్నాడు. ఈ అస్త్రంతో ఉన్న వేలాది త్రిశూలాలు, గదలు, బాణాలు అన్నీ మంత్రం జపించి, ప్రయోగించగానే, శత్రువుల నాశనమై పోతారు అంటూ పాశుపతాస్త్రంతో బాటు, ధనస్సును కూడ ఇచ్చి, స్వర్గానికి వెళ్ళమని చెప్పి, శంకరుడు అదృశ్యమయ్యాడు.

అర్జునుడు ఇంద్రుని స్వర్గానికి వెళ్ళి కలుసుకోవడం, అక్కడ ఊర్వశి ప్రవర్తన గురించి తెలుసుకొందాం.

ఇంద్రుడు అర్జునుని తీసికొని రమ్మని రథాన్ని పంపాడు. అర్జునుడు సంతోషించి, రథసారథి మాతలితో పాటు రథంపై మంధరాచలం నుడి పైకి పోసాగాడు. దారిలో మాతలి ఇలా అన్నది. "వీరుడా! నీకు కనిపించే ఈ నక్షత్రాలన్నీ పుణ్యపురుషుల నివాస స్థానాలు." అక్కడినుండి అమరావతికి చేరుకోగా అక్కడి దేవతలందరు

అర్జునునికి నమస్కరించారు. అర్జునుడు వారికి ప్రతినమస్కారం చేసి ఇంద్రునికి నమస్కరించాడు. మేనక, ఊర్వశి మున్నగు అప్సరసలు నాట్యం చేస్తున్నారు. అర్జునుడు ప్రతిరోజు అస్త్రశస్త్ర ప్రయోగాలలో రహస్యం తెలుసుకొంటూ, అభ్యాసంలోనే నిమగ్నుడై, 5 సం॥ల పాటు ఇంద్రలోకంలోనే ఉన్నాడు.

ఒకరోజు ఇంద్రుడు అర్జునుని పిలిచి, చిత్రసేనుడి వద్ద నాట్యం నేర్చుకోమన్నాడు. అనతికాలంలోనే అర్జునుడు నాట్యంలో ప్రజ్ఞను సాధించాడు. ఒక నిముషంలో అర్జునుడు ఊర్వశిని కన్ను ఆర్పకుండా చూడటం ఇంద్రుడు గమనించాడు. చిత్రసేనునికి చెప్పి, ఊర్వశి అర్జునుని వద్దకు వెళ్ళే ఏర్పాటు చేయమన్నాడు. వెంటనే ఊర్వశి సర్వాలంకార భూషితయై అర్జునుని వద్దకు చేరింది. అర్జునుడు ఊర్వశిని చూచి, నమస్కరిస్తున్నాను అని అనగానే 'ఊర్వశి' 'అర్జునా! నన్ను ఇంద్రుడు నీకు సేవ చేయమని పంపాడు. నిన్ను చూచిన తర్వాత నీవైపు ఆకర్షించబడ్డాను. దయచేసి నన్ను స్వీకరించు' అని ఊర్వశి అన్నది.

అపుడు అర్జునుడు 'దేవీ! నీవు నాకు గురుపత్ని సమానురాలవు. నేను నిన్ను చూచినది నిజమే. కాని ఆ నా చూపులు పూజ్యభావనమే కాని వేరొకటి కాదు' అని చెప్పాడు. అపుడు ఊర్వశి 'ఓ వీరా! మేము అవివాహితలం. గురుపత్నులం కాలేము. నేను కామముతో వేగిపోతున్నాను. ఆ పీడ నుండి తప్పించి, నా తాపాన్ని నివారించు' అని అన్నది. కాని అర్జునుడు తాను ఆమెకు పుత్రసమానుణ్ణి అనగానే ఆమె కోపంతో ఊగిపోయి 'నీవు నపుంసకుడవై నాట్యం నేర్పుదువుగాక!' అని శపించి, వెళ్ళిపోయింది. దుఃఖితుడైన అర్జునునితో 'అర్జునా! ఊర్వశి శాపము నీకు అజ్ఞాతవాసంలో వరంగా ఉంటుంది, దుఃఖించకు' అని ధైర్యం చెప్పాడు. 'నలుడు కూడా ఇలా శాపాన్ని వరంగా మార్చుకొని కష్టాలనుండి దూరమయ్యాడని, ఆ కథ చెప్తాను విను' అన్నాడు.

"పూర్వం భరత ఖండంలోని నిషధ దేశాన్ని నలుడు పరిపాలిస్తూ వుండేవాడు. అతడు గుణవంతుడు, పరమ సుందరుడు, సత్యవాది, జితేంద్రియుడై అందరికీ ప్రియమైన వాడుగా, వేదవేత్తగా శోభిస్తూ ఉన్నాడు. సర్వగుణ సంపన్నుడై, పరాక్రమవంతుడై విక్రమిస్తూ ఉన్నాడు. ఆ రోజుల్లోనే భీమకుడు అనే రాజు విదర్భ దేశాన్ని పరిపాలిస్తుండేవాడు. భీమకునకు ఒక్కగానొక్క కుమార్తె పేరు దమయంతి. దమయంతి లక్ష్మీదేవిలా రూపవతి. విశాల నేత్రాలతో అలరారుతున్నది. దేవతలలో గాని, యక్షులలో గాని దమయంతి అంతటి అందగత్తె లేదు.

ఆ కాలంలో విదర్భ నుండి నిషధ దేశానికి, నిషధ నుండి విదర్భ దేశానికి రాజోద్యోగులు కూడ వస్తూ పోతూ వుండేవారు. వారి మధ్య సయోధ్య ఎక్కువగానే ఉండేది. అందులో కొందరు దమయంతి సౌందర్యాన్ని గురించి నలునికి చెపుతుండేవారు. మరికొంతమంది నలుని గుణసంపదను గురించి దమయంతికి చెప్పసాగారు. ఈవిధంగా వారిరువురి మధ్య ప్రేమ అంకురించింది.

ఒకరోజు నలుడు తన ఉద్యానవనంలో విహరిస్తూ, అక్కడ హంసలను చూచి, వాటిలో ఒక హంసను తన చేతిలోనికి తీసుకొన్నాడు. ఆ హంస మానవ భాషలో తనను విడిచిపెట్టమని కోరుతూ, దానికి ప్రతిగా తాను విదర్భ దేశానికి వెళ్ళి దమయంతికి మీ గురించి చెప్పి, మిమ్మల్ని వివాహం చేసుకొనేట్లు చేస్తానని చెప్పింది. నలుడు నవ్వుకొంటూ ఆ హంసను వదలివేశాడు. ఆ హంసలన్నీ గుంపుగా ఎగురుకుంటూ, విదర్భ దేశానికి వెళ్ళి దమయంతి దగ్గర వ్రాలాయి. వాటిని పట్టుకోవడానికి దమయంతి ప్రయత్నించగా, ఒక హంస ఇలా అన్నది. "ఓ దమయంతీ! నిషధ దేశాధీశుడైన నల మహారాజు పురుష శ్రేష్ఠుడు. నీవు స్త్రీలలో రత్నానివి. మీ ఇద్దరి

కలయిక అమోఘంగా ఉంటుంది" అన్నాయి. నలుని దగ్గర కూడా ఇలాగే చెప్పండి అని దమయంతి ఎంతో సంతోషపడి, హంసలను పట్టుకొనే ప్రయత్నాన్ని మానివేసింది.

ఇంతలో విదర్భరాజైన భీమకుడు దమయంతి యొక్క స్వయంవరాన్ని ప్రకటించాడు. భూలోకంలోని రాజులందరు విదర్భకు బయలుదేరారు. ఇంద్రాది దేవతలు నారదుని ద్వారా ఈ విషయం తెలుసుకొని విదర్భకు బయలుదేరారు. నలుడు కూడ స్వయంవరానికి ప్రయాణమైనాడు. సూర్యప్రభలతో వెలిగిపోతున్న నలుని చూచిన ఇంద్రాది దేవతలు తమకు దూతగా వ్యవహరించమని కోరారు. నలుడు సరేనన్నాడు. మా దేవతలలో ఒకరిని వరించమని దమయంతికి చెప్పమని వారు కోరారు. నలుడు ఆశ్చర్యంతో నేను కూడా స్వయంవరానికే వెళుతున్నానని, కనుక కుదరదన్నాడు. నీవు సత్యవ్రతుడవు కనుక నీవు దూతకార్యము నిర్వహించవలసిందేనని వారు ఒత్తిడి తెచ్చారు. నీవు నిరాటంకంగా అంతఃపురలోనికి వెళ్ళగలవు అని కూడ చెప్పారు. ఇంద్రుడు చెప్పిన విధంగానే నలుడు నిరాటంకంగా దమయంతి దగ్గరకు చేరాడు.

ఈ అందగాడైన నలుని చూచి చెలికత్తెలు ఆశ్చర్యపోయారు. దమయంతి కూడ ఆనందపడింది. దూతగా వచ్చిన విషయం నలుడు వివరించాడు. అపుడు దమయంతి నేను మిమ్మల్ని తప్ప దేరొకరిని వరించనని గట్టిగా చెప్పింది.

స్వయంవర మండపంలో నలునితో పాటు ఇంద్రాది దేవతలు కూడ నలుని రూపంలోనే కూర్చొన్నారు. అందరూ నలుని రూపంతో వున్నారు. దమయంతికి దిక్కుతోచలేదు. ఆమె దిక్పాలాది రాజులందరిని వేడుకొనగా వారు కనికరించి, తమ తమ నిజరూపాలను ప్రదర్శించారు. దమయంతి సంతోషించి, నలుని వరించింది. నలుడు సంతోషంతో దమయంతి చాతుర్యాన్ని అభినందించాడు. దేవతలు అందరూ నలునికి కానుకలుగా వరములిచ్చారు. ఇంద్రుడు యజ్ఞములో తన దర్శనమగునట్లు, అగ్ని నలుడనుకున్న చోట తానావిర్భవించునట్లు, యముడు పాకశాల ప్రావీణ్యముండునట్లు, వరుణుడు, నలుడు కోరుకున్న చోట జలముద్భవించునట్లు వరము లిచ్చి అదృశ్యమయ్యారు.

ఆ తరువాత నలుడు దమయంతితో పాటు నిషధ దేశానికి చేరుకొని, అశ్వమేధయాగము చేసి, ఒక కుమారుని, ఒక కుమార్తెను పొందాడు.

ఇదిలా వుండగా, ఇంద్రాది దేవతలు తిరుగు ప్రయాణంలో కలి హడావుడిగా వెళుతుండడం గమనించారు. అతనిని ఆపి ఇంద్రుడు ఎక్కడికి పోతున్నావని అడగగా, దమయంతి స్వయంవరానికి పోతున్నానని చెప్పాడు కలి. ఇంద్రుడు నవ్వి, దమయంతి నలుని స్వయంవరం వ్యవహారమంతా చెప్పాడు. కలి ఆగ్రహోదగ్రుడై 'నేను నలుని రాజ్యచ్యుతుని చేసి, దమయంతిని వేరు చేస్తా'నని చెప్పి, నలుని రాజధానిలోకి ప్రవేశించి సమయం కోసం ఎదురు చూడసాగాడు. 12 సంవత్సరాలు గడిచాయి. ఒకరోజు శుచికాని నలునిలో కలి ప్రవేశించాడు. మరొక వేషంలో నలుని సోదరుడైన పుష్కరుని వద్దకు వెళ్ళి, నలునితో పాచికలాడి, రాజ్యాన్ని కైవసం చేసుకోమని ప్రోత్సహించాడు. ద్వాపరంలోని పాచికలుగా మారి పుష్కరునకు అనుకూలించాడు. పదే పదే పాచికలాటకు రమ్మని పుష్కరుడు నలుని కోరినా నలుడు తిరస్కరిస్తూ వచ్చాడు. చివరకు నలుడు అంగీకరించేవరకు తన ప్రతిపాదనను పుష్కరుడు వదలలేదు. శనిప్రభావంతో నలుడు పాచికలాటలో ఓడిపోయాడు. నలుడు తన పిల్లలను విదర్భ దేశానికి పంపించి వేశాడు. దమయంతి మాత్రం నలునితోనే వుంటానని పట్టుపట్టింది.

ఏకవస్త్రంతో రాజధానిని వదలి బయటకు వచ్చిన నలుడు దమయంతితో పాటు అడవిలో బంగారు రెక్కలున్న పక్షులను చూచాడు. వాటిని పట్టుకొంటే, కాస్త బంగారం లభిస్తుందని, దానితో కొంతకాలం పాటు జీవనం సాగించవచ్చని తలచి, తన అంగవస్త్రాన్ని వాటిపైకి విసిరాడు. ఆ పక్షులు నలుని ఉద్దేశించి, 'ఓయీ నలుడా! మేము పక్షులం కాము, నిన్ను రాజ్యచ్యుతిని చేసిన పాచికలం" అంటూ ఆ అంగవస్త్రంతో పాటు ఆకాశానికెగిరిపోయాయి. ఉన్న ఒక వస్త్రం కూడా పోవడంతో, దమయంతి తన చీరలో సగం చించి ఆయనకు యిచ్చింది. ఆ తర్వాత వారు నడుచుకొంటూ, ఆ అరణ్యంలో ఒ కూడలిలాంటి ప్రదేశానికి చేరారు. నలుడు దమయంతితో ఏ మార్గం ఎటు పోతుందో చెప్పసాగాడు. ఆ సంకేతాన్ని అర్థం చేసుకొన్న దమయంతి, మిమ్మల్ని వదిలి వెళ్ళనని చెప్పింది. ఇలా ఇద్దరూ ఒక ధర్మశాలలో బస చేశారు. నలుడు ఇలా అనుకున్నాడు.

ఎలాగూ నేను లేని పక్షంలో దమయంతి తన పుట్టింటికి వెళుతుందనే ఆశతో నలుడు అర్థరాత్రి సమయంలో ఆమెను ఒంటరిగా వదిలి వెళ్ళిపోయాడు. మెళకువ వచ్చిన తర్వాత దమయంతి నలుడు కనిపించనందున నిరాశాపరురాలైంది. వెదకసాగింది. దుఃఖంతో ఉన్మాదావస్థలో ఉన్న దమయంతిని కొండచిలువ మ్రింగడానికి ప్రయత్నించినా ఆమె స్పృహలోకి రాలేదు. ఈ దృశ్యాన్ని చూచిన వేటగాడొకడు వచ్చి కొండచిలువను ముక్కలు చేసి దమయంతిని రక్షించాడు. ఆమె అందాన్ని చూచి ఆమెను మోహించిన వేటగాడు తన కోర్కెను తీర్చమని ఆమెను బలవంత పెట్టసాగాడు. కాని ఆమె తన పాతివ్రత్య మహిమతో వాడిని శపించి చంపివేసింది.

మరల నలుని వెదుకుతూ బయలుదేరింది. తర్వాత ఒక ఋషుల బృందం కనిపించగా, వారికి తన వృత్తాంతమంతా నివేదించి, తనను రక్షించమని కోరింది. వారు ఆమెతో నలుడు మళ్ళీ నిన్ను చేపట్టి, రాజ్యపాలన చేసేలా చూస్తామని చెప్పి అదృశ్యులైనారు. దమయంతికి ఆశ్చర్యం వేసింది. ఆ తర్వాత ఒక వర్తకుల గుంపు అక్కడకు వచ్చింది. వారితో పాటు, వారి సాయంతో దమయంతి చేది దేశపు రాజైన సుబాహుని రాజ్యానికి చేరింది. ఆమె వీథిలో నడుస్తుండగా, కిటికీలో నుండి ఆమెను గమనించిన రాజమాత దమయంతిని తనవద్దకు పిలిపించుకొనింది. అక్కడ దమయంతి నియమపూర్వకంగా, స్వేచ్ఛగా ఉండసాగింది.

దమయంతిని వదలిపెట్టి వెళ్ళిన నలునకు అడవిలో ఒకవైపు దావాగ్ని కనిపించింది. ఆ కార్చిచ్చునుండి "నల మహారాజా! రక్షించు" అన్న కేక వినిపించింది. నలుడు ఆ శబ్దం విని ఆ దిశకు వెళ్ళగా, అక్కడ కర్కోటకుడనే సర్పరాజు కనిపించాడు. దానిని రక్షించగా, పది అడుగులు లెక్కిస్తూ నడవమని కోరాడు. పది అడుగులు లెక్కించగానే సర్పరాజు అతనిని కాటువేయడంతో. ఆ విషం కారణంగా నలుని రూపం మారిపోయింది. అపుడు కర్కోటకుడు "ఓ రాజా! నీకు ఏ శత్రుభయము లేదు. నీవు బాహుకుడుగా పేరు మార్చుకొని, అయోధ్య రాజైన ఋతుపర్ణుని కొలువులో రథసారథిగా చేరు. ఆ రాజు నీకు మిత్రుడు కాగలడు. నీవు అతనిని అశ్వవిద్య నేర్పు. పాచికలాటలో మెళకువలను అతడు నీకు నేర్పుతాడు." అని చెప్పి అదృశ్యుడయ్యాడు. అలాగేనని అయోధ్యకు వెళ్ళి, ఋతుపర్ణుని కొలువులో బాహుకుడనే పేరుతో రథసారథిగా చేరాడు. ఈ బాహుకుని అశ్వశాలాధ్యక్షునిగా నెలకు పదివేల బంగారు నాణాల జీతమిస్తూ నియమించాడు ఋతుపర్ణుడు. వారిద్దరూ మంచి మిత్రులైనారు.

నలదమయంతులు విడిపోయిన విషయం విదర్భ రాజైన భీమకునికి తెలిసి, చాల విచారించాడు. తర్వాత చురుకుగా ఉండే కొందరు బ్రాహ్మణులను పంపి ఆమె ఆచూకీ కనిపెట్టమన్నాడు. అలా ఆచూకీ తెలియజేసి వారికి పదివేల గోవులిస్తానని ప్రకటించాడు. ఆ బ్రాహ్మణులలో సుదేవుడనే బ్రాహ్మణుడు చేది రాజధానిలోని రాజమహలులో వున్న దమయంతిని గుర్తించాడు. విషయం తెలుసుకొన్న రాజమాత వివరాలు

అడిగి తెలుసుకొని దమయంతిని బిగ్గరగా కౌగిలించుకొని ముద్దాడింది. "బిడ్డా! నీవు నా చెల్లెలి కుమార్తెవు" అని ఎంతో సంతోషంతో ఆమెకు అనేక కానుకలిచ్చి, పల్లకి తెప్పించి, కొందరు కాపలాదారులతో విదర్భకు పంపింది. దమయంతిని చూచి భీమకుడు ఎంతో సంతోషించాడు. ప్రకటించిన ప్రకారం సుదేవునికి 10 వేల గోవులతో పాటు ఒక గ్రామాన్ని, వలసినంత ధనాన్ని ఇచ్చి పంపాడు.

ఆ తర్వాత నలుని వెదకటానికి దమయంతి బ్రాహ్మణులను పంపింది. జనమున్న చోట ఏ మాటలు అనవలెనో అన్నీ చెప్పి పంపింది. పర్ణాదుడను బ్రాహ్మణుడు అయోధ్య రాజైన ఋతుపర్ణుని కొలువులో రథసారథిగా వున్న బాహుకుడు రాజుతో మిత్రుడుగా వ్యవహరిస్తుండడం చూచి దమయంతికి విషయం చెప్పాడు.

దమయంతి ఈ పర్యాయం సుదేవుని ఋతుపర్ణుని దగ్గరకు పంపి, రేపే దమయంతి స్వయంవరం అని చెప్పి, విదర్భకు రమ్మని ఋతుపర్ణునికి ఆహ్వాన పంపింది. దానిలో అంతరార్థం ఏమంటే – బాహుకుడే నలుడైన పక్షంలో మాత్రమే ఋతుపర్ణుని విదర్భకు నిర్ణీత సమయానికి తీసికొని రాగలడు. వాయువేగంతో రథాన్ని నడపటం నలునకు వెన్నతో పెట్టిన విద్య. మరెవ్వరికీ ఇది సాధ్యం కాని పని. విషయం తెలుసుకున్న ఋతుపర్ణుడు బాహుకునితో రేపే నన్ను విదర్భకు చేర్చేందుకు రథం సిద్ధం చేయమని చెప్పాడు. సరేనని బాహుకుడు అక్కడినుండి కదిలాడు.

బాహుకుని ఆలోచనలు పలువిధాలుగా పరుగెత్తుతున్నాయి. పక్షివలె అతని రథం కొండలను, కోనలను అధిగమించి ముందుక సాగుతోంది. ఋతుపర్ణుడు రథాన్ని ఆపమని కోరగా, 'రాజా! అది ఇక్కడికి ఒక యోజన దూరంలో ఉంది' అని బాహుకుడు చెప్పాడు. ఆశ్చర్యపడిన రాజు తన గణిత విద్యను ప్రదర్శించాలని తలచి ఈ మామిడి చెట్టుకు లక్ష ఆకులు, వేయి పండ్లు వున్నాయని బాహుకునకు చెప్పాడు. బాహుకుడు వాటిని నిర్ధారణ చేయడం చూచి ఆశ్చర్యపడ్డాడు. ఋతుపర్ణుడు ఇలా అన్నాడు. 'ఓ బాహుకా! నీవు నాకు మంచి మిత్రుడవు. గణిత విద్యవలెనే నేను పాచికల మర్మము కూడ చెప్పగలను. ఈ రెండు విద్యలు నీకు నేర్పిస్తాను. నీవు నాకు అశ్వసారథ్యంలో మెళకువలు నేర్పు"మని కోరాడు.

ఋతుపర్ణుని నుండి బాహుకుడు పాచికల మర్మం తెలుసుకోగానే, అతని శరీరంలో దాగిన కలి బయటకు వచ్చేశాడు. కర్కోటకుడు కాటువేయగా శరీరంలోకి ప్రవేశించిన విషం దిగిపోయింది. ఈలోగా రథం విదర్భలోనికి ప్రవేశించింది. ఈ రథం యొక్క చప్పుడు విని, ఇది నల చక్రవర్తి రథం చప్పుడు లాగానే వున్నదని దమయంతి నిర్ధారించుకొంది.

స్వయంవర వృత్తాంతం తెలియని భీమకుడు ఋతుపర్ణుని ఆహ్వానించి కుశలప్రశ్నలు వేసి ఆతిథ్యం ఇచ్చాడు. స్వయంవర ఛాయలు కనపడక పోవడంతో ఋతుపర్ణుడు కూడ మిన్నకుండిపోయాడు.

బాహుకుని కనిపెట్టే నిమిత్తం, దమయంతి కేశిని అనే దాసిని పంపింది. కేశిని తిరిగి వచ్చి ఇలా చెప్పింది. "అమ్మా! ఆ బాహుకుడు తలచిన చోట నీటిని, అగ్నిని సృష్టిస్తున్నాడు".

ఈ మాటలు విన్న దమయంతి బాహుకుడు నలుడేనని నిశ్చయించుకొని, తన ఇద్దరు పిల్లలను బాహుకుని చెంతకు పంపింది. ఆ పిల్లలను గుర్తించిన బాహుకుడు, వారిని తనవద్ద కూర్చుండబెట్టుకొని ముద్దాడుతున్నాడు. మరి కాసేపటి తర్వాత దుఃఖించసాగాడు. ఆ తర్వాత కేశినితో "ఈ పిల్లలు నా పిల్ల వలెనే ఉన్నారు. అందుచేతనే నాలో దాగిన పితృప్రేమ పెల్లుబికింది. అయినప్పటికి కేశినీ, నీవు పలుమార్లు ఇలా నా వద్దకు రాకూడదు."

అన్నాడు.

ఈ జరిగిన విషయాలన్నీ కేశిని దమయంతికి చెప్పగా, తన తల్లితో చెప్పి బాహుకుని తన అతఃపురానికి రప్పించింది. దమయంతిని చూడగానే బాహుకుడు దుఃఖంతో ఏడ్వసాగాడు. దమయంతి కూడ కన్నీళ్ళ పర్యంతమైంది. నలుడు అపుడు ఇలా అన్నాడు. "దమయంతీ! నేను కావాలని రాజ్యం కోల్పోలేదు. అలాగే అడవిలో కూడా నిన్ను ఒంటరిదాన్ని చేయడానికి కారణం, నీవు నీ పుట్టింటికి చేరతావనే ఆశతోనే చేశాను. ఇవన్నీ కలి ప్రభావం వల్ల జరిగిన పని" అని కర్కోటకుని తలచుకొని తన నిజారూపాన్ని పొందాడు.

నలదమయంతులిద్దరూ పరస్పర గాఢపరిష్వంగంలో మునిగి తేలారు. ఆ తరువాత పుష్కరునితో పాచికలాడి, అతనిని ఓడించి, తన రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని, ప్రజారంజకంగా రాజ్యపాలన చేశాడు నలుడు.

కాబట్టి, ప్రస్తుతం నీవు పొందిన శాపం కూడా నీకు వరంగానే పరిణమిస్తుంది. మీ అజ్ఞాతవాస కాలంలో నీకు ఉపయోగపడుతుంది" అన్నాడు.

అగస్త్యుడు మరియు లోపాముద్ర యొక్క ఉదంతాన్ని లోమశుడు ధర్మరాజుకు విన్నవించిన విధానాన్ని తెలుసుకొందామా!

కామ్యకవనంలో ఉన్న పాండవులకు అర్జునుడు లేకుండా గడవడం కష్టంగా ఉంది. నారద మహర్షి, ధౌమ్యుడు తీర్థయాత్రల గురించిన విశేషాలు చెప్పడంతో, పాండవులు నైమిశారణ్యానికి చేరారు. అక్కడ చాతుర్మాస్య వ్రతం చేసి, బ్రాహ్మణులను సత్కరించి, తన పరివారంతో ధర్మరాజు అగస్త్యాశ్రమానికి చేరుకున్నాడు.

అచ్చట లోమశ మహర్షి ధర్మరాజుతో ఇలా చెప్పసాగాడు. "ధర్మరాజా! ఒకసారి అగస్త్యుడు ఒక లోయలో తన తల్లిదండ్రులు తలక్రిందులుగా వ్రేలాడటం చూచి, ఎందుకిలా వున్నారని అడిగాడు. అక్కడి మునులు ఇలా చెప్పారు. "అగస్త్యా! మేము నీ పితృగణానికి చెందిన వాళ్ళం. నీకు పుత్ర సంతానం కలిగితే, మాకు సద్గతి కలుగుతుంది'. అపుడు అగస్త్యుడు 'మీ కోరిక తీరుస్తాను' అని అన్నాడు. ఆ కారణంగానే, అగస్త్యుడు విదర్భ రాజు వద్దకు వెళ్ళి, ఆ రాజకుమార్తె అయిన లోపాముద్రను తనకిచ్చి వివాహం చేయమన్నాడు. ఆ రాజదంపతులకు ఇష్టం లేకపోయినా, ముని శపిస్తాడని భయపడి, తమ కుమార్తెను ఆయనకిచ్చి వివాహం చేశారు. లోపాముద్ర నారబట్టలతో అగస్త్యుని వెంట వెళ్ళింది. అగస్త్యుడు భార్యతో సహా హరిద్వారానికి వెళ్ళి తపస్సు ఆరంభించాడు. కాని ఒకరోజు అగస్త్యుడు లోపాముద్ర యొక్క అందచందాలకు మోహపడి, సమాగమానికి స్వాగతించాడు. కాని ఆమె కాషాయ వస్త్రాలతో కాకుండా మేలిమి అలంకారణతో రమ్మని అగస్త్యుని కోరింది. అపుడు ధనము కొరకు శ్రుతపర్వుడు మున్నగు రాజుల వద్దకు వెళ్ళి ధనాన్ని కోరాడు. రాజులు ధనం ఇస్తామన్నారు. కాని తాను తీసికొంటే ప్రజల అవసరాలకు అడ్డంకి అపుతుందని ధనాన్ని తీసికోలేదు.

చివరకు అగస్త్యుడు ఇల్వలుడను రాక్షస రాజు వద్ద అపారమైన ధనమున్నదని తెలుసుకొని అక్కడి వెళ్ళి ఆ రాక్షస రాజును ధనమిమ్మని కోరాడు. ఇల్వలుడు తాను ఎంత ఇవ్వగలననుకుంటన్నారో చెప్పమని అగస్త్యుని అడిగాడు. అపుడు అగస్త్యుడు ఇలా అడిగాడు. 'ఓ అసురరాజా! ఈ నాతో వచ్చిన రాజులకు పదివేల గోవుల చొప్పున, అంతే సంఖ్యలో బంగారు నాణేలు, అలాగే నాకు రెట్టింపు గోవులు, నాణేలు, ఒక బంగారు రథం, రెండు అశ్వాలు ఇవ్వ'మని అడిగాడు. ఇల్వలుడు ఎంతో సంతోషించి, అతడు కోరిన సంపదను ఇచ్చి పంపాడు. అగస్త్యుడు ఆశ్రమానికి చేరి, లోపాముద్ర కోరికలన్నింటినీ తీర్చాడు. ఆ తరువాత అగస్త్యుడు గర్భాదానం చేసి,

అడవులకు పోయాడు. లోపాముద్ర కాలక్రమంలో మంచి ముహూర్తాన దృఢస్యుడు అనే బాలునికి జన్మనిచ్చింది. ఆ తర్వాత అగస్త్యుని పితరులు ఎంతో సంతోషంతో కోరుకున్న లోకాలకు వెళ్ళిపోయారు. అందుచేతనే ఈ ఆశ్రమానికి అగస్త్యాశ్రమం అని పేరు వచ్చింది. దీని ప్రక్కనే భాగీరథీ నది ప్రవహిస్తోంది. ఇచ్చటనే శ్రీరాముడు పరశురాముని తేజస్సును హరించి వేశాడు. కాని ఆ తేజాన్నే పరశురాముడు ఈ తీర్థంలో స్నానం చేయడం ద్వారా తిరిగి పొందాడు. ధర్మరాజా! అలాగే నీ తేజస్సును కూడ దుర్యోధనుడు హరించివేశాడు. ఆ తీర్థంలో స్నానమాడి మీ పితరులకు సంతోషం కలిగించు' అని చెప్పగా, ధర్మరాజు అదేవిధంగా చేసి తమ పితరులను సంతుష్టి పరచాడు. ఆ తర్వాత ధర్మరాజు లోమశ మహర్షిని, పరశురాముని గురించి చెప్పమని కోరాడు. అపుడు లోమశ మహర్షి ఇలా చెప్పసాగాడు 'ఓ ధర్మరాజా! రావణ సంహారం కోరి విష్ణువు స్వయంగా రామావతార మెత్తాడు. శ్రీరాముని శక్తిసామర్థ్యాలను పరీక్షించుటకు పరశురాముడు అయోధ్యకు వచ్చాడు. పరశురాముడు శ్రీరామునితో ఇలా అన్నాడు. 'రాకుమారా! నా ధనస్సు మృత్యువు వలె భయంకరమైనది. నీలో శక్తి వుంటే దీనిని ఎక్కుపెట్టు' అన్నాడు. శ్రీరాముడు వెంటనే ధనస్సును తీసికొని, క్షణకాలంలో టంకారం చేయగా ఆ ధ్వనికి దిక్కులు పెక్కటిల్లాయి. ఇంకేమి కావాలి అని అడుగగా, పరశురాముడు మరియొక దివ్యబాణాన్ని ఇస్తూ, దానిని నీ చెవి వరకు లాగి చూపించు అన్నాడు. అపుడు శ్రీరాముడు నవ్వుతూ, నన్ను మీరు చిన్నచూపు చూస్తున్నారు. మీకు దివ్యనేత్రాలు ఇస్తున్నాను. నన్ను దర్శించండి' అని అన్నాడు. పరశురాముడు శ్రీరాముని శరీరంలో సూర్యుని, వసువుల్ని, రుద్రుణ్ణి, యక్షులను, నదులను, సముద్రాలను, పర్వతాలను చూచాడు. ఈ లోపుగా శ్రీరాముడు వదలిన బాణము ప్రచండ వేగంతో వచ్చి పరశురాముని తేజస్సును హరించి వేసి, తిరిగి శ్రీరాముని చేరింది. చేతనావస్థలోనికి వచ్చిన పరశురాముడు శ్రీమహావిష్ణు అంశ అయిన శ్రీరామునికి నమస్కరించి కుంచించుకు పోయాడు. కాని ఇక్కడ అగస్త్య తీర్థంలో స్నానం చేసి, పోగొట్టుకున్న తేజస్సును తిరిగి పొందాడు.

తేజస్వి అయిన అగస్త్యుని అద్భుతమైన, దివ్యమైన మరియు అలౌకికమైన ఉదంతాలను గురించి తెలుసుకొందామా!

పూర్వం భయంకరులైన కాలకేయ రాక్షసులు వృత్రాసురుని అధీనంలో ఉండి, ఇంద్రాది దేవతలపై ఆక్రమణలు చేస్తుండేవారు. దేవతలు బ్రహ్మకు విన్నవించుకోగా, బ్రహ్మ ఇలా చెప్పాడు. "మీరు మహాముని యైన దధీచి వద్దకు వెళ్ళి లోకహితం కొరకు తన ఎముకలను ఇవ్వమని అడగండి." అని అన్నాడు. అలాగే వారు ఆయన వద్దకు వెళ్ళి అడుగగా, ఇంద్రియాలను, మనస్సును వశంలో ఉంచుకొని దధీచి ప్రాణత్యాగం చేశాడు. అపుడు ఆయన ఎముకలు సేకరించి, విశ్వకర్మతో వజ్రాయుధాన్ని తయారు చేయించి, దానితో ఇంద్రుడు వృత్రాసురుని చంపాడు.

ఆ భయంతో కాలకేయ రాక్షసులు సముద్ర గర్భంలోకి వెళ్ళి దాక్కొన్నారు. పెద్ద పెద్ద చేపలు, మొసళ్ళు ఉండటం చేత రాక్షసులు సురక్షితంగా వున్నారు. రాత్రంతా ఋషులను చంపసాగారు. దేవతలు ఆ రాక్షసులను చంపలేకపోయారు. అందరూ విష్ణువుకు మొర పెట్టుకొన్నారు. అగస్త్య మహర్షిని శరణు వేడమని విష్ణువు వారికి చెప్పాడు. దేవతలందరు అగస్త్య ముని వద్దకు వచ్చి "దేవా! పూర్వం మీరు వింధ్యాచల పర్వతాన్ని కుంచింప చేశారు. మేము ఇపుడు మీ శరణు కోరి వచ్చాము" అని అంటుండగానే ధర్మరాజు మధ్యలో కలుగజేసుకొని "మునివరా! వింధ్యాచల పర్వతాన్ని మీరెలా కుంచింపజేశారో తెలుసుకోవాలనుకుంటున్నాను.' అని అన్నాడు. అపుడు లోమశ మహర్షి ఇలా చెప్పాడు. "సాధారణంగా సూర్యోదయం, సూర్యాస్తమయాలు ముగిసేసరికి

సూర్యుడు సుమేరు పర్వత ప్రదక్షిణ పూర్తిచేస్తాడు. ఇది గమనించిన వింధ్యపర్వతం తన చుట్టూ కూడా ప్రదక్షిణం చేయమని సూర్యుని అడుగుతుంది. అపుడు సూర్యుడు "నేను ఇష్టం వచ్చినట్లు తిరగడం లేదు. ఈ జగత్తును సృష్టించినవారి నిర్దేశనుసారమే నా గతి విధులున్నాయి" అన్నాడు. ఈ మాటలు విన్న వింధ్యపర్వతం కోపంతో సూర్యచంద్రులను అడ్డగించే కోరికతో అకస్మాత్తుగా పెరగటం ప్రారంభమయింది. దేవతల మాటలను కూడా వింధ్యుడు వినలేదు. అందుచేత అందరూ వెళ్ళి, అగస్త్య మహర్షిని ఆ పెరుగుదలను ఆపమని అడిగారు. అగస్త్య మహర్షి భార్యతో సహా వింధ్య పర్వతం వద్దకు వచ్చి, "ఓ పర్వతరాజా! నేను ఒక పనిమీద దక్షిణానికి వెళ్తున్నాను. నాకు మార్గం ఇవ్వు' అనగానే 'అలాగే'నని తన ఎత్తును తగ్గించుకొని ఆయనకు దారి ఇచ్చాడు. వింధ్య పర్వతాన్ని దాటిన తర్వాత 'నేను తిరిగి వచ్చేవరకు ఇలాగే వేచి వుండు' అని వింధ్యుని ఆదేశించాడు. అలా దక్షిణానికి వచ్చాడే గాని తిరిగి వెళ్ళలేదు. ఆ విధంగా వింధ్య పర్వతం యొక్క ఎదుగుదల ఆగిపోయింది. ధర్మరాజా! కాలకేయ రాక్షసులను ఎలా సంహరించారో నీవు వినాలి.

దేవతలందరూ అగస్త్య మహర్షి వద్దకు వెళ్ళగా, ఆయన ఏం కావాలో కోరుకోమన్నాడు. దేవతలు 'మహర్షీ! మీరు సముద్ర జలాన్ని త్రాగితే, మేము కాలకేయులను చంపగల'మని అన్నారు.

ఋషులు, దేవతలు వెంటరాగా, అగస్త్యుడు సముద్ర తీరానికి చేరుకొని, 'నేను ప్రపంచహితం కోరి సముద్ర జలపానం చేస్తాను' అని అంటూ సముద్రంలో చుక్కనీరు లేకుండా తాగేశాడు. అపుడు నీరులేని సముద్రంలోనికి దేవతలు సులభంగా వెళ్ళి, ఆ కాలకేయ రాక్షసులను సంహరించారు. అగస్త్యుడు మళ్ళీ సముద్ర జలాన్ని బయటకు వదిలివేయమని దేవతలు కోరగా, ఆయన 'ఆ జలం నాలో జీర్ణమై పోయింది, ఇంకేమైనా ఉపాయం ఆలోచించండి' అని చెప్పాడు. దేవతలు బ్రహ్మకు విషయం చెప్పగా, బ్రహ్మ 'దేవతలారా! కొంత కాలానికి సముద్రం భగీరథుని ద్వారా గంగాజలంతో నిండుతుంది." అని చెప్పాడు.

అపుడు ధర్మరాజు భగీరథుని ఉదంతం చెప్పమని కోరగా, లోమశ మహర్షి ఇలా చెప్పనారంభించాడు. "రాజా! పూర్వం ఇక్ష్వాకువంశంలో సగరుడు అనే రాజుండేవాడు. అతనికి ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు అరవై వేల మంది కుమారులు. రెండవ భార్యకు ఒక ఒక కుమారుడు. ఇతని పేరు అసమంజసుడు. తన రెండవ భార్య కుమారుడైన అసమంజసుడు ప్రజాకంటకుడుగా మారినందున సగరుడు అతనిని దేశ బహిష్కృతుని చేశాడు. సగర మహారాజు అశ్వమేధ యాగం చేసి, ఒక అశ్వాన్ని వదలి పెట్టాడు. దాని రక్షణ కొరకు తన అరువది వేలమంది కుమారులను పంపాడు. ఇంద్రుడు, సగరుడు స్వర్గానికి రాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో గుర్రాన్ని ఎత్తుకొని పోయి, పాతాళంలో కపిల మహాముని ఆశ్రమంలో దాచాడు. అశ్వం కోసం అరవై వేల మంది దేశమంతా తిరిగి ఎక్కడా కనబడక, చివరకు పాతాళం వరకు భూమిని త్రవ్వి అక్కడ తపస్సు చేసుకుంటున్న కపిల మహర్షి ఆశ్రమంలో వున్న గుర్రాన్ని చూసి, ఆయనే అపహరించాడనే భావంతో ఆయన తపస్సుకు భంగం కలిగించారు. కాని ఆ ముని కళ్ళు తెరవగానే, ఆ కళ్ళనుండి వెలువడిన అగ్నిజ్వాలలకు మాడిమసై పోయారు.

ఒకరోజు సగరుడు అసమంజసుని కుమారుడగు అంశుమంతుని పిలిచి 'తప్పిపోయిన అశ్వాన్ని తీసుకురా, దానితో నేను యజ్ఞం పూర్తిచేస్తాను, స్వర్గమార్గం సులువై పోతుంది' అన్నాడు. అంశుమంతుడు అశ్వం కొరకు వెదుకుతూ తన పెదతండ్రులు వెళ్ళిన మార్గాన్నే పాతాళానికి వెళ్ళి అక్కడ కపిల మహర్షిని, అశ్వాన్ని కూడా చూచాడు. అంశుమంతుడు ఎంతో వినయంగా కపిల మహర్షిని ప్రార్థించగా, కపిలుడు ప్రసన్నుడై వరం కోరుకోమన్నాడు. అంశుమంతుడు అశ్వం కావాలని కోరాడు. తన పెదనాన్నల గురించి ఆయనను అడుగగా,

ఆయన బూడిద గుట్టను చూపాడు. వారిని పవిత్రులుగా చేయమని అంశుమంతుడు అడుగగా కపిలుడు మొదటి కోరిక తీర్చి, రెండవ కోరిక తీరాలంటే వారిపై గంగాజలం పారాలి అన్నాడు.

అంశుమంతుడు అశ్వాన్ని తీసుకొని వచ్చిన తర్వాత సగరుడు యజ్ఞం పూర్తిచేసి, రాజ్యం అంశుమంతునికి అప్పగించి తాను స్వర్గానికి చేరుకొన్నాడు. తన పెదనాన్నలకు విముక్తి కలిగించడమెలా అన్న ఆలోచనతో అంశు మంతుడు ఆలోచిస్తుండగా, ఆయన కుమారుడు దిలీపుడు తెలుసుకొని తపస్సు చేసి వారికి ముక్తి కలిగించాలనుకున్నాడు. దిలీపుని వల్ల కూడా కాలేదు. ఆ తర్వాత ఆయన కుమారుడు భగీరథుడు రాజ్యమేలాడు.

భగీరథుడు మహారాజుగా ధనుర్ధరుడై, చక్రవర్తియై, మహారథిగా పేరుగాంచాడు. కపిల ముని ద్వారా తన పితృగణం మృతి చెందిన విషయం తెలుసుకొని, వారికి స్వర్గప్రాప్తి లభించేందుకు అరణ్యాలకు వెళ్ళి గంగను గురించి తపస్సు చేయగా, గంగ ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకోమంటే భగీరథుడు 'ఓ వరదాయినీ! కపిలుని ఆగ్రహ జ్వాలలకు భస్మమై పోయిన మా అరవై వేల మంది పితృగణాన్ని నీ పవిత్ర జలాలతో అభిషేకిస్తే, వారికి సద్గతి ప్రాప్తిస్తుంది' అన్నాడు.

అపుడు గంగానది 'నేను ఆకాశం నుండి భువికి దిగుతున్నప్పుడు నా వేగాన్ని తట్టుకోలేక భూమి తల్లడిల్లి పోతుంది. నా వేగాన్ని ఆపగల శక్తి లేదు. అటువంటి శక్తిని నీవు పొందితే, నాకేమీ అభ్యంతరం లేదు." అన్నది. అపుడు భగీరథుడు శంకరుని గూర్చి తపస్సు చేసి, శంకరుని ప్రసన్నం చేసుకొని, ఆ మహాదేవుని తలపై నుండి గంగ దుముకునట్లు, ఆ పిదప సగర పుత్రుల భస్మమున్న తావునకు వచ్చునట్లు అనుగ్రహింప చేసికొన్నాడు. ఆ తర్వాత ఉరుకులు పరుగులతో ముందుకు వస్తున్న గంగను, పరమ శివుడు తన జటాజూటాల్లో బంధించాడు. మళ్ళీ భగీరథుని కోరిక మేరకు ఒక పాయన వదలి, దానిగుండా ప్రవాహాన్ని నేలపై వదిలాడు. తన దారిలో వున్న జహ్ను మహాముని ఆశ్రమాన్ని గంగ ముంచెత్తగా, ఆగ్రహించిన జహ్నుడు గంగాజలాన్ని త్రాగేశాడు. తిరిగి భగీరథుడు ఆయనను ప్రార్థించగా ఆయన తన చెవినుండి గంగను వదలి పెట్టాడు. ఆ విధంగా జాహ్నవి అనే పేరు దాల్చిన గంగ ముందుకు వెళ్ళి, భస్మరాశిని ముంచెత్తి, ఆ తర్వాత సముద్రాన్ని నింపింది.

ఇక, ఋష్యశృంగ వృత్తాంతాన్ని కూడ తెలుసుకొందాం:

"ధర్మరాజా! దేవనదియైన కౌశిక వద్ద కశ్యపముని ఆశ్రమం ఉండేది. కశ్యపుని కుమారుడు విభాండకుడు. ఆయన కుమారుడే ఋష్యశృంగుడు. తలపై ఒక కొమ్ముతో ఋష్యశృంగుడు జన్మించాడు. తన తండ్రి, తన ఆశ్రమం తప్ప మరేమీ తెలియని ఋష్యశృంగుడు తపస్సు చేసి ఎంతో శక్తివంతుడయ్యాడు. ఆయన ఏ చోటికి వెళ్ళినా అక్కడ ప్రకృతి శోభ పరిమళించేది. వర్షాలు విరివిగా కురిసేవి.

ధర్మరాజు ఆశ్చర్యంతో 'ప్రకృతి విరుద్ధంగా ఋష్యశృంగుడు ఎలా జన్మించాడు?' అని అడుగగా, లోమశ మహర్షి 'ధర్మరాజా! ఒకసారి కశ్యపుని కుమారుడు విభాండకుడు సరోవరంలో స్నానం చేస్తుండగా, అచట ఒక అప్సరసను చూచి, మోహంతో స్ఖలనం చేసుకొన్నాడు. అది సరోవరంలోని జలంలో కలిసి పోయింది. దాహంతో వున్న ఒక జింక వచ్చి ఆ నీటిని త్రాగింది. నిజానికి ఆ జింక 'చిత్రరేఖ' అనే అప్సరస. దేవేంద్రుని సభలో నాట్యం చేస్తుండేది. దేవేంద్రుని శాపంతో జింకగా మారి, శాపవిమోచనం కోసం ఆశ్రమం చుట్టుప్రక్కల తిరుగుతుండేది. అలా జింక గర్భం దాల్చి, మానవరూపంతోనే ఋష్యశృంగునికి జన్మనిచ్చింది. అతనికి తండ్రి తప్ప ఇతరులెవరూ తెలియరు. ఆడ, మగ భేదం కూడా తెలియదు.

అదే సమయంలో, అంగదేశాన్ని రోమపాదుడు అనే రాజు పరిపాలిస్తుండేవాడు. కరువుకాటకాలు ఏర్పడి, రాజ్యం దుర్భిక్షమైంది. మంత్రుల సలహాతో ఋష్యశృంగుని తీసికొని రావడానికి ఆయన వేశ్యలను వినియోగించాడు. ఒక వృద్ధ వేశ్య కన్య కశ్యపుడు లేని సమయంలో ఋష్యశృంగుని వద్దకు వచ్చింది. ఆ వేశ్య ఋష్యశృంగుని వద్దకు వెళ్ళగా, అతడు మీరెవరో కాని మీ శరీర కాంతిని బట్టి వందనీయ మహానుభావలనిపిస్తోంది అంటూ ఆసనం చూపించి కూర్చోమన్నాడు. మీ పేరేమి, మీ ఆశ్రమ మెచ్చట వుంది అని అడిగాడు. అందుకు ఆ వేశ్య నా ఆశ్రమం యిక్కడికి మూడు యోజనాల దూరంలో వుంది. మీరే నాకు వందనీయులు అని అన్నది. ఋష్యశృంగుడు ఫలాలు స్వీకరించమని కోరాడు.

కాని ఆ వేశ్య వాటిని తృణీకరించింది. తన వద్దవున్న స్వాదిష్ట పదార్థాల్ని ఆయనకు ఇచ్చింది. అంతేకాదు మాదక పానీయాలను కూడ ఇచ్చి, ఆటపాటలతో ముంచెత్తింది. ఋషి ప్రలోభంలో మునిగాడు. పలుమార్లు ఆలింగనం చేసుకొని, మైమరపించి, సమయం లేదని వేశ్య వెళ్ళిపోయింది.

కొంత సమయానికి కశ్యపుడు వచ్చి ఋష్యశృంగుని చూచి ఇలా దీనంగా ఉండటానికి కారణం ఏమిటని అడిగాడు. ఋష్యశృంగుడు 'తాతగారూ! బంగరు కాంతులతో మెరసే ఒక బ్రహ్మచారి ఈ ఆశ్రమంలోనికి వచ్చాడు. అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాడు' అని అనేక రకాలుగా వర్ణించి, కశ్యపునికి చెప్పాడు. పైగా అతన్ని చూచి నా మనస్సులో ప్రేమ కలుగుతోందని, శరీరం అంతా ఆర్తితో నిండిపోయిందని చెప్పాడు. చివరకు అతన్ని శాశ్వతంగా నావద్దనే ఉంచుకోవాలనిపించింది' అని చెప్పాడు. అంతట కశ్యపుడు 'నాయనా! రాక్షసులు మారువేషాలతో తిరుగుతుంటారు. నీవు వారిని నమ్మవద్దు' అని చెప్పి తన పనిమీద వెళ్ళిపోయాడు.

కశ్యపుడు లేని సమయంలో, ఆ వేశ్య మళ్ళీ వచ్చింది. ఋష్యశృంగుడు ఆమెను చూచి మా తాతగారు రాకముందే మీ ఆశ్రమానికి వళ్దాం పదండి అనగానే ఆ వేశ్య రోమపాదుని వద్దకు తీసుకొని వెళ్ళింది. ఋష్యశృంగుడు రాజ్యంలో అడుగు పెట్టగానే అక్కడ వర్షాలు కురవసాగాయి. రాజ్యం సుభిక్షమయింది.

రోమపాదుడు ఋష్యశృంగునికి తన కుమార్తె శాంతనిచ్చి వివాహం చేశాడు. కశ్యపుడు ఈ విషయం తెలిసి తాను లేని సమయంలో తనకు తెలియకుండా ఋష్యశృంగుని తీసుకొని వచ్చి, తన అనుమతి పొందకుండా వివాహం జరిపించినందుకు ఆగ్రహంతో రాజసభకు వచ్చాడు. కాని ఇంద్రుని వలె ప్రకాశిస్తున్న ఋష్యశృంగుని చూచి శాంతించాడు. ఆ తర్వాత కొంతకాలానికి ఈ విషయం తెలుసుకున్న దశరథుడు, ఆయనను తన రాజ్యానికి రప్పించి, ఆయన ద్వారా పుత్రకామేష్ఠి యాగం చేయించాడు. ఆ యాగ ఫలితంగా ఆయనకు రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు జన్మించారు.

దేవతుల్యుడైన పరశురాముని గురించి తెలుసుకొందాం.

పాండవుల వనవాస సమయంలో పరశురామునికి సన్నిహితుడైన అకృతవర్ణుడు తమ ఆశ్రమానికి రాగా, ఆయనను ఘనంగా సత్కరించి, పరాశరుని జన్మవృత్తాంతం చెప్పమని ధర్మరాజు ఆయనను కోరాడు.

అకృతవర్ణుడు ఇలా చెప్పసాగాడు. "ఓ రాజా! భృగవంశంలో జమదగ్ని కుమారునిగా దేవతుల్యుడైన పరశురాముడు జన్మించాడు. జమదగ్ని, రేణుకలకు జన్మించిన 5 మంది కుమారులలో పరశురాముడు ఆఖరివాడు.

రేణుక మహా పతివ్రత. ఆమె ప్రతిరోజూ నదికి స్నానానికి వెళ్ళి, అక్కడి ఇసుకతో కుండను తయారుచేసి, నీటిని తెచ్చేది. ఒకరోజు రేణుక స్నానంచేసి, నీరు తీసుకొని తిరిగి వస్తుండగా, విధివశాత్తు చిత్రరథుడనే గంధర్వ

రాజు తన భార్యలతో కలిసి జలవిహారం చేయడం చూచి, మనోవికారానికి లోనై ఆశ్రమానికి ఆలస్యంగా వచ్చింది. మహాతేజస్వియైన జమదగ్ని దివ్యదృష్టితో విషయాన్ని గ్రహించి, రేణుకను చంపమని కుమారులను ఆదేశించాడు. కాని కుమారులు తల్లి యందలి ప్రేమచేత ఆమెను చంపడానికి నిరాకరించారు. అపుడు పరశురాముడు మాత్రం తండ్రి ఆజ్ఞమేరకు తల్లిని రెండు ముక్కలుగా నరికేశాడు. జమదగ్ని సంతోషించి వరం కోరుకోమని పరశురాముని అడిగాడు. అప్పుడు పరశురాముడు తన తల్లిని బ్రతకించమని కోరాడు. సరేనన్నాడు జమదగ్ని. ఆ విధంగా పరశురాముడు తన తల్లి రేణుకను బ్రతికించుకున్నాడు.

ఒకరోజు పరశురాముడు బయటకు వెళ్ళాడు. ఆ సమయంలో కార్తవీర్యార్జునుడు అనే రాజు ఆశ్రమానికి వచ్చి, ఆతిథ్యం స్వీకరించి, హైహమధేనువును చూచాడు. అతినికి దానిపై ఆశ కలిగింది. ఆశ్రమాన్ని తన బలగంతో చిందరవందర చేయించి, హైహమధేనువును తరలించుకు పోయాడు. పరశురాముడు జరిగిన విషయం తెలుసుకొని, ఆగ్రహంతో కార్తవీర్యార్జునుని పైకి వెళ్ళి, అతనిని వేయి ముక్కలుగా నరికివేశాడు.

మరల పరశురాముడు ఆశ్రమంలో లేని సమయంలో, కార్తవీర్యార్జునుని కుమారులు ఆగ్రహంతో ఆశ్రమానికి వచ్చి జమదగ్నిని చంపివేశారు. ఆశ్రమానికి వచ్చిన పరశురాముడు జరిగినది గ్రహించి, దుఃఖించాడు. తండ్రి అంత్యక్రియలు నిర్వహించి, హెచ్చిన క్రోధంతో, దేశంలో రాజనే వాడు లేకుండా చేస్తానని శపథం పట్టి, కార్తవీర్యార్జునుని కుమారులపై దూకి, వారిని చంపివేశాడు. తరువాత 21 సార్లు దండయాత్ర చేసి రాజవంశాల్ని నిర్మూలించాడు. వారి రక్తం మడుగులయ్యాయి. కొందరు రాజులు మాత్రం పారిపోయి గుహలలో తలదాచుకొన్నారు. చివరకు శాంతించిన పరశురాముడు మహేంద్ర పర్వతంపై నివాసం ఏర్పరచుకున్నాడు." అని చెప్పగా, పాండవులు చతుర్దశినాడు పరశురాముని దర్శించి, అక్కడి నుండి దక్షిణ దిశగా ప్రయాణించి త్రయంబకంలో పుట్టిన గోదావరిని దర్శించి, అక్కడినుండి ప్రభాసతీర్థం చేరారు.

పాండవులు ప్రభాసతీర్థంలో వున్నారని తెలిసి, శ్రీకృష్ణుడు, బలరాముడు కొంతమంది యాదవ ప్రముఖులను వెంటబెట్టుకొని వచ్చాడు. పాండవుల కష్టాలు చూసి కౌరవులపై ఆగ్రహించిన యాదవులను ధర్మరాజు శాంతింపజేసి, శ్రీకృష్ణ బలరాములను ద్వారాకకు సాగనంపాడు. తదుపరి పాండవులు పయోష్ణి నదిలో స్నానం చేసి నర్మదా నదీ తీరానికి చేరుకున్నారు. దాని ప్రక్కనే వున్న వైఢూర్య పర్వతాన్ని కూడా దర్శించారు.

ఇక చ్యవన మహాముని గురించి తెలుసుకుందాం.

రోమశుడు ధర్మరాజుతో ఇలా చెప్పాడు. 'ధర్మరాజా! భృగుమహర్షి కుమారుడైన చ్యవనుడు ఇక్కడ చాలా కాలం తపస్సు చేశాడు. అతని శరీరం చుట్టూ పుట్టలేర్పడినాయి. తీగెలు పాకాయి. ఒకనాడు శర్యాతి మహారాజు కుమార్తె సుకన్య అటుగా వచ్చి పుట్టలోనుండి కనిపిస్తున్న కళ్ళను చూచి, ఆ వింతను దర్శించాలనే కోరికతో పుట్టను త్రవ్వించింది. చ్యవనుడు ఆగ్రహించి శర్యాతిని ససైన్యంగా మూత్రం, పురీషం స్తంభింపజేశాడు. విషయం తెలుసుకొన్న శర్యాతి చ్యవనుని వద్దకు వచ్చి ఇది తెలియక జరిగిన అపచారమని మన్నించమని వేడగా, సుకన్యను తనకిచ్చి వివాహం చేస్తే, అపచారం నశిస్తుందని అన్నాడు. చేసేదిలేక ఇష్టం లేకపోయినా శర్యాతి చ్యవనునితో సుకన్యకు వివాహం చేశాడు. ఒకనాడు అశ్వనీ దేవతలు అక్కడకు వచ్చి, సుకన్యతో 'నీవంటి అందగత్తెకు చ్యవనుడిలాంటి వృద్ధుడు తగడు' అనగా ఆమె 'నేను నా భర్తను ప్రేమిస్తున్నాను' అని అన్నది. అశ్వనీ దేవతల విషయం చ్యవనునికి చెప్పగా వారి సలహా ప్రకారం నడుచుకోమన్నాడు. సరేనని సుకన్య అశ్వనీ దేవతలతో తనకు సుందరాంగుడైన వరుణ్ణి ప్రసాదించమని కోరింది. అపుడు వారు చ్యవనునితో సహా సరోవరంలో మునిగి

నవయవ్వన యువకుల రూపంలో బయటకు వచ్చారు. తమలో చ్యవనుని వరించమని చెప్పగా, తన పాతివ్రత్య మహిమతో ఆమె చ్యవనుని గుర్తించింది. అపుడు అశ్వనీ దేవతలతో చ్యవనుడు శర్యాతి చేసే యజ్ఞంలో వారికి సోమరసం అందిస్తానని చెప్పాడు. అదేవిధంగా వారికి సోమరసం త్రాగించబోగా ఇంద్రుడు అడ్డుపడ్డాడు. కాని చ్యవనుడు హోమం నుండి ఒక భయంకరాకారుని సృష్టించి, ఇంద్రుని నిగ్రహించాడు. ఇంద్రుడు భయపడి చ్యవనునితో తనను క్షమించమని కోరాడు. చ్యవనుడు సృష్టించిన రాక్షసుడు కాముకులైన స్త్రీలలోను, మద్యంలోను, పాచికలలోను, మృగములలోను ప్రవేశించాడు.' అని చెప్పాడు.

ఆ తర్వాత పాండవులు పైంధవారణ్యంలోకి ప్రవేశించగా, రోమశుడు యమునా నదిని చూపించి, అక్కడి విశేషాల్ని క్రింది విధంగా తెలియజేశాడు.

"ధర్మరాజా! ఇది గంగానదితో సమానమైనది. దీని తీరాన మాంధాత అనే మహారాజు ఎన్నో యాగాలు చేశాడు. పూర్వం ఇక్ష్వాకు వంశంలో ధార్మికుడు, కీర్తివంతుడు, బలవంతుడూ అయిన యవనాశ్వుడనే రాజు వుండేవాడు. సంతానం కోసం అతడు భృగు మహర్షిని ప్రార్థించగా, ఆయన రాజు చేత పుత్రకామేష్టి యాగం చేయించాడు. మంత్రజలాన్ని తన శిష్యులను జాగ్రత్త చేయమన్నాడు భృగుమహర్షి. యవనాశ్వుడు దాహం వేయడంతో చూసుకోకుండా ఆ మంత్రజలాన్ని తాగేశాడు. భృగుమహర్షి అది తెలుసుకొని నీ భార్యచేత త్రాగించ వలసిన మంత్రజలాన్ని నీవు త్రాగావు కాబట్టి నీవు గర్భం ధరిస్తావని చెప్పాడు. ఆ విధంగా యవనాశ్వుడు గర్భం ధరించగా, అతని శరీరంలోని ఎడమ భాగాన్ని చీల్చి, మాంధాత జన్మించాడు. ఆ శిశువును ఇంద్రుడు చూడవచ్చి ఆ శిశువు నోటిలో చూపుడు వేలుపెట్టి 'ఇది అమృతము, దీనిని తాగ'మని చెప్పాడు. అందువలన అతనికి మాంధాతృడు అని నామకరణం చేశారు. మాంధాత చాలకాలం రాజ్యపాలన చేసి, తన పరాక్రమంతో ఎన్నో రాజ్యాలను జయించాడు. యజ్ఞయాగాలు చేశాడు. ఇంద్రునితో యుద్ధం చేసి రాజ్యంలో సకాలంలో వానలు కురిసేలా చేశాడు. మాంధాత, సోమక మహర్షి, నహుషుడు, అంబరీషుడు వంటివారు యాగంచేసిన పుణ్యభూమి ఇది. నిషధ దేశంలోని సరస్వతీ నది అక్కడ మాయమై ఇక్కడ వెలిసింది. ధర్మజా! ఇది విష్ణుపద తీర్థం.' అని చెప్పాడు.

ఇప్పుడు మహాదాత, ఉదార స్వభావి, త్యాగశీలి అయిన శిబి చక్రవర్తిని గురించి తెలుసుకుందాం.

చక్రవర్తులలో శిబి చక్రవర్తి వంటివాడు మరొకడుండడు, ఆయనకు ఆయనే సాటి. శిబి తల్లి పేరు మాధవి, తండ్రి పేరు ఉశీనరుడు. ఉశీనర రాజ్యానికి రాజు. శిబి అజాతశత్రుడని పేరుపొందిన చక్రవర్తి. అతని దానగుణం విని ఇంద్రుడు అతనిని పరీక్షించ దలచాడు. తాను డేగరూపం దాల్చగా, అగ్నిదేవుడు పావురంగా మారి శిబి చక్రవర్తి యజ్ఞంచేస్తున్న సభాస్థలికి వెళ్ళి ఆయన ఒడిలో వ్రాలాడు. మానవ భాషలో శిబితో 'రాజా! నన్ను తరుముకు వస్తున్న డేగనుండి కాపాడండి.' అన్నాడు. అంతలో అక్కడికి వచ్చిన డేగ, 'రాజా! ఈ పావురం ఈరోజు నాకు ఆహారంగా దొరికింది. దాన్ని నాకు వదలిపెట్టు. నాకు తీరని ఆకలిగా వుంది. ఆ పావురాన్ని తిని ఆకలి తీర్చుకుంటా'నని మానవ భాషలో పలికింది. అపుడు శిబి 'నీవు ధర్మాధర్మాలు తెలిసినదానవుగా వున్నావు. ప్రాణరక్షణ కోసం నన్ను శరణు కోరిన పావురాన్ని విడిచి, వేరే ఆహారం వెదుక్కో' అన్నాడు. కాని డేగ తన నోటిముందు ఆహారాన్ని తనకు దక్కకుండా చేయవద్దంది. అందుకు శిబి అంగీకరించకపోయేసరికి, డేగ శిబి శరీరంలో పావురం బరువుకు తగ్గ మాంసాన్ని ఇవ్వమని అడిగింది. సరేనని శిబి తన కుడి తొడలోని కొంత మాంసాన్ని ఒక త్రాసులో ఒకవైపు కోసి వుంచాడు. రెండవ వైపు పావురాన్ని వుంచగా అది తూగలేదు. మరికొంత

మాంసాన్ని వేశాడు. కాని త్రాసు తూగలేదు. అప్పుడు తన శరీరాన్ని పూర్తిగా త్రాసులో వుంచాడు. అదిచూచిన ఇంద్రుడు, అగ్ని తమ నిజరూపాలను ధరించి, ఆయన దానగుణాన్ని వేనోళ్ళ పొగిడి, ఆయనకు వరాలిచ్చి, ఆయన శరీరాన్ని యధాతథంగా మార్చి, వారిని దీవించి వెళ్ళారు. ఆ విధంగా శిబి చక్రవర్తి శరణాగత రక్షకునిగా మరింత పేరు సంపాదించాడు." అని చెప్పాడు.

ఇపుడు అష్టావక్రుని గురించిన విశేషాలు తెలుసుకుందాం.

పూర్వం ఉద్దాలకుడు అనే ముని వుండేవాడు. అతనికి ఏకపాదుడు అనే పేరుగాంచిన శిష్యుడు వుండేవాడు. ఆయన ఉద్దాలకుని వద్ద వేదాలు బాగా అభ్యసించాడు. ఇతని భార్య సుజాత. ఈమె ఉద్దాలకుని కుమార్తె. ఈమె గర్భవతి కాగానే, ఆమె గర్భం తేజోవంతంగా ప్రకాశిస్తూ వుండేది. ఒకసారి ఏకపాదుడు వేదం చదువుతుండగా, ఆమె గర్భంలోనుండి, 'నాన్నగారూ! మీరు చదువుతున్న వేదాలు సరిగ్గా లేదు' అనే మాట వినిపించింది. అది వినగానే తండ్రి అహం దెబ్బతిని, 'నీవు గర్భంలో ఉండగానే వంకర టింకరగా మాట్లాడుతున్నావు కనుక నీవు అష్ట వంకరలతో జన్మించెదవు గాక' అని శపించాడు.

సుజాత కోరిక మేరకు ఏకపాదుడు ధనం నిమిత్తం జనక మహారాజు వద్దకు వెళ్ళాడు. అక్కడ శాస్త్ర విషయంలో జరిగిన చర్చలో ఓడిపోయి, షరతు ప్రకారం నీటిలో ముంచివేయబడ్డాడు. విషయ తెలుసుకొన్న ఉద్దాలకుడు సుజాతకు చెప్పి అష్టావక్రునికి తెలియకుండా వ్యవహరించమని కోరాడు. నీట మునిగింది తన తండ్రియే నని భావించిన అష్టావక్రుడు శ్వేతక మునితో మాట్లాడి, ఇద్దరూ కలిసి జనక మహారాజు యజ్ఞశాలకు చేరారు. కాని ద్వారపాలకులు అడ్డగించారు. ఎంత చెప్పినా వినకపోవడంతో, ద్వారపాలకులు ఈ బాలురను జనక మహారాజు వద్దకు తీసుకొని వెళ్ళారు.

అష్టావక్రుడు రాజుతో 'రాజా! మీవద్ద 'వంది' అనే అతడు అందరినీ శాస్త్రాల్లో ఓడిస్తున్నాడట కదా! నీట ముంచుతున్నాడట కదా! నేను అతనితో అద్వైత బ్రహ్మను గురించి శాస్త్రార్థం చేయగలను' అని చెప్పగా, రాజు ఆశ్చర్యపడి, అష్టావక్రుని అనేక ప్రశ్నలడిగాడు. అన్ని ప్రశ్నలకు చక్కగా సమాధానం యిచ్చాడు అష్టావక్రుడు. అది విన్న మహారాజు అష్టావక్రుని వందితో శాస్త్రచర్చకు అనుమతించాడు. వంది అష్టావక్రునితో 'ఓ అష్టావక్రా! అగ్ని ఒకటే అయినా అనేక రకాలుగా ప్రకాశిస్తోంది. సూర్యుడు ఒకడే తేజోవంతంగా ప్రకాశిస్తున్నాడు. శత్రువులను నశింప జేయు దేవరాజు ఇంద్రుడు ఒక్కడే. పితరుల ఈశ్వరుడుగా యముడు ఒక్కడే అని తెలుసుకో!' అని వంది అన్నాడు.

అది విన్న అష్టావక్రుడు వందితో 'ఓ వందీ! ఇంద్రుడు, అగ్ని వీరిద్దరు దేవతలై వున్నారు. నారదుడు మరియు పర్వతకుడు ఇద్దరూ దేవర్షులైనారు. అశ్వినీ కుమారులు కూడ ఇద్దరే. రథానికి చక్రాలు రెండే. విధాత పతీపత్నులను సహచరులుగా సృష్టించాడని తెలుసుకో' అని అష్టావక్రుడు అన్నాడు.

ఇద్దరి మధ్య వాదోపవాదాలు హెచ్చి, ఒకచోట వందికి శ్లోకభాగం గుర్తుకు రాకపోగా, అష్టావక్రుడు దానిని పూర్తిచేసి శ్లోకం మొత్తం చెప్పేశాడు. ఇలా చెప్పి, వందిని ఓడించాడు అష్టావక్రుడు. అపుడు వంది 'ఓ రాజా! ఓడిపోయినవాడు నీట మునగాల్సి వుంది. నిజమే. నేను వరుణుని కుమారుణ్ణి. ఓడిపోయిన వారినందరిని వరుణదేవుని యజ్ఞానికి సహాయకారులుగా పంపాను. వారినందరినీ ఇప్పుడే రప్పిస్తాను. అష్టావక్రుని తండ్రిని

కూడ రప్పించాడు. ఏకపాదుడు తన కుమారుడైన అష్టావక్రుని దగ్గరలోనున్న నదిలో స్నానం చేయించి, సర్వాంగ సుందురుడైన యువకుడుగా మార్చాడు." అని చెప్పాడు.

తర్వాత పాండవులు సంగమ నదీతీరానికి వచ్చారు. అక్కడ రైభ్యాశ్రమం, భరద్వాజాశ్రమం చూపించి రోమశుడు దాని గురించిన విశేషాలు క్రింది విధంగా తెలియజేశాడు.

"ధర్మరాజా! పూర్వం రైభ్యుడు, భరద్వాజుడనే మహర్షులు మిత్రులుగా వుండేవారు. రైభ్యునికి అర్ధావసు, పరావసు అనే కుమారులున్నారు. భరద్వాజుని కుమారుడు యవక్రీతుడు. అతనికి రైభ్యుని కుమారులంటే ఈర్ష్య, అసూయ. కష్టపడకుండానే విద్య నేర్వాలనే ఉద్దేశ్యంతో ఇంద్రుని గురించి తపస్సు చేశాడు. ఇంద్రుడు ప్రత్యక్షమవగా తాను తలచినంతనే తనకు విద్య రావాలని కోరాడు. ఇంద్రుడు గురువు లేకుండా తపస్సుతో వచ్చే విద్య నిలవదు. గురుముఖంగానే విద్య నేర్వాలని చెప్పి వెళ్ళిపోయాడు. కాని యవక్రీతుడు పట్టుదలతో మరల ఇంద్రుని గురించి తపస్సు చేసి, తాను కోరిన వరం పొందాడు. అనేకమందిని తన పాండిత్యంతో ఓడించాడు.

ఒకనాడు యవక్రీతుడు రైభ్యుని ఆశ్రమానికి వచ్చి, పరావసు భార్య కృష్ణను చూచి మోహించి తన కోరిక తీర్చమన్నాడు. ఆమె ఏదో సాకు చెప్పి అప్పటికతనని వదిలించుకొంది. విషయం తన మామగారికి చెప్పగా రైభ్యుడు ఆగ్రహించి, అగ్నిగుండంలో తన జటను వేసి ఒక రాక్షసుని సృష్టించాడు. మరొక జటను వేసి కృష్ణ మాదిరి వుండే ఒక స్త్రీని సృష్టించాడు. వారితో యవక్రీతుని చంపమని చెప్పాడు. కృష్ణలా వున్న యువతి యవక్రీతుని మోహింపజేసి, మాయోపాయంతో అతని కమండలాన్ని తస్కరించింది. దాంతో యవక్రీతుడు అపవిత్రుడు కాగా, రాక్షసుడు అతనిని సంహరించాడు. ఇది తెలిసి భరద్వాజుడు తానుకూడా ప్రాయోపవేశం చేసి మరణించాడు.

బృహద్యుముడనే రాజు తాను చేస్తున్న సత్రయాగానికి రైభ్యుని కుమారులను ఋత్విక్కులుగా నియమించాడు. ఒకరాత్రి పరావసు ఆశ్రమానికి వస్తున్నపుడు ఏదో అలికిడి వినిపించి, ఎదురుగా వస్తున్న వ్యక్తిని చంపేశాడు. తీరాచూడగా, తాను చంపినది తన తండ్రినే అని గ్రహించి, ఎంతో దుఃఖించి ఆయన అంత్యక్రియలు నిర్వహించి, జరిగిన విషయం తన అన్న అర్ధావసుకు చెప్పి, అర్ధావసుతో తనను బ్రహ్మహత్యాపాతకం నుండి తప్పించమని కోరాడు. తమ్ముని బదులుగా అర్ధావసు తండ్రికి కర్మలు నిర్వహించి, తమ్మునికి బ్రహ్మహత్యా పాతకం అంటకుండా చేశాడు. తర్వాత యాగశాలలోకి ప్రవేశిస్తున్న అతనిని చూచి పరావసు బృహద్యుమ్ననితో 'రాజా! ఇతడు పవిత్రమైన యాగ క్రతువును విడిచి బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తం చేశాడు' అని చెప్పాడు. అర్ధావసు జరిగిన విషయమంతా రాజుకు విన్నవించాడు. యాగంలో పాల్గొన్న దేవతలు అతని సత్యనిష్ఠను ప్రశంసించి, అతని కోరిక మీద అతని తండ్రి రైభ్యుని, భరద్వాజుని, యవక్రీతుని కూడా బ్రతికించారు." అని చెప్పాడు.

ఇపుడు సౌగంధికాపహరణ ఘట్టంలో భీమసేనుడు ఆంజనేయుని ఎలా కలిశాడో తెలుసుకుందామా!

అనుకోని రీతిలో ద్రౌపది సౌగంధికా పుష్ప సౌందర్యాన్ని తెలుసుకొని, ముగ్ధురాలై, అలాంటి పుష్పాలు తెచ్చిపెట్టమని భీమసేనుని కోరుతుంది. సరేనని భీమసేనుడు గంధమాదన పర్వతాన్ని చేరుకున్నాడు. భీమసేనుని గర్జనలకు క్రూర మృగాలు కూడా పరుగెత్తి పోతున్నాయి. అక్కడ ఒక అరటితోటలో విశ్రాంతి తీసుకుంటున్న ఆంజనేయుడికి భీమసేనుడు వస్తున్న సమాచారం తెలిసింది. ఆంజనేయుడు చిన్నగా తోకను ఆడించినంత మాత్రాన చుట్టుప్రక్కల ఉన్న చెట్లు పెకలించబడ్డాయి. భీముడు ఈ భయంకర శబ్దం విని, అటూ ఇటూ

చూస్తుండగా, ఒక వానర రాజు శిలపై నిద్రపోతున్నాడు. భీముడు ఆ వానరము యొక్క తోకను తొలగించమని కోరగా, ఆ వానర రాజు 'అయ్యా! నేను వృద్ధుణ్ణి, నీవే తొలగించుకొని వెళ్ళు' అని అనగా భీమసేనుడు ప్రయత్నించి, విఫలుడైనాడు. అపుడు భీముడు 'నీవు ఈ రూపంలో ఉన్న ఏ దేవుడవో చెప్పు, నన్ను క్షమించు' అని అన్నాడు. అపుడు ఆంజనేయుడు 'భీమా! నేను నీ సోదరుడను. నీకు దర్శనమివ్వాలని ఈ నాటకం ఆడాను.' అన్నాడు. అపుడు భీముడు 'ఓ నా సోదరా! ఆంజనేయా! నీవు సముద్రాన్ని లంఘించినవాడవు. నీ దివ్య రూపాన్ని నాకు చూపించు' అని ప్రతిమలాడాడు. ఆంజనేయుడు తన విశ్వరూపాన్ని చూపగా, భీముడు పులకాంకితుడైనాడు. తేజోవంతమైన ఆ విశాల శరీరాన్ని చూడలేక భీముడు ఆ రూపాన్ని ఉపసంహరించుకోమని ఆంజనేయుని కోరాడు. ఆంజనేయుడు భీముని కౌగిలించుకొని, కుబేరుని తోటలోని సౌగంధికా పుష్పాలను తీసికొని వచ్చే సమయంలో యక్షులతో జాగ్రత్తగా వుండమని చెప్పి అదృశ్యమైనాడు. భీముడు కైలాస పర్వత సమీపంలో వున్న కుబేరుని రాజభవనం వద్ద సరోవరంలోని నీటిని త్రాగాడు. ఇంతలో రాక్షసులు భీముని అడ్డుకొన్నారు. ఆ రాక్షసులు కుబేరుని వద్దకు వెళ్ళి విషయం వివరించగా, కుబేరుడు శాంతంగా 'అన్నీ నాకు తెలుసు, ద్రౌపది కోరితే భీముడు సౌగంధికా పుష్పాల కోసం వచ్చాడు. అతనిని నిరోధించవద్దు' అని చెప్పి పంపాడు. భీముడు సౌగంధికా పుష్పాలను తెచ్చి ద్రౌపదికిచ్చి సంతోషింప జేశాడు.

ఘటోత్కచుని సాయంతో పాండవులందరు భీముని వద్దకు చేరారు. ఆకాశ వాణి హెచ్చరిక ప్రకారం వారు అత్యంత ప్రయాసపడి బదరికాశ్రమం చేరుకొన్నారు.

జటాసుర వధను గురించి తెలుసుకుందాం.

ఒకసారి జటాసురుడనే రాక్షసుడు బ్రాహ్మణ వేషధారియై ధర్మరాజును శరణు వేడి, అక్కడే వారితో ఉండసాగాడు. ఒకరోజు భీముడు అడవిలోకి వెళ్ళడం చూసి, మహర్షులు స్నానం చేస్తుండగా, జటాసురుడు భయంకర రూపం దాల్చి, పాండవులను ద్రౌపదితో సహా సమస్త ఆయుధాలను ఎత్తుకు పోసాగాడు. ధర్మరాజు ఎంత చెప్పినా వినలేదు. సహదేవుడు తనతో యుద్ధం చేయమని అడిగాడు. భీముడు అల్లంత దూరంనుండి వస్తూ జటాసురుని చూశాడు. జటాసురుడు అందరినీ వదలి భీముని ఎదిరించాడు. ఇద్దరి మధ్య భయంకరమైన పోరు సాగింది. భీముడు చివరకు ఒక్క పిడిగుద్దుతో జటాసురుని యముడి దగ్గరకు పంపాడు.

అర్జునుని ప్రవాస విశేషాలను గురించి తెలుసుకొందాం:

అర్జునుడు స్వర్గలోకం నుండి ఇంద్రుని రథంపై పాండవులు ఉన్న చోటికి వచ్చి దిగాడు. వెంటనే ధౌమ్యునికి, ధర్మరాజుకు, భీమునికి నమస్కరించాడు. నకుల, సహదేవుల్ని దగ్గరకు తీసుకున్నాడు. ప్రేమగా ద్రౌపదిని పలకరించి, ధర్మరాజు వద్ద వినయంగా నిల్చున్నాడు. అర్జునుడు రావడంతో పాండవులు సంతోషించారు. ఇంద్రుడు ఇచ్చిన బందారు కానుకలు ద్రౌపదికి ఇచ్చాడు. ధర్మరాజు అర్జునుని ప్రవాస విశేషాలు చెప్పమని అడిగారు. అర్జునుడు తాను హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేస్తుండగా అడవి పంది రావడం, పరమేశ్వరునితో యుద్ధం చేయడం, పార్వతిపరమేశ్వరులు ప్రత్యక్షం కావడం, శంకరుడు పాశుపతాన్ని ఇవ్వడం వంటి విషయాలను వివరంగా చెప్పాడు. ఆ తర్వాత దివ్యరథంలో తనను మాతలి ఇంద్రలోకానికి తీసకు వెళ్ళడం, ఇంద్రుని ఆజ్ఞ మేరకు మాతలిని రథసారధిగా చేసికొని రాక్షసులను చంపటానికి బయలుదేరి వెళ్ళి సముద్రం లోపల దాక్కున్న

నివాత కవచ రాక్షసులతో యుద్ధం చేస్తుండగా, వారు మాయా రూపాల్లో విజృంభించడం, తన దివ్యాస్త్రాలతో వారిని సంహరించడం, తిరుగుమార్గంలో కాలకేయులను సంహరించి, ఇంద్రుని చేరి ఆయన ప్రశంసలందుకోవడం వంటి విషయాలన్నీ చెప్పాడు. అపుడు ధర్మరాజు ఆ నివాత కవచ రాక్షసులను చంపిన ఆ దివ్యాస్త్ర ప్రయోగాన్ని చూడాలనుకొంటున్నానని అన్నాడు. వెంటనే అర్జునుడు ఆ దివ్యాస్త్రాన్ని ప్రయోగించగానే వాయువు స్తంభించడం సూర్యకాంతి తగ్గడం ప్రారంభమైనాయి. దేవతలు నారదుని అర్జునుని దగ్గరకు పంపి అస్త్ర ఉపసంహారం చేయించారు.

పదివేల ఏనుగుల బలంగల భీముడు సర్పం చేత చిక్కడం ఆశ్చర్యమే కదా! అదేమిటో తెలుసుకొందామా!

పాండవులు గంధమాదన పర్వతం నుండి బయలుదేరి అనేక ప్రాంతాలను చూస్తూ, ద్వైతవనానికి చేరుకొన్నారు. అక్కడ వారు నాలుగు సంవత్సరాలు గడిపారు. మొదటి ఆరు సంవత్సరాల వనవాసంతో మొత్తం 10 సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒకరోజు భీముడు ఒంటరిగా తిరుగుతున్న సమయంలో ఒక గుహలోకి వెళ్ళాడు. అందులో ఉన్న ఒక కొండచిలువ భీముని చుట్టుకొంది. అంత బలవంతుడు కూడ అచేతనంగా ఉండిపోయాడు. ఆ సర్పం ఎవరిని చుట్టినా అంతేనట. కనుక భీముడు కూడ ఏమీ చేయలేక పోయాడు. భీముని వెదుకుతూ వచ్చిన ధర్మరాజు ఇది చూసి ఆశ్చర్య పడ్డాడు. ధర్మరాజు ఆ సర్పంతో 'బలవంతుడైన నా తమ్ముడు నీకెలా పట్టుబడ్డాడు? నీకు వలసిన ఆహారం నేను ఇస్తాను. నా తమ్ముని వదలి పెట్టు' అని అడిగాడు. ఆ కొండచిలువ ఇలా అన్నది. "ఓ రాజా! పూర్వ జన్మలో నేను నహుషుడనే రాజును. శాపవశాన ఇలా అయ్యాను. భీముడు నా దగ్గరగా రావడంతో నేను పట్టుకొన్నాను. నీవు నా ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగితే నీ తమ్ముని వదులుతాను' అని అన్నది. ధర్మరాజు సర్పమడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానాలను చెప్పాడు. చివరగా 'బ్రాహ్మణు డెవరు? శూద్రు డెవరు?' అని అడిగింది. సత్యం, దయ, క్షమాగుణం గలిగిన వారందరు బ్రాహ్మణులు, ఆ గుణములు కలిగియున్న శూద్రులు కూడ బ్రాహ్మణులే అని చెప్పాడు. మిగిలినవారు శూద్రులవుతారు అని ధర్మరాజు చెప్పగానే సర్పం దివ్య తేజస్సుతో తన నిజరూపాన్ని పొంది దేవతారూపంలో సాక్షాత్కరించింది. అపుడు ధర్మరాజు ఆ సర్పం యొక్క శాప వృత్తాంతం చెప్పమని అడుగగా, ఆ సర్పం "ఓ రాజా! నేను ధనమదంతో అహంకరిస్తూ వ్యవహరించేవాడను. ఆకాలంలో నేను స్వర్గానికి రాజుగా ఉండి, దేవతలు, గంధర్వులు, బ్రహ్మర్షులను, యక్ష రాక్షసులను మరియు నాగులను సుంకం చెల్లించేటట్లు చేశాను. మహర్షులు నా పల్లకి మోసేవారు. ఒకరోజు మహర్షులు నా పల్లకి మోస్తుండగా, అగస్త్యుని నేను కాలితో తన్నినందున ఆయన నన్ను శపించాడు. శాపవిమోచన మడుగగా, ధర్మరాజు వల్ల విమోచనం జరుగుతుందని చెప్పాడు. అప్పటినుండి ఇక్కడే పడివుండి, నీవల్ల శాపవిమోచనం పొందాను' అని చెప్పి తపస్సుకు వెళ్ళిపోయాడు. ధర్మరాజు భీమసేనుని తీసుకొని ఆశ్రమానికి బయలుదేరాడు.

శ్రీకృష్ణుడు మరియు మార్కండేయ మహర్షి కామ్యక వనానికి వచ్చి పాండవులను కలిసిన విషయాన్ని తెలుసుకొందాం.

శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి వస్తున్నాడని పాండవులు తెలుసుకొని ఎదురేగి స్వాగతించారు. శ్రీకృష్ణుడు అందరినీ పలకరించి, అర్జునుని దగ్గరకు తీసుకొన్నాడు. సత్యభామ ద్రౌపదిని చూచి ఆలింగనం చేసుకొంది. కుశల ప్రశ్నలైన తర్వాత మార్కండేయ మహర్షి వచ్చాడు. తపోవృద్ధుడైనా మార్కండేయుడు యువకుడిలా కనిపిస్తాడు. అందరూ మహర్షికి పూజాదికాలు నిర్వహించారు. ధర్మరాజు కోరిక మేరకు మార్కండేయ మహర్షి ఇలా ఉపదేశించాడు. 'సర్వభూతాల యందు దయచూపాలి. సర్వులకూ హితము చేకూర్చాలి. సత్యం పలకాలి.

ఇతరులను దోషులుగా చూడరాదు. ఇంద్రియ నిగ్రహం కలిగి వుండాలి. ప్రజారక్షణ అవశ్యం. ధర్మాన్ని ఆచరిస్తూ, అధర్మాన్ని వదలివేయాలి. దానం చేయాలి. దేవతలను, తల్లిదండ్రులను పూజించాలి." ఈ విధంగా అనేక విషయాలు చెప్పాడు.

ఒక పతివ్రతా స్త్రీ గురించి తెలుసుకొందాం.

ఒకరోజు ధర్మరాజు పతివ్రతా స్త్రీలను గురించి చెప్పమని మార్కండేయ మునిని కోరాడు.

మార్కండేయ మహర్షి ఇలా చెప్పాడు.

"ధర్మరాజా! పూర్వం కౌశికుడు అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు గొప్ప తపస్వి, ధర్మాత్ముడు కూడ. వేదవేదంగాలు, ఉపనిషత్తులు అధ్యయనం చేసి వున్నాడు. ఒకరోజు కౌశికుడు ఒక చెట్టు క్రింద కూర్చొని వేదపఠనం చేస్తున్న సమయంలో, ఆ చెట్టు మీద కూర్చొన్న కొంగ కౌశికుని మీద రెట్ట వేసింది. మహర్షి ఆ పక్షిని కోపంతో చూడసాగాడు. ఆయన తీవ్రమైన దృష్టితో ఆ పక్షి మలమల మాడి క్రిందపడిపోయింది. దీనిని చూచిన కౌశికుని హృదయంలో కరుణ ఉదయించింది. అతని నోటినుండి అనుకోకుండానే ఈ మాటలు వచ్చాయి. "అయ్యయ్యో! నేను క్రోధమునకు బానిసనై చేయరాని పని చేసితిని కదా!"

ఆ తరువాత కౌశికుడు ఊరిలోనికి భిక్షాటనకు బయలుదేరి, ఒక ఇంటి ముందు నిలబడి, "భవతీ భిక్షాందేమి" అని అడిగాడు. ఆ సమంల ఆ ఇల్లాలు పాత్రలు శుభ్రం చేసుకొంటూ, ఆగండి ఇప్పుడే వస్తాను అని చెప్పింది. ఇంతలో ఆమె భర్త అలసిపోయి ఆకలితో ఇంటికి రాగా, ఆమె భర్తకు సేవలు చేస్తూ, భోజనం వడ్డిస్తూ, బయట వేచివున్న కౌశికుని సంగతి మరిచిపోయింది.

పతినే ప్రత్యక్షదైవంగా భావించే ఆ ఇల్లాలు, భర్త మిగిల్చిన ఆహారాన్నే తాను తిని, ఆయనకు సేవలు చేస్తూ, చటుక్కున బ్రాహ్మణుడు గుర్తుకు వచ్చి, భిక్ష తీసికొని అనుమానంతో బయటకు వచ్చింది.

బయట వేచివున్న కౌశికుడు ఆలస్యం తాళలేక ఆగ్రహంతో ఆ ఇల్లాలిని చూచి 'దేవీ! ఇప్పుడే వస్తాను అని చెప్పిన నీవు ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చావు?' అని అడిగాడు. అపుడు ఆ ఇల్లాలు శాంతంగా "పండితవర్యా! నా పతియే నాకు దైవసమానుడు. నేను ఆయన సేవకు అంకితమై యున్నాను.' అన్నది.

కౌశికుడు కోపంతో 'ఏమంటివి, ఏమంటివి? నీకు ఈ బ్రాహ్మణుని కంటె పతియే గొప్పవాడనుకొంటివా. నీకు బ్రాహ్మణ శక్తియుక్తులు తెలియవు. మేమనుకొంటే ఈ ప్రపంచాన్ని భస్మం చేయగలం తెలుసునా?' అన్నాడు.

అపుడు ఆ ఇల్లాలు ఇలా అన్నది."ఓ తపస్వీ! కోపగించకు. నేనేమి నీ చూపుల తాకిడికి మాడి మసైపోయిన కొక్కెరను కాను. గుడ్లురిమి ఎందుకు చూస్తున్నావు? నేను బ్రాహ్మణులను అవమానించ దలచుకోలేదు. జరిగిన ఆలస్యానికి క్షమించమని కోరుతున్నాను. మొదట మీరు మీ క్రోధాన్ని జయించుకోండి. ఎవరి ధర్మమేమిటో తెలుసుకోవాలనుకంటే, మిథిలా నగరంలో ఉన్న ధర్మవ్యాధుని వద్దకు వెళ్ళండ" అనగా, కౌశికుని కోపం నశించి, శాంతచిత్తుడైనాడు. శుభము కలుగు గాక! అని దీవించి, మిథాలా నగానికి బయలుదేరాడు. తాను భస్మము చేసిన పక్షిని గురించి ఆ ఇల్లాలికి ఎలా తెలిసిందనే విసయం గురించి చింతించ సాగాడు.

కౌశికుడు మిథిలా నగరమునకు చేరి, ధర్మవ్యాధుడున్న స్థలానికి చేరి, మౌనంగా కూర్చొని ఉన్నాడు. అక్కడ ధర్మవ్యాధుడు మాంసం విక్రయిస్తూ కనిపించాడు. కౌశికుని గమనించిన ధర్మవ్యాధుడు, బయటకు వచ్చి, ఆయనకు నమస్కరించి పతివ్రతా శిరోమణి పంపగా వచ్చారు కదా అని చెప్పి, తన ఇంటికి తీసుకొని పోయాడు. దానికీ కౌశికుడు ఆశ్చర్య పడినాడు. మాంసం విక్రయించడం బాధగా వున్నదని కౌశికుడు అనగా, ధర్మవ్యాధుడు ఇలా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా! ఈ కులవృత్తి నాకు అనాదిగా వచ్చింది. ధర్మబద్ధుడనై, నా తల్లిదండ్రులను సేవించుకొంటున్నాను. సత్యమునే పలుకుతాను, యధాశక్తి దానం చేస్తాను." ఆ తరువాత కౌశికుడు అడిగిన అనేకానేక ధర్మసూక్ష్మాలు, తత్త్వవివేచన గురించి ధర్మవ్యాధుడు సవిస్తరంగా వివరించాడు.

తల్లిదండ్రుల యెడల భక్తితాత్పర్యాలు ఎలా ఉండాలో ధర్మవ్యాధుడు ప్రత్యక్షంగా చూపించాడు.

ఆశ్చర్యచకితుడైన కౌశికుడు ఇలా అన్నాడు. "ధర్మవ్యాదా! నీవు శూద్రడవై వుండికూడ బ్రాహ్మణుడవేనని నేను విశ్వసిస్తున్నాను." అని చెప్పి, తృప్తితో తిరిగి వెళ్ళాడు కౌశికుడు.

శిబి చక్రవర్తిని గురించిన అడిగిన విధంగానే, ధర్మరాజు ఇపుడు కార్తికేయుని గురించి చెప్పమని అడుగుతున్నాడు. విందామా!

పూర్వకాలంలో దేవాసురులకు యుద్ధాలు జరుగుతూ వుండేవి. దేవతలు ఎక్కువగా నష్టపోతూ వుండేవారు. అందుచేత ఇంద్రుడు మానస పర్వతం చేరి, తీవ్రంగా ఆలోచించి, దేవసైన్యానికి ఒక గట్టి సైన్యాధిపతి కావాలని, అందుకు ఉపాయం అన్వేషించడం ప్రారంభించాడు.

ఇంతలో ఒక స్త్రీ ఆర్తనాదం వినిపించి, అటువైపు చూచాడు ఇంద్రుడు. కేశి అనే రాక్షసుడు ఒక కన్యను పీడించడం జరుగుతోంది. ఇంద్రుడు హెచ్చరించినా ప్రయోజనం లేనందున, ఇద్దరి మధ్య యుద్ధం జరిగింది. ఇంద్రుని ముందు రాక్షసుడు తట్టుకోలేక, కన్యను వదిలి పారిపోయాడు.

ఇంద్రుడు కన్యను ప్రశ్నించగా, ఆ కన్య 'దేవా! నేను ప్రచండుని కుమార్తెను. నా పేరు దేవసేన.' అపుడు ఇంద్రుడు 'నీవు దేవసేనవా? నీవు నాకు సోదరివి అవుతావు. నీకు ఎలాంటి భర్త కావాలో కోరుకో' అని అన్నాడు ఇంద్రుడు. అపుడు దేవసేన 'నాకు కాబోయే భర్త దేవదానవ యక్షరాక్షసులను జయించగలవాడై వుండాలి. బలవంతుడు, పరాక్రమశీలియై మీతో కలిసి పనిచేయగలవాడై వుండాలి. ధర్మనిష్ఠాగరిష్ఠుడై కీర్తిని వృద్ధిచేసుకొనే వాడై కూడా ఉండాలి. ఇన్ని కోర్కెలు విన్న ఇంద్రుడికి దిక్కుతోచక ఆ కన్యను బ్రహ్మ వద్దకు తీసికొని వెళ్ళాడు. బ్రహ్మతో 'ఈ కన్యకు శూరవీరుడైన భర్త కావాలట' అని చెప్పగా, బ్రహ్మ 'అగ్నిదేవుని ద్వారా ఒక మహా పరాక్రమవంతుడు జన్మిస్తాడు. ఈమెకు అతడు పతి అవుతాడు, మీకు సేనాధిపతి కూడ అవుతాడు' అని బ్రహ్మ చెప్పాడు.

ఇంద్రుడు ఈ కన్యను తీసికొని, వశిష్ఠుడు మున్నగువారు చేయుచున్న యజ్ఞం దగ్గరకు వెళ్ళాడు. దేవతలు వారి వారి భాగాలను తీసుకొంటూ వున్నారు. అగ్నిదేవుడు కూడ తన భాగాన్ని తీసుకొన్నాడు. కాని అక్కడ వున్న ముని పత్నులను చూచి చంచల మనస్కుడైనాడు. అగ్నిదేవుడు తన చిత్త చాంచల్యానికి దుఃఖిస్తూ, తన శరీరాన్ని త్యజించడానికి అడవులకు వెళ్ళాడు.

ఈ విషయాన్ని అగ్నిదేవుని భార్య స్వాహా తెలుసుకొని, 'నేను మునిపత్నుల రూపలో వెళ్ళి, అగ్నిదేవుని శాంతింప చేస్తాను. పైగా అగ్నిదేవుని పట్ల నా మోహావేశం కూడ తగ్గిపోతుంది' అని అనుకొన్నది.

అగ్నిదేవుని భార్యయైన స్వాహా ఒక్కొక్క మునిపత్ని రూపాన్ని ధరిస్తూ స్ఖలిత వీర్యమును ఒక సువర్ణ కలశంలో భద్రపరచింది. ఆ రకంగా, ఆరుసార్లు భద్రపరచడం వల్ల ఆరుశిరస్సులతో బాలుడు జన్మించాడు. అతనికి కార్తికేయుడని నామకరణం చేశారు. అరుంధతి రూపం మాత్రం స్వాహా ధరించలేక పోయింది. పెరిగి పెద్దవాడైన కార్తికేయుడు మహాదేవుడు దైత్యులను వధించుటకు వదలిపెట్టిన ధనస్సును కార్తికేయుడు ఎత్తి సింహనాదం చేశాడు. ఋషులు అనుమానంతో తమ భార్యలు వదలిపెట్టారు. స్వాహా వారి వద్దకు వెళ్లి కార్తికేయుడు తన కుమారుడని చెప్పింది. విశ్వామిత్రుడు కూడ ఆ రోజుఅగ్నిదేవుని అనుసరించి అడవిలోనికి వెళ్ళి యదార్థాన్ని గ్రహించాడు. కనుక మునిపత్నుల నిరపరాధం తెలిసింది. కార్తికేయుని బలపరాక్రమాలను చూచిన ఇంద్రుడు అతనిని తన సేనాధిపతిగా ఉండమని కోరాడు. కార్తికేయుడు సమ్మతించగా అభిషేకం జరిగింది. ఈ ఉత్సవానికి పార్వతీపరమేశ్వరులు వచ్చి విశ్వకర్మ చేసిన మాలను కార్తికేయుని మెడలో వేశారు. అదే సయంలో ఇంద్రుడు దేవసేనను తెచ్చి బ్రహ్మ చెప్పిన విధంగా ఈమె నీ భార్య అని వారిద్దరికి పాణిగ్రహణం చేయించాడు. దేవతల సేనాధిపతియైన కార్తికేయుని వద్దకు నిర్దోషులైన ఆరుగురు మునిపత్నులు వచ్చి, మా భర్తలు మమ్మల్ని వదిలేశారు. అక్షయ స్వర్గప్రాప్తి అనుగ్రహించండి అని కోరగా అలాగే జరుగుతుందని చెప్పి వారిని తృప్తిపరచి పంపివేశాడు.

అలాగే స్వాహా కూడ తన కోరికను ఇలా చెప్పింది. 'నాయనా! నేను చిన్నప్పటి నుండి అగ్నిదేవుని ప్రేమిస్తున్నాను. భార్య అయి కూడ ఆయన అనురాగాన్ని పొందలేక పోతున్నాను. ఆయనతో విడివడని రీతిలో అనుగ్రహించు.' కార్తికేయుడు వెంటనే స్పందించి, "బ్రాహ్మణులు అగ్నిలో హవనం చేసేటప్పుడు 'స్వాహా' అని చెప్పటం నిశ్చితం చేస్తున్నాను. కనుక నీవు ఎప్పుడూ అగ్నిని అంటి పెట్టుకొని ఉంటావు.' అని చెప్పాడు.

ఒకరోజు బ్రహ్మ కార్తికేయునితో ఇలా అన్నాడు. 'కార్తికేయా! నీవు నీ తండ్రిగారైన మహాదేవుని వద్దకు వెళ్ళు. కారణమేమంటే, రుద్రుడు లోకహితం కోరి అగ్నిదేవునిలోను, ఉమ స్వాహాలోను ప్రవేశించి నిన్ను ఉత్పన్నం చేశారు.' కార్తికేయుడు సరేనని మహాదేవుని వద్దకు వెళ్ళిపోయాడు. కార్తికేయుడు మహాదేవుని చేరుకోగానే అక్కడ ఉన్న ఇంద్రుడు, యముడు, వరుణుడు, చంద్రుడు మున్నగువారు స్వాగతించారు. మహాదేవుడు కార్తికేయుని ఆలింగనం చేసుకొని, 'నాయనా! నీవు సమయానుకూలంగా వ్యూహాల్ని రచిస్తూ ముందుకు సాగాలి' అని చెప్పి వీడ్కోలు పలికాడు.

ఈలోపుగా మహిషాసురుడు బ్రహ్మ ద్వారా వరములు పొంది, దేవతల్ని చెండాడడం ప్రారంభించాడు. ఇంద్రుడు ఆ రాక్షసుని కట్టడి చేయాలని తలచాడు. ఇక మహిషాసురుని వదిలేది లేదని, మహాదేవుడు కార్తికేయుని తలచుకొన్నాడు. వెంటనే కార్తికేయుడు యుద్ధభూమిలో ప్రత్యక్షమైనాడు. దేవతలు హర్షించారు. రాక్షసులు భయానికి గురియైనారు. బలశాలియైన కార్తికేయుడు శక్తి బాణాన్ని ప్రయోగించాడు. దానితో ప్రాణం కోల్పోయిన మహిషాసురుడి శరీరం అనేక యోజనాల దూరాన్ని ఆక్రమించింది. అక్కడ చేరిన దేవతలతో మహాదేవుడు ఇలా అన్నాడు. 'ఓ దేవతలారా! మీరు నన్ను వలెనే కార్తికేయుని (కుమార స్వామి) ఆదరించండి.'

విశేషం ఏమంటే ఈ విషయమును చదివినవారు నిస్సందేహంగా కీర్తిని మరియు ధనమును ప్రాప్తించు కొందురు. శుభం.

ఇక కౌరవుల ఘోషయాత్ర, అవమానం, పాండవులు వారిని విడిపించటం గురించి తెలుసుకొందాం:

పాండవులు ద్వైతవనంలో ఉన్నారని తెలుసుకొని, వారిని అవమానించ దలంచి, దుర్యోధనాదులు భారీ సైన్యంతో, తమ స్త్రీలతో కూడ అక్కడ విడిది చేశారు. కృశించిన పాండవులను అపహాస్యం చేయవచ్చునని, తమ దర్పం చూపించవచ్చునని వారు ఆశపడ్డారు. సరోవరం దగ్గర ఒక క్రీడామైదానాన్ని నిర్మించమని దుర్యోధనుడు సైనికులను ఆదేశించాడు. కాని అప్పటికే అక్కడకు చేరుకొన్న చిత్రసేనుడనే గంధర్వరాజు వారిని అడ్డుకొన్నాడు. అది తెలుసుకున్న దుర్యోధనుడు తన సైన్యాన్ని పంపాడు. గంధర్వుడు మరియు సైనికుల మధ్య జరిగిన భయంకర యుద్ధంలో కౌరవ సైన్యం పలాయనం చిత్తగించింది క్రోధాగ్నితో దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు స్వయంగా యుద్ధానికి బయలుదేరారు. కర్ణుడు తన బాణాలతో గంధర్వులను చిత్రహింసలు పెడుతున్నాడు. ఇది గమనించిన చిత్రసేనుడు యుద్ధరంగంలోనికి వచ్చి మాయాస్త్రాలను ప్రయోగించ సాగాడు. వీటి ధాటికి కౌరవ వీరులు పారిపోవడం జరిగింది. కర్ణుడు కూడ విఫలుడై వికర్ణుని రథంలో పారిపోయాడు.

ఈలోగా, గంధర్వులు దుర్యోధనుని చుట్టుముట్టారు. దుర్యోధనుడు కూడ భీకర యుద్ధమే చేశాడు. కాని చుట్టుముట్టిన గంధర్వులు అతని రథాన్ని ముక్కలు ముక్కలు చేశారు. దుర్యోధనుడు రథం నుండి క్రింద పడగానే, చిత్రసేనుడు వానిని పట్టుకొని బందీని చేసేశాడు.

కౌరవ సేన పారిపోయి ధర్మరాజు శరణు కోరింది. భీముడు ఇష్టపడక పోయినా, ధర్మరాజు వారిని విడిపించాడు. ధర్మరాజు ఆదేశం మేరకు భీముడు నకుల సహదేవులు గంధర్వులను తుదముట్టించడానికి వెళ్ళారు. పాండవులు గంధర్వులను కకావికలం చేయగా, వారు దుర్యోధనుని తీసుకొని ఆకాశమార్గాన వెళ్ళిపోయారు. ఇది గమనించిన అర్జునుడు ఆకాశమార్గాన్ని నిర్బంధించాడు. గంధర్వులు వెనుకబడటం గమనించిన చిత్రసేనుడు తన మాయతో అదృశ్యమై అర్జునునిపై బాణవర్షం కురిపింసాగాడు. అర్జునుడు శబ్దభేది బాణాలతో ఎదుర్కొన్నాడు. అర్జునుని ధాటికి చిత్రసేనుడు తట్టుకోలేక, అర్జునుని ఎదుట ప్రత్యక్షమైనాడు. అపుడు అర్జునుడు 'చిత్రసేనా! స్త్రీలతో పాటు దుర్యోధనాదులను ఎందుకు బంధించావు?' అని అడిగాడు. 'అర్జునా! నీవు నా స్నేహితుడవు. ఇంద్రలోకంలో నా వద్ద గాన విద్య నేర్చుకొన్నావు. ఈ దుర్యోధనాదులు మిమ్మల్ని పరిహసించడానికి వస్తున్నారని, వారిని నివారించమని ఇంద్రుడు నన్ను ఆదేశించాడు. అందుకే వీరిని బంధించాను.' అని చిత్రసేనుడు అన్నాడు.

ఆ తర్వాత అందరూ ధర్మరాజు వద్దకు చేరారు. చిత్రసేనుడు ధర్మరాజుకు నమస్కరించి, దుర్యోధనాదులను అప్పగించి స్వర్గానికి వెళ్ళిపోయాడు. దుర్యోధనునికి ధర్మరాజు హితవచనాలు చెప్పి వారిని వదలివేశాడు. దుర్యోధనుడు మార్గమధ్యంలో నిరాశతో ఉండినవాడై, ప్రాయోపవేశం చేయాలని నిర్ణయించుకొన్నాడు. ఎవరు చెప్పినా వినలేదు. ఆరాత్రి ఒక కలను కన్నాడు. ఆ కల సారాంశం ఏమంటే – దేవతలతో యుద్ధం చేసిన అసురులు రాబోయే మహాయుద్ధంలో దుర్యోధనుని పక్షాన మాయోపాయాలతో సిద్ధంగా ఉన్నారని, అందులో భాగంగానే సంశప్తకులను అర్జునుని కోసం నియోగించమని, అలాగే భీష్మ ద్రోణాదులతో ప్రవేశించి పాండవుల పట్ల వారికున్న ఆత్మీయతను నశింప చేయగలమని రాక్షసులు నచ్చచెప్పారు. ఆ కల కారణంగా దుర్యోధనుడు శరీరత్యాగాన్ని విరమించుకొని హస్తినాపురానికి వెళ్ళాడు.

దుర్వాసునకు, దుర్యోధనుడు ఆతిథ్యం, వరం పొందటం ఎలా జరిగిందో తెలుసుకొందాం.

ఒకరోజు దుర్వాస మహాముని తన 10 వేల మంది శిష్యులతో దుర్యోధనుని దగ్గరకు వచ్చాడు. ముక్కోపి

దుర్వాసుడు వచ్చాడని తెలుసుకొన్న దుర్యోధనుడు తగిన రీతిలో నక్క వినయం ప్రదర్శించ సాగాడు. దుర్యోధనుడు విసుగు ప్రదర్శించక అనుగుణంగా నటించాడు.

దుర్యోధునుని సేవలకు మెచ్చి వరం కోరుకోమంటే, దుర్యోధనుడు, 'దేవా! మాకు ధర్మరాజు పెద్దవాడు, ధర్మనిరతుడు. మీరు వారి వద్ద ఆతిథ్యం పొందండి. అయితే ఒక ముఖ్య విషయం. ద్రౌపది భోజనం చేసి, విశ్రాంతి తీసికొనే సమయంలో వెళ్ళండి.' అని అన్నాడు. నీకిచ్చిన వరం ప్రకారం అలాగే చేస్తానని చెప్పి దుర్వాసుడు వెళ్ళిపోయాడు. ఎలాగూ పాండవులకు అవమానం జరిగి తీరుతుందని దుర్యోధనుడు సంతోషంతో ఉన్నాడు.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన విశేషమేమంటే – దుర్వాస ముని పాండవులను పరీక్షించ ప్రయత్నిస్తాడు కాని శ్రీకృష్ణుడు వారిని ఎలా రక్షిస్తాడో చూద్దామా!

దుర్వాసముని అనుకొన్న వెంటనే పాండవుల దగ్గరకు వచ్చాడు. ధర్మరాజు మునిని స్వాగతించి, స్నానం చేసిరండని విన్నవించాడు. ధర్మరాజు సమయాసమయములను గుర్తించలేదు. కాని ద్రౌపదికి బెంగ పట్టుకొంది. ద్రౌపది శ్రీకృష్ణుని ప్రార్థించటం మొదలు పెట్టింది శ్రీకృష్ణుడు వెంటనే వచ్చి తనకు భోజనం పెట్టమని ద్రౌపదిని అడుగుతాడు. సూర్యభగవానుడు ప్రసాదించిన అక్షయ పాత్రను శుద్ధి చేసి పెట్టానని చెప్పింది. ఆ శుద్ధి చేసిన పాత్రను తెప్పించాడు శ్రీకృష్ణుడు. ఆమె అలాగే తెచ్చింది. శ్రీకృష్ణుడు ఆ పాత్రలో అంటీఅంటనట్టున్న ఆకుకూరను తిని త్రేన్చుతాడు. ఇదే సమయంలో అక్కడ దుర్వాస ముని, శిష్యులు కూడ బ్రేవ్‌మంటూ త్రేన్చుతుంటారు. కనుక ఇక్కడ ధ్మరాజు వద్దకు వెళ్ళే శ్రమ ఎవరికీ లేదు అంటూ అటునుండి అటే వెళ్ళిపోయారు. అతిథులు రాలేదని ధర్మరాజు ఒక బ్రాహ్మణుని వారికోసం పంపితే నది దగ్గర ఎవరూ లేరని ఆ బ్రాహ్మణుడు వచ్చి చెప్పాడు.

మరొక విశేషం చూద్దాం.

జయద్రధుడు ద్రౌపదిని అపహరిస్తాడు. పాండవులు ఎలా శాస్తి చేస్తారో తెలుసుకుందాం.

ఒకరోజు పాండవులందరు ద్రౌపదిని ఆశ్రమంలో వదలి పండ్లు, ఫలాల కోసం అడవికి వెళ్ళారు. ఆ ఆశ్రమం ముందుగా వెళ్తున్న జయద్రధుడు ఒంటరిగా ఉన్న ద్రౌపదిని చూచి మోహించాడు. ఎవరివి అని అడిగితే నేను పాండవుల భార్యను, ద్రుపదరాజు కుమార్తెను అని చెప్పింది. తనతో వస్తే, తనను పట్టమహిషిని చేస్తానన్నాడు. ద్రౌపది మిక్కిలి ఆగ్రహంతో 'నీకు చావు మూడింది, కామంతో వున్నా'వని మందలించింది. కాని జయద్రధుడు బలవంతంగా రథంపై ఎక్కించుకొని బయలుదేరాడు. ద్రౌపది పిలుపు నందుకొని ధౌమ్యుడు రథాన్ని వెంబడిస్తున్నాడు.

పాండవులు ఆశ్రమానికి రాగా, దాసి జరిగినదంతా వారితో చెప్పింది. పట్టరాని ఆగ్రహంతో పాండవులు సైన్యంతో రథాలపై వెంబడించారు. జయద్రధుని రథంలొ ద్రౌపదిని చూచిన పాండవుల క్రోధం మరింత హెచ్చింది. అర్జునుడు బాణవర్షం కురిపించగా, అంధకారం ఆవరించింది. భీమసేనుడు మొదలగువారు జయద్రధుని సైనికులను సంహరిస్తున్నారు. ధర్మరాజు, అర్జునుడు, నకులుడు చాలమంది సైనికులను హతమార్చారు. అర్జునుని బాణప్రయోగంతో వాని రథాశ్వాలు చనిపోయాయి. దిగిపోతున్న జయద్రధుని భీముడు జుట్టుపట్టుకొన్నాడు. గుండుచేసి, ఐదు పిలకలు పెట్టి, వానిని భీముడు ధర్మరాజు ముందుకు తెచ్చాడు.

అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. 'జయద్రధా! నీవు మా సోదరి దుస్సల భర్తవైనందున భీముని చేతిలో బ్రతికి పోయావు. ఇకముందు ఇలాంటి తప్పుడు పనులు చేయవద్దు' అని హెచ్చరించి, పంపివేశాడు.

జయద్రధుడు అవమాన భారంతో కృంగిపోతూ, శంకరుని గురించి తపస్సు చేసి, అర్జునుని తప్ప, మిగతా నలుగురిని ఒక్క రోజు నిలువరించు వరాన్ని పొందాడు.

ద్రౌపది వంటి పతివ్రతను గురించిన ఉదంతము ఏదైనా ఉంటే తెలియచెప్పమని మార్కండేయ మునిని ధర్మరాజు అడుగుతాడు. అపుడు మార్కండేయ మహర్షి ఇలా చెప్పడం ప్రారంభించాడు.

"ఓ రాజా! పూర్వం మద్ర దేశానికి అశ్వపతి అనే రాజుండేవాడు. అతడు అత్యంత ఉదారుడు, సత్యనిష్ఠుడు, జితేంద్రియుడు. దానియై, చతురుడై పురవాసుల అభిమానమును చూరగొన్నవాడైనాడు. ఆ రాజు భార్య పూజాఫలంగా గర్భవతియై ఒక ఆడబిడ్డను కన్నది. ఆమెకు సావిత్రి అని పేరు పెట్టారు.

కాలక్రమంలో ఆమె యవ్వనవతియై ఉండగా, తండ్రి అశ్వపతిరాజు కుమార్తె నుద్దేశించి "బిడ్డా! నీవు పెండ్లి చేసుకొనుటకు అర్హురాలవైనావు. నీవు వరుని అన్వేషించుకొనే నిమిత్తం బయలుదేరు. నీకు తోడుగా మన వృద్ధ మంత్రులు వస్తారు. తపస్వినియై సావిత్రి రాజర్షులున్న తపోవనముల వెంట తిరుగుట ప్రారంభించింది. తపోధనులకు నమస్కరిస్తూ, వారి మంచిచెడులను విచారిస్తూ, దానధర్మాలు చేస్తూ, సమస్త తీర్థస్థానములను తిరిగింది.

ఒకరోజు అశ్వపతి రాజు సభాభవనంలో ఉండగా, అక్కడకు విచ్చేసిన నారద మహర్షిని సన్మానించి మాట్లాడుతూ ఉన్నాడు. అదే రోజు తిరిగివచ్చిన సావిత్రి నాన్నగార్కి, మహర్షికి నమస్కరించింది.

సావిత్రిని చూచిన నారదుడు ఈమెకు పెండ్లి వయస్సు వచ్చింది కదా అని అన్నాడు. అపుడు అశ్వపతి ఆ కారణంగానే సావిత్రి బయటకు వెళ్ళి వచ్చింది అంటూ "బిడ్డా! ఎక్కడైనా నీకు నచ్చిన వరుడు కనిపించాడా? చెప్పు" అని కుమార్తెతో అన్నాడు. వివరంగా చెప్పు అని అనగానే సావిత్రి ఇలా చెప్ప నారంభించింది. "నాన్నగారూ! సాళ్వ దేశంలో ద్యుమత్సేనుడు ప్రఖ్యాతిగాంచిన రాజు, ధర్మాత్ముడై కూడా ఉన్నాడు. విధివశాన, ఆ రాజు అంధుడై పోవడం చేత, అతని కుమారుడు సత్యవంతుడు చిన్నవాడుగా ఉండటం చేత, పొరుగుననున్న రాజు వీరి రాజ్యాన్ని హస్తగతం చేసుకొన్నాడు. వేరే మార్గం లేనందున ద్యుమత్సేనుడు అతని భార్య కుమారునితో పాటు అడవిలో ఆశ్రమం ఏర్పాటు చేసుకొని అక్కడ వుండటం ప్రారంభించారు. నియమనిష్ఠలతో జీవనం చేస్తూ ఉన్నారు. అక్కడే అతని కుమారుడైన సత్యవంతుడు సన్మార్గంలో జీవిస్తూ, పెరిగి పెద్దవాడైనాడు. నేను ఆ సత్యవంతునే మనస్ఫూర్తిగా ప్రేమించి, నా భర్తగా మనస్సులో ప్రతిష్ఠింప జేసుకున్నాను." అని చెప్పింది. అక్కడే ఉన్న నారద మహర్షి ఇలా అన్నాడు. "రాజా! సత్యవంతుడు నిజానికి వీరపుత్రుడు. సూర్యుని వంటి తేజస్సు గలవాడు. బృహస్పతి వంటి బుద్ధికుశలుడు. క్షమాశీలుడు, దాత, సత్యవాది, ప్రియదర్శి, గొప్ప రూపవంతుడు, పైగా మృదుస్వభావి అయినను స్వల్ప ఆయుష్కుడు. నేటినుండి సరిగ్గా ఒక సంవత్సరం తరువాత చనిపోతాడు." ఈ మాటలు విన్న అశ్వపతి కుమార్తెతో నారదమహర్షి చెప్పినది విన్నావు కదా, అందుచేత వేరొక వరుని అన్వేషించుకో అని చెప్పాడు. అపుడు సావిత్రి "నాన్నగారూ! నేను సత్యవంతుని పతిగా ఎన్నుకొన్నాను. అతని ఆయుష్షు ఎంత వున్నా, గుణహీనుడైనా, ఏమైనా అతడే నా భర్త. నా మనస్సే నాకు ప్రామాణికం." అని చెప్పింది. నారదుడు ఇలా అన్నాడు. "రాజా! సావిత్రి యొక్క మనస్సును మనం మార్చలేము. అందుచేత నీవు కన్యాదనం చేయడమే సముచితం".

నారద మహర్షి ఆదేశానికి సమ్మతించి, ఒక శుభవేళ వివాహ సామగ్రితో, ఋత్విజులతో ద్యుమత్సేనుని ఆశ్రమానికి వెళ్ళాడు. ద్యుమత్సేనుడు వీరిని చూచి ఆశ్చరచకితుడై, సావిత్రి ఈ అడవిలో ఉండగలుగునా అని సంకోచించినా, చివరకు సంతోషంతో అంగీకరించాడు. అలా వారి వివాహం జరిపించబడింది ఆశ్రమంలో. సువర్ణ సంపన్నురాలైన సావిత్రి తన ఆభరణాలను తీసివేసి, నారబట్టలు ధరించి, తన మధుర వాక్కులతోను, కార్యశీలతతోను అందరినీ అలరిస్తూ, భర్తకు ఏకాంతసేవ చేస్తూ, ప్రసన్నుని గావించుకొంది.

సావిత్రి మాత్రం మనసులోనే రోజులు లెక్కించుకుంటూ వుంది. ఆ విధంగా సంవత్సర కాలం ఇట్టే గడిచిపోయింది. ఇంక నాలుగు రోజులే ఉన్నవి అనగా సావిత్రి మూడు రోజుల వ్రతము చేయబూనింది. రాత్రింబవళ్ళు స్థిరంగా కూర్చొని, వ్రతం పూర్తి చేసుకొని, అత్తమామలకు, చుట్టూ వున్న ఋషిపుంగవులకు నమస్కరించి, వారి ఆశీర్వాదం తీసుకొంది.

ఆ రోజు నాలుగో రోజు. సత్యవంతుడు గొడ్డలి తీసికొని, వంట కలప, పళ్ళు ఫలాలు తీసికొని రావడానికని బయలుదేరాడు. సావిత్రి తానుకూడ వస్తానని గట్టి పట్టు పట్టింది. అలాగైతే అత్తమామల ఆజ్ఞ తీసికొని రమ్మన్నాడు. సావిత్రి వారి అనుమతి అడగగా, వ్రతదీక్షతో నీరసించి ఉన్నావు. ఎలా వెళ్తావని ఎప్పుడూ ఏదీ కోరని సావిత్రి కోరికను వారు చివరికి మన్నించి, జాగ్రత్తలు చెప్పారు.

సావిత్రి భర్తను అనుసరించింది. మనస్సులో దుఃఖభారంతో కృంగిపోతున్నా కూడా, పైకి చిరునవ్వులతో కన్పిస్తూ నడుస్తోంది. సత్యవంతునితో పాటు సావిత్రి కూడ ఒక చిన్న గంప నిండా పళ్ళు, ఫలాలు నింపుకొంది. ఆ తరువాత సత్యవంతుడు కట్టెలు కొట్ట నారంభించాడు. కాని కొద్ది శ్రమతోనే అలసిపోయి, అతనికి తలనొప్పి బాధ మొదలయింది.వెంటనే సావిత్రి వద్దకు వెళ్ళి శరీరమంతా శిథిలమై పోతోంది, కూర్చునే శక్తి కూడా లేదు. పడుకొంటానన్నాడు సత్యవంతుడు. సావిత్రి వెంటనే సత్యవంతుని తల తన ఒడిలో పెట్టుకొని కూర్చుంది. నారద మహర్షి మాటలు గుర్తురాగా, ఈరోజే చివరి క్షణాలేమోనని సావిత్రి లెక్కించసాగింది. అంతలోనే ఎరుపురంగు నేత్రాలతో, తెల్లని వస్త్రాలతో ఒక భయంకరమూర్తి కనిపించాడు. సావిత్రి భర్త తలను పక్కకు జరిపి, లేచి నిలబడింది. ఆందోళనతో సావిత్రి ఆ మూర్తిని ఇలా అడిగింది. "మీరెవరో దేవునిలా వున్నారు. ఇక్కడికి ఎందుకొచ్చారు? అని అడింది. అందుకు ఆ భయంకరమూర్తి "ఓ సావిత్రీ! నేను యమధర్మరాజును. నీవు పతివ్రతవు మరియు తపస్వినివి కనుక నేను నీతో మాట్లాడుతున్నాను. నేటితో సత్యవంతుని ఆయువు తీరింది. పాశముతో నేను తీసుకొని వెడతాను." అన్నాడు. అపుడు సావిత్రి ఇలా అన్నది "దేవా! ఇలాంటి సందర్భాలలో యమదూతలు వస్తారని విన్నాను. మరి మీరే స్వయంగా రావడమేమిటి?' అని సందేహం వెలిబుచ్చింది. యముడు "దేవీ! మీరందరు సత్యవంతులు కావడంతో నేనే విధిగా రావాల్సి వచ్చింది." అంటూనే సత్యవంతుని శరీరములో అంగుష్ఠమాత్ర పరిమాణం గల జీవుని పాశంతో బంధించి దక్షిణదిశ వైపు పోసాగాడు. సావిత్ర కూడ యముని అనుసరించింది. యముడు సావిత్రిని చూచి "నీవు నీ పాతివ్రత్య ధర్మము కొద్దీ, ఎంత దూరం రావలెనో అంతదూరం వచ్చావు. నీవు నీ పతి సేవ ఋణం తీర్చుకొన్న దానివయ్యావు. తిరిగి వెళ్ళి దహనసంస్కారములు చేయి' అని అన్నాడు. అపుడు సావిత్రి "దేవా! నా పతిదేవుని ప్రాణాలు ఎక్కడ వుంటే, నేనూ అక్కడే ఉంటాను. నేను చేసిన తపస్సుకు, చూపిన పతి ప్రేమకు, చేసిన వ్రతములకు మరియు మీ దయవలన నా ప్రాణమునకు ఆటంకము కలుగదు." అన్నది. సావిత్రి మాటలకు ప్రసన్నుడైన యముడు "సావిత్రీ! నీవు నీ భర్త ప్రాణాలు తప్ప మరేదైనా కోరుకో" అని ఈ రకంగా ఐదు వరాలు యిచ్చాడు.

అందులో మొదటి వరంగా తన మామయైన ద్యుమత్సేనుని అంధత్వాన్ని తొలగించమని కోరింది. రెండవ వరముగా ద్యుమత్సేనుని రాజ్యం శ్రమపడకుండా ఆయనకు దక్కాలన్నది. ఇక మూడవ వరంగా తన తండ్రియైన అశ్వపతి రాజకు పుత్ర సంతానం కావాలన్నది. నాల్గవ వరంగా తనకు పుత్ర సంతానం కావాలని కోరింది. చివరగా భర్త లేకుండా మానవ లోకంలో సంతానం సాధ్యం కాదు కనుక తన పతికి ప్రాణభిక్ష పెట్టాలని కోరింది. ఇలా యమలోక ప్రయాణ మార్గములో అనేక వరములిచ్చిన కారణంగా చివరగా యమరాజు సత్యవంతుని ప్రాణాలు సావిత్రికి తిరిగి యివ్వక తప్పలేదు.

యమరాజు ఇలా అన్నాడు. "సాధ్వీ! సావిత్రీ! నీ భర్త ప్రాణములు తిరిగి ఇస్తున్నాను. వెళ్ళు. మృతిచెందిన నీ భర్తను తీసికొని ఆశ్రమానికి చేరుకో".

సావిత్రి భర్త శరీరం దగ్గరకు వచ్చింది. భర్త శరీరంలో కదలికలు ప్రారంభమై, చైతన్యం వచ్చి, నిద్రనుండి మేల్కొన్నవానిలా సత్యవంతుడు లేచికూర్చున్నాడు. అతడు ఇలా అన్నాడు. "దేవీ! ఎవరో వచ్చి నన్ను బలవంతంగా లాగుకొని పోయినట్లనిపించింది, ఎవరు వారు?" సావిత్రి "పురుషశ్రేష్ఠా! ఆ వచ్చినవారు యమరాజు. ఆయన ప్రజలను నియంత్రించు దేవశ్రేష్ఠుడు కదా! ఇప్పుడు ఆయన లోకానికి వెళ్ళిపోయాడు. నాథా! సూర్యాస్తమయం అయింది చీకటి పడిపోయింది. నెమ్మదిగా ఆశ్రమానికి వెళ్దాం పదండి" అంటూ చేయూత నిచ్చి, నడిపించడం మొదలు పెట్టింది.

ఈలోగా ఇక్కడ ద్యుమత్సేనునకు కంటిచూపు వచ్చింది. అన్నింటిని చూడగల్గుతున్నాడు. కొడుకు, కోడలు ఇంకా రాలేదేమని భార్య శైల్యతో కలిసి ఆశ్రమాలు వెదకటం ప్రారంభించాడు. ఆ ముని వాటికల్లో ఉన్నవారు రాజదంపతులకు ధైర్యం చెబుతూ వున్నారు.

ఈలోగా సావిత్రి సత్యవంతులు అక్కడికి చేరుకొన్నారు. అందరి ఆనందానికి అవధులు లేకపోయింది. ఆలస్యానికి కారణాలు తెలపమని ఋషులంతా సావిత్రిని అడిగారు. ఎవరికీ తెలియని అనేక విషయాలను వారికి సావిత్రి వివరించింది. నారద మహర్షి సత్యవంతుడు అల్పాయుష్కుడు అని చెప్పినను, తాను ఆయనను వివాహమాడటం, ఆ నిర్ణీత దినమైన ఈ రోజు తాను సత్యవంతునితో అడవికి పోవడం, సత్యవంతుడు అలసిపోవడం, యమరాజు ప్రాణాలు హరించడం, తాను వెన్నాడగా, ఆయన వరాలివ్వడం, ఆ కారణంగానే మామకు కంటిచూపు రావడం, చివరకు భర్తను బ్రతికించుకోగల్గడం మున్నగు విషయాలన్నీ సావిత్రి వారికి చెప్పింది. అది వినిన ఋషులు సావిత్రిని ప్రశంసించారు. మరురోజు ద్యుమత్సేనుని రాజ కర్మచారులు వచ్చి, సింహాసనం అధిష్టించమని కోరారు. ఆ విధంగా సత్యవంతుడు కూడ యువరాజైనాడు. సావిత్రి యువరాణి అయింది. సారాంశమేమనగా ఎవరైతే ఈ సావిత్రీ సత్యవంతుల కథ వింటారో, వారి కోర్కెలు ఫలిస్తాయి.

పాండవులు మళ్ళీ ద్వైతవనానికి, ద్రౌపదితో సహా వచ్చి కాలం గడుపుతూ వున్నారు. ఒకరోజు ఒక బ్రాహ్మణుడు పరుగెత్తుకొంటూ వచ్చి తన యజ్ఞ సమిధను ఒక జింక తన కొమ్ములో ఇరికించుకొని పరుగెత్తిందని, దానిని తెచ్చి యివ్వమని పాండవులను కోరాడు. పాండవులు ధనస్సులు ధరించి, ఆ జింక వెళ్ళిన దిశగా పోసాగారు. ఆ జింక చాల దూరం వెళ్ళి అదృశ్యమైంది. పాండవులు తిరిగి తిరిగి అలసి ఒక వటవృక్షం క్రిందకు చేరారు. అందరికి దాహం వేస్తోంది. ధర్మరాజు నకులుని పిలిచి, సమీపంలో ఉన్న సరస్సు నుండి నీరు తీసుకు రమ్మని పంపాడు. నకులుడు ఒక జలాశయాన్ని చూచి, తాను త్రాగి, అమ్ముల పొదిలో నీళ్ళు తీసుకొని పోవచ్చునని

అటువైపు కదిలాడు. ఆకాశవాణి 'నకులా! నేనడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పు. అపుడు నీళ్ళు త్రాగవచ్చు. తీసికొని పోవచ్చు' అని అన్నది. నకులుడు లెక్కచేయకుండా నీరు త్రాగి అక్కడే పడిపోయాడు. నకలుడు రానందున ధర్మరాజు సహదేవుని పంపాడు. సహదేవుడు అలాగే త్రాగి పడిపోయాడు. ఇద్దరూ రానందున ధర్మరాజు అర్జునుని పంపగా, అర్జునుడు వెళ్ళి చూడగా నకుల సహదేవుల శరీరాలు స్పృహ లేకుండా పడివున్నాయి. అర్జునుడు కూడ మొదట నీరు త్రాగుదామని వెళ్ళి, త్రాగి అచేతనుడై పడిపోయాడు. ధర్మరాజు భీముని పంపాడు. భీమునికి కూడ అదే స్థితి సంభవించింది. సోదరులు నలుగురూ రాకపోయే సరికి, ధర్మరాజు స్వయంగా అక్కడికి వెళ్ళి తన తమ్ములు నలుగురూ స్పృహ తప్పి పడివుండటం చూచాడు. ఇంతలో ఆకాశవాణి ధర్మరాజుతో ఇలా అన్నది. 'నేను ఒక కొంగను, నీ సోదరులు పడివుండుటకు కారణం నేనే. నీవు కూడ నా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకపోతే, నీకూ అదే స్థితి సంభవిస్తుంది, నా ప్రశ్నలకు సమాధానం చెబితే, నీవు నీరు త్రాగి, నీ సోదరులను తీసుకొని పోవచ్చు.' అని అన్నది. ఇలాంటి పని ఒక కొంగ చేయలేదు కనుక రుద్రుడో లేక ఒక దేవతయో అయి వుంటుంది అని అనుకొన్నాడు ధర్మరాజు. అపుడు నిజస్వరూపంతో ఒక యక్షుడు ప్రత్యక్షమై, 'నేను యక్షుణ్ణి. నీ సోదరులను పడవేసింది నేనే.' ఈ మాటలు వింటూ ధర్మరాజు దగ్గరలోని చెట్టుపై కూర్చొని వున్న యక్షుని చూచాడు. ప్రశ్నలకు సమాధానం చెపుతానని ధర్మరాజు అన్నాడు.

ప్రశ్నలు – సమాధానాలు

యక్షుడు : సూర్యుని ఎవరు ఉదయింప, అస్తమింప జేస్తున్నారు అతడు దేనిలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు.

ధర్మరాజు: బ్రహ్మ సూర్యుని ఉదయింప చేస్తున్నాడు. దేవతలు అతని నలువైపులా నడుస్తున్నారు. ధర్మము అతనిని అస్తమింప జేస్తున్నది. సర్వములో ప్రతిష్ఠితుడై వున్నాడు.

యక్షుడు : భూమికంటె బరువైనదేది? ఆకాశం కంటె ఎత్తైన దేది? గాలికంటే వేగంగా వెళ్ళేది ఏది?

ధర్మరాజు : తల్లి భూమికంటె బరువైనది. తండ్రి ఆకాశం కంటే ఎత్తైన వాడు. మనస్సు గాలికంటే వేగంగా పయనిస్తుంది.

యక్షుడు :– ఒంటరిగా కదులున దేది? ఒకసారి ఉత్పన్నమై, మళ్ళీ అగునదేది? శీతలము యొక్క ఔషధము ఏమిటి? మహా క్షేత్రమేది?

ధర్మరాజు : సూర్యుడు ఒంటరిగా తిరుగుతాడు చంద్రుడు ఒకసారి జన్మించి, మళ్ళీ జన్మిస్తాడు. అగ్ని శీతలము యొక్క ఔషధము. భూమి పెద్ద క్షేత్రము.

యక్షుడు : ధన్యవాదాలకు యోగ్యులైన పురుషుల్లో ఏ ఉత్తమ గుణం ఉండాలి? ధనములలో ఉత్తమ ధనమేది? లాభములలో ప్రధాన లాభమేది? సుఖములలో శ్రేష్ఠమైన సుఖమేది?

ధర్మరాజు : ధన్యపురుషుల్లో దక్షతయే ఉత్తమ గుణం. ధనాల్లో శాస్త్ర జ్ఞానమే ఉత్తమమైన ధనం. లాభాల్లో ఆరోగ్యమే ప్రధానమైనది. సుఖములలో సంతోషమే శ్రేష్ఠమైన సుఖం.

యక్షుడు ఈ రకంగా అనేక ప్రశ్నలడిగి, ధర్మరాజు ఇచ్చిన సమాధానాలకు సంతృప్తి చెంది తిరిగి ఇలా అడిగాడు. 'ఓ రాజా! నీ సోదరులలో ఒకరిని మాత్రమే సజీవుని చేస్తాను. కోరుకో.' అన్నాడు. ధర్మరాజు

నకులుడిని బ్రతికించమని కోరాడు. బలశాలి భీముణ్ణి, అస్త్రవిద్యా నిపుణుడైన అర్జునుని వదలిపెట్టి, నకులుని ఎందుకు కోరుకున్నావు అని యక్షుడు అడుగగా, 'ఓ యక్షా! నేను ధర్మబద్ధుడను. కుంతి పుత్రుడనైన నేను బ్రతికి ఉన్నాను. అలాగే మాద్రి తనయుల్లో నకులుని బ్రతికించమని కోరాను.' అన్నాడు. యక్షుడు సంతోషించి అందరినీ జీవింపజేశాడు. 'రాజా! నేను నీ తండ్రియైన యమరాజును. జింకరూపంలో వచ్చి, నేను బ్రాహ్మణుని, ఆరణిని ఎత్తుకొని పోయి మాయమైనాను. నేను నీ ధర్మబద్ధమైన జీవితాన్ని గ్రహించడానికే వచ్చాను. ధర్మరాజా! యశస్సు, సత్యము, దమము, శౌచము, మృదుత్వము, లజ్జ, అచంచలత, దానము, తపము, బ్రహ్మజ్ఞానము నీ శరీరంలో భాగాలేనని తెలుసుకో. నేను నీ పట్ల ప్రసన్నుడనైనాను. ఏదేని వరం కోరుకో' అని యమరాజు అడిగాడు. "దేవా! బ్రాహ్మణుడు పోగొట్టుకున్న అరణిని ప్రసాదించు" అని అడిగాడు. తథాస్తు అని మరో వరం కోరుకోమన్నాడు. అందుకు ధర్మరాజు "దేవా! 12 సంll ల మా అరణ్యవాసం ముగిసింది. అజ్ఞాతవాసంలో మమ్మల్ని ఎవరూ గుర్తుపట్టకుండా వరం ఇవ్వు" అనగా యమరాజు తథాస్తు అని, తిరిగి మూడవ వరం కోరుకోమన్నాడు. అందుకు ధర్మరాజు లోభ, మోహ, మద, మాత్సర్యాలను, క్రోధాన్ని జయించునట్లు వరమివ్వమని ధర్మరాజు కోరాడు. తథాస్తు అని యమధర్మరాజు అదృశ్యమై పోయాడు. పాండవులు తమ ఆశ్రమానికి తిరిగి వచ్చి, అచ్చటి సమస్త వేదవేత్తలకు, మునులకు, యతులకు తమ అజ్ఞాతవాసాన్ని గురించి చెప్పి, వారి ఆశీస్సులు అందుకొని, ద్రౌపది మరియు ధౌమ్యునితో కలిసి బయలుదేరారు.

-o0o-

4. విరాట పర్వం

పన్నెండు సంవత్సరాల అరణ్యవాసం పూర్తయింది. ధర్మరాజు సోదరులను పిలిచి మంతనాలు చేశాడు. మత్స్య దేశపు రాజైన విరాటుడు బలవంతుడు మరియు సంపన్నుడు, కనుక అక్కడికి వెళ్ళడం శ్రేయస్కరమని నిర్ణయించుకొన్నారు. అక్కడికి ఎప్పుడు ఎలా వెళ్ళాలో, అక్కడ ఎలా ప్రవర్తించాలో చెప్పమని ధౌమ్య మునిని కోరారు.

ధౌమ్యుడు ఇలా హితవు పలికాడు – "రాజు దగ్గర ఎలా ప్రవర్తించాలో వినండి. ముందు అనుమతి తీసుకోవాలి. రాజులను పూర్తి విశ్వాసంలోనికి తీసికోకూడదు. అంతఃపురంలో ఉన్నవారితో దూరంగా ఉండాలి. రాజుకు వ్యతిరేకులతో స్నేహం పనికిరాదు. అతి చిన్న పనైనా రాజుతో చెప్పి చేయాలి. రాజు ముందు క్రోధము దర్పము, గర్వము ప్రదర్శించ రాదు. మృదువైన మాటలతో వినయంగా ఉండాలి.. శాస్త్ర జ్ఞానం కలవారు రాజుకు కుడియెడమల కూర్చుండాలి. శస్త్రం ధరించినవారు వెనుక ఉండాలి. ఆంగిక చేష్ట చేయరాదు. బిగ్గరగా నవ్వరాదు, ఎవరైతే శూరవీరులై, సత్యవాదులై, జితేంద్రియులై నీడలా ఉంటారో వారే రాజు దగ్గర సురక్షితంగా ఉంటారు. కనుక పాండవులారా! మీరు ప్రయత్నపూర్వకంగా మనస్సులను మీ అధీనంలో వుంచుకొని వ్యవహరిస్తేనే, ఈ అజ్ఞాతవాసం విజయవంతంగా పూర్తి అవుతుంది.

పాండవులు ధౌమ్యుని మాటలు విని బయలుదేరి యమునా నదిని దాటి విరాట రాజధాని దగ్గరకు చేరారు. అక్కడికి దగ్గరలో వున్న శమీవృక్షంపై తమ ఆయుధాలను భద్రపరచుకొన్నారు. మృతదేహాన్ని చెట్టు కొమ్మకు వేలాడదీశారు. నగరంలోనికి ప్రవేశించగానే, దుర్గామాత ఆలయానికి వెళ్ళి, ఆ మాత ఆశీస్సులు తీసుకొన్నారు.

ప్రథమంగా ధర్మరాజు పాచికలు ఒక గుడ్డలో కట్టుకొని, విరాట రాజు సభా భవనంలోనికి ప్రవేశించాడు. ధర్మరాజు విరాట రాజును ఇలా వేడుకొన్నాడు. 'రాజా! నేను బ్రాహ్మణుడను. సర్వం కోల్పోయాను. మీ శరణు కోరుతున్నాను. మీ దగ్గర ఉండాలని కోరుకుంటున్నాను.' అని అన్నాడు. అపుడు విరాట రాజు 'ఓ బ్రాహ్మణ దేవతా! మీ పేరేమి, ఎక్కడినుండి వచ్చారు, ఏ కళలో మీకు ప్రవేశం వుంది?' అని అడిగాడు. ధర్మరాజు 'అయ్యా! నా పేరు కంకుభట్టు. నేను ధర్మరాజు వద్ద జూదమాడుతూ ఉండేవాణ్ణి. ఆ కళలో నేను మేటిని." అని చెప్పగా రాజు సంతసించి, తన మిత్రునిగా ఉండమని, సకల సౌకర్యాలు అమరునని చెప్పాడు.

ఈలోపు భీమసేనుడు సింహంలా సభాభవనంలోనికి ప్రవేశించాడు. వంటవాని వేషంతో వచ్చాడు. కాంతులీనే శరరంతో ఉన్న భీముడు, 'ఓ రాజా! నా పేరు వలలుడు. వంటలు బాగా చేస్తాను. దయచేసి నన్ను వంటవానిగా నియమించండి' అని ప్రార్థించాడు. అపుడు విరాటుడు 'నీవు తేజోమయంగా కన్పిస్తున్నావు. వంటలవాడిగా కన్పించడం లేదు. ఇంద్రతేజస్సుతో ప్రకాశిస్తున్నావు' అని అన్నాడు. అపుడు భీముడు 'రాజా! నా మాటలు నమ్మండి. ధర్మరాజు కూడ రుచి చూచాడు. నేను వీరుణ్ణి కూడ. సింహాలతో, ఏనుగులతో పోరాడుతూ మిమ్మల్ని సంతోష పెట్టగలను.' అని చెప్పగా రాజు సంతోషించి భీముని వంటశాల అధికారిగా నియమించాడు. ఆ తరువాత అర్జునుడు వచ్చి, బృహన్నలగా ఉత్తరకు నాట్యం నేర్పడానికి నియుక్తుడైనాడు. తరువాత ద్రౌపది సైరంధ్రిగా వచ్చి, రాణి సుధేష్ణ దగ్గర నియమించ బడింది. తర్వాత ఆవుల సంరక్షకుడిగా సహదేవుడు అరిష్టనేమి పేరుతో, చివరగా నకులుడు దామగ్రంథి పేరుతో అశ్వముల అధికారిగా నియమించబడ్డాడు.

పాండవులు అజ్ఞాతవాసం ఇలాగ ఆరు నెలలు గడిచింది. బ్రహ్మోత్సవం కారణంగా రాజు రాజ్యంలోని మల్లయోధులను ఆహ్వానించి, వసతి ఏర్పాటు చేయించాడు. ఆ పోరాటాల్లో, జీమూతుడనువాడు గర్వంతో రంకెలు వేస్తుంటే విరాటరాజు భీముని పిలిచి, వానితో పోరాడమని చెప్పాడు. భీముడు రాజు కీర్తిని పెంచాలని రంగప్రవేశం చేయదలచాడు. ఇద్దరూ మదగజముల రీతి తలపడుతున్నారు. భయంకర పోరాటం జరుగుతున్నది. భీముడు తాను ఇక ఉపేక్షించకూడదని, జీమూతుని తన రెక్కల్లో బంధించి, గిరగిరా త్రిప్పేస్తుంటే, ఇతర మల్లయోధులు, రాజు, ప్రేక్షులు ఆశ్చర్యపోసాగారు. చివరకు భీముని దెబ్బలకు జీమూతుడు అచేతనుడైపోయాడు. తుదకు మరణించాడు. జగత్ప్రసిద్ధుడైన జీమూతుని హతం చేసిన భీమునిపై విరాటరాజుకు అభిమానం పెరిగింది. ఇతర రకరకములైన పోరాటాల్లో భీముడు ప్రదర్శించిన పరాక్రమం అద్వితీయంగా ప్రశంసల నందుకొంది. మిగతా పాండవులు కూడ రాజుగారికి సంతృప్తిని కలిగిస్తూ జీవిస్తున్నారు.

ఆసక్తికర సంఘటన ఏమంటే ద్రౌపదిపై కీచకుడు ఆసక్తి కనపరుస్తాడు. చివరకు భీముని చేతిలో మరణిస్తాడు. ఎలా జరిగిందో తెలుసుకొందామా మరి!

ఒకరోజు విరటుని బావమరిది, సైన్యాధిపతియైన కీచకుని దృష్టి ద్రౌపదిపై పడింది. అక్క అనగా రాణి సేవలో వున్న సైరంధ్రి దగ్గరకు వెళ్ళి 'కళ్యాణీ! నీ సౌందర్యం, కాంతి, సౌకుమార్యం ప్రపంచంలో ఎక్కడా లేదు. నేను నీకు సర్వసౌఖ్యాలు కలిగిస్తాను. ఈ దాసీ పనేమిటి? నా రాణులు నీకు దాసీలౌతారు. నన్ను కనికరించు' అంటూ ప్రాధేయపడ సాగాడు కీచకుడు. సైరంధ్రి 'నేను పరాయి స్త్రీని, ఇలా మాట్లాడటం తగని పని' అని చెప్పినా, కీచకుడు 'నా పట్టపు రాణివై భోగాలు అనుభవించు' అని అన్నాడు.

అపుడు ద్రౌపది 'ఓ రాజా! ఇలా మోహంలోపడి ప్రాణం కోల్పోవద్దు. ఐదగురు గంధర్వులు నా భర్తలు. నన్ను సదా రక్షిస్తుంటారు. నీవు నాపై, ఈ మోహబుద్ధిని మానవల్సిందే, నీవు ఏ లోకాల్లో ఉన్నా, నా భర్తలు నిన్ను వదలరు.' అని చెప్పగా, కీచకుడు దిక్కుతోచక అక్క దగ్గరకు వెళ్ళి, ఏదైనా ఉపాయం చెప్పమన్నాడు. 'సైరంధ్రిని నీ దగ్గరకు ఒంటరిగా పంపుతాను. నీవు ఒప్పించుకో' అని అక్క చెప్పింది. ఒక పాత్రనిచ్చి సైరంధ్రిని కీచకుని దగ్గరకు పంపుతుంది. సైరంధ్రి భయంభయంగా, సూర్యుని ప్రార్థించి, బయలుదేరుతుంది. సూర్యభగవానుడు ఒక రాక్షసుని పంపి, ద్రౌపది వెంట వుండి కాపాడమని శాసిస్తాడు. సైరంధ్రి భయంతో వెళ్ళి మీ అక్క మీకు మంచి పానీయాన్ని తీసుకు వెళ్ళి ఇమ్మన్నది అని చెప్పగా, కీచకుడు సంతసించి, ద్రౌపదిని పట్టుకోబోతాడు. అయితే వేగంతో కీచకుని నెట్టివేసి, ద్రౌపది సభా ప్రాంగణంలోనికి చేరుకుంది. కీచకుడు వెంట పరగెత్తుకొని వచ్చి, ద్రౌపది జుట్టు లాగి తన్నాడు. ద్రౌపదిని రక్షిస్తూ వస్తున్న రాక్షసుడు కీచకుణ్ణి బంతిలా విసిరి వేయగా, అల్లంత దూరాన పడి అచేతనుడై పోతాడు.

ఆ సమయంలో సభలో ధర్మరాజు, భీముడు, సహదేవుడు కూడ ఉన్నారు. భీముడు ఆగ్రహంతో లేవగా ధర్మరాజు ఆపాడు. సైరంధ్రి విరాట రాజునుద్దేశించి, ధర్మబద్ధంగా మాట్లాడగా అందుకు హర్షించారు. ధర్మరాజు ద్రౌపదిని రాణి వద్దకు వెళ్ళమని ఆదేశించాడు. ద్రౌపది వెళ్ళి రాణికి అన్ని విషయాలు చెప్పగా, రాణి 'నిన్ను నా సోదరుడు అవమానిస్తున్నాడు. వాడిని నీవాళ్ళ చేత చంపించు' అని అనగా సైరంధ్రి 'రాణీ! కీచకుడు ఎవరిని అవమానిస్తున్నాడో, వారే కీచకుని చంపగలరు" అని జవాబు ఇచ్చింది.

తరువాత కీచకుని వధకు వ్యూహరచన జరిగింది. దాని ప్రకారం సైరంధ్రి కీచకుని నర్తనశాలకు ఆహ్వానిస్తుంది. అంతకుముందే, భీముడు అక్కడ పడుకొని వుంటాడు. కీచకుడు ఎంతో తమకంతో అక్కడికి

రావడం జరిగిపోయింది. కీచకుడు భీముని ద్రౌపదిగా భావించి అనేక వ్యర్థ ప్రేలాపనలు చేశాడు. భీముడు ఒక్క ఉదటున లేచి 'ఓరీ పాపీ! నిన్ను నేలకేసి కొట్టగలను' అని వాని జుట్టు పట్టుకొన్నాడు. కీచకుడు కూడ బలశాలి కనుక ఇద్దరూ భీకర యుద్ధం చేశారు. చివరకు భీముడు కీచకుని చంపి, అతని చేతులు, కాళ్ళను పొట్టలో దూర్చాడు. అతడు మరణించాడు. ఆ తర్వాత, ద్రౌపది అనుమతి తీసికొని భీముడు పాకశాలకు వెళ్ళాడు. కీచకుని సోదరులు, బంధువులు ఆ దృశ్యాన్ని చూచి విలపించారు. కీచకుని మృతదేహంతోపాటు సైరంధ్రి శరీరాన్ని కాల్చివేయటానికి రాజుగారి అనుమతి తీసుకొన్నారు. సైరంధ్రిని కూడ తీసికొని పోతున్నప్పుడు పాండవులు బిగ్గరగా ఎలుగెత్తి అరచిన శబ్దాలను భీముడు విని, రాచమార్గం ద్వారా కాకుండా, గోడ దూకి శ్మశానవాటిక వైపు ఒక పెద్ద వృక్షాన్ని చేతిలో పట్టుకొని వెళ్ళుచున్న దృశ్యాన్ని చూచి ఉపకీచకులు సైరంధ్రిని వదలి పెట్టి పోసాగారు. కాని భీముడు వారిని వెంటాడి అందరినీ చంపి వెళ్ళిపోయాడు.

అంతఃపురంలోకి ప్రవేశించిన సైరంధ్రిని రాణి సుధేష్ణ ఇలా అడిగింది. 'సైరంధ్రీ! గంధర్వులైన నీ భర్తలతో మాకు భయంగా ఉంది. నీవు ఎచ్చటికైనా వెళ్ళిపో' అన్నది. అందుకు ద్రౌపది 'మహారాణీ! ఇంక 13 రోజుల వరకు మాకు ఆశ్రయం ఇవ్వండి. మీకు కూడ మేలు జరుగుతుంది' అని ద్రౌపది అన్నది.

ఇది ఇలావుండగా, అజ్ఞాతవాసంలో వున్న పాండవులను పసిగట్టుటకు దుర్యోధనుడు గూఢచారులను పంపాడు. వారు దేశదేశాలు తిరిగి చివరకు దుర్యోధనుని వద్దకు చేరారు. అపుడు అక్కడ భీష్మ, ద్రోణ, కర్ణ, కృప, సుశర్మ, దుశ్శాసనాదులు ఉన్నారు. గూఢచారులు దుర్యోధనుని ఉద్దేశించి అందరి సమక్షంలో ఇలా అన్నారు. 'రాజా! ఈ ఆజ్ఞానుసారం వెళ్ళి వెదికాము. కాని పాండవులు ఎక్కడ ఉన్నారో తెలసుకోలేక పోయాము. పర్వతాలు, దేశాలు, మహానగరాలు అన్నీ గాలించాము. కాని జాడ దొరక లేదు. వారు మరణించి ఉంటారని మేము అనుకొంటున్నాము." ఇది వినిన దుర్యోధనుడు, 'పాండవుల అజ్ఞాతవాసం ముగియడానికి ఇంకా కొద్ది రోజులే మిగిలి వున్నాయి. మనం వారిని కనిపెట్టలేక పోతే, వారు బయలుదేరి వచ్చి, మనల్ని చీల్చి చెండాడటగలరు.' అన్నాడు. ఇది వినిన కర్ణుడు 'రాజా! ఇంకను తెలివిగల గూఢచారులను, సుసంపన్న దేశాలకు, మహాత్ముల ఆశ్రమాలకు పంపవలయును' అని అన్నాడు. దుర్యోధనుడు కర్ణుని ఆలోచనను బలపరచాడు. అపుడు ద్రోణాచార్యుడు ఇలా అన్నాడు. "పాండవులు శూరవీరులు, జితేంద్రియులు, ధర్మజ్ఞులు, వారు మరణించారని నేను అనుకోను అందుచేత బ్రాహ్మణులతో గాని, సిద్ధపురుషులతో కాని వెతికించిన ఏమైన ఫలితం వుండవచ్చు.' భీష్ముడు ఇలా అన్నాడు. 'నీతిమంతులైన వారిని అవినీతిపరులు కనుక్కోలేరు. పాండవులు ఎక్కడ ఉంటారో, అక్కడ వేదపారాయణం జరుగుతుంటుంది. ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుంది. దానిని బట్టి, మీరు జాగ్రత్తలు తీసుకోండి.' అన్నాడు. కృపాచార్యుడు "నేను భీష్మ పితామహుల మాటలతో ఏకీభవిస్తున్నాను. అజ్ఞాతవాసం పూర్తి అయిన తరువాత, పాండవుల తేజస్సు ద్విగుణీకృతం అవుతుంది. సంధి అగత్యం ఏర్పడవచ్చు. యుద్ధమే తప్పనిసరైతే, రాజుచే సైన్యం సంతృప్తిగా ఉందా, లేదా అని విచారించాలి. ధనాగారం నిండుగా ఉండాలి. అవసరమైతే దండోపాయాన్ని ఉపయోగించాలి.' అన్నాడు.

త్రిగర్త దేశపు రాజు సుశర్మ కర్ణుని వైపు చూస్తూ, దుర్యోధనుని ఉద్దేశించి ఇలా అన్నాడు. "రాజా! మత్స్య దేశపు రాజు విరటుడు కీచకుని బలం చూచుకొని, మమ్మల్ని చాలసార్లు హింసించాడు. ఇప్పుడు గంధర్వులు ఆ కీచకుని చంపారు. కనుక ఇపుడు విరాట రాజుపై దండయాత్రకు నాకు అనుమతి ఇవ్వండి." కర్ణుడు సుశర్మతో ఏకీభవించాడు. దుర్యోధనుడు సైన్యాన్ని సిద్ధం చేయమని దుశ్శాసనుని ఆజ్ఞాపించాడు. దుర్యోధుడు సుశర్మతో ఇలా అన్నాడు. 'మహారథీ సుశర్మా! మీరు ఒకవైపు నుండి, మేము మరొకవైపు నుండి దండయాత్ర చేద్దాం.

విరాటుని లక్ష గోవులను తరలించుకొని పోవాలి. అటునుండి మీరు దండయాత్ర చేసిన తరువాత, మేము ఇటునుండి చేస్తాము.'

ఇలా వీరు నిర్మించుకొన్న వ్యూహం ప్రకారమే, సుశర్మ తన సైన్యాన్ని తీసికొని విరాటరాజు గోవులను తరలించుటకు దురాక్రమణ చేశాడు. ఆపాటికే పాండవులు అజ్ఞాతవాసం పూర్తి అయిపోయింది. అప్పటికి సుశర్మ లక్ష గోవులను స్వాధీనం చేసుకొన్నాడు. ఇది తెలిసి, విరాటరాజు యుద్ధానికి సిద్ధమైనాడు.

విరాటరాజు తన తమ్ములైన శతానీకుడు, మదిరాశ్వుడు, సూర్యదత్తునితో 'తేజశ్శీలురైన, మారువేషధారులైన పాండవులు కూడ యుద్ధం చేయగలరు. కనుక వారి కోసం కూడ రథాలు సిద్ధం చేయించు' అని చెప్పాడు. ఇరుపక్షాలు భయంకర యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. శతానీకుడు, విరాటరాజు వైరివీరులను చంపుతున్నారు. సశర్మ విరాటరాజు రథాన్ని ఛిన్నాభిన్నం చేసి, విరటుని పట్టుకొని, తన రథంపై వేగంగా వెళ్ళసాగాడు. దానిని గమనించిన ధర్మరాజు భీముని హెచ్చరించి, రాజును విడిపించుకు రమ్మన్నాడు. భీముడు వెంటనే సుశర్మను వెంబడించి, బాణవర్షం కురిపించాడు. భీముడు మహోగ్రుడై తన గదతో రథాలపై, గజాలపై అశ్వాలపై ఉన్నవారిని ముక్కలు ముక్కలుగా చేస్తున్నాడు. సుశర్మ ఎదుటనే వేలాదిమందిని హతం చేశాడు భీముడు. సుశర్మ రథం దిగి పారిపోతున్నప్పుడు భీముడు అతని జుట్టు పట్టుకొని నేలపై ఈడ్చసాగాడు. త్రిగర్తుల సైన్యం పారిపోయింది. నకుల సహదేవులు గోవులన్నింటిని విరాటనగరం వైపు మళ్ళించారు. భీముడు సుశర్మను రథానికి కట్టి ధర్మరాజు వద్దకు తెచ్చాడు. ధర్మరాజు 'ఓయీ సుశర్మా! నీవు విరాటరాజు దాసుడవు. ఇలాంటి సాహసం మళ్ళీ చేయొద్దు' అని వదలి వేశాడు. సుశర్మ ధర్మరాజుకు నమస్కరించి, తలదించుకొని వెళ్ళిపోయాడు.

విరాట రాజు సుశర్మను ఎదిరించడానికి వెళ్ళిన సమయంలో దుర్యోధనుడు విరాట నగరంపై దాడి చేశాడు. భీష్ముడు మున్నగువారు దుర్యోధనుని వెంబడి ఉన్నారు. గోపబాలురు, గోరక్షకుడు వెళ్ళి గోవులను అటకాయించడం గురించి ఉత్తర కుమారునితో చెప్పారు. ఉత్తరుడు ప్రగల్భాలు పలకడం చూచి సైరంధ్రి ఇలా అంది. 'ఇపుడు మన వద్ద బృహన్నల పూర్వం అర్జునునికి సారథిగా పనిచేశాడు. కనుక మీరు బృహన్నలను రథసారథిగా చేసుకొంటే, మీకు తప్పక విజయం కలుగుతుంది.' ఉత్తరుడు తన చెల్లెలు ఉత్తర ద్వారా బృహన్నలను పిలిపించి, రథం తెప్పించి, కవచం ధరించి, సిద్ధమైనాడు. ఉత్తర యుద్ధంలో గెలిచి, ఓడిన మహావీరుల తలపాగాల కుచ్చులను నాకు బొమ్మ పొత్తికలుగా తీసికొని రమ్మని బృహన్నలను కోరింది. ఉత్తర కుమారుడు సారథియైన బృహన్నలను కౌరవుల వైపు రథం నడిపించమని ఆదేశించాడు. అర్జునుడు కళ్ళెం కొద్దిగా వదులు చేయగా, అశ్వాలు ఆకాశమార్గాన వెళుతున్నట్లు అనిపించింది. ఉత్తర కుమారునికి ముచ్చెమటలు పోయసాగాయి. అపుడు బృహన్నలతో 'బృహన్నలా! శస్త్రవిద్యలలో నైపుణ్యం లేని నేను ఆ మహావీరులతో పోరాడలేను. రథాన్ని విరాట నగరానికి పోనీ!' అన్నాడు. అపుడు బృహన్నల 'ఉత్తర కుమారా! మనం ఇపుడు మరలిపోతే, అందరూ నవ్వుతారు. మనం ఎట్టి పరిస్థితుల్లోనూ గోవులను మళ్ళించుకొని పోవాలి. భయపడకు.' అనినను ఉత్తర కుమారుడు భయంతో రథం దిగి పారిపోవడంతో, అర్జునుడు కూడ రథం దిగి, 'ఉత్తర కుమారా! నీవు సారథిగా ఉండు, నేను యుద్ధం చేస్తాను' అని అన్నాడు. దూరంనుండి గమనించిన ద్రోణాచార్యుడు ప్రక్కనే ఉన్న భీష్మునితో 'పితామహా! ఆ స్త్రీ వేషంలో వున్న పురుషుడు అర్జునునిలా ఉన్నాడు, అదే నిజమైతే మనల్ని జయించి, గోవులను తరలించుకు పోగలడు.' అని అన్నాడు. దుర్యోధనుడు 'అదే నిజమైతే, పాండవుల అజ్ఞాతవాసం భంగమైనట్లే, మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలు చేయవలసిందే. ఇంకా గడువు ముగియలేదు కదా! చాల సంతోషంగా ఉంది.' అని తనలో తాను ఆలోచిస్తున్నాడు.

అర్జునుడు సమీపంలో వున్న శమీవృక్షంపై ఉన్న ఆయుధాలను తీసుకొని రమ్మని ఉత్తర కుమారునిత అన్నాడు. ఉత్తరుడు వాటిని తెచ్చి, అర్జునునికి ఇస్తూ, 'ఇవి ఎవరివి?' అని అడిగాడు. ఇది అర్జునుడివిలే' అని బృహన్నల చెప్పాడు. 'ఇది గాండీవము. దీన్ని వరుసగా బ్రహ్మ, ప్రజాపతి, ఇంద్రుడు, చంద్రుడు మాత్రమే ఉపయోగించారు. కాని ఇటీవల అరుణుని ద్వారా అర్జునునకు ప్రసాదించబడింది' అని అన్నాడు. ఇప్పుడు పాండవులు ఎక్కడున్నారని ఉత్తర కుమారుడు అడిగితే, నేనే అర్జునుణ్ణి, కంకుభట్టుగా ధర్మరాజు, వలలుని పేరుతో వంటవానిగా భీముడు, గ్రంధికునిగా నకులుడు, తంత్రీపాలుడుగా సహదేవుడు, సైరంధ్రిగా ద్రౌపది మీ కొలువులోనే వున్నామని తెలుసుకో' అని అన్నాడు.

ఉత్తర కుమారుడు సందేహంతో అర్జునుని నీ పది పేర్లేమి అని అడిగితే, అర్జునుడు ధనంజయుడు, విజయుడు, శ్వేతవాహనుడు, ఫల్గుణుడు, కిరీటి, భీభత్సుడు, సవ్యసాచి, అర్జునుడు, జిష్ణు మరయు కృష్ణ – ఇవన్నీ నా పేర్లు అన్నాడు. ఇవన్నీ వినిన ఉత్తర కుమారుడు, అర్జునునికి నమస్కరించి, 'ఇది నా సౌభాగ్యము, మీకు రథసారధిగా ఉంటాను' అని అన్నాడు. అర్జునుడు అన్ని అస్త్రములను స్మరణకు తెచ్చుకొని, మనస్సులో పదిలపరచుకుని, ప్రసన్నుడైనాడు. ఆయనకు మునుపటి రూపం వచ్చింది. ఈ తర్వాత శమీవృక్షానికి నమస్కరించి, అగ్నిదేవు డిచ్చిన రథాన్ని స్మరించుకున్నాడు తదేక ధ్యానంతో. ఒక దివ్యరథం ఆకాశంనుండి దిగివచ్చింది. అర్జునుడు ప్రదక్షిణము చేసి రథానికి నమస్కరించాడు. మహాశంఖమైన దేవదత్తాన్ని పూరించాడు. అర్జునుని ధనస్సు టంకార ధ్వని, హనుమ ఝంకార ధ్వని, రథ ధ్వని శత్రువుల గుండెలను భయంతో కలవర పరచాయి. పర్వతలు గుహలు, దిశలు ప్రతిధ్వనించాయి. భూమి బ్రద్దలవడం, మేఘగర్జనల కంటె భీషణమైన శబ్దంతో కౌరవసైన్యం నిస్తేజమైపోయింది. అపుడు ద్రోణాచార్యుడు ఆ వస్తున్నది అర్జునుడి లాగే ఉన్నాడు అని అన్నాడు. దుర్యోధనుడు అపుడు అదే అర్జునుడయిన పక్షంలో, వారి గడువు ముగిసిందా లేదా అనేది పితామహుడు తేల్చాలి. గడువు ముగియక పోతే, పాండవులు మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలు చేయాల్సి ఉంటుంది.' అన్నాడు. 'అర్జునుడు నా చేతిలో చావక తప్పదు' అని కర్ణుడు అన్నాడు. 'అర్జునుణ్ణి నీవొక్కడివే ఏమీ చేయలేవు' అని కృపాచార్యుడు కర్ణునితో అన్నాడు. 'ఎందుకంటే ఆనాడు చిత్రసేనుని ఓడించి కౌరవుల్ని రక్షించాడు. ఇప్పుడు కూడ శకుని అండతో యుద్ధం చేయ'మని అశ్వత్థామ అన్నాడు. చివరకు భీష్ముడు 'పాండవుల అజ్ఞాతవాసం ఎప్పుడో ముగిసింది. అందుచేతనే అర్జునునితో యుద్ధం తప్పదు. నా ఆలోచన ఏమంటే దుర్యోధనుడు తగినంత సైన్యంతో గోవులను తీసికొని హస్తిన బాట పట్టాలి. ద్రోణుడు సైన్యంతో మధ్యలో ఉండాలి. ద్రోణునికి ఎడమ అశ్వత్థామ, కుడివైపు కృపాచార్యుడు ఉండాలి. కర్ణుడు సైన్యం ముందుండాలి. నేను సైన్యం మొత్తం వెనుక భాగాన వుండి ఉచితానుచితాలు పర్యవేక్షిస్తుంటాను.' అన్నాడు.

ఇలా కౌరవుల వ్యూహరచన ముగిసింది. దూరాన్నుండి వస్తున్న అర్జునుని చూచి ద్రోణుడు కౌరవ వీరులతో 'అదిగో అర్జునుడు వస్తున్నాడు. రెండు బాణాలు నా పాదాల దగ్గర రాలినవి. ఇలా నా కుశల సమాచారము అర్జునుడు తెలుసుకొంటున్నాడు.' అన్నాడు. ఈలోపు అర్జునుడు కౌరవ సైన్యాలను చూచి, దుర్యోధనుడు కన్పించకపోగా, రథాన్ని దక్షిణ దిక్కుకు మరలించమని చెప్పి, ఆవైపు దుర్యోధనుని చూచాడు. దుర్యోధనుని వెంటనున్న సైన్యంపై బాణవర్షం కురిపించి, వారిని తరిమివేసి, గోవులను నగరంవైపు మళ్ళించమని గోపాలకులను ఆజ్ఞాపించాడు. తర్వాత రథాన్ని కర్ణుని వైపు మళ్ళించమని చెప్పాడు. అక్కడికి చేరేలోగా సైన్యాన్ని సంహరించాడు. కర్ణుడు అర్జునునిపై బాణాలు వేసి, ఉత్తర కుమారుని బాధపెట్టాడు. కాని అర్జునుడు తన బాణవర్షంతో కర్ణుని

కప్పివేశాడు. అతి గొప్ప ధనుర్ధరులైన వారిద్దరి మధ్య జరిగిన యుద్ధాన్ని చూడటానికి ఎక్కడివారక్కడే నిలబడి పోయారు.

అర్జునుడు సవ్యసాచిగా మారి కర్ణుని బాణవర్షంతో కప్పివేశాడు. భీష్ముడు కూడా కప్పబడ్డాడు. కౌరవ సైన్యం హాహాకారాలు ఆకాశాన్నంటాయి. కర్ణుడు తేరుకొని అర్జునుని అశ్వాన్ని, సారథిని నొప్పించాడు. అర్జునుడు కూడ కర్ణుని విపరీతంగా నొప్పించాడు. కర్ణుడు నిస్సహాయుడై యుద్ధం నుండి విరమించుకొన్నాడు.

అర్జునుడు వివిధాస్త్రాలను ప్రయోగిస్తూ, రుద్రుని వలె కౌరవ సైన్యాన్ని నాశనం చేశాడు. అర్జునుడు ఉత్తర కుమారునితో 'రాకుమారా! అదగో అటు చూడు, ఎరుపురంగు అశ్వాలను కలిగిన మహాపురుషుడు కృపాచార్యుడు, అటు చూడు, సమస్త శస్త్రధారుల్లో శ్రేష్ఠుడైన ద్రోణాచార్యుడు, మన రథంతో ఆయనకు ప్రదక్షిణం చేయి. దగ్గరలోనే అశ్వత్థామ వున్నాడు. అదిగో ఏనుగు గుర్తు ఉన్న దుర్యోధనుడు. ఆ ప్రక్కనే వున్నవాడు అమిత పరాక్రమవంతుడు కర్ణుడు. అడుగో, అతి పెద్ద ధనుస్సుతో, శ్వేత ఛత్రంతో ప్రకాశిస్తున్న మా పితామహుడు భీష్ముడు. మిగతా అందరినీ జయించిన తరువాతనే మనం పితామహుని వద్దకు వెళ్ళాలి.

విరాట రాకుమారుడు కృపాచార్యుని రథానికి ప్రదక్షిణం చేయించి, ఎదురుగా నిలబడ్డాడు. అర్జునుడు తన దేవదత్త శంఖాన్ని బిగ్గరగా పూరించాడు. రోషంతో కృపాచార్యుడు అర్జునునిపై బాణవర్షం కురిపించగా, వాటినన్నింటిని అర్జునుడు మధ్యలోనే త్రుంచివేశాడు. మరొక బాణంతో ఆయన ధనస్సును కూడా ముక్కలు చేశాడు. ఆగ్రహంతో కృపాచార్యుడు శక్తిని ప్రయోగించాడు. అర్జునుడు ఒకేసారి పదిబాణాలు వేసి ఆ శక్తిని ఎదిరిస్తూ, రథాన్ని, అశ్వాన్ని, సారథిని నష్టపరచాడు. కృపాచార్యుని గదను, అతని వద్దకే పంపాడు అర్జునుడు. కౌరవ వీరులు ఇదంతా గమనించి, కృపాచార్యుని యుద్ధభూమినుండి పంపించి వేశారు.

ఈలోగా ద్రోణాచార్యుడు అర్జునుని ఎదుర్కోవడం ప్రారంభించాడు. ఇద్దరూ నిపుణులే. సైనికులు వీరి పోరాటం చూస్తూ, ప్రతిభను పోగొట్టుకున్నారు. ద్రోణాచార్యుని బాణాలను అర్జునుడు మొదట్లోనే త్రుంచివేయసాగాడు. ద్రోణాచార్యుడు వాయవ్య, ఆగ్నేయాస్త్రాలను ప్రయోగిస్తుంటే, అర్జునుడు తన దివ్యాస్త్రాల చేత వాటిని ఖండిస్తుంటే చూచి దేవతలు కూడ ఆశ్చర్యపడ్డారు. వీరుల కేకల మధ్య, అర్జునుడు ద్రోణాచార్యుని కవచాన్ని ముక్కలు చేసేశాడు. ద్రోణాచార్యుని సారథి రథాన్ని రణరంగం నుండి దూరంగా తీసికొని వెళ్ళాడు.

తరువాత అశ్వత్థామ అర్జునునితో పోరాడాడు. అశ్వత్థామ బాణవర్షతో అర్జునుని వింటినారిని త్రుంచేశాడు. కాని క్షణకాలంలో అర్జునుడు కొత్త నారిని సంధించి భయంకరంగా పోరాటం చేశాడు. అర్జునుడు తన అమ్ముల పొదినుండి నిరంతరం బాణవర్షం కురిపిస్తున్నాడు. అశ్వత్థామ అమ్ముల పొది పదే పదే ఖాళీ చేసి యిబ్బంది పెట్టాడు. ఇంతలో అర్జునునికి కర్ణుడు కనిపించగా, అశ్వత్థామను వదలివేసి, కర్ణునిపై బాణవర్షం కురిపించాడు. కర్నుడు కూడ ఏమాత్రం తగ్గకుండా అర్జునుని వేధించాడు. అర్జునుడు చివరకు ఒక తేజోవంతమైన బాణాన్ని వేయగా, అది నేరుగా వెళ్ళి కర్ణుని కవచాన్ని ఛేదిస్తూ, శరీరంలో గ్రుచ్చుకోగా కర్ణుడు స్పృహ కోల్పోయాడు. సారథి కర్ణుని తీసుకొని వెళ్ళిపోయాడు.

ఇక అదిగో భీష్ముని వద్దకు తీసికొని పో అని అర్జునుడు ఉత్తర కుమారుని అడిగాడు. ఉత్తర కుమారుడు 'ఓ వీరవరా! ఇంతటి రణరంగాన్ని నేను ఇంతవరకు చూడలేదు. భయం వేస్తోంది. నా అవయవాలు చచ్చుపడ్డాయి. మీ గాండీవ శబ్దానికి నేను చెవిటి వాడినై పోయాను సుమా! నేను ఇక సారథ్యం చేయలేకున్నాను.' అని అన్నాడు.

అర్జునుడు 'రాకుమారా! నీకు అన్ని శక్తులూ ఉన్నాయి. భయపడకు. నీవు అశ్వాల్ని చూచుకో. మిగతావి నేను చూచుకుంటాను.' అన్నాడు. ఉత్తర కుమారుడు ధైర్యంగా భీష్ముని ముందుకు రథాన్ని తోలాడు. భీష్ముడు ఇది గమనించి, అర్జునుని రథాన్ని అడ్డగించాడు. కోపంతో అర్జునుడు భీష్ముని రథానికి గల ధ్వజాన్ని పడగొట్టాడు, భీష్ముని నొప్పించాడు. దీన్ని గమనించి, వీరులందరు అర్జునుని మీదకు వచ్చారు. అపుడు అర్జునుడు ఇంద్రాస్త్ర ప్రయోగించి, అందరినీ అదుపులోకి తెచ్చుకొన్నాడు. ఏనుగులు మూర్ఛపోయాయి. సైనికులు పరారయ్యారు. భీష్ముడు కోపంతో అర్జునుని ధ్వజంపై ఎనిమిది బాణాలు ప్రయోగించాడు. అర్జునుని రథం ప్రక్కన వున్న వారికి గాయాలయ్యాయి. వెంటనే అర్జునుడు దివ్యాస్త్రాలను ప్రయోగించి, భీష్ముని అశ్వాలను, సారథిని నొప్పించాడు. అత్యంత తీవ్ర బాణాలతో యుద్ధం చేస్తున్న అర్జునుని చూచి భీష్ముడు ఖిన్నుడైనాడు. గమనించిన సారథి రథాన్ని బయటికి తీసుకొని వెళ్ళాడు.

తరువాత దుర్యోధనుడు అర్జునునకు ఎదురుగా వెళ్ళి గాయపడ్డాడు. పారిపోవ యత్నించాడు. అర్జునుడు హేళన చేయగా, మళ్ళా ఏనుగు మీద తిరిగి వచ్చాడు దుర్యోధనుడు. సహాయంగా కర్ణుడు కూడ వచ్చాడు. అదే సమయానికి భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు కూడ వచ్చారు. ఆ పరిస్థితిని గమనించిన అర్జునుడు సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించి, అందరినీ మూర్ఛిల్ల చేశాడు. అచేతనావస్థలో వున్న ఆ వీరుల తలపాగాల నుండి కుచ్చులను కత్తిరించమని ఉత్తర కుమారునకు చెప్పాడు అర్జునుడు. భీష్ముని వద్దకు మాత్రం వెళ్ళవద్దని చెప్పాడు. ఉత్తర కుమారుడు వెళ్ళి రంగురంగుల తలపాగాల కుచ్చులను కత్తిరించి తెచ్చి, రథాన్ని ఎక్కి, అర్జునుని యుద్ధభూమి నుండి బయటకు తీసికొని వెళ్ళాడు.

ఇది చూచి భీష్ముడు మళ్ళీ అర్జునునిపై బాణవర్షం కురిపించసాగాడు. అర్జునుడు ప్రతిఘటించి, అశ్వాలను నొప్పించి, భీష్ముని సారథిని చంపాడు. సూర్యుని వలె ప్రకాశించాడు. కౌరవ వీరులు మేల్కొన్నారు. దుర్యోధనుడు అర్జునుని చూచి భీష్మ పితామహుని నిలువరించమని కోరాడు. భీష్ముడు అపుడు 'దుర్యోధనా! నీవు అచేతనావస్థలో ఉన్నపుడు అర్జునునికి నిన్ను చంపే అవకాశం ఉంది. వ్యర్థ ప్రలాపాలు మానుకొని హస్తినకు బయలుదేరు' అని చెప్పాడు.

ఇటువైపు అర్జునుడు కూడ ఉత్తర కుమారునితో 'రాకుమారా! మనం విజయులం ఐనట్లు, వస్తున్నట్టు రాజుకు వర్తమానం పంపు' అని అన్నాడు.

ఇక పాండవులు విరాటరాజు పక్షాన పోరాడి, విజయులై ఉత్తర కుమారునితో కలిసి, విరాట నగరంలోకి ప్రవేశించడం, ఆ తరువాత జరిగిన ఆసక్తికరమైన ఘటనలను తెలుసుకుందామా!

అర్జునుడు, ఉత్తర కుమారుడు మరల శమీవృక్షం దగ్గరకువెళ్ళి, ఆ వృక్షంపై ఆయుధాలన్నీ భద్రపరచుకొని, విరాట నగరంవైపు బయలుదేరారు. బృహన్నల వేషంలోనే అర్జునుడు రథసారథిగా ఉన్నాడు. సమయం ఇంకా రాకపోవడంతో అర్జునుడు తాను అర్జునడనని, బృహన్నలను కాదని చెప్పలేదు. విరాటరాజు కూడ విజయగర్వంతో సింహాసనం అధిష్టించాడు. కాని ఉత్తరు కుమారుడు ఒంటరిగా వెళ్ళి భీష్మాదులతో తలడపడటం అంటే విపత్కర విషయమని భావించి, విరాటరాజు ఆందోళనతో ఉన్నాడు. తన సర్వసైన్యాన్ని ఉత్తర కుమారునకు సహాయంగా నిలబడమని విరాటరాజు ఆదేశించాడు.

ఈలోపుగా ఉత్తర కుమారుడు పంపిన వేగులు విరాట రాజుకు తమ విజయ సందేశంతో పాటు, కౌరవులను జయించి, గోవులను మళ్ళించి, రాకుమారుడు నగరం వైపు వస్తున్నాడని చెప్పారు. ఈ వార్త విని విరాట రాజు ఆనందానికి హద్దులు లేవు. స్వాగత ఏర్పాట్లు చేయమని, శోభాయమానంగా ఉండాలని ఆదేశించాడు. తన సంతోషాన్ని ప్రదర్శించుటకు విరాటరాజు తన కుమారుడే జయించి వస్తోన్నట్లు, వానిని ప్రశంసించడం మొదలు పెట్టాడు. కాని ధర్మరాజుకు అన్నీ తెలుసు కనుక 'రాజా! బృహన్నల రథసారధిగా ఉంటే ఇంద్రుణ్ణి కూడ జయించవచ్చు' అని అనగానే, పట్టరాని కోపంతో విరాటరాజు చేతిలోని పాచికలను ధర్మరాజు ముఖం మీద విసిరి వేశాడు. ధర్మరాజు ముక్కునుండి రక్తం కారటం మొదలు పెట్టింది. తన రక్తపుచుక్క భూమిపై పడకముందే ధర్మరాజు తన చేతిని అడ్డుపెట్టుకొన్నాడు. ఆ రక్తపు చక్క భూమిపై పడితే, కరువు కాటకాలు ప్రబలుతాయి. అందుచేత ద్రౌపది ఒక చిన్న పాత్ర తెచ్చి, రక్తం క్రిందపడకుండా పట్టుకొంది.

ఈలోగా బృహన్నల, ఉత్తర కుమారుడు సభాభవనంలో ఉన్నారని వార్త అందింది. రాజు వారిద్దరిని లోపలికి రమ్మన్నాడు. ధర్మరాజు మెల్లగా ద్వారపాలకునితో "మొదట ఉత్తర కుమారుని మాత్రమే ప్రవేశపెట్టు" అన్నాడు. నా గాయం చూస్తే, విరాటుడు నాశనమై పోతాడు.' అని అన్నాడు. తరువాత రాకుమారుడు ప్రవేశించి, రాజుకు, కంకుభట్టుకు నమస్కరించి, 'ఈ మహాపురుషుణ్ణి (ధర్మరాజును) ఎవరు గాయపరచారు?' అని అడిగాడు. 'నేనే గాయపరచాను నాయనా, నేను నిన్ను పొగుడుతుంటే, ఈయన బృహన్నలను ప్రశంసిస్తుంటే, కోపంతో గాయపరచాను.' అని విరటుడు అనగా, 'అయ్యో రాజా! మీరు అనర్థానికి కారకులవుతున్నారు. వీరిని ప్రసన్నులుగా చేసికోవాలి.' అనగానే విరటుడు ధర్మరాజును క్షమాపణ కోరాడు. ఈలోగా బృహన్నల కూడ లోనికి వచ్చాడు. అందరి ఎదురుగానే విరటుడు మరల కుమారుని ప్రశంసించడం మొదలు పెట్టాడు. అంతటి మహావీరులను ఎలా నిలువరించ గలిగావో చెప్పమని ఉత్తర కుమారుని విరటుడు అడిగాడు. అపుడు రాకుమారుడు ఇలా అన్నాడు. "మహారాజా! నిజానికి ఈ విజయం నాది కాదు. ఒక దేవకుమారుడు నాకు ఈ విజయాన్ని సాధించి పెట్టాడు. ఆయనే కౌరవ వీరులను మట్టికరిపించి, గోవులను మళ్ళించి, మేలిమి వస్త్రాలను అపహరించి, మనకు గొప్ప విజయాన్ని అందించాడు.' అని అనగా, 'ఆ దేవ కుమారుని నాకు చూపించు' అని విరటుడు అడుగగా, ఉత్తర కుమారుడు 'ఆ దేవకుమారుడు అక్కడే అదృశ్యమయ్యాడు' అని అంటూ రంగురంగుల తలపాగ కుచ్చులను చూపించి, వాటిని ఉత్తరకు ఇచ్చాడు. ఆమె ఎంతో సంతోషపడింది.

ఆ తర్వాత మూడవ రోజు, పాండవులందరు రాజోచిత రీతిలో దుస్తులు ధరించి, సభాభవనంలో సింహాసనాలపై కూర్చొని వున్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన విరటుడు ఆశ్చర్యంతో పాచికలాటకు నేను నియమించుకున్న కంకుభట్టు నా సింహాసనంపై కూర్చోవడం ఆశ్చర్యంగా ఉంది అనుకొని వారి వివరాలు అడిగాడు. సమాధానంగా అర్జునుడు 'రాజా! మీ సింహాసనం ఏమిటి? ఆ మహాపురుషుడు ఇంద్రుని సింహాసనంపైననే కూర్చొన తగినవాడు. ఆయన మహారథికుడై, ధర్మపరాయణుడై, ధీరుడై, చతురుడై, సత్యవాదియై, జితేంద్రియుడైన ధర్మరాజు నామంతో ప్రఖ్యాతి గాంచి వున్నాడు' అని అనగానే, 'అయితే భీమార్జున నకుల సహదేవులు, ద్రౌపది ఎక్కడ?' అని రాజు అడిగాడు. అపుడు అర్జునుడు మీ అశ్వాలను చూచింది నకులుడు, సహదేవుడు ఆవులను రక్షించాడు. మాలిని నామంతో సైరంధ్రి రూపంలో ఉన్నదే ద్రౌపది. చివరగా నేనే అర్జునుణ్ణి.' అని ప్రకటించాడు.

ఆ సమయంలో కలుగ జేసుకొని, ఉత్తర కుమారుడు 'నాన్నగారూ! రణరంగంలో కౌరవులను తరిమికొట్టిన దేవకుమారుడు ఈ అర్జునుడే. చీల్చిచెండాడాడు.' అని చెప్పాడు.

ఇదంతా చూచి సంతసించిన విరాటరాజు పాండవులను అమితంగా ప్రశంసించి, ఉత్తరను వివాహ మాడమని అర్జునుని కోరాడు. 'రాజా! నేను ఉత్తరకు నాట్యం నేర్పాను. నాకు రాకుమారి కుమార్తెతో సమానం. నా కుమారుడైన అభిమన్యునకు ఇచ్చి వివాహం జరిపించడం ఉచితంగా భావిస్తున్నాను.' అన్నాడు.

అందరూ సమ్మతించి, హర్షించిన మీద, శ్రీకృష్ణుడు, బలదేవుడు, సాత్యకి, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు మొదలైనవారు హాజరు కాగా అంగరంగ వైభవంగా ఉత్తర మరియు అభిమన్యుల వివాహం వైభవంగా జరిగింది. విరటుడే కాకుండా, వివాహానికి విచ్చేసిన రాజులందరు గొప్ప సైన్యాల్ని, అశేష సంపదను పాండవులకు సమర్పించారు.

-o0o-

5. ఉద్యోగ పర్వం

అభిమన్యుని వివాహం తరువాత యాదవులందరు విరాటుని సభకు వెళ్ళారు. ఆ సభలో విరాటుడు, ద్రుపదుడు, వసుదేవుడు, శ్రీకృష్ణుడు, సాత్యకి, ధర్మరాజు, భీముడు, అర్జున, నకుల సహదేవులు మరియు అభిమన్యుడు మున్నగువారు తమ తమ ఆసనాల్లో కూర్చొని ఉన్నారు.

ముందుగా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "శకుని కపట ద్యూతంతో పాండవులు అరణ్య, అజ్ఞాత వాసాలను ధర్మబద్ధులై అనేకమైన శ్రమలకోర్చి జయప్రదంగా ముగించుకున్నారు. ఇపుడు పాండవుల అర్ధరాజ్యం కోసం మనం ఒక సమర్థుడైన దూతను పంపించాల్సి వుంది. ఆలోచించండి." బలరాముడు "జూద వ్యసనాన్ని ఆధారం చేసుకొని, వారి రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఇందులో శకుని తప్పు లేదనుకొంటాను.' అని అనగానే సాత్యకి అసహనంగా లేచి బలరాముని ఆక్షేపించాడు. 'ధర్మరాజుకు ఇష్టం లేకున్నా బలవంతంగా జూదమాడించి, రాజ్యం కాజేయడం ధర్మసమ్మతమా? పాండవులు ఇపుడు భాగస్వాములై యుండి కూడ, భిక్షమెత్తుకోవాలా?' అని అన్నాడు. 'భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మున్నగువారు ఎంత చెప్పినా దుర్యోధనుడు అంగీకరించడు' అని కూడ అన్నాడు. అపుడు సాత్యకి 'రేపటి రణంలో పాండవులను ఎదుర్కొనే వీరులున్నారా? పాండవుల రాజ్యం వారికిచ్చి వేయాలి. లేకుంటే రణంలో దుర్యోధనాదులు నశించుట నిజము' అని దురుసుగా చెప్పాడు.

అపుడు ద్రుపదుడు ఇలా అన్నాడు. 'దుర్యోధనుడు మంచిగా రాజ్యం ఇస్తాడని నేననుకోను. చెడ్డవాని మనస్సు మంచి మాటలతో మారదు. రాబోయే యుద్ధంలో సహకరించమని ఇతర రాజులను దూతలను పంపాలి. నావద్ద తెలివిగల పురోహితుడున్నాడు. వానిని ధృతరాష్ట్రుని వద్దకు పంపాలి. సందేశం ఎలా వుండాలో నా పురోహితునకు చెప్పి పంపండి.' అని చెప్పాడు. శ్రీకృష్ణుడు 'మహారాజు ద్రుపదుడు అనుభవపూర్వకంగా బాగా మాట్లాడాడు. ధర్మరాజుకు అనుకూలమైన సందేశాన్ని అందించి తననే పంపమని కోరుతున్నా' అని అన్నాడు. విరాటరాజు శ్రీకృష్ణుని సత్కరించి, అందరికీ వీడ్కోలు పలికాడు. పాండవులు కూడ ఇతర రాజులను రాబోవు యుద్ధములో వారిని తమకు సహకరించమని అన్నాడు. ఆయా రాజులందరు సంతోషంగా సైన్యంతో సహా వచ్చి సహకరిస్తామని జవాబు ఇచ్చారు. దుర్యోధనుడు కూడ ఇదే పనిలో వున్నాడు. అపుడు ద్రుపదుడు తన పురోహితునితో 'ఓ దేవా! జీవుల్లో మానవుడు శ్రేష్ఠుడు. వారిలో ద్విజులు శ్రేష్ఠులు. వీరిలో విద్వాంసులు గొప్పవారు. వీరిలో బాగా సిద్ధాంతం తెలిసినవారు ఉన్నతులు. అందులో బ్రహ్మవేత్తలు ఉత్తమోత్తములు. మీరు బృహస్పతికి సములై ఉన్నారు. కనుక మీరు హస్తినకు వెళ్ళి పాండవులకు న్యాయం జరిగేటట్లు సమయోచితంగా, పని సఫలవంతంగా అయ్యేటట్లు ధృతరాష్ట్రునికి చెప్పి ఒప్పించండి.' అని చెప్పాడు.

ద్రుపదుని పురోహితుడు తన శిష్యులతో పాటు హస్తినకు బయలుదేరాడు. ఇటు అర్జునుడు శ్రీకృష్ణుని సహాయం కొరకు ద్వారకకు బయలుదేరాడు. దుర్యోధనుడు కూడ ద్వారాకకు వచ్చాడు. దుర్యోధనుడు శ్రీకృష్ణుని పాదాల వద్ద కూర్చోవడం అవమానంగా భావించి, తల వద్దనున్న సింహాసనంపై కూర్చొన్నాడు. కాని అర్జునుడు రెండు చేతులను జోడించి, శ్రీకృష్ణుని పాదాల చెంత నిల్చుని ఉన్నాడు. శ్రీకృష్ణుడు మేల్కొని పాదాల వద్ద నిల్చున్న అర్జునుని చూచాడు. దిగ్గున లేచి తలవద్ద కూర్చొన్న దుర్యోధనుని కూడా చూచాడు. ఇద్దరూ వచ్చిన కారణమేమని వారిని అడిగాడు. దుర్యోధనుడు శ్రీకృష్ణుని సాయం కావాలని, తానే ముందు వచ్చానని చెప్పాడు. అపుడు శ్రీకృష్ణుడు నిజమే మీరు ముందు వచ్చారు, కాని నేను ముందు అర్జునుని చూచాను. కాబట్టి ఇద్దరికి సాయం

చేస్తాను. నా దగ్గర కోటానుకోట్ల యాదవ సైన్యం ఉంది. వారు రణరంగ నిపుణులు. నేను మాత్రం ఆయుధం పట్టను. నా సైన్యం ఒక వైపు, నేను ఒక్కడినే ఒక వైపు, కాబట్టి అర్జునా! నీవు చిన్నవాడవు కనుక నీవే కోరుకో అని అనగానే అర్జునుడు శ్రీకృష్ణుని కోరుకొన్నాడు. దుర్యోధనుడు సైన్యాన్ని తీసుకొన్నాడు. ఆ తర్వాత దుర్యోధనుడు బలరాముని వద్దకు సాయం కోరి వెళ్ళాడు. బలరాముడు 'దుర్యోధనా! నేను కృష్ణుని వదలి ఉండలేను. నేను ఎవరికి సాయం చేయను. నేను తీర్థయాత్రలకు వెళ్ళిపోతున్నాను.' అని చెప్పాడు. దుర్యోధనుడు సంతోషించాడు. ఎందుకంటే నారాయణుని సైన్యం తనకు లభించింది కనుక తనదే విజయమని భావించాడు. తరువాత దుర్యోధనుడు కృతవర్మను సాయం అడిగాడు, ఆయన ఒక అక్షౌహిణి సైన్యాన్నిచ్చాడు. చాల సంతోషంగా దుర్యోధనుడు హస్తిన చేరాడు. శ్రీకృష్ణుడు అర్జునుని ఇలా అడిగాడు. 'అర్జునా! నన్ను ఎందుకు కోరుకున్నావు?'. అపుడు అర్జునుడు 'ఓ కృష్ణా! చాలకాలం నుండి నాదొక కోరిక. నిన్ను నా సారథిగా చూడాలని.' అన్నాడు. అందుకు శ్రీకృష్ణుడు అర్జునుని సారథిగా ఉండటానికి అంగీకరించాడు. అక్కడనుండి అందరూ ధర్మరాజు వద్దకు చేరారు.

పాండవ సందేశం విన్న శల్యుడు ఒక అక్షౌహిణి సైన్యంతో పాండవులకు సాయం చేసేందుకు బయలుదేరాడు. దుర్యోధనుడు ఈ విషయం తెలుసుకొని తానే నాయకత్వం వహించి మధ్య దారిలో ఎన్నో సత్కారాలు చేయించాడు. శల్యుని కోసం ఇంద్రసమాన భవనాన్ని నిర్మించాడు. శల్యుడు చూచి, ఇంత గొప్ప నిర్మాణం ఎవరు ఏశారో, వారిని నా వద్దకు తీసుకొని రండి అని సేవకులతో అన్నాడు. సేవకులు దుర్యోధనుని దగ్గరకు వెళ్ళి ఈ మాటలు చెప్పారు. శల్యుడు ప్రసన్నంగా ఉన్నాడని, దుర్యోధనుడు శల్యునికి ఎదురేగాడు. ఈ సత్కారాలన్నీ దుర్యోధనుడే చేశాడని, అతనిని కౌగలించుకొని ఏమి కావాలో కోరుకోమన్నాడు. దుర్యోధనుడు శల్యుని తన సైన్యానికి నాయకత్వం వహంచమని కోరాడు. శల్యుడు తథాస్తు అన్నాడు. దుర్యోధనునితో 'నీవు నీ రాజధానికి పో. నేను ధర్మరాజును కలిసి వస్తాను' అని అన్నాడు.

శల్యుడు ఉపప్లావ్య ప్రదేశానికి వచ్చి, పాండవులను కలిశాడు. తాను ఎంతో సంతోషిస్తున్నానని పాండవులకు చెప్పాడు. ధర్మరాజుతో శల్యుడు, "రాజా! నేను సైన్యంతో వస్తున్నపుడు, మార్గమధ్యంలో దుర్యోధనుడు నాకొరకు అనేక సౌకర్యాలు ఏర్పరచి, నాచే ఒక వరం పొందాడు. దానిప్రకారం నేను వారి పక్షాన పోరాడవలసి వస్తుంది" అని అనగా ధర్మరాజు 'మహారాజా! మీరిచ్చిన వరం ప్రకారమే చేయండి. కర్ణార్జునుల మధ్య పోరాటం జరిగేటప్పుడు, మీరు కర్ణుని సారథిగా ఉంటారు, కనుక అర్జునుని విజయం కోరి, కర్ణుని నిరుత్సాహ పరచండి' అని చెప్పగా, శల్యుడు సరేనన్నాడు. సమయం మనకు అనుకూలంగా లేనపుడు కష్టములు తప్పవు. ఇంద్రుడు, ఇంద్రాణి కూడ కష్టాలు అనుభవించారు అని కూడ అన్నాడు.

అపుడు ఇంద్రుడు, ఇంద్రాణి విషయం చెప్పమని శల్యుడు అడిగాడు. ధర్మరాజు ఇలా చెప్పడం మొదలు పెట్టాడు. 'ఓ రాజా! పూర్వం దేవశ్రేష్ఠుడైన త్వష్ట అనే ప్రజాపతి ఉండేవాడు. ఇంద్రునితో గల విరోధం చేత మూడు తలలు గల పుత్రుని ఉత్పన్నం చేశాడు. ఆ బాలుడు ఒక ముఖంతో వేదపఠనం చేసేవాడు. రెండవ ముఖంతో సుధాపానం, మూడవదానితో అన్ని దిక్కులను క్రింగేటట్లు చూచేవాడు. అతడు తపస్వియై, తపస్సులో లీనమై ఉండేవాడు. ఇంద్రుడు వీని తపస్సుకు భయపడి, తపస్సును భంగం చేయమని అప్సరసలను పంపాడు. అప్సరసలు వచ్చి అతన్ని రెచ్చగొట్టసాగారు. త్రిశిరుడు అజేయుడై ఉన్నాడు. అప్సరసలు ఏమీచేయలేక ఇంద్రునితో చెప్పారు. ఇంద్రుడు ఆలోచించి, వజ్రాయుధాన్ని ప్రయోగించా లనుకొన్నాడు. ఏ కారణం లేకుండానే త్రిశిరుని

ఇంద్రుడు చంపేశాడు. ఈ విషయం త్వష్ట ప్రజాపతికి తెలిసి ఆగ్రహించాడు. నిరపరాధియైన నా కుమారుని చంపుతాడా అని ఇంద్రుణ్ణి నాశనం చేయడానికి వృత్రాసురుని సృష్టించాడు.

ఇంద్రుని చంపిరమ్మని త్వష్ట వృత్రాసురుని ఆదేశించాడు. వృత్రాసురుడు త్వష్ట తపోబలం చేత స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ ఇంద్రునికి, వృత్రాసురునికి జరిగిన భీకర యుద్ధంలో, వృత్రాసురుడు ఇంద్రుణ్ణి పట్టుకొని మ్రింగేశాడు. దేవతలందరు భయపడి, మాయోపాయంతో వృత్రాసురునికి ఆవలింతలు వచ్చేటట్టు చేశారు. ఇంద్రుడు వృత్రాసురుని పొట్టలోనుండి సూక్ష్మరూపంలో బయటకు వచ్చేశాడు. మళ్ళీ యుద్ధం మొదలైంది. ఇంద్రుడు తట్టుకోలేక పారిపోయాడు. ఆ పిదప దేవతలు, ఇంద్రుడు అందరు కలిసి శ్రీమహావిష్ణువు దగ్గరకు వెళ్ళి ఆయన్ను ప్రార్థించారు. అపుడు విష్ణువు ఇలా అన్నాడు. 'దేవతలారా! త్వష్ట యొక్క తపోబలం వల్ల వృత్రాసురుని ఎవరూ జయించలేరు. నేను ఇంద్రుని వజ్రాయుధంతో వస్తాను. మీరు వృత్రాసురుని లొంగదీయండి.' అన్నాడు.

శ్రీమహావిష్ణువు చెప్పిన ప్రకారం, దేవతలందు వృత్రాసురుని వద్దకు వెళ్ళి ఇలా అన్నారు. 'ఓ వీరుడా! నీ తేజం పెరిగిపోతోంది. కాని ఇంద్రుణ్ణి చంపలేక పోయావు. మీ మధ్య సత్పురుషులు బాధలనుభవిస్తున్నారు. కనుక మీరు సఖ్యతతో మెలగండి.' అపుడు వృత్రాసురుడు ఇలా అన్నాడు. 'నేను ఒప్పుకొంటాను. ఒక షరతు. ఇంద్రుడు కాని, దేవతలు కాని ఏవిధంగా కూడ పగలు గాని, రాత్రిగాని నన్ను చంపరాదు.' దేవతలు సరేనన్నారు.

ఒకరోజు వృత్రాసురుడు సముద్రతీరాన విహరిస్తున్నప్పుడు, ఇంద్రుడు చూచాడు. సంధ్యాసమయం కనుక విష్ణుభగవానుని తలచుకొన్నాడు. ఆ సముద్రంలో పర్వతమంత నురుగు తడిగాను, పొడిగాను లేకుండా, అస్త్రశస్త్రాలు లేకుండా ఎగిసిపోతోంది. ఇదే సరియైన సమయమని, విష్ణువు ఆవహించిన వజ్రాయుధాన్ని నురుగుతో సహా వృత్రాసురునిపై పడేశాడు. వృత్రాసురుడు వెంటనే క్రిందపడి చనిపోయాడు.

ఇంద్రుడు, త్రిశిరుని చంపిన బ్రహమహత్యా దోషం చుట్టుకొని, అచేతనుడై నీటిలో దాగుకొన వలసి వచ్చింది. ఇంద్ర పదవి ఖాళీ అయింది. కనుక ఆ పదవిపై ఎవరిని అధిష్ఠింప జేయాలో ఆలోచించసాగారు దేవతలు.'

'దేవతలు, ఋషులు అందరూ యశస్వియైన నహుషుని దగ్గరకు వెళ్ళి, ఇంద్ర పదవి చేపట్టమని ఒప్పించి, అభిషేకం కూడ చేశారు. కాని, నహుషుడు క్రమంగా భోగలాలసుడైనాడు. ఒకసారి నహుషుడు ఇంద్రాణిని (శచీదేవి) చూచి, మోహించి సభలో ఇలా అన్నాడు. 'నేను దేవతల రాజును, శచీదేవి నాకెందుకు సేవ చేయకూడదు. ఈవేళనే నా భవనానికి వచ్చేటట్లు చూడండి.' శచీదేవి భయపడి బృహస్పతి శరణు వేడింది. బృహస్పతి అభయమిచ్చాడు. నహుషుడు కోపంతో ఉండటం చూచి దేవతలు 'దేవరాజా! ఇలా మీరు పరస్త్రీని కోరకండి' అని అన్నారు. దేవతలు శచీదేవిని నహుషునకు స్వాధీనం చేయమనగానే, శచీదేవి భయంతో బృహస్పతివైపు చూచింది. బృహస్పతి 'దేవతలారా! మీరు అందరి హితం కోరండి' అని అన్నాడు. అపుడు దేవతలు శచీదేవితో 'దేవీ! నీవ పతివ్రతవు. నీవు నహుషుని దగ్గరకు పోవడం వల్ల నష్టం ఏమీ లేదు. నిన్ను కోరడం ద్వారా అతను భ్రష్టుడై పోతాడు. నీవు తెలివిగా మాట్లాడి జయించగలవు.' అని అన్నారు.

శచీదేవి సంకోచంతోనే నహుషుని దగ్గరకు వెళ్ళింది. నహుషుడు ఆమెతో తనను పతిగా స్వీకరించమని కోరాడు. అపుడు శచీదేవి 'సురేశ్వరా! నాకు కొంత సమయం కావాలి. నా భర్త ఇంద్రుడు నాకు లభించని పక్షంలో నేను మీ సేవలో ఉంటాను.' అని అన్నది. నహుషుడు సరేనన్నాడు.

నహుషుని అనుమతితోశచీదేవి బృహస్పతి దగ్గరకు వెళ్ళగా దేవతలందరు శ్రీమహావిష్ణువు దగ్గరకు వెళ్ళారు. పరిస్థితిని గమనించిన ఆయన దేవతలతో ఇలా అన్నాడు. 'బ్రహ్మహత్యా దోషంతో బాధపడుతున్న ఇంద్రుని గురించి అశ్వమేధ యాగం చేయండి. నహుషుడు తన పాపాలతో త్వరగానే నశించి పోతాడు.'

అశ్వమేధయాగంతో ఇంద్రుని పాపాలు తొలిగాయి కాని నహుషుని బలం ముందు నిలువలేక రహస్యంగా దాక్కున్నాడు. శచీదేవి రాత్రి దేవిని ప్రార్థించి, ప్రసన్నం చేసుకొని, ఇంద్రుడున్న చోటికి వెళ్ళింది.

ఇంద్రుడు ఒక సరోవరంలో కమల పుష్పకాండంలో దాగివుండగా, శచీదేవి తన బాధను చెప్పుకొంది. ఇంద్రుడు శచీదేవితో 'దేవీ! దేవతలు ఇచ్చిన హవ్యం ద్వారా నహుషునికి శక్తి హెచ్చింది. ఒక ఉపాయం ఏమిటంటే నీవు నహుషుని దగ్గరకు వ్యక్తిగతంగా వెళ్ళి ఋషులతో పల్లకిలో నీ వద్దకు రమ్మని చెప్పు. అలాగే శచీదేవి నహుషునికి దగ్గరకు వెళ్ళి, ఋషులు మోస్తున్న పల్లకిలో తన వద్దకు రమ్మని చెప్పింది. కామపీడితుడైన నహుషుడు అలాగే చేయసాగాడు. ఆ తర్వాత బృహస్పతి శాస్త్రం ప్రకారం హవనం చేస్తూ, అగ్నిదేవుని పంపి ఇంద్రుని వెదకమన్నాడు. అగ్నిదేవుడు ఇంద్రుడున్న స్థలం గురించి బృహస్పతికి చెప్పాడు. బృహస్పతి ఋషులతో, గంధర్వులతో అక్కడికి వెళ్ళి ఇంద్రుని స్తుతించటం ప్రారంభించాడు. తేజస్సుతో ఇంద్రుడు బయటకు వచ్చాడు. అంతలోనే అక్కడికి చేరిన అగస్త్యుడు నహుషుని పతనాన్ని గురించి చెప్పాడు. దేవర్షులతో పల్లకి మోయిస్తున్న నహుషుని తేజస్సు నశించి పోయింది. నా శాపకారణంగా కొండచిలువగా మారి భూమ్మీద పడుతున్నాడు. తర్వాత ఇంద్రుడు ఐరావతాన్ని ఎక్కి అగ్నిదేవుడు, బృహస్పతి, యముడు, వరుణుడు, కుబేరుడు, సమస్త దేవతా గణాలు వెంటరాగా, దేవలోకం చేరి ధర్మపాలన చేయసాగాడు.'

శల్యుడు ఇలా అన్నాడు. 'ఓ ధర్మరాజా! ఇంద్రుడు భార్యతో సహా ఎన్నో కష్టాలనుభవించాడు. అజ్ఞాతవాసం కూడా చేశాడు. అలాగే మీరు కూడ ద్రౌపదితో సహా ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. చివరకు ఇంద్రుడు వృత్రాసురుని, నహుషుని నాశనం చేసి, సింహాసనాన్ని అధిష్టించాడు. అలాగే మీరు కూడా కర్ణ, దుర్యోధనులను నాశనం చేసి కీర్తి నార్జిస్తారు' అని చెప్పగా ధర్మరాజు సంతోషించాడు. శల్యుడు ధర్మరాజు అనుమతి తీసికొని దుర్యోధనుని వద్దకు వెళ్ళిపోయాడు.

సాత్యకి తన బలాల్ని తీసికొని ధర్మరాజు వద్దకు వచ్చాడు. సైన్యంతో ఛేదిరాజు వచ్చాడు. జయత్సేనుడు కూడ సైన్యంతో వచ్చాడు. పాండ్యరాజు కూడా వచ్చి ధర్మరాజు సేనలో చేరాడు.

అంతేకాదు, ద్రుపదుని, విరటుని సైన్యం కూడ చేరేసరికి అంతా చూచుటకు శక్తిసంపన్నమై కనిపించింది. ఇలా చూస్తే, పాండవుల పక్షాన ఏడు అక్షౌహిణుల సైన్యం చేరి, ఉత్సాహాన్ని ఇనుమడింప జేసింది. అటువైపు భగదత్తుడు కౌరవుల పక్షాన ఉత్సాహ పరుస్తున్నాడు. కృతవర్మ, జయద్రధుడు, కాంభోజ రాజు, వింధ్యరాజు తగినంత సైన్యాలతో దుర్యోధనుని సేవకు వచ్చారు. ఇలా దుర్యోధనుని పక్షాన పదకొండు అక్షౌహిణుల సైన్యం సమకూరింది.

ద్రుపద మహారాజు పురోహితుడు కౌరవ సైన్యాన్ని చూచాడు. అతనిని ధృతరాష్ట్రుడు, భీష్ముడు, విదురుడు సత్కరించారు. కుశల ప్రశ్నల అనంతరం పురోహితుడు ఇలా అన్నాడు. "ముఖ్యమైన విషయ మేమంటే ధృతరాష్ట్రుడు, పాండురాజు ఇద్దరూ ఒక తండ్రి కుమారులు. కనుక వారిద్దరికి రాజ్యంపై అధికారం ఉంది. ధృతరాష్ట్రుని కుమారులకు రాజ్యం దక్కగా, పాండురాజులకు దక్కలేదు. దీనికి కారణం ఏమిటి? కౌరవులు పాండవులను

చంపాలని ప్రయత్నించారు. కాని పాండవులు రాజ్యాన్ని విస్తరించారు. కౌరవులు కపట జూదంలో ఓడించి పాండవులను అరణ్యానికి పంపారు. ధృతరాష్ట్రుడు కూడ ఆమోదించాడు. ఇప్పటికే పాండవులు తమ రాజ్యాన్ని యుద్ధం లేకుండా కోరుతున్నారు. దుర్యోధనునకు నచ్చచెప్పి, ప్రాణనష్టం లేకుండా చూడండి. ఒకవేళ రణమే జరిగితే, పాండవులు ఎన్ని అక్షౌహిణుల సైన్యాన్ని అయినా మట్టుపెట్టగలరు, సందేహం లేదు. కృష్ణుడు, అర్జునుడు ఉన్న చోట పరాజయం ఉండదనే విషయం మరచిపోకండి." ఈ మాటలు విన్న భీష్ముడు 'ఓ బ్రాహ్మణా! పాండవులు క్షేమంగా ఉన్నందుకు సంతోషం. సంధి ప్రయత్నం సంతోషకరం. అర్జునుని అస్త్రవిద్యను ఎవరూ తట్టుకోలేరు." అనగా కర్ణుడు 'బ్రాహ్మణోత్తమా! రేపు యుద్ధంలో అన్నీ తెలుస్తాయిలే. దుర్యోధనుడు రాజ్యాన్ని ఏమాత్రం ఇవ్వడు" అని గట్టిగా అన్నాడు. అపుడు భీష్ముడు 'ఓయీ కర్ణా! మాటలు ఆపు. నీవు అర్జునుని ఎప్పుడైనా గెలిచావా? మొన్న విరాట నగరంలో అతడు ఆరుగురు మహారథులను ఓడించింది తెలియదా?' ఈ మాటలన్నీ విన్న ధృతరాష్ట్రుడు తాను సంజయుని పంపిస్తాను అని పురోహితుణ్ణి సత్కరించి పంపాడు.

ధృతరాష్ట్రుడు సంజయుని సభకు పిలిపించి ఇలా చెప్పాడు. 'సంజయా! నీవు వెళ్ళి పాండవుల కుశల సమాచారం తెలుసుకో. వారందరు తమ తమ పరాక్రమంతో రాజ్యాల్ని, సంపదను తీసికొని వచ్చి నాకు ఇచ్చారు. వారిలో ఏ దోషమూ లేదు. వారు బ్రతికి ఉండగా వారి రాజ్యాన్ని దుర్యోధనుడు అనుభవించాలనుకొంటున్నాడు. కాని అది అసాధ్యం. వారి రాజ్యం వారికివ్వడమే మేలు. భీముడు, అర్జునుడు, కృష్ణుడు కలిస్తే, యుద్ధంలో నా కుమారులను నాశనం చేయగలరు.

ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, ఘటోత్కచుడు కూడ ఉన్నారు. అందుచేత ఓ సంజయా! నీవు ధర్మరాజు వద్దకు వెళ్ళి, ఆయా రాజుల మధ్య సయోధ్య నెరపి, మనస్పర్థలు హెచ్చిపోకుండా చూడు.' అని చెప్పాడు.

సంజయుడు ఉపప్లావ్యానికి వెళ్ళి పాండవులను కలిశాడు. ధర్మరాజు తదితరులందరూ సంజయుని స్వాగతించి, అన్ని విషయాలు మాట్లాడారు.

సంజయుడు వారితో ఇలా అన్నాడు.'ధృతరాష్ట్రుడు మీతో వైరం కోరుకోడు. యుద్ధం జరగకుండా, మీరు వేరు మార్గాన్ని ఆలోచించండి. మీ మంత్రులను, సామంతులను పిలిచి మాట్లాడండి, మీ సందేశాన్ని ధృతరాష్ట్రునకు వినిపిస్తాను.' అని చెప్పాడు.

ధర్మరాజు అపుడు "సంజయా! శ్రీకృష్ణుడు, సాత్యకి, విరటుడు ఉన్నారు. మీ సందేశం వినిపించండి.' అన్నాడు. సంజయుడు "ధృతరాష్ట్రుడు శాంతిని కోరుతున్నాడు. మీలో ఏ దోషమూ లేదు. ఏది చెప్పినా సంధి ద్వారానే శాంతి నెలకొంటుంది.'

ధర్మరాజు ఇలా అన్నాడు. 'ఓ సంజయా! మేము యుద్ధానికి ఇష్టపడడం లేదు. దుర్యోధనుడు మమ్మల్ని ఎంత కష్టపెట్టినా, మేము వారిని క్షమిస్తూ వచ్చాం. రానున్న సంధిలో భాగంగా, మా ఇంద్రప్రస్థం మాకు చెందాలి. దుర్యోధనుడికి ఇష్టమైతే సంధి సఫలమే.'

సంజయుడు – 'ధర్మరాజా! మీరు చేసే ప్రతి పనీ ధర్మబద్ధమైనదే. యుద్ధం లేకుండా కౌరవులు రాజ్యం ఇచ్చేవారు కాకున్ననూ, యుద్ధం చేయకుండా బిచ్చం సరియైనది కాదు. మీరు ఇప్పటికే సర్వలోకార్హులు. నరసంహారం మంచిది కాదు. జీవితమంతా వనంలో గడిపినా మేలే జరుగుతుంది.' అని అనగా ధర్మరాజు

‘సంజయా! కర్మలలో కెల్ల ధర్మం శ్రేష్ఠమైనది. నేను చేయబోయే కార్యం ధర్మమా అధర్మమా ముందు తెలుసుకో. తరువాత నన్ను నిందించు. శ్రీకృష్ణుడు ఏది చెప్పినా, నేను వింటాను.’ అని అన్నాడు.

అపుడు శ్రీకృష్ణుడు సంజయుని ఉద్దేశించి ఇలా అన్నాడు.‘ఓ సంజయా! కౌరవులు లోభులై పాండవుల రాజ్యాన్ని కాజేయాలని ఉన్నారు. ధర్మనిరతునిపై నీకెందుకు సందేహం వచ్చింది? నీవు అన్ని ధర్మాలు తెలిసి కూడ కౌరవ పక్షపాతిగా ఎందుకున్నావు? క్షత్రియ ధర్మమైన యుద్ధాన్ని వదలి శాంతి అని అంటే అది ధర్మమౌతుందా? దోపిడిదారులుగా మారిన కౌరవులు రణరంగంలో నశించిపోతారు. ద్రౌపదిని నిండు సభలో అవమానించింది నీవు చూడలేదా? విదురుడు మాత్రమే అడ్డుకున్నాడు. ధర్మమంటే ఏమిటో ఎరుగని నీవు ధర్మరాజుకు ధర్మాన్ని బోధించడానికి ప్రయత్నిస్తున్నావు. ఇది విడ్డూరము. నేను దూతగా వస్తాను. పాండవులు వృద్ధి చెందుతారని ధృతరాష్ట్రునికి చెప్పు’ అనగానే సంజయుడు ధర్మరాజు అనుమతి తీసుకొని వెళ్ళిపోయాడు.

సంజయుడు మరురోజు వస్తానని ధృతరాష్ట్రునితో చెప్పి వెళ్ళినందున, ధృతరాష్ట్రుడు విదురుని పిలిపించుకొని మంతనాలాడి, తనకు నీతి బోధ చేయమని చెప్పాడు.

విదురుడు ధృతరాష్ట్రునితో ‘మహారాజా! పాండవులు మా ఆజ్ఞను ఎన్నడూ ధిక్కరించ లేదు. అయినా వారిని అడవులకు పంపారు. ధర్మరాజు ధర్మనిరతుడు గనుక మిమ్మల్ని పూజనీయుడిగా భావించాడు. సద్గుణ సంపన్నులు కనుక పాండవులు అన్ని కష్టాలు పడ్డారు. యోగ్యులు కాని వారగు దుర్యోధనుడు, శుని, కర్ణుని మీద రాజ్యభారం మపడం ధర్మం కాదు. సముద్రము దాటుటకు నావ ఎలా అవసరమో, స్వర్గాన్ని చేరడానికి సత్యం అంతే అవసరం. మహారాజా! ఈ విషయాన్ని మీరు గ్రహించలేక పోతున్నారు. ధర్మము మాత్రమే కళ్యాణకారకం, క్షమ అనేది శాంతి పొందుటకు సర్వశ్రేష్ఠమైన ఉపాయం. ధనం ఉండి దానం చేయనివాడిని, పేదవాడై కష్టపడని వానిని గుదిబండ కట్టి నీటిలో మంచేయాలి. ఉన్నత స్థానాన్ని ఆశించేవారికి నిద్ర, భయము, క్రోధము, అలసట ఉండకూడదు. దొంగ జాగ్రత్తగా లేని వ్యక్తితో, వైద్యుడు రోగితో, మదించిన స్త్రీలు కాముకులతో, పురోహితులు యజ్ఞములతో, రాజులు ప్రతిపక్షులతో, విద్వాంసులు మూర్ఖులతోనూ తమ జీవితాల్ని నెట్టుకొస్తూ ఉంటారు. అలాగే విద్య ముగించిన శిష్యుడు గురువును, పెండ్లి అయిన కుమారుడు తల్లిని, యజమాని సేవకుని, రోగి వైద్యుని తిరస్కరిస్తుంటారు. పండిన ఫలాలను మాత్రమే గ్రహించిన రసం వస్తుంది. ఏరకంగా తుమ్మెదలు పుష్పాలను కాపాడుతూ తేనెను గ్రహిస్తాయో, అదేవిధంగా రాజులు పన్నులు వసూలు చేస్తూ, ప్రజలను కాపాడాలి. ధర్మాన్ని వదిలిన రాజు యొక్క రాజ్యం నశించిపోతుంది. మధుర భాషణ మంగళకరం, దుర్భాష అనర్థానికి కారణం అవుతుంది.’ వీటిని వినిన ధృతరాష్ట్రుడు విదురుని మరికొన్ని ధర్మార్థ విషయాలు తెలుపమని అడిగాడు.

అపుడు విదురుడు ‘ఓ రాజా! మీరు పాండవులను, కౌరవులను సమాన బుద్ధితో చూడండి. అలాచేస్తే, మీకు కీర్తియే కాదు, స్వర్గం కూడ లభిస్తుంది. ఇది మీకు అర్థం కావాలంటే మీకు కేశిని కథ చెప్తాను. వినండి.’ అన్నాడు.

ఒక సమయంలో కేశిని అనే ఒక సుందరి శ్రేష్ఠమైన భర్తను పొందాలని స్వయంవర సభలోకి వచ్చింది. ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు కేశినిని భార్యగా పొందాలని అక్కడికి వచ్చాడు. వారిద్దరి మధ్య సంభాషణ ఎలా జరిగిందో వినండి.

కేశిని : విరోచనా! బ్రాహ్మణుడా లేక దైత్యుడా, ఎవడు శ్రేష్ఠుడు? ఒకవేళ బ్రాహ్మణుడే శ్రేష్ఠుడని నీవంటే, నేను సుధన్వుని పెండ్లి చేసుకుంటాను.

విరోచనుడు : కేశినీ! మేము అందరి కంటె ఉత్తములం. దేవతలు, బ్రాహ్మణులు మాకు పోటీ రారు.

కేశిని : విరోచనా! రేపు ఉదయం సుధన్వుడు ఇక్కడికి వస్తున్నాడు. ఇక్కడే మనం ముగ్గురం మాట్లాడుకుందాం.

విరోచనుడు : అలాగే! నీవు చెప్పినట్లే, ఇక్కడే ముగ్గురం రేపు కలుసుకుందాం.

విదురుడు : ఓ రాజా! మరునాటి ఉదయం సుధన్వుడు రాగానే, కేశిని అతనిని స్వాగతించింది. అపుడు

సుధన్వుడు : ప్రహ్లాదనందనా! మీ బంగారు సింహాసనాన్ని ఒకసారి ముట్టుకొంటా. నేనును మీ సింహాసనంపై కూర్చొన్న యెడల, మనం ఇద్దరం సమానమవుతాం.

విరోచనుడు : ఓ సుధన్వా! నాతోపాటు నీవు కూర్చొనే అర్హత లేదు. నీవు పీటపై కూర్చో.

సుధన్వుడు : తండ్రికొడుకులు కలిసి కూర్చోవచ్చు. ఇద్దరు బ్రాహ్మణులు, ఇద్దరు క్షత్రియులు, ఇద్దరు వైశ్యులు, ఇద్దరు శూద్రులు ఇలా ఒకేచోట కూర్చోవచ్చు. ఇతర వ్యక్తులతో కూర్చోరాదు. నీవు పిల్లవాడివి, నీకీ విషయాలు ఏమీ తెలియవు.

విరోచనుడు : మనిద్దరిలో ఎవరు శ్రేష్ఠులో కనుక్కొని వద్దాం పద. నా ఆస్తిని ఫణంగా పెడుతున్నా.

సుధన్వుడు : నీ ఆస్తి ఉంచుకో. మనం ఇద్దరం మన ప్రాణాలను ఫణంగా పెడదాం.

విరోచనుడు : అలాగే కానివ్వు. కాని నేను దేవతలను గాని, మానవులను గాని అడుగలేను.

సుధన్వుడు : మీ నాన్నగారి దగ్గరకే వెళదాం. నీకోసం మీ నాన్న అబద్ధ మాడతాడని నేను అనుకోను.

ఇద్దరూ ఈ ఒడంబడికతో ప్రహ్లాదుని దగ్గరకు చేరారు.

ప్రహ్లాదుడు : విరోచనా! మీరిద్దరు మిత్రులైనారా, ఏమిటి?

విరోచనుడు : నాన్నగారూ! ఒక సందేహం. మా ప్రాణాలు ఫణంగా పెట్టి వచ్చాం.

సుధన్వుడు : ప్రహ్లాదా! బ్రాహ్మణుడనైన నేను శ్రేష్ఠుడనా లేక విరోచనుడా?

ప్రహ్లాదుడు : మీ వివాదంలో నేను తలదూర్చగలనా?

వాస్తవాన్నే చెప్పండి అని సుధన్వుడు అడిగాడు.

ప్రహ్లాదుడు : అసత్య నిర్ణయం చెపితే ఏమి శిక్ష?

నరకానికి వెళ్ళాల్సుంటుందన్నాడు సుధన్వుడు.

ప్రహ్లాదుడు : విరోచనా! సుధన్వుని తండ్రి 'అంగిరా' నాకంటే శ్రేష్ఠుడు. సుధన్వుడు నీకంటే శ్రేష్ఠుడు. ఇతని తల్లి నీ తల్లికంటే శ్రేష్ఠురాలు. కనుక నీవు సుధన్వుని చేతిలో ఓడిపోయావు. ఇపుడు నీ ప్రాణాలకు సుధన్వుడు

యజమాని. ఓ సుధన్వా! విరోచనుని నేను పొందాలనుకుంటున్నాను.

విరోచనుడు : ప్రహ్లాదా! నీవు ధర్మానికి కట్టుబడి, సత్యమునే చెప్పావు. కనుక నీ పుత్రుని నీకే ఇచ్చేస్తున్నాను. ఈ విరోచనుడు కేశినితో కలిసి నా కాళ్ళు కడగాలి.

విదురుడు ధృతరాష్ట్రునితో 'కనుక ఓ రాజా! రాజ్యం కోసం సత్యాన్ని విడువకు. పుత్రవ్యామోహంతో వినాశం కోరుకోకు. ఈ విషయం మీకు పూర్తిగా అవగాహనకు రావాలంటే, మీరు మహర్షి దత్తాత్రేయుని కథ వినాలి. వినండి.

ప్రాచీనకాలంలో దత్తాత్రేయుడు పరమహంస రూపంలో విహరిస్తుండగా, సాధ్య దేవతలు ఆయన్ని విద్యుత్తుతో కూడిన ఒక వాణిని వినిపించమని కోరారు. అపుడు దత్తాత్రేయుడు వారితో 'ధైర్యం, మనోనిగ్రహం, సత్యధర్మాలు పాటించటం మన విధి. ఇతరులు దూషించినా మనం వారిని మరల దూషించరాదు. పైగా క్షమించినట్లయితే వారి కోపం ఆగిపోతుంది. అందువల్ల, వారి కోపం వారినే నశింపజేస్తుంది. క్షమించినవారికి పుణ్యం లభిస్తుంది. మౌనంగా ఉండడం మంచిది. సత్యపాలన మౌనం కంటే రెండు రెట్లు ఉత్తమమైనది. ఉదాహరణకు పాండవులను హతం చేయుటకు వెళ్ళిన కౌరవులు గంధర్వుల చేత అపహరింపబడి తరిమివేయ బడినారు. ఆ సమయంలో పాండవులే వారిని కాపాడారు. కాని కృతజ్ఞత లేని కౌరవులు ఎల్లప్పుడు పాండవులకు హాని చేయాలనే కుట్రలు చేస్తున్నారు. అలాటి దుర్మార్గులు ఎవరికీ మిత్రులుగా వుండజాలరు. వారిని అధమజాతి పురుషులు అని అంటాం.'

అపుడు ధృతరాష్ట్రుడు విదురుని 'అయితే ఉత్తమ కులాలవారని ఎవరిని అంటాం?' అని అడిగాడు. విదురుడు 'రాజా! ఎవరైతే తపస్సు, ఇంద్రియ నిగ్రహం, వేదాధ్యయనం, యజ్ఞం, అన్నదానం, పవిత్ర వివాహం మరియు సదాచారం అనే ఏడు గుణములు కలిగివుంటారో, వారే ఉత్తమ కులంవారని అనాలి. సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జీవన్మరణాలు అనేవి చక్రంలోని ఆకుల్లాగా ఒకదాని తర్వాత మరొకటి వస్తుంటాయి. ధీరపురుషుడు వీటిని హర్షించడు, వాటిపట్ల కోపించడు.' అని అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు తనకు శాంతిప్రదమైన ఉపదేశం చేయమని విదురుని అడుగుతాడు. విదురుడు 'రాజా! విద్య, తపస్సు, ఇంద్రియ నిగ్రహం మరియు లోభగుణం విడిచిపట్టుటకంటె శాంతిని పొందుటకు వేరొక ఉపాయం లేదు. శత్రుభావం, భేదభావం చూపేవారికి వినాశమే శరణ్యం. జూదంలో ద్రౌపది ఓడిపోయిందని మీతో చెప్పారు. జూదంలో ఆసక్తుడైన దుర్యోధనుని ఆపండి. విద్వాంసులు ఈ మోసాన్ని జీర్ణించుకోలేరు. మీరు నా మాటలు లెక్కచేయరు. పాండవులు సత్యాన్ని ఆశ్రయించారు. ఇప్పుడైనా మీరు దుర్యోధనుని దుర్మార్గాన్ని ఆపండి.' అని చెప్పగా ధృతరాష్ట్రుడు 'విదురా! వేదాల్లో మనిషి 100 సంవత్సరాలు బ్రతుకుతాడని ఉంది కదా. పూర్తి ఆయుష్షును ఎందుకు పొందలేక పోతున్నాడు?' అని అడిగాడు.

విదురుడు 'రాజా! ఎవరైతే అహంకారంతో, వాచాలత్వం కలిగివుంటారో, త్యాగగుణం వారిలో లోపిస్తుందో, కోపాన్ని ప్రదర్శిస్తారో, తన పోషణనే ప్రధానంగా భావిస్తారో వారి ఆయువు క్షీణిస్తుంటుంది. ఈ దుర్గుణాలే మానవుని చంపుతున్నది. మృత్యువు రానేరాదు. ధర్మనిరతులైన, తేజశ్శీలురైన పాండవులను కాదని సంపదనంతా దుర్యోధనునకు అప్పగించారు. అతడు మదమాత్సర్యాలతో బలి చక్రవర్తి వలె చెడిపోయాడు. ఈ ప్రపంచంలో దానం చేసి ప్రేమను సంపాదిస్తారు. మంచి భాషణ ద్వారా కూడా ప్రేమను సంపాదిస్తారు. అలాగే మంత్రాలు, ఔషధాలతో ప్రేమను పొందుతారు. నిజానికి నెమ్మది స్వభావం కలవాడు ఎల్లపుడు ఏదో ఒకటి పొందుతూ, వృద్ధి చెందుతూనే ఉంటాడు.' అని అన్నాడు.

అపుడు ధృతరాష్ట్రుడు 'విదురా! నీవు చెప్పేది సత్యమే. ధర్మమే గెలుస్తుంది. అయినా నేను నా కుమారుని త్యాగం చేయలేక పోతున్నాను.' అని చెప్పాడు. విదురుడు 'రాజా! పరస్పరం విరోధభావం వున్నవారిని, కాముకుల్ని, సిగ్గులేని వారిని, మొండివారిని, పాపాత్ముల్ని మరియు అయోగ్యుల్ని ఆదరించకుండా, వదలి వేయాలి.' అని అన్నాడు. ధృతరాష్ట్రుడు విదురుని మరికొన్ని మంచి విషయాలు చెప్పమని అడిగాడు. విదురుడు 'రాజా! సనత్సుజాతుడనే మహిర్ష బ్రహ్మ యొక్క పుత్రుడై మృత్యువు అనునది లేదని చెప్పాడు. అతడే మీ అనుమానాలను తీర్చగలడు.' అని అన్నాడు. ఈ దేహంతో ఆయన్ని ఎలా కలుసుకోమంటావని ధృతరాష్ట్రుడు అడుగగా విదురుడు ఆ సనాతనుని స్మరించగానే ఆయన దర్శనమిచ్చాడు. ఇద్దరు స్వాగతించి, విదురుడు 'దేవా! ధృతరాష్ట్రుని హృదయంలో కొన్ని సందేహాలున్నాయి. వాటిని తీర్చుటకు మీరే సమర్థులు.' అని అన్నాడు.

ధృతరాష్ట్రుడుసనత్సుజాతుని ఇలా అడిగాడు. 'మహర్షీ! మరణము అనేది లేదని మీ సిద్ధాంతం అని విన్నాను. దేవతలు, రాక్షసులు కూడ బ్రహ్మచర్య పాలన చేస్తూ చనిపోయారు. ఈ రెండింటిలో ఏది సత్యమో తెలుప ప్రార్థన.' సతన్సుజాతుడు 'ఓ రాజా! నీవడిగిన ప్రశ్నలో రెండు పక్షాలున్నాయి. మృత్యువు ఉన్నది. అది కర్మతో దూరమౌతుంది. రెండవ పక్షంలో మృత్యువు లేనే లేదు. ఈ రెండూ సత్యమేనని నీవు విశ్వసించాలి. కొందరు మోహం చేత మృత్యువు ఉనికిని ఒప్పుకొంటున్నారు. కాని నా సిద్ధాంతం ప్రకారం అజాగ్రత్తగా ఉండుటయే మృత్యువు. దానివల్లనే రాక్షస ప్రవృత్తిగల మానవులు మృత్యువాత పడుతున్నారు. జాగరూకత గల మహాత్ములు బ్రహ్మ స్వరూపులౌతున్నారు.

మృత్యువు అనేది పులివలె మానవులను తినదు. దానికి రూపం లేదు. అజాగ్రత్తను యముడిగా భావించి మృత్యువు అంటారు కొందరు. యమదేవతలు పితృలోకాన్ని శాసిస్తుంటారు. పుణ్యమును సుఖంగాను, పాపమును దుఃఖంగాను తలుస్తారు. యముని ఆజ్ఞ మేరకే మానవునిలో కోపము, అజాగ్రత్త, లోభ గుణము అనేవి మృత్యురూపంలో ప్రవేశిస్తాయి, కబళిస్తాయి. అహంకారికి ఆత్మ సాక్షాత్కారము వీలుకాదు. మోహంతో సంసార చక్రంలో చిక్కుకు పోతున్నాడు. శరీరానికి ప్రాణేంద్రియములు దూరమైనపుడు ఈ విధంగా మృత్యువు మరణరూప సంకేతంగా నిలుస్తుంది.' అని చెప్పాడు.

ఈ విధంగా ధృతరాష్ట్రుడు విదురుని, సనత్సుజాతుని ఉపదేశములను విని, మరునాటి ఉదయం రాజసభకు చేరుకున్నాడు. రాజులతో, కౌరవులతో సభ నిండిపోయింది. సంజయుడు వచ్చి, సభనుద్దేశించి ఇలా చెప్పడం ప్రారంభించాడు. 'ఓ కౌరవులారా! నేను మీ దూతగా పాండవుల వద్దకు వెళ్ళి వచ్చాను. వారు మీ కుశలము అడిగారు. అక్కడ శ్రీకృష్ణుడు మరియు ధర్మరాజు అనుమతితో, అర్జునుడు చెప్పిన విషయం, ముఖ్యంగా దుర్యోధనుడు వినాలని కోరుకొంటున్నాడు. రాజులు, కర్ణుడు అందరూ ఈ సందేశాన్ని వినాలి. దుర్యోధనుడు ధర్మరాజు యొక్క రాజ్యాన్ని ఇవ్వని పక్షంలో ధృతరాష్ట్రుని పుత్రులు పాపకర్మను అనుభవించాల్సి వస్తుంది. యుద్ధమే జరిగితే, పాండవుల అభీష్టమే నెరవేరుతుందని చెప్పవచ్చు. ధర్మరాజు తన కోపమును కౌరవులపై చూపినచో, కౌరవులు భస్మం కాగలరు. అపుడు దుర్యోధనుడు పశ్చాత్తాప పడవలసి వస్తుంది. శిఖండి భీష్ముని, ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుని చంపునపుడు దుర్యోధనుడు విచారించక తప్పదు. సాత్యకిని ఎదుర్కొనగలవారు కౌరవులలో ఎవరూ లేరు. నేను కూడ పాశపతాస్త్రాన్ని, బ్రహ్మాస్త్రాన్ని, ఇంద్రాది అస్త్రాలన్నిటిని ప్రయోగించి వారిలో ఒక్కరిని కూడా మిగల్చను. ఓ సంజయా! నా మాటల్ని సందేహించవద్దు. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, విదురుడు చెప్పినట్లు వారు చేయకపోతే వారిలో ఒక్కరూ మిగలరు అన్నాడు.' అని ముగించాడు.

తర్వాత, భీష్ముడు దుర్యోధనునితో 'ఒకప్పుడు బృహస్పతి, శుక్రాచార్యుడు, ఇంద్రుడు మున్నగు దేవగణములలో ఉన్నవారందరు బ్రహ్మను చుట్టుకొని కూర్చున్నారు. ఆ సమయంలో ఇద్దరు తేజోవంతులైన మహర్షులు వారిని దాటుకొంటూ వెళ్ళారు. అపుడు బృహస్పతి బ్రహ్మను 'ఏమిటి? వారు ఎవరు? మిమ్మల్ని ఉపాసించకుండానే వెళ్ళారు' అని అడిగితే, బ్రహ్మ వారు నరనారాయణులు. వారి తేజస్సుతో లోకాలన్నీ వెలిగి పోతున్నాయి. ఆ నరనారాయణులే నేటి ఈ కృష్ణార్జునులు. వీరు ఆనాటి ప్రాచీన దేవతలని గ్రహించు' అని అన్నాడు.

నేడు అర్జునుడు విరుచుకుపడితే, పశ్చాత్తాప పడవలసి వస్తుంది. అభిమన్యుడు శ్రీకృష్ణుడంతటి బలశాలి, మహారథి. ద్రుపదుడు, శిఖండి, ధృష్టద్యుమ్నుడు మున్నగు మహారథులు పరాక్రమిస్తే, మీరు మీ రాజ్యాన్ని వదులుకోవలసి వస్తుంది. ఓ దుర్యోధనా! నీవు ఒక విషయం మరిచిపోయావు. నీ బుద్ధిని శకుని, కర్ణుడు, దుశ్శాసనుడు పెడత్రోవ పట్టిస్తున్నారు.' అనగానే, కర్ణుడు ఉద్వేగంతో 'పితామహా! నేను క్షాత్రధర్మంతో ప్రవర్తిస్తున్నాను. సమయం వచ్చినపుడు నేను ఒక్కడినే పాండవులందరిని చంపివేయగలను.' అని అనగా భీష్ముడు ధృతరాష్ట్రునితో 'రాజా! కర్ణుడు ఇలాగే అంటాడు. పాండవులకు 16వ వంతు కూడ సమర్థుడు కాడు. విరాటనగరంలో పలాయనం చిత్తగించిందెవరు, కర్ణుడు కాదా? ఘోషయాత్రలో పరాభవం పొందలేదా?' అన్నాడు. ఈ మాటలను ద్రోణుడు సమర్థించినా, ధృతరాష్ట్రుడు అంతగా పట్టించుకో లేదు. ఎవరి బలం చూచుకొని, ఈ పాండవులు రణానికి సిద్ధమవుతున్నారని ధృతరాష్ట్రుడు సంజయుని అడిగాడు. అపుడు సంజయుడు ఇలా అన్నాడు. 'వారిలో ధృష్టద్యుమ్నుడు, భీమసేనుడు, అర్జునుడు, కృష్ణుడు, నకుల సహదేవులు, శిఖండి, సాత్యకి, కేకయరాజులు,విరాటరాజు, కాశీరాజు, శిశుపాలుని, జరాసంధుని కుమారులు మరియు ద్రుపదుని బలం చూచుకొని వారు యుద్ధానికి సిద్ధమవుతున్నారు.' అని చెప్పాడు.

దుర్యోధనుడు ధృతరాష్ట్రుని ఉద్దేశించి ఇలా అన్నాడు 'మహారాజా! భయపడకండి. మనల్ని గురించి దిగులు లేదు. మనం వారికంటె బలవంతులం. శ్రీకృష్ణుడు ధర్మరాజును పట్టాభిషిక్తుణ్ణి చేయాలని చూస్తున్నాడు. కాని మనం రణరంగంలో దిగితే, శత్రువులు మనల్ని జయించలేరు. మన పక్షాన ఉన్న రాజులందరు పాండవులతో భీకరంగా పోరాడటానికి సిద్ధంగా ఉన్నారు. మహారాజా! నా గద భీమునిపై పడితే అతడు లేవలేడు. మన సైన్యమే వారికంటే ఎక్కువ వున్నది. అర్జునుని చంపే ఏర్పాట్లు చేశాను. వారివైపు పాండవులు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకియే వున్నారు. మనవైపు అనేకమంది వీరులున్నారు. అందుచేత మీరు భయపడవలసిన అవసరం లేదు.'

తర్వాత సంజయునితో అర్జునుని రథం గురించి చెప్పమని అడిగాడు. అపుడు సంజయుడు 'రాజా! అర్జునుని రథధ్వజంలో దేవతల మాయామూర్తులను ప్రతిష్ఠించారు. అర్జునుడు స్వయంగా తన రథ ధ్వజంలో హనుమంతుని ప్రతిష్ఠించుకొన్నాడు. ఆ ధ్వజం ఒక యోజనం వ్యాపించి వుంది. ఆ ధ్వజం దేనినైనా అధిగమిచ గలదు. గంధర్వుడు ఇచ్చిన వాయువేగ అశ్వాలు వున్నాయి. ఆ రథం ఎక్కడైనా విహరించగలదు. ఒకవేళ ఒక అశ్వం మరణిస్తే, మరుక్షణమే మరో అశ్వం పుట్టుకు వస్తుంది. అశ్వాల సంఖ్య ఎపుడూ వందకు తక్కువ కాకుండా ఉంటాయి.' అని అన్నాడు.

అపుడు ధృతరాష్ట్రుడు పాండవుల సైన్యం గురించి అడుగగా సంజయుడు 'ధృష్టద్యుమ్నుడు, చేకితానుడు, సాత్యకి ఒకొక్క అక్షౌహిణి సైన్యాన్ని తెచ్చారు. ద్రుపదుడు, సత్రాజిత్తు చెరొక అక్షౌహిణి సైన్యాన్ని తెచ్చారు.

విరాట రాజు ఉత్తరుని, సూర్యదత్తుని, మదిరాక్షునితో సహా ఒక అక్షౌహిణి సైన్యాన్ని తెచ్చి ధర్మరాజును కలిశారు. కేకయ దేశ సోదరులు కూడ ఒక అక్షౌహిణి సైన్యాన్ని తెచ్చారు. వీరంతా ధర్మరాజు పక్షాన దుర్యోధుననితో పోరాడటానికి సిద్ధంగా వున్నారు.

రాజా! శిఖండి భీష్మునితోను, ధర్మరాజు శల్యునితోను, భీముడు దుర్యోధన దుశ్శాసనులతోను, అర్జునుడు కర్ణ, అశ్వత్థామ, జయద్రధునితోను, ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యునితోను, సాత్యకి కృతవర్మతోను, సహదేవుడు శకునితోను, నకులుడు ఉదంకునితోను యుద్ధం చేయటానికి సిద్ధంగా వున్నారు.

రాజా! నేను కూర్చున్న చోటికి ధృష్టద్యుమ్నుడు వచ్చి 'సంజయా! నీవు వెంటనే ధృతరాష్ట్రుని దగ్గరకు పోయి యుద్ధం చేసే పని మానుకోమని చెప్పు. లేకపోతే అర్జునుడు, భీముడు, నేను కలిసి మీ పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని నాశనం చేస్తాం' అని అన్నాడు. ఈ మాటలు విన్న ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో 'యుద్ధం చేయవద్దు, ఇది తగిన పనికాదు' అని చెప్పాడు. 'పాండవుల అర్ధభాగం వారికిచ్చి, నీది నీవు తీసికో. భీష్మ ద్రోణ కృపులు కూడ యుద్ధానికి సమ్మతించడం లేదు. నీవు కూడ ఇష్టపడవు. కాని శకుని, కర్ణుడు, దుశ్శాసనుడు నిన్ను యుద్ధానికి పురికొల్పుతున్నారు' అని కూడా అన్నాడు.

అపుడు దుర్యోధనుడు 'నాన్నగారూ! ఈ భీష్మ ద్రోణాదుల బలం చూచుకొని నేను యుద్ధానికి సిద్ధపడటం లేదు. పాండవులను చంపటానికి మేము ముగ్గురం చాలు. వారికి సూది మొన మోపినంత భూమి కూడ ఇవ్వను' అని అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు 'బంధువులారా! నేను దుర్యోధనుని వదలుకొంటున్నాను. ఇతన్ని అనుసరించేవారు యమపురికి పోతారు. సంజయా! శ్రీకృష్ణుడు ఏమన్నాడో చెప్పు' అని అడిగాడు.

అపుడు సంజయుడు ఇలా చెప్పాడు. 'రాజా! నేను శ్రీకృష్ణుని ఆంతరంగిక మందిరానికి వెళ్ళాను. అక్కడ శ్రీకృష్ణార్జునులతో సత్యభామ, ద్రౌపది వున్నారు. మీ సందేశాన్ని వినిపించిన తరువాత, అర్జునుడు దానికి సమాధాన మివ్వమని శ్రీకృష్ణుని ప్రార్థించాడు. శ్రీకృష్ణుడు మధురమైన పలుకులతో ప్రారంభించి, కఠోర వచనాలతో ఇలా ముగించాడు. 'సంజయా! ధృతరాష్ట్రునితో నామాటగా చెప్పు. వారికి విపత్కర పరిస్థితి వచ్చింది. విరాట నగరంలో అర్జునుడు ఒక్కడే కౌరవుల నందరిని ఎదిరించాడు. నేను ఇపుడు అర్జునుని ప్రక్కనే వున్నాను. అర్జునుని ఎదిరించగల శక్తి ఎవరికీ లేదు.' అన్నాడు.

అపుడు కర్ణుడు ఇలా అన్నాడు 'పరశురాముడిచ్చిన బ్రహ్మాస్త్రం నా దగ్గరుంది. అర్జునుని నేను జయించగలను. మన సైన్యంతో నేనొక్కడినే పాండవులను ఎదిరించి చంపగలను' అని అనగా, భీష్ముడు 'ఓయీ కర్ణా! నీ బుద్ధి నశించింది. ఇష్టం వచ్చిన రీతిలో వాగుతున్నావు. కౌరవుల మరణం కంటే ముందే నీకు మరణం ఉంటుంది. అక్కడ శ్రీకృష్ణుని రక్షణలో ఉండగా, నీవు చావక తప్పదు.' అని అనగా దుర్యోధనుడు భీష్మునితో 'పితామహా! మేమందరం ఒకే శిక్షణ పొందాం. అలాంటప్పుడు పాండవులే గెలుస్తారని ఎలా అనగలరు? మేం ముగ్గురం చాలు వారినందరిని చంపటానికి' అని అన్నాడు.

విదురుడు ఇలా అన్నాడు. 'ఎవరైతే ఇంద్రియ నిగ్రహం (దమం), దానం, తపము, జ్ఞానము మరియు స్వాధ్యాయము చేస్తారో, వారు మాత్రమే మోక్షాన్ని పొందుతారు. పూర్వపురుషులు చెప్పిన ఒక కథ చెప్తాను, వినండి.

ఒక వేటగాడు పక్షులను పట్టుకోవటానికి అడవిలో ఒక వల పన్నాడు. రెండు పక్షులు అందులో చిక్కుకున్నాయి. ఆ పక్షులు వలను తమ శక్తినంతా వుపయోగించి, ఆకాశానికి ఎత్తుకొని పోతున్నాయి. వేటగాడు కూడా వాటిని వెంబడిస్తూ పోతున్నాడు. వేటగాడు చేస్తున్న పనిని, ఒక ముని చూచి హేళన చేశాడు. అపుడు వేటగాడు ఆ పక్షులు కలహించుకొంటే క్రింద పడుతాయి అని మునితో అన్నాడు. అతనన్నట్టుగానే ఆ రెండు పక్షులు కలహించుకొని క్రింద పడగానే వేటగాడు వాటిని చేజిక్కించుకొన్నాడు. ఆరకంగానే మానవులు కూడ పరస్పరం కలహించుకొంటే, శత్రువులకు చిక్కిపోతారు. కనుక స్నేహభావంతో మెలగటం నేర్చుకోవాలి.

మేము ఒకసారి గంధమాదన పర్వతంపై తిరిగేటప్పుడు ఒక తేనెతుట్టెను చూచాము. ఆ తుట్టె చుట్టూ పాములు చేరి వున్నాయి. ఆ తేనె అతి శక్తివంతమైనది. దానిని గ్రుడ్డివారు సేవిస్తే వారికి చూపు వస్తుంది. ముసలివారు సేవిస్తే యవ్వనవంతులవుతారు. లోభంతో భిల్లు జాతి యువకులు దానిని పొందాలని ప్రయత్నించి విఫలులై ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఓ రాజా! నీ కుమారుడు దుర్యోధనుడు కూడ సకల సామ్రాజ్యాన్ని దోచుకోవాలని ఆశపడుతున్నాడు. కాని పాండవుల చేతిలో మరణించగలరు.'

ఇలా విదురుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు 'ఓ దుర్యోధనా! నీవు చెడుమార్గంలో ఉన్నావు. శ్రీకృష్ణుడు పాండవులతో ఉన్నంతవరకు వారిని ఎవరూ ఏమీ చేయలేరు. భీష్మ ద్రోణాదులకు మీరు సమానులు. కనుక వారి రాజ్యం వారికిచ్చి వేయి' అని అన్నాడు.

అత్యంత ప్రధానమైన, ప్రముఖమైన సంఘటన అయిన శ్రీకృష్ణుని రాయబారాన్ని గురించి తెలుసుకుందాం.

శ్రీకృష్ణుడు రాయబారానికి వెళ్ళే ముందు, ధర్మరాజును, భీమార్జునులను, నకుల సహదవులను, సాత్యకిని మరియు ద్రౌపదిని కలిసి వారి అభీష్టములను తెలుసుకున్నాడు. తర్వాత హస్తినకు బయలుదేరాడు. తాను వెళ్ళే మార్గానికి ఇరువైపుల మహర్షులు నిలబడి ఉండటం శ్రీకృష్ణుడు గమనించి, క్రిందకు దిగి వారిని పరామర్శించాడు. వారందరు బ్రహ్మతేజస్సుతో వెలుగొందుతున్నారు. అందులోనుండి పరశురాముడు ముందుకు వచ్చి, శ్రీకృష్ణుని ఆలింగనం చేసుకొని ఇలా అన్నాడు. 'ఓ శ్రీకృష్ణా! ఈ దేవర్షులు, బ్రహ్మర్షులు, రాజర్షులు పురాతన కాలంలో తమ తపశ్శక్తితో దేవతలను, రాక్షసులను కూడా చూచినవారు. ఈరోజు, ఈ సమయాన, వీరు హస్తినాపురంలో చేరియున్న క్షత్రియ రాజులను, సభాసదులను, మిమ్మల్ని చూడాలని బయలుదేరారు. ఆ సభలో మీ వాదనల్ని వినాలని మేము ఉత్సాహంతో వస్తున్నాం. భీష్మ, ద్రోణ, విదురాదులు చెప్పే ప్రవచానలను కూడా మేము వినగలం. ఓ వీరవరా! మీ ప్రయాణం కొనసాగించండి. మేము సభలో మీ దర్శనం చేసుకోగలం.' అని చెప్పాడు.

శ్రీకృష్ణుని వెంట పదిమంది మహారథులు, వేయి కాల్బలం, వేయి అశ్వికబలం, వందలాది సేవకులు, భోజన సామగ్రి వుంది.

శ్రీకృష్ణుడు బయలుదేరే వేళ శుభాశుభ శకునాలు సంభవించాయి. కాని ప్రయాణ మార్గంలో అన్నీ శుభశకునాలే కన్పించాయి. అలా గ్రామాలు, పట్టణాలు దాటుకొంటూ, సాయంకాలానికి శాల్యవనమనే గ్రామంలో విడిది చేశారు.

అటు ధృతరాష్ట్రుడు, శ్రీకృష్ణుడు హస్తినకు బయలుదేరాడన్న వార్తను తెలుసుకొని, దుర్యోధనునితో సకల స్వాగత ఏర్పాట్లు చేయించమని ఆజ్ఞాపించాడు. దుర్యోధనుడు కూడ మహోన్నతమైన ఏర్పాట్లు వెంటనే చేయించాడు. ధృతరాష్ట్రుడు ఎంతో సంతోషంతో విదురునితో 'విదురా! శ్రీకృష్ణుడు రేపు ఉదయానికి హస్తినకు చేరుకోగలడు. మనం అత్యంత విలువైన కానుకలు సమర్పించి, ప్రసన్నుని చేసికోవాలి.' అని అనగా దుర్యోధనుడు 'నాన్నగారు! కృష్ణుడు పాండవ పక్షపాతి. ఆయనకేమి కానుకలు ఇవ్వవద్దు' అని అన్నాడు. అపుడు భీష్ముడు 'శ్రీకృష్ణుడు తన మనస్సులో ఉన్నట్లే చేస్తాడు. ఆయనను ఎవరూ మార్చలేరు. ఆయనతో మృదువుగా సంభాషించి, సంధి చేసుకోండి' అని చెప్పాడు. అపుడు దుర్యోధనుడు 'పితామహా! నేను ఎవరికి రాజ్యభాగం ఇవ్వను. శ్రీకృష్ణుని బంధిస్తాను. అపుడు పాండవుల భాగం సమస్తం నా అధీనంలోనికి వస్తుంది.' అన్నాడు. ఈ మాటలు విన్న ధృతరాష్ట్రుడు, సభాసదులెల్లరు ఆశ్చర్యపడ్డారు. శ్రీకృష్ణుని బంధించడమా, సాధ్యమా, న్యాయమా అని విస్మయం ప్రకటించారు.

అపుడు భీష్ముడు 'ధృతరాష్ట్రా! బుద్ధిలేని నీ కుమారుని నేడు మరణం చుట్టుముట్టింది. ఈ దుర్బుద్ధి శ్రీకృష్ణునికి ఎదురు నిలిస్తే, మనం కూడా మాడి మసైపోతాం' అని చెప్పి ఆగ్రహంతో సభనుండి వెళ్ళిపోయాడు.

శ్రీకృష్ణుడు హస్తిన పొలిమేరల్లోకి రాగానే, స్వాగతం పలుకుటకు భీష్మ, ద్రోణ, కృపులే కాకుండా, దుర్యోధనుని తప్పించి ధృతరాష్ట్రుని కుమారులందరూ వచ్చారు. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని వద్దకు వచ్చి పలకరించాడు. తరువాత విదురుని వద్దకు, తరువాత మేనత్త కుంతి వద్దకు వెళ్ళి పరామర్శించాడు. చివరకు దుర్యోధునుని రాజభవనానికి చేరాడు. దుర్యోధనుడు మిత్రులతో సహా ఘనంగా స్వాగత సత్కారాలు చేసి, భోజనానికి స్వాగతించాడు. కృష్ణుడు 'దూతగా నాకు కొన్ని నియమాలున్నాయి. నా కార్యం ఫలిస్తే, నేను ఆతిథ్యం స్వీకరిస్తా"నని చెప్పి, రాజభవనం నుండి బయటకు వచ్చి, విదురుని ఇంటికి వెళ్ళాడు. విదురుని ఇంటివద్దనే శ్రీకృష్ణుని భీష్మ, ద్రోణ, కృప, బాహ్లికులు తమ తమ భవనాలకు రావలసిందిగా ప్రార్థించారు. వారి విన్నపాలను శ్రీకృష్ణుడు త్రోసిపుచ్చి, వారిని సాగనంపాడు. విదురుడు గొప్ప విందు భోజనాన్ని ఏర్పాటు చేశాడు. శ్రీకృష్ణుడు మొదట బ్రాహ్మణులకు భోజనం అందించి, వారి భోజనం అయిన తరువాత తాను తన అనుయాయులతో కలిసి భోజనం చేశాడు. తర్వాత శ్రీకృష్ణుడు, విదురుడు అనేక విషయాలు మాట్లాడుకున్నారు. విదురుడు దుర్యోధనుని దుర్మార్గాన్ని గురించి శ్రీకృష్ణునికి వివరించాడు.

మరునాడు ఉదయమే శ్రీకృష్ణుడు సభకు వెళ్ళేందుకు సిద్ధపడుతుండగా, దుర్యోధనుడు, శకుని వచ్చి సభకు రమ్మని ఆహ్వానం పలికారు. ఒక రథంపై కృష్ణుడు, విదురుడు, మరొక రథంపై దుర్యోధనుడు, శకుని సభకు బయలుదేరారు.

శ్రీకృష్ణుని రథం సభాభవనం సింహద్వారం వద్ద ఆగగానే, శ్రీకృష్ణుడు విదురునితో, సాత్యకితో కలిసి సభాభవనంలోకి ప్రవేశించారు. ఒక దివ్య కాంతిపుంజం వలె ప్రకాశిస్తున్న శ్రీకృష్ణుని చూచి ధృతరాష్ట్రునితో సహా సభికులెల్లరు నిల్చున్నారు. ప్రత్యేక బంగారు సింహాసనంపై కృష్ణుడు ఆసీనుడైనాడు. శ్రీకృష్ణుడు అంతరిక్షంలో వున్న నారదాది మహర్షులు చూస్తూవుండటం గమనించి, భీష్మునితో 'ఈ సభను చూడటానికి వచ్చిన బ్రహ్మర్షులకు, రాజర్షులకు ఆసనాలు ఏర్పాటు చేయండి, సత్కరించండి' అని అనగానే, ద్వారం నుండి ఋషులు రాసాగారు. భీష్ముడు తగిన ఏర్పాట్లు చేయించాడు. రాజులందరి దృష్టి శ్రీకృష్ణుని వైపే కేంద్రీకృతమై, సభ మౌనంగా, గంభీరంగా ఉంది. శ్రీకృష్ణున ఎంత చూచినా తనివితీరటం లేదని భావించవలసి వస్తోంది. ఆ సమయంలో శ్రీకృష్ణుడు లేచి సభామధ్యభాగానికి వచ్చి, ధృతరాష్ట్రుని వైపు చూస్తూ, మేఘ గంభీర స్వరంతో –

'ఓ రాజా! నేను వచ్చిన ఉద్దేశ్యం ఏమంటే క్షత్రియ వీరుల సంహారం జరుగరాదు. అది జరుగక ముందే, పాండవులు, కౌరవుల మధ్య సంధి జరగాలి. మిగతావారికంటె, కురువంశీయులలో దక్షత, మృదుత్వం, క్షమాగుణం, సరళత్వం, సత్యపాలన అధికంగా ఉంటుంది. అలాటిది వారిలో సత్ప్రవర్తన లేకుంటే వారిని సరిదిద్దాల్సిన బాధ్యత మీపై వుంది. దుర్యోధనాదుల క్రూర ప్రవర్తన సరైంది కాదు. మనం తలచుకొంటే, సంధి అసాధ్యమూ కాదు. మీరు మీ కుమారులను అదుపు చేయండి. నేను పాండవుల సంగతి చూస్తాను. వీరిద్దరు ఏకమైతే, సమస్త లోకాల్ని ఏలగలరు.

పాండవులు మీకు ఏమి చెప్పమన్నారంటే – మీ ఆజ్ఞమేరకే 12 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం గడిపివచ్చాం. ఇపుడు మా రాజ్యాన్ని మాకు ఇవ్వాలి. ఇలా ధర్మాన్ని, న్యాయాన్ని రక్షించాల్సిన బాధ్యత మీపై ఉన్నది.' 'రాజా! మీరు పాండవులకు రాజ్యం ఇవ్వండి. వారు మీ సేవకు సిద్ధంగా వున్నారు. అలాకాని పక్షంలో వారు యుద్ధానికి కూడ సిద్ధంగా వున్నారు. కనుక ఏది హితకరమో, అది ఆచరించండి.' అని శ్రీకృష్ణుడు చెప్పగా వినిన సభాసదులు మౌనంగా ఆలోచించసాగారు.

ఆ గంభీర వాతావరణాన్ని భంగం చేస్తూ, పరశరాముడు లేచి నిల్చుని ఇలా చెప్పసాగాడు. 'ఓ రాజా! నీ ఆలోచనలన్నీ ప్రక్కనపెట్టి, నేను చెప్పే ఒక సత్యాన్ని విను. అది మీకు బాగుగా తోచితే అనుసరించు.' అని అన్నాడు.

పూర్వకాలంలో గొప్ప బలశాలియైన దందోద్భవుడనే రాజు ఉండేవాడు. అతడు ప్రతి రోజూ ఉదయం లేవగానే నన్ను మించిన మహారథుడు ఉన్నాడా అని కనపడిన ప్రతి మునిషిని అడుగుతుండేవాడు. ఇతని గర్వాన్ని అణగద్రొక్కాలని తలంచి బ్రాహ్మణులు నిన్ను మించిన వీరులు వున్నారని అన్నారు. వారు ఎక్కడ అని అంటే నరనారాయణులని, గంధమాదన పర్వతంపై తపస్సు చేసుకొంటున్నారని చెప్పారు. దందోద్భవుడు గొప్ప సైన్యంతో ఆ పర్వతంపై నరనారాయణులను కలిశాడు. వారు అతనిని ఏమి కావాలని అడిగారు. తనతో యుద్ధం చేయమన్నాడు రాజు. అపుడు వారు 'అయ్యా! ఇది తపోభూమి. ఇక్కడ యుద్ధాలకు తావులేదు. క్రోధం, లోభం, కుటిలాలు అలాంటివి ఇక్కడ వుండవు.' అని అన్నారు. అలా చెప్పినా దందోద్భవుడు రణానికే పట్టుపట్టాడు. చేసేది లేక నరుడు తన చేతిలో కొన్ని గడ్డిపరకలు పట్టుకొని, యుద్ధం ప్రారంభించమన్నాడు. దందోద్భవుడు వెంటనే తన సైన్యంతో పాటు తాను గూడ తీవ్ర బాణాలను వేయటం ప్రారంభించాడు. నరుడు గడ్డిపోచను అమోఘ అస్త్రంగా మలచి ప్రయోగించాడు. తత్ఫలితంగా, దందోద్భవునితో సహా సైనికులందరి ముక్కుల్లో గడ్డి కూరుకుపోయింది. భయపడి రాజు నరుని పాదాలపై పడి క్షమాపణ కోరాడు. నరుడు క్షమించాడు. రాజు అహంకారాన్ని వీడి, ధర్మానుకూలంగా వ్యవహరించసాగాడు.' ఇదంతా చెప్పి పరశురాముడు 'అయ్యా! ఆనాటి నరనారాయణులే ఈనాటి ఈ శ్రీకృష్ణార్జునులు. సద్బుద్ధితో ఉండండి.' అని అన్నాడు. ఇలా పరశురాముడు ముగించగానే, కణ్వ మహర్షి దుర్యోధనుని ఉద్దేశించి, 'ఓ దుర్యోధనా! నీవు బలశాలినని గర్వించకు. నీకంటె బలశాలురున్నారు. పాండవులు దేవతలతో సమానులు. వారు నిజానికి వాయువు, ఇంద్రుడు, ధర్ముము మరియు అశ్వనీ దేవతల కుమారులు. తెలుసుకో. అందుచేత నీవు వారితో విరధం పెట్టుకోవద్దు. ఉత్తమ మార్గాన్ని అనుసరించు. ఇక్కడే వున్న నారదుడు శ్రీమహావిష్ణువు మహిమ తెలిసినవాడు. శ్రీమహావిష్ణువే శ్రీకృష్ణుని రూపంలో వున్నాడని తెలుసుకో.' అని చెప్పగానే, దుర్యోధనుడు కర్ణుని వైపు తిరిగి, పెద్దగా నవ్వసాగాడు. దుర్యోధనుడు జబ్బలు చరుచుకొంటూ, 'ఓ మహర్షీ! ఏమి, ఏది, ఎలా జరగాలో నాకు తెలుసు. దాని ప్రకారమే నా ఆచరణ

వుంటుంది. మీ కథనాల వల్ల నాకేమి లాభం లేదు.' అని గర్జించాడు దుర్యోధనుడు.

ధృతరాష్ట్రుడు కోరిన మీదట శ్రీకృష్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'దుర్యోధనా! నామాట విను. నామాట వింటే నీ పరివారం అంతా క్షేమంగా ఉంటుంది. నీవు నిజానికి బుద్ధిమంతుల కులంలోనే జన్మించావు. కనుక నీవు శుభకార్యాలే చేయాలి. నీవు చేయాలనుకొన్నది నీకు తగదు. దుష్టచిత్తులైన వారే మొండిగా ఉంటారు. నీవు చూడు పాండవులు ఎలా ఉన్నారో, వారు బుద్ధిమంతులు, శూరవీరులు, ఆత్మజ్ఞులు, ఉత్సాహవంతులు. వారితో సంధి చేసుకో. మీ తల్లిదండ్రుల మాటను శిరసావహించు. నీవు మొదటినుండి కపటంతోనే వున్నావు. అయినా పాండవులు నీపట్ల ప్రేమతోనే ఉన్నారు. ఒకవేళ యుద్ధమే వస్తే, భీమసేనుని ఎవరూ ఎదిరించలేరు. అర్జునుని ఎదుర్కొనే శక్తి గంధర్వులకు, దేవతలకు కూడ లేదు. మొన్న విరాటనగరంలో జరిగింది మర్చిపోయావా? కులఘాతకుడవు కావద్దు.' భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని సమర్థించారు. అన్నీ విన్న దుర్యోధనుడు ఇలా అన్నాడు.

'కేశవా! నీవు పాండవ పక్షపాతివి కనుక నన్ను దోషిగా చూపిస్తున్నావు. బలాబలాలలో పాండవులు మిన్న అని భావిస్తున్నావా? పితామహుని మొదలు అందరూ నన్నే నిందిస్తున్నారు. నాలో ఏ దోషమూ కనిపించటం లేదు. పాండవులు వ్యసనంతో జూదమాడి, ఓడి అరణ్యానికి వెళ్ళారు. ఇందులో నా తప్పు ఏముంది చెప్పు. నాకు తెలుసు పాండవులు మమ్మల్ని ఎదుర్కోలేరు. మేము నీ మాటలకు భయపడం. ఇంద్రుని ముందుకూడ తలవంచే వారం కాదు. ఓ కర్ణా! ఈ ప్రపంచంలో మమ్మల్ని ఎదిరించే క్షత్రియుడే లేడు. భీష్మ, ద్రోణ, కర్ణులను దేవతలు కూడ జయించ లేరు. ఈ పాండవులు ఏపాటివాళ్ళు?

మేము యుద్ధంలో ఓడితే స్వర్గం ప్రాప్తిస్తుంది అని మీకు తెలిదా? పాండవులకు రాజ్యభాగం లభించదు. కేశవా! నేను జీవించి వున్నంతవరకు పాండవులకు సూదిమొన మోపినంత భూమి కూడ ఇవ్వను.'

ఈ మాటలు విన్న శ్రీకృష్ణుడు కొంచెం కఠినంగానే ఇలా అన్నాడు. 'ఓ దుర్యోధనా! నీవు వీరమరణం కోరుకుంటే అలాగే కానివ్వు. కొంతకాలం సుఖంగా ఉండు. విపరీతమైన జనసంహారం జరుగుతుంది. ఈ సభాసదులు అందరూ ఇది ఎరుగుదురు.

పాండవుల ఔన్నత్యాన్ని జీర్ణించుకో లేక, నీవు శకుని కలిసి కపట జూదం ఆడించారు. ద్రౌపదిని అవమానించారు. లక్క ఇంట్లో పాండవులను కడతేర్చాలని నీవు చూశావు. మొదటినుండి వారిని హింసిస్తూనే ఉన్నావు. నీవు ఏ అపరాధం చేయలేదని అంటున్నావు. నీవు వారి భాగం ఇవ్వకపోతే, వారు నిన్ను చంపి యావదాస్తిని సొంతం చేసుకోగలరు సుమా!' శ్రీకృష్ణుడు ఇలా చెప్తూ వుండగానే దుశ్శాసనుడు, దుర్యోధనునితో 'రాజా! భీష్మ, ద్రోణ, మరియు నాన్నగారు కలిసి మిమ్మల్ని, కర్ణుని, నన్ను బంధించి పాండవులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు.' అన్నాడు. ఈ మాటలు వినలేని దుర్యోధనుడు ఆగ్రహంతో తోటివారితో బయటికి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిచి, విదురునితో చెప్పి, దుర్యోధనుని సభలోకి రప్పించారు. గాంధారి చెప్పిన హితవచనాలన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారిపోయింది.

దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణుడు కలిసి శ్రీకృష్ణుని బంధించి, పాండవులను ఏకాకి చేయాలనే యత్నంలో ఉన్న విషయం తెలుసుకొన్న సాత్యకి, కృతవర్మకు చెప్పి, సైన్యంతో సభాభవ ద్వారం వద్దకు రమ్మని

చెప్పి, తాను సభలోకి వచ్చి, శ్రీకృష్ణునికి విషయం చెప్పాడు.

శ్రీకృష్ణుడు చిరునవ్వుతో ధృతరాష్ట్రుని, విదురుని ఉద్దేశించి 'దూతను బంధించుట ధర్మవిరుద్ధం. అయినా నన్ను బంధించడం అంటే చిన్న బాలుడు అగ్నికణాన్ని పట్టుకున్నట్లే అవుతుంది' అని అనగా, ధృతరాష్ట్రుడు దుర్యోధనుని పిలిచి చీవాట్లు పెట్టాడు. 'ఓ కుటిల దుర్యోదనా! శ్రీకృష్ణ పరమాత్మను బంధించటం చేతితో గాలిని పట్టుకొన్నట్లే అవుతుంది. యావత్ భూమిని నెత్తికెత్తుకున్నట్లే అవుతుంది.' అని గద్దించాడు.

అపుడు శ్రీకృష్ణుడు దుర్యోధనునితో 'ఓయీ దుర్యోధనా! నీ అజ్ఞానంతో నేను ఒంటరివాడననుకొంటున్నావు. నా వెంట సమస్త పాండవులు, వీరవరులు వున్నారు. అంతేకాదు, ఆదిత్యుడు, రుద్రుడు, వసువులు, మహర్షులు ఉన్నారు.' అని అంటూ శ్రీకృష్ణుడు అట్టహాసం చేశాడు. అంతే, శ్రీకృష్ణుని అన్ని అంగములలో అంగుష్టాకారంలో దేవతలు అగుపించ సాగారు. ఆయన నొసట బ్రహ్మ, వక్షస్థలంలో రుద్రుడు, భుజాల్లో లోకపాలకులు, నోటిలో అగ్నిదేవుడు కనిపించారు.

ఆదిత్యుడు, వసువులు, అశ్వనీ కుమారులు, ఇంద్రుడితో సహా విశ్వేదేవత, యక్షులు, గంధర్వులు మరియు రాక్షసులు శ్రీకృష్ణుని నుండి అభిన్నంగా కన్పిస్తున్నారు. బలరాముడు, అర్జునుడు రెండు భుజాలలో ప్రకటితమైనారు. భీముడు, ధర్మరాజు, నకుల సహదేవులు సైన్యంతో కనిపించారు. ఆ సమయంలో శ్రీకృష్ణుని యొక్క అసంఖ్యాకమైన భుజాలు కన్పిస్తున్నాయి. ఆయన చేతులలో శంఖం, చక్రం, గద, ధనుస్సు, నాగలి, ఖడ్గం మున్నగునవి కన్పిస్తున్నాయి. నేత్రాలనుండి అగ్నిజ్వాలలు ఎగిసి పడుతున్నాయి. రోమాల నుండి సూర్యకిరణములు వెలువడుతున్నాయి.

శ్రీకృష్ణుని ఈ భయంకర స్వరూపాన్ని చూచిన రాజులు భయంతో కళ్ళుమూసుకున్నారు. కేవలం భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, సంజయుడు మరియు ఋషులు మాత్రం చూడగలిగారు. ధృతరాష్ట్రునికి తన మాయ చేత తన విశ్వరూపాన్ని చూపించి, తన విశ్వరూపాన్ని తనలో ఇముడ్చుకొన్నాడు. తరువాత శ్రీకృష్ణుడు సాత్యకి మరియు కృతవర్మతో కలిసి, సభనుండి నిష్క్రమించాడు. అది గమనించిన నారదాది మహర్షులు కూడ అంతర్ధాన మైనారు.

శ్రీకృష్ణుడు మేనత్త అయిన కుంతి దగ్గరకు వెళ్ళి, నమస్కరించి, సభలో జరిగిన విషయాలు వివరించి, పాండవులకు ఏ సందేశం పంపాలో తెలపమని అడిగాడు. కుంతి 'కేశవా! ధర్మరాజాదులకు ఇలా చెప్పు. రాజ్యపాలన చేయడం మీ ధర్మం. పూర్వం కుబేరుడు ముచికుందునికి భూప్రపంచం అంతా ఇచ్చినా, అతను స్వీకరించ లేదు. కాని తన బాహుబలంతో తదుపరి కాలంలో యావత్ ప్రపంచాన్ని శాసించాడు. రాజుల దండనీతి ప్రయోగం సరైన రీతిలో ఉంటే, ప్రజలు సుఖించగలరు. నిజానికి ప్రతి యుగము యొక్క కారణభూతులు రాజులే అయివున్నారు.

కృష్ణా! ఏదో ఈ ప్రసంగం వచ్చింది కాబట్టి నీకొక ప్రాచీన ఇతిహాసాన్ని వినిపించనా! విదుల అనే క్షత్రియ వంశస్తురాలు, తన కుమారుడు యుద్ధంలో ఓడిపోయి వచ్చినందుకు, కటువుగా మాట్లాడి యుద్ధోన్ముఖుని చేయటం ప్రారంభించింది. ఆమె యశస్విని, కులీనురాలు, దీర్ఘదర్శియై వున్నది. తన కుమారుడు సింధురాజు చేతిలో ఓడిపోయి రావడం ఆమె జీర్ణించుకోకోలేక, కుమారునితో 'ఓరీ పిరికిపందా! నీవు నా కుమారుడవు కావు. నీకు పౌరుషం లేదు. అభిమానం లేదు. నిన్ను క్షత్రియునిగా భావించాను. ప్రాణముండి కూడ ఓడిపోయి

బ్రతకకు. వెళ్ళి వీరస్వర్గం అలంకరించు' అని తీవ్రంగా మాట్లాడింది. తల్లి ధనం ఇవ్వగా, సైన్యం సమకూర్చుకొని రణరంగాన్ని కకావికలం చేయసాగాడు. ఓ కృష్ణా! నేను కూడా అలాంటి వీరవనితను. పాండవులకు ఒక సంగతి గుర్తు చేయి. ఆనాడు ద్రౌపదిని అవమానించిన తీరును నేను ఇంకా జీర్ణించుకోలేదని, లేనని కూడ వారికి చెప్పు.' అన్నది.

తర్వాత శ్రీకృష్ణుడు కర్ణుని తనను సాగనంపేందుకు రమ్మని కోరి తన రథంపై కూర్చుండ బెట్టుకొని, హస్తిన దాటిన తర్వాత, ధర్మయుతమైన మాటలు ఇలా చెప్పసాగాడు. 'ఓ కర్ణా! నీకొక రహస్యం చెబుతాను. కుంతి కన్యగా వున్నపుడు నీవు ఆమెకు జన్మించావు. నీవు పాండురాజు కుమారుడవు. ధర్మానుసారంగా నీవే రాజ్యాధికారివి. నీవు నాతో వస్తే, నీవు ధర్మరాజు కంటే ముందే జన్మించావని చెప్పవచ్చును. ఆ విధంగా పాండవులు, ఉపపాండవులు నీకు పాదాభివందనం చేస్తారు. మీవారితో కలిసి నీకే రాజ్యాభిషేకం చేస్తారు. ఈ రకంగా పాండవులు అందరూ కలిసి రాజభోగాన్ని అనుభవించవచ్చు.' అనగా కర్ణుడు 'కేశవా! నా హితం కోరి చెప్పావు. ఇవన్నీ నాకు తెలిసినవే. సూర్యదేవుని వల్ల నన్ను కన్నతల్లి నన్ను ఆరోజే నీళ్ళలో వదిలివేసింది. దుర్యోధనుడు నాపై విశ్వాసంతోనే యుద్ధానికి సిద్ధపడుతున్నాడు. నేనిపుడు అతణ్ణి మోసం చేయలేను. నీవు ఈ రహస్యాన్ని ధర్మరాజుకు చెప్పకు. కుంతియొక్క ప్రథమ పుత్రుణ్ణి నేనే అని తెలిస్తే, వారే పట్టం కడతారు. అలా అయితే అప్పుడు రాజ్యాన్ని దుర్యోధనుడే అప్పగిస్తాడు.

ఇలా కర్ణుని మాటలు విన్న శ్రీకృష్ణుడు నవ్వుతూ 'ఓ కర్ణా! సకల సామ్రాజ్యం ఎలాగూ పాండవులే జయిస్తారు. సరే. నీవు వెళ్ళిన తరువాత భీష్మ, ద్రోణ, కృపాచార్యులకు ఇలా నా మాటగా తెలియజేయి. ఈ మాసం యుద్ధానికి అనుకూలం. నేటినుండి ఏడవ రోజు అమావాస్య. ఆ రోజు యుద్ధం ప్రారంభించడానికి మంచిరోజు. దుర్యోధనుని అధీనంలో ఉన్న వారందరికీ ఉత్తమ గతి ప్రాపించనుంది." అని చెప్పగా కర్ణుడు 'ఓ కృష్ణా! అన్నీ తెలిసిన నీవు నన్ను ఎందుకు మోహంలో పడవేయ చూస్తున్నావు? ఎలాగూ ప్రపంచం అంతమవుతుంది. ఇందులో నేను, దుర్యోధనుడు, శకుని నిమిత్తమాత్రులమే. జింకపిల్లలు గుంపులు గుంపులుగా పాండవుల కుడిభాగాన పరుగెత్తుతున్నాయి. అది వారికి విజయ సంకేతమే. కౌరవుల ఎడమ వైపునుండి జింకలు వెళ్ళటం పరాజయ సంకేతమై యున్నది.' అపుడు శ్రీకృష్ణుడిట్లా అన్నాడు. 'ఓ కర్ణా! వినాశకాలం దాపురించిందనటం వాస్తవమే. అందుచేతనే అన్యాయం కూడ న్యాయం లాగ కనిపిస్తుంది.' అని అన్నాడు. తరువాత కర్ణుడు యుద్ధరంగంలోనే కలుద్దామని చెప్తూ, శ్రీకృష్ణుని వద్ద శలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

కర్ణునికి తన జన్మవృత్తాంతం చెప్పి, కర్ణుని పాండవులకు అనుకూలంగా మలచవచ్చుననే ఆలోచనతో కుంతి ఒక ఉదయం గంగానది వద్ద సూర్యనమస్కారాలు చేస్తున్న కర్ణుని వద్దకు వెళ్ళింది. కుంతిని చూచి నమస్కరించిన కర్ణుడు నేను ఏమి చేయగలనని కుంతిని అడిగాడు. అపుడు కుంతి 'నాయనా! నేను కుంతిభోజుని దగ్గర ఉన్న సమయంలో, కన్యగా ఉండగానే, నీకు నేను జన్మనిచ్చాను. సాక్షాత్తూ సూర్య భగవానుడే నీ తండ్రి నీవు నీ సోదరులను గుర్తించలేక మోహంతో దుర్యోదనునితో స్నేహం చేస్తున్నావు.

నీవు పాండవులతో సఖ్యతగా ఉంటే, బలరామ కృష్ణుల వలె, కర్ణార్జునులు కీర్తిని గడిస్తారు. అని చెప్పే సమయంలో ఆకాశవాణి 'ఓ కర్ణా! కుంతి నిజమే చెప్తున్నది. నీవు మీ తల్లి చెప్పినట్లు నడుచుకో, హితం కూడుతుంది' అనిన మాటలు గాని, కుంతి మాటలు గాని కర్ణునిపై పనిచేయలేదు.

కర్ణుడు ఇలా అన్నాడు. 'అమ్మా! నన్ను నీవు వదలివేసి తప్పు పని చేశావు. క్షత్రియ కులంలో జన్మించినా, నేను క్షత్రియుడుగా చలామణి అవడం లేదు. ఇంతటి ద్రోహం మరేదీ లేదు. ఇపుడు నీవు నీ హితం కోరి ఏదో చెప్తున్నావు. కాని నేను దుర్యోధనునికి ఋణపడి వున్నాను. పాండవులతో యుద్ధం చేసి కాని, అతని ఋణం తీర్చుకోలేను. అయినా తల్లిగా నీకు ఊరటగా ఒక మాట చెప్తున్నా. నేను అర్జునుని తప్ప, మిగతా నలుగురునీ చేత చిక్కినా వధింపను. ఈ విధంగా నీకు ఐదుగురు కుమారులుంటారు.' ఆ తర్వాత కుంతి కర్ణుని ఆశీర్వదించి వెళ్ళిపోయింది.

యుద్ధం అనివార్యమైంది. కనుక దుర్యోధనుడు కాల్బలం, గజబలం, రథబలం మరియు అశ్విక బలంగా విభజించబడిన తన 11 అక్షౌహిణుల సైన్యాన్ని తేరిపార చూశాడు. ఒక్కో అక్షౌహిణికి ఒక్కో నాయకుని నియమించాడు. కృపాచార్యుడు, ద్రోణుడు, శల్యుడు, జయద్రధుడు, సుదక్షిణుడు, కృతవర్మ, అశ్వత్థామ, కర్ణ, భూరిశ్రవ, శకుని మరియు బాహ్లికులను మొదలైన వారిని సేనానాయకులుగా నియమించాడు.

ఆ తరువాత దుర్యోధనుడు భీష్మ పితామహునితో 'పితామహా! సైన్యం ఎంత పెద్దదైనా, నాయకత్వం పటిష్ఠంగా వుండాలి కనుక మీరే సర్వసైన్యాధక్షునిగా వ్యవహరించండి.' అని అన్నాడు. భీష్ముడు 'సరే, అలాగే. కాని నాకు మీరు, పాండవులు రెండు కళ్ళలాంటివారు. నేను పాండవులను మాత్రం చంపను. మీ పక్షాన యుద్ధం చేస్తాను. రోజుకు వారి పక్షాన ఉన్న పది వేల మందిని సంహరిస్తాను.' అని చెప్పిన తర్వాత భీష్ముని సర్వ సైన్యాధిపతిగా అభిషిక్తుని చేశాడు.

పాండవుల పక్షాన వున్న 7 అక్షౌహిణుల సైన్యానికి ఒక్కొక్కరుగా, వరుసగా ద్రుపదుడు, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, చేకితానుడు మరియు బీమసేనుడు ఏడుగురు సేనానాయకులుగా నిర్ణయించ బడ్డారు. సర్వసైన్యాధ్యక్షునిగా ధృష్టద్యుమ్నుని అభిషిక్తం చేశారు. సేనకు ముందు భాగంలో భీముడు, నకులుడు, సహదేవుడు, అభిమన్యుడు, ద్రౌపది కుమారులు, ధృష్టద్యుమ్నుడు మరియు ఇతర యోధులు నడువసాగారు. మధ్యభాగంలో ధర్మరాజును వలయంగా చుట్టుకొని కేకయ దేశపు రాజకుమారుడు ధృష్టకేతు, కాశీరాజు కుమారుడు, శిఖండి మున్నగువారు ఉన్నారు.

సేన వెనుకభాగంలో విరాటరాజు, కుంతిభోజుడు మొ॥వారు కృష్ణార్జునులతో ఉండేవిధంగా వ్యూహరచన కావించారు.

యుద్ధం సమీపించడంతో బలరాముడు యదువీరులను తీసుకొని పాండవుల శిబిరానికి వెళ్ళారు. పాండవులందరు స్వాగతించారు. బలరాముడు 'కృష్ణా! ఈ యుద్ధంలో భయంకరంగా నరసంహారం జరుగనుంది. మనకు ఇరుపక్షాలవారు ముఖ్యులే, కావలసినవారే. కనుక నీవు నిష్పక్షపాతంగా సహకరించు" అని చెప్పి తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు.

భీష్మక పుత్రుడైన రుక్మి అక్షౌహిణి సైన్యంతో పాండవుల దగ్గరకు వచ్చాడు. అర్జునునితో 'అర్జునా! నేను వచ్చాను. భయపడవద్దు. కౌరవులను జయించి, రాజ్యాన్ని నీకు వశం చేస్తాను.' అనగానే అర్జునుడు ఒకసారి కృష్ణునివైపు మరియు ధర్మరాజు వైపు చూస్తూ, నవ్వుతూ, గంభీర స్వరంతో రుక్మిని చూసి ఇలా అన్నాడు. 'నేను

ద్రోణాచార్యుని శిష్యుణ్ణి. శ్రీకృష్ణుని ఆశీర్వాదం నాకుంది. గాండీవం నా చేతిలో ఉంది. నాకు భయం లేదు. నాకు నీ సాయం అవసరం లేదు. నీ సహాయం ఎవరి కవసరమో వారికి చేయి. వెళ్ళు' అన్నాడు. రుక్మి అక్కడినుండి దుర్యోధనుని దగ్గరకు వెళ్ళి ప్రగల్భాలు పలికాడు. దుర్యోధనుడు అహంకారి కాబట్టి రుక్మి సాయాన్ని తిరస్కరించాడు. బలరాముడు, రుక్మి తప్ప మిగతా రాజులందరు యుద్ధంలో పాల్గొన్నారు.

దుర్యోధనుడు ఉలూకునితో పాండవులకు కటువైన సందేశాన్ని పంపాడు. 'ఓ ఉలూకా! నా మాటలు యధాతధంగా వాళ్ళకు వినిపించు. ఆనాడు కౌరవ సభలో వారి మాటలు మా చెవులలో రింగుమంటున్నాయి. ధార్మికులని పేరు ఉన్నా అధర్మాన్ని అనుసరిస్తున్నారు. దీనిని మార్జాల వ్రతమంటారు. నారద మహర్షి మా నాన్నగారికి చెప్పగా విన్నాను. దానిని నీకు చెబుతాను. విను.

ఒకసారి ఒక పిల్లి వేటాడలేక, ఆహారం దొరక్క, గంగాతీరంలో తపస్సు ప్రారంభించింది. అక్కడి పక్షులకు విశ్వాసం కలిగించడానికి ధర్మాన్ని ఆచరిస్తున్నట్లు నటించింది. పక్షులకు దీనిపై గౌరవం కుదిరింది. ఎలుకలు కూడ నమ్మటం మొదలు పెట్టాయి. చిన్న, ముసలి ఎలుకలను దీని రక్షణలో పెట్టసాగాయి. పిల్లి ఎలుకలను తిని తిని బలిసింది. ఎలుకలు గ్రహించి అక్కడి నుండి పారిపోయాయి. పిల్లికూడ వెళ్ళిపోయింది. కాబట్టి ఓ దుర్మార్గులారా! మీరు మార్జాల వ్రతం చేస్తున్నారు. కపట నాటకం ఆడుతున్నారు. ప్రపంచాన్ని మోసం చేయకండి. ఓ పాండవులారా! గత అవమానాలను గుర్తుచేసుకొని, మగటిమి ప్రదర్శించండి. బలం లేకున్న దుశ్శాసనుని రక్తం త్రాగుతాననడం హాస్యాస్పదం కాదా. భీష్ముని, కర్ణుని, శల్యుని, ద్రోణుని జయించండి. అది మీ చేత కాదు. రాజ్యం ఎలా వచ్చింది మీకు?" ఈ మాటలన్నీ ఉలూకుడు పాండవులకు వినిపించాడు. అపుడు పాండవులు తమ తీవ్ర సందేశాలను మహా రోషంతో ఈ విధంగా ఉలూకుడికి వినిపించారు.

భీమసేనుడు 'ఓరీ దుర్బుద్ధీ! మీకు సాక్షాత్తు యముడు, కుబేరుడు మరియు రుద్రుడు సాయం చేయవచ్చినను, మేము మా ప్రతిజ్ఞలను పూర్తి చేస్తాం' అని ఆవేశంగా అన్నాడు.

శ్రీకృష్ణుడు ఇలా చెప్పి పంపాడు. 'ఓ దుర్యోధనా! రేపటి నుండి రణరంగలో నీ రథం ఎక్కడ వున్నా అర్జునుడి రథం వెంటాడుతూ ఉంటుంది. నీవు ఏ లోకాలలోకి వెళ్ళినా, నీకు అర్జునుని రథమే కన్పిస్తుంది.'

అర్జునుడు 'ఓయీ ఉలూకా! దుర్యోధనుడి వ్యర్థ ప్రేలాపనలతో ప్రయోజనం ఏమీ లేదు. రేపు నా గాండీవమే జవాబు చెప్తుంది.' అని అనగా, ఈ మాటలన్నీ కూడా ఉలూకుడు విన్నాడు, దుర్యోధనుని వద్దకు చేరి ఆ మాటలన్నీ చెప్పాడు.

దుర్యోధునుని సైన్యం గురించి – వేలాది రథాలున్నాయి. దుశ్శాసనుడు, దుర్యోధనుడు, సోదరులందరూ గొప్ప రథికులే. భూరిశ్రవుడు, శల్యుడు అతిరథులు. జయద్రధుడు ఇద్దరు రథికులకు సమానం. విందుడు, అనువిందుడు, శకుని, లక్ష్మణ కుమారుడు వీరంతా రథులే. అశ్వత్థామ మహారథి. కృపాచార్యుడు, ద్రోణాచార్యుడు, బాహ్లికుడు అతిరథులు. అలంబసుడు అతిరథుడు. కర్ణుడు అర్ధరథుడై వున్నాడు.

పాండవుల సైన్యం గురించి : ధర్మరాజు మంచి రథుడు. భీముడు ఎనిమిది రథులకు సమానం. నకుల సహదేవులు మంచి రథులు. అర్జునుని ఎదుర్కోవటానికి ద్రోణుడు తప్ప ఎవరూ లేరు. ఉపపాండవులు అల్పరథులే. అభిమన్యుడు కృపాచార్యుని అంతటి వాడు. ధృష్టద్యుమ్నుడు మహారథి, ఘటోత్కచుడు గొప్ప మాయావి. మరియు అతిరథ, మహారథుడు.

ఇక నా సంగతి 'నేను కుంతీపుత్రులను చంపను. శిఖండి ఎదురైతే అస్త్రసన్యాసం చేస్తాను.' అని భీష్ముడు అన్నాడు. అపుడు దుర్యోధనుడు 'పితామహా! శిఖండి వివరాలు చెప్పండి' అని అడిగాడు.

భీష్ముడు ఇలా చెప్పసాగాడు. 'దుర్యోధనా! మీ తాతలు విచిత్ర వీర్యునికి, చిత్రాంగదునికి వివాహం చేయాలని, కాశీరాజు కుమార్తెలైన అంబ, అంబిక, అంబాలికల స్వయంవర సమయంలో అక్కడ చేరిన రాజులందరినీ ఓడించి, తెచ్చాను. అంబ తాను సాళ్వరాజు భార్యను కాబోతున్నానని చెప్పగా ఆమెను పంపించి వేశాను. కాని సాళ్వుడు ఆమెను తిరస్కరించాడు. అంబ తిరిగివచ్చి నాతో వివాహం కోరింది. నా ప్రతిజ్ఞ గురించి ఆమెకు చెప్పగా ఆమె పరశురాముని వద్దకు చేరి, నాపైకి యుద్ధానికి పంపింది. ఇదే కురుక్షేత్రంలో 23 రోజుల పాటు మేమిరువురం యుద్ధం చేశాం. గెలుపోటములు నిర్ణయం కాలేదు. అపుడు పరశురాముడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. నేను కూడ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాను. నారదాది ఋషులు వచ్చి మమ్మల్ని వారించారు. పరశురాముడు అక్కడే వున్న అంబను పిలిచి, 'నేను నా శక్తినంతను ఉపయోగించి యుద్ధం చేసినా, నీ కష్టాన్ని తీర్చలేక పోయాను. నీవే భీష్ముని శరణు వేడు. లేదా నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళిపో' అన్నాడు. అంబ నావద్దకు రానని, తపస్సు చేసి నన్ను చంపుతానని ప్రతిజ్ఞ చేసి, అడవులలో తపస్సు చేసుకోవడానికి వెళ్ళింది. యమునా నదీతీరంలో తపస్సు ప్రారంభించింది. శంకరుడు ప్రత్యక్షమై ఆమె సగం శరీరం అంబానది గాను, మిగతా సగం మత్స్యదేశపు రాజు ద్రుపదుని యొక్క కన్యగాను జన్మించేలా వరమిచ్చాడు. తరువాత తీవ్ర తపం చేయగా, శంకరుడు మరల ప్రత్యక్షమై, 'నీవు ద్రుపదుని కుమార్తెగా జన్మించి, తరువాత పురుషుడవై భీష్ముని చంపగలవు.' అని వరం ఇచ్చాడు. 'అంబ ఆనందంతో అగ్నిని సృష్టించి, అందులో ఆహుతి అయింది.' అని చెప్పాడు.

అపుడు దుర్యోధనుడు 'శిఖండి కన్యకగదా, పురుషుడు ఎలా అయ్యాడు?' అని ప్రశ్నించాడు. భీష్ముడు ఇలా చెప్పాడు. 'దుర్యోధనా! ద్రుపదునకు శంకరుని వరం వల్ల శిఖండి జన్మించాడు. స్త్రీగా జన్మించినా, ఆ పిదప పురుషుడగునని అతనికి వరప్రసాదం వుంది. ఎలాగూ మగవాడు అవుతాడు గనుక హిరణ్యవర్మ కుమార్తెతో వివాహం జరిపించాడు. హిరణ్యవర్మ కోపంతో ద్రుపదునిపై దండయాత్రకు ప్రయత్నాలు ప్రారంభించాడు. శిఖండి బాధతో ప్రాణత్యాగానికని అడవికి వెళ్ళాడు. అక్కడ యక్షుడు ప్రత్యక్షమై ఏమిటి నీ బాధ అని అడిగాడు. ఆమె తన కథ వినిపించగా, యక్షుడు జాలిపడి ఆమెకు తన పురుషత్వాన్ని ప్రసాదించి, ఆమె స్త్రీత్వాన్ని తాను తీసుకున్నాడు. శిఖండి సంతోషంగా రాజ్యానికి చేరుకున్నాడు. శిఖండి పురుషత్వాన్ని పరీక్ష చేయుటకు దశార్ణవ రాజైన హిరణ్యవర్మ కొంతమంది యువతులను పంపాడు. వారు శిఖండిని పరీక్షించి, మగవాడేనని దశార్ణవ రాజుకు చెప్పారు.

యక్షుల రాజైన కుబేరుడు ఈ మధ్య స్థూలకర్ణుడు కనిపించడం లేదని అడుగగా, విషయం తెలిసి స్థూలకర్ణుని పిలిపించి, నీవు ఎల్లకాలం స్త్రీత్వంతోనే వుండుమని శపించాడు. యక్షులందరు వేడుకొనగా, శిఖండి మరణించువరకు ఇలాగే వుంటావని శాపపరిహారం ప్రకటించాడు కుబేరుడు.

పూర్వ నియమం ప్రకారం శిఖండి స్థూలకర్ణుని వద్దకు వచ్చి, పురుషత్వాన్ని తీసుకోమని చెప్పాడు. కుబేరుని ద్వారా జరిగిన పరిణామాలన్నీ చెప్పగా, శిఖండి ప్రసన్నవదనంతో వెళ్ళిపోయాడు. ఆ విధంగా అంబ నాపై పగబూని శిఖండిగా అవతరించింది. ఆమె పురుషరూపంలో నన్ను ఎదుర్కొంటే, స్త్రీలతోకాని, పురుషులుగా

మారినవారితో గాని యుద్ధం చేయనని నేను పెట్టుకున్న నియమం ప్రకారం అంబ నా ఎదుటకు వస్తే నేను అస్త్రసన్యాసం చేస్తాను' అన్నాడు.

తర్వాత తమ తమ సైన్యం యొక్క బలపరాక్రమాలను గురించి దుర్యోధనుడు, ధర్మరాజు పూర్తిగా తెలుసుకొన్నారు. భీష్ముడు, ద్రోణుడు, అశ్వత్థామ ఒక నెల రోజులలో పాండవుల సైన్యాన్ని నాశనం చేస్తామని చెప్పగా కర్ణుడు మాత్రం తనకు అయిదు రోజులు చాలని అన్నాడు. కృపాచార్యుడు తనకు రెండు నెలల సమయం పడుతుందని చెప్పాడు.

ధర్మరాజు తన సైన్యం యొక్క బలపరాక్రమాలను గురించి, అర్జునుని అడగ్గా, తాను ఒక్క రోజులోనే సమస్త కౌరవ సైన్యాన్ని సంహరించగలనని, తన వద్ద పాశుపతాస్త్రమున్నా, దాన్ని ఉపయోగించకుండానే యుద్ధం చేస్తానని చెప్పాడు. అలాగే ధర్మరాజుకు కోపం వస్తే, క్షణకాలంలోనే కౌరవ సైన్యం నశిస్తుందని గుర్తుచేశాడు. ఆ విధంగా తమకే విజయం లభిస్తుందని గట్టిగా చెప్పాడు.

-o0o-

6. భీష్మ పర్వం

కురుక్షేత్రంలో రెండు పక్షాలు తమ తమ సైన్యాలను అనేక యోజనాల పొడవునా గుడారాలను వేసుకొన్నాయి. ఇరు పక్షాలు కొన్ని యుద్ధ సంబంధమైన, ధార్మిక విషయాలు ఏర్పరచుకొన్నాయి.

ప్రతిరోజూ యుద్ధం పరిసమాప్తం కాగానే, స్నేహపూర్వకంగా మెలగాలి. యుద్ధం నుండి బయటికి వెళ్ళిపోయిన వారిపై అస్త్ర ప్రయోగం చేయరాదు. కాల్బలము కాల్బలముతోను, అదేవిధంగా మిగతా బలాలు కూడ వాటితోనే యుద్ధం చేయాలి. ఒకరితో ఒకరు యుద్ధం చేస్తున్నపుడు, వేరొకరు జోక్యం చేసుకోరాదు. శరణన్న వారిని, అస్త్రశస్త్రములను కోల్పోయిన వారిని చంపరాదు. భేరీనినాదాలు చేసేవారిని, శంఖం పూరించేవారిని, అస్త్రశస్త్రములను అందించేవారిని హింసించకూడదు. ఈ నియమాలు పాటించుచు ఉభయులు నిర్ణయించుకొన్నారు.

ధృతరాష్ట్రుడు ఒంటరిగా ఉన్నాడు. అన్ని కాలాలను ఎరిగిన వేదవ్యాసుడు వచ్చి ఆయనను పలకరించాడు. 'ధృతరాష్ట్రా! నీవు యుద్ధం చూడాలనుకొంటే, నీకు దివ్యదృష్టిని ప్రసాదిస్తా'నని వేదవ్యాసుడు చెప్పాడు. అపుడు ధృతరాష్ట్రుడు 'ఓ మహర్షీ! యుద్ధంలో మావారు చనిపోవడం నేను చూడలేను. కాని యుద్ధ విశేషాలను తెలుసుకోవాలనుకుంటున్నాను.' అని అనగా వేదవ్యాసుడు సంజయునికి దివ్యదృష్టినిచ్చి, 'వీని ద్వారా నీవు యుద్ధ విశేషాలు తెలుసుకోగలవు' అని చెప్పి వెళ్ళిపోయాడు.

కొంచెం సమయం తర్వాత, ధృతరాష్ట్రుడు సంజయునితో 'సంజయా! రాజ్య వ్యామోహంతో ఈ రాజులు కలహించుచున్నారు. కనుక అసలు ఆ భూమి ప్రాశస్త్యమేమిటో చెప్పు' అని అడిగాడు.

అపుడు సంజయుడు "ఓ రాజా! ఈ జగత్తు యావత్తు భూమిపైనే ఉత్పన్నమై, భూమిమీదనే లయించుచున్నది. ఎక్కువ కాలం స్థిరంగా ఉండేది భూమియే. భూమిపై ఎవరికి అధికారం వుంటుందో, వారి అధీనంలోనే జగత్తు నిలబడి ఉంటుంది. ఆ కారణంగానే రాజులు భూమికోసం ఒకరినొకరు చంపుకొంటున్నారు.' అని చెప్పాడు.

సంజయుడు యుద్ధభూమికి వెళ్ళి, కొన్ని దినములు అక్కడ ఉండి యుద్ధాన్ని చూచి తిరిగి వచ్చి దుఃఖంతో ధృతరాష్ట్రునితో 'మహారాజా! భీష్ముడు యుద్ధం వదిలి వేశాడు. ఆయన నేడు అంపశయ్యపై ఉన్నాడు. ఆనాడు పరశురాముని తో పోరాడి ఓడిపోని ధీరుడు నేడు శిఖండి చేతిలో ఓడిపోయాడు. ఇంద్రుని సముడైన, హిమాలయములాంటి వాడు, సముద్రముకంటె గంభీరుడై, భూమి అంతటి సహనశీలియై, పది రోజులలో లక్షలాది సైనికులను సంహరించిన మహాయోధుడు అంపశయ్యపై పడి ఉన్నాడు.' అని అన్నాడు. అపుడు ధృతరాష్రుడు 'సంజయా! అంతటి ఇంద్రసముడు శిఖండి చేతిలో ఎలా చనిపోయాడు? నాకు దుఃఖం ఆగడం లేదు. ఆయన వెనుక ఎవరున్నారు? భీష్ముని దేవతలు కూడా ఓడించలేరే! యుద్ధ వివరాలు క్రమపద్ధతిలో నాకు చెప్పు' అని అడిగాడు.

సంజయుడు ఇలా చెప్పనారంభించాడు. "మహారాజా! వేదవ్యాస మహర్షి కృప చేత కాలాల జ్ఞానము మరియు ఆకాశయానము చేయగల శక్తి నాకు లభించింది. ఈ సందర్భంగా మహర్షికి నమస్కరించి, యుద్ధ వివరాలను వివరిస్తాను. వినండి.

దుర్యోధనుడు దుశ్శాసనునితో 'ఈ యుద్ధంలో మనం భీష్ముని రక్షించుకోవడం కంటే ఇతర పెద్ద కార్యాలేవీ లేవు. పితామహుడు ముందుగానే చెప్పాడు – నేను పాండవులను చంపను అని. అలాగే శిఖండితో యుద్ధం

చేయవలసి వస్తే అస్త్రసన్యాసం చేస్తానని కూడా అన్నాడు. కనుక శిఖండి నుండి మనం భీష్ముని రక్షించుకోవాలి. అదిగో చూడు. అర్జునుని ఎడమ ప్రక్కన యుధామన్యుడు, కుడిప్రక్కన ఉత్తమౌజుడు రథచక్రాలను రక్షిస్తూ వున్నారు. అర్జునుడే కచచంగా శిఖండిని రక్షిస్తున్నాడు. శిఖండి పితామహుని చంపకుండా చూడాలి."

ఆ తరువాత 11 అక్షౌహిణుల సైన్యం యుద్ధానికి సిద్ధమైంది. వెలిగిపోతున్న భీష్మ పితామహుడు సైన్యాధిపతిగా తేజోవంతంగా ప్రకాశిస్తున్నాడు.

మహరాజా! భీష్ముడు తలపై తెల్లని తలపాగాధరించాడు. అలాగే తెల్లని కవచం కూడా ధరించాడు. అశ్వాలు కూడా తెల్లగా వున్నాయి. చంద్రునిలా ప్రకాశిస్తున్నాడు. అతనిని చూచి వైరివీరులు భీతి చెందుతున్నారు. ద్రోణాచార్యుని పతాకంపై బంగారు వేదిక, కమండలము, ధనుస్సు ఉన్నాయి. కృపాచార్యుని రథంపై ఉన్న పతాకంపై వృషభ చిహ్నం ఉంది. రాజా! అర్జునుడు వజ్రవ్యూహాన్ని పన్నాడు. అది ఇంద్రుని వ్యూహం. భీమసేనుడు ముందుభాగంలో ధృష్టద్యుమ్నుడాదిగా గలవారితో నడుస్తున్నాడు. కౌరవ సేన ముఖం పడమర వైపు, పాండవ సేన ముఖం తూర్పు వైపు ఉన్నాయి. మీ సైన్యంతో లక్షకు మించిన ఏనుగులు ఉన్నాయి, ప్రతి ఏనుగుకు వంద వంద రథాలున్నాయి. ప్రతి రథానికి పంచాశ్వాలున్నాయి. ప్రతి అశ్వానికి పదిమంది ధనుర్ధరులున్నారు. ఈ రకంగా వ్యూహరచన చేసి భీష్మ పితామహుడు ముందుకు సంద్రంలా సాగిపోతున్నాడు.

ఇరుపక్షాలు యుద్ధ సన్నద్ధులై ఉండగా, అర్జునుడు శ్రీకృష్ణుని తమ రథాన్ని రెండు సేనల మధ్య నిలుపుమని అడిగాడు. శ్రీకృష్ణుడు ఈ మాటలు విని, తమ రథాన్ని భీష్ముడు, ద్రుపదుడు మరియు ఇతర రాజుల ఎదుట నిలిపాడు. అర్జునుడు ఎదురుగా వున్న హేమాహేమీలను, బంధువులను, తాతముత్తాతలను, గురువులను, సోదరులను, కుమారులను, మిత్రులను, ఆప్తులను చూచి అత్యంత కరుణాపూర్ణ స్వరంతో 'ఓ కృష్ణా! ఎదురుగా వున్న స్వజనాన్ని చూచి నా అంగాలు శిథిలమైపోతున్నాయి. నోరెండుతోంది, నిలబడలేక పోతున్నాను. ఈ యుద్ధంలో వీరినందరిని సంహరించడం వల్ల లభించే కీర్తి, సంపదలు నాకేమీ అక్కర లేదు. ఓ కృష్ణా! త్రిలోకాధిపత్యం వచ్చినా, నేను వీరిని చంపను." అని శోకంతో అర్జునుడు విల్లమ్ములు వదలిపెట్టి, రథంలో కూలబడి పోయాడు.

ఇక్కడే విశ్వవిఖ్యాతమైన భగవద్గీత – సాంఖ్య యోగాన్ని శ్రీకృష్ణుడు అర్జునునికి బోధిస్తాడు. కర్మయోగం, కర్మ సన్న్యాస యోగం, ఆత్మ సంయమ యోగం, జ్ఞాన విజ్ఞాన యోగం, అక్షర పరబ్రహ్మ యోగం, రాజవిద్య రాజగుహ్య యోగం, విభూతి యోగం, విశ్వరూప దర్శన యోగం, భక్తి యోగం, క్షేత్ర క్షేత్రజ్ఞ విజ్ఞాన యోగం, గుణత్రయ విభాగ యోగం, పురుషోత్తమ యోగం, దైవాసుర సంపద్విభాగ యోగం, అన్ని యోగ సారాంశాలను శ్రద్ధాభక్తులతో వినిన అర్జునుడు 'అచ్యుతా! నీ దయవలన నా మోహం నశించింది. జ్ఞానం ప్రాప్తించింది. సంశయరహితడునైనాను. నీవు చెప్పినట్లే చేస్తాను.' అని శ్రీకృష్ణునితో చెప్పాడు.

ఇక్కడ మనం భగవద్గీతలోని యోగాల సారాంశం క్లుప్తంగా తెలుసుకొందాం.

శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అంటాడు – 'అర్జునా! ఈ సంకట సమయంలో ఈ మోహం నీకెలా దాపురించింది? దానివల్ల కీర్తి దక్కదు. స్వర్గం లభించదు. ఈ హృదయ దౌర్బల్యాన్ని త్యజించి, యుద్ధం చేయుటయే నీ క్షత్రియ ధర్మం.' అనగానే గురువులను, బంధువులను ఎలా వధించేది? అని అడుగుతాడు. అపుడు శ్రీకృష్ణుడు – ఎవరి కోసమైతే దుఃఖించ తగదో, వారికోసమై శోకిస్తున్నావు. మరణం శరీరానికే గాని ఆత్మకు కాదు. జీవాత్మ ఒక శరీరాన్ని వదలి మరొక శరీరంలో ప్రవేశిస్తుంది. క్షత్రియ ధర్మం ధర్మ యుద్ధం. నీవు లాభనష్టాలు, అవీ ఇవీ

ఆలోచించకుండా యుద్ధం చేయి. లేకపోతే నీకు పాపం చుట్టుకుంటుంది. కర్మ చేయడమే నీ పని, ఫలితాన్ని ఆశించకూడదు. ఈశ్వరునికి అర్పించాలి. నీ బుద్ధి స్థిరంగా ఉండాలి. కర్మయోగ ఆచరణ చేయువాడే శ్రేష్ఠుడు. ఆశ, మమతా రహితుడవై, కర్మలు నాకు అర్పిస్తూ నీవు యుద్ధం చేయాలి. నీ బుద్ధి ద్వారా మనస్సును అదుపులో ఉంచుకొని కామాన్ని జయించాలి. అర్జునా! నీ హృదయంలోని అజ్ఞానజనిత సంశయాన్ని జ్ఞానఖడ్గంతో నరికి కర్మయోగంలో స్థిరంగా ఉండి, యుద్ధం చెయ్యి.

అర్జునా! కర్మ యోగము, కర్మ సన్న్యాస యోగము రెండూ కళ్యాణకారక మైనవే. కాని కర్మయోగమే శ్రేష్ఠమైనది. సంశయరహితుడైన పురుషుడు పరబ్రహ్మ ధృతిలో నిత్యుడై వుంటాడు. సంకల్పం వదలినవాడే యోగి. ఆత్మశుద్ధి కోసం యోగాభ్యాసం ఒక్కటే మార్గం. తాపసులకంటె యోగి శ్రేష్ఠుడు. కనుక నీవు యోగివైపో. నన్ను నిరంతరం భజిస్తూ ఉండు. నా తత్త్వం తెలుసుకొన్నవారందరూ నాకు ప్రియులే. కాని జ్ఞాని నాకు అత్యంత ప్రియుడు. శ్రద్ధ, భక్తి లేనివాడు నన్ను తెలుసుకోలేడు. ఏ పురుషుడు నన్ను స్మరిస్తూ మరణిస్తాడో, అతడు నన్నే చేరుకొంటాడు. అర్జునా! నీవు నిరంతరం నన్ను స్మరిస్తూనే యుద్ధం చెయ్యి.

నా సంకల్పం ద్వారా ఉత్పన్నమైన భూతజాలం నాలోనే స్థిరమై ఉంటుంది. నన్ను సగుణ, నిర్గుణ రూపాల్లో, దేవతల రూపాల్లో స్థిరమై నన్ను ఉపాసిస్తుంటారు. క్రతువు నేనే. యజ్ఞాన్ని నేనే. వేదాలు నేనే. సర్వభూతాల శుభాశుభాలను నేను చూస్తుంటా. ప్రళయకారకుడిని నేనే. నాకు మరణం లేదు. నా ఉత్పత్తిని ఎవరూ ఎరుగరు. ప్రాణులకు కలుగు నానా విధాలైన భావాలు నావల్లనే కలుగుతున్నాయి. ఎవరైతే నా అలౌకిక శక్తిని తెలుసుకుంటారో, వారు నాలోనే స్థిరంగా ఉంటారు. ఆది, మధ్యం, అంతం అంతా నేనే. చంద్రుణ్ణి, సూర్యుణ్ణి నేనే. సర్వ భూతాల్లో ప్రకాశించే చైతన్యాన్ని నేనే అని తెలుసుకో. నా విస్తారానికి హద్దు లేదు. నేను అనంతుణ్ణి, సర్వవ్యాపిని, సర్వభూతాల్లో నివసించేవాడిని నేనే. సర్వజగత్తును భరించి, కర్మఫలాల్ని అందించేది నేనే. తల్లిని, తండ్రిని, తాతను, తెలుసుకోదగిన వాడను నేనే. నా అలౌకిక శక్తులు అనంతాలు. మీరెరిగినవి కొన్ని మాత్రమే.

ఇన్ని విషయాలను వినిన అర్జునుడు భగవంతుని విశ్వరూపాన్ని చూడాలని కోరుకొంటాడు. 'నీ శక్తి, బలము, వీర్యము, తేజస్సుతో నిండిన నీ రూపాన్ని చూడాలని వుంది. నేను యోగ్యుడనని నీవు భావిస్తే నీ స్వరూపాన్ని చూపించు' అని అడుగుతాడు. అపుడు శ్రీకృష్ణుడు 'నీవు నీ ఈ కళ్ళతో నా రూపాన్ని చూడలేవు, దివ్య చక్షువుల్ని ప్రసాదిస్తాను. వాటితో ఆ విశ్వరూపాన్ని చూడు.' అని అర్జునునికి దివ్య చక్షువుల్ని ప్రసాదించి, క్షణంలో అనంతాకాశ రూపానికి ఎదిగిపోయాడు. వాటితో ఆ విశ్వరూపాన్ని అర్జునుడు ఇలా చూస్తాడు.

నానా వర్ణములతో అలౌకిక రూపాల్లో అదితి పుత్రులు, వసువులు, రుద్రులు, అశ్వనీ దేవతలు, మరుద్గణాలు అన్నీ చూడగల్గుతున్నాడు. చరాచర జగత్తు ఒక్కటిగా కన్పిస్తోంది. తప బంధుగణమంతా ఆ వరీరంలో కనిపిస్తోంది. అర్జునునికి మనసు తేలికపడింది. అతడు ఇలా అన్నాడు.

'ఓ దేవా! నీ శరీరంలో అనేక సంపూర్ణ దేవతలు, భూతసముదాయం, బ్రహ్మ, మహాదేవుడు, సమస్త ఋషులు, దివ్యమైన సర్పాలు చూస్తున్నాను. రాజసముదాయాలు మీలో ప్రవేశిస్తున్నారు.' అన్నాడు. అపుడు శ్రీకృష్ణుడు – ఈ సమయంలో లోకాలను నాశనం చేయుటకు నా ప్రవృత్తి, నీ ప్రతిపక్ష వీరులెవ్వరు నీవు యుద్ధం చేయకున్నా, వారెవరూ బ్రతకరు. అందుచేత నీవు యుద్ధం చేయి. కీర్తి సంపాదించుకో. – అని అనగా అర్జునుడు ఇలా అన్నాడు.

'ఓ దేవదేవా! ఓ విశ్వస్వరూపా! నీవు ప్రసన్నుడవై నిజరూపం ధరించు. అత్యంత తేజోవంతమైన నీ విశ్వరూపాన్ని చూడడం ఇక నావల్ల కావడం లేదు.' అని అన్నాడు.

అపుడు శ్రీకృష్ణుడు 'అర్జునా! నేను నా యోగశక్తి ద్వారా పరమ తేజోమయ సీమారహిత విరాట్ స్వరూపాన్ని నీకు ప్రదర్శించాను. ఇది ఇతరులకు సాధ్యం కాదు. నా ఈ రూపాన్ని నీవు తప్ప మరెవరు చూచుటకు యోగ్యులు కారు. దేవతలు, ఋషులు ఎప్పుడూ నా ఈ రూపాన్ని చూడాలని కాంక్షిస్తుంటారు. కాని నేను నీకు ప్రసన్నుడనై నా రూపాన్ని ప్రదర్శించాను. నీ కోరిక మేరకు నా యధారూపాన్ని చూడు. భయపడకు' అని ఓదార్చి, తన యధారూపాన్ని చూపించాడు.

ఇది విశ్వరూప సందర్శన యోగం. సాకార నిరాకార భక్తుల్లో శ్రేష్ఠుడెవరు అని అర్జునుడు అడుగుతాడు. కృష్ణుడు – నన్ను ఏకాగ్ర చిత్తంతో ఎవరు ధ్యానం చేస్తారో, వారే ఉత్తమ భక్తులుగా భావించబడతారు. నిరాకారునిగా నన్ను ధ్యానించే భక్తులు కూడ నన్నే పొందుతారు. జ్ఞానం శ్రేష్ఠమైంది. జ్ఞానం కంటే ధ్యానం శ్రేష్ఠం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మహాశ్రేష్టం. కారణం త్యాగం వల్ల తక్షణమే శాంతి లభిస్తుంది. ఆకాశం ఎలా అదృశ్యమవదో, అలాగే ఆత్మ దేహము యొక్క గుణములచే లుప్తము కాదు. సూర్యుడు సకల జగత్తును ఎలా ప్రకాశింపజేస్తాడో, అలాగే ఒక ఆత్మ అన్ని క్షేత్రాల్ని ప్రకాశింప చేస్తుంది. ఎవరైతే ఈ విషయాన్ని తెలుసుకుంటారో, వారు పరబ్రహ్మ స్థితిని పొందుతారు.

సత్వ రజస్తమో గుణాలు మూడూ ప్రకృతినుండి ఉద్భవించాయి. ఇవి జీవాత్మను దేహంలో బంధిస్తున్నాయి. ఈ మూడింటిలో సత్వగుణం నిర్మలం. జ్ఞానంతో కలిసి ప్రకాశిస్తుంది. రజోగుణం కోరికతో ముడిపడి కర్మబంధాల్లో మానవుని తగుల్కొనేట్లు చేస్తుంది. తమోగుణం అజ్ఞానం నుండి ఉత్పన్నమై జీవిని సోమరితనంతో, నిద్రతో బంధిస్తుంది. సత్వగుణంతో చనిపోయినవారు స్వర్గలోకాలకు, రజోగుణంతో మరణించినవారు మానవ లోకాలకు, తమోగుణంతో చనిపోయినవారు పశుపక్ష్యాదుల యోనులలో జన్మిస్తారు.

సంసార రూప వృక్షమైన రావిచెట్టు యొక్క మూలతత్వమును ఏ పురుషుడు తెలుసుకంటాడో, అతడు వేదాల్ని తెలుసుకున్న వాడవుతాడు. అర్జునా! సూర్యునిలోని తేజస్సు, చంద్రునిలోని ప్రకాశం, అగ్నిలోని వెలుగు నేనేనని తెలుసుకో. ఈ పరమ రహస్య జ్ఞానాన్ని నా ద్వారా తెలుసుకొని, నా తత్వాన్ని గ్రహించిన జ్ఞానవంతుడు కృతార్థుడౌతున్నాడు.

అర్జునా! మానవుల్లో దైవాసురులను రెండు రకాల వారున్నారు. అంతఃకరణలో నిర్మలత్వం, ధ్యానయోగంలో స్థిరత్వం, సాత్విక దానం, దమము, గురుపూజ, వేదపఠనము, సంకీర్తనాసక్తి, కోపం లేకుండుట, పరులను నిందించకుండుట మున్నగు ఉత్తమ గుణములు కలిగియున్నవారే ఉత్తమ పురుషులని, వారినే పురుష లక్షణులని గ్రహించవలసి వుంది.

అసుర స్వభావం గలవారు ప్రవృత్తి, నివృత్తి ఎరుగరు. స్త్రీపురుష సంయోగం తప్ప మరేమీ లేదని అంటారు. లోకం భోగములకే అని అంటారు. భ్రష్టమైన ఆచరణలతో, జగత్తు యొక్క వినాశనానికే వీరు జన్మిస్తారు. ఇలాంటి పాపకర్ములను, నరాధములను నేను మళ్ళీ మళ్ళీ అసుర గర్భాల్లోకే తోసేస్తుంటాను

అర్జునా! మానవుడు శ్రద్ధా స్వరూపుడు. సాత్వికుడు, దేవతలను పూజిస్తాడు. రాజసులు యక్షరాక్షసులను, తామసులు ప్రేత, భూతాలను పూజిస్తారు. ఆరోగ్యాన్ని, ఆయుష్షును ఇచ్చే ఆహారం సాత్వికులకు ఇష్టం. పులుపు, కారంతో కూడినవి రాజసులకు ఇష్టం. రసహీనం, దుర్గంధంతో వున్న ఆహారం తామసులకు ఇష్టం.

చివరగా, మోక్ష సన్న్యాస యోగ విశేషాలను శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్తాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల కర్మస్వభావాన్ని బట్టి గుణములను విభజించటం జరిగింది. ఆత్మనిగ్రహం, నాపై శ్రద్ధ, శుచి, వేదాధ్యయనం, పరమాత్మ తత్త్వజ్ఞానం – ఇవి బ్రాహ్మణులకు స్వాభావిక గుణాలు. తేజస్సు, ధైర్యం, శూరవీరత,చాతుర్యం, యుద్ధ విద్య, దానగుణం ఇవి క్షత్రియుల స్వాభావిక గుణాలు. పొలంపనులు, గోరక్షణ, వ్యాపారం వైశ్యుల ప్రధాన గుణాలు. సేవచేయుట శూద్రుల స్వాభావిక కర్మలనబడతాయి.

ఎవరైతే గీతాశాస్త్రాన్ని శ్రద్ధాసక్తులతో పఠిస్తారో, వింటారో, వారు సర్వపాపముల నుండి విముక్తి పొందుతారు. శ్రేష్ఠమైన లోకాలకు వెళ్తారు. అర్జునా! నేను చెప్పినవన్నీ నీవు ఏకాగ్రచిత్తంతో విన్నావా? నీ అజ్ఞాన జనిత మోహం పటాపంచలైందా?' అని అడిగాడు. అపుడు అర్జునుడు 'అచ్యుతా! నీ కృప వలన నా మోహం మాయమైంది. జ్ఞానోదయమైంది. సంశయాలు నశించాయి. ఇప్పటినుండి నీవెలా చేయమంటే అలాగే చేస్తాను.' అని చెప్పాడు. ఇంతటితో భగవద్గీత విశేషాలు సమాప్తమైనాయి.

ఇలా గీతోపదేశాన్ని పొందిన అర్జునుడు యుద్ధానికి కృతనిశ్చయుడై, గాండీవాన్ని చేతిలోనికి తీసుకోగానే, మహారథులందరు ఒక్కసారిగా సంతోషంతో సింహనాదం చేశారు.

యుద్ధానికి సిద్ధమవటం చూచిన ధర్మరాజు తన అస్త్రశస్త్రాలను రథంలోనే వుంచి, శత్రుసైన్యంలో ఉన్న భీష్ముడున్న స్థలానికి వెళ్ళసాగాడు. ధర్మరాజును సోదరులు, ముఖ్య రాజులు అనుసరించారు. ఎందుకు వెళుతున్నాడనేది తెలియదు. కాని శ్రీకృష్ణుడు యుద్ధానికి ముందు ధర్మరాజు భీష్ముని అనుమతి కోసం వెళుతున్నాడని అన్నాడు. ధర్మరాజు తన వైపు రావడం గమనించిన కౌరవ యోధులు ధర్మరాజు భయపడి, భీష్ముని శరణు కోసం వస్తున్నాడని సంబరపడసాగారు. ఈలోగా ధర్మరాజు భీష్మునికి నమస్కరించి, అనుమతి, ఆశీర్వాదం యివ్వమని ప్రార్థించాడు. భీష్ముడు సంతోషించి ఏదైనా వరం కోరుకోమంటే, ధర్మరాజు మృత్యు రహస్యాన్ని చెప్పమని అడిగాడు. అపుడు భీష్ముడు సమయం వచ్చినపుడు మళ్ళీ కలుసుకోమని చెప్పాడు. తరువాత ద్రోణాచార్యుని వద్దకు వెళ్ళి అనుమతి కోరగా, ఏ సలహా కావాలో అడగు అని ద్రోణుడు అన్నాడు.

అప్పుడు ధర్మరాజు ద్రోణునితో 'మిమ్మల్ని జయించే పద్ధతి చెప్పండి. అని అడిగాడు. ద్రోణుడు 'నేను విషాదంతో నిర్భ్రాంతపడిపోతే ధనుస్సును వదలి పెడతాను. అపుడు ఎవరైనా నన్ను చంపవచ్చు' అని అన్నాడు. అలాగే ధర్మరాజు కృపుని, శల్యుని కలిసి, వారి అనుమతి తీసికొన్నాడు. తర్వాత ధర్మరాజు కౌరవ సైన్యాన్ని ఉద్దేశించి – 'మీలో ఎవరైనా మావైపు వచ్చి యుద్ధం చేయాలనుకొంటే రావచ్చును. స్వాగతిస్తాను.' అని అనగానే, దుర్యోధనుడి తమ్ముడు యుయుత్సుడు ఇటువైపు వచ్చి చేరిపోయాడు.

శ్రీకృష్ణుడు కర్ణుని కలిసి 'నీవు భీష్ముడున్నంత వరకు కౌరవుల పక్షాన యుద్ధం చేయలేవు గదా, అటువంటప్పుడు ఇటు వచ్చి పాండవుల పక్షాన యుద్ధం చేయి' అని అడుగగా కర్ణుడు సున్నితంగా తిరస్కరించాడు.

కురుక్షేత్ర సంగ్రామం ప్రారంభం – మొదటి రోజు

ఇక ఇరుపక్షాల వీరుల మధ్య యుద్ధం ఎలా జరిగిందో తెలుసుకొందాం.

భీష్ముని నేతృత్వంలో దుర్యోధనాదులు, భీమసేనుని నేతృత్వంలో పాండవులు ఒక్కుమ్మడిగా తలపడ సాగారు. భీముడు సింహం వలె, ఏనుగు వలె ఘీంకరిస్తూ కౌరవ సేనలను తరమసాగాడు. ఈలోగా, దుర్యోధనాదులు పాండవులపై బాణవర్షం కురిపించ సాగారు. పాండవుల పక్షాన నకుల సహదేవులు ధృష్టద్యుమ్నుడు మున్నగువారు భయంకరంగా యుద్ధం చేయసాగారు. ఇరుపక్షాలు అడుగు వెనక్కు వేయలేదు.

ఆ తరువాత భీష్ముడు, అర్జునుడు రంగంలోకి దిగారు. సాత్యకి కృతవర్మతో భీకరంగా పోరాడుతున్నాడు. ధర్మరాజు శల్యునితో, ధృష్టద్యుమ్నుడు ద్రోణునితో, భీముడు దుర్యోధనునితోను భయంకరంగా పోరాటం సాగిస్తున్నారు. రాక్షసరాజు అలంబసునితో ఘటోత్కచుడు, శిఖండితో అశ్వత్థామ తలపడుతున్నారు. కాలం గడిచే కొద్దీ, యుద్ధం భీకర దృశ్యాన్ని సంతరించుకుంటోంది. భీష్ముని వలన పాండవులు భయానికి గురియైనారు.

మొదటిరోజు ప్రథమార్ధంలో అనేకమంది వీరులు కూలిపోయారు. తర్వాత దుర్యోధనుని ప్రేరణతో కృతవర్మ, దుర్ముఖుడు, కృపుడు, శల్యుడు మరియు వివంశుడు అనే ఐదుగురు అతిరథులతో భీష్ముడు పండవుల సేనలోనికి చొచ్చుకు రాసాగారు. దీన్ని గమనించి అభిమన్యుడు భీష్ముని రథాన్ని తన తీవ్రమైన బాణాలతో పడగొట్టాడు, మిగతా వీరుల్ని చిత్రహింసలు పెట్టాడు. దుర్యోధనుని సారథిని చంపాడు. కృపాచార్యుని ధనుస్సును విరిచాడు. అభిమన్యుని పరాక్రమం అర్జునునితో సమానంగా ఉందని దేవతలు హర్షించారు. భీష్మునితో వచ్చిన అతిరథులు అభిమన్యునిపై ఒక్కసారిగా బాణవర్షం కురిపించారు. కాని అభిమన్యుడు తొణకకుండా బాణాల్ని మధ్యలోనే త్రుంచివేసి, భీష్మునిపై బాణవర్షం కురిపిస్తూ సింహనాదం చేశాడు.

రాజా! అపుడు భీష్ముడు భయంకరమైన దివ్యాస్త్రాలను అభిమన్యునిపై కురిపించాడు. దానిని గమనించి విరటుడు, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు, భీముడు, సాత్యకి మున్నగు మహారథులందరూ అభిమన్యుని రక్షించుటకై పరుగెత్తారు. ఉత్తర కుమారుడు శల్యుని మీదకు వచ్చాడు. కోపించిన శల్యుడు ఒక భయంకరమైన శక్తిని వదలి, ఉత్తరుని చంపి, కృతవర్మ రథంపై ఎక్కాడు. ఉత్తరుడు చనిపోవటంతో క్రోధితుడైన కృతవర్మ శల్యునిపై బాణవర్షం కురిపించాడు. శల్యుడు ఆపదలో ఉన్నాడని గ్రహించిన జయత్సేనుడు, విందుడు మున్నగువారు శ్వేతునిపై బాణవర్షం కురిపించారు. శ్వేతుడు వారి అందరి బాణాలను త్రుంచివేశాడు. వారి శక్తులను కూడ ముక్కలు ముక్కలు చేశాడు. వారి ధ్వజాలను పడగొట్టి, శల్యుని వైపు వెళ్ళాడు. అపుడు కౌరవులు హాహాకారాలు చేయసాగారు. దీన్ని గమనించిన దుర్యోధనుడు భీష్ముని ముందు నిలిచి, శ్వేతుని రథం ముందుకు వెళ్ళి భీష్ముని రక్షించాడు. అపుడు పాండవులందరు వచ్చి శ్వేతుని రక్షిస్తూ, భీష్ముని చుట్టుముట్టారు. అయినా భీష్ముడు చాలమంది రథికులను చంపాడు. శ్వేతుడు కూడ అనేక మంది కౌరవ సైనికులను చంపాడు. నేను కూడా భయంతో మీ ముందుకు వచ్చి బ్రతికాను, లేకపోతే నేనూ చనిపోయి వుండేవాడిని. భీష్ముడు చండప్రచండుడై పాండవ సైన్యాన్ని సంహరించ సాగాడు. శ్వేతుడు అడ్డుతగిలి నష్టాన్ని కొంత తగ్గించగలిగాడు. పాండవ సైన్యం హర్షంతో, కౌరవ సైన్యం నిరాశతో ఉన్నాయి. శ్వేతుడు మిక్కిలి చాకచక్యంతో భీష్ముని ధనుస్సును ముక్కలుగా చేసి, ధ్వజాన్ని విరగగొట్టాడు. పాండవుల ఆనందానికి అవధులు లేవు. శంఖాలు పూరించారు.

దుర్యోధనుని ప్రేరణతో కర్ణుడు, శల్యుడు, వివర్ణుడు భీష్మునికి తోడుగా వచ్చారు. భీష్ముడు శ్వేతుని

నాలుగు అశ్వాలను చంపి, ధ్వజాన్ని విరగగొట్టాడు. శ్వేతుడు ఒక మహాశక్తిని భీష్మునిపై ప్రయోగించాడు. భీష్ముడు దాన్ని ముక్కలు చేశాడు. శ్వేతుడు గద పైకెత్తి భీష్ముని వైపు రాసాగాడు. ఆ వేగాన్ని తట్టుకోలేక భీష్ముడు రథం నుండి దూకాడు. ఆ గద రథంపై పడగా రథం మసి అయిపోయింది. శల్యుని రథాన్ని ఎక్కాడు భీష్ముడు. ఈ లోగా సాత్యకి, భీముడు, అభిమన్యుడు మున్నగువారు శ్వేతుని రక్షణ కొరకు రాసాగారు. కాని ద్రోణుడు, కృపాచార్యుడు వారిని అడ్డగించారు. శ్వేతుడు కత్తితో భీష్ముని ధనస్సును మరల విరగ్గొట్టాడు. భీష్ముడు మరొక ధనస్సు తీసుకొని శ్వేతుని వైపు రాగా, అడ్డువచ్చిన భీముని, అభిమన్యుని, సాత్యకిని, కేకయ రాజు కుమారులను బాణాలతో వేధించి, బ్రహ్మాస్త్రంతో అభిమంత్రించి, శ్వేతకేతునిపై ప్రయోగించాడు. అది అతని ప్రాణాలను హరించింది. కౌరవులు ఆనందంతో గంతులు వేయసాగారు. పాండవులు విషణ్ణ వదనాలతో ఉన్నారు.

శ్వేతుని మరణం తర్వాత కూడా యుద్ధం కొనసాగింది. కృతవర్మతో శల్యుడు యుద్ధానికి తయారవడం చూచి శంఖుడు మండిపడి శల్యునిపై దాడిచేశాడు. శల్యుని రక్షించటానికి కౌరవ రథికులు శంఖునిపై దాడిచేశారు. శంఖుడు వారందరి ధనుస్సులు విరిచి విజయానందం చేయసాగాడు. భీష్ముడు శంఖుని ముందుకు రాగా, అర్జునుడు అతనిని రక్షించేందుకు భీష్మునితో పోరు ప్రారంభించాడు. శల్యుడు అదను చూచుకొని శంఖుని అశ్వాలను చంపాడు. భీష్ముడు అర్జునుని వదలి ద్రుపదుని సైన్యాన్ని సంహరించసాగాడు. ఇంతలో సూర్యాస్తమయం అయింది. సేనలు వెనుకకు మరలాయి.

మొదటరోజు యుద్ధంలో పాండవులు వెనక్కు తగ్గారు. దుర్యోధనుడు సంతోషంతో ఉన్నాడు. ధర్మరాజు దిగులుతో శ్రీకృష్ణునికి తన బాధను చెప్పుకొన్నాడు. అపుడు శ్రీకృష్ణుడు ధర్మరాజును ఓదారుస్తూ, 'ఓ ధర్మజా! నీవు ఇలా శోకించ తగదు. నీ సోదరులు విశ్వవిఖ్యాత ధనుర్ధరులు. నేను, సాత్యకి మీకొరకే ఉన్నాం. విరటుడు, ద్రుపదుడు మున్నగు బలశాలురు నీవైపు వున్నారు. శిఖండి భీష్ముని చంపటానికే ఉన్నాడు. ఈ ఊరడింపుతో ధర్మరాజు కొంత కుదుటపడి, దృష్టద్యుమ్ననితో క్రౌంచారుణమనే వ్యూహాన్ని రచించాలని ఆదేశించాడు.

రెండవ రోజు యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు ధర్మరాజు ఆదేశానుసారం అర్జునుణ్ణి సంపూర్ణ సేనకు అగ్రభాగాన ఉంచాడు. ద్రుపదుడు తనతో పాటు క్రౌంచవ్యూహం యొక్క శిరోభాగాన ఉంటారు. కుంతిభోజుడు మరియు చేది రాజు రెండు కన్నులుగా, కిరాతులు మెడ దగ్గర, నిషాదులు పృష్టభాగాన, రెండు రెక్కలకు భీముడు మరియు ధృష్టద్యుమ్నుడు, సాత్యకి మున్నగువారు దక్షిణ పక్షాన, నకుల సహదేవులు వామపక్షాన నిలిచారు. రెండు వైపుల పెట్టని కోటవలె గజబలాన్ని నిలిపారు. ఈ రకంగా క్రౌంచవ్యూహం రచించి, పాండవులు సూర్యోదయం వరకు ఎదురు చూస్తున్నారు.

రెండవరోజు యుద్ధ వివరాలు :

పాండవులు క్రౌంచవ్యూహాన్ని చూచిన దుర్యోధనుడు భీష్మ ద్రోణులతో కలిసి ఒక మహావ్యూహాన్ని రచించ సాగాడు. కౌరవ సేనకు ముందుభాగాన భీష్ముడు, ఆ తర్వాత ద్రోణుడు, ఆ వెనుక దుర్యోధనుడు తన సోదరులతో, వామపక్షాన శల్యుడు, భగదత్తుడు మరియు దక్షిణాన సుశర్మ, కాంభోజరాజు, పృష్టభాగాన అశ్వత్థామ, కృపాచార్యుడు మొదలగువారిని నిలిపాడు.

దుర్యోధనుడు ఆజ్ఞ ఇవ్వగానే కౌరవ వీరులు పాండవులపై విరుచుకు పడసాగారు. భీష్ముడు అభిమన్యునిపైన,

భీముని పైన, సాత్యకిపైన, ధృష్టద్యుమ్నుని పైన బాణవర్షం కురిపించి, క్రౌంచవ్యూహాన్ని ఛిన్నాభిన్నం చేశాడు. దీన్ని గమనించిన అర్జునుడు శ్రీకృష్ణునిత తమ రథాన్ని భీష్ముని వైపు తీసికొని వెళ్ళమన్నాడు. వెళ్ళగానే భీష్ముడు, ప్రక్కనున్న అతిరథులు అర్జునునిపై బాణవర్షం కురిపించారు.

ఈలోగా పాండవ వీరులందరు అక్కడికి చేరారు. భీష్ముడు అర్జునునిపై ఎనుబది బాణాలను ఒక్కసారిగా ప్రయోగించాడు. అర్జునుడు ఆగ్రహించి, కౌరవసైన్యంలోనికి ప్రవేశించి గాండీవమును ప్రయోగించ సాగాడు. భీష్ముడు అర్జునుని వైపు కదిలాడు. ఇద్దరి బాణాలు మధ్యలోనే మ్కులు ముక్కలు అవసాగాయి. ఇద్దరూ అజేయులే. అంరూ చూస్తున్నారు ఆశ్చర్యంతో.

ద్రోణుడు ధృష్టద్యుమ్నునిపై తీవ్రమైన బాణాలు వేశాడు. కాని మధ్యలోనే వృథా అయిపోయాయి. ద్రోణుని ఒక భయంకర బాణాన్ని ధృష్టద్యుమ్నుడు త్రిప్పికొట్టాడు. ద్రుపద పుత్రుడు ప్రయోగించిన శక్తిని ద్రోణుడు త్రిప్పి కొట్టాడు. ధృష్టద్యుమ్నుని సారథిని, అశ్వాలను చంపివేశాడు. ధృష్టద్యుమ్నుడు గదతో రథం దిగాడు. ద్రోణుడు ఆ గదను ముక్కలు చేశాడు. గమనించిన భీముడు వచ్చాడు. అది గమనించి దుర్యోధనుడు కళింగ సైన్యాన్ని భీమునిపైకి పంపాడు. భీముడు ఆగ్రహంతో కళింగ రాకుమారుని నరికివేశాడు. కళింగరాజు భీముని అశ్వాలను చంపాడు. ఆగ్రహించిన భీముడు ఏనుగు దంతాలను నరికి, ఆ రాజును సంహరించాడు. సైన్యాన్ని ఊచకోత కోశాడు. కళింగ సేనానులు ఎందరో భీముని వలన చంపబడ్డారు. ఈలోగా భీష్ముడు రాగా, సాత్యకి భీష్ముని సారథిని చంపి, భీముని తీసుకొని వెళ్ళిపోయాడు.

రెండవరోజు సాయంత్రం కావస్తూంది. ధృష్టద్యుమ్నుడు ఒంటరిగా అశ్వత్థామను, కృపాచార్యుని, శల్యుని ఎదుర్కొంటున్నాడు. దాన్ని గమనించిన అభిమన్యుడు పరుగున వచ్చి, ఆ ముగ్గురిపై బాణవర్షం కురిపించాడు. దుర్యోధనుని కుమారుడు లక్ష్మణ కుమారుడు అభిమన్యుని ఎదుర్కొంటున్నాడు. భయంకరమైన పోరు సాగింది ఇద్దరి మధ్య. లక్ష్మణ కుమారుడు, అభిమన్యుల పోరు తీవ్రమైంది. దుర్యోధనుడు కొడుకు సాయంకోరి రాగా, ఇటు అర్జునుడు కూడ వచ్చి తన పరాక్రమాన్ని చవిచూపించాడు. భీష్మద్రోణాదులు కూడ అక్కడికి వచ్చి,అర్జునుని ఎదుర్కొన్నారు. అర్జునుడు బాణవర్షం కురిపించాడు. దానితో చీకట్లు ముసురుకొన్నాయి. అర్జునుని ఎదుర్కొనే వీరులెవరూ కౌరవ సేనలో లేకపోయారు. ఇది గమనించిన భీష్ముడు ద్రోణాచార్యుని, ఎలాగూ సూర్యాస్తమయ మయింది కనుక యుద్ధాన్ని విరమింప జేశాడు.

మూడవరోజు : భయంకర యుద్ధం :

భీష్ముడు గరుడవ్యూహం రచించి అగ్రభాగాన తానున్నాడు. దాని నేత్రాల దగ్గర ద్రోణుని, కృతవర్మను నిలిపాడు. శిరోభాగంలో అశ్వత్థామ, కృపాచార్యుని ఉంచాడు. కంఠం వద్ద శల్యుడు, భగదత్తుడు మరియు జయద్రధుడు ఉన్నారు. దుర్యోధనుడు సోదరులతో పృష్టభాగాన ఉన్నారు. విందుడు, అనువిందుడు తోక భాగంలో, మిగిలిన వీరాధివీరులు ఇరుప్రక్కల రెక్కలుగా ఉన్నారు.

అటువైపు, పాండవులు అర్ధచంద్రాకారంలో వ్యూహాన్ని రచించారు. దక్షిణ భాగన భీముడు, వెనుక విరాటుడు, ధృష్టద్యుమ్నుడు మొ॥ వారు ఉన్నారు. ధర్మరాజు ఏనుగుల సైన్యంతో పృష్టభాగాన ఉన్నాడు. ధర్మారాజును వెన్నంటి సాత్యకి, ఉపపాండవులు ఐదుగురు మరియు అభిమన్యుడు కూడ ఉన్నాడు. అర్ధచంద్రాకార వామభాగాన అర్జునుడు శ్రీకృష్ణునితో పాటు విరాజిల్లుతున్నాడు.

యుద్ధం ప్రారంభం కాగానే అర్జునుడు కౌరవ సైన్యాన్ని ధ్వంసం చేయసాగాడు. కౌరవులు పాండవ సైన్యాన్ని తరమసాగారు. ఆ సమయంలో భీముడు, ఘటోత్కచుడు, సాత్యకి మున్నగువారు కౌరవ సేనలను భయంకరంగా తరమసాగారు.

దుర్యోధనుడు వెయ్యిమంది రథికులను తీసికొని ఘటోత్కచుని ఎదిరించసాగాడు. ఘటోత్కచుడు వారినందరిని పారద్రోలాడు. అర్జునుడు చమత్కారంగా యుద్ధం చేస్తూ, అందరిని ఆశ్చర్య పరచాడు. దుర్యోధనుడు భీష్ముని వద్దకు వెళ్ళి మొరపెట్టుకోగా, భీష్ముడు అభయమిచ్చాడు.

విజయగర్వంతో ఉన్న పాండవులకు ఎదురుగా భీష్ముడు వచ్చి పిడుగులా పడ్డాడు. క్షణంలో వేలాదిమంది పాండవ సైన్యం యోధానుయోధులు మరణించారు. రక్తపు టేరులు ప్రవహించ సాగాయి. భీష్ముని వీరత్వాన్ని చూచి భయపడి, పాండవ సైన్యం పరుగెత్తిపోసాగింది.

ఇది గమనించిన శ్రీకృష్ణుడు అర్జునుని ఉత్తేజపరచగా, అర్జునుడు వచ్చి భీష్ముని ఢీకొని, అతని ధనస్సు విరిచాడు. రెండవ ధనుస్సును కూడ విరగగొట్టాడు. మూడవ ధనస్సుతో భీష్ముడు అర్జునుని బాధింపసాగాడు. భీష్ముని సూచన మేరకు ద్రోణుడు, కృతవర్మ, కృపాచార్యుడు మున్నగువారు వచ్చి అర్జునుని ఢీకొట్టసాగారు. అర్జునునికి సాత్యకి సాయంగా వచ్చాడు. భీష్ముడు పాండవ సైన్యాన్ని ఊచకోత కోయసాగాడు. భీష్ముని తెంపరితనాన్ని చూసి భరించలేక, శ్రీకృష్ణుడు చక్రం తీసికొని, రథం దిగి భీష్ముని వైపు నడువసాగాడు. దీన్ని గమనించిన భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించి, తనను చంపమని ప్రార్థించాడు. వెంటనే రథం దిగివచ్చిన అర్జునుడు శ్రీకృష్ణుని బ్రతిమలాడి, తన వీరత్వాన్ని ప్రదర్శిస్తానని శపథం చేశాడు. అదేప్రకారం అర్జునుడు అద్భుత అస్త్ర విద్యను ప్రదర్శించి, సంపూర్ణ కౌరవ సేనను వెనక్కి నెట్టాడు. సూర్యాస్తమయంతో యుద్ధం ముగిసింది.

నాలుగవ రోజు ఉదయం పూట యుద్ధంలో భీష్ముడు, కృపుడు, ద్రోణుడు, దుర్యోధనాదులు ఒక్కసారిగా అర్జునుని మీద విరుచుకు పడ్డారు. దీనిని గమనించిన అభిమన్యుడు వచ్చి వారి భీకరాస్త్రాలను వృథా కావించాడు. భీష్ముడు అర్జునుని లక్ష్యంగా చేసుకున్నాడు. వీరిద్దరి మధ్య జరిగిన తీవ్రమైన ద్వంద్వయుద్ధాన్ని అందరూ చూడసాగారు. ఇటువైపు ఐదుగురు మహారథులు అభిమన్యుని ఎదుర్కొన్నారు. అభిమన్యుడు అందరిని ఎదిరించాడు. దుర్యోధనుని ఆజ్ఞ మేరకు 25 వేల మంది సైనికులు అర్జునుని, అభిమన్యుని చుట్టుముట్టారు. దీనిని గమనించిన ధృష్టద్యుమ్నుడు తన సైన్యంతో వచ్చి చేరాడు. ధృష్టద్యుమ్నుడు సంయముని కుమారుని చంపాడు. ఇందుకు కోపించిన సంయముడు, శల్యుడు ధృష్టద్యుమ్నుని వింటినారిని త్రెంచారు. బాణాలు వేయడం ప్రారంభించారు. అభిమన్యుడు శల్యుని ఎదుర్కొన్నాడు. ఇలా యుద్ధం తీవ్రతరమౌతున్న సమయంలో భీమసేనుడు తన ఎదురుగా దుర్యోధనుడు తన సోదరులతో ఉండటం చూచి గదను ఎత్తాడు. ఇది గమనించిన కౌరవ సోదరులు పారిపోసాగారు. దుర్యోధనుడు కోపంతో మగధ రాజు యొక్క పదివేల గజబలాన్ని భీముని మీదికి పంపాడు. భీముడు రథం దిగి గజబలాన్ని సంహరించసాగాడు. పాండవ బలం, భీమసేనుని వెంట ఉండి రక్షించసాగారు. ఇదిచూచిన మగధ రాజు తన మదగజాన్ని అభిమన్యుని రథంవైపు త్రిప్పాడు. అభిమన్యుడు ఒకే ఒక బాణంతో మదగజాన్ని చంపాడు. మగధ రాజును సంహరించాడు.

ఈలోగా కౌరవ పుత్రులు 14 మంది ఒకేసారి భీమునిపై విరుచుకు పడ్డారు. భీమసేనుడు ఆకలిగొన్న బెబ్బులి వలె ఒకే ఒక్క బాణంతో గరుడుణ్ణి, సేనాపతిని, మూడు బాణాలతో జరాసంధుని కుమారుని,

సుకేశుని మకుటం మరియు కుండలాలతో పాటు ఉగ్రుని, వీరబాహను యమలోకానికి పంపించి వేశాడు. అదేవిధంగా భీముని, భీమరథుని సులోచనుణ్ణి కౌరవ సేనాపతులందరూ చూస్తుండగా చంపివేశాడు.

భీష్ముడు హెచ్చరించగా, భగదత్తుడు వేగంగా వాడియైన బాణాన్ని భీముని ఛాతీలో నాటగా, భీమసేనుడు అచేతనుడై కూర్చుండి పోయాడు. భగదత్తుని సింహనాదం విన్న ఘటోత్కచుడు అక్కడినుండి అదృశ్యమై భయంకరమైన మాయను వ్యాపింపచేశాడు. తాను స్వయంగా గజరాజును ఎక్కివచ్చి భగదత్తుని, అతని ఏనుగును పీడించసాగాడు. ఇది తెలిసి భీష్ముడు, ద్రోణుడు మహారథులను తోడ్కొని ఘటోత్కచునికి ఎదురుగా వెళ్ళారు. వీరినందరిని చూచిన మాయావి ఘటోత్కచుడు పెద్దగా అరిచాడు. భూనభోంతరాళాలు దద్దరిల్లుతున్న వైనం గమనించిన భీష్ముడు యుద్ధం అపితేనే శ్రేయస్కరమని భావించి, యుద్ధ విరమణ ప్రకటించాడు.

అయిదవ రోజు యుద్ధం :

సూర్యోదయం కాగానే, భీష్ముడు మకరవ్యూహాన్ని రచించాడు. పాండవులు శ్యేనవ్యూహాన్ని రచించారు. పాండవులు చూస్తుంగనే భీష్ముడు, ద్రోణాచార్యుడు శ్యేనవ్యూహాన్ని ఛేదించసాగారు. దుర్యోధనునితో పాటు శల్యుడు ఉండటం చూచి, భీమసేనుడు వారిపై ఆక్రమణ చేశాడు. భీమసేనుని బాణవర్షంతో కప్పివేయడం గమనించిన అభిమన్యుడు మరియు ఉపపాండవులు భీమునికి రక్షణగా వచ్చారు. యుద్ధం తీవ్రతరంగా జరుగుతున్నది. భీష్ముడు భీమసేనుని గాయపరచి, ధనస్సును ముక్కలు చేశాడు. ఇది చూచిన సాత్యకి భీష్ముని ఎదుర్కొన్నాడు. భీష్ముడు సాత్యకి రథసారథిని క్రింద పడవేశాడు. సాత్యకి సారథి మళ్ళీ రథం ఎక్కగానే సాత్యకి రెట్టింపు ఉత్సాహంతో కౌరవ సేనను భస్మీపటలం కావించసాగాడు. ఇది గమనించి, దుర్యోధనుడు సాత్యకి పైకి 10 వేల రథికులను పంపాడు. సాత్యకి వారినందరిని చంపి, భూరిశ్రవుని ఎదిరించాడు. భూరిశ్రవుని బాణవర్షానికి, సాత్యకి వెంట ఉన్న సైన్యం అంతా పరుగెత్తారు. దీన్ని గమనించిన సాత్యకి పుత్రులు పదిమంది భూరిశ్రవుణ్ణి బాణాలతో బాధింపసాగారు. భూరిశ్రవుడు వారి ధనస్సులను, తలలను కూడ త్రుంచివేశాడు. సాత్యకి గర్జిస్తూ వచ్చి భూరిశ్రవుని ఎదుర్కొన్నాడు. వీరిద్దరు ఒకరి అశ్వాలను మరొకరు చంపుకున్నారు. సూర్యస్తమయంతో యుద్ధం ఆగిపోయింది.

ఆరవరోజు యుద్ధం :

దుర్యోధనుడు భీష్ముని వద్ద తన బాధను వెళ్ళబోసుకున్నాడు. భీష్ముడు తన సేనను మండలాకారంలో నిలిపాడు. ఇదిచూచిన ధర్మరాజు తన సైన్యాన్ని వజ్ర వ్యూహంలో నిలిపాడు. ఈ వ్యూహాన్ని ఛేదించే తలంపుతో ద్రోణుడు విరాటరాజుతోను, అశ్వత్థామ శిఖండితోను, దుర్యోధనుడు ధృష్టద్యుమ్ననితోనూ, నకుల సహదేవులు శల్యునితోను, ఘటోత్కచుడు భగదత్తునితోనూ, అలంబసుడు సాత్యకితోనూ తలపడ్డారు.

దుర్యోధనుని వైపు రాజులందరు అర్జునునిపై దాడికి దిగారు. వారు అర్జునుని అన్నివైపుల నుండి దిగ్బంధించారు. కోపించిన అర్జునుడు ఇంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. ఫలితంగా రాజులందరూ గాయపడి భీష్ముని శరణు కోరారు. మిగతా సైన్యం అంతా గందరగోళమైంది. విరాటరాజు ద్రోణుని ఎదిరించాడు. విరటుని పుత్రుడైన శంఖుడు ద్రోణుని ఎదిరించాడు. కోపించిన ద్రోణుడు శంఖుని చంపివేశాడు. విరాటరాజు నిరాశతో యుద్ధం నుండి నిష్క్రమించాడు.

శిఖండి అశ్వత్థామపై బాణాలు వదిలాడు. కోపంతో అశ్వత్థామ శిఖండిని రథహీనునిగా చేశాడు. శిఖండి కత్తి, డాలుతో అశ్వత్థామ పైకి కదిలాడు. అశ్వత్థామ శిఖండి కత్తి, డాలును ముక్కలు ముక్కలుగా చేశాడు. శిఖండి ఆలస్యం చేయకుండా, దగ్గరలో ఉన్న సాత్యకి రథం ఎక్కాడు. సాత్యకి అలంబసుని గాయపరిచాడు. అలంబసుడు మాయను ప్రదర్శించి సాత్యకిని బాణవర్షంతో కప్పివేశాడు. సాత్యకి అలంబసుని మాయను ఛేదించాడు అర్జునుని ఇంద్రాస్త్రంతో.

మరొకవైపు దుర్యోధునికి ధృష్టద్యుమ్ననికి పోరు జరుగుతున్నది. ఇద్దరి మధ్య భీకరమైన పోరు జరుగుతున్నది. దుర్యోధనుని అశ్వాలను ధృష్టద్యుమ్నుడు చంపాడు. రథం లేని దుర్యోధనుడు కోపంతో కత్తి, డాలు తీసికొని ధృష్టద్యుమ్ని వైపు పరుగెత్తసాగాడు. అతలోనే శకుని దుర్యోధనుని అడ్డగించి, రథంపై తీసుకొని వెళ్ళిపోయాడు. ఈవిధంగా దుర్యోధనుని పారద్రోలి ధృష్టద్యుమ్నుడు కౌరవసేనను ఊచకోత కోయడం ప్రారంభించాడు.

ఒకవైపు భీమసేనుడు మరియు కృతవర్మ, మరొకవైపు విందానువిందులను ఇరంవాసునితోనూ,భయంకర యుద్ధం జరగుతోంది. అదే సమయంలో ఘటోత్కచుడు భగదత్తునితో యుద్ధం చేస్తూ ముప్పుతిప్పలు పెట్టి అద్భుత శక్తిని ప్రయోగించాడు. భగదత్తుడు ఆ శక్తిని మధ్యలోనే ముక్కలు చేయటం చూచి, ఘటోత్కచుడు యుద్ధం నుండి తప్పుకొన్నాడు.

ఆరవరోజు మధ్యాహ్నం నుండి జరిగిన యుద్ధ వివరాలు :

శృతాయుకు మరియు ధర్మరాజుకు మధ్య భయంకరమైన యుద్ధం జరిగింది. దేవతలు మరియు ఋషులు ప్రపంచ శాంతికొరకు స్వస్తివాచకం పలుకసాగారు. ధర్మరాజు తన కోపాన్ని అణచుకొని, తీవ్రబాణాలతో శృతాయు యొక్క ధనస్సును విరుగ గొట్టాడు అశ్వాలను చంపాడు. శృతాయువు బ్రతుకు జీవుడా యని పారిపోయాడు. ఇతనిని చూచి సైన్యమంతా పరుగెత్తుకు పోసాగారు.

చేకితానునికి మరియు కృపాచార్యునికి మధ్య భయంకర పోరు సాగింది. ఇద్దరూ నేలపైనన కత్తియుద్ధం చేయసాగారు. ఇంతలో కరవీరకుడు వచ్చి చేకితానుని మరియు శకుని వచ్చి కృపాచార్యుని రథాలపై దూరంగా తీసుకొనిపోయారు. దుర్యోధనుని సోదరులు చిత్రసేనుడు, వికర్ణుడు, ధుర్మర్షణుడు అభిమన్యుని ఎదుర్కొనసాగారు. అభిమన్యుడు శరవేగంతో వారిని రథహీనులుగా చూసి, వారిని వదలివేసి, భీష్ముని వైపు కదిలాడు. ఇదిచూచిన అర్జునుడు కూడ భీష్మునివైపు కదిలాడు. అర్జునుడు భీష్మునికి అండగావచ్చిన రాజులను చంపటం ప్రారంభించాడు. భీష్ముడు అవేమీ లెక్కచేయకుండా దగ్గరలో వున్న ధర్మరాజు అశ్వాలను సంహరించాడు. ధ్మరాజు వెంటనే నకులుని రథం ఎక్కాడు. సూర్యాస్తమయంతో ఆనాటి యుద్ధం ముగిసింది.

ఏడవ రోజు యుద్ధం – విశేషాలు :

ఈరోజు పాండవులు శిఖండిని ముందు నిలిపి, భీమార్జునులు రక్షణగా వున్నారు. రథం వెనుక ఉప పాండవులు మరియు అభమన్యుడు ఉన్నారు. తరువాత ధృష్టద్యుమ్నుడు ఉన్నాడు. మధ్యభాగంలో ధర్మరాజుతో పాటు నకుల సహదేవులున్నారు. ఆ తరువాత దృపదుడు, ధృష్టకేతుడు మరియు కేకయ రాజు కుమారులు వున్నారు. వీరందరు ప్రాణాలొడ్డి కౌరవసైన్యంపై దాడిచేశారు.

అటువైపు భీష్ముని ముందు దుర్యోధనాదులు రక్షణగా నిలిచారు. వారి వెనుక ద్రోణుడు, అశ్వత్థామ, ఆ తర్వాత భగదత్తుడు, సుశర్మ మొదలైనవారు సైన్యంతో నిలబడి వున్నారు. భీష్ముడు ప్రతిరజు యుద్ధ వ్యూహాన్ని మారుస్తూ ఉంటాడు. భీకరయుద్ధం ప్రారంభమైంది.

అర్జునుడు శిఖండిని ముందు పెట్టి, భీష్మునితో తలపడ్డాడు. భీముడు కౌరవ వీరులను యమపురికి పంసాగాడు. సాత్యకి, నకుల, సహదేవుల బలపరాక్రమాలకు కౌరవ సేన లొంగిపోవ నారంభించింది. భీష్ముడు, పాండవ వీరులను నిలువరించసాగాడు. అదే సమయంలో శిఖండి భీష్ముని పైకి దూసుకొని వచ్చాడు. భీష్ముడు అపుడు 'ఓ శిఖండీ! నీవు బాణాలు వేసినా, వేయకున్నా, నేను మాత్రం నీపై అస్త్రాలు సారించను." అని అంటూ, పాండవ సైన్యాన్ని మాత్రం హతమార్చసాగాడు భీష్ముడు. పాండవ వీరులు భీష్ముని నిలువరించలేక పోవడం గమనించిన అర్జునుడు శిఖండిని ప్రేరేపించాడు. కృతవర్మ ధృష్టద్యుమ్నుని, భూరిశ్రవుడు భీమసేనుని, వికర్ణుడు నకల సహదేవులను, కృపాచార్యుడు సాత్యకిని, దుర్యోధనుడు అభిమన్యుని, సుదక్షిణుడు ద్రుపదుని, అశ్వత్థామ ధర్మరాజును, ద్రోణాచార్యుడు శిఖండిని నిలువరించడం ప్రారంభించారు. అర్జునుని దుశ్శాసనుడు అడ్డుకొని భీష్ముని వైపు వెళ్ళకుండా చేశారు. దుశ్శాసనుడు భీష్ముని రథం వెనక్కు వెళ్ళి దాక్కొన్నాడు. భీష్ముని వైపు వెళ్తున్న సాత్యకిని, అలంబసుడు అడ్డుకున్నాడు. భీకర యుద్ధం జరిగింది ఇద్దరి మధ్య. సహాయంగా భగదత్తుడు వచ్చాడు. సాత్యకి భగదత్తునిపై దృష్టి కేంద్రీకరించాడు. విరాట, ద్రుపదులు భీష్ముని వైపు వెళ్ళగా, వారిని అశ్వత్థామ ఎదుర్కొన్నాడు. తర్వాత ద్రోణాచార్యుడు పాండవ సైన్యంలోనికి జొరబడి గందరగోళం చేయసాగాడు. అంతలో 10 మంది కౌరవ యోధులు భీముని చుట్టుముట్టారు. భీముడు వాళ్ళకు గుణపాఠం నేర్పాడు. అర్జునుడు సాయంగా వచ్చాడు. దీన్ని గమనించిన దుర్యోధనుడు సుశర్మను పంపాడు. అప్పటికే భగదత్తుడు, కృతవర్మ మున్నగువారు భీమార్జునులను చుట్టుముట్టారు. అర్జునుడు వేలాదిమంది తలలను నరికివేశాడు. సంకుల సమరం జరిగింది.

ఇలా కౌరవ సైన్యంతోపాటు భీష్ముడు, పాండవ సైన్యంతో పాటు అర్జునుడు పోరాటం ఉధృతంగా చేస్తున్నారు. విజయం నిర్ణయించ లేని పరిస్థితిలో ఉంది. భీష్ముడు ఉదాసీనతకు గురియైనాడు. ధర్మరాజుతో 'కుమారా! ధర్మరాజా! నేను ఉదాసీనుడనైనాను. ప్రాణాలపై నాకు ఆశలేదు. శిఖండిని ముందుంచుకొని, అర్జునుడాదిగా గల పాండవ వీరులు నాపై బాణాలు ప్రయోగించాడు.' అని అనగానే, పాండవ వీరులందరు శిఖండిని ముందుపెట్టి, భీష్మునిపై బాణవర్షం కురిపించసాగారు. దీన్ని గమనించిన దుర్యోధనుడు, రాజులు, ద్రోణుడు, అశ్వత్థామ మున్నగు వీరాధివీరులు భీష్ముని రక్షణకై వచ్చారు. శిఖండిని, అర్జునుని చంపుటకు గట్టిగా ప్రయత్నించారు. అభిమన్యుడు దుర్యోధనుని నిలువరించాడు. వేరొక చోట ద్రోణుడు ధృష్టద్యుమ్నునితో పోరాడాడు. వీరిద్దరి మధ్య భయానక యుద్ధం జరిగింది.

అర్జునుడు భీష్ముని తీవ్రమైన బాణాలతో బాధిస్తున్నాడు. సాయపడవచ్చిన భగదత్తుని అర్జునుడు ఎదిరించి, శిఖండిని భీష్ముని వైపు వెళ్ళమని ఆజ్ఞాపించాడు. కౌరవసైన్యాన్ని అర్జునుడు చీల్చిచెండాడసాగాడు. భీష్ముడు అపుడు విశ్వభక్షకుడైనాడు. ఎవరూ సాహసించలేదు. భీష్మునికి రక్షణగా ఉన్న కౌరవ వీరులు పాండవ సైన్యాన్ని చంపుతూనే వున్నారు. అర్జునుడు దుశ్శాసనుని పడగొట్టి విజయకేతన మెగురవేశాడు. శల్యుడు, కృపాచార్యుడు మున్నగువారు పాండవ సైన్యాన్ని తరుమసాగారు. భీష్ముడు కూడ రెచ్చిపోయి విరటుని తమ్ముని చంపాడు. శ్రీకృష్ణుని సంకేతంతో శిఖండిని భీష్మునికి ఎదురుగా నిలిపి, పాండవులందరు భీష్ముని చుట్టుముట్టి ఆయుధాలను

ప్రయోగించసాగారు. అయినా భీష్ముడు పాండవ వీరులతో పోరు సాగిస్తూనే వున్నాడు. బాణాలన్నీ భీష్ముని శరీరంలో నాటుకు పోయాయి. అపుడు భీష్ముడు ఆయుధాలను విడిచాడు. పలుమార్లు భీష్ముని ధనుస్సులను అర్జునుడు త్రుంచివేస్తూనే ఉన్నాడు. భీష్ముడు ప్రయోగించిన శక్తిని అర్జునుడు మధ్యలోనే నిర్మూలించాడు. అపుడు భీష్ముడు తనలో తాను స్వచ్ఛంద మరణమును స్వాగతించాలని తలుస్తూ కత్తి, డాలు తీసుకొని రథం దిగే ప్రయత్నం చేశాడు. కాని అర్జునుడు వాటిని ముక్కలు చేశాడు. భీష్ముని శరీరమంతా బాణాలమయం అయిపోయింది. భీష్ముడు కింద పడగానే, దేవతలు హావహాకారాలు చేశారు. భీష్ముడు నేలపై పడకుండా అర్జునుడు బాణాలతో శరశయ్యను తయారుచేశాడు. ఉత్తరాయణ పుణ్యకాలం వరకు వేచి ఉండాలని భీష్ముడు నిర్ణయించుకొన్నాడు. కౌరవుల దుఃఖానికి అంతులేదు. దుర్యోధనాదులు శోకాకుల చిత్తంతో ఉన్నారు. భీష్ముడు ఉపనిషత్తుల్లో చెప్పిన ప్రకారం యోగధారణను ఆశ్రయించి, ఓంకార జపం చేస్తూ, ఉత్తరాయణ కాలం వరకు నిరీక్షిస్తూ వున్నాడు.

భీష్ముడు రణభూమలో పడిపోయిన వార్త వినగానే, కౌరవులెల్లరు దుఃఖసముద్రంలో మునిగిపోయారు. ద్రోణాచార్యుడు కాసేపు స్పృహ కోల్పోయి తిరిగి తేరుకొన్నాడు. యుద్ధం ఆపివేయబడింది. రాజులందరు నిరాయుధులై భీష్మునికి నమస్కరించి ఎదురుగా నిలబడ్డారు. వారినుద్దేశించి భీష్ముడిలా అన్నాడు. 'ఓ మహారథులారా! మిమ్మల్ని స్వాగతిస్తున్నాను. మిమ్మల్ని చూచి సంతోషిస్తున్నాను. నాకు మెత్తని తలగడ ఏర్పాటు చేయండి' అనగానే రాజులు అతి కోమలమైన, మెత్తని తలగడను తెచ్చి అమర్చబోగా, భీష్ముడు 'ఈ తలగడలు శరశయ్యకు యోగ్యమైనవి కావు.' అని అర్జునుని వైపు చూచి 'అర్జునా! నాకు తలగడ ఏర్పాటు చేయి. నీకు క్షత్రియ ధర్మజ్ఞానం ఉన్నది, నిర్మల బుద్ధి వున్నది. ధనుర్ధరులలో నీవు శ్రేష్ఠుడవు. కావున నీవు నాకు తలగడ అమర్చగలవు.' అని అన్నాడు. అర్జునుడు సరేనని, ఆయన ఆజ్ఞను శిరసావహించి, గాండీవమును ఎత్తి, మూడు బాణములను అభిమంత్రించి, వాటి ప్రయోగము ద్వారా భీష్ముని యొక్క తల స్థాయిని పైకెత్తాడు. దానితో భీష్ముడు ప్రసన్నుడైనాడు. రాజులను చూచి వారితో 'నేనిలాగే శరశయ్యపై ఉత్తరాయణం వచ్చు వరకు పడి ఉంటాను. చివరి ప్రార్థన ఏమంటే మీరందరు సానుకూల నిర్ణయం తీసుకొని యుద్ధం విరమిస్తే, నేను సంతోషిస్తాను.' అని చెప్పాడు.

తదనంతరం, నిపుణులైన వైద్యులు వచ్చి భీష్ముని శరీరం నుండి బాణములను తొలగించుటకు ప్రయత్నించగా, భీష్ముడు వారిని వారించి, వారికి పారితోషికాలు యిప్పించి పంపించివేశాడు. రాజులందరు భీష్మునికి మూడు సార్లు ప్రదక్షిణం చేసి, రెండు చేతులెత్తి నమస్కరించి, తమ తమ శిబిరాలకు వెళ్ళిపోయారు.

తెల్లవారిని తరువాత కౌరవులు, పాండవులు భీష్ముని దగ్గరకు వెళ్ళారు. వేలాదిమంది కన్యలు వచ్చి చందనం, పూలు తెచ్చి పూజించారు. పెద్దలు, స్త్రీలు, పిన్నలు, వాద్యకారులు మున్నగువారు అందరూ భీష్ముని వద్ద కూర్చున్నారు. బాణముల ఒరిపిడి చేత భీష్మునికి మూర్ఛ వచ్చినంత పనై దాహం అని అన్నాడు. వెంటనే చల్లని నీరు, తినుబండారాలు తెచ్చారు. అపుడు భీష్ముడు 'నేనిపుడు మానవలోకం నుండి దూరమై పోయాను. ఈ వస్తువులు ముట్టుకోను. నేనిపుడు అర్జునుని చూడాలనుకొంటున్నాను.' అన అనగానే, అర్జునుడు ముందుకు వచ్చి ఏమి ఆజ్ఞ అని అన్నాడు. 'నాయనా! నీ బాణముల తాకిడి చేత నాకు బాధ రెట్టింపు అవుతోంది. నోరు ఎండింది. నీరు తీసుకొని రా!' అని అడుగగా, అర్జునుడు తన రథం ఎక్కి, గాండీవాన్ని సవరించి, భీష్ముని చుట్టి వచ్చి, ఒక మెరుస్తున్న బాణాన్ని తీసి దానికి పర్జన్యాస్త్రం జోడించి, మంత్రం పఠిస్తూ, భీష్ముని తల ప్రక్కనే నేలమీద ప్రయోగించాడు. ఆ నేలనుండి దివ్య అమృతధార, దివ్యరసయుక్తమైన శీతల ప్రాణధార వెలువడింది. ఆ జలంతో భీష్ముడు తృప్తి పడగా, బాధలన్నీ సమసిపోయాయి.

భీష్ముడు దుర్యోధనుని ఉద్దేశించి, 'ఓ దుర్యోధనా! పాండవులను జయించడం నీవల్ల కాదు. ఇప్పటికైనా వారి అర్ధ రాజ్యం వారికిచ్చి సంధి చేసుకో' అని చెప్పాడు. కాని మరణమాసన్నమైన వ్యక్తికి ఔషధం రుచించనట్లే, దుర్యోధనునికి భీష్ముని మాటలు రుచించ లేదు.

భీష్ముడు పడిపోయిన వార్త వినగానే కర్ణుడు కన్నీటితో భీష్ముని వద్దకు వచ్చి శోకతప్త హృదయంతో 'మహాబాహూ! నేను రాధాపుత్రుణ్ణి. మీ సేవలకు హాజరై వున్నాను.' అనిన విన్న భీష్ముడు కన్నులు విప్పార్చి నీవు రాధాపుత్రడవు కావు, కుంతీపుత్రుడవు అని అంటూ దగ్గరకు తీసుకొన్నాడు. 'కుమారా! నీపై నాకు మొదటినుండి ఏ ద్వేషమూ లేదు. నీవు పాండవుల పట్ల విమర్శలు చేస్తున్నందునే నేను నీతో కటువుగా మాట్లాడాను. నాకు తెలుసు నీవు అవక్రపరాక్రమవంతుడవు, బ్రాహ్మణ భక్తుడవు, దానశీలివి, గుణవంతుడవు, ధనుర్ధరులలో నీవు శ్రీకృష్ణుడంతటి వాడవు. నీవు తలచినట్లయితే, ఈ యుద్ధాన్ని ఆపగలవు' అని భీష్ముడు అన్నాడు. అపుడు కర్ణుడు 'మహాబాహూ! నేను మొదటినుండి దుర్యోధనునికి ఋణపడి వున్నాను. నేను యుద్ధానికే నిశ్చయించుకొన్నాను. నేటివరకు నా చపలత్వం వల్ల ఏమి మాట్లాడినా క్షమించండి.' అన్నాడు.

భీష్ముడు సంతోషించి, కర్ణుడు యుద్ధం చేయుటకు క్షత్రియోచితముగా అనుమతి ఇచ్చాడు. కర్ణుడు భీష్మునికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

-o0o-

7. ద్రోణ పర్వం

భీష్ముడు పడిపోయిన వార్తను విని ధృతరాష్ట్రుడు కన్నీరుమున్నీరైనాడు. సంజయుడు ఇలా అన్నాడు. 'ఓ రాజా! భీష్ముడు పడిపోయాక, కౌరవులు దిక్కులేని వారైనారు. ఇపుడు వారి దృష్టి కర్ణుని వైపు మళ్ళింది. కర్ణుడు ఇలా అన్నాడు. 'భీష్మునిలో వీరోచిత గుణాలున్నాయి. ఆయన లేకపోవడంతో కౌరవుల పరాజయం సులభమైపోయిందని కన్నీరు పెట్టాడు. దుర్యోధనుడు బాధపడసాగాడు. ఇంతలో కర్ణుడు తేరుకుని మీరు ఎవరూ భయపడ నవసరం లేదు. నేను అన్ని బాధ్యతలను భరించి, శత్రువులను జయించటమో, వీరమరణం పొందడమో జరుగునని చెప్పి, ఆయుధాలతో పాటు రథము సిద్ధం చేసుకొని రమ్మని ఆజ్ఞాపించాడు.

కర్ణుడు రథముపై కూర్చొని నేరుగా భీష్ముని వద్దకు వెళ్ళి, ప్రణామం చేసి ఆశీర్వదించమని కోరాడు. భీష్ముడు సంతోషించి ఆశీర్వదించి పంపాడు. కర్ణుని చూచిన కౌరవ సైన్యం జయధ్వనులతో స్వాగతించింది. దుర్యోధనుడు ప్రస్తుతం ఎవరిని సర్వసైన్యాధ్యక్షునిగా నియమించుకోవాలో తెలియ చెప్పమని, కర్ణుని అడుగగా, కర్ణుడు ద్రోణాచార్యులే సర్వ శ్రేష్ఠులు అని చెప్పాడు. వారిని ఓడించగలవారు ఎవ్వరూ లేరు. ఈ మాటలు వినిన దుర్యోధనుడు సంతోషంతో ద్రోణాచార్యుని వద్దకు వెళ్ళి, 'దేవా! విద్యలో, బుద్ధిలో, ఆయువులో, పరాక్రమంలో, జ్ఞానంలో, నీతిలో, తపస్సులో మిమ్మల్ని మించిన వారెవరూ లేరు. మీరు సర్వసేనాధిపతిగా ఉండి, విజయాన్ని ప్రాప్తింపజేయండి.' అని ప్రార్థించాడు. ద్రోణాచార్యుడు సంతోషించి 'రాజా! నీవు చెప్పినట్లు నా సర్వశక్తుల్ని ఒడ్డి యుద్ధం చేస్తాను. కాని ధృష్టద్యుమ్నుని గెలవటం నాకు సాధ్యం కాదు. ఎందుకంటే అతడు నన్ను చంపటానికే జన్మించాడు.' అని చెప్పాడు. అనుకున్న రీతిలో, ద్రోణాచార్యుని సేనాధిపతిగా అభిషేకించాడు. అందరూ జయజయ ధ్వానాల మధ్య దుర్యోధనుని సన్మానించారు.

పదకొండవ రోజు యుద్ధం:- ద్రోణాచార్యుడు సేనాధిపతిగా వ్యూహరచన చేసి దుర్యోధనాదులతో యుద్ధానికి బయలుదేరాడు. ద్రోణుని కిరువైపుల జయద్రధుడు, వికర్ణుడు, కళింగ రాజులున్నారు. వారి రక్షణకై శకుని సైన్యంతో కూడ ఉన్నాడు. అనేకమంది రాజులు తమ సైన్యంతో నడువసాగారు. కర్ణుడు ముందుకు సాగాడు. కర్ణుని చూచి భీష్ముని లోటును సైన్యం మరిచిపోయింది. భీష్ముడు పాండవులను పట్టించుకోలేదు. కాని కర్ణుడు వారి అంతు చూస్తాడని తలచాడు.

ద్రోణుని శకట వ్యూహాన్ని గమనించిన ధర్మరాజు క్రౌంచవ్యూహం పన్నాడు. ఆ వ్యూహానికి ముందు శ్రీకృష్ణార్జునులను నిలిపాడు. అటువైపు కర్ణుడు అర్జునుని చూచాడు. వారిద్దరు ఒకరినొకరు చూచుకొంటున్న సమయంలోనే, ద్రోణుడు దుర్యోధనుని వరం కోరుకోమన్నాడు. ధర్మరాజును ప్రాణాలతో పట్టుకొని నాకు అప్పగించండి అని దుర్యోధనుడు ద్రోణుని కోరాడు. బంధించి ఇవ్వమన్నావు గాని చంపమనలేదేమి అని చెప్పి, ధర్మరాజు అజాతశత్రువైనాడు కదా అన్నాడు.

ద్రోణుడు పాండవ సైన్యాన్ని ఎదిరిస్తూ, ధర్మరాజు వైపు పోసాగాడు. కౌరవసైన్యం జయధ్వానాల మధ్య అర్జునుడువేగంగా వచ్చి అడ్డుకొన్నాడు. ఆ సమయానికి సూర్యాస్తమయం అయింది కనుక ఆరోజు యుద్ధం సమాప్తమయింది.

పన్నెండవ రోజు యుద్ధ విశేషాలు :

ద్రోణాచార్యుడు దుర్యోధనునితో 'ఓ రాజా! నీకు ముందే చెప్పాను. అర్జునుడు తోడుగా ఉన్నంతవరకు ధర్మరాజును చెరపట్టలేం. అర్జునుని దూరం చేయటానికి ఒక ఉపాయం ఉంది. అర్జునుడు ఎవరైనా యుద్ధానికి రమ్మంటే కాదనడు. అందుచేత ఎవరైనా అర్జునుని కవ్వించి దూరప్రాంతానికి తీసికొనిపోతే, ధర్మరాజు లభిస్తాడు. ఈ మాటలు విన్నటువంటి త్రిగర్త రాజు, అతని సోదరులు ఐదుగురు అర్జునుని దూరప్రాంతానికి తీసికొనివెళ్ళి చంపుతామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే వారు 10వేల మంది రథికులతో బయలుదేరారు. సుశర్మ కూడ వారితో కలిశాడు. తమతో యుద్ధం చేయమని సంశప్తకులు కోరారు. తనకు అనుమతి ఇవ్వమని ధర్మరాజును అర్జునుడు కోరాడు. ధర్మరాజు రక్షణ కొరకై పాంచాల రాకుమారుడు సత్యజిత్తును నియమించి, అర్జునుడు వెళ్ళిపోయాడు.

రణరంగానికి అత్యంత దూరంలో సంశప్తకులు తమ రథసైన్యాన్ని అర్ధచంద్రాకారంలో మొహరించారు. వీరిని సమీపించగానే, అర్జునుడు తన దేవదత్త శంఖాన్ని పూరించాడు. నలుదిశల ఆ శంఖధ్వని ప్రతిధ్వనించింది. ఆ శబ్దానికి భయపడిన సంశప్తకులు తేరుకొని ఒక్కపెట్టున అర్జునునిపై విరుచుక పడ్డారు. సుశర్మ, సుబాహుడు మొ॥వారు అర్జునుని ఉక్కిరిబిక్కిరి చేయాలనుకున్నారు. కోపోద్రిక్తుడైన అర్జునుడు సుధన్వుని తల నరికేశాడు.

ఇది చూచిన సైనికులు దుర్యోధనుని సేవ వైపు రుగెత్త సాగారు. కాని త్రిగర్త రాజు వారికి ధైర్యం చెప్పి, మళ్ళీ అర్జునునిపై ఆక్రమణకు పంపాడు. అందులోని నారాయణసేన ఒక్కసారి దాడిచేసి, శ్రీకృష్ణార్జునులను కనపడకుండా చేశారు. వెంటనే అర్జునుడు విశ్వకర్మాస్త్రాన్ని ప్రయోగించి, వారి మాయను పటాపంచలు చేశాడు. మాయతో వేనవేల శ్రీకృష్ణార్జునులను సృష్టించి వారిని అయోమయానికి గురిచేశారు. ఈ విధంగా సంశప్తకులను వ్యామోహపరచి, అర్జునుడు వారిని చంపేశాడు.

అర్జునుడు లేకుండా చూసి ధర్మరాజును బంధించే తలంపుతో, ద్రోణాచార్యుడు గరుడవ్యూహం పన్నాడు కాని దాన్ని ఎదుర్కోవడానికి ధర్మరాజు, మండల వ్యూహాన్ని పన్నాడు. ధర్మరాజును రక్షించే నిమిత్తం ధృష్టద్యుమ్నుడు నేరుగా ద్రోణాచార్యుని ఎదుర్కొన్నాడు. ద్రోణాచార్యుడు దాన్ని అపశకునంగా భావించాడు. అయినప్పటికి ద్రోణుడు పాండవ సైన్యంపై బాణవర్షం కురిపిస్తూనే ఉన్నాడు. ధర్మరాజువ్యూహం చెదిరిపోయింది. అదే సమయంగా భావించి, ద్రోణుడు ధర్మరాజుపై ఆక్రమణ చేశాడు. దీన్ని గమనించిన సత్యజిత్తు వెంటనే అక్కడికి వచ్చి వాడియైన బాణాలతో ఆచార్యుని గాయపరచాడు. ఇద్దరి మధ్య భయంకరమైన పోరు జరిగిది. చివరకు అర్ధచంద్రాకార బాణంతో సత్యజిత్తు తలను నేలకొరిగేట్టు చేశాడు ద్రోణుడు.దీన్ని గమనించిన ధర్మరాజు యుద్ధరంగంనుండి తప్పుకొన్నాడు. ఆ తరువాత ద్రోణుడు శతానీకుని, దృఢసేనుని చంపేశాడు. సాత్యకి కూడ ద్రోణుని నిలువరించ లేక పోయాడు. మిగతా స్థలాల్లో కూడ కౌరవులు పాండవులను వేధిస్తున్నారు. కొద్దిసమయంలోనే పాండవులు పుంజుకొని, ద్రోణుని చుట్టుముట్టారు. ఇది ఇలా ఉండగా, భీముని ఎదుర్కొనడానికి దుర్మర్షణుడు బయలుదేరాడు. సాత్యకి ద్రోణుని బంధిచడానికి ప్రయత్నిస్తుంగా, కృతవర్మ అడ్డుకొన్నాడు.యుయుత్సుని సుబాహుడు ఆపాడు. ఈరకంగా పాండవ పక్ష వీరుందరూ ద్రోణాచార్యుని పైకి దండెత్తారు. కాని కౌరవ వీరులందరు వారిని అడ్డగించారు. ఘటోత్కచుడు అనేకమైన ఆయుధాలను తీసికొని ద్రోణాచార్యుని వైపు పరుగెత్తగా, అలంబసుడు అడ్డగించాడు.

ఓ రాజా! ఆ సమయంలో దుర్యోధనుడు గజబలంతో భీమునిపై వ్యూహం పన్నాడు. అతికొద్ది సమయంలోనే భీముడు వారిని పారద్రోలాడు. దుర్యోధనుడు కోపంతో తన వాడిబాణాలతో భీమసేనుని గాయపరచాడు.

మరుక్షణంలోనే భీముడు బెబ్బులివలె విజృంభించి దుర్యోధనుని ధనుస్సును విరిచి బాధింపసాగాడు. ఇదిచూచి అంగదేశపు రాజ తన ఏనుగును భీమునిపైకి తోలాడు. గమనించిన భీమసేనుడు ఆ ఏనుగును కుల్చివేసి, అంగదేశపు రాజును చంపేశాడు. సైన్యమంతా ప్రాణభయంతో పరుగు పెట్టసాగింది.

తరువాత భగదత్తుడు భీమనిపై ఆక్రమణ చేశాడు. భగదత్తుని ఏనుగు తన కాళ్ళతో, తొండంతో భీముని రథాన్ని, అశ్వాల్ని ఒక్కసారిగా నుగ్గు నుగ్గు చేసింది. భీముడు అతి చాకచక్యంతో ఆ భయంకరమైన ఏనుగు పొట్ట క్రిందికి దూరాడు. భీమునికి విశేష గజవిద్య తెలుసు కనుక దాని పొట్టక్రింద చేరి ఆ విద్యను ప్రదర్శించాడు. కాని ఆ విద్య ఇక్కడ అంతగా పనిచేయలేదు కారణం ఆ ఏనుగు పదివేల ఏనుగుల బలం కలిగి ఉంది. అది భీముని చంపాలని చూసింది. వలయాకారంలో తిరుగుతూ ఆ గజరాజు భీముని తన తొండంతో పడవేసి కాళ్ళతో త్రొక్కనారంభించింది. భీముడు మళ్ళీ దాని పొట్ట క్రిందికి చేరాడు. కొంతసేపుండి, బయటికి వచ్చి అతివేగంతో పరుగెత్తుకు పోయాడు. ఇరుసేనలు భయపడ్డాయి. పాండవసైన్యం భీమసేనుని దగ్గరకు చేరింది.

దాన్ని గమనించిన ధర్మరాజుపాంచాల వీరులను ఉసిగొల్పి భగదత్తుని చుట్టుముట్టారు. దశార్ణరాజు ఏనుగునెక్కి భగదత్తుని ఢీకొన్నాడు. వెంటనే ఏనుగు కూలబడింది. ఇదే మంచి సమయమని, భగదత్తుడు దశార్ణ రాజును చంపేశాడు. భగదత్తుని చుట్టుముట్టిన ధర్మరాజు యొక్క రథ సైన్యం భగదత్తుని బాధించసాగింది. ఈలోగా భగదత్తుడు ఏనుగును సాత్యకి రథంవైపు తోలాడు. ఆ ఏనుగు సాత్యకి రథాన్ని ఎత్తి పడేసింది. సాత్యకి నేర్పుగా తప్పించుకొన్నాఉ. అభిమన్యుడు, చేకితానుడు, యుయుత్సుడు భగదత్తుని ఏనుగును బాధించసాగారు. అది తొండంతో అడ్డుపడిన వారిని విసిరి వేయసాగింది. పాండవసైన్యం భయపడ సాగింది. దాని వేగంతో దుమ్ము ధూళి లేచి ఏమీ కనపడని పరిస్థితి ఏర్పడింది. అర్జునుడు కీడును శంకించి, రథాన్ని మరల్చమనగా సంశప్తకులు తమతో యుద్ధం చేయమని రెచ్చగొట్టారు. అర్జునుడు ఎటూ నిర్ణయించుకోలేక, క్షణకాలంలో అక్కడున్న సంశప్తకులను చంపివేసి, భగదత్తుని దగ్గరకు వచ్చాడు. వాడి బాణాలను, భగదత్తునిపై శక్తిని ప్రయోగించాడు. భగదత్తుడు వాటిని ముక్కలు చేస్తూ, శ్రీకృష్ణార్జునులపై శక్తిని ప్రయోగించాడు. అర్జునుడు ఆ శక్తిని మధ్యలోనే ఛేదిస్తూ, అంగరక్షకులను చంపుతూ, ఏనుగు కవచాన్ని ఛేదించాడు. క్రోధించిన భగదత్తుడు అర్జునుని పైకి వైష్ణవాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రాన్ని శ్రీకృష్ణుడు తనలో ఇముడ్చుకొన్నాడు. దీనిని చూచిన అర్జునుడు 'దేవా! నీవు యుద్ధం చేయనని చెప్పావు. ఎందుకు ఈ అస్త్రాన్ని నిర్జించావు? నీవు నాకు ఎందుకు వదలలేదు? నా శక్తి సామర్థ్యాల మీద నమ్మకం లేదా?' అనగా కృష్ణుడు అర్జునునికి వాస్తవం చెపుతూ ఒక రహస్యం తెలియజేశాడు. 'అర్జునా! పూర్వం పృథ్వీ దేవి తన కుమారుడైన నరకాసురుని కొరకు నానుండి వైష్ణవాస్త్రం ఇప్పించింది. ఆ అస్త్రమే భగదత్తునికి వచ్చింది. దానినుండి ఇంద్రుడు, రుద్రుడు కూడ తప్పుకోలేరు. అందుకే అది నిన్ను తాకకుండా నేను జాగ్రత్తపడ్డాను.' అని చెప్పాడు.

ఆ తర్వాత అర్జునుడు భగదత్తునిపై వాడి బాణాలను గుప్పించి, అర్ధచంద్రాకార వాడిబాణాన్ని ఆ మదపుటేనుగు కుంభస్థలంపై నాటగా, అది నేరుగా లోపలికి పోయి దాని ప్రాణాలు తీసింది. కొండవలె అది క్రింద పడిపోయింది.

శ్రీకృష్ణుడు అర్జునునకు ఒక వాస్తవమైన ఉపాయం ఇలా చెప్పాడు. 'అర్జునా! భగదత్తుని లలాటంపై నున్న పట్టీని తొలగించిన పక్షంలో కనుబొమ్మలు క్రిందికి జారి చూపు ఆనదు. అప్పుడు అతనిని తేలికగా చంపవచ్చును.' అని చెప్పాడు.

అర్జునుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా, భగదత్తుని లలాటంపై ఉన్న పట్టీని త్రెంచి, గ్రుడ్డివాడిగా చేసి, అర్ధచంద్రాకారపు బాణంతో అతని ప్రాణాలు తీశాడు. ఆవిధంగా ఇంద్రుని మిత్రుడైన భగదత్తుడు చనిపోయాడు.

అర్జునుని స్వైరవిహారం : అర్జునుడు భగదత్తుని చంపి, దక్షిణ దిక్కున గాంధార రాజైన సుబలుని పుత్రులు వృషకుడు మరియు అచలుడు ఒకరు ముందుండి, మరొకరు వెనుక నుండి ఆక్రమణ చేయడం చూచి, తన వాడిబాణాలతో వృషణుని సారథిని గాయపరచి, అశ్వాలను చంపేశాడు. ఈ ఇద్దరినీ ఒకే బాణంతో చంపాడు. తన సోదరులు చనిపోవడం గమనించిన శకుని తన మాయాజాలంతో రకరకాల ఆయుధాలను, పక్షుల్ని, జంతువులను సృష్టించి వదిలాడు. అవన్నీ ఒక్కసారిగా శ్రీకృష్ణార్జునుల మీదికి వచ్చాయి. అర్జునుడు తన అస్త్రబలంతో వాటినన్నిటిని తరిమికొట్టాడు. శకుని చీకటిని వ్యాపింపజేశాడు. అర్జునుడు 'జ్యోతిష'" అను పేరుగల అస్త్రంతో ఆ చీకటిని పారద్రోలాడు. అలాగే ఆదిత్యాస్త్రంతో వెలుగులు నింపాడు. ఇక శకుని రణరంగంలో నిలువలేక పారిపోయాడు.

ఆతర్వాత అర్జునుడు కౌరవ సైన్యాన్ని చీల్చిచెండాడటం మొదలుపెట్టాడు. యోధులందరు కర్ణుని గొంతెత్తి పిలుస్తున్నారు. వెంటనే కర్ణుడు వచ్చి తన బాణాలతో అర్జునుని అడ్డగించాడు. అర్జునుడు కర్ణునిపై శక్తిని ప్రయోగించాడు. దానిని కర్ణుడు ముక్కలు చేసేశాడు. అర్జునుడు తన పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించి కర్ణుని అచేతనునిగా చేశాడు.

కర్ణునికి సహాయంగా వచ్చిన అతని ముగ్గురు సోదరులను కర్ణుని ఎదుటనే చంపేశాడు. ఇంతలో సూర్యాస్తమయం కాగా యుద్ధం ఆగిపోయింది.

పదమూడవ రోజు యుద్ధం :

యుద్ధానికి వెళ్ళేముందు దుర్యోధన ద్రోణాచార్యుల మధ్య సంవాదం జరిగింది. అర్జునుడు ప్రక్కన లేని యెడల ధర్మరాజును బంధించ గలనని ద్రోణుడు చెప్పిన మాటలు వినిన, సంశప్తకులు తాము అర్జునునితో పోరాడి, చంపుతామని దక్షిణ దిశకు వెళ్ళారు. అచట అర్జునునికి, సంశప్తకులకు భీకర పోరు సాగింది. ఇక్కడ ద్రోణాచార్యుడు సులభంగా చక్రవ్యూహాన్ని నిర్మించాడు. పరాక్రమశీలురై రాకుమారులను నిలిపాడు. మధ్యలో దుర్యోధనునికి వలయాకారంలో కర్ణుడు, కృపాచార్యుడు మరియు దుశ్శాసనుడు ఉన్నారు. అగ్రభాగాన ద్రోణునితో పాటు జయద్రధుడు, అశ్వత్థామ, 30 మంది కౌరవ సోదరులు, శకుని, శల్యుడు మరియు భూరిశ్రవుడు ఉన్నారు. మిక్కిలి తేజంతో వెలుగొందుతున్న ఆ వ్యూహం పాండవుల పాలిట శాపమైంది. ఆ గొప్ప వ్యూహాన్ని ఛేదించగలవారు పాండవులలో లేరు. వారిని ఛేదించగల అర్జునుడు సంశప్తులతో దూరంగా వెళ్ళిపోయాడు. ముఖద్వారాన ఉన్న ద్రోణుడు, జయద్రధుడు, సైంధవుడు మున్నగువారు భీమసేనుని, సాత్యకిని, ధృష్టద్యుమ్నుని, ద్రుపదుని, నకుల సహదేవులను, ఘటోత్కచుణ్ణి, శిఖండిని నిలువరించారు. ఆ సమయంలో ధర్మరాజు అభిమన్యుని ఉద్దేశించి, 'కుమారా! ఈ చక్రవ్యూహాన్ని ఛేదించగల సందర్భాల్లో, నీవు, అర్జునుడు, శ్రీకృష్ణుడు మరియు ప్రద్యుమ్నుడు తప్ప మరెవరూ ఈ ప్రపంచంలో లేరు. అందుచేత నీవు ఈ వ్యూహాన్ని ఛేదించు' అని అన్నాడు. అపుడు అభిమన్యుడు 'నేను ఛేదించగలను కాని, తిరిగి బయటకు వచ్చే ఉపాయం నాకు తెలియదు' అని చెప్పాడు. అపుడు భీమసేనుడు ఇలా అన్నాడు. 'కుమారా! నేను, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి మొ॥ వారం మేము నీ వెంట ఉంటాము. నీవు వ్యూహాన్ని భంగం చేయగానే మేమందరం ఆ వ్యూహాన్ని ధ్వంసం చేస్తాము' అని అన్నాడు.

అభిమన్యుడు తన రథాన్ని ద్రోణాచార్యుని వైపు మళ్ళించమని సారథిని కోరాడు. అభిమన్యుని వెనుకవైపు పాండవ యోధులందరు చక్రవ్యూహం వైపు నడిచారు. అభిమన్యుడు ద్రోణుని ఎదురుగా నిలిచాడు. రెండు పక్షాలు తలపడ్డాయి. ద్రోణాచార్యుడు చూస్తుండగనే, అభిమన్యుడు చక్రవ్యూహాన్ని ఛేదించుకొని లోనికి ప్రవేశించాడు. కౌరవ యోధులు ఒక్కుమ్మెట్టున దాడిచేశారు. అభిమన్యుడు ధైర్యంతో అందరిని ఎదుర్కొంటూ, కౌరవ సైన్యాన్ని ఊచకోత కోయసాగాడు. దానితో అక్కడ భీభత్సం నెలకొంది. దుర్యోధనుడు అభిమన్యుని ముందుకు వచ్చాడు. దాన్ని గమనించి, దుర్యోధనుని రక్షణ కొరకు అశ్వత్థామ, కృపాచార్యుని, కర్ణుని, కృతవర్మను, శకునిని పంపాడు. వీరందరు వలయాకారంగా ఏర్పడి, అభిమన్యుడిపై బాణవర్షం కురిపించసాగారు. అభిమన్యుడు ధైర్యంగా వారిని ఎదుర్కొన్నాడు. ఈలోగా దుర్యోధనుడు తప్పించుకొని పోవడం, అభిమన్యునికి రుచించలేదు.

అశ్మక రాకుమారుడు వేలాది సైన్యంతో అభిమన్యుని ముట్టడించగా, కోపించిన అభిమన్యుడు తన బాణవిద్యచే అశ్మక రాకుమరుని చంపివేశాడు. సైన్యం దిక్కుతోచక పారిపోసాగింది. ఇక ఆ సమయంలో ద్రోణుడు, కర్ణుడు, శకుని, శల్యుడు మొదలగువారు అభిమన్యుని కట్టడి చేయనారంభించారు. తీవ్రమైన బాణాలను ప్రయోగించారు. అభిమన్యుడు కూడ తన ఆస్త్రవిద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించసాగాడు. అతిరథ మహారథులను ఎదుర్కొని తీవ్రమైన గాయాలకు లోనైనాడు. బాధను అణచుకొని, అభిమన్యుడు అత్యంత శక్తివంతమైన బాణాన్ని కర్ణునిపై ప్రయోగించాడు. ఆ బాణం కర్ణుని కవచాన్ని ఛేదించి, శరీరం గుండా చీల్చుకొని భూమిలోనికి దిగబడింది. కర్ణుడు విలవిలలాడుతున్నాడు. దగ్గరలో ఉన్న శల్యుని అభిమన్యుడు బాణాలతో కప్పివేశాడు. శల్యుని దురవస్థను చూసిన సైన్యం మొత్తం, ద్రోణాచార్యుడు చూస్తుండగానే పారిపోయారు. ఆ సమయంలో దేవతలు, సిద్ధులు, చారణులు, గంధర్వులు, యక్షులు మున్నగువారు అభిమన్యుని యశస్సును కీర్తిస్తున్నారు. ఈలోగా, శల్యుని సోదరుడు తన అన్నకు జరిగిన అవమానం తెలుసుకొని, నేరుగా అభిమన్యుని ఎదుటకు వచ్చి పోరు ప్రారంభించాడు. వెంటనే అభిమన్యుడు శల్యుని సోదరుని అవయవాలను, విడివిడిగా ముక్కలు చేసివేశాడు. ఆ తరువాత, అభిమన్యుడు మండలాకారంలో నర్తిస్తూ, అంతటా తానే, ఎక్కడ చూచినా తానే కన్పించటం మొదలైంది.

జయద్రధుని పరాక్రమం:

అభిమన్యుని సంకుల సమరం గురించి తెలుసుకోవడం, అభిమన్యుడు బాగా రెచ్చిపోయిన సమయంలో దుశ్శాసనుడు ఎదురుగా వెళ్ళితే, అపుడు అభిమన్యుడు 'ఓరీ! నానుండి నీవు వెంటనే వెళ్ళకపోతే, ఈ క్షణమే నీ ఆఖరి క్షణం అవుతుంది' అంటూ, ఒక తేజోవంతమైన బాణాన్ని వదిలాడు. అది దుశ్శాసనుని కంఠభాగాన్ని చీలుస్తూ వెళ్ళిపోయింది. గాయపడి రథంలోపలికి వెళ్ళిపోగా, సారథి రథాన్ని బయటకు తీసుకువెళ్ళాడు.

రాజా! ధర్మరాజు, భీముడు, శిఖండ, సాత్యకి, నకులసహదేవులు, దృష్టద్యుమ్నుడు, విరాటరాజు, మరియు ద్రుపదుడు మున్నగువారు చక్రవ్యూహం ముఖద్వారం దగ్గరకు చేరుకోగానే, కౌరవ యోధులు భయపడి పారిపోయారు. కాని సైంధవుడు (జయద్రధుడు) ఒక్కడే నిబ్బరంగా నిల్చుని పాండవులందరిని ఎదిర్చి నిలువరించాడు. పాండవులను నిలువరించే శక్తి జయద్రదునికి ఎలా అబ్బింది అని ధృతరాష్ట్రుడు అడుగగా సంజయుడు 'రాజా! పాండవులు అరణ్యవాసం చేసే కాలంలో జయద్రధుడు ద్రౌపదిని అపహరించి భీముని చేతిలో అవమానం పాలైనాడు. ఆ అవమానాన్ని తట్టుకోలేక, శంకరుని గురించి తపస్సు చేసి, మెప్పించి, అర్జునుని తప్ప పాండవులందరిని జయించ గలుగు వరాన్ని పొందాడు.' అన్నాడ. జయద్రధుడు ఒంటరిగానే పాండవ సైన్యాన్ని తరిమికొట్ట సాగాడు. అభిమన్యుడు ఏర్పరచుకున్న నిరాటంక మార్గాన్ని తన ఆయుధాలతో నింపేశాడు. భీముడు జయద్రధుని

ధనుస్సు విరగగొట్టగా, జయద్రధుడు భీముని రథ అశ్వాలను చంపేశాడు. భీముడు దిగి సాత్యకి రథం ఎక్కాడు. ఈలోగా అభిమన్యుడు ఉత్తర దిశన గల గజబలాన్ని సంహరించి, పాండవులకు దారి సుగమం చేశాడు. జయద్రధుడు ఆ మార్గాన్ని మూసివేశాడు. పాండవ అతిరథులు, మహారథులు వ్యూహాన్ని ఛేదించుటకు ఎంత ప్రయత్నించినా, జయద్రధుడు తనకు గల వరం ప్రభావంతో నిర్వీర్యం చేస్తున్నాడు. అభిమన్యుడు మహాతేజంతో చక్రవ్యూహంలోని సైనికుల నందరిని సంహరించాడు. ప్రధాన యోధులు మాత్రం అతనిని చుట్టుముట్టి ఉన్నారు. రుక్మరథుడు బీరాలు పలుకుతూ, అభిమన్యునికి ఎదురుగా వెళ్ళి పోరాడ ప్రయత్నించగా, అభిమన్యుడు మొదట రుక్మిరథుని ధనుస్సును త్రెంచి, రెండు భుజాలను, శిరస్సును నేలకూల్చాడు. అతడు చనిపోగానే, అతని స్నేహితులైన వీరయోధులు అభిమన్యునిపై విరుచుకు పడ్డారు. వీరి వీరంగం చూచిన అభిమన్యుడు క్రోధంతో గాంధారాస్త్రాన్ని ప్రయోగించాడు. ఈ అస్త్రం వేలాదిగా రూపొంది శత్రువులను గందరగోళంలో ముంచి, వారి గొంతులు కోసిపారేసింది. ఒక్క అభిమన్యుడే అక్కడ ఉన్న కాల్బలం, రథబలం, అశ్వబలాన్ని, గజబలాన్ని కుప్పకూల్చేశాడు. శత్రువుల హాహాకారాల మధ్య దుర్యోధనుడు అభిమన్యునికి ఎదురుగా వెళ్ళిన మరుక్షణమే, అభిమన్యుడు వేలాది బాణాలను గుప్పించి, తేరుకోకుండా గురిచేయగా, దుర్యోధనుడు భయంతో పారిపోయాడు. ధృతరాష్ట్రుడు 'సంజయా! అభిమన్యుడు ఇలా విజయాలు సాధిస్తూ పోతున్నాడు కదా, అలాంటప్పుడు దుర్యోధనాదులు ఏం ఉపాయం ఆలోచిస్తున్నారు అని అడిగాడు. సంజయుడు 'రాజా! దుర్యోధనుడు పారిపోవటం చూచి, కౌరవ సైన్యం కూడా తలోదిక్కుకు పారిపోసాగారు. అభిమన్యుని పరాక్రమానికి ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ మొదలైనవారే వెనుకంజ వేశారు. కాని దుర్యోధనుని కుమారుడు లక్ష్మణుడు మాత్రం ఎదురొడ్డి నిలిచాడు. అభిమన్యుడు ఒక్క బల్లెంతో లక్ష్మణుని తల తెగటార్చాడు. అభిమన్యుని నరకండి, చంపండి అని దుర్యోధనుడు పెద్దపెద్దగా కేకలు వేయసాగాడు. అపుడు ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, బృహద్బలుడు మరియు కృతవర్మ అను ఆరుగురు మహారథులు అభిమన్యుని చుట్టుముట్టారు. కాని అభిమన్యుడు బెబ్బులి వలె శరపరంపరలను కురిపించి వారిని పారద్రోలాడు.

పద్మవ్యూహంలో అభిమన్యుని స్వైరవిహారం – అభిమన్యుని వధ :

అభిమన్యుడు, కర్ణుడు పోరాడుతూ వుండగా, వారి దేహాలు రక్తంతో తడిసిపోయాయి. కర్ణుని దగ్గర ఉన్న ఆరుగురు వీరులు అభిమన్యుని చికాకు పరిచే ప్రయత్నంతో అతని చేతిలోనే అసువులు బాశారు. అభిమన్యుడు 'క్షురప్ర' అనే బాణంతో అనేకమంది రాకుమారులను హతమార్చాడు. ఈలోగా దుశ్శాసనుని కుమారుడు అభిమన్యునిపై బాణవర్షం కురిపించాడు. అభిమన్యుడు కూడ మరొక బాణాన్ని వేశాడు. అశ్వత్థామ ప్రమాదాన్ని గుర్తించి, తన మూడు బాణాలతో దానిని వమ్ము చేశాడు. అభిమన్యుడు వెంటనే అశ్వత్థామ, శల్యుని ధ్వజాలను పడగొట్టాడు. శకుని దూరంనుండే అభిమన్యునిపై మూడు బాణాలు వేశాడు. అభిమన్యుడు వచ్చిన వారినందరిని చంపుతున్నాడు. ఇపుడు మనమందరం కలిసి అతనిని చంపాలి అని శకుని అన్నాడు. అపుడు కర్ణుడు ద్రోణాచార్యుని సమీపించి, అభిమన్యుని చంపే ఉపాయం చెప్పమని అడిగాడు. అపుడు ద్రోణుడు అభిమన్యుని లాఘవాన్ని ప్రశంసించాడు. అభిమన్యుడు యువకుడు, కవచాలు అభేద్యం. కవచధారణలో నిష్ణాతుడు. నేను నేర్పిందే. అభిమన్యుని ధనుస్సు తుంచితే తప్ప, దేవతలు కూడ ఏమీ చేయలేరు. ఓ కర్ణా! నీవు గొప్ప ధనుర్ధరుడవు కదా! నీవు ఆ పనిచెయ్యి.' అని అన్నట్లుగానే, కర్ణుడు అభిమన్యుని ధనస్సును, కృతవర్మ అశ్వములను, కృపాచార్యుడు రక్షకులను మరియు సారథిని చంపివేశారు. అపుడు కూడ అభిమన్యుడు కత్తి, డాలు తీసికొని ముందుకు దూకాడు. ద్రోణుడు, కర్ణుడు వాటిని ముక్కలు ముక్కలుగా చేసేశారు. ఎటూతోచక, అభిమన్యుడు రథ చక్రం తీసుకొని ద్రోణుని వైపు కదిలాడు. అందరూ కలుసుకొని ఆ చక్రాన్ని కూడా ముక్కలు చేశారు. ఆగ్రహంతో

అభిమన్యుడు గద తీసికొని అశ్వత్థామను కొట్టాడు. ప్రమాదం గుర్తించి, అశ్వత్థామ రథం నుండి దూకి, మూడడుగులు వెనక్కి వేశాడు, తప్పించుకొన్నాడు. కాని ఆ గద తాకిడికి అశ్వాలు, రక్షకులు, మరియు సారథి చనిపోయారు. ఆ దశలో కూడ అభిమన్యుడు కాలకేయుని, అతని అనుచరులైన 77 మంది గదధారులను చంపేశాడు. ఆయా రాజవంశాల 17 మంది మహారథులను, పది ఏనుగులను యమపురికి పంపాడు అభిమన్యుడు.

తరువాత దుశ్శాసనుని కుమారుల రథాల్ని ధ్వంసం చేశాడు. గదాయుద్ధంలో ఇద్దరూ నేలపై పడిపోయారు. అప్పుడే లేస్తున్న అభిమన్యుని తలపై దుశ్శాసన కుమారుడు గదాప్రహారం చేశాడు. మళ్ళీ అభిమన్యుడు స్పృహ కోల్పోయాడు. ఈరకంగా అందదూ కలిసి ద్రోణుడు, కర్ణుడు అభిమన్యుని మరణానికి కారకులైనారు. కౌరవ యోధులు సంతోషపడినా, పాండవులు శోకంలో కూరుకుపోయారు. రణభూమిలో రక్తపుటేరులు ప్రవహిస్తున్నాయి. సాయంకాలం కాగా యుద్ధం ముగిసింది.

అభిమన్యుడు మరణించినందున పాండవ యోధులందరు తమ రథాల్ని వదలి, కవచాలను తీసివేసి, ధనుస్సులను పడవేసి విలపించుచున్న ధర్మరాజు చుట్టూ కూర్చొని అభిమన్యుని స్మరించుకొంటూ ఉన్నారు. ధర్మరాజు విలాపానికి అంతులేకుండా ఉంది. ఆ సమయానికి వేదవ్యాస మహర్షి అక్కడికి వచ్చి విషయం గ్రహించి, ఇలా అన్నాడు. 'ధర్మరాజా! అభిమన్యుడు అసంఖ్యాకమైన వీరుల మదమణచి స్వర్గం చేరుకొన్నాడు. మృత్యువును తప్పించుకొనేవారు ఎవరూ లేరు. ఒకమాట విను. సత్యయుగంలో అకంపనుడు అనే రాజు ఉండేవాడు. అతనికి హరి అను పుత్రుడు వున్నాడు. శౌర్యపరాక్రమాల్లో ఇంద్రునితో సమానుడైనా కూడ, శత్రువులందరూ కలిసి ఆ యువరాజును చంపారు. ఆరోజు శోకాన్ని తొలగించటానికి నారద మహర్షి వచ్చి ఆయనకు ఎన్నో ఉదంతాలు చెప్పాడు. ఆ మహర్షి చెప్పిన మాటలనే నేను నీకు వినిపిస్తాను. అని ఇలా చెప్పసాగాడు. 'పూర్వం సృంజయుడు అనే రాజు తాను కోరుకున్న విధంగా ఒక కుమారుని పొందాడు ఆ కుమారుడు తేజశ్శాలి, శత్రుభీకరుడు, యశస్వి. అంతేకాకుండా తన మలమూత్రాదులనే కాక చివరకు ఉమ్మివేసినా బంగారం అయ్యే వరంతో జన్మించాడు. అతని పేరు సువర్ధష్ఠివి. నిరంతరం బంగారం ఉత్పత్తి అవుతున్నందున రాజ భవనాల దగ్గరనుండి భోజనపాత్రలు, శయనాగారాల వరకు అన్నీ బంగారుమయమైపోయాయి.

ఇలా కొంతకాలం జరిగిన తర్వాత దారిదోపిడీదారులు సువర్ణష్ఠివిని బలవంతంగా ఎత్తుకుపోయి, బంగారం కోసం, ఆ రాకుమారుని చీల్చి చంపి, ఏమీ దొరక్క వెళ్ళిపోయారు. తండ్రి దుఃఖానికి అంతులేదు. ఎవరైనా ఏదో రోజు చావవలసినదే కదా అని చెప్పాడు.

మరొక విషయం: పూర్వం రాజర్షి మరుత్తు యజ్ఞయాగాలు చేసి గొప్పవాడైనాడు. సాక్షాత్తు శంకరుడే అతనికి ఒక సువర్ణగిరి శిఖరాన్ని ప్రదానం చేశాడు. అతని యజ్ఞశాలలో ఇంద్రుడు, బృహస్పతి మరియు ప్రజాపతులు భయపడుతుండేవారు. అతడు వేయి సంవత్సరాలు రాజ్యాన్ని పాలించాడు. అయినా అతనినీ మృత్యువు వీడలేదు. అందుచేత నీవుకూడ శోకించ తగదు.

సంపూర్ణ జగత్తును చాపలా చుట్టిన శిబి చక్రవర్తి కూడ చనిపోయాడు కదా! ఆయన బంగారు నాణేలనే దానం చేశాడు. సర్వజీవులను ప్రాణంగా చూసుకొన్నాడు. పితృవాక్య పరిపాలకుడైన శ్రవణుడు, 14 సంవత్సరాలు సీత లక్ష్మణులతో వనవాసం చేసి, లోకకంటకుడైన రావణుని చంపి, దైవాంశ సంభూతుడైనను శ్రీరాముడు పరంధామమునకు చేరవలసి వచ్చింది కదా!

భగీరథుడు గంగను భూమికి తెచ్చాడు. ఆయన యజ్ఞం చేసినపుడు గంగానదికి ఇరువైపుల బంగారు ఇటుకలను పేర్చి, బంగారు ఆభరణాలను ధరించిన పదిలక్షల మంది కన్యలతో దానం చేయించాడు. ఒక్కొక్క కన్య నాలుగు అశ్వాలు పూన్చిన రథంపై కూర్చొని, తనవెంట వంద చొప్పున ఏనుగులు బంగారు హారాలు ధరించి వెంటరాగా, ముందుకు వెళ్తున్నది. ప్రతి ఏనుగు వెనుక వైపున ఒక వేయి చొప్పున అశ్వాలు, ప్రతి అశ్వం వెనుక వందచొప్పున ఆవులు, ప్రతి ఆవు వెనుక ఒక్కో మేకల మంద ఉండేది. అలా దక్షిణలు ఇస్తుండేవాడు. అయినప్పటికి బ్రహ్మలోకానికి వెళ్ళాల్సి వచ్చింది కదా!

మరొక విషయం: దిలీప మహారాజు కూడ యజ్ఞాలు చేయునపుడు యజ్ఞశాలలోని మార్గాలు బంగారంతో చేయించాడు. ఆరాజు సువర్ణమయ రాజభవనం సర్వకాలాల్లో దేదీప్యమానంగా వెలుగొందుతుండేది. అయినా ఆ రాజు కూడ ఈ భూలోకంలో శాశ్వతంగా ఉండలేకపోయాడు కదా!

యయాతిరాజు దేవయానిని మరియు శర్మిష్ఠను పెండ్లాడినప్పటికిని శాంతి లభించక రాజ్యాన్నంతా హోతలకు, అధ్వర్యులకు, ఉద్గాతలకు ఇచ్చి అడవులకు వెళ్ళి తనువు చాలించాడు కదా!

విచిత్రమైన విషయమేమంటే, యవనాశ్వుని కొడుకు మాంధాత. ఇతని జననం విచిత్రంగా వుంది. ఒకరోజు యవనాశ్వుడు వేటకు వెళ్ళి, దాహమై, నీటిలో వెదుకసాగాడు. కొంతదూరం వెళ్ళగా అది ఒక యజ్ఞశాలగా కనిపించడంతో అక్కడ నేయి కలిపిన నీరు ఉండగా, అది త్రాగిన మరుక్షణమే, అది మంత్రపూత జలం కావడం చేత, అది యవనాశ్వుని పొట్టలో ఒక బాలునిగా రూపుదిద్దుకొంది. అశ్వనీకుమారుడు బాలుని బయటికి తీశాడు. ఇతడు ఎవరి పాలు త్రాగాలి అనే ప్రశ్న ఉదయించగానే ఇంద్రుడు 'మాంధాతా! నా పాలు త్రాగు' అన్నాడు. వెంటనే ఇంద్రుని వ్రేళ్ళనుండి నేయి, పాలు ధారగా వచ్చాయి. అప్పటినుండి ఆ బాలునికి మాంధాత అని పేరు వచ్చింది. పన్నెండు రోజుల్లో పన్నెండు సంవత్సరాల వాడైనాడు. ఆ తర్వాత రాజ్యపాలన చేస్తూ, తాను చేసే యజ్ఞాలలో దేవతలను, అసురులను, మానవులను, యక్షులను, గంధర్వులను, సర్పములను, పక్షులను మరియు ఋషులను భాగస్వాములుగా చేసేవాడు. అయినా ఆ మాంధాత రాజు కూడ ఈ లోకాన్ని విడిచి వెళ్ళాడు.

అంబరీష మహారాజు కూడ మృత్యువును వరించాడు. ఈయన ఒక్కడే ఒంటరిగా 10 లక్షల మంది యోధులతో యుద్ధం చేసేవాడు. అలాగే శశిబిందుడు లక్షమంది భార్యలను కలిగి ఉండి, ఒక్కో భార్య ద్వారా వేయిమంది సంతానాన్ని పొందాడు. అయినాకూడా ఆయన దివ్యలోకాలకు వెళ్ళవలసి వచ్చింది. గయుడు వంద సంవత్సరాలు అగ్నిహోత్రం చేశాడు. అందుచేత అతనికి అగ్నిహోత్రుని ఆశీస్సులు లభించాయి. అయినా మృత్యువాత పడక తప్పలేదు. రంతిదేవుని వలె కుబేరుని వద్ద కూడ ధనరాశులు ఉండేవి కావు. అంతటివాడు కూడ మరణానికి స్వాగతం పలకాల్సి వచ్చింది.

దుష్యంతుని కొడుకు భరతుడు కూడ ఈ లోకాన్ని విడిచాడు కదా! భరతుడు చిన్నప్పుడే సింహాలను లాక్కొని పోయేవాడట. పాముల కోరలు పీకటం, ఏనుగులను అదుపులో పెట్టడం, సింహాల గుంపును అదుపు చేయడం, వీటిని చూచిన ఋషులు భరతునికి సర్వదమనుడని పేరు పెట్టారు. పృథు అనే రాజు ఈ నేలను సేద్యయోగ్యంగా చేయడంతో ఆయనకు పృథు అను పేరు స్థిరమైంది. ఆబాలగోపాలము యొక్క మన్ననలు పొందిన పృథు కూడ మింటికి ఎగశాడు కదా!"

ఈ విషయాలన్నిటిని, వ్యాసమహర్షి చెప్పగా, ధర్మరాజు శోకాన్ని విస్మరించి, శాంతచిత్తుడైనాడు.

వ్యాసమహర్షి అంతర్ధానమైనాడు. అభిమన్యుని మరణం అర్జునునికి తీవ్ర విషాదకారణమైంది.

అర్జునుడు జయద్రధుని చంపుటకు ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ విషయాలు తెలుసుకొందాం.

అర్జునుడు సంశప్తకులను నాశనం చేసి, శ్రీకృష్ణునితో కలిసి శిబిరానికి వచ్చాడు. దారిలో కొన్ని అపశకునములు చూడగా, అర్జునుడు ఖిన్నుడైనాడు. అభిమన్యునకు తాను వెలుపలికి వచ్చే ఉపాయం చెప్పలేదు. ఏమి జరిగిందోనని చూడగా, పాండవులందరు వ్యాకుల చిత్తంతో కనిపించారు. పుత్రశోకంతో పీడితుడైన అర్జునుని శ్రీకృష్ణుడు అనునయిస్తూ ఇలా అన్నాడు. 'అర్జునా! యుద్ధంలో పలాయనం చేస్తే మనం బాధపడాలి కాని వీరస్వర్గం అలంకరించిన వారికోసం కాదు.'

అర్జునుడు వివరాలు కోరగా ధర్మరాజు ఇలా చెప్పసాగాడు. 'అర్జునా! నీవు అటు వెళ్ళగానే ద్రోణుడు ఇక్కడ పద్మవ్యూహం రచించాడు. దానిని ఛేదించమని, తన శక్తి ఎవరికీ లేదని. అందుచేత అభిమన్యుని ఛేదించమని, మేమందరం తన వెంట వస్తామని చెప్పాము. శంకరుని వరప్రభావంతో జయద్రధుడు మమ్మల్ని ఆపాడు. అభిమన్యుడు వ్యూహాన్ని ఛేదించుకొని వెళ్ళి చండ్రప్రచండుడై విజృంభించాడు. ఆ ఒక్కడిని ఆరుగురు అతిరథ మహారథులైన ద్రోణ, కర్ణ, కృప, అశ్వత్థామ, బృహద్బల మరియు కృతవర్మ ఎదుర్కొన్నారు. అయినా అభిమన్యుడు వారినందరిని ఎదిరిస్తూ, వేయి ఏనుగులను, అశ్వాలను మరియు రధులను పరలోకానికి పంపాడు. ఆ తర్వాత 2000 మంది రాజకుమారులు మరియు అనేకమంది అపూర్వ వీరులను, తుదకు బృహద్బలుని కూడ స్వర్గలోకానికి పంపించాడు. అనేకసార్లు వ్యూహాన్ని ఛేదిస్తూ, మా కొరకు మార్గాన్ని సుగమం చేసినా, ప్రతిసారీ మమ్మల్ని జయద్రధుడు అడ్డుకొన్నాడు. చివరలో దుశ్శాసనుని కుమారుని గదాఘాతానికి అభిమన్యుడు నేలకొరిగాడు.'

ఈ వృత్తాంతం విని అర్జునుడు మూర్ఛపోయాడు. కొంతసేపటిలోనే తేరుకొని ఇలా ప్రతిజ్ఞ చేశాడు. 'రేపు యుద్ధంలో సూర్యాస్తమయంలోగా నేను జయద్రధుని చంపకపోతే, నేను అగ్నికి ఆహుతి అవుతాను. దేవతలు, అసురులు, మానవులు, నాగులు, పితరులు, బ్రహ్మర్షులు, దేవర్షులు మరియు ఈ చరాచర జగత్తు ఏకమైనా సరే, నానుండి జయద్రధుని ఎవరూ రక్షించలేరు.'

ఈ విషయం తెలుసుకున్న జయద్రధుడు దుర్యోధనుని వద్దకు పోయి మొరపెట్టుకొన్నాడు. దుర్యోధనుడు వానిని తీసికొని ద్రోణుని వద్దకు వెళ్ళాడు. నేను శకట వ్యూహం రచించి, రక్షిస్తానని భయపడవద్దని ద్రోణుడు ధైర్యం చెప్పాడు.

శ్రీకృష్ణుడు, సుభద్ర, ఉత్తర మరియు ద్రౌపది వద్దకు వెళ్ళి ఊరడించాడు. ఆరోజు రాత్రి, అర్జునునికి ఒక కల వచ్చింది. అందులో శంకరుడు ప్రత్యక్షమై పాశుపతాస్త్రాన్నిచ్చాడు. తెల్లవారి ఈ కల శ్రీకృష్ణునికి చెప్పగా, అంతా శుభమే జరుగుతుందని శ్రీకృష్ణుడు చెప్పాడు.

ఆ తరువాత అందరూ ధర్మరాజు అనుమతి తీసుకొని, కవచాలు ధరించి, యుద్ధరంగానికి వెళ్ళుటకు సిద్ధపడ్డారు. అందరి ముఖములపై దివ్య కాంతులు ప్రకాశిస్తున్నాయి. అత్యంత కీలకమైన ధనుర్ధరుడు అర్జునుడు మావెంట ఉన్నాడని పాండవ సైన్యం రెట్టింపు ఉత్సాహంతో ఉరకలు వేస్తూ, గంభీరంగా సముద్రం వలె కదిలింది.

ద్రోణాచార్యుడు కౌరవసేనను శకటవ్యూహంలో జయద్రధుని నిలిపి, అతనితో ఇలా అన్నాడు. 'నీవు, భూరిశ్రవుడు, కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు మరియు కృపాచార్యుడు ఒక లక్ష అశ్వికులను, అరవై వేల రథికులను,

14 వేల గజారోహకులు మరియు 21 వేల కాల్బలమును తీసికొని ఆరు క్రోసుల దూరాన ఉండండి. మీవద్దకు వచ్చే వీరుడుండడు. ఎందుకంటే ఈ శకట వ్యూహం 24 క్రోసుల పొడవు, 10 క్రోసుల వెడల్పు, దాని వెనుక పద్మగర్భమను అభేద్య వ్యూహం వుది. ఆ పద్మగర్భవ్యూహంలో రహస్యంగా సూచీముఖవ్యూహం ఉంది. ఇక్కడ కృతవర్మను నిలిపాను. ప్రధాన ముఖద్వారం వద్ద తానే ఉంటానని ద్రోణాచార్యుడు చెప్పాడు.

ఇక పాండవుల వైపు నకులుని కుమారుడు శతానీకుడు, ధృష్టద్యుమ్నుడు కృష్ణునితో కలిసి వ్యూహ రచన చేశాడు. అగ్రభాగాన అర్జునుడు శంఖం పూరించాడు. శ్రీకృష్ణుడు కూడ పాంచజన్యం పూరించాడు. ఇద్దరి శంఖనాదాల్ని విన్న కౌరవ సైన్యం భయభ్రాంతుల్లో చిక్కుకు పోయింది. కౌరవ పక్షాన దుర్మర్షణుడు గజబలాధిపతిగా ఉన్నాడు. దాన్ని చీల్చుకొని వ్యూహం సవరించమని అర్జునుడు శ్రీకృష్ణుని రథం అటుపోనివ్వమన్నాడు. అటువైపు రథం తిరగగానే భీకర యుద్ధం ప్రారంభమైంది.

అర్జునుడు ఒక్కసారిగా సవ్యసాచియై శరపరంపరలతో వీరుల తలలను, అశ్వాల తలలను, ఏనుగుల తొండాలను ఒక్కపెట్టున క్రింద పడవేయసాగాడు. ఎటుచూచినా అర్జునుడే. అతని పరాక్రమమే కన్పిస్తోంది. దుర్మర్షణుడు సైన్యంతో సహా పారిపోయాడు. దుశ్శాసనుడు కూడ తన గజబలంతో పారిపోయాడు. అర్జునుడు జయద్రధుని చేరాలంటే, ముందుగా ద్రోణాచార్యుని జయించాలి. కావున ద్రోణుని సైన్యాల వైపు మళ్ళాడు. ద్రోణుడు తీవ్ర బాణాలు అర్జునునిపై వేశాడు. వాటిని మధ్యలోనే అర్జునుడు అడ్డుకొని, తీవ్రబాణాలను ద్రోణునిపై సంధించాడు. ఆ తరువాత ద్రోణుడు విషాగ్ని బాణాలతో శ్రీకృష్ణుని, అర్జునుని చీకాకు పరచాడు. కోపంతో అర్జునుడు ద్రోణుని సైన్యాన్ని ఊచకోత కయసాగాడు. అర్జునుని నిరోధించటానికి ద్రోణుడు బాణ పరంపరతో కప్పివేశాడు. ఇలా యుద్ధ తీవ్రత పెరగడం చూచి, శ్రీకృష్ణార్జును లిద్దరూ ఆలోచించి, ద్రోణుని వదలిపెట్టి, జయద్రధుని వైపుకు మళ్ళారు. నన్ను జయించకుండా ఎక్కడికి అని ద్రోణుడు అడుగగా, 'ఆచార్యా! మిమ్మల్ని జయించడం ఎవరి వల్లా కాదు' అని అంటూ కౌరవ సైన్యం లోనికి జొరబడ్డాడు.

అర్జునుని కృతవర్మ నిరోధించాడు. శ్రీకృష్ణుని సలహా మేరకు అర్జునుడు కృతవర్మకు స్పృహలేకుండా చేసి, ముందుకు సాగాడు. అర్జునుడు వేలాది బాణాలతో శృతాయుధుని సారథుని, అశ్వాలను చంపేశాడు. శ్రుతాయుధుడు శక్తివంతమైన గదను తీసికొని అర్జునుని వైపు సాగాడు. ఇక్కడ శ్రుతాయుధుని గురించి తెలుసుకోవాలి. ఇతడు వరుణుని పుత్రుడు. మహానదియైన పర్ణాశ ఇతని తల్లి. ఆమె కోరిక మేరకు వరుణుడు శృతాయుధునికి మరణం లేకుండునట్లు వరం ఇస్తూ, అభిమంత్రించిన ఒక గదను కూడ శృతాయుధునికి ఇచ్చాడు. కాని ఒక షరతు పెట్టాడు. ఈ గదను యుద్ధము చేయని వారిమీదకు ప్రయోగిస్తే, అది తిరిగివచ్చి నిన్నే చంపుతుంది. విషయం తెలిసికూడా శృతాయుధుడు అతి కోపంతో ఆ గదను శ్రీకృష్ణునిపై ప్రయోగించాడు. అది తిరిగివచ్చి, శ్రుతాయుధుని చంపివేసింది. దీన్ని గమనించిన కౌరవ సైన్యం పారిపోసాగింది. ఆలోపుగా సుచక్రిణుడు, శతాయువు, అచ్యుతాయుడు, నియతాయుడు మరియ దీర్ఘాయుడు అపరిమిత సైన్యంతో వచ్చి, అర్జునునితో యుద్ధం చేసి, రణభూమిలోనే ప్రాణాలు వదిలారు. ఆ పిదప అర్జునుడు రణరంగంలో నాట్యం చేయసాగాడు. సూర్యాస్తమయం కావస్తోంది. శ్రీకృష్ణార్జునులు జయద్రధుని వైపు కదిలారు. కౌరవసైన్యాన్ని చీలుస్తూ, మార్గం సుగమం చేయగా, శ్రీకృష్ణుడు రథాన్ని తోలుతున్నాడు. మార్గమధ్యంలో అసంఖ్యాక ఏనుగులు, అశ్వాలు, మానవ మృతదేహాల, ముక్కలైన రథాలు – వీటన్నింటిని దాటుకుంటూ వెళ్తున్న అర్జునుని రథాశ్వాలు అలసిపోయినవని శ్రీకృష్ణుడు అర్జునునితో అన్నాడు. జయద్రధుని చేరాలంటే చాలదూరం ఉంది. అశ్వాలు అలసిపోయాయి.

కనుక వాటికి విశ్రాంతి, ఆహారం, నీరు అవసరమై ఉంది. అపుడు అర్జునుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. 'దేవా! నేను రథం దిగి కౌరవసేనను చూచుకొంటాను. నీవు ఈ అశ్వాల సంగతి చూడు.' అని రథం దిగి మేరుపర్వతంలా నిల్చున్నాడు. ఇదే అదను అనుకొని, కౌరవ సైన్యం విరుచుకు పడింది. కాని వారినందరిని అర్జునుడు అడ్డుకొని తన అస్త్రముల ద్వారా భూమిని చీల్చి ఒక అందమైన సరోవరాన్ని రప్పించాడు. ఆ సరోవరం స్వచ్ఛ జలాలతో అందంగా ఉంది. ఒక్క క్షణంలో ఏర్పడ్డ ఆ సరోవరాన్ని చూడాలని నారద మహర్షి అక్కడికి వచ్చాడు. ఆ తర్వాత అర్జునుడు తన బాణాలతో ఒక అద్భుతమైన ఇంటిని నిర్మించాడు.

అర్జునుని ఈ పరాక్రమాన్ని చూచిన సిద్ధులు, చారణులు మరియు సైనికులు ప్రశంసించ సాగారు. విశేషమేమంటే – నేలపై నిల్చుని ఉన్న మహాయోధుడు అర్జునుని ముందు మహామహారథులు కూడ తలలు వంచుకొని నిల్చున్నారు. వారెవరూ అర్జునుని కదల్చలేక పోయారు. శ్రీకృష్ణుడు అశ్వాలను బాణములతో నిర్మించిన ఇంటికి తీసుకొని వెళ్ళి, వాటి శ్రమను, దుఃఖాన్ని, ఆవేదనను మరియు గాయములను తగ్గించాడు. శ్రీకృష్ణ భగవానుడే ఆ అశ్వాలను నీటివద్దకు తీసికొని వెళ్ళటం, స్నానం చేయించటం మరియు గడ్డిని ఆహారంగా అందించటం అన్నీ కూడ తానే స్వయంగా ఎంతో ప్రేమతో చేశాడు.

ఆ తరువాత రథము సిద్ధం చేసి అత్యంత వేగంతో జయద్రధుడున్న ప్రదేశానికి నడిపించాడు భగవానుడు. కౌరవ పక్షీయులు చూస్తూ మిన్నకుండిపోయారు. జయద్రధుని వైపు వెళ్తున్న అర్జునుని దుర్యోధనుడు అడ్డుకొన్నాడు. మంత్రపూతమైన కవచాన్ని ద్రోణుడు దుర్యోధనునికి ధరింపచేశాడు. అందుచేత దుర్యోధనుడు రథంపై ధైర్యంగా బాణవర్షం కురిపించసాగాడు. అర్జునుడు చాకచక్యంతో వాటిని త్రిప్పికొడుతూ, మరిన్ని బాణాలను వేయసాగాడు. శ్రీకృష్ణుడు 'అర్జునా! వజ్రపాతంలాంటి నీ బాణాలు ఎందుకు వ్యర్థం చేస్తున్నావని అర్జునుని అడిగితే 'దేవా! దుర్యోధనుడు అతని కవచంలో ముల్లోకాల శక్తిని నిహితం చేశాడు. అది అస్త్రాలతో భేదింపబడదు' అని అర్జునుడు చెప్పాడు. ఆ రహస్యం ఒక్క ద్రోణాచార్యునికే తెలుసు. నాకు కూడ ఉపదేశించాడు. ఇంద్రుడే స్వయంగా వజ్రాయుధం ప్రయోగించినా అది చెక్కు చెదరదు. దేవా! అన్నీ తెలిసిన నీవు నన్ను అడుగుతున్నావు తప్ప వేరేమీ కాదు. అయినా దుర్యోధనుని కవచాన్ని నేను ధరిస్తాను చూడు' అంటూ ఎంతో ఆత్మవిశ్వాసంతో అర్జునుడు నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. అశ్వత్థామ ఆ నారాయణాస్త్రాన్ని ఖండించాడు. ఇలా కాదని అర్జునుడు క్షణకాలంలో దుర్యోధునుని అశ్వాలను, రక్షకులను చంపివేశాడు. దుర్యోధనుడు ఆపదలో వున్నాడని, చాలమంది కౌరవవీరులు అర్జునుని చుట్టుముట్టారు. వీరిలో ఎనిమిదిమంది మహారథులున్నారు. వారు భూరిశ్రవుడు, శల్యుడు, కర్ణుడు, వృషసేనుడు, జయద్రధుడు, కృపాచార్యుడు, శల్యుడు మరియు అశ్వత్థామ. వీరితో పాటు దుర్యోధనుడు కూడ బాణవర్షం కురిపిస్తూ వున్నాడు. అర్జునుడు రెట్టింపు ఉత్సాహంతో వారినందరిని నిలువరించాడు.

శకట వ్యూహ ముఖద్వారం వద్ద, సహదేవుడు దుర్ముఖునితోను, సాత్యకి వ్యాఘ్రదత్తునితోను మరియు భీముడు అలంబసునితోను పోరులో ఉన్నారు. భీముడు అలంబసుని గాయపరచగా, అతను పాండవ సైన్యాన్ని నష్టపరచ సాగాడు. నా సోదరుడైన బకుణ్ణి చంపావు కనుక నీపై నేను పగ తీర్చుకొంటానని చెప్పి అలంబసుడు అక్కడినుండి అదృశ్యమైనాడు. భీమసేనుడు ఆకాశాన్నంతా బాణాలతో కప్పివేశాడు. అలంబసుడు అనేక విధాలైన మాయారూపాల్లో భీముని పోరాట విన్యాసాలు చూస్తున్నాడు. గొడ్డళ్ళు, బరిసెలు, రంపాల వర్షం కురిపించాడు. పాండవ సైన్యం దీనితో నష్టపడ సాగింది. బాగా కోపించిన భీమసేనుడు విశ్వకర్మాస్త్రాన్ని ప్రయోగించాడు. దీనితో రాక్షస మాయ అంతరించి పోవడమే కాకుండా వేలాది అస్త్రాలుగా రూపొంది అలంబసుణ్ణి పీడించసాగాయి.

ఈ బాధనుండి తప్పించుకోవడానికి అలంబసుడు ద్రోణుని సైన్యంలో చేరాడు. కాని ఘటోత్కచుడు అలంబసునిపై తీవ్రమైన బాణాలు వేయసాగాడు. ఇద్దరి మధ్య భీకర మాయాయుద్ధం జరిగింది.. అలంబసుడు ఆ మాయలన్నీ పటాపంచలు చేయసాగాడు. సమీపంలో వున్న నకుల సహదేవులు, ధర్మరాజు, భీమునితో బాటు అలంబసునిపై విరుచుకు పడ్డారు. ఘటోత్కచుడు అలంబసుని త్రిప్పి త్రిప్పి నేలకేసి కొట్టాడు. రాక్షస సైన్యం పారిపోయింది.

మరొకవైపు సాత్యకి విజృంభణను చూచి, ద్రోణుడే స్వయంగా ఎదుర్కొన్నాడు. కౌరవ కోలాహలం చూచి, ధర్మరాజు సాత్యకిని అర్జునుని వద్దకు వెళ్ళమని చెప్పాడు. ధర్మరాజు రక్షణ బాధ్యత తనకు అప్పగించినందున మొదట ఒప్పుకోలేదు. కాని రాజాజ్ఞను ధిక్కరించరాదు కదా! అర్జునుని చేరుకోవటానికి సాత్యకి కౌరవ సైన్యంలో ప్రవేశించాడు. కృతవర్మ సాత్యకిని అడ్డగించాడు. కాని కృతవర్మ సైన్యాన్ని సాత్యకి హింసలపాలు చేశాడు. జలసంధుడు అపారమైన సైనిక బలంతో సాత్యకిని ఎదిర్చాడు. సాత్యకి తీవ్రమైన బాణాలతో జలసంధుని వక్షస్థలాన్ని ఛేదించి చంపేశాడు. సాత్యకి వేగానికి అడ్డుకట్ట వేయాలని ఎందరో కౌరవ యోధులు ప్రయత్నించి విఫలులైనారు. సాత్యకి అర్జునునికి దగ్గరగా వచ్చాడు. ధర్మరాజు కీడు శంకించాడు. అర్జునునికి, సాత్యకికి ఏదో జరగబోతోందని భయపడ్డాడు. ధర్మరాజు విషాదానికి కారణమేమని భీమసేనుడు అడిగాడు. విషయం తెలుసుకున్న భీముడు ధర్మరాజుకు ధైర్యం చెప్పి ఇలా అన్నాడు. 'నేను వెళ్ళి ఆ పురుష సింహాలను కలిసి, సమాచారం మీకు వినిపిస్తాను. ధర్మరాజు రక్షణ బాధ్యత ధృష్టద్యుమ్ననికి అప్పగించి, భీముడు కౌరవ సైన్యంలోకి జొరబడ్డాడు. ద్రోణాచార్యుడు భీముని నిలువరించాడు. కోపించిన భీముడు గదను ద్రోణునిపై విసిరాడు. ద్రోణుడు రథం దిగి తప్పించుకున్నాడు. ఆ గదాప్రహారానికి ద్రోణుని రథం, అశ్వాలు ముక్కలయ్యాయి. ముందుకు సాగగా, ధృతరాష్ట్ర కుమారులు భీమసేనుని చుట్టుముట్టారు. అదే మంచి సమయమని భావించి, భీముడు ఆ కౌరవ రాకుమారులను సంహరించ సాగాడు. భీముని పరాక్రమం ఇలా ఉండటం చూచి, కర్ణుడు ఎదురు వచ్చాడు. ఇద్దరి మధ్య భీకర పోరు సాగింది. భీముడు కర్ణుని రథాశ్వాలను చంపగా, కర్ణుడు వృషసేనుని రథం ఎక్కి వెళ్ళిపోయాడు.

అంతదూరంలో జయద్రధునితో పోరాడుతున్న అర్జునుని, భీముడు చూచాడు. శ్రీకృష్ణార్జునులు తమ శంఖధ్వనులు చేశారు. భీముడు క్షేమమని సింహనాదం ద్వారా ధర్మరాజుకు తెలిపాడు. దగ్గరలోనే సాత్యకి కూడ యుద్ధం చేస్తూ కనిపించాడు. భీముడు 14 మంది ధృతరాష్ట్ర పుత్రులను యమపురికి పంపాడు. కర్ణుడు భీముని గాయపరచగా, భీముడు తన ఉద్దండతను ప్రదర్శిస్తూ తన గదాఘాతంతో చంపబోయి, అర్జునుడు గుర్తుకు వచ్చి, వదలిపెట్టాడు. మరొకవైపు యుద్ధంలో సాత్యకి భూరిశ్రవుణ్ణి చంపేశాడు.

అర్జునుడు జయద్రధుని చంపాలనే ప్రతిజ్ఞ నెరవేరాలంటే, త్వరగా జయద్రధుని చేరాలి. రథం త్వరగా అటువైపుకు మళ్ళించమనగా, శ్రీకృష్ణుడు మరల్చాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన కౌరవ వీరులు దుర్యోధనుడు, కర్ణుడు, వృషసేనుడు, శల్యుడు, అశ్వత్థామ మున్నగువారు జయద్రధుని చేరి రక్షించసాగారు. అర్జునుని శపథం నెరవేరకుండా చేయదలచి, వీరందరు ఒక్కపెట్టున శరపరంపరలను కురిపించసాగారు. కుపితుడైన అర్జునుడు ఇంద్రాస్త్రాన్ని ప్రయోగించగా, ఆకాశం అంధకారంతో నిండిపోయింది. మహారథులకు దిక్కుతోచ లేదు. దానికి తోడు శ్రీకృష్ణుడు కూడ తన యోగమాయ చేత సూర్యుని కనపడకుండా చేశాడు. కౌరవులు సంతోషంతో వున్నారు. ఎందుకంటే అర్జునుడు ఇక అగ్నిప్రవేశం చేయాల్సివస్తుందని. జయద్రధుడు కూడ ధైర్యంతో బయటకి వస్తున్నాడు. అపుడు శ్రీకృష్ణుడు తన యోగమాయను వదిలించబోతూ అర్జునునితో ఇలా అన్నాడు. 'అర్జునా! జయద్రధుని తల ఎవరు నేలపై పడవేస్తారో, వారి తల వంద ముక్కలగునని జయద్రధుని తండ్రి శాపం పెట్టి

వున్నాడు. వాని తండ్రి ప్రస్తుతం శమంతకపంచక క్షేత్రంలో తపస్సు చేసుకుంటున్నాడు. అందుచేత అర్జునా! నీవు ఖండించిన జయద్రదుని తల వాని తండ్రి వడిలో పడునట్లు జాగ్రత్త తీసికో.' ఇంతలో హఠాత్తుగా తిరిగి వెలుతురు రావడంతో దిక్కుతోచక నిలబడిపోయిన కౌరవ సైన్యాన్ని చూస్తూ, విషయం తెలిసిన అర్జునుడు ఒక ప్రచండ బాణంతో జయద్రధుని తల నరికి, డేగవలె ఆ తలను శమంతకపంచకం వైపు తీసుకువెళ్ళి అతని తండ్రి ఒడిలో పడవేశాడు. ఏమీతెలియని జయద్రధుని తండ్రి వృద్ధక్షత్రుడు లేచి నిలబడగానే ఆ తల క్రింద పడి, అతని తల వంద ముక్కలైపోయింది.

ఈవిధంగా జయద్రధుని వధించి, శ్రీకృష్ణుడు, అర్జునుడు, సాత్యకి, భీముడు తమ శంఖాలను పూరించారు. అంధకారం పూర్తిగా తొలగిపోయి సూర్యుడు ప్రకాశించడం మొదలుపెట్టాడు. ఇదంతా శ్రీకృష్ణుని మాయ అని తెలుసుకొని, కౌరవులు దుఃఖించారు. ఈ విషాదంలో మునిగిన కృపాచార్యుడు, అశ్వత్థామ ఇరువైపుల నుండి అర్జునుని బాధింపసాగారు అర్జునుడు మామూలు బాణములను ప్రయోగించినా కూడా, కృపాచార్యుడు తట్టుకోలేక, రథంలోపలికి వెళ్ళి అక్కడ పడిపోయాడు. సారథి గమనించి, రథాన్ని దూరంగా తీసికొని వెళ్ళిపోయాడు.

అశ్వత్థామ పాండవసైన్యాన్ని మట్టి కరిపించసాగాడు. దాన్ని గమనించిన భీముని కుమారుడు ఘటోత్కచుడు అత్యంత క్రోధంతో అశ్వత్థామను ఎదిరించాడు. ఘటోత్కచుని రథం ఇనుముతో నిర్మించబడి, ఎనిమిది చక్రాలు కలిగి ఉంటుంది. చూడటానికి చాల భయంకరంగా ఉంటుంది. ఆ రథంలోనే కూర్చొని అశ్వత్థామ వైపు కదిలాడు ఘటోత్కచుడు. ఇతని వెంట ఒక అక్షౌహిణి రాక్షస సైన్యం ఉంది. వీరి చేతుల్లో రకరకాలైన ఆయుధాలున్నాయి. ఘటోత్కచుడు యముడిలాగ కన్పిస్తున్నాడు. ఇతని చేతిలోనున్న మహా ధనుస్సును చూచి రాజలోకం భయపడుతూ వుంది. ఈ రాక్షస సైన్య ఆకార ప్రకారాలను చూచినచో ఎంతటివారైనా పారిపోక తప్పదు. దుర్యోధునుని సైన్యం భయపడుతోంది. ఘటోత్కచుడి సింహనాదం విని కౌరవసైన్యం వణకసాగింది. అకస్మాత్తుగా అక్కడ బండరాళ్ళ వర్షం కురవడం మొదలైంది. అది రాత్రి కనుక రాక్షస సైన్యం యొక్క బలం బాగా పెరిగిపోయింది. వారి ఆయుధాలు వర్షించే భయంకర వాతావరణం రణరంగంలో దిగ్భ్రమ కలిగించింది. దానిని గాంచిన కౌరవ యోధులు తలోదిక్కుకు పారిపోయారు. కాని అక్కడ నిలిచి ఉన్న మహావీరుడు అశ్వత్థామ మాత్రం బెదరక చెదరక రాక్షస సమూహాల్ని క్షణకాలంలో భస్మం చేశాడు. విపరీతమైన కోపంతో ఘటోత్కచుడు భయంకర బాణప్రయోగం ప్రారంభించాడు. ఒక లక్షకోణములు గల మహాఉద్ధత చక్రమును ప్రయోగించగా, దానిని అశ్వత్థామ ముక్కలు చేశాడు. ఘటోత్కచుని కుమారుడు అంజనపర్వుడు అంతలో వచ్చి అశ్వత్థామను నిలువరించాడు. అశ్వత్థామ అంజనపర్వుని సారథిని చంపాడు. రథహీనుడైన అంజనపర్వుడు గదను, కత్తిని తీసుకొని రాగా, వాటిని కూడ అశ్వత్థామ ముక్కలు చేశాడు. అంజనపర్వుడు కోపంతో ఆకాశంలోకి ఎగిసి, వృక్షములనే వర్షంగా కురిపించ సాగాడు. తర్వాత క్రిందికి వచ్చి మరొక రథాన్ని ఎక్కాడు. ఇదే అదనుగా భావించి, అశ్వత్థామ అంజనపర్వుని చంపివేశాడు. కుమారుని చంపిన అశ్వత్థామపై ఘటోత్కచుడు రుద్రుడై విరుచుకు పడ్డాడు.

ఇలాగ ఇరువురి మధ్య బాణవర్షం ఆకాశమంతా నిండిపోయింది. ఘటోత్కచుడు తరువాత ఆకాశమున కెగసి ఒక మహాపర్వతాకారమును దాల్చాడు. ఆ పర్వతము అనేక శిఖరములు, దట్టమైన వృక్షములతో కూడి ఉన్నది. ఆ పర్వతాగ్రంనుండి నీరు దుముకుతున్నది.

అశ్వత్థామ ఏమాత్రం చలించకుండా ఆ పర్వతంపై వజ్రాస్త్ర ప్రయోగం చేశాడు. ఆ అస్త్రస్పర్శతో పర్వతం మాయమై పోయింది. ఆ తరువాత ఘటోత్కచుడు ఇంద్రధనుస్సుతో కూడిన నల్లని మేఘమై రాళ్ళవర్షం కురిపించడం

మొదలు పెట్టాడు. అశ్వత్థామ వాయవ్యాస్త్రం ప్రయోగించి ఆ నల్లని మేఘాన్ని చిందరవందర చేసేశాడు. ఘటోత్కచుడు అపుడు అశ్వత్థామను చంపివేయమని తన రాక్షస సైన్యాన్ని ఆదేశించాడు. వారందరు వికృత చేష్టలతో అశ్వత్థామపై విరుచుకు పడసాగారు. అశ్వత్థామ వారినందరిని చంపసాగాడు. ఘటోత్కచుడు మితిమీరిన ఆగ్రహంతో ఎనిమిది గంటలు కలిగిన శక్తిని అశ్వత్థామపై ప్రయోగించాడు. చాకచక్యంతో ఆ శక్తిని అశ్వత్థామ పట్టుకొని, దానినే ఘటోత్కచునిపై విసిరివేశాడు. దాన్ని గమనించిన ఘటోత్కచుడు రథంనుండి దూకి వేరుపడ్డాడు. ఆ శక్తి రథంపై పడి, రథం భస్మమై పోయింది. అపుడు ఘటోత్కచుడు దృష్టద్యుమ్నుని రథం ఎక్కాడు. ఇద్దరూ కలిసి అశ్వత్థామను ఎదుర్కోవడం సాగించారు.

అశ్వత్థామ యమదండం లాంటి బాణాన్ని ఘటోత్కచుడిపై ప్రయోగించగా, అది ఘటోత్కచుని రొమ్మును చీల్చుకుంటూ పోయి నేలలో దిటబడింది. ఘటోత్కచుడు దృష్టద్యుమ్నుని రథంలోనే కుప్పకూలిపోయాడు దృష్టద్యుమ్నుడు రథాన్ని రణరంగంనుండి దూరంగా తీసుకొని పోయాడు.

కౌరవులందరు అశ్వత్థామను ప్రశంసించారు. ఘటోత్కచుడు అలంబసుని మరియు అలాయుధుని చంపి, పిదప అమోఘమైన శక్తిగల కర్ణుని చేతిలో ఘటోత్కచుడు స్నేహ కోల్పోయాడు.

ధర్మరాజు, భీముడు, అశ్వత్థామను ఎదుర్కొన్నారు. అటువైపు దుర్యోధనుడు, ద్రోణుడు పాండవులతో యుద్ధం చేయడం ప్రారంభించారు. కోపించిన భీముడు అంబష్ట, వంగదేశ, త్రిగర్త దేశ వీరులను యమలోకానికి పంపించాడు. ఇతర వీరులను కూడ హతమార్చాడు. రెండవ వైపు అర్జునుడు కూడ మద్ర మరియు పర్వతీయ వీరులను తుదముట్టించాడు. ద్రోణుడు వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించి పాండవ వీరులను చంపసాగాడు. పాండవ సేన పారిపోసాగింది.

సైనికులకు ధైర్యం రావడానికి, అర్జునుడు, భీముడు ద్రోణుని ఎదుర్కోవటానికి సిద్ధమైనారు. దుర్యోధనుడు ద్రోణునికి బాసటగా వున్నాడు. అర్జునుడు మాత్రం కౌరవ సైన్యాన్ని ఊచకోత కోస్తున్నాడు. రాత్రి సమయంలో నిద్ర పమయం వ్యాకులత ఎక్కువైంది. చాలమంది రాజులు తమ వాహనాలను వదలి పారిపోసాగారు.

కౌరవయోధుడైన సోమదత్తుడు పాండవులను రెచ్చగొడుతూ, ధనుష్టంకారాలు చేయసాగాడు. సాత్యకి అటువైపు రథాన్ని త్రిప్పాడు. సోమదత్తుడు సాత్యకి ధనస్సును త్రెంచాడు. వెంటనే మరొక ధనుస్సుతో సాత్యకి వాడి బాణాలతో సోమదత్తుని ఎదుర్కొని రథాన్ని కూల్చివేశాడు. అక్కడికి వచ్చిన భీముడు కూడ సోమదత్తునిపై బాణవర్షం కురిపించాడు. సాత్యకి ఒక బాణంతో సారథిని చంపాడు. మరొక బాణంతో సోమదత్తుని ప్రాణాల్ని బలిగొన్నాడు. కౌరవ యోధులు ఇది చూచి సాత్యకిని చుట్టుముట్టారు. ధర్మరాజు సాత్యకికి సాయంగా వచ్చాడు.

మరొకవైపు భీముడు దుర్యోధనుని ఓడించాడు. కర్ణుడు సహదేవుని ఓడించారు. శల్యుడు విరటుని తరిమివేశాడు. ద్రుపదుడు వృషసేనునితో, ప్రతిద్వంద్వుడు దుశ్శాసనునితో, నకులుడు శకునితో, శిఖండి కృపాచార్యునితో సంకుల సమరం చేశారు. ఆ రణరంగంలో ధృష్టద్యుమ్నుడు, సాత్యకి మరియు అర్జునుడు తమ పరాక్రమాన్ని చూపించారు. పిమ్మట ద్రోణుడు, కర్ణుడు పెట్రేగిపోయి పాండవ సైన్యాల్ని సంహరింస సాగారు. ధర్మరాజు ఈ విషయం శ్రీకృష్ణునికి చెప్పగా కర్ణుని ఎదిరించుటకు శ్రీకృష్ణుడు ఘటోత్కచుని పంపాడు.

కర్ణుని చంపుటకు బయలుదేరిన అతని ఉధృతిని గుర్తించిన దుర్యోధనుడు దుశ్శాసనునితో, దుశ్శాసనుని వెళ్ళి కర్ణునికి అండగా నిలవమని చెప్పాడు. ఈ మాటలు వినిన అలంబసుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు.

'రాజా! నన్ను అనుమతిస్తే నేను ఘటోత్కచుని నాశనం చేయగలను.పూర్వం మాకు పాండవులతో విరోధం ఉంది' అని చెప్పగా, దుర్యోధనుడు వెంటనే సరేనన్నాడు. అలంబసుడు ఘటోత్కచునిపై పోరుకు సిద్ధమవడాన్ని లెక్క చేయకుండా ఘటోత్కచుడు కర్ణుని వైపు కదిలాడు. అలంబసుడు మాయావి. అతనిని నిరోధించాడు. ఇద్దరి మధ్యా పోరు విచిత్రంగా సాగింది. వారి విస్మయకర పోరు చూచి, సైనికులందరు ఆశ్చర్యపోయారు. ఇక వీడితో ఆటలు చాలునని ఘటోత్కచుడు దేగవలె ఆకాశంలోనికి ఎగిరి అలంబసునిపై పడ్డాడు. అయోమయంలో పడిన అలంబసుని ఘటోత్కచుడు వాడి తలను కత్తితో నరికేశాడు. రక్తం కారుతున్న ఆ తలను తీసికెళ్ళి దర్యోధనుని రథంలో పడేసి ఇలా అన్నాడు. 'ఓరీ! ఇది నీ పరాక్రమవంతుడి తల. ఇలాగే నీవు కర్ణుని తలకూడ చూడగలవు' అని అరిచాడు.

ఆ తరువాత 400 మూరల పొడవు, వెడల్పు గల, ఎనిమిది చక్రాల రథానికి వంద అశ్వాలను పూన్చి సారథియైన విరూపాక్ష రాక్షసునితో పాట ఘటోత్కచుడు కర్ణునికి ఎదురేగాడు. కర్ణుడు కూడ ఏమాత్రం జంకకుండా బాణవర్షం కురిపించ సాగాడు. కర్ణుని బాణాల్ని ఎదుర్కొంటూనే ఘటోత్కచుడు తన మాయతో అపార రాక్షస సైన్యాన్ని సృష్టించాడు. బండరాళ్ళ వర్షం కురిపించాడు. ఇది రాత్రి సమయం కావడంతో రాక్షసులకు అనుకూలంగా వుంది. ఈ భీభత్సానికి దుర్యోధనునితో సహా కౌరవ సైన్యం పారిపోయింది. కేవలం కర్ణుడు మాత్రమే ధైర్యంగా ఎదుర్కొన్నాడు. మాయలు పటాపంచలు చేస్తున్నాడు. ఇలా భీకర పోరు సాగుతోంది.

ఇంతలో అలాయుధుడను రాక్షసుడు వచ్చి, దర్యోధనుని అనుమతితో ఘటోత్కచుని ఎదిరించ సాగాడు. కర్ణుని వదలి అలాయుధుణ్ణి ఘటోత్కచుడు ఢీకొట్ట సాగాడు. భీముడు అలాయుధుని కవ్వించాడు. అలాయుధుడు భీముని వైపు వెళ్ళగా, ఇద్దరి మధ్య భీకర పోరు సాగింది. అలాయుధుడు భీముని రథహీనునిగా చేశాడు. భీముడు గదా ప్రహారం చేశాడు. గదను ముక్కలు చేసి, ముష్టిఘాతానికి అలాయుధుడు తలపడ్డాడు. శ్రీకృష్ణుని సంకేతాన్ని ఘటోత్కచుడు అందుకొని, కర్ణుని వదలి అలాయుధుని ఢీకొన్నాడు. కోపించిన అలాయుధుడు రక్తపు వర్షం కురిపించి, పిడుగులు పడేట్లు చేశాడు. ఘటోత్కచుడు ఆ మాయను వమ్ముచేసి, అలాయుధుని పైకెత్తి నేలకేసి కొట్టి కుత్తుక కత్తిరించి, దుర్యోధనుని ఎదుట పడేశాడు. దుర్యోధనాదులు ఇంద్రుని శక్తితో ఘటోత్కచుని చంపమని కోరారు. అర్ధరాత్రి సమయం కనుక ఘటోత్కచుని అదుపు చేయటం ఎవరి తరం కాదని కర్ణుడు ఒక నిర్ణయానికి వచ్చాడు. తత్ఫలితంగా కాలాగ్ని యొక్క జిహ్వవలె నున్న శక్తిని ఘటోత్కచునిపై ప్రయోగించాడు. తాను చనిపోతానన్న విషయం ధృవీకరించుకొన్న ఘటోత్కచుడు తన శరీరాన్ని మేరుపర్వతమంత పెంచి క్రింద పడిపోయాడు. వాని శరీరం క్రింద ఒక అక్షౌహిణి సైన్యం నలిగి నశించింది.

రాజా! రాత్రి యొక్క మూడు భాగాలు గడిచిపోయాయి. చంద్రుని వెన్నెల తగ్గుతోంది. కనుక ఇరుపక్షాల వారు సంధ్యావందనాలు లాంటి కార్యక్రమాలు ముగించుకొని యుద్ధానికి సిద్ధపడ్డారు.

ద్రోణాచార్యుడు తన సైన్యాన్ని రెండు భాగాలుగా చేసి, తనతో పాటు దుర్యోధనుని తీసికొని, పాండవ యోధులపై ఆక్రమణ చేశాడు. ఆ సమయంలో అర్జునుడు ద్రోణాచార్యుని దాటి వెళ్ళి కౌరవ సైన్యాన్ని నాశనం చేయనారంభించాడు. దీన్ని చూచిన కర్ణుడు, దుర్యోధనుడు మరియు శకుని అర్జునుని ఎదిరించ సాగారు. ఆ సమయంలో ద్రోణుడు ఉత్తర దిశన ఉన్నాడు. అక్కడ వున్న పాండవ సైన్యం ద్రోణుని చూచి భయపడసాగింది. అంతలోనే ద్రుపదుడు, విరాటుడు, ద్రోణాచార్యునిపై బాణాలు వేస్తూ యుద్ధం చేయసాగారు. ద్రోణుడు వారి

బాణాలను వమ్ము చేసి వారి శక్తి ప్రయోగాన్ని కూడ ముక్కలు ముక్కలుగా చేశాడు. ఆ తరువాత రెండు బల్లెములను ప్రయోగించి విరాట, ద్రుపదులను బలిగొన్నాడు. ఈ ఇద్దరు మహాయోధులు చనిపోవడం చూచిన ధృష్టద్యుమ్నుడు అత్యంత విషాదంతో నేను ఈరోజు ద్రోణాచార్యుని అంతమొందిస్తాను అని శపథం చేశాడు. అదే సమయంలో భీముడు కౌరవ సైన్యాన్ని చీల్చి చెండాడుతూ, ద్రోణ సైన్యంలోనికి చొచ్చుకుపోయాడు. అప్పటికే ధృష్టద్యుమ్నుడు కూడ అక్కడికి చేరుకున్నాడు. ఇరుపక్షాల పోరు తారాస్థాయికి చేరింది. ద్రోణాచార్యుడు పాండవ సైన్యాన్ని సంహరిస్తున్నాడు. అందరూ భయపడ్డారు. కాని అర్జునుడు పోరాటం మానలేదు. ఆ సమయంలో దుర్యోధన, దుశ్శాసనులు నకుల సహదేవులతో పోరాడుతున్నారు.

ద్రోణాచార్యుని, అర్జునుని మధ్య పోరు రసవత్తరంగా సాగుతోంది. ద్రోణుడు ప్రయోగించే వివిధ అస్త్రాలను అర్జునుడు ఆదిలోనే నిర్వీర్యం చేస్తున్నాడు. తరువాత ద్రోణుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి పర్వతాలు వణికి పోసాగాయి. మహావృక్షాలు పెళ్ళగించబడ్డాయి. సైనికులు పారిపోసాగారు. అర్జునుడు కూడ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి, ఆ ఉధృతిని శాంతింప చేశాడు.

ద్రోణాచార్యుడు ప్రబలుడై పాండవ సైన్యాన్ని నాశనం చేయసాగాడు. శ్రీకృష్ణుడు పాండవుల నుద్దేశించి, 'ఓ పాండవులారా! ద్రోణుడు శ్రేష్ఠ ధనుర్ధరుడు. చేతిలో ధనస్సున్నంత కాలం ఇంద్రాది దేవతలు కూడ అతనిని జయించ లేరు. తాను స్వచ్ఛందంగా ధనస్సును విడవాలి. అది జరగాలంటే అశ్వత్థామ మరణించాడనే వార్త వింటే, ఆయన నిర్వీర్యుడవుతాడు. ఎవరైనా ఆ వార్త ఆయనకు చేరవేయాలి' అని అన్నాడు. మాళవ దేశపు రాజైన ఇంద్రవర్మకు చెందిన 'అశ్వత్థామ' అనే ఏనుగును భీమసేనుడు చంపి, ద్రోణాచార్యునకు వినపడునట్లు 'అశ్వత్థామ చంపబడ్డాడు' అని ఎలుగెత్తి అరవటం మొదలు పెట్టాడు ఈ వార్త వినిన ద్రోణాచార్యుని శరీరం శిథిలం కాజొచ్చింది. అయినా వార్త పట్ల నమ్మకం కుదరక, తనతో పోరాడుతున్న ధృష్టద్యుమ్ననిపై వేయి బాణాలు వేశాడు. అంతేకాక, ఆవేశము ఆవహించిన ద్రోణుడు దివ్యాస్త్ర ప్రయోగంతో లక్షమంది పాండవ వీరులను కాజేశాడు. ఇంతటి పని చేసినది చూచి అగ్నిదేవుని నాయకత్వంలో విశ్వామిత్రుడు, జమదగ్ని, భరద్వాజుడు, గౌతముడు, వశిష్ఠుడు, కశ్యపుడు మరియు అత్రి మహర్షి ద్రోణాచార్యుని బ్రహ్మలోకానికి తీసుకొని వెళ్ళుటకు వచ్చారు వారివెంట గర్గ, భృగు మరియు అంగిరా మున్నగువారున్నారు. వారందరు సూక్ష్మరూపాల్ని ధరించి వచ్చి ఇలా అన్నారు 'ఓ ద్రోణా! ఆయుధాల్ని వదలివేసి మావైపు నడు. ఇప్పటివరకు నీవు అధర్మ యుద్ధం చేశావు. నీకు మరణ సమయం ఆసన్నమైంది. ఇప్పటికైనా యుద్ధం మానెయ్యి. నీవు బ్రాహ్మణుడవు అయివుండి కూడా బ్రహ్మాస్త్రం గురించి తెలియని వారిని కూడ ఆ అస్త్రంతో తుదముట్టించావు. ఇలాంటి పాపము చేయవద్దు' అని చెప్పారు.

ఋషులు చెప్పిన మాటలు వినిన ద్రోణుడు నిజంగా తన కుమారుడు మరణించాడా, లేదా అని ధర్మరాజును అడిగాడు. శ్రీకృష్ణుని మరియు భీముని ప్రోద్బలంతో ధర్మరాజు ద్రోణాచార్యుని ఉద్దేశించి బిగ్గరగా 'అశ్వత్థామ చంపబడ్డాడు' అని, మరల నెమ్మదిగా 'కాని ఏనుగు' అని అన్నాడు. ధర్మరాజు రథం ఎప్పుడూ నేలపైనుండి నాలుగు అంగుళాలు పైన ఉంటుంది. కాని వెంటనే అది నేలను తాకింది. ద్రోణాచార్యుడు ధర్మరాజు మాటలు విని పుత్ర శోకంతో పీడితుడై, తాను పాండవులకు అన్యాయం చేశానని భావించసాగాడు.

ద్రోణుడు ఆ స్థితిలో ఉండగానే, ధృష్టద్యుమ్నుడు ఆక్రమణ చేశాడు. ఇద్దరి మధ్య భీకర రణం సాగింది. అనేకమైన దివ్యాస్త్రాలను ప్రయోగించుకొన్నారు. ఒక సదర్భంలో సాత్యకి వచ్చి ధృష్టద్యుమ్నుని రక్షించాడు.

ద్రోణుడు ఇకా ఆయుధాలు వదలనందున, భీముడు వెళ్ళి 'ఆచార్యా! అశ్వత్థామ చనిపోయాడని మీకు నమ్మకం లేదా? ప్రాణులను హింసించకూడదనునది బ్రాహ్మణుల ఉత్తమ నియమం. మీరు వేదవేత్తలైన బ్రాహ్మణులు కదా' అని చెప్పాడు. ఆ మాటలు విన్న, ద్రోణుడు ధనుస్సును క్రింద పడేశాడు. కౌరవ సేనాధిపతులను, మహారథులను పిలుస్తూ, రథంలోపల ద్రోణుడు కూలబడిపోయాడు. ద్రోణుడు జ్ఞానస్వరూపుని వలె కూర్చొని, ధ్యానం చేసుకొంటూ, విష్ణువును ధ్యానించసాగాడు. ఆ తరువాత ప్రాణత్యాగం చేసి, ఉత్తమ గతిని ప్రాప్తించుకొన్నాడు. ఆ సమయంలో ఆయన ఉజ్వల స్థితిని నేను, కృపాచార్యుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు మరియు ధర్మరాజు మాత్రమే చూడగలిగాము. రాజా! ద్రోణుడు పరంధామం చేరాడు. చైతన్యం లేని ఆయన శరీరంపై ధృష్టద్యుమ్నుడు దాడిచేశాడు. ఎవరు అడ్డుపెట్టినా పట్టించుకోకుండా ధృష్టద్యుమ్నుడు ద్రోణుని తల నరికి, దుర్యోధనాదులవైపు విసిరి వేశాడు. ఆ తర్వాత వారు నాట్యం చేయసాగారు. భీముడు 'పాంచాల రాకుమారా! ఎప్పుడైతే కర్ణుడు మరియు దుర్యోధనుడు ఇలా అసువులు బాసెదరో, అపుడు కూడ ఇదేవిధంగా మనం హర్షం వ్యక్తం చేద్దాం' అని అన్నాడు.

ద్రోణాచార్యుని మరణ వార్త వినగానే, కౌరవ సైన్యం చెల్లాచెదురై పారిపోసాగారు. దీన్ని గమనించిన అశ్వత్థామ దుర్యోధనుని ఏమి జరిగిందని అడిగాడు. కృపాచార్యుడు జరిగినదంతా చెప్పాడు. ఇది వినిన అశ్వత్థామ దుఃఖంతో, కోపంతో ఊగిపోయాడు. తన తండ్రి మరణానికి కారకులైన పాండవులనందరిని చంపుటకు నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ బాణం నుండి వేలాది బాణాలు వెలువడి, ఆకాశమంతా నిండిపోయాయి. ఆ తరువాత గదలు అనేకాలుగా ప్రకటితమైనాయి. వీటితో నిండిన ఆకాశాన్ని చూచి పాండవులు భయపడ్డారు. పాండవులు యుద్ధానికి తలపడే కొద్దీ, ఆ ఆయుధాల సంఖ్య పెరిగి పోతోంది. చూస్తున్నంతలోనే పాండవ సైన్యం భస్మం కాజొచ్చింది. ధర్మరాజు నిశ్చేష్టుడైనాడు.

అపుడు శ్రీకృష్ణుడు అందరినీ ఉద్దేశించి ఇలా అన్నాడు. 'ఓ యోధులారా! మీ అస్త్రాలన్నీ క్రింద పడేయండి. మీరుకూడ రథం దిగిపొండి. నారాయణాస్త్రానికి శాంతి మంత్రం ఇదేనని గ్రహించండి. నిరాయుధులై నేలపై వున్నవారిని నారాయణాస్త్రం చంపదు.' వెంటనే యోధులందరూ రథాలు దిగిపోయారు. భీముడు మాత్రం అశ్వత్థామ ఎదుటకు పోయి కాలుదువ్వుతున్నాడు. అశ్వత్థామ కూడ బాణ పరంపరను వదులుతూ వున్నాడు. అది ప్రళయకాలాగ్ని రూపమై భీముని కబళింప సాగింది. వెంటనే శ్రీకృష్ణార్జునులు వచ్చి భీముని రథం నుండి క్రిందికి లాగారు. భీముని ఆయుధాలు క్రింద పడ్డాయి. ఆ రకంగా నారాయణాస్త్రం శాంతించింది.

దుర్యోధనుడు మళ్ళీ నారాయణాస్త్రాన్ని సంధించమని అశ్వత్థామను కోరాడు. కుదరదని చెప్పగా, మిగతా అస్త్రాలు ప్రయోగించమన్నాడు. తండ్రి మరణం గుర్తుకు రాగా, అశ్వత్థామ ధృష్టద్యుమ్ననిపై ఆక్రమణ చేశాడు. ఇద్దరి మధ్య భయంకరమైన పోరు జరిగింది. అశ్వత్థామ తన పరాక్రమంతో ధృష్టద్యుమ్నుని రథహీనునిగా చేశాడు. ఇది గమనించిన సాత్యకి అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. ఇతర కౌరవ వీరులు కూడ వచ్చి, అశ్వత్థామకు బాసటగా నిలిచి సాత్యకిని ఎదుర్కొన్నారు. సాత్యకి ఉగ్రరూపం దాల్చి వారినందరిని రథహీనులుగా చేశాడు. అశ్వత్థామను కూడ రథహీనుని చేసి తరిమి కొట్టాడు.

అశ్వత్థామ మరొక రథం ఎక్కి, సాత్యకి కవచాన్ని ఛేదించాడు. సాత్యకి గాయపడగా, సారథి రథాన్ని దూరంగా తీసుకొని వెళ్ళాడు.

భీముడు రౌద్రరూపుడై అశ్వత్థామను ఎదుర్కొన సాగాడు. భీముడు తన పరాక్రమం, బలం, వీరత్వాన్ని ప్రదర్శించి, అశ్వత్థామను మూర్ఛిల్ల చేశాడు. తేరుకొన్న అశ్వత్థామ భీముని సారథిని చంపాడు. అశ్వాలు భీముని రథాన్ని బయటికి తీసికొని పోయాయి. అశ్వత్థామ సంతోషంతో శంఖం పూరించాడు.

భీమసేనుడు మున్నగు యోధులు అశ్వత్థామ చేతిలో ఓడిపోవడం గమనించిన అర్జునుడు, అశ్వత్థామను తనతో యుద్ధం చేయమని కవ్వించాడు. అశ్వత్థామ కుపితుడై తన చేతిలోనికి ఆగ్నేయాస్త్రాన్ని తీసికొని, అభిమంత్రించి, పాండవ వీరులను, సైన్యాన్ని చంపుట మొదలు పెట్టాడు. అది ఆకాశంలో బాణవర్షం కురిపించ సాగింది. ఆ సమయంలో రాక్షసులు, పిశాచులు నాట్యం చేస్తున్నారు. వేడిగాలులు, రక్తవర్షంతో భీభత్సంగా ఉంది. ఆ వేడిమిని భరించలేక పాండవ సైన్యం మృత్యువాత పడుతున్నారు. నలువైపులా అంధకారం వ్యాపించింది. ఏమిటో, ఎవరికీ అర్థం కాకుండా ఉంది. అర్జునుడు మాత్రం ఎంతో నిబ్బరంతో బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. చీకటి తొలగి, చల్లని గాలి వీస్తోంది. ఆ వెలుగులో చూస్తే, అర్జునుని యొక్క అక్షౌహిణి సైన్యం భస్మమై పోయింది. ఆరని జ్వాలలలో ఉన్న శ్రీకృష్ణార్జునులు బయటకు వచ్చారు. అశ్వత్థామకు ఇది ఆశ్చర్యం కలిగించింది. ఆగ్నేయాస్త్రం శ్రీకృష్ణార్జునులపై ప్రభావం చూపనందుకు నిరాశపడి అశ్వత్థామ నిరాశతో రణభూమినుండి వెళ్ళిపోయాడు.

అలా వెళుతున్న అశ్వత్థామకు ఎదురుగా వ్యాస మహర్షి వచ్చాడు. అశ్వత్థామ నమస్కరించి, విచారంగా ఇలా అన్నాడు. 'దేవా! నేను ఆగ్నేయాస్త్రాన్ని మరణ ధర్మమున్న పాండవులపై ప్రయోగించాను. వారు ఎలా బ్రతికి ఉన్నారో నాకు అర్థం కావడం లేదు.' అని అన్నాడు. అపుడు వ్యాసమహర్షి ఇలా అన్నాడు. 'అశ్వత్థామా! పూర్వం విశ్వవిధాత అయిన నారాయణుడు చాలకాలం అంటే 66 వేల సం॥ల కాలం నిరాహారంగా కఠోర తపస్సు చేశాడు. తత్ఫలితంగా ఆదిదేవుడైన శంకరుడు ప్రసన్నుడై ప్రత్యక్షమైనాడు. నారాయణుడు శంకరుని స్తుతించి, అనేక వరాలు పొందాడు. ఆ తరువాత ఆదిదేవుడైన శంకరుడు ఇలా అన్నాడు. 'నారాయణా! సమర భూమిలోనికి నీవు వెళ్ళినపుడు నన్ను మించిన బలవంతుడవు కాగలవు.' ఆ పిదప నారాయణుడు తన తపోబలం చేత నరుని సృష్టించాడు. ఆ నరనారాయణులే ఈ శ్రీకృష్ణార్జునులని తెలుసుకో' అని చెప్పాడు.

-o0o-

8

8. కర్ణ పర్వం8

ద్రోణాచార్యుడు చనిపోగానే, దుర్యోధనాదులు అమితంగా భీతి చెందారు. అశ్వత్థామ ఊరడించాడు. కర్ణుని సర్వసైన్యాధిపతిగా అభిషేకించారు. కర్ణుడు సేనాని అయిన తర్వాత జరిగిన విశేషాలను పరిశీలిద్దాం.

16వరోజు యుద్ధం :

కర్ణుని అనుమతితో యుద్ధభేరి మ్రోగించారు. శంఖ ధ్వని వినగానే కౌరవ సైన్యం ఉత్సాహంతో ముందుకు వచ్చింది. కర్ణుడు స్వయంగా మకర (మొసలి) వ్యూహాన్ని రచించి ముఖద్వారంలో తానే ఉన్నాడు. ప్రధాన భాగాల్లో అశ్వత్థామ, దుర్యోధనుడు, కృతవర్మ మరియు కృపాచార్యుడు ఉన్నారు.

ఇది చూచిన ధర్మరాజు ఎదుటివారి వ్యూహానికి ధీటుగా వ్యూహ రచన చేయమని అర్జునుని కోరగా, అర్జునుడు అర్ధచంద్రాకార వ్యూహ రచన చేశాడు. కర్ణార్జునులు ఎదురెదురుగా తారసపడగానే సంకుల సమరం ఆరంభమైంది.

భీమసేనుని క్షేమక్షేమధూర్తి ఎదుర్కొన్నాడు. భీముని చేతిలో అతడు సంహరింపబడ్డాడు. మరొకవైపు విందుడు, అనువిందుడు సాత్యకితో తలపడి ప్రాణాలు కోల్పోయారు. మరొక చోట అశ్వత్థామకు భీమసేనునికి యుద్ధం జరుగుతోంది. ఇద్దరూ భీకర పోరాటంలో ఒకరినొకరు తీవ్రంగా గాయపరచుకొంటూ చివరకు రణరంగం నుండి నిష్క్రమించారు. సహదేవుడు దుశ్శాసనుని పరాజితుని చేశాడు. ఆకాశం మధ్యలో సూర్యుడు వెలుగొందుతుండగా, కర్ణుడు పాండవ సైన్యాన్ని ఊచకోత కోయసాగాడు. ఎందరో యోధులు భయకంపితులైనా పోరు సాగిస్తున్నారు. దుర్యోధనుడు కర్ణుడు కలిసి ధర్మరాజును, అర్జునుని మరియు సాత్యకిని ఎదుర్కొన్నారు. సూర్యాస్తమయం కావడంతో యుద్ధం ముగించి, ఎవరి శిబిరాలకు వారు వెళ్ళిపోయారు.

ప్రతిరోజూ ఇంతమంది కౌరవ సేన చనిపోతుందని చెపుతున్నారు కాని, ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే వారే లేరా అని ధృతరాష్ట్రుడు సంజయుని అడిగాడు. అపుడు సంజయుడు, 'రాజా! జరిగినదానికి చింతించి ఏం ప్రయోజనం? పాండవులు సంధికి సిద్ధపడ్డారు. కాని మీరు పుత్ర వ్యామోహంతో ఇంతవరకు తెచ్చారు. ఇప్పుడు మీరు వగచి ఏం లాభం? యుద్ధంలో జరిగింది చెప్తాను. వినండి.

16వ రోజు రాత్రి గడిచాక, కర్ణుడు దుర్యోధనుని వద్దకు వచ్చి ఇలా అన్నాడు. 'రాజా! ఇవాళ నా పోరాటం అర్జునునితో ఉంటుంది. మా యిద్దరిలో ఒకరే బ్రతికి ఉంటారు. నేను ఇంద్రుడు ఇచ్చిన ఆయుధాన్ని పోగొట్టుకున్నాను. దివ్యాస్త్రముల జ్ఞానం మాకు సమానంగా ఉంది. పరాక్రమంలో, బాణప్రయోగంలో యుద్ధకౌశలంలో అర్జునుడు నన్ను మించలేడు. నా ధనుస్సు పేరు 'విజయ'. దీనిని విశ్వకర్మ ఇంద్రుని కొరకు రూపొందించాడు. దానిని ఇంద్రుడు పరశురామునికి ఇచ్చాడు. పరశురాముడు నాకు ఇచ్చాడు. ఇది గాండీవంకంటె మిన్నయైనది. నేను అర్జునుని కంటే దేనిలో తక్కువో, అది కూడ మీకు చెప్పాలి. అర్జునునకు అగ్నిదేవుడు ఇచ్చిన రథం గొప్పది. దానిని ఎటువైపు నుంచి కూడ ఛేదించలేము. ఆ రథానికి మనోవేగంలా వెళ్ళగల అశ్వాలున్నాయి. ఆ రథ ధ్వజంపై ఆశ్చర్యపరిచే ఒక వానరం కూర్చొని ఉంది. అన్నిటికంటే శ్రేష్ఠమైన విషయ మేమంటే – జగత్తును రచించే శ్రీకృష్ణుడు దాని సారథియై వున్నాడు. రక్షకుడై ఉన్నాడు. అందుచేత అశ్వవిద్య తెలిసిన శల్యుని నాకు సారథిగా ఇవ్వండి.' అని అన్నాడు.

అపుడు దుర్యోధనుడు శల్యుని వద్దకు వెళ్ళి సవినయంగా ఇలా అన్నాడు. 'ఓ రుద్ర దేశాధీశా! మీరు రణరంగంలో శ్రీకృష్ణునితో సమానులు. కనుక మీరు కర్ణుని రథసారథిగా ఉండండి.' అని చెప్పగా, శల్యుడు శరీరమంతా క్రోధంతో ఊగిపోయి 'దుర్యోధనా! నీవు నన్ను అవమానిస్తున్నావు. కర్ణుడు కనీసం నా సమానుడని నేను భావించడం లేదు. పైగా ఒక క్షత్రియుడు వెళ్ళి ఒక సూతునికి సేవ చేయడం నేను ఎక్కడా వినలేదు.' అని చెప్పి వెళ్ళిపోయాడు. దుర్యోధనుడు కాళ్ళావేళ్ళాబడి ప్రతిమలాడాడు. అపుడు శల్యుడు 'నేను శ్రీకృష్ణుని కంటె గొప్పవాడినని అన్నావు. కనుక సారథిగా ఒప్పుకొంటున్నాను. కాని యుద్ధం జరిగేటప్పుడు నేను ఏమన్నా సరే కర్ణుడు భరించాలి సుమా!' అన్నాడు. కర్ణుడు, దుర్యోధనుడు సరేనన్నారు.

దుర్యోధనుడు శల్యునితో మార్కండేయ మహర్షి ఉదంతాన్ని చెపుతానని ఇలా చెప్పసాగాడు. 'చాలా కాలం క్రితం తారకామయుని రాక్షస సైన్యాన్ని దేవతలు ఓడించారు. తారకునికి ముగ్గురు కుమారులు. వారు వరుసగా తారాక్షుడు, కమలాక్షుడు మరియు విద్యున్మాలి అని ఉన్నారు. వారు బ్రహ్మ గురించి కఠోర తపస్సు చేసి చిత్రమైన వరాన్ని పొందారు. ఆ వరమేమంటే – ఆ ముగ్గురు రాక్షసులు విడివిడిగా మూడు నగరాల్లో స్థిరపడి వేయి సంవత్సరాలు ఆకాశయానం చేసిన తర్వాత, ఒకచోట ఆ మూడు నగరాలు కేంద్రీకరించబడినపుడు, ఏ దేవుడైనా, ఒక బాణంతో వాటిని నాశనం చేస్తే, అది మా మరణానికి కారణ మగునట్లు లేకున్న మేము అమరులమగునట్లు వరమివ్వండి అని బ్రహ్మ నుండి ఆ వరాన్ని పొందారు.

మయుని ద్వారా ఆ మూడు నగరాలు సృష్టింపజేసి, మూడు లోకాల్లో ఉండసాగారు. తారకామయునికి హరి అను బలశాలియైన పుత్రుడింకొకడున్నాడు. అతడు బ్రహ్మ గురించి తపస్సు చేసి, మహిమాన్వితమైన ఒక 'బావి'ని వరంగా పొందాడు. మృతదేహాలను ఆ బావిలో పడవేసినచో వారు మళ్ళీ జీవం పొందుతారు. వారిలో అహం ప్రబలి దేవతలను, ఋషులను బాధించటం, ఆశ్రమాలను ధ్వంసం చేయటం మొదలుపెట్టారు.

దీనిని గమనించిన దేవతలు ఇంద్రునితో సహా బ్రహ్మ వద్దకు వెళ్ళి, ఆయన యిచ్చిన వరం వల్ల తాము ఎన్ని బాధలు పడుతున్నామో చెప్పి మొరపెట్టుకున్నారు బ్రహ్మ వారిని తీసికొని పరమేశ్వరుని వద్దకు వెళ్ళి విషయమంతా చెప్పడు. పరమశివుడు వారికి అభయమిచ్చి, త్రిపురాసురులను చంపుటకు సిద్ధపడ్డాడు. కాని పరమశివుడు ఒక నిబంధన పెట్టాడు.

నాకంటే శ్రేష్ఠుడయిన వానిని నాకు రథసారథిగా ఇవ్వమన్నాడు. దేవతలు సమాలోచించి, బ్రహ్మ మాత్రమే శ్రేష్ఠుడైనవాడని, బ్రహ్మను ప్రసన్నం చేసుకొని, రథసారథిగా ఉండుటకు ఒప్పించారు

ఒక ప్రదేశంలో త్రిపురాసురులు ప్రకటితమవగానే, పరమ శివుడు ఒకే బాణంలో ఆ అసురులు ముగ్గురిని సముద్రంలో పడవేశాడు. ఆ రకంగా లోకకళ్యాణం జరిగింది.' అని ముగించాడు. దుర్యోధనుడు 'ఓ రాజా! ఆ రకంగా మీరు, శ్రీకృష్ణుడు, కర్ణుడు మరియు అర్జునుని కంటే శ్రేష్ఠుడైన వారని నిస్సందేహంగా చెప్పవచ్చును.' అపుడు శల్యుడు ఇలా అన్నాడు. 'రాజా! బ్రహ్మ పరమేశ్వరునికి, శ్రీకృష్ణుడు అర్జునునికి సారథ్యము చేయుట నేనెరుగుదును. అలాగే నేను కర్ణునికి సారథ్యం చేస్తాను.' అని చెప్పాడు.

కర్ణుడు శల్యుని సారథిగా చేసికొని యుద్ధానికి ప్రయాణమైనపుడు, వారిద్దరి మధ్య ఒక కటువైన సంభాషణ జరిగింది. కర్ణుడు అసందర్భ ప్రేలాపనలు చేస్తూ, అర్జునుడు ఎక్కడ ఉన్నాడో చెప్పినవానికి కావలసినంత ధనమిస్తానని ప్రగల్భాలు పలికాడు. ఈ వ్యర్థపు మాటలు విన్న శల్యుడు 'ఓయీ! గంధర్వులతో పోరు జరిగినపుడు

మొదట పారిపోయింది నీవు కాదా! విరాటుని గోవుల మరల్చినపుడు స్పృహతప్పి పడిపోయినది నీవు కాదా! ఎందుకు నీకు ఈ బీరాలు?'

క్రోధానికి గురియైన కర్ణుడు శల్యునితో 'నోరు మూసుకో. నేను నిన్ను చంపి కాకులకు, గద్దలకు వేయగలను. కాని మూడు కారణాలతో నిన్ను వదులుతున్నాను. ఒకటి దుర్యోధనుని కార్యం జరగాలి, రెండు నిన్ను చంపితే పాపం చుట్టుకొంటుంది, మూడు నీవు ఏమి మాట్లాడినా అభ్యంతరం చెప్పనని మాట ఇచ్చాను.' ఆ పిదప శల్యుడు హంసోపాఖ్యానం అను దృష్టాంతాన్ని చెప్పాడు. అది ఇలా ఉంది.

పూర్వకాలంలో సముద్ర తీరప్రాంతాన్ని పాలించే ఒక రాజు వుండేవాడు. ఆ రాజ్యంలో ధనధాన్య సంపన్నుడైన ఒక వైశ్యుడు వుండేవాడు. అతడు మిక్కిలి భూతదయ కలిగినవాడు. అతనికి అల్పవయస్సు గల అనేకమంది పుత్రులుండేవారు. ఆ కుటుంబంతో ఒక కాకి కూడ వుండేది. ఆ కాకికి వారు ఎంగిలి ఆహార పదార్థాలు పెట్టేవారు. ఆ ఎంగిలి పదార్థాలను బాగా తిని, తన జాతి పక్షులను అవమానిస్తుండేది.

ఒకరోజు అదే సముద్ర తీరానికి మానస సరోవరం నుండి కొన్ని హంసలు వచ్చాయి. ఆ కాకి ఒక హంస దగ్గరకు వచ్చి, మనం పరుగుపందెం వేసుకొందామా అని అన్నది. అక్కడ ఉన్న హంసలు అన్నీ నవ్వి మేము మానస సరోవరం నుండి భూమండలమంతా చుట్టివచ్చే శక్తిసామర్థ్యాలు గలవారమని, పైగా నీవు నైపుణ్యం గల హంసతో తలపడ బోతున్నావు, ఎలా నెగ్గుకు రాగలవని అన్నవి. ఆ కాకి అప్పుడు తన కండబలాన్ని ప్రదర్శిస్తూ నేను వంద రీతుల్లో గాలిలో తేలియాడగలను, ఆకాశంలో పరుగులు పెట్టగలను. ఎలాంటి ప్రక్రియలో ఎగరవలెనో నాకు చెప్పండి అని అన్నది. హంస 'నేను ఒకే రీతిలో ఎగరగలను. నీవు నీ ఇష్టమొచ్చినట్లు ఎగురవచ్చు.' అని చెప్పింది. కాకుల గుంపులు కూడ వచ్చాయి. ఒకేరీతిలో ఎలా ఎగరగలదని నవ్వుకుంటున్నాయి.

పోటీ ప్రారంభమైంది. కాకి, హంస ఆకాశంలోకి ఎగిరి దూసుకు పోతున్నాయి. కాకి అనేక రీతుల్లో ఎగురుతూ అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. హంస మాత్రం మందగతిలో పయనిస్తోంది. కాకి ముందుకు దూసుకుపోతోంది. చూచేవాళ్ళు హంస ఓడిపోతుందని అనుకున్నారు. హంస మెల్లమెల్లగా వేగం పుంజుకొని సముద్రం మీదుగా ప్రయాణం సాగించింది. ఆ సమయానికి కాకి శక్తి క్షీణించసాగింది. దాని రెక్కలు, ముక్కు సముద్ర జలాన్ని తాకుతున్నాయి. కృశించిన కాకి హంస వద్దకు వచ్చి, తనను రక్షించమని ప్రార్థించింది. ఈలోగానే ఆ కాకి మరింత బలహీనపడి సముద్రంలో పడిపోయింది. హంస ఆ కాకిని చాకచక్యంగా తన వీపుపై ఎక్కించుకొని తీరానికి చేర్చింది.' అని చెప్పి, 'ఓ కర్ణా! ఎంగిలి కూడు తిని కండలు పెంచుకొన్న కాకి వెల్లికిలా పడిపోయింది. అలాగే నీవు కూడ దుర్యోధనాదుల ఎంగిలికూడు తిని బలిసి పోయావు. యుద్ధంలో అర్జునుడు నీ సోదరుణ్ణి చంపినపుడు నీ పౌరుషం ఏమైంది, అందరికంటే ముందు నీవే పారిపోయావు కదా! కనుక ఇకనుండైనా వ్యర్థ ప్రేలాపనలు కట్టిపెట్టు.' అని అన్నాడు శల్యుడు.

ఇలా శల్యుడు హంసోపాఖ్యానం చెప్పిన పిదప కర్ణుడు ఎంతో బాధపడి తనను కాకితో పోల్చినందుకు, విధి తనను ఎలా చిన్నచూపు చూస్తున్నదో చెప్పుటకు రెండు వదంతులు చెప్పాడు. అయినను నేను కృష్ణార్జునులను గెలువగలను అని చెప్పాడు.

కర్ణుడు చెప్పిన మొదటి ఉదంతం – కర్ణుడు దివ్యాస్త్రాలను, బ్రహ్మాస్త్రాలను సంపాదించడానికి బ్రాహ్మణ వేషంలో పరశురాముని సేవ చేయుటకు వెళ్ళాడు. ఒకరోజు కర్ణుని తొడపై తలవుంచి పరశురాముడు నిద్రిస్తున్నాడు.

ఇంద్రుడు పురుగు రూపంలో వచ్చి కర్ణుని తొడ క్రింద చేరి రక్తం వచ్చేలా కుట్టాడు. కర్ణుని తొడ క్రిందినుండి పాదాల క్రిందుగా పరశురాముడు నిద్రస్తున్న వైపుకు రక్తం కారసాగింది. రక్తపు తడి తగిలి పరశురామునికి నిద్రాభంగమైంది. నిద్రలేచిన పరశురాముడు తనకు చల్లగా తగిలిన రక్తపు ప్రవాహాన్ని చూచి, ఇంత రక్తం కారుతున్నా భరించిన కర్ణుడు బ్రాహ్మణుడు కాదని తెలుసుకొని, బ్రహ్మాస్త్రం ప్రయోగించే సమయంలో దాని మంత్రం మరిచిపోతావని శాపం ఇచ్చాడు.

రెండవ ఉదంతం – ఒకరోజు నిర్జన కీకారణ్యంలో ధనుర్విద్యాభ్యాసం చేస్తున్న కర్ణుడు ఒక ఆవుదూడను పొరపాటున కొట్టి చంపాడు. వాటి యజమానియైన బ్రాహ్మణుడు కర్ణుని నీవు రణరంగంలో యుద్ధం చేసే సమయంలో నీ రథచక్రము భూమిలో దిగబడి పోయి నీకు ఆపద వచ్చును గాక.' అని శపించాడు.

యుద్ధరంగంలోకి వచ్చిన కర్ణుడు పాండవుల వ్యూహాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాడు. దానిని ధృష్టద్యుమ్నుడు రక్షిస్తూ వున్నాడు. దానికి ధీటుగా కర్ణుడు వ్యూహరచన చేయసాగాడు. కర్ణుని వ్యూహరచన ప్రకారం కుడివైపు కృపాచార్యుడు ఎడమ వైపు శకుని, ఆ తర్వాత సంశప్తకులు, మధ్యలో కర్ణుడు, ఆ తర్వాత దుశ్శాసనుడు, వెనుక వైపు దుర్యోధనుడు, వెన్నంటి అశ్వత్థామ తగినంత కాల్బలం, అశ్వికబలం గల రథములు మరియు గజములు పెట్టని కోటవలె ఉన్నాయి.

ధర్మరాజు అర్జునునితో 'అర్జునా! నీవు కర్ణునితో, భీముడు దుర్యోధనునితో, నకులుడు వృషసేనునితో, సహదేవుడు శకునితో, సాత్యకి కృతవర్మతో, ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామతో తలపడండి. నేను కృపాచార్యునితో యుద్ధం చేస్తాను.' అని అన్నాడు.

రెండు పక్షాలు సమీపించి సంకుల సమరం చేయసాగాయి. అర్జునుడు సంశప్తకులను బాధింపసాగాడు. కర్ణుడు పాండవులను తరిమి కొట్టసాగాడు. అర్జునుడు సంశప్తకులను చూడగానే రెచ్చిపోయి ముందుకు దూసుకు పోయాడు. వారు కూడ అర్జునుని చంపాలని నిశ్చయంతో పెట్రేగి పోయారు. అలాగే కర్ణుడు కూడ పాండవులను చూడగానే ఆవేశంతో పాండవ సేనను హతమారుస్తూ, ధర్మరాజును నొప్పించాడు. దీన్ని గమనించిన పాండవ వీరులు ధృష్టద్యుమ్నుడు, భీముడు, సాత్యకి, శిఖండి, నకులుడు, సహదేవుడు అందరూ కర్ణుని తుదముట్టించాలని, కర్ణునిపై వారందరు శరపరంపరను కురిపించ సాగారు. కర్ణుని పుత్రులు మరియు కౌరవ యోధులు కొందరు ఆ దూకుడును తగ్గించారు. అదేసమయంలో కర్ణుడు తన తీక్షణ బాణాలతో విశాలమైన పాండవ సైన్యాన్ని సంహరించ సాగాడు. క్రమంగా ధర్మరాజుపై ఆక్రమణ చేశాడు కర్ణుడు. ధర్మరాజు కూడ ఎంతో నైపుణ్యంతో యమదండంలాంటి బాణాన్ని కర్ణునిపై ప్రయోగించాడు. దాని ప్రభావంతో కర్ణుడు అచేతనుడై శల్యుని రథం ఎదుట పడిపోయాడు. కౌరవసేన హాహాకారాల మధ్య, కర్ణుడు చేతనుడై వెంటనే ధర్మరాజు యొక్క వేగాన్ని నిరోధించాడు. రకరకాల అస్త్రాలను ప్రయోగించి, ధర్మరాజు రథాన్ని ముక్కలు చేశాడు. అలా పరాజితుడైన ధర్మరాజు మరొక రథం ఎక్కి యుద్ధరంగం నుండి పారిపోయాడు.

దీన్ని గమనించిన భీముడు బిగ్గరగా సింహనాదం చేస్తూ, కర్ణుని వైపు రాసాగాడు. అది గమనించిన దుర్యోధనుడు తన సోదరులను కర్ణునికి బాసటగా పంపాడు. క్రోధంతో భీముడు అడ్డువచ్చిన వివిత్సుని బల్లెంతో చంపాడు. మిగతావారు భీమునిపై దాడిచేయగా, భీముడు రెండు బల్లేలను ఒకేమారు ప్రయోగించి వికటుని, సకున్ని చంపేశాడు. కౌరవ సైన్యం హాహాకారాలు మ్రోగాయి. భీముడు క్రోధుని, నందుని, ఉపనందుని చంపాడు.

కర్ణుడు అపుడు ముందుకు వచ్చి భీముని రథాన్ని కూల్చాడు. భీముడు గద తీసుకొని కౌరవ సైన్యంలోకి చొచ్చుక పోయి వారిని చంపసాగాడు.

ఇలా రెండు పక్షాల యోధులు పరాక్రమించారు. శిఖండి కృపాచార్యుని చేతిలో ఓడిపోయాడు. ధృష్టద్యుమ్నుని చేతిలో కృతవర్మ పరాజితుడైనాడు. ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుని చిత్తుగా ఓడించాడు. మరొకవైపు కర్ణుడు పాండవ సైన్యాన్ని సంహరిస్తున్నాడు. అర్జునుడు సంశప్తకులను సంహరించటమే గాక అశ్వత్థామను యుద్ధరంగం నుండి పారియిపోయేటట్లు చేశాడు. ఆ తరువాత అశ్వత్థామ ధృష్టదుమ్నుని ఓడించాడు. సాత్యకి శకునిని పారద్రోలాడు. మరొకవైపు భీముడు కౌరవ సైన్యాన్ని చంపుతుండగా, దుర్యోధనుడు అడ్డుకొన్నాడు. భీముడు దుర్యోధనుని అశ్వాలను, సారథిని చంపాడు. దిక్కుతచక అక్కడినుండి దుర్యోధనుడు పారిపోయాడు.

ధర్మరాజు కౌరవ సైన్యాన్ని సంహరించసాగాడు. కౌరవ సైనికులు పరుగెత్తటం చూచిన కర్ణుడు కోపంతో ధర్మరాజును మూర్ఛిల్లునట్లు గాయపరచాడు. తట్టుకోలేక ధర్మరాజు సారథితో శిబిరానికి తీసికొని పొమ్మని చెప్పాడు. భీముని ద్వారా విషయం తెలిసి, శ్రీకృష్ణుడు, అర్జునుడు వెళ్ళి ధర్మరాజును పరామర్శించారు. ఇలాగ కర్ణుని చావు తప్పదని అర్జునుడు చెప్పాడు. 'నీ చేతిలో చావకుండా ఇంకా కర్ణుడు బ్రతికే ఉన్నాడా? నన్ను అవమానించినవాడు ఇంకా బ్రతికే ఉండటం నీ గాండీవానికే అవమానం' అని ధర్మరాజు ఆక్రోశించాడు అర్జునునితో. అపుడు అర్జునుడు ధర్మరాజును చంపుటకు కత్తిని ఎత్తాడు. ఆశ్చర్యపడిన శ్రీకృష్ణుడు కత్తి ఎందుకు ఎత్తావు అని అర్జునుని అడిగితే, నా గాండీవాన్ని ఎవరైనా తూలనాడితే చంపుతానని ప్రతిజ్ఞ చేసి ఉన్నాను' అని అర్జునుడు చెప్పాడు. అపుడు శ్రీకృష్ణుడు 'అర్జునా! నీకు సరైన అవగాహన లేక ధర్మసూక్ష్మాలను గ్రహించలేక వున్నావు. నీకు ఒకటి రెండు ఉదంతాలు చెప్తాను. విను.

మొదటి ఉదంతం: పూర్వం ఒక వేటగాడు ఉండేవాడు. అతడు ప్రతిరోజూ జింక పిల్లల్ని వేటాడి తన వృద్ధ తల్లిదండ్రులను, ఆశ్రితులను పోషిస్తూ ఉండేవాడు. ఒకరోజు అతనికి ఏదీ లభించలేదు. కాని ఒకచోట ఒక విచిత్రమైన జంతువు కనిపించింది. అది ముక్కుతో వాసన చూచి అదేమిటో గ్రహిస్తుంది. అది నీరు త్రాగుతున్న సమయంలో వేటగాడు దానిని చంపాడు. వెంటనే ఆకాశం నుండి అప్సరసలతో కూడిన ఒక విమానం క్రిందికి దిగింది. అసలు విషయ మేమంటే ఆ చంపబడిన జంతువు పూర్వజన్మలో తపస్సు చేసి, ప్రాణులందరిని చంపి తినుటకు వరము పొందింది. అందుచేత దానిని దేవతలు గ్రుడ్డిదానినిగా చేసినందున, అది ముక్కుతో వాసన చూచి ఏమిటో గ్రహిస్తుండేది. అటువంటి క్రూర జంతవును చంపినందున వేటగాడు స్వర్గానికి వెళ్ళాడు.

అర్జునా! నీకు బాగా అర్థమయ్యేందుకు మరొకటి చెప్తాను. విను.

రెండవ ఉదంతం: పూర్వకాలంలో కౌశికుడు అను బ్రాహ్మణుడు సర్వకాల సర్వావస్థల యందు సత్యమునే పలికేవాడు. కనుక అతనికి సత్యవాది అని పేరు వచ్చింది. ఒకరోజు కొందరు యాత్రికులు వచ్చి మమ్మల్ని దోపిడీవాళ్ళు తరుముకొస్తున్నారని చెప్పి, సత్యవాది ఇంటికి దగ్గరలో వున్న చెట్ల గుబురుల్లో దాక్కున్నారు. దానిని సత్యవాది గమనించాడు.

అక్కడికి వచ్చిన దోపిడీదారులు యాత్రికుల గురించి సత్యవాదిని అడిగారు. సత్యవాది నిజమే చెన్పినందున, వాళ్ళు యాత్రికులను దోచుకొని వెళ్ళిపోయారు. ఆ కారణంగా ఆ సత్యవాదికి నరకం ప్రాప్తించింది. ఇందులో ఉన్న ధర్మసూక్ష్మాన్ని గ్రహించాలి. హింసను హింసతోనే అరికట్టాలి అని తెలుస్తున్నది. అర్జునా! ఇప్పుడు చెప్పు.

ధర్మరాజు వధ్యుడేనా?' ఈరకంగా శ్రీకృష్ణుడు అర్జునుని ప్రతభంగాన్నుండి, భ్రాతృవధ నుండి, ఆత్మఘాతం నుండి రక్షించాడు. అర్జునుని చేష్టలకు విసిగి తాను అడవులకు వెళతానని తెలుపగా శ్రీకృష్ణుడు వారించాడు. అర్జునుడు కూడ తనను క్షమించమని ధర్మరాజు పాదాలపై పడ్డాడు. భీముడు అర్జునుని చూచి సంతోషించి యుద్ధానికి దూకాడు. ఆ ఇద్దరూ కౌరవ సేనను సమూలంగా ధ్వంసం చేసేందుకు ముందుకు సాగారు.

రాజా! అలా యుద్ధం జరిగే సమయంలో దుశ్శాసనుడు బాణవర్షం కురిపిస్తూ భీమునివైపు వచ్చాడు. భీముడు, దుశ్శాసనుల మధ్య భయంకర యుద్ధం జరిగింది. భీముడు దుశ్శాసనుని ధనస్సును విరిచి, సారథిని చంపాడు. దుశ్శాసనుడు ధైర్యంతో మరొక ధనుస్సుతో, అశ్వాలను సంభాళించుకొని, భీమునిపై పోరుకు ముందుకు సాగాడు. తరువాత దుశ్శాసనుడు ఒక వజ్రసమానమైన భయంకర బాణాన్ని వదిలాడు. ఆ బాణం యొక్క తాకిడికి, భీముని అవయవాలన్నీ శిథిలమై రథంలోనే పడిపోయాడు. మళ్ళీ కాసేపటికి తేరుకొని యుద్ధం చేయసాగాడు. దుశ్శాసనుడు భీముని ధనుస్సును విరిచి సారథిని ఇబ్బంది పెట్టినప్పుడు భీముడు క్రోధంతో ఒక శక్తిని ప్రయోగించగా, దానిని దుశ్శాసనుడు ముక్కలు చేశాడు. కౌరవ సేన సంతోషంతో దుశ్శాసనుని కీర్తించింది.

భీముడు ఆగ్రహంతో తన గదను వేగంగా విసిరాడు. దుశ్శాసనుని శక్తిని ముక్కలు చేస్తూ, రథాన్ని విరగకొడుతూ, దుశ్శాసనుని తాకింది. దుశ్శాసనుడు నేలపై పడిపోయాడు. వెంటనే భీముడు రథం దిగి దుశ్శాసనుని ఆక్రమించాడు. కర్ణుడు, దుర్యోధనుడు చూస్తుండగానే, భీముడు దుశ్శాసనుని మెడను త్రొక్కిపెట్టి కటువుగా ఇలా అన్నాడు. 'ఓరీ దుశ్శాసనా! నాడు ద్రౌపదిని లాక్కొచ్చిన నీ చేతిని ఊడబెరికి, నా ప్రతిజ్ఞ మేరకు నీ రొమ్ము చీల్చి, రక్తాన్ని త్రాగువలసి ఉన్నది" అనగానే దుశ్శాసనుడు వణకడం మొదలుపెట్టాడు. భీముని వీరత్వము, క్రోధం చూచిన కౌరవ సైన్యం యావత్తు హాహాకారాలు చేస్తూండగానే, వారి ఆయుధాలు క్రింద పడిపోయాయి.

భీముడు ఒక్కపెట్టున దుశ్శాసనుని కుడిచేతిని ఊడబెరికి, రొమ్మును చీల్చి, ఉబికి వస్తున్న రక్తాన్ని త్రాగసాగాడు. ఆ తరువాత కత్తితో దుశ్శాసనుని తల తెగనరికి వేశాడు.

తదనంతరం, దుర్యోధనుడు, కృతవర్మ, శకుని, కృపాచార్యుడు మరియు కర్ణుడు ఈ అయిదుగురు మహారథులు శ్రీకృష్ణార్జునులపై భయంకర బాణవర్షం కురిపించ సాగారు. తోడుగా భీకర కౌరవ సైన్యం కూడ వచ్చి చేరింది. అర్జునుడు ఒక్కడే ఆ మహారథుల ధనుస్సులు విరగగొట్టి, కౌరవ సైన్యాన్ని పారద్రోలాడు. వెంటనే పూలవర్షం కురవసాగింది జయకేతనంగా.

ఇదంతా గమనించిన అశ్వత్థామ దుర్యోధనుని వద్దకు వెళ్ళి, 'దుర్యోధనా! నీవు సంతోషంతో పాండవులతో సంధి చేసుకో. విరోధంతో ఏ లాభమూ లేదు. నీ గురుదేవుడు అస్త్రవిద్యా నిపుణుడై కూడ యుద్ధంలో చంపబడ్డాడు. ఇదే స్థితి భీష్మునికి, మిగిలిన మహారథులకు ప్రాప్తించింది కదా! నేను, కృపాచార్యులు మాత్రమే బ్రతికి ఉన్నాం. అందుచే నీవు పాండవులతో కలిసి చిరకాలం రాజ్యాన్ని పాలించుకో. నేను అర్జునుని ఒప్పించగలను. అలాగే శ్రీకృష్ణుడు కూడ సరేనంటాడు. హితైషి ధర్మరాజు సమ్మతిస్తాడు. మిగిలిన పాండవులు ధర్మరాజు మాట వింటారు.

అందుచేత దుర్యోధనా! నీవు పాండవులతో మైత్రిని స్వీకరిస్తే, ప్రపంచ కళ్యాణం చేసినవాడవు అవుతావు.' ఇలా పలికిన మాటలను దుర్యోధనుడు ఖిన్నుడై విని ఇలా అన్నాడు. 'నీవు చెప్పిన విషయాలన్నీ నిజమే. కాని నా మాటలు కూడ విను. భీముడు దుశ్శాసనుని కిరాతంగా చంపిన తరువాత అన్న మాటలు నా చెవుల్లో ఇప్పటికీ

రింగుమంటున్నాయి. భీముడు ఇలా అన్నాడు 'ఈ రణయజ్ఞంలో దుర్యోధనుడనే యుద్ధపశువును బలి ఇస్తాను.' ఈ దశలో నాకు శాంతి ఎలా లభిస్తుంది? ఇప్పుడెలా సంధి సాధ్యమౌతుంది? గురుపుత్రా! ఇపుడు అర్జునుడు విపరీతంగా అలసిపోయి వున్నాడు. అందుకని కర్ణుడు అర్జునుని జయించగలడు.' అని దుర్యోధనుడు అశ్వత్థామతో వినయంగా మాట్లాడి ప్రసన్నం చేసుకొన్నాడు.

రాజా! కర్ణార్జునుల మధ్య చాలసేపు భయంకర పోరు జరిగింది. అర్జునుడు బ్రహ్మకు నమస్కరించి, బ్రహాస్త్రమును ప్రయోగించగా, కర్ణుడు తన బాణపరంపరతో దానిని నష్టపరిచాడు. అర్జునుడు మరొక బ్రహ్మాస్త్రాన్ని సంధించగా, దానినుండి వెలువడిన ప్రజ్వలిత బాణాలు నలుదిశలా నిండిపోయాయి. అంతే కాదు, ఆ బాణాల నుండి వెలువడిన బల్లెములు, చక్రములు, త్రిశూలాలు మరియు గదలు కౌరవ యోదులను సంహరించ సాగాయి. కర్ణుడు కూడ అర్జునునిపై శరపరంపర కురిపించాడు. శ్రీకృష్ణార్జునులతో పాటు వున్న భీమునిపై కూడ బాణవర్షం కురిపించి, కర్ణుడు బిగ్గరగా నవ్వసాగాడు. దానికి స్పందించిన అర్జునుడు కర్ణుని రథధ్వజాన్ని విరగగొట్టి, కౌరవ సైన్యాన్ని చెండాడసాగాడు. వారందరు వచ్చి కర్ణునితో మొరపెట్టుకోగా, కర్ణుడు కూడ పాండవ సైన్యాన్ని సంహరించ సాగాడు. ఇద్దరూ అస్త్రశస్త్ర ప్రవీణులే కావడం చేత, తమ తమ శత్రుసేనను ధ్వంసం చేయసాగారు.

ఒక సమయంలో కర్ణుడు కృష్ణార్జునులను ఇబ్బంది పెట్టినపుడు కౌరవ సైన్యం సంతోషించింది. అపుడే కర్ణుడు అర్జునుని గాయపరచాడు. అర్జునుడు కురిపించిన బాణవర్షాన్ని తట్టుకోలేక కౌరవసైన్యం పారిపోసాగింది. కర్ణునికి తన పక్షం వారు ఎవరూ కనిపించక పోవడం చూచినా, ధైర్యంతో అర్జునుని ఎదుర్కొన్నాడు. అపుడు అర్జునుడు ప్రచండ రూపాన్ని ధరించి, కౌరవసైన్యాన్ని భస్మం చేస్తున్నాడు. ఇదిచూచిన కర్ణుడు పరశురాముని ద్వారా పొందిన 'అథర్వణ' అస్త్రాన్ని ప్రయోగించాడు. అర్జునుడు అన్నింటిని ఎదుర్కొన్నాడు. అంతరిక్షం నుండి చూస్తున్నవారు కూడా విస్మయం ప్రకటించారు. కర్ణార్జునులిద్దరూ ఒకరిని మించి మరొకరు తమ తమ యుద్ధకౌశలాన్ని, పరాక్రమాన్ని ప్రకటించ సాగారు.

ఇదే సమయంలో పాతాళంలో వున్న అర్జునుని విరోధియైన అశ్వసేనుడు నాగజాతి వీరుడు కర్ణుని అమ్ముల పొదిలో బాణరూపంలో ఒదిగిపోయాడు. ఆ సమయంలో కర్ణుడు ఈ సర్పముఖ బాణాన్ని గుర్తుకు తెచ్చుకొన్నాడు. అది అత్యంత భయంకరమైనది. దానిని అర్జునుని చంపటానికే చాల రోజుల నుండి జాగ్రత్తగా ఉంచాడు. కర్ణుడు ఆ బాణానికి నిత్యం పూజ చేస్తూ, బంగరు అమ్ముల పొదిలో జాగ్రత్తచేస్తూ ఉండేవాడు. ఆ బాణాన్ని కర్ణుడు ఇప్పుడు ధనుస్సుపై ఎక్కుపెట్టాడు. కాని అశ్వసేనుడు ఆవహించి ఆ బాణామును ఎక్కుపెట్టగా, ఇంద్రాది లోకపాలురు అయ్యో! అని అనుకొన్నారు.

అది అత్యంత వేగంగా రావటం చూచిన శ్రీకృష్ణుడు తన కాలితో రథాన్ని నొక్కిపట్టి, రథాన్ని కాస్త భూమిలోకి దించాడు. అశ్వాలు కూడ అది గ్రహించి, మోకాళ్ళు వంచాయి. అలా దూసుకువచ్చిన బాణం అర్జునుని మకుటాన్ని తాకి కిందపడిపోయింది. నిజానికి ఆ మకుటము ఇంద్రుని కొరకు బ్రహ్మ కావాలని రూపొందించిందే. అర్జునుడు రాక్షస సంహారానికి వెళ్ళేటపుడు దానిని అర్జునునికి ఇంద్రుడు ఇచ్చాడు. ఆ మకుటమే ఇప్పుడు సర్పము యొక్క విషానికి మాడిపోయింది. తక్షక పుత్రుడైన అశ్వసేనుడు సర్పబాణ ముఖముతో ఆవహించి అర్జునుని బలిగొనాలని చూశాడు. మళ్ళీ అమ్ముల పొదిలో దూరాలని చూచిన అశ్వసేనుని కర్ణుడు చూచి నీవెవరు అని అతణ్ణి అడిగాడు. అపుడు అశ్వసేనుడు 'కర్ణా! నేను నాగరాజు తక్షకుని పుత్రుణ్ణి. ఖాండవ

దహనంలో అర్జునుడు మాకు విరోధి. ఈసారి మళ్ళీ నీవు నన్ను ఉపయోగించు. తప్పక నేను అర్జునుని చంపుతాను' అని అన్నాడు.

అపుడు కర్ణుడు ఇలా అన్నాడు. 'ఓయీ! ఈ కర్ణుడు ఇతరుల బలంమీద ఆధారపడి మనుగడ సాగించువాడు కాదు. వందలాది అర్జునులను చంపవలసి వచ్చినా నేను నీ సహాయం తీసుకోను. ఒకసారి ప్రయోగించిన బాణమును మళ్ళీ వేయను. నా దగ్గర కూడ సర్పబాణమున్నది. ఇక నీవు వెళ్ళవచ్చును.' అనగా, కర్ణుని వాలకం నాగరాజుకు నచ్చలేదు. తానే మహాభయంకరమైన రూపం దాల్చి, అర్జునుని వైపు వెళ్ళసాగాడు. దీన్ని చూచిన శ్రీకృష్ణుడు 'అర్జునా! ఖాండవ వనదహనం తరువాత, అక్కడినుండి పారిపోయిన తక్షకుని పుత్రుడు నీమీదకు వస్తున్నాడు. ఆ నాగరాజును అంతం చేయి' అనగానే అర్జునుడు నాగరాజును ముక్కలు ముక్కలుగా చేసేశాడు.

కర్ణార్జునుల మధ్య పోరు భయంకరంగా సాగుతోంది. అర్జునుడు కర్కశమైన బాణాలతో కర్ణుని హింసిస్తున్నాడు. అయినా కర్ణుడు కూడ వీడకుండా ఎదురాడుతున్నాడు పరశురాముని శాప కారణంగా కర్ణునికి బ్రహ్మాస్త్ర మంత్రం గుర్తుకు రావడం లేదు. బ్రాహ్మణుడిచ్చిన శాప కారణంగా రథం భూమిలో కూరుకు పోసాగింది. కర్ణుడు ధర్మాన్ని నిందిస్తూ, అటూ ఇటూ ఊగిపోతున్నాడు. అర్జునుడు మాత్రం బాణాలను సంధిస్తూ, కర్ణుని బాధిస్తూనే ఉన్నాడు. కర్ణుడు కోపంతో అర్జునుని యొక్క ధనుస్సు అల్లెత్రాడును తెంచేశాడు. అర్జునుడు మరో ధనుస్సు తీసుకోగా, రెండవసారి కూడా త్రెంచేశాడు. ఇలా 11 సార్లు త్రెంచి, అర్జునుని నియంత్రించాడు కర్ణుడు. అర్జునుడు మళ్ళీ శరపరంపరలు కురిపించ సాగాడు. వీటన్నింటిని ఎదుర్కొంటూ, కర్ణుడు అర్జునుని కంటే పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఇక ఇలా కర్ణుని ఉపేక్షించకూడదని, అర్జునుడు రౌద్రాస్త్రాన్ని ప్రయోగించ సిద్ధపడ్డాడు. సరిగ్గా అదే సమయానికి కర్ణుని రథ చక్రం మరింతగా భూమిలోకి క్రుంగిపోసాగింది. దానిని లేవనెత్తుటకు కర్ణుడు ఎంతో ప్రయత్నించినా అది లేవలేదు. అపుడు కర్ణుడు అర్జునుని చూస్తూ ఇలా అన్నాడు. 'ఓ కుంతీకుమారా! నీవు గొప్ప ధనుర్ధరుడవు. నేను ఈ రథ చక్రం ఎత్తేవరకు ఆగు. అంతేకాదు, ఎవరైతే వెన్నుచూపి పరుగెత్తుతాడో, ఎవరైతే రెండు చేతులూ ఎత్తి నమస్కరిస్తారో, ఎవరైతే ఆయుధాలను విడిచి పెడతారో, అలాంటి వారిపై శూరవీరులు బాణప్రహారం చేయరు. నీవు ఎరుగక కాదు. సదాచారుడవు అయివున్నావు. యుద్ధ ధర్మం తెలిసినవాడవు. ఉపనిషత్తులు తెలిసినవాడవు. దివ్యాస్త్రములను ఎరిగిన వాడవు మరియు ఉదార హృదయుడవు. కార్తవీర్యార్జునుడంతటి వాడిని నిర్జించిన వాడవు. నేనీ రథ చక్రం ఎత్తేవరకు ఆగు. నీవు రథముపై ఉన్నావు. అందుచే నీవు నాపై ప్రహారం చేయడం ఉచితమైన పని కాదు.'

కర్ణుని మాటలు విన్న శ్రీకృష్ణుడు ఇదియే ఉచితమై సమయమని భావించి ఇలా అన్నాడు. 'ఓ కర్ణా! చాల గొప్ప సంగతే. నీవు ఈ సమయంలో ధర్మాన్ని గురించి మాట్లాడుతున్నావు. పాండవులు నియమానుసారం అజ్ఞాతవాసం పూర్తి చేసుకొన్న తర్వాత కూడ వారి రాజ్యభాగం వారికి ఇవ్వనివ్వ లేదు. నీ సలహా మేరకే దుర్యోధనుడు భీమునికి విషాహారం పెట్టాడు. పాములతో కరిపించాడు. అపుడు ఏమైంది నీ ధర్మం? లక్కభవనం తగలపెట్టినపుడు, ద్రౌపది వస్త్రాపహరణ మప్పుడు, చక్రవ్యూహంలోకి అభిమన్యుడు చొరబడినప్పుడు నీ ధర్మం ఏమైంది? నిరాయుధుడైన అభిమన్యుని చంపినపుడు ఏమైంది నీ ధర్మం? అని శ్రీకృష్ణుడు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక కర్ణుడు తలదించుకొన్నాడు.

ఆ తరువాత కూడ ధనస్సు తీసుకొని అర్జునునిపై అతి వేగంగా బాణాల్ని సంధించాడు. అర్జునుడు కర్ణునిపై ఆగ్నేయాస్త్రాన్ని వదిలాడు. కర్ణుడు దానిని వారుణాస్త్రంతో శాంతింప చేశాడు. తరువాత చీకట్లు క్రమ్ముకోగ,

వాటిని అర్జునుడు వాయవ్యాస్త్రంతో తొలగించాడు. కర్ణుడు అర్జునుని వధించాలనే తలంపుతో అగ్నిసన్నిభమైన ఒక బాణాన్ని తీసుకొని గురిపెట్టగా, పర్వతాలు, అడవులు, యావత్ భూమి కంపించ సాగింది. కర్ణుడు దానిని వదలగానే, అది బలంగా అర్జునుని తాకింది. ఆ తాకిడికి అర్జునుడు నిలువెల్లా శిథిలమవసాగాడు. ఇదే సమయమని కర్ణుడు రథచక్రాన్ని పైకెత్తే ప్రయత్నం చేశాడు. కాని సఫలుడు కాలేదు. వెంటనే తేరుకొన్న అర్జునుడు కర్ణుని రథ ధ్వజాన్ని ధ్వంసం చేశాడు. దానితో కర్ణుని మరియు కౌరవుల యశస్సు నశించింది. అపుడు హాహాకారాలు చెలరేగాయి.

అర్జునుడు తన అమ్ములపొది నుండి వజ్రాయుధంతో సమానమైన, యమదండం లాంటి బణాన్ని తీశాడు. దానికి ఆరు రెక్కలున్నాయి. కనుక వేగంగా పరిగెత్త గలదు. అది సుదర్శన చక్రాన్ని పోలి కాలాగ్ని వలె భయంకరంగా ఉన్నది. దానిని ప్రయోగిస్తూ అర్జునుడు ఇలా అన్నాడు. 'నేను గురుజనుల మరియు పెద్దల సేవ చేయుచూ సత్యమును ఆశ్రయించిన వాడనైతే నేను ప్రయోగిస్తున్న ఈ బాణం కర్ణుని అంతు చూచుగాక!' అని ఆ బాణాన్ని ప్రయోగించగా, సూర్యుని వలె వెలుగొందుతూ నేరుగా వెళ్ళి కర్ణుని యొక్క మస్తకమును తెగనరికింది. ఆ సమయంలో కర్ణుని శరీరం నుండి ఒక తేజస్సు ఎగసి సూర్యమండలంలో విలీనమయింది. అచ్చటి వారందరు ఈ దృశ్యాన్ని చూచారు.

ఇలా కర్ణుడు స్వర్గస్తుడు కాగానే, పాండవ పక్షంలోని వారందరూ ఆనందంతో శంఖాలు ఊదసాగారు. ఎందరో రాజులు అర్జునుని ఆలింగనం చేసుకొన్నారు. కౌరవ పక్షంలోని వారు భయంతో పారిపోసాగారు.

దుర్యోధనుడు కంటనీరు పెట్టుకున్నాడు. భీముడు ఆనందంతో నాట్యం చేశాడు. శల్యుడు దుర్యోధనుని వద్దకు వచ్చి ఊరడించ సాగాడు. 'రాజా! నేడు కర్ణార్జునుల యుద్ధం అసమానంగా సాగింది. చివరివరకు కర్ణునిదే పైచేయిగా తోచింది. కాని విధి నిర్ణయం అనుకూలంగా లేదు. నీ పక్షాన పోరాడిన వారందరూ వీరులే, పరాక్రమవంతులే, శౌర్యవంతులే, తేజోశాలురే. వీరు అవధ్యులైనప్పటికీ మరణించారు. ఇదంతా ప్రారబ్ధమనుకొని, ధైర్యాన్ని చిక్కబట్టుకొని వుండు.' అని చెప్పాడు.

ఓ రాజా! యుద్ధంలో గాయపడి శిబిరంలో వున్న ధర్మరాజుకు కర్ణుని మరణ వార్త వినిపించుటకు శ్రీకృష్ణార్జునులు శిబిరానికి చేరారు. ప్రసన్నుడైన ధర్మరాజు ఇలా అన్నాడు. 'దేవకీనందనా! ఇది ఆనందకరమైన విషయం. నీవు సారధ్యం చేశావు. కాబట్టి అర్జునుడు చంపగలిగాడు. నీవందించిన మెళుకువలతోనే ఇది సుసాధ్యమయింది. నిన్ను ఎంత ప్రశంసించినా తక్కువే అని తలుస్తాను.'

ఈ అప్రియ సమాచారం విన్నటువంటి ధృతరాష్ట్రుడు మొదలు నరికిన చెట్టువలె క్రింద పడిపోయాడు. ఇదేవిధంగా గాంధారి కూడ విలపిస్తూ, శోకసముద్రంలో మునిగిపోయింది. ఆ సమయంలో విదురుడు గాంధారిని, సంజయుడు ధృతరాష్ట్రుని అనునయించారు.

ఎవరైతే కృష్ణార్జునుల యుద్ధమనే యుద్ధయజ్ఞాన్ని చదివెదరో, వినెదరో, వారు యజ్ఞఫల ప్రాప్తి పొందుతారు. అంతేకాదు. బ్రాహ్మణులకు వేదపఠన ఫలాలు, క్షత్రియులకు యుద్ధంలో విజయము, వైశ్యులకు ధనవృద్ధి, శూద్రులకు ఆరోగ్యము లభిస్తుంది.

-o0o-

9. శల్య పర్వం

కర్ణుడు చనిపోయిన తర్వాత కౌరవ సైన్యం అంతా పారిపోసాగింది. దుర్యోధనుడు ఎంత చెప్పినా వినే స్థితిలో లేదు. దుఃఖితుడైన దుర్యోధనునితో కృపాచార్యుడు 'రాజా! నీతో మాట్లాడాలనుకుంటున్నాను. నీకు నచ్చితే దానిననుసరించు. ఇంతవరకు భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, సైంధవుడు, నీ సోదరులు ఎందర మరణించారు. శ్రీకృష్ణుడు సారథిగా వున్నంతవరకు అర్జునుని దేవతలు కూడ జయించలేరు. యుద్ధం మొదలై 17 రోజులైంది. మనది చుక్కాని లేని నావ అయింది. బృహస్పతి నీతి ననుసరించి, 'బలహీన పడినపుడు, సంధి చేసుకోవాలి.' అందుకని నీవు సావధానంగా ఆలోచించి, తగిన నిర్ణయం తీసుకొని మిగిలిన వారినందరిని కాపాడు.' అని చెప్పగా, దుర్యోధనుడు 'విప్రవర్యా! మీరు నా హితం కోరి చెపుతున్నారు. కాని మరణించే వ్యక్తికి ఔషధం రుచించనట్లు, నాకు కూడ సంధి చేసుకోవటం ఇష్టం లేదు. జూదంతో నేను ధర్మరాజును కష్టాలపాలు చేశాను. దూతగా వచ్చిన శ్రీకృష్ణుని బంధించ ప్రయత్నించాను. ద్రౌపదిని అవమానించాను. ఈ రకంగా వైరభావం అగ్ని జ్వాలలా ప్రజ్వరిల్లుతోంది. కనుక సంధి ప్రస్తావన సరియైనది కాదు. నేను పాండవులను బ్రతిమాలి రాజ్యం దక్కించుకోవడం కంటే యుద్ధంచేసి వీరస్వర్గం అలంకరిస్తాను.' అని చెప్పి, తర్వాత మహారథియైన అశ్వత్థామ వద్దకు వెళ్ళాడు. అశ్వత్థామకు యుద్ధవిద్యలన్నీ కరతలామలకాలే. శుక్రాచార్య డంతటి తెలివితేటలు గలవాడు. దుర్యోధనుడు 'గురుపుత్రా! ఇప్పుడు అందరి ఆశలు మీపైనే ఉన్నాయి. అందుచేత మీరు ఆజ్ఞాపించండి. ఇపుడు ఎవరిని సైన్యాధిపతిగా నియమిద్దాం.' అని అన్నాడు. అందుకు అశ్వత్థామ ఇలా అన్నాడు. 'మనలో పరాక్రమవంతుడు, తేజస్సు మరియు యశస్సు గలవాడు, సర్వగుణ సంపన్నుడు అయిన శల్యుని సేనాధిపతిగా నియమించండి.' వెంటనే దుర్యోధనుడు శల్యుని వద్దకు వెళ్ళి తన మనసులోని మాటను చెప్పగా శల్యుడు సంతోషంతో అంగీకరించి ఇలా అన్నాడు. 'ఓ కురురాజా! నా ప్రాణం, ధనం, రాజ్యం సర్వం మిమ్మల్ని సంతోష పెట్టడానికే' అని చెప్పాడు.

'పూర్వం కార్తికేయుడు యుద్ధంలో దేవతల్ని రక్షించినట్లు, మీరు సేనాధిపతి పదవి స్వీకరించి, మమ్మల్ని రక్షించండి.' అని దుర్యోధనుడు అన్నాడు.

శల్యుడు 'దుర్యోధనా! నా మాట విను. మహారథులలో శ్రీకృష్ణార్జునులు శ్రేష్ఠులని అందరూ అనుకొంటారు. కాని బాహుబలంలో వారు నాకు సాటిరారు. మీ సైన్యానికి నాయకత్వం వహిస్తాను. దుర్భేద్యమైన వ్యూహరచన చేస్తాను.' అని అన్నాడు. తరువాత శాస్త్రయుక్తంగా శల్యుని సేనాధిపతిగా అభిషేకించారు. శల్యుని యొక్క నాయకత్వాన్ని సమస్త కౌరవ సైన్యం, నాయకులు హర్షంతో సంతోషం వ్యక్తం చేశారు.

18వ రోజు యుద్ధం – శల్యుని సేనాధిపతిత్వం :

దుర్యోధనుని ఆజ్ఞమేరకు సైన్యం యుద్ధానికి సిద్ధమైంది. కృపాచార్యుడు, కృతవర్మ, అశ్వత్థామ, శల్యుడు, శకుని మరియు ఇతర రాజులు ఒకచోట చేరి ఇలా శపథం చేశారు. 'మనలోనుండి ఎవరు కూడా పాండవులతో ఒంటరిగా పోరాడరాదు. అంతేకాదు, పాండవులతోపోరుడుతున్న వారిని వదలి పెట్టి వెళ్ళకూడదు.' ఆ తర్వాత శల్యుడు 'సర్వతోభద్ర' అనే వ్యూహాన్ని రచించాడు పాండవులు కూడ తమ సైన్యాన్ని మూడు భాగాలుగా విభజించి, ధృష్టద్యుమ్ననికి, సాత్యకికి, శిఖండికి అప్పగించారు.

ఆ సమయంలో దుర్యోధనుని వద్ద 11 వేల రథాలు, 10700 ఏనుగులు, రెండు లక్షల అశ్వాలు మరియు 3 కోట్ల కాల్బలము వున్నది. అలాగే ధర్మరాజు వద్ద ఆరు వేల రథాలు, ఆరు వేల ఏనుగులు, 10 వేల అశ్వాలు మరియు ఒక కోటి కాల్బలం ఉంది.

యుద్ధ ప్రారంభంలో నకులుడు మిగిలిపోయిన కర్ణుని ముగ్గురు కుమారులను చంపాడు. ప్రతిభాశాలి యైన శల్యుడు ధర్మరాజు మరియు భీమునితో యుద్ధం ఆరంభించాడు. మరొక చోట దుర్యోధనుడు చేకితానుని చంపాడు. ధర్మరాజు ధూమ్రసేనుని చంపాడు. మధ్యాహ్నం అవుతోంది. శల్యుడు తన పరాక్రమంతో చెలరేగి పోతున్నాడు. అర్జునునికి అశ్వత్థామకు మధ్య జరిగే పోరు రక్తికట్టిస్తోంది.

మామయైన శకునిపై నకులుడు విరుచుకు పడ్డాడు. శల్యుడు నకులుని ధనస్సును తెంచాడు. ఈలోగా సహదేవుడు, ధర్మరాజు, సాత్యకి మరియు భీముడు వచ్చి ఒక్కసారిగా శల్యుని ఎదుర్కొన్నారు. ఆ సమయంలో శల్యుడు ప్రదర్శించిన అస్త్రవిద్యా నైపుణ్యం వీరులు పొగడదగినంతగా ఉంది. శల్యుడు ధర్మరాజు అశ్వాలను చంపాడు, తర్వాత పాండవ సైన్యాన్ని ఊచకోత కోయసాగాడు. ఇది చూచిన భీముడు శల్యుని ధనస్సును విరిచి శల్యుని గాయపరచాడు, సారథిని చంపాడు. నిస్సహాయుడైన శల్యుడు రథం దిగి కత్తి, డాలు తీసుకొని నకులుని రథం ఇరుసును విరగకొట్టాడు. ధర్మరాజు వైపు వెళ్ళాడు. దీన్ని గమనించిన ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, శిఖండి ధర్మరాజుకు అండగా నిలబడ్డారు. భీముడు శల్యునిపై విరుచుకు పడి, అతని కత్తిని, డాలును ముక్కలు చేశాడు. అయినా శల్యుడు ధైర్యంగా ధర్మరాజు వైపు నడిచాడు.

ధర్మరాజు శల్యునిపై ఒక సువర్ణమయ దండాన్ని కలిగిన శక్తిని ప్రయోగించాడు. ఆ శక్తి శల్యుని నిర్వీర్యుణ్ణి చేసి, నేలను తాకునట్లు చేసింది. దానితో శల్యుని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ఆ తర్వాత ధర్మరాజు శల్యుని సోదరుని చంపి, కౌరవ సేనను నాశనం చేయసాగాడు. పాండవులు కౌరవ సైన్యాన్ని సాత్యకి తరుమసాగాడు. కృతవర్మ వచ్చి సాత్యకిని నిరోధించాడు. కృతవర్మ, కృపాచార్యుడు ధర్మరాజును ఎదుర్కొన్నారు. కోపించిన ధర్మరాజు కృపాచార్యుని వేధించి కృతవర్మను రథహీనునిగా చేశాడు. వెంటనే అశ్వత్థామ అక్కడకు వచ్చి కృతవర్మను తన రథంపై ఎక్కించుకొని ధర్మరాజుకు దూరంగా తీసికొని పోయాడు. ధర్మరాజు చేతిలో శల్యుడు మరణించడం వల్ల పాండవ సైన్యానికి ఆనందమే ఆనందము, సైన్యం నాట్యంలో మునిగి తేలుతోంది.

శల్యుని మరణానంతరం శల్యుని ఏడువందల మంది రథికులు కోపంతో పాండవులను ఢీకొట్టి, వారి పరాక్రమానికి మాడి మసైపోయారు. దానితో కౌరవ సైన్యంలో నిరాశ నెలకొంది. అయినా దుర్యోధనుడు ఉత్సాహపరుస్తూ 21 వేల కాల్బలంతో ముందుకు సాగాడు. భీముడు తన భయంకరమైన గదను తీసుకొని ఆ మొత్తం కాల్బలాన్ని చంపేశాడు. పాండవ వీరులందరు కలిసి దుర్యోధనునిపై దాడిచేశారు. దుర్యోధనుడు, ఒక్కడే తన ప్రతాపంతో పాండవులను ఎదుర్కొన్నాడు. కౌరవ సేన దుర్యోధనునికి అండగా నిలిచింది.

ఆ తరువాత సాళ్వరాజు గజరాజును ఎక్కి వచ్చి పాండవ వీరులను సంహరించ సాగాడు. ధృష్టద్యుమ్నుడు ఆ గజరాజు కుంభస్థలాన్ని పగలగొట్టాడు. సాత్యకి సాళ్వ రాజు యొక్క తలను, బల్లెము విసిరి క్రింద పడగొట్టాడు. సాత్యకి వెంటనే కృతవర్మతో తలపడ్డాడు. సాత్యకి కృతవర్మను రథహీనుణ్ణి చేయగా, కృపాచార్యుడు పరుగున

వచ్చి కృతవర్మను తీసుకొని రథంపై వెళ్ళిపోయాడు. నకులుడు, సహదేవుడు, సాత్యకి, భీముడు మరియు ధర్మరాజు ఒక్కసారిగా దుర్యోధనునిపై ఆక్రమణ చేసినా, దుర్యోధనుడు బెదరక వారిని ఎదుర్కొన్నాడు.

రెండు పక్షాల్లో యుద్ధం జరుగుతుండగా, శకుని సహదేవునిపై బాణవర్షం కురిపించాడు. అపుడు అక్కడ శకుని కుమారుడు ఉలూకుడు కూడ ఉన్నాడు. ఇద్దరూ కలిసి భీముని గాయపరచి, నకులునిపై బాణాలు వేయసాగారు. శకుని సహదేవుని మూర్ఛిల్ల చేశాడు భీముడు శకుని సైన్యాన్ని అడ్డుకొని సింహనాదం చేశాడు. తనకు ఎదురుగా వచ్చిన ఉలూకుని తలను సహదేవుడు నరికివేశాడు. ఇదిచూచిన శకుని ఉగ్రుడై సహదేవుని చంపటానికి ప్రయత్నించాడు. కాని శకుని ఆటలు సాగలేదు. చివరకు శక్తిని ప్రయోగించాడు. కాని సహదేవుడు దానిని మూడు ముక్కలు చేసేశాడు. శకునికి భయం పట్టుకొంది. కౌరవ యోధులు పారిపోసాగారు. వారి వెనుక శకుని కూడ పారిపోసాగాడు. సహదేవుడు శకునిని వెంబడించి గాయపరచగా, శకుని తిరగబడ్డాడు. అపుడు సహదేవుడు బలమైన లోహపు బాణాలతో శకునిని చంపేశాడు. పాండవ వీరులు సంతసించి, సహదేవుని ప్రశంసించారు. ఇది చూచిన దుర్యోధనుడు మిగిలిన సైన్యాన్ని ఒకచోటికి చేర్చి 'యోధులారా! పాండవులనందరిని ధృష్టద్యుమ్నుని చంపి నా దగ్గరకు రండి' అని ఆదేశించాడు. ఆ సమయంలో దుర్యోధనునికి దిక్కు తోచకుండా వుంది. ఆలోచనలతో హతాశుడైనాడు.

తనవెంట సైన్యం, వందలాదిమంది రాజులు, చతురంగ బలాలు ఏమీలేకుండా ఒంటరిగా, రథవిహీనుడై మరియు గాయపడినవాడై పారిపోవుటకు ప్రయత్నిస్తున్నాడు.

ఆ సమయంలో పాండవుల వద్ద రెండు వేల మంది రథికులు, ఏడువందల ఏనుగులు, ఐదువేల మంది అశ్వికులు మరియు పదివేల మంది కాల్బలము వున్నది. కనుచూపు మేరలో తనవారెవరూ కనపడక పరోవరం వైపు వెళ్తున్నాడు.

రాజా! నేను కూడ పాండవులకు బందీనై ఉన్నాను. ధృష్టద్యుమ్నుడు నన్ను చూసి సాత్యకితో ఇలా అన్నాడు. 'ఈ సంజయుడు బ్రతికి ఉండి మనకు ఏమి లాభం?' ఈ మాటలు వినిన సాత్యకి కత్తి తీసి నన్ను చంపబోయాడు. అదే క్షణంలో వేదవ్యాస మహర్షి ప్రత్యక్షమై, 'సంజయుని ప్రాణాలతో వదలివేయండి. ఇతనిని చంపకూడదు.'. అలా వేదవ్యాసుని దయవల్ల ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, అచటినుండి ఆ సాయంత్రం పూట హస్తినకు బయలుదేరాను. కొంచెం దూరం ప్రయాణం చేసిన తర్వాత, ఒకచోట దుర్యోధనుడు ఒంటరిగా గద పట్టుకొని నిలుచుని ఉండటం చూచాను. ఆయనను చూచి నేను బాధపడ్డాను. వేదవ్యాస మహర్షి పాయంతో నేను బ్రతికి పోయానని చెప్పాను. దుర్యోధనుడు ఒక నిట్టూర్పు విడిచి 'నీవు మహారాజు వద్దకు వెళ్ళి, నీ కుమారుడైన దుర్యోధనుడు సరోవరంలో విశ్రాంతి తీసుకొంటూ వున్నాడని చెప్పు' అంటూ సరోవరంలో ప్రవేశించాడు.

అప్పుడే కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ అక్కడికి చేరుకొని, నన్ను చూచి సంతోషించి, దుర్యోధనుని గురించి అడిగారు. ఏ సరోవరంలో జలస్తంభన విద్య ద్వారా దాగివున్నాడో, దానిని చూపించాను. అక్కడినుండి శిబిరాలకు వెళ్ళి రాణివాసమును హస్తినాపురమునకు తరలించునట్లు చూచాము. యుయుత్సుడు శ్రీకృష్ణుని మరియు ధర్మరాజు అనుమతి తీసికొని రాణులను వెంటబెట్టుకొని దుఃఖభారంతో హస్తినాపురమునకు వెళ్ళి, ధృతరాష్ట్రాదులను కలిశాడు.

రాజా! రణరంగంలో ఎంత వెదికినా దుర్యోధనుడు కనిపించనందున పాండవులందరూ తమ తమ శిబిరాల్లో విశ్రాంతి తీసుకొంటున్నారు.

కౌరవ శిబిరంలో ఎవరూ లేనందున, కృపాచార్యులు సరోవరం వద్దకు చేరి దుర్యోధనునితో 'రాజా! లే! మమ్మల్ని తీసికొని వెళ్ళి ధర్మరాజుతో యుద్ధం చేయండి. విజయమో, వీరస్వర్గమో మనల్ని వరిస్తుంది.' అన్నాడు.

దుర్యోధనుడు 'తప్పక మనల్ని విజయం వరిస్తుంది. నేను తీవ్రంగా గాయపడి ఉన్నాను. ఈ ఒక్కరోజు రాత్రి విశ్రాంతి తీసికొని, రేపు మిమ్మల్ని తీసుకొని వెళ్ళి యుద్ధం చేస్తాను. మీరుకూడ వెళ్ళి విశ్రాంతి తీసికోండి." అని అన్నాడు.

వీరు ఇలా మాట్లాడుతుండగానే కొద్దిమంది వేటగాళ్ళు అటుగా వచ్చి వారి సంభాషణ విని, వెళ్ళి భీమునికి చెప్పారు. వెంటనే పాండవులందరు శ్రీకృష్ణునితో కలిసి ఆ ద్వైపాయనమను భయంకర సరోవరానికి బయలుదేరారు వారు వస్తున్న చప్పుడు గ్రహించి, అశ్వత్థామ, తదితరులు అక్కడినుండి తప్పుకొని దూరాన ఉన్న ఒక చెట్టు క్రింద విశ్రాంతి తీసికోసాగారు. సరోవరం వద్దకు చేరుకొన్న పాండవులు దుర్యోధనుని రెచ్చగొట్టి, నీటినుండి పైకి వచ్చేటట్టు చేశారు. మాలో ఒక్కరితోనైనను గదాయుద్ధం చేసి, రాజ్యాన్ని తీసికో అన్నారు.

ఓ రాజా! ఆ విపత్కర సమయంలో కూడ దుర్యోధనుడు ఎంతో నిబ్బరంగా, నిర్భయంగా సింహం వలె కన్పిస్తున్నాడు.

భీముడు ఇలా అన్నాడు. 'ఓయీ దుర్యోధనా! నీవల్లనే భీష్మ పితామహుడు శరశయ్యపై ఉన్నాడు. కౌరవ వంశాన్ని నాశనము చేసిన నీవొక్కడివే బ్రతికి వున్నావు. నేను నా ఈ గదతో నిన్ను చంపటం తప్పడం లేదు. నేను నీ గర్వమణచి, నీ రాజ్యకాంక్షను అంతరింప జేస్తాను.' అని అనగా దుర్యోధనుడు ఇలా సమాధానం ఇచ్చాడు. 'ఓ వృకోదరా! మాటల వల్ల ప్రయోజనం లేదు. గదాయ్ధంలో నీ భరతం పడతాను. ఈ గద నా చేతిలో వున్నంతవరకు దేవతలు కూడ నన్ను జయించలేరు.' అని అన్నాడు.

ఓ రాజా! భీమునికి మరియు దుర్యోధనునికి మధ్య గదాయ్ధం జరుగు సమయంలో బలరాముడు అక్కడికి వచ్చాడు. పాండవులు, శ్రీకృష్ణుడు అందరూ ఆయనకు నమస్కరించారు. భీముడు మరియు దుర్యోధనుడు తమ తమ గదలను ఎత్తి బలరామునిపై తమకున్న గౌరవాన్ని ప్రదర్శించారు.

బలరాముడు శ్రీకృష్ణునితో కౌరవులకు కూడ సాయం చేయమని చెప్పాడు. శ్రీకృష్ణుడు అర్జునుడు నిరాకరించినందుననే బలరాముడు తీర్థయాత్రలకు వెళ్ళాడు. వీరిద్దరి మధ్య గదాయుద్ధం జరుగుతుంది తెలిసి ఇపుడు కురుక్షేత్రానికి వచ్చాడు.

బలరాముడు మొదట దర్శించిన ప్రభాస క్షేత్ర విశేష మేమనగ, చంద్రుడు ఆ తీర్థంలో స్నానం చేసి శాపవశాన తనకు తగులుకొన్న కుష్ఠ వ్యాధిని తొలగించుకొన్నాడు. ఆ వివరాలు ఏమనగా – దక్ష ప్రజాపతి తన 27 మంది కుమార్తెలను చంద్రునికిచ్చి వివాహం చేశాడు. చంద్రుడు కేవలం రోహిణిని పట్టమహిషిగా భావించి, మిగతా వారిని తిరస్కరించాడు. వారు వెళ్ళి తండ్రికి చెప్పుకొనగా, దక్ష ప్రజాపతి చంద్రునికి హితవు చెప్పాడు. కాని చంద్రుడు రోహిణికే అంకితమైనాడు. మళ్ళీ కుమార్తెలు తండ్రికి చెప్పుకోగా, ప్రజాపతి చంద్రుని పిలిచి, కోపగించి, శపించెదనని బెదిరించి, సమన్యాయం చేయమని ఆదేశించాడు. కాని చంద్రుడు రోహిణియందే అనురక్తుడై యున్నాడు విధిలేక ప్రజాపతి చంద్రుని శపించిన కారణంగా కుష్ఠువ్యాధిగ్రస్తుడై కాంతిని కోల్పోయాడు.

ఆ కారణంగా ఓషధులు, వృక్షములు, మొక్కలు మరియు వరిపంట మున్నగునవి వాడిపోయాయి. దేవతలంతా ప్రజాపతి దగ్గరకు వెళ్ళి వేడుకొన్నారు. సరస్వతీ నది ప్రథమ తీర్థమైన ప్రభాస క్షేత్రంలో స్నానం చేసి, పత్నుల నెల్లరిని ఏలుకోవడం వల్ల యథారూపు ధరించునని చెప్పాడు. చంద్రుడు అలాగే చేశాడు.

ఇక, ఉదపాన తీర్థం మరియు త్రితముని యొక్క వృత్తాంతం తెలుసుకొందాం.

పూర్వం గౌతమ మునికి ముగ్గురు కుమారులు వుండేవారు. వారు వరుసగా ఏకతుడు, ద్వితుడు మరియు త్రితుడు. అందరికంటె తెలివిగలవాడు త్రితుడు యజ్ఞాలు చేయడంలో నేర్పరి. తండ్రి చనిపోయిన తర్వాత త్రితుని ప్రజలు గౌరవిస్తూ ఉండేవారు.

ఒకరోజు ఏకతుడు, ద్వితుడు కలిసి ధనార్జన గురించి ఆలోచించ సాగారు. యజమానులను సంప్రదించి, యజ్ఞయాగాదులు చేసి, సోమపానం చేస్తూ, ధనం సంపాదించ వచ్చునని తలంచి, త్రితుణ్ణి ఒప్పించి, యాగాలు చేయనారంభించారు. యజమానులు వందలాది గోవులను ఇస్తుండేవారు. ఏకతుడు, ద్వితుడు పేరాశకు లోనై త్రితునికి గోవులలో భాగం ఇవ్వరాదని నిశ్చయించుకొన్నారు.

ఒకరోజు ముగ్గురూ కాలినడకన వెళ్తుండగా, ఒక తోడేలును చూచి త్రితుడు భయంతో దగ్గరలో వున్న ఒక బావిలో పడ్డాడు. మిగతా ఇద్దరూ సంతోషించి, తమ్ముని వదలి వెళ్ళిపోయారు. త్రితుడు మహా బుద్ధిశాలి. ఆ బావిలోనే తన సంకల్పబలంతో నీటిని, అగ్నిని, సోమరసాన్ని ఆవిర్భవింప చేసి, వేదమంత్రములు చదువగా, ఆ ధ్వని స్వర్గాన్ని తాకింది. దేవతలు ప్రత్యక్షమై వరము కోరుకోమన్నారు. తనను బావినుండి రక్షించి, ఆ బావిని పునీతం చేయమని అడిగాడు. వెంటనే బావిలోనికి సరస్వతీ జలం ప్రవశించింది. త్రితుడు ఇంటికి వెళ్ళాక సోదరులు చేసిన పనికి కోపగించి, తోడేళ్ళు కండని శపించాడు. సరస్వతీ నదిలోనే స్థిరమై పోయిన ఆ ఉదపాన తీర్థంలో బలరాముడు స్నానంచేసి తరించాడు.

సరస్వతీ తీర్థంలో విశ్వామిత్రుడు ఎలా రాజర్షి అయినాడో తెలుసుకొందాం.

పూర్వ కాలంలో గాధి అనే ప్రసిద్ధినొందిన రాజొకడుండేవాడు. అతని కుమారుడు విశ్వామిత్రుడు. కొంతకాలం తర్వాత గాధి తన కుమారునికి పట్టాభిషేకం చేసి, స్వయంగా శరీరాన్ని త్యజించి, నేరుగా స్వర్గానికి చేరాడు. భూమండలాన్ని మొత్తాన్ని పాలించటం విశ్వామిత్రునికి కష్టంగా తోచింది. అనేకచోట్ల రాక్షసులు, ప్రజలను కష్టపెడుతున్నారని తెలిసి, సైన్యాన్ని తీసుకొని ప్రజారక్షణకు బయలుదేరాడు.చివరకు వారు వశిష్ఠ ముని ఆశ్రమానికి చేరుకొన్నారు. అక్కడ విశ్వామిత్రుని సైనికులు అత్యాచారాలు చేస్తూ, ఆశ్రమాన్ని ధ్వంసం చేయసాగారు. వశిష్ఠుడు తన కామధేనువును చూసి, వీరి అంతు తేల్చు అని చెప్పాడు. వెంటనే భయంకరులైన భిల్లులను సృష్టించి, విశ్వామిత్రుని సైనికులపైకి పంపాడు. ఆ భిల్లులు విశ్వామిత్రుని సైనికులను చావబాది తరిమివేశారు.

ఈ విషయం తెలిసిన విశ్వామిత్రుడు రాజు కంటె ఋషి గొప్పవాడని తెలిసి, సరస్వతీ తీర్థంలో తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి బ్రాహ్మణుడైనాడు. అటువంటి తీర్థంలో బలరాముడు తన అనుయాయులతో కూడి స్నానమాచరించి, అక్కడ వున్న బ్రాహ్మణులకు ఇవ్వగలిగినంత బంగారాన్ని, ధనాన్ని ఇచ్చాడు.

అగ్నితీర్థం, బదరి పావన తీర్థముల యొక్క మహిమను గురించి తెలుసుకొందాం.

బలరాముడు ఈ తీర్థంలో స్నానం చేసి, అక్కడి బ్రాహ్మణులను బంగారం మరియు డబ్బు ఇచ్చి పుణ్యం చేసుకొన్నాడు.

1. అగ్నితీర్థం : భృగు మహర్షి శాపం చేత అగ్నిదేవుడు భయపడి శమీవృక్షంలో దాక్కున్నాడు. అగ్నిదేవుడు ఎక్కడా కనిపించక పోవడంతో ఇంద్రాది దేవతలు వెదకగా అగ్నితీర్థంలోని శమీవృక్షంలో కనిపించాడు. భృగుడు శపించిన విధంగానే అగ్నిదేవుడు సర్వభక్షకుడైనాడు. అదే తీర్థంలో స్నానం చేసి, అగ్నిదేవుడు బ్రహ్మత్వాన్ని ప్రాప్తించుకొన్నాడు.

2. బదరికావన తీర్థం : పూర్వకాలంలో భరద్వాజుని కుమార్తె అయిన శృతవతి ఇంద్రుని భర్తగా పొందుటకు నియమిత తపస్సు చేసింది. ఇంద్రుడు ప్రత్యక్షమై ఇలా అన్నాడు. 'ఓ మనోహరీ! నీ కోరిక తప్పక తీరుతుంది. నీవు ఈ శరీరాన్ని త్యాగం చేసి నాతోపాటు వచ్చి స్వర్గలోకంలో ఉంటావు.'. ఇంకా 'ఓ శృతవతీ! ఈ తీర్థంలో 12 సం॥లు వర్షాలు లేక ఋషులందరు హిమాలయం వైపు వెళ్ళారు. కేవలం ఒక్క అరుంధతి మాత్రమే ఆకులలములు తింటూ యిక్కడే వుండి తపస్సు చేసింది. శివుడు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకొమ్మని చెప్పగా 'ఈ తీర్థ స్థలమునకు బదరికావనమని ప్రసిద్ధి యగునట్లు చేయండి' అని కోరింది. పరమశివుడు తథాస్తు అన్నాడు. ఈరకంగా అరుంధతి సిద్ధిని ప్రాపించుకొంది. అలాగే నీవు కూడ వ్రతపాలన చేశావు. కనుక ఎవరైనా ఈ తీర్థంలో స్నానం చేసి ఒక్క రాత్రి ఉన్నట్లయితే, వారికి స్వర్గం ప్రాప్తిస్తుందని చెప్పాడు.'

ఇంకను – ఆదిత్య తీర్థం మరియు వృద్ధి కన్య క్షేత్రాల గురించి తెలుసుకొందాం.

1. ఆదిత్య తీర్థ స్థలం : పూర్వకాలంలో ఈ తీర్థంలో దేవల ముని అనునతడు గృహస్థ ధర్మము నిర్వహిస్తూ తపస్సు చేస్తుండేవాడు. అనుకూల ప్రతికూలాలను సమంగా చూస్తూ ధర్మరాజు వలె సమదర్శియై ఉండేవాడు. ధర్మాచరణ కలిగి వుండేవాడు.

ఒకరోజు జైగీషవ్యుడనే ముని తన యోగశక్తి చేత ఒక బిచ్చగాడి రూపం ధరించి దేవలముని ఆశ్రమానికి వచ్చి ఉండసాగాడు. మహర్షి జైగీషవ్యుడు సిద్ధి పొందినవాడు కనుక అన్ని సమయాల్లోనూ యోగస్థితిలోనే వుండేవాడు. ఈవిధంగా చాలాకాలం గడిచిపోయింది.

ఆ తరువాత జైగీషవ్యుడు కనిపించేవాడు కాదు. భోజనానికి మాత్రమే వచ్చేవాడు. అలాగ అనేక సంవత్సరాలు గడిచాయి. ఇంతకాలం దేవమునితో ఒక్కమాట కూడ మాట్లాడ లేదు. అతడు విచిత్రమైన మనిషిగా కన్పించాడు. ఒకనాడు దేవల ముని ఆకాశమార్గంలో సముద్ర తీరానికి వెళ్ళగా అప్పటికే అక్కడ జైగీష ముని ఉన్నాడు. తిరిగి యింటికి చేరేసరికి జైగీష ముని కూడ ఇంట్లోనే ఉన్నాడు.

ఆశ్చర్య పడిన దేవల ముని జైగీషవ్యుని గురించి తెలుసుకొనే తలంపుతో మళ్ళా ఆకాశమార్గాన వెళుతుండగా, స్వయంగా సిద్ధులు జైగీషవ్యుని పూజిస్తున్నట్లు కనిపించింది. అక్కడినుండి జైగీషవ్యుడు చంద్రలోకం, పితృలోకం, స్వర్గలోకం వెళ్తున్నట్లు మునికి కనిపించింది. ఆ తరువాత ఆయన పతివ్రతల లోకానికి వెళ్ళి, మళ్ళీ దేవలునికి కన్పించ లేదు. బ్రహ్మలోకానికి వెళ్ళాడని తెలిసింది. తాను అక్కడికి వెళ్ళలేనని తెలిసి, దేవలుడు విచారగ్రస్తుడైనాడు. దేవలుడు దిగువ లోకాలు చుట్టి చివరకు భూలోకానికి వచ్చాడు దేవల ముని ఆశ్రమానికి

చేరుకోగానే అక్కడ కూర్చున జైగీషవ్యుని చూచి, శరణు కోరి, మోక్షధర్మాన్ని చెప్పమని కోరాడు. జైగీషవ్యుడు దేవల ముని కోరికను మన్నించి జ్ఞానోపదేశం చేసి, యోగ విధానం ఉపదేశించాడు ఆ కారణంగా దేవల ముని గృహస్థ ధర్మాన్ని వదలివేసి, మోక్ష ధర్మంపై ఆసక్తి పెంచుకొని, సిద్ధిని పొంది, పరమయోగాన్ని ప్రాప్తించుకున్నాడు.

2. వృద్ధి కన్యా క్షేత్రం : పూర్వం కుణిగర్గ అను ఋషి తన మనోసంకల్పం చేతనే ఒక అందమైన కుమార్తెను సృష్టించాడు ఆ తరువాత ఆ ఋషి శరీరాన్ని వదలి, స్వర్గానికి చేరాడు. ఆ కన్య ఆశ్రమ బాధ్యతలను వహస్తూ తపస్సు చేసింది. చివరకు ఆ కన్య వృద్ధి పొందిన తరువాత తనువు చాలించాలనుకొన్న సమయంలో నారదుడు వచ్చి ఇలా అన్నాడు. 'దేవీ! నీవు పెళ్ళి కాకుండా శరీరాన్ని వదలిన యెడల స్వర్గానికి వెళ్ళలేవు.' అందుకని ఆ వృద్ధి కన్య ఋషుల సభలోకి వెళ్ళి, 'ఎవరు నన్ను వివాహమాడతారో, వారికి నా సగం తపశ్శక్తిని ధారపోస్తాను.' అని అన్నది. దానికి శృంగవానుడు ఒక షరతుతో సిద్ధపడ్డాడు. ఒక రాత్రి మాత్రమే నాతో వుండవచ్చునన్నాడు. పాణిగ్రహణమైన తరువాత ఆ వృద్ధి కన్య తరుణి రూపంలో ఒక రాత్రి గడిపి వెళ్ళిపోయింది.

ఇక మనం భీమసేనుని మరియు దుర్యోధనుని గదాయుద్ధం చూద్దామా!

బలరాముడు అనేక పుణ్యక్షేత్రాలు దర్శించి, కురుక్షేత్రానికి వచ్చి, ఆశ్రమంలో ఋషులతో మాట్లాడుతుండగా నారదుడు వచ్చి, దుర్యోధన భీమసేనుల గదాయుద్ధం జరగబోతున్నదని ఆయనకు చెప్పాడు. బలరాముడు ఉత్సాహంగా పాండవ కౌరవ విశేషాలు చెప్పమని అడిగాడు. అపుడు నారదుడు ఇలా చెప్పాడు. 'మొదట భీష్ముడు శరశయ్యపై పడిపోయాడు. ద్రోణాచార్యుడు, జయద్రధుడు, కర్ణుడు మరియు కర్ణుని పుత్రులు పరలోకం చేరారు. భూరిశ్రవుడు, శల్యుడు మరియు ఇతర కౌరవ యోధుల స్థితి కూడ అంతే అయింది. దుర్యోధనుడి సైన్యంలో కేవలం కృపాచార్యుడు, కృతవర్మ మరియు అశ్వత్థామ మాత్రమే మిగిలారు. ఆ సమయంలో దుర్యోధనుడు సరోవరంలో దాక్కున్నాడు.

పాండవులు ఆ సరోవరం చేరి దుర్యోధనుని బయటకు రప్పించారు. ఇప్పుడు వారిద్దరి మధ్య గదాయుద్ధం జరగబోతోంది.

ఈ మాటలు వినగానే బలరాముడు శిష్యులతో కలిసి ద్వైపాయన సరోవరం వద్దకు యుద్ధం చూడటానికి వచ్చాడు. బలరాముని చూడగానే ధర్మరాజు లేచి నిలుచుని స్వాగతించాడు. దుర్యోధనుడు సంతోషించాడు. భీమసేనుడు కవచం ధరించి, గద తీసికొని నిలబడ్డాడు. దుర్యోధనుడు కూడ బంగరు కవచం ధరించి, భీముని ఎదుట నిలబడ్డాడు. గదలు పైకెత్తి ఒకరి నొకరు కవ్వించుకొన్నారు. వారిద్దరు రామరావణుల వలె కన్పించారు. భీముడు దుర్యోధనునివైపు పరుగెత్తాడు గదతో. దుర్యోధనుడు కూడ భీముని ఎదుర్కొన్నాడు. ఒకరి నొకరు ఆబోతుల వలె ఢీకొన్నారు. గదల వల్ల శబ్దం భయంకరంగా వెలువడింది. ఇద్దరూ బాగా అలసిపోయినందున, కొంతసేపు విశ్రాంతి తీసుకొన్నారు.

మళ్ళీ యుద్ధం ప్రారంభమైంది. ఇద్దరి గదల తాకిడితో భీకర శబ్దాలు వెలువడ్డాయి. వారి విన్యాసాలు చూపరులను విస్మయ పరుస్తున్నాయి. వారిద్దరు సమవుజ్జీలుగా కన్పించారు. రకరకాల విన్యాసాలతో ఇద్దరూ భీకర యుద్ధం చేస్తున్నారు.

భీముడు దుర్యోధనుని కంటె బలవంతుడే. కాని అభ్యాసంలో దుర్యోధనుడే మేటి. కనుక న్యాయమైన గదా యుద్ధంలో దుర్యోధనుని జయించటం సాధ్యం కావడం లేదు. అందుచేత శ్రీకృష్ణుడు భీమసేనునికి తన

ప్రతిజ్ఞ గుర్తు చేస్తూ అర్జునునికి చెప్పగానే, అర్జునుడు భీమనికి తన ఎడమ తొడను చూపిస్తూ సంకేతం ఇచ్చాడు. ఆ తరువాత భీముడు రెచ్చిపోయి క్షణకాలంలో తన తల ఎత్తుకు ఎగిరి గదతో తన తలపై మోదబోతున్న సమయంలో భీముడు గదతో దుర్యోధనుని తొడలపైన గదా ప్రహారం చేశాడు. చూచువారికి అది భీముడు తన రక్షణ కోసం గద పైకెత్తగా అది పొరబాటున దుర్యోధనుని తొడలకు తగిలినట్లుగా కనిపించింది. దుర్యోధనుడు బిగ్గరగా ఆర్తనాదం చేస్తూ, నేలపై పడిపోయాడు. గదాయుద్ధ నిబంధనలను ఉల్లఘించినందుకు, బలరాముడు తన హలాన్ని తీసుకొని భీమునివైపు దూసుకుపోయాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు బలరాముని అడ్డుకొంటూ ఇలా అన్నాడు. 'ఆనాడు సభాభవనంలో చేసిన ప్రతిజ్ఞ మేరకే నడుచుకొన్నాడు కాని వేరేమీ కాదు. నిండుసభలో ద్రౌపదిని తొడపై కూర్చుండమని దుర్యోధనుడు చేసిన పరమ నికృష్ట చేష్టకు గాను భీముడు తొడలు విరగ గొడతానని ప్రతిజ్ఞ చేశాడు. కనుక భీముడు ప్రతిజ్ఞాపాలన మాత్రమే చేశా'డని బలరామునికి నివేదించి, ఆయన్ను శాంతింప చేశాడు. అయినా బలరాముడు తాను ఈ అధర్మ యుద్ధ పరిణామాన్ని సహించలేకున్నానని అంటూ అక్కడినుండి వెళ్ళిపోయాడు.

ఇలా దుర్యోధనుడు నిర్వీర్యుడైన పిదప, పాండవులు దుర్యోధనుని శిబిరాలను స్వాధీనం చేసుకొన్నారు. అక్కడికి చేరుకొన్న శ్రీకృష్ణార్జునులు రథము దిగగానే, అర్జునుని రథ ధ్వజం నుండి ఆంజనేయుడు అంతర్ధానమైనాడు. రథం తగలబడి మంటల్లో కాలిపోయింది.

నిజానికి ద్రోణాచార్యుని మరియు కర్ణుని దివ్యాస్త్రాలు రథంతో సహా ఎప్పుడో కాలిపోయింది. కాని శ్రీకృష్ణ భగవానుడు అర్జునుని రథంపై కూర్చొని వుండడం వల్ల అది ఇప్పటివరకు తన అస్తిత్వం దక్కించుకొంది.

తరువాత శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళి, ధృతరాష్ట్రునికి మరియు గాంధారికి ఓదార్పును చేకూర్చాడు.

దుర్యోధనుడు అంతిమ దశలో వున్నాడని సందేశవాహకులు చెప్పగానే కౌరవ మహారథులైన అశ్వత్థామ, కృపాచార్యుడు మరియు కృతవర్మ దుర్యోధనుని వద్దకు చేరుకొన్నారు. దుర్యోధనుడు దయనీయ స్థితిలో వున్నాడు. అపుడు అశ్వత్థామ దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'ఓ రాజా! ఈరోజు నేను శ్రీకృష్ణుడు చూస్తుండగానే ఏదో ఒక ఉపాయంతో సమస్త పాంచాలురను యమలోకానికి పంపిస్తాను. కేవలం మీరు నాకు అనుమతి ఇస్తే చాలు' అని అన్నాడు.

ఎంతో ప్రసన్నుడైన దుర్యోధనుడు కృపాచార్యునికి చెప్పి, అశ్వత్థామకు సేనాధిపతిగా అభిషేకం చేయమన్నాడు. దుర్యోధనుడు అక్కడ పడి వున్నాడు. తదుపరి కార్యక్రమం కొరకు, ఈ ముగ్గురు మహారథులు అక్కడినుండి వెళ్ళిపోయారు.

-o0o-

10. సౌప్తిక పర్వం

రాజా! మహారథులైన కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ కొంచెంసేపు విశ్రాంతి తీసుకోవడానికి దట్టమైన అడవిలోకి ప్రవేశించి ఒక విశాలమైన వటవృక్షాన్ని చూచారు. దానికి వేలాది శాఖలున్నాయి. అపుడు సూర్యాస్తమయం కావడంతో చీకట్లు వ్యాపించసాగాయి. ఆ వృక్షము యొక్క మొదట్లో వారు నిద్రకు ఉపక్రమించారు. కృతవర్మ, కృపాచార్యుడు నిద్రలోకి జారుకోగానే, అశ్వత్థామ అధిక క్రోధంతో ఉండటం చేత నిద్ర పట్టక, నలువైపులా చూడగా, వృక్షం మీద అసంఖ్యాకంగా కాకులు కన్పించాయి. అవి వాటి వాటి గూళ్లలో నిద్రిస్తున్నాయి. ఆ సమయంలో ఒక భయంకరమైన గుడ్లగూబ అటువైపు వస్తున్నట్లు కనిపించింది. అది నేరుగా చెట్టుపైకి చేరి, తన వాడి గోళ్ళతో కాకులను చంపసాగింది. ఆ గుడ్లగూబ నానా భీభత్సం చేస్తోంది. తన వాడి గోళ్ళతో అనేక కాకులను చంపివేయసాగింది. శత్రువులైన కాకులను గుడ్లగూబ ఎలా చంపిందో, అలాగే తాను కూడా చేయాలని అశ్వత్థామ తలచాడు.

వెంటనే కృతవర్మను, కృపాచార్యుని లేపి, తన ఆలోచనను చెప్పాడు. ఆ ఇద్దరూ అశ్వత్థామ కపటోపాయాన్ని విని సిగ్గుతో మౌనం వహించారు. అశ్వత్థామ మళ్ళీ ఇలా అన్నాడు. 'దుర్యోధనుడు 11 అక్షౌహిణుల సైన్యానికి అధిపతిగా ఉన్నాడు. అంతేకాదు, రారాజు తలను భీముడు తన్నాడు. అలాంటి పాండవులను మాయోపాయం చేతనే ఎదుర్కోవాలి. మరి మీరేమంటారో చెప్పండి.' అనగా కృపాచార్యుడు 'ఓ అశ్వత్థామా! ఈ ప్రపంచంలో మానవులందరు దైవపరమైన, పురుషార్థపరమైన కర్మలతో బంధించబడి వున్నారు. అయినా ఏ ఒక్కదానితో సఫలురు కాలేదు. ఒకదానికొకటి తోడు అయినప్పుడే సఫలత దక్కుతుంది. పాండవులు కౌరవుల కంటె ఉన్నతులు. మనం అసమర్థుల వెంబడి ఉన్నాం. కనుకనే మనం కష్టనష్టాలను భరించాల్సి ఉంది. ఎవరైతే పడుకొని ఉంటారో, శస్త్రములు లేకుండా ఉంటారో, శరణాగతులై ఉంటారో, అటువంటి వారిని చంపటం ధర్మం కాదు. నీవు శస్త్రధారుల్లో శ్రేష్ఠమైన వాడివి. నీవు సూర్యసమాన తేజశ్శాలివి. ఈ రాత్రి విశ్రాంతి తీసుకొని, రేపు ఉదయం అందరి ఎదుటా శత్రువులను ఓడించు.' అని అనగా అశ్వత్థామ మరల ఇలా అన్నాడు.

'మీరు చెప్పినవన్నీ బాగానే ఉన్నాయి. కాని పాండవులు ఎప్పుడూ ధర్మకార్యాలను ముక్కలు చేశారు. ధృష్టద్యుమ్నుడు శస్త్రాలు లేని మా నాన్నగారిని వధించాడు. కర్ణుని రథచక్రం భూమి మీద దిగబడినప్పుడు అర్జునుడు చంపాడు. శిఖండిని చూచిన తరువాత భీష్ముడు అస్త్రాలను వదలిపెట్టాడు. అప్పుడే అర్జునుడు ఆయన్ని పడగొట్టాడు. గదాయుద్ధంలో భీముడు దుర్యోధనుని తొడలు విరగ్గొట్టాడు. నేను నరకానికి వెళ్ళినా బాధడను. ఈరాత్రి పాంచాలురను చంపివేస్తాను. ఈ నా దృఢనిర్ణయాన్ని మార్చే శక్తి ఎవ్వరికీ లేదు.' ఇలా చెప్పి అశ్వత్థామ తన రథాన్ని సిద్ధం చేసుకోసాగాడు. కృపాచార్యుడు, కృతవర్మ కూడ తోడుగా వుంటామని అశ్వత్థామతో చెప్పి అశ్వత్థామను అనుసరించారు.

అశ్వత్థామ శత్రు శిబిరాల వైపు రథాన్ని నడిపాడు ఆ రాత్రి సమయంలో వారిని అంతమొందించాలని పాండవుల శిబిరాలకు చేరుకొని, ద్వారం దగ్గర నిల్చున్నారు. ఆ ద్వారం దగ్గరే ఒక మహాకాయుడు, మహా తేజస్సుతో కాపలా కాస్తున్నాడు. ఆ మహాకాయుడు పులిచర్మం ధరించి వున్నాడు. చేతులలోను, భుజాల మీద రకరకాల అస్త్రశస్త్రాలను ధరించి, శరీరం మీద భయంకరమైన సర్పములు బుసలు కొడుతుండగా, నోటినుండి అగ్నిజ్వాలలు ఎగిసిపడుతున్నాయి. అతని ముఖం నుండి, ముక్కునుండి, చెవుల నుండి వేలాది నేత్రాలనుండి

ఆరని మంటలు ఉద్భవిస్తున్నాయి. అతని నుండి వెలువడుతున్న తేజోకిరణాల నుండి శంఖ చక్ర గద ధరించిన వేలాది విష్ణుమూర్తులు ప్రకాశితమౌతున్నారు. ఇలాంటి భయభీతులను చేయగల ఆ మహాకాయుని చూచి అశ్వత్థామ చలించలేదు. పైగా ఆ శరీరంపై దివ్యాస్త్రాలను ప్రయోగించడం మొదలు పెట్టాడు.

ఆ భయంకర రూపుడు అశ్వత్థామ వదలిన అస్త్రాలను మ్రింగాడు. దీన్ని చూచిన అశ్వత్థామ దేదీప్యమానమైన శక్తిని వదిలాడు. అది వెళ్ళి ఆ మహాకాయుని తాకి క్రిందపడింది. తరువాత కత్తిని విసిరాడు ఆ కత్తి వెళ్ళి ఆ మహాకాయునిలో లీనమై పోయింది. కోపించిన అశ్వత్థామ గదను ప్రయోగించాడు. అది కూడ వెళ్ళి ఆ మహాకాయునిలో లీనమై పోయింది.

ఈ విధంగా అశ్వత్థామ వద్ద వున్న అన్ని అస్త్రాలు అయిపోగా, దిక్కులు చూడసాగాడు. ఎటుచూచినా విష్ణుమయంగా కనిపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూచి కలరవడ సాగాడు. కృపాచార్యుని మాట వినకపోయానే అని దుఃఖించసాగాడు. కాని యుద్ధం నుండి విరమించుకో దలచలేదు. ఈ మహాకాయం అతని అడుగులను కదలనీయడం లేదు. నేను ఈ సమయంలో ఆదిదేవుడైన శంకరుని వేడుకొంటాను. ఆయన దేవతలకు వందనీయుడు. ఉమాపతి సర్వపాపహరుడు, వందనీయుడు. ఆ త్రిశూలధారి నన్ను కాపాడగలడు.' అని పరమ శివుని స్తుతించడం మొదలుపెట్టాడు అశ్వత్థామ ఇలా...

'ఓ పరమ శివా! నీవు ఉగ్రుడవు, అచలుడవు, కళ్యాణమయుడవు, రుద్రుడవు, సకల విద్యలకు ఆది దేవుడవు, పరమేశ్వరుడవు, వరదాయకుడవు, జగదీశ్వరుడవు, విశ్వరూపుడవు, బహురూపివి, ఉమాపతివి, గణాధ్యక్షుడవు. నీవు రుద్ర నామముతో ప్రసిద్ధుడవు మరియు బ్రహ్మచారివై వున్నావు. నేను అత్యంత నిర్మలమైన మనస్సుతో, ఆత్మసమర్పణ చేస్తూ, నిన్ను భజిస్తున్నాను. నిన్ను శరణుజొచ్చాను.

ఓ దేవా! నేడు ఈ ఆపద నుండి విడివడిన యెడల, ఈ నా శరీరాన్ని నీకు యజ్ఞరూపంలో అర్పిస్తాను' అని అనగా, అతని దృఢనిశ్చయానికి పర్యవసానంగా అక్కడ ఒక బంగరు వేదిక ప్రకటితమైంది. దానినుండి ప్రజ్వలితమైన అగ్ని ఎగిసిపడింది. దానిలోనుండి అనేక గణములు బయటకు వచ్చాయి. ఆ గణముల ముఖములు, నేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

అవి భూతముల వలె కన్పిస్తూ, ముల్లోకాలను భయపెడుతున్నాయి. అయినా, అశ్వత్థామ వాటిని చూచి భయపడలేదు.

'ఓ దేవా! శత్రువుల వలన పరాభవాన్ని జీర్ణించుకోలేక ఈ శరీరాన్ని హవిస్సు రూపంలో నీకు అర్పిస్తాను' అంటూ అగ్నిలా వెలిగిపోతున్న వేదికపైకి ఎక్కి కూర్చున్నాడు. అదిచూచి, శంకరుడు నవ్వుతూ ఇలా అన్నాడు. 'శ్రీకృష్ణుడు సత్యము చేత, తపస్సు చేత, త్యాగం చేత నన్ను ఆరాధించాడు. అందుచేతనే అతనికంటె ప్రియులు నాకు మరెవ్వరూ లేరు. అందుకే ఆ పాంచాలురను నేను రక్షించాను. ప్రస్తుతం వారి ఆయువు తీరిపోయింది అంటూ ఒక నిశిత కరవాలాన్ని తీసి, అందులోనే తాను సమాహితుడై అశ్వత్థామకు ఇచ్చాడు. ఆ కరవాలం చేతికి తీసికొన్న అశ్వత్థామ అత్యంత తేజశ్శాలిగా ఐనాడు.

'ఓ రాజా! పరవశివుడు ప్రసాదించిన కత్తి తీసికొని అశ్వత్థామ కృతవర్మ, కృపాచార్యులను హెచ్చరించి, అత్యంత విశాలమైన ఆ శిబిరంలోనికి మధ్యభాగం నుండి చొరబడ్డాడు. యోధులందరు గాఢ నిద్రలో వున్నారు. ప్రక్కనే శయ్యపై ఉన్న ధృష్టద్యుమ్నుని చూచాడు. తన కాలితో తన్ని అతనిని లేపాడు. గాఢనిద్రలో నుండి లేచిన

ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామను గుర్తించి నిలదొక్కుకోబోగా, అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని చావబాదాడు. ఈ గొడవకు నిద్రలేచిన స్త్రీలు, పరిచారికలకు నోట మాట రాలేదు. ఈలోగా అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని నిరాయుధుని చేసి చంపాడు. ఈ కోలాహలానికి క్షత్రియ వీరులు లేచి అశ్వత్థామను చుట్టుముట్టారు. వారినందరిని రుద్రాస్త్రంతో మట్టుబెట్టాడు. ఆ తరువాత ఉత్తమౌజుని, యుధామన్యుని, ప్రబోధక వీరులను చంపాడు. ఇతర శిబిరాల్లో కూడ ప్రవేశించి శిఖండిని, ద్రౌపదీ పుత్రును సంహరించాడు. ఆ తర్వాత ఆ ముగ్గురు మహారథులూ, దుర్యోధనుడు పడి వున్న స్థలానికి వచ్చారు. మరణావస్థలో వున్న దుర్యోధనునితో అశ్వత్థామ ఇలా అన్నాడు. 'ఓ రాజా! పాండవుల పక్షాన వారైదుగురు, శ్రీకృష్ణుడు, సాత్యకి మాత్రం మిగిలారు. మనవైపు కృపాచార్యుడు, కృతవర్మ మరియు నేను మిగిలాము. ధృష్టద్యుమ్ననితో సహా సమస్త పాంచాలురను యమపురికి పంపటం జరిగింది. పాండవులపై ప్రతీకారం తీసుకోవడం జరిగిందని తెలుసుకో' అనిన మాటలు వినిన దుర్యోధనుడు ఆనందపడి 'మిత్రమా! నీవు చేసిన ఈ మాత్రం భీష్ముడు కాని, కర్ణుడు మరియు మీ నాన్నగారు కూడ చేయలేక పోయారు. నీవు శిఖండిని, ధృష్టద్యుమ్నుని చంపావు. కనుక మహదానందం కలిగింది.' అంటూ దుర్యోధనుడు ఆ ముగ్గురు మహారథులను ఆలింగనం చేసికొని, ప్రాణం విడిచాడు.

ఆ రాత్రి జరిగిన మారణకాండ గురించి సారథి వెళ్ళి వృత్తాంతం అంతా ధర్మరాజుకు చెప్పాడు. ఆ అమంగళకర వార్త విని ధర్మరాజు క్రింద పడిపోయాడు. అక్కడే ఉన్న సాత్యకి, భీమార్జునులు, ధర్మరాజును సంభాళించారు. అందరూ కలిసి ఆ చోటికి వెళ్ళి, జరిగిన మారణకాండను చూచి మిక్కిలి దుఃఖించారు. శోకతప్త అయిన ద్రౌపదిని నకులుడు అక్కడికి తీసుకొని వచ్చాడు. ఆ దృశ్యాన్ని చూచి ద్రౌపది గర్భశోకంతో విలపించసాగింది.

ధర్మరాజు ద్రౌపదితో ఇలా అన్నాడు.'ఓ ధర్మజ్ఞురాలా! నీ పుత్రులు, సోదరుడు వీరగతిని ప్రాప్తించుకొన్నారు కనుక శోకించ వలదు. అశ్వత్థామ ఇక్కడినుండి అడవుల్లోకి వెళ్ళిపోయాడు. అతనిని చంపినను, నీకు తెలిసే అవకాశం లేదు.' అపుడు ద్రౌపది 'రాజా! అశ్వత్థామ జన్మించినదాదిగా, అతని తలపై మణి ఉన్నదని విన్నాను. సంగ్రామంలో అతనిని చంపి, ఆ మణిని తీసికొని రావాలి. ఆ మణిని మీరు ధరించాలి.' అన్నది. తరువాత ద్రౌపది భీమునితో 'ఆర్యా! ఎంతోమందిని చంపి విజయం సాధించినట్లుగానే, ద్రోణ కుమారుని చంపు' అనగానే, భీముడు నకలుని సారథిగా చేసికొని, అశ్వత్థామను చంపుటకు బయలుదేరాడు.

రౌద్రమూర్తియైన భీమని చూచి శ్రీకృష్ణుడు ధర్మరాజుతో 'రాజా! భీముడు ఒంటరిగా అశ్వత్థామను చంపటానికి వెళ్ళుట శ్రేయస్కరం కాదు. ద్రోణుడు కుమారునికి బ్రహ్మాస్త్రం ఇచ్చియున్నాడు. అలాగే అర్జునుని యెడల ప్రసన్నుడై అతనికి కూడా ఇచ్చియున్నాడు. అశ్వత్థామ సహనశీలికానందు, మానవులపై ప్రయోగించరాదని ద్రోణాచార్యుడు అతనికి చెప్పియున్నాడు. దుర్మార్గుడైన అశ్వత్థామ ఒకరోజు నా వద్దకు వచ్చి, తన వద్దనున్న బ్రహ్మాస్త్రాన్ని నాకు ఇచ్చి, నావద్ద నున్న చక్రాన్ని తనకివ్వమని అడిగాడు. నేను నా దగ్గర వున్న ధనుస్సును, శక్తిని, చక్రాన్ని మరియు గదను అతనికి చూపించి ఏది కావాలో తీసుకోమని చెప్పాను. అశ్వత్థామ సుదర్శన చక్రాన్ని తీసుకోవడానికి ఉత్సహించి దానిని లేవనెత్తలేక విఫలుడైనాడు. దానితో అశ్వత్థామ సిగ్గుతో తలదించుకొన్నాడు. తనను క్షమించి, ఆశీర్వదించమని కోరాడు.' అని చెప్పాడు.

శ్రీకృష్ణార్జునులు మరియు ధర్మరాజు ఒక శ్రేష్ఠమైన రథాన్ని ఎక్కి భీముడు వెళ్ళిన దిక్కున వెళ్ళి, భీముని కలుసుకొన్నారు. గంగాతీరంలో వేదవ్యాసుడు ఋషుల మధ్య కూర్చొని వుండడం వారు చూశారు. అశ్వత్థామ

కూడ వారి దాపునే ఉన్నాడు. అశ్వత్థామను చూడగానే భీముడు అతనివైపు కదిలాడు. అశ్వత్థామ భీముని చూడగానే ఇదే సరియైన సమయమని తలచి 'ఈ భూమండలంలో పాండవులు నశించి పోవుదురు గాక!' అని సంకల్పించి, బ్రహాస్త్ర ప్రయోగం చేశాడు. శ్రీకృష్ణుని హెచ్చరికతో అర్జునుడు కూడ బ్రహ్మాస్త్ర ప్రయోగం చేస్తూ ఇలా సంకల్పించాడు.'ఆచార్య పుత్రునికి మంగళమగు గాక! నాకు, నా సోదరులకు మంగళమగు గాక! ఈ నా బ్రహాస్త్రం ద్వారా శత్రువు బ్రహ్మాస్త్రము శమించు గాక!'

ఈరకంగా రెండు అస్త్రాలు సమస్త లోకాల్ని సంతప్తం చేయసాగాయి. వీరిద్దరిని శాంతింప జేయుటకు నారదుడు, వేదవ్యాస మహర్షి ప్రయత్నించారు.

వ్యాసుడు ఇలా అన్నాడు. 'వీరులారా! ఇంతకు పూర్వం ఎవరూ బ్రహ్మాస్త్రాన్ని మానవులపై ప్రయోగించ లేదు. మీరిద్దరు అనర్థానికి కారకులైనారు. వెంటనే మీ అస్త్రాలను విరమించుకోండి.' అనగానే అర్జునుడు విరమించుకున్నాడు. కాని అశ్వత్థామ విరమించుకోవాలనే తలంపు ఉన్ననూ విఫలుడైనాడు. అందుచేత ఆ బ్రహ్మాస్త్రం ఉత్తర గర్భంవైపు మరలించాడు. తరువాత తన ఓటమిని ఒప్పుకొని తన తలపై వున్న మణిని తీసి ఇచ్చాడు.

అశ్వత్థామ పాండవులకు మణి ఇచ్చి, నీరసంగా అడవులలోకి వెళ్ళిపోయాడు. పాండవులందరు ద్రౌపది వద్దకు వచ్చి, మణిని ఆమెకు అప్పగించారు. ఆ మణిని ధర్మరాజు ధరించవలసినదిగా కోరుతూ ద్రౌపది ధర్మరాజుకు యిచ్చింది. ఆ మణిని ధరించడం వల్ల శస్త్రములతో కాని, వ్యాధులతో కాని, ఆకలితో కాని, దేవతలతో కాని, దానవులతో కాని, నాగులతో కాని, రాక్షసులతో కాని మరియు దొంగలతో కాని ఎలాంటి భయమూ వుండదు. అందుకని ధర్మరాజు వెంటనే ఆ మణిని మస్తకమున ధరించాడు.

-o0o-

11

11. స్త్రీ పర్వం

ఇక విదురుడు మరియు వ్యాస మహర్షి ధృతరాష్ట్రునకు సద్బోధ ఎలా చేశారో తెలుసుకొందాం.

విదురుడు ధృతరాష్ట్రుని వద్దకు వచ్చి ఇలా చెప్పాడు. 'రాజా! ఈ ప్రపంచంలో ధనవంతుడు పేదవాడిని హీనంగా చూస్తుంటాడు. ఎప్పుడైతే బుద్ధిమంతుడు, మూర్ఖుడు, ధనికుడు, పేదవాడు, ఉన్నతకుల సంజాతుడు, నిమ్నకుల జనితుడు, ప్రతిష్ఠితుడు, అప్రతిష్ఠితుడు చనిపోతారో, అప్పుడు శ్మశాన వాటికకు తీసుకొని వెళతారు. అక్కడ ఎలాంటి భేదభావం లేకుండా అగ్నికి ఆహుతి అవుతారు. ఈ వేదోక్త ఉపదేశము ననుసరించి, ఇతరులలో ఎవరు దైవాన్ని చూడగలరో, వారు తప్పక పరమగతిని పొందుతారు.

ఈ విషయంలో మీకొక దృష్టాంతం చెపుతాను. వినండి.

ఒకరోజు ఒక బ్రాహ్మణుడు దట్టమైన అడవిలో ప్రయాణం చేస్తున్నాడు. ఆ కీకారణ్యం భయం గొలుపుతోంది. ఆ ప్రాంతంలో సింహాలు, పులులు, ఏనుగులు ఇష్టం వచ్చినట్లు తిరుగుతుండటం చూచిన ఆ బ్రాహ్మణుడు సురక్షిత ప్రాంతం కోసం వెదకసాగాడు. ఎటు తిరిగిన అడవిని దాటలేక పోతున్నాడు. తనను తాను రక్షించుకోవడం అసాధ్య మనిపించింది. ఇలా ఉండగా, ఆ బ్రాహ్మణుడు తెలుసుకొన్న దేమంటే, ఈ భీకర అడవి ఒక బృహత్తర వలలో చిక్కుకొందని, అలాగే అయిదు శిరస్సులు గలిగిన నాగుపాము అన్ని వైపుల నుండి చుట్టుకొని వుంది. ఆ అడవిలో ఆకులలములతో నిండిన ఒక పెద్ద బావి వుంది. ఆ బావిలో ఆ బ్రాహ్మణుడు పడిపోయి, తల క్రిందికి కాళ్ళు పైకి వచ్చి, త్రిశంకు స్వర్గంలో పడినట్లున్నాడు.

ఆ లోతైన బావిలో ఒక భయంకర సర్పం కనిపించింది. అక్కడే ఆనుకొని ఒక గొప్ప ఏనుగు కనిపించింది. ఆ ఏనుగు శరీరం తెల్లగా, నల్లగా ఉండి ఆరు ముఖాలు, పన్నెండు కళ్ళు కలిగి ఉంది. అది నెమ్మదిగా బ్రాహ్మణుని వైపు కదలడం ప్రారంభించింది. ఆ బావి గట్టున వున్న చెట్టుపై తేనె తుట్టె వుండి, దానినుండి తేనె ధారలు కారుతున్నాయి. ఆ తేనెను బ్రాహ్మణుడు ఆస్వాదించ సాగాడు. ఆ చెట్టు ఊడల ద్వారా వేలాడుతున్న బ్రాహ్మణుడు, ఆ ఊడలను కొరుకుతున్న తెలుపు, నలుపు రంగు గల రెండు ఎలుకలను చూశాడు. అతని భయానికి అంతులేకుంది. క్రూరమృగాలతో, అయిదు తలల సర్పాలతో, ఆరు తలల ఏనుగుతో, ఎలుకలు కొరికిన ఊడలనుండి తాను బావిలో పడిపోదునన్న భయము చివరగా తేనెటీగలతో భయం పట్టుకుంది. ఈ విధంగా సంసార సాగరంలో పడి అక్కడనే చిక్కుకొని జీవితం మీద ఆశ చావక, వైరాగ్యం కూడ ఆవహించటం లేదు.

రాజా! మోక్ష తత్త్వ విద్యాంసులు ఈ ఉదాహరణను చెప్పారు. దానిని సరిగ్గా అర్థం చేసుకొని ధర్మాచరణ చేసినచో పరలోకంలో సుఖం తప్పక లభిస్తుంది. ఆ దట్టమైన అడవి ఈ ప్రపంచమే. క్రూరమృగాలు వ్యాధులు. ఆ బావి మానవ దేహం. అయిదు తలల సర్పం మృత్యువు. ఏనుగు ఆరు ఋతువులుగా భావించాలి. రెండు ఎలుకలు రాత్రి, పగలు. కోరికలన్నీ తేనెటీగలుగా భావించాలి.' అనగా ధృతరాష్ట్రుడు తనకు బాగా అర్థమైందని చెప్పాడు.

'దుర్యోధనుడు లేని జీవితం నాకెందుకు? పుత్రులు, ధనం, సంబంధీకులు అందరూ నశించిన తర్వాత జీవించటం కంటె మరణాన్ని ఆహ్వానించటమే మేలనిపిస్తోంది' అని ధృతరాష్ట్రుడు వ్యాసునితో అన్నాడు.

అపుడు వ్యాసుడు ఇలా చెప్పాడు. 'ధృతరాష్ట్రా! నీవు సకల శాస్త్రాలు విన్నావు. నీవు బుద్ధిమంతుడవు. ధర్మార్థాలలో కుశలుడవు. మానవ జీవితం నీటి బుడగ అని నీకు తెలుసు. మర్త్యలోకం అనిత్యం, పరలోకం నిత్యమైదని తెలుసు.

జీవితం యొక్క పర్యవసానం మరణమే. ఇవన్నీ తెలిసిన నీవు శోకించ తగదు. విధి విధానమును దాటుట ఎవరికినీ శక్యము కాదు. పాండవులపై నీ కరుణాకటాక్ష వీక్షణాలను ప్రసరిస్తూ, నీవు ధైర్యంతో ఉండు, ప్రాణాలు నిలుపుకో. అపుడు నీ కీర్తి నలుదిశలా వ్యాపిస్తుంది. మరియు ధర్మార్థముల ప్రాప్తి లభిస్తుంది' అని వ్యాస మహర్షి ఓదార్పు మాటలు చెప్పాడు.

క్రమక్రమంగా సంజయుని దివ్యదృష్టి క్షీణిస్తోంది. ధృతరాష్ట్రుని వద్దకు వచ్చి ఇక మీరు ప్రేతకర్మలు చేయుటకు సిద్ధపడండి అని అన్నాడు. విదురుడు కూడ సమర్ధించాడు. అందుచేత రథము సిద్ధం చేయమని చెప్పి, గాంధారిని, కుంతిని మరియు ఇతర స్త్రీలనందరిని కూడ తీసికొని రమ్మన్నాడు. గాంధారి పుత్రశోకంతో ఉన్నను, కుంతిని, ఇతర స్త్రీలను తీసికొని బయలుదేరింది. వేలాది మంది రోదిస్తూ రణక్షేత్రం వైపు బయలుదేరారు.

కొద్ది దూరం వెళ్ళగానే, ధృతరాష్ట్రుని ముగ్గురు మహారథులైన అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ కలిశారు. అశ్వత్థామ దుఃఖంతో ఇలా అన్నారు. 'రాజా! దుర్యోధనుని సైన్యంలో మేము ముగ్గురమే మిగిలాం. మిగతా సైన్యం అంతా నశించిపోయింది." తర్వాత కృపాచార్యుడు గాంధారి నుద్దేశించి, 'ఓ గాంధారీ! నీ పుత్రులందరు రణరంగంలో తేజోమూర్తులై నడిచారు. అందుచేత మీరు శోకించ వద్దు. పాండవులు కూడ తనయులను, బంధువులను కోల్పోయి రోదిస్తున్నారు.' అన అనునయ వాక్యాలు పలికాడు. ఆ తరువాత ఆ ముగ్గురూ వారి వద్ద శెలవు తీసికొని, గంగాతీరంవైపు అశ్వాలను నడిపారు. కొంచెం దూరం వెళ్ళిన తర్వాత కృపాచార్యుడు హస్తినాపురం వైపు, కృతవర్మ తన రాజ్యానికి మరియు అశ్వత్థామ వేదవ్యాస మహర్షి ఆశ్రమానికి మళ్ళారు. అలావెళ్ళిన కొద్ది సేపటికే, వ్యాసాశ్రమానికి చేరుకున్న పాండవులు అశ్వత్థామను ఓడించి బందీని చేశారు.

ధృతరాష్ట్రుడు అంత్యేష్ఠి కార్యక్రమానికి వచ్చాడని తెలిసి, ధర్మరాజు తన సోదరులతో పాటు ఆయన దగ్గరకు వెళ్ళి దర్శించుకొన్నాడు. పుత్రశోకంతో దుఃఖిస్తున్న ధృతరాష్ట్రుని ధర్మరాజు వెళ్ళి కౌగలించుకున్నాడు. అంతలోనే ధృతరాష్ట్రునికి తన కుమారుని చంపిన భీముణ్ణి అంతమొందించాలనే దుష్ట తలంపు కలిగింది. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన శ్రీకృష్ణుడు ముందుకు సాగుతున్న భీముని ఆపి, ఇనుముతో తయారుచేసిన భీముని విగ్రహాన్ని ముందుకు జరిపాడు. ధృతరాష్ట్రుడు పదివేల ఏనుగుల బలం కలవాడు. ఆయన కౌగిలింతలో చిక్కిన వారెవరూ ప్రాణాలతో బయటపడ లేదరు. ఆ లోహపు విగ్రహాన్ని భీముడే అనుకొని బిగియార కౌగిలించుకొని ముక్కలు ముక్కలు చేసేశాడు ఆ బలప్రదర్శన ఒత్తిడికి ధృతరాష్ట్రుని నోటినుండి రక్తం కారసాగింది. సంజయుడు పరిచర్య చేయగా, తెప్పరిల్లి 'హా భీమా, భీమా' అంటూ విలపించసాగాడు అపుడు శ్రీకృష్ణుడు 'రాజా! శోకించ వద్దు. భీముడు మీ చేతలో చనిపోలేదు. మీరు ముక్కలు చేసింది దుర్యోధనుడు చేయించిన భీముని ఇనుప విగ్రహం. రాజా! మీరు పుత్రశోకం వదలి భీముని చంపాలని ఆలోచించారు. అది మీకు ఉచితం కాదు.' అనగా ధృతరాష్ట్రుడు 'కృష్ణా! నీవు భీముని ఆపి విగ్రహాన్ని పెట్టడం మంచిదైంది. ఇప్పుడు నా కోపం శాంతించింది.'

ఆ తరువాత నకుల సహదేవులను ఆశీర్వదించాడు. అక్కడ శెలవు తీసికొని అందరూ గాంధారి వద్దకు వచ్చారు. గాంధారి పాండవులపై చాల కోపంగా ఉన్నదని గ్రహించిన వ్యాస మహర్షి ఇలా అన్నాడు. 'గాంధారీ! నీవు కోపగించ వద్దు. దుర్యోధనుడు యుద్ధానికి వెళుతూ నిన్ను ఆశీర్వదించమని కోరినపుడు నీవు 'ఎటు ధర్మముంటుందో అటే గెలుపు వుంటుం'దని అన్నావు కదా!' అని అనగా గాంధారి 'దేవా! పాండవుల పట్ల కుంతికి ఎంత ప్రేమ ఉన్నదో అంత ప్రేమ నాకూ వున్నది. కాని భీముని కార్యాలు నాకు రుచించ లేదు.'

అపుడు ఈ మాటలు విన్న భీముడు భయంభయంగా ఇలా అన్నాడు. 'అమ్మా! నేను చేసిన శపథము మేరకే వ్యవహరించాను. వేరేమీ లేదు. పైగా ధర్మయుద్ధంలో దుర్యోధనుని గెలవటం ఎవరి వల్ల కాదు.' అని భీముడు అన్నాడు.

'ఒక రాక్షసుని వలె దుశ్శాసనుని రక్తం ఎందుకు తాగావు?' అని గాంధారి అడిగింది. జవాబుగా భీముడు 'తల్లీ! శపథం మేరకు కేవలం త్రాగినట్లు నటించాను తప్ప అంతటి నీచానికి నేను ఒడిగట్ట లేదు.' అని అన్నాడు.

తర్వాత ధర్మరాజు ఎక్కడ అని గాంధారి అడిగింది. ధర్మరాజు భయంతో వణికిపోతూ రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ 'తల్లీ! క్రూరకర్మ నాచరించిన నేను నీ ఎదుటనే వున్నాను' అని చెప్పి, వంగి ఆమె పాదాలకు నమస్కరించటానికి ప్రయత్నిస్తుండగా దీర్ఘదర్శియైన గాంధారి దృష్టి ధర్మరాజు కాలిగోటిపై పడింది. గాంధారి కట్టుకొన్న నల్ల పట్టీ నుండి దృష్టి పడగానే, కాలి వ్రేళ్ళు నల్లగా మాడిపోయాయి. ఇది చూచిన అర్జునుడు శ్రీకృష్ణుని వెనుకవైపుకు వెళ్ళి దాక్కున్నాడు. నకుల సహదేవులు అటూ ఇటూ వెళ్ళిపోయారు ఇది గమనించిన గాంధారి శాంతించి భయపడవద్దని చెప్పింది.

ఆ తరువాత అక్కడనే ఉన్న కుంతిని దర్శించారు. రణరంగంలో గాయపడిన తన కుమారులను చూసి చింతించింది. అందిరినీ నిమిరి తన ప్రేమను ప్రకటించుకొంది. అయిదుగురు పుత్రులను కోల్పోయి ద్రౌపది ఏకధారగా విలపిస్తోంది. పాండవులు ఎంత చెప్పినను శాంతించ లేదు. తుదకు గాంధారి, కుంతి ద్రౌపదిని ఓదార్చారు. అక్కడే వున్న శ్రీకృష్ణునితో గాంధారి ఇలా అన్నది. 'ఓ కృష్ణా! అదిగో కర్ణుడు నేలపై పడి వున్నాడు. అదిగో జయద్రదుడు నేలపై ఉన్నాడు. అర్జునుడు అతన్ని చంపాడు. అడుగో అసమాన పరాక్రమవంతుడు భీష్ముడు శరశయ్యపై ఉన్నాడు. ఇదిగో ఇటు చూడండి. పరశురాముని అంతటివాడు ద్రోణుడు పడి వున్నాడు. అదిగో అక్కడ శకుని నేలపై పడి వున్నాడు.. అందుచేత ఓ కృష్ణా! నేను నిన్ను శపిస్తాను. నీవు శక్తి ఉండి కూడ కౌరవులు మరియు పాండవులను యుద్ధ విముఖులను చేయలేదు. వారు ఎలా పరస్పరం చంపుకున్నారో మీ యదువంశీయులందరు ఒకరినొకరు అలాగే చంపుకొందురు గాక!' అని శపించింది.

గాంధారి శపించగానే శ్రీకృష్ణుడు ఒక చిరునవ్వు నవ్వి మీ శాపాన్ని స్వాగతిస్తున్నాను అని అన్నాడు. ఇది వినిన పాండవులు ఆందోళన చెందారు.

అసంఖ్యాకమైన వీరుల మృతదేహాలకు విధియుతంగా దహన సంస్కారాలు చేయుటకుగాను కౌరవ పురోహితులైన సుధర్ముని, పాండవుల పురోహితుడైన ధౌమ్యుని, సంజయుని, విదురుని, యుయుత్సుని మరియు ఇంద్రసేనుని నియోగించారు. ముఖులైనవారి మృతదేహాలకు చందనాది ద్రవ్యాలతో పాటు నేతిధారలతో అగ్నిలో

దహనం చేశారు. ఆ తర్వాత ధర్మరాజు ధృతరాష్ట్రుని తీసికొని గంగాతీరంవైపు నడిచాడు. స్త్రీలందరు తమ భర్తలకు జలాంజలి అర్పించారు. అక్కడే ఉన్న కుంతి తన పుత్రులనుద్దేశించి ఇలా అన్నది. 'కుమారులారా! కర్ణుడు మీ పెద్దన్నయ్య. సూర్యుని ద్వారా నాకు జన్మించాడు. కనుక వానికి కూడ మీరు జలాంజలి సమర్పించండి.'

ధర్మరాజు ఎంతో దుఃఖపడి కర్ణుని యొక్క స్త్రీలనందరిని పిలిచి శాస్త్రోక్తంగా కర్మలు చేయించి తన పట్ల ఉన్న కోపమును విడిచిపెట్టమని వారిని కోరాడు.

-o0o-

12. శాంతి పర్వం

మృతవీరులందరికి జలతర్పణం కావించిన తరువాత, ఆత్మశుద్ధి కొరకు అందరూ గంగా తీరంలోనే నెల రోజులు వున్నారు. ఆ సమయంలో నారదుడు, వ్యాసమహర్షి మరియు కణ్వ మహర్షి వచ్చి ధర్మరాజును కలుసుకొన్నారు. అందులో నారదుడు, వేదవ్యాసునితో మాట్లాడిన తరువాత ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'ఓ రాజా! మీరు మీ బాహుబలంతో మరియు శ్రీకృష్ణుని అండతో విజయం సాధించి సంతృప్తి కలిగి వున్నారా?' అని అడిగినపుడు, ధర్మరాజు ఇలా అన్నాడు. "మునివర్యా! శ్రీకృష్ణుని మరియు నా సోదరుల వీరత్వంతో నాకు రాజ్యం దక్కింది. ద్రౌపది పుత్రులు, సోదరుడు మరియు తండ్రి అందరూ మరణించారు. వీరశూరడైన అభిమన్యుని పోగొట్టుకున్నాము. మహామాయావి, బలయుతుడైన ఘటోత్కచుని కోల్పోయాము. కర్ణుడు మా సోదరుడని తెలిసిన తర్వాత, నా దుఃఖం ఇనుమడించింది. మీరు సర్వజ్ఞులు కదా! కర్ణుని రథ చక్రం భూమిలో ఎందుకు కూరుకుపోయింది? మా తల్లి కుంతి పాదాల వలెనే కర్ణుని పాదాలు వుండేవి. మొదట నాకు అర్థం కాలేదు కాని తరువాత తెలిసి వచ్చింది.' అని అనగా, నారదుడు కర్ణుడు ఎలా శాపగ్రస్తుడైనాడో ధర్మారాజుకు ఇలా చెప్పసాగాడు. "రాజా! పరశురాముని వద్ద విద్యాభ్యాసం చేసి బ్రహ్మాస్త్రాన్ని పొందిన కర్ణుడు బ్రాహ్మణుడు కాదని తెలుసుకొన్న తరువాత పరశురాముడు అవసరమున్న సమయంలో బ్రహ్మాస్త్ర ప్రయోగ విధానాన్ని మరచి పోదువు గాక అని శపించాడు. ఒకసారి పరశురాముడు కర్ణుని తొడపై తలవుంచి నిద్రిస్తుండగా, కర్ణుని తొడను తొలుస్తున్న ఒక విషపు పురుగును తొలగించకుండా ఓర్చుకొనుట చేత, అతని నుండి రక్తము ప్రవహించటం గమనించిన పరశు రాముడు ఇతరు బ్రాహ్మణుడు కాదని నిర్ధారణకు వచ్చాడు. కోపించిన పరశురాముడు కర్ణుని ఆ విధంగా శపించాడు. మరొకసారి పొరపాటున ఒక బ్రాహ్మణుని ఆవును కర్ణుడు చంపినపుడు ఆ బ్రాహ్మణుడు కూడ కర్ణుని శపించాడు. బ్రాహ్మణుని శాపమేమనగా యుద్ధ సమయంలో కర్ణుని రథ చక్రం భూమిలోనికి క్రుంగిపోతుంది అని. ఇంద్రుడు మారువేషంలో వచ్చి కర్ణుని కవచకుండలాలను హరించాడు. అయినా అతడు వీరమరణం పొందాడు. దుఃఖించతగదు.'

అపుడు ధర్మరాజు "ఈ బంధనాలన్నీ త్రెంచుకొని, రాజభోగాలు వదలి, అడవుల్లోకి వెళ్ళిపోతాను" అని అనగా అర్జునుడు ఇలా చెప్పాడు. 'రాజా! అలౌకిక పరాక్రమాన్ని ప్రదర్శించి సంపాదించుకొన్న రాజ్యలక్ష్మిని వదలి అడవులకు వెళతాననడం ఉచితమైన పని కాదు. మీరు ఇప్పుడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించి, రాజ్యమును సుభిక్షంగా పరిపాలించాల్సి ఉంది."

అపుడు భీమసేనుడు 'ఓ రాజా! అడవులకు వెళ్తాననే మీ నిర్ణయం మాకెవరికీ అంగీకిరం కాదు. అలాంటపు, కౌరవులను నాశనం చేయటం వలన వచ్చిన లాభమేమటి?' నకులుడు 'రాజా! వేదాలకు విరుద్ధంగా నడచిన యెడల నాస్తికులు అని అంటారు. యుద్ధంలో విజయం సాధించిన తరువాత శోకించేవారు ప్రపంచంలో ఎక్కడా ఉండరు.' తరువాత సహదేవుడు ఇలా అన్నాడు. 'రాజా! బాహ్యవస్తువులను త్యజించినంత మాత్రాన ఫలితమేమీ ఉండదు.'

తరువాత వ్యాసమహర్షి ఇలా అన్నాడు. 'ధర్మరాజా! అన్నిటికంటె గొప్పది గృహస్థ ధర్మం. క్షత్రియులైన వారు రాజ్యపాలన చేస్తూ ప్రజలను సంరక్షించాలి.ఇది నీకు బాగా అర్థం కావాలంటే ఒక కథ చెబుతాను విను.

పూర్వం శంఖుడు, లిఖితుడు అనే ఇద్దరు సోదరులుండేవారు. ఇద్దరూ గొప్ప తపస్సంపన్నులు. వారి

ఆశ్రమాలు దగ్గర దగ్గరగానే ఉండేవి. ఒకరోజు లిఖితుడు అన్నగారి ఆశ్రమానికి వెళ్ళాడు. అతడు వెళ్ళిన సమయానికి శంఖుడు ఆశ్రమంలో లేడు. ఆశ్రమ ప్రాంగణంలో చట్లు, వాటికి కాయలు, పండ్లు ఉన్నాయి. లిఖితుడు ఆ చెట్లనుండి కొన్ని పండ్లు కోసుకొని తింటూ, సోదరుని కోసం నిరీక్షిస్తున్నాడు. ఈలోగా వచ్చిన శంఖుడు లిఖితుని చూచి ఆ పండ్లు ఎక్కడివి అని అడిగాడు. ఎదురుగా ఉన్న చెట్టునుంది అని చూపించాడు. అపుడు శంఖుడు 'సోదరా! నీవు అధర్మం చేశాడు. నన్ను అడగకుండానే కోసుకొని తింటున్నావు. ఇది ధర్మం కాదు. నీవు దొంగతనం చేశావు కనుక నిన్ను శిక్షించాల్సి ఉంది. కాని నేను శిక్షించలేను. నీవు మన రాజు సుద్యుమ్నుని వద్దకు వెళ్ళి, విషయం చెప్పి, ధర్మపాలన చేయమని కోరుకో. లిఖితుడు సోదరుని మాటను గణించి రాజు వద్దకు వెళ్ళి, తనను శిక్షించమని కోరాడు. రాజు అతని చేతులు నరికించి వేయించాడు. మొండిచేతులతో లిఖితుడు శంఖుని వద్దకు వెళ్ళాడు. శంఖుడు 'లిఖితా! నీవు వెంటనే బాహుదా నది వద్దకు వెళ్ళి స్నానం చేసి దేవతలకు, పితరులకు తర్పణం చేసి రా!' అఇ అన్నాడు. అలాగేనని లిఖితుడు వెంటనే బాహుదా నదికి వెళ్ళి నీటిలో మునుగగానే, భుజముల నుండి చేతులు పుట్టుక వచ్చాయి. అతడు సంతోషించి, తర్పణం చేసి, శంఖుని దగ్గరకు వచ్చాడు. శంఖుడు 'నేను నా తపోబలంతో నీకు చేతులు వచ్చేటట్లు చేశాను.' అని అన్నాడు.

అపుడు లిఖితుడు 'అలా అఇతే మొదటనే మీ తపోబలాన్ని ఎందుకు ఉపయోగించ లేదు?' అని అడిగాడు. శంఖుడు ఇలా అన్నాడు. 'నిన్ను శిక్షించుట ద్వారా క్షత్రియోచిత ధర్మం ప్రకారం రాజు శుద్ధి ఐనాడు. నీవు శుద్ధి అయినావు, తర్పణం చేయడం వల్ల పితరులు శుద్ధి అయినారు.' అని అన్నాడు.

ఈ కథ చెప్పి, వ్యాస మహర్షి 'అందుకని ధర్మరాజా! క్షత్రియుల యొక్క ముఖ్య ధర్మం ప్రజాపాలన చేయటమే కాని సన్యాసం కాదు.' ఇంతమంది ఇన్ని అంశాలు చెప్పినను, ధర్మరాజు బుద్ధి మారలేదు. అర్జునునితో ఇలా అన్నాడు.'అర్జునా! నేను ప్రాయోపవేశం చేయడం తప్ప మార్గాంతరం లేదు. ఇచ్చటనే ఇప్పుడే ఇలాగే కృంది, కృశించి, నీరసించి, ఎండుకట్టెగా మారి పోతాను. ఈ గంగా తీరాన ప్రాణాలు విడుస్తాను. మీరందరు కలిసి నాకు అనుమతి ఇవ్వండి.' అని అన్నాడు.

అర్జునుడు అయోమయంలో పడిపోయి, శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. 'దేవా! ధర్మరాజు ఎవరి మాటా వినేలా లేడు. మీరే స్వయంగా ఉపదేశించండి.' శ్రీకృష్ణుడు మెల్లగా లేచి, ధర్మరాజు వద్దకు వెళ్ళి, అతని చేతిని పట్టుకొని, 'రాజా! ఇక మీరు శోకించవద్దు. ఎందుకంటే, ఈ కురుక్షేత్రంలో మరణించిన బంధువులందరూ స్వర్గం చేరుకొన్నారు. అభిమన్యుడు మరియు పాండుపౌత్రులు కూడ స్వర్గం చేరారు. అందుచేత మనము దుఃఖించవలసిన పని లేదు.'

సృంజయుని కుమారుడైన సుహోత్రుడు ఈ లోకానికి ఇస్తున్న ఒక పరంపరను చెప్తాను వినండి. అతని కాలంలో ఇంద్రుడు ఒక సంవత్సరమంతా సువర్ణ వర్షాన్ని కురిపించాడు. దాంతో బ్రహ్మ కూడ వెనుకపడిపోయాడు. దానం చేయడంలో, శరణాగతుల్ని రక్షించడంలో అతనికి సాటి ఎవరూ లేరు. కాని అతడు స్వర్గం చేరాడు కదా!

దుష్యంతుని కుమారుడు భరతుడు చిన్న వయస్సునుండే క్రూరమృగాలతో స్నేహం చేసుకొని, పెద్దవాడైన తర్వాత వేయి అశ్వమేధ యాగాలు, వంద రాజసూయ యాగాలు చేశాడు. అయినప్పటికి అతను కూడ కాలగర్భంలో కలిసిపోయాడు గదా!

దశరథుని కుమారుడు శ్రీరామచంద్రుడు ఎంత గొప్పవాడో ముల్లోకాలకు తెలుసు. మానవ జన్మ ఎత్తిన కారణంగా అతనికి కూడ మరణం తప్పలేదు కదా! దివినుండి భువికి గంగను తెచ్చిన భగీరథుడు ఏమైనాడు? దిలీప చక్రవర్తి యుద్ధాలు చేస్తుంటే ఇంద్రుడికి సైతం చెమటలు పట్టి పారిపోయేవాడు. అలాంటి దిలీపుడు ఉండగలిగాడా? యవనాశ్వుని కుమారుడు మాంధాత నేడు స్వర్గంలో తలమానికమై ఉన్నాడు. నాభాగుని కుమారుడు అంబరీషుడు యజ్ఞాలు చేస్తుంటే రాజులు వచ్చి సేవకుల్లా పనిచేసే వారు. అలాటి అంబరీషుడు నిష్క్రమించక తప్పలేదు కదా! చిత్రరథుని కుమారుడు శశిబందుకు ఒక లక్షమంది రాణులుండేవారు. అయినా అతడు ఉండగలిగాడా?

అమూర్తరాయుని కొడుకు గయుడు అగ్నిదేవుని ప్రసన్నం చేసుకొని వరాలు పొందాడు. అయినను గయుడు ఇక్కడ నేలపై శాశ్వతంగా నిలదొక్కుకోలేక పోయాడు. ఇక్ష్వాకు వంశంలో జన్మించిన సగరునకు 60 వేల మంది కుమారులుండేవారు. అతని పేరుమీదనే సముద్రమునకు సాగరుడన్న పేరు వచ్చింది. అయినా సగరుని మృత్యువు కబళించలేదా?

వేనుని యొక్క కుమారుడు పృథు కాలగర్భంలో కలిసిపోయాడు. అందుకని ఓ ధర్మరాజా! నీవు సింహాసనాన్ని అధిష్ఠించి గొప్ప గొప్ప యజ్ఞాలు చేస్తూ ఉంటే, నీవు కోరుకున్న లోకానికి చేరుకోగలవు' అని శ్రీకృష్ణుడు వాస్తవ విషయాలన్నీ నిర్మొహమాటంగా చెప్పాడు.

ధర్మరాజు వ్యాసమహర్షిని 'మునివర్యా! రాజులు ఆపద కాలంలో ఎలాంటి నీతిని అనుసరించాలి?' అని అడుగగా, వేదవ్యాసుడు ఇలా చెప్పాడు. 'ధర్మరాజా! నీవు ధర్మము యొక్క పరిపూర్ణ రహస్యాల్ని తెలుసుకోవాలనుకుంటే కురువృద్ధ పితామహుడైన భీష్ముని వద్దకు వెళ్ళాలి. ఇంక కొన్ని రోజులలో భీష్ముడు ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నాడు. నీవు ఈ లోపుగానే అక్కడికి వెళ్ళు.' అని చెప్పగా, ధర్మరాజు 'దేవా! ఇంతటి నరసంహారం జరిగిన తరువాత కూడ నేను ఎలా వెళ్ళి ముఖం చూపగలను?' అని అనగా, శ్రీకృష్ణుడు 'ధర్మరాజా! నీవు ఇంకా శోకాన్ని పట్టుకోకు. వేదవ్యాసుడు చెప్పినట్లు ఆచరించు' అని అన్నాడు.

శ్రీకృష్ణుని మాటలు వినగనే, ధర్మరాజు ఒకసారి వేదవేదాంతాలను స్మరణకు తెచ్చుకొని, ఒక నిర్ణయానికి వచ్చి శాంతిని పొంది ధృతరాష్ట్రాదులతో బాటు హస్తినాపురానికి చేరుకొన్నాడు. హస్తినలో ధర్మరాజు పట్టాభిషేకానికి తగిన ఏర్పాట్లు చురుకుగా సాగాయి. బంగారు సింహాసనంపై ధర్మరాజు ఉత్తరాభిముఖుడై కూర్చొన్నాడు. అతనికి అభిముఖుడై శ్రీకృష్ణుడు, సాత్యకి కూర్చొన్నారు. ఇరువైపులా భీముడు, అర్జునుడు కూర్చొన్నారు. ఆ పిదప ఒకవైపు సువర్ణ రజత ఆసనాలపై నకుల సహదేవులు, కుంతి కూర్చొన్నారు. ఇదేవిధంగా కౌరవుల పురోహితుడు సుధర్ముడు, విదురుడు, ధౌమ్యుడు మరియు ధృతరాష్ట్రుడు కూడ అందమైన విడివిడిగా ఉన్న ఆసనాలపై కూర్చొన్నారు. ధృతరాష్ట్రుడు ఉన్నవైపునే యుయుత్సుడు ఆ పిమ్మట సంజయుడు, మరియు గాంధారి ఆసీనులైనారు.

ఆ పిమ్మట సర్వతోభద్ర ఆసనంపై ధర్మరాజును, ద్రౌపదిని కూర్చోబెట్టి ధౌమ్యుడు శాస్త్రయుతంగా అభిషేకించాడు. శ్రీకృష్ణుడు కూడ పాంచజన్యంతో పవిత్రజలాన్ని నింపి ధర్మరాజును అభిషేకించాడు. సభాసదులతో, పురజనులతో క్రిక్కిరిసిన ఆ ప్రాంగణం కరతాళధ్వనులతో మారుమ్రోగింది.

ధర్మరాజు మాట్లాడుతూ శ్రీకృష్ణుని ప్రశంసించాడు. ధృతరాష్ట్రుని అనుమతి తీసుకొని దుర్యోధన దుశ్శాసనుల రాజప్రాసాదాలను భీమార్జునులకు ఇచ్చాడు. అదేవిధంగా మిగతా వారికి కూడ సముచిత భవనాలను

కేటాయించాడు. తగురీతిలో వచ్చిన వారందరికి దానధర్మాలు చేశాడు.

ధర్మరాజు ఇలా హస్తినాపుర ప్రజలందరిని సంతుష్టపరచి శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ధ్యానంలో నిమగ్నుడై ఉన్నాడు. ధర్మరాజు నేరుగా వెళ్ళి రెండు చేతులు జోడించి 'దేవా! మీ కృపవల్లనే మేము మళ్ళీ రాజ్యాన్ని దక్కించుకోగలిగాం.' అని అన్నాడు. శ్రీకృష్ణుడు ఏమీ సమాధానం ఇవ్వకుండా ధ్యానంలో నిమగ్నుడై ఉన్నాడు. ధర్మరాజు మళ్ళీ 'దేవా! నేను మీ శరణాగతుడను. పాదాభివందనం చేస్తున్నాను. నన్ను కరుణించండి.' అని ప్రార్థించాడు.

అంతవరకు ధ్యానసమాధిలో లీనమై యున్న శ్రీకృష్ణుడు సర్వేంద్రియాలను యథాస్థానంలో నిల్పి, చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు. 'బాణశయ్యపై ఉన్న భీష్ముడు ఈ సమయంలో నన్ను ధ్యానం చేస్తున్నాడు. కనుక నా మనస్సు అతనియందే లగ్నమై ఉంది. పరశురాముడంతటివాడితో 23 రోజులు యుద్ధంచేసి ఓడిపోలేదు. గంగ ద్వారా జన్మించి, వసిష్ఠుని శిష్యునిగా దివ్యాస్త్రాలను సంపాదించి, వేదవేదాంగాలను జీర్ణం చేసుకొన్నాడు. అందుకని ధర్మాత్ములలో శ్రేష్ఠుడైన భీష్మ పితామహుని వద్దకు వెళ్ళి, నీ సందేహాలనన్నింటిని నివృత్తి చేసుకో.' అని అనగా, ధర్మరాజు 'దేవా! నీ దర్శనం కూడ భీష్ములవారికి చేయాల్సి ఉంది. ఉత్తరాయణం రాగానే దేవలోకం వెళ్ళిపోతాడు. అందుచేత మీ నేతృత్వంలోనే భీష్మ పితామహుల దర్శనం చేసుకొంటాం.' ధర్మరాజు మాటలు విన్న శ్రీకృష్ణుడు సాత్యకిని పిలిచి రథం సిద్ధం చేయించమని చెప్పాడు. ఒక రథంపై శ్రీకృష్ణుడు సాత్యకితోను. మరొక రథంపై ధర్మరాజు అర్జునునితోను, వేరొక రథంపై భీముడు నకుల సహదేవులతోను, మరియొక రథంపై కృపాచార్యుడు, యుయుత్సుడు మరియు సంజయుడు బయలు దేరారు. ఓఘవతి నదీతీరాన ఉన్న భీష్ముని శరశయ్యకు కొంతదూరంలో రథాలను నిలిపి, ఋషులచే పరివేష్ఠింపబడిన భీష్ముని వద్దకు చేరుకొన్నారు. అక్కడనే వున్న వేదవ్యాసునకు నమస్కరించి కొంచెం తలెత్తి 'దేవా! మీకు నమస్కారం.' అని స్తుతించసాగాడు. శ్రీకృష్ణుడు మధ్యలో కలుగజేసుకొని 'వీరవరా! మీరు ఈ లోకంనుండి వెళ్ళిపోగానే జ్ఞానం నశించిపోయే ప్రమాదం వుంది. అందువలన ధర్మార్థ యోగముల గురించి ధర్మరాజుకు బోధించి, ఆయన శోకం తొలగించండి.' శ్రీకృష్ణుని మాటలు విన్న భీష్ముడు ఆనందంతో రెండు చేతులు జోడించి 'మీరుండగా నేను ఏపాటివాడిని?' అని అన్నాడు గద్గద స్వరంతో. దానికి శ్రీకృష్ణుడు స్పందించి, మీకు వరమలిస్తున్నానని, ఇప్పటినుండి ఆకలిదప్పులుండవు, ఎలాంటి బాధ మీ దరిచేరదు, అన్ని శాస్త్రముల జ్ఞానభాండాగారం మీలో తొణికిసలాడుతున్నది' అని అన్నాడు.

ఇక ధర్మరాజు అడిగిన కొన్ని ధర్మార్థ సంబంధ సంశయాలను భీష్ముడు ఎలా తీర్చాడో చూద్దామా?

భీష్ముడు చెప్పిన విషయాలు ఇలా ఉన్నాయి. అవి ఈ క్రింది వాటికి సంబంధించినవి.

1) రాజోచిత శిష్టాచారము, 2) రాజుయొక్క నీతిపూర్ణ వ్యవహారం, 3) రాజ్య శాసనం యొక్క సాధనములు, 4) బ్రహ్మయొక్క నీతిశాస్త్రము, 5) నాలుగు వర్ణాలు మరియు నాలుగు ఆశ్రమాల గురించి, 6) సర్వ సాధారణ ధర్మాలు, 7) రాజధర్మాల మహత్యం, 8) రాజధర్మంలో నాలుగు ఆశ్రమ ధర్మాల కలయిక, 9) ప్రజల అభ్యుదయంలో రాజు పాత్ర, 10) రాజు యొక్క ప్రధాన కర్తవ్యాలు, 11) యుగనిర్మాణంలో దండనీతి యొక్క ప్రాధాన్యత, 12) ఇహపర లోకాల్లో రాజు సుఖం ప్రాప్తించుకోవడానికి కావలసిన గుణాలు, 13) రాజధర్మము మరియు రాజు విద్వాంసుడైనా అతనికి పురోహితుని ఆవశ్యకత, 14) బ్రాహ్మణ క్షత్రియ సమ్మిళిత శక్తి యొక్క ప్రభావం, 15) రాజధర్మానుసారంగా వ్యవహరించుట, 16) ఉత్తమ, అధమ బ్రాహ్మణుల పట్ల రాజు

వ్యవహారం, 17) ఆపద కాలంలో బ్రాహ్మణుల వ్యవహారం, కర్తవ్యం, 18) ఋత్విజుల లక్షణాలు, 19) మిత్రులు, మిత్రులు కానివారి గురించి పసిగట్టుట, 20) మంత్రిని అంచనా వేయడం, 21) సభాసదుల లక్షణాలు మరియు రహస్యాధికారి గుణగణముల గురించి, 22) రాజు వ్యవహార నీతి, 23) నగర వర్ణన – పై నుదహరించిన విషయాల గురించి భీష్ముడు ధర్మరాజుకు వివరణ ఇచ్చాడు. కాని ధర్మరాజు సందేహాలన్నీ తొలగిపోలేదు. కనుక ఇలా అడిగాడు. 'పితామహా! ఈ ప్రపంచంలో అనేకులు అనేక కష్టాలు భరిస్తున్నారు కదా! అవి ఎలా తొలగిపోతాయి?'

భీష్ముడు ఇలా చెప్పాడు. 'ఎవరైతే గొప్పలకు పోకుండా, నియమబద్ధంగా జీవితం గడుపుతుంటారో, కోరికలను అణచిపెడుతూ ఉంటారో, ఎదుటివారి కఠినత్వాన్ని సమీక్షించుకుంటూ వుంటారో, ఇతరులను అవమానించకుండా ఉంటారో, మరియు తల్లిదండ్రుల సేవలో నిమగ్నులై ఉంటారో, అటువంటివారు మాత్రమే దుఃఖం నుండి విముక్తులౌతారు.'

ధర్మరాజు – 'పితామహా! చాలమంది కఠోర చిత్తం కలిగి, బాహ్యంగా శాంతస్వభావులుగా కనిపిస్తుంటానే, అలాగే మృదుస్వభావం కలిగినవారు కఠోరంగా కనిపిస్తుంటారు, మనం వారిని ఎలా గుర్తుపట్టగలం?'

భీష్ముడు – 'ధర్మరాజా! పూర్వకాలం నాటి ఒక కథను చెప్తాను. విను. చాలకాలం క్రిందట పురి అనే అడవిలో పౌరికుడు అనే పెద్దపులి రాజ్యమేలుతుండేది. అది ఘాతకి కనుక జంతువులను చంపుతూ, వాటిని తింటూ ఉండేవాడు. వాడి ఆయువు మూడి చనిపోయాక, కర్మఫలంగా నక్కగా జన్మించాడు. కాని అతడు పూర్వజన్మ స్మరణ కలిగి ఉన్నాడు. పూర్వజన్మను గురించి బాధపడుతూ, ఇంక ఈ నక్క జన్మలో హింస చేయకుండా సత్యం పలుకుతూ శ్మశానభూమికి దగ్గరలో నివసిస్తున్నాడు. అక్కడ వుంటూ ఈ నక్క మాంసాహారం వదలి వేసి, కందమూలాలు తింటూ, శుచిగా ఉండటం చూచిన మిగతా నక్కలకు ఈ వ్యవహారం నచ్చలేదు. సమయం దొరికినప్పుడల్లా, మిగతా నక్కలు ఈ నక్కకు నీతులు బోధించసాగాయి. మాంసం నీకు తెచ్చిపెడతాము అని కూడ అన్నాయి. ఇలా అనేక విధాలుగా హింసించ సాగాయి. అపుడు ఆ నక్క ఇలా అన్నది. 'బంధువులారా! మప చెడు అలవాట్ల వల్లనే మనల్ని ఎవరూ నమ్మటం లేదు. మన ఆచారణ సరిగా చేసుకొంటే, మన కులగౌరవం పెరుగుతుంది. కనుకనే, నేను సదాచారంతో మన వంశ ప్రతిష్ఠను హెచ్చించే పనిలో వున్నాను. నన్ను మీరు ఎగతాళి చేయరాదు. ఆశ్రమంలో ఉండి ఎవరైనా గోహత్య చేస్తే పాపం అంటదా? శ్మశానంలో ఉండి గోదానం చేస్తే పుణ్యం లభించదా? మీ జీవితాలు ఇహపరలోకాల్లో అశుభ ఫలితాలను ఇచ్చేవిగా ఉన్నవి. శుభకర్మ లనేది ఆత్మ ప్రేరణ వల్ల జరుగుతుంది. అందుచేత మీరుకూడ శుచిశుభ్రతలతో శుభకర్మ లాచరించాలని కోరుతున్నా' అని అన్నది. ఈ నక్క యొక్క సత్ప్రవర్తన గురించి, అలా అలా ప్రాకి, చివరకు ఆ రాజ్యపు రాజైన పెద్దపులికి తెలిసి, స్వయంగా నక్క దగ్గరకు వచ్చి, అందరి ఎదుట నక్కను సన్మానించి, తనకు మంత్రిగా ఉండమని కోరింది. 'నీ గురించి అన్ని విషయాలు విన్నాను. నీవు నాతోపాటు వచ్చి సమస్త భోగములను అనుభవించవచ్చును. కాని ఒక విషయం నీకు చెప్పాలి. మా జాతి కఠోర స్వభావం గలది. అయినా నీ మృదుస్వభావంతో నక్కలు మారిన పక్షంలో నీకు శుభము జరుగుతుంది' అని చెప్పింది.

నక్క ఇలా చెప్పింది. 'మృగరాజా! మీరు శుద్ధ స్వభావం ఉన్న మంత్రి కోసం వెదుకుతున్నారు. మీకు సన్నిహితంగా ఉంటూ, మిమ్మల్ని ప్రేమించేవారిని మత్రిగా నియమించుకోవాలి. తరువాత మీ భోగభాగ్యాల గురించి చెప్పారు. నేను సాత్వికంగానే ఉంటాను. ఏ ఆడంబరాలు అవసరం లేదు. నేను మంత్రిగా వచ్చి,

న్యాయబద్ద పరిపాలన చేయాలంటే, మీ పాత సేవకులు నాపై కక్ష కడతారు. అయినా, నేను కొన్ని నిబంధనలకు లోబడి పనులు చేస్తున్నాను. కాబట్టి, మీ ప్రోత్సాహం నాకు అనివార్యం. నేను చెప్పే విషయాలు, ఋజువులను బట్టి, మీ సన్నిహితులు దొంగలైనప్పటికీ, మీరు వారిని శిక్షించకూడదు. మీరు నా ఆత్మీయులను కూడ శిక్షించకూడదు. ఈ విషయాలన్నీ మీరు ఒప్పుకొంటే, మంత్రిగా చేరతాను.' అని చెప్పింది.

పెద్దపులి ఆదేశాలతో, అట్టహాసాలతో, నక్క మంత్రిపదవి అధిష్ఠించింది. యుద్ధ ప్రాతిపదికన, లంచగొండితనం రూపుమాపింది. పాత అనుచరులు, మంత్రుల ఆటలు చెల్లడం లేదు. అవన్నీ నక్క దగ్గరకు వచ్చి, కావలసినంత ధనమిస్తామని ఆశ పెట్టాయి. అయినా నక్క వినలేదు. అందుచేత చావుదెబ్బ తీయాలని పన్నాగాలు మొదలైనాయి. ప్రతిరోజూ మాంసం పెద్దపులి నిర్ణీత స్థలంలో వుంచేది. ఆరోజు రాజు మాంసాన్ని నక్క తెచ్చి నక్క వసతి గృహంలో పెట్టారు.

పెద్దపులికి ఆకలి కాగానే చూస్తే మాంసం లేకపోవడంతో వెతకమని సేవకులకు ఆదేశాలిచ్చింది. వారు వెళ్ళి నక్క గృహంలో వున్న మాంసాన్ని తెచ్చి, నక్కపై నిందలు మోపసాగాయి. పెద్దపులి నక్కను చంపమని ఆదేశించింది. కాని పెద్దపులి తల్లి తొందరపడ వద్దని కొడుకును ఆదేశించింది. కారణమేమంటే, నక్కమాంసం తినదు కనుక దొంగిలించి తినాల్సిన అవసరం నక్కకు లేదు. అదే సమయంలో ఒక గూఢచారి వచ్చి, పెద్దపులి పట్ల జరిగిన ఒక కుతంత్రం గురించి చెప్పింది. అందుచేత నిరపరాధియైన నక్కను పదే పదే కౌగిలించుకున్నది పెద్దపులి.

ఆ తరువాత నక్క మంత్రి పదవిని త్యజించి, పెద్దపులి సర్దిచెప్పినా వినకుండా, దూరంగా అడవుల్లోకి వెళ్ళిపోయింది. అక్కడ నక్క ఆహారం తినడం మానివేసి, మృత్యుపర్యంతం అలాగే ఉండి, చివరకు స్వర్గాన్ని చేరుకొంది.

ఇక సముద్రము మరియు నదుల వృత్తాంతం గురించి, భీష్ముడు మరియు ధర్మరాజు మధ్య సంభాషణ గురించి చెపితే, చాల బాగుంటుంది.

ఒకానొకప్పుడు, నదులకు రాజైన సముద్రుడు, ఆయా నదులను పిలిచి తనలోని సందేహాలను ఇలా అడిగాడు. 'ఓ నదులారా! మీరు వేగంగా ప్రవహిస్తున్నప్పుడు చెట్టు కూకటి వ్రేళ్ళతో పెకలించబడి ప్రవాహంలో వస్తుంటాయి. కాని తుంగమొక్కలు కనిపించవు. కారణం అవి సన్నగా, పీలగా, శక్తిహీనమై మీ ఒడ్డునే వుంటాయి. అయినా మీరు మీ వేగంతో వాటిని తేలేకపోతున్నారు. ఎందుచేత? అవి తేలికగా వున్నాయనా? ఏమైనా వుపకారం కోరుకొంటున్నారా? అవి మీ తీరాన్ని వదలి రాలేనంత బలంగా వేళ్ళూనుకొని వున్నాయా? ఈ విషయంలో మీ అభిప్రాయం వినాలని అనుకొంటున్నాను.'

ఈ మాటలు విన్న గంగానది అర్థపూరితమైన విషయం ఇలా చెప్పింది. 'నాథా! మహావృక్షాలన్నీ అహంకారంతో విర్రవీగుతుంటాయి. కనుక అవి తమ తమ స్థానాలను విడిచిపెట్టవలసి వస్తుంది. తుంగమొక్కలు వాతావరణానికి అనుకూలంగా ప్రవర్తిస్తాయి. వంగి లేస్తాయి. మళ్ళీ తలపైకెత్తి బ్రతకగలుగుతాయి.'

భీష్ముడు – ధర్మరాజా! జీవుడు అనుకూల, ప్రతికూల పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తే, విజయం లభిస్తుంది.

ధర్మరాజు – పితామహా! నిస్సహాయుడైన రాజు తన బుద్ధిబలంతో ఎవరిని ఆశ్రయిస్తే విజయం సాధించగలడు?

భీష్ముడు – మంచి ప్రశ్న అడిగావు. అలాంటి సమయాల్లో శత్రువులతో కూడ చేయి కలుపవచ్చు. ఈ విషయం నీకు పూర్తిగా అర్థం కావడానికి ఒక కథ చెప్తాను. విను.

ఒక అడవిలో ఒక పెద్ద వటవృక్షం వుంది. అది అసంఖ్యాకమైన ఊడలతో, లతలతో గుబురుగా ఉండి భయం కలిగిస్తోంది. ఆ చెట్టు కొమ్మల్లో వందలాది పక్షులు గూళ్ళు నిర్మించుకొని నివసించసాగాయి. చెట్టు విశాలంగా వ్యాపించి ఉంది. చెట్టు క్రింద చల్లగా ఉండేది. ఆ చెట్టుపైన పక్షులే కాకుండా, పాములు, అడవి జీవులు కూడ ఉండేవి. ఆ చెట్టు మొదట్లో ఒక కన్నం వేసుకొని ఒక ఎలుక నివసిస్తుండేది. చెట్టు శాఖపై ఒక పిల్లి కూడ ఉండేది. ఆ పిల్లి చెట్టుపైన వుండే పక్షులను తింటూ ఆనందంగా కాలం గడిపేది.

ఒక రోజు వేటగాడు పన్నిన ఉచ్చులో పిల్లి చిక్కుకొంది. చీకటిపడితే అడవి జీవాలు ఉచ్చులో పడతాయి. కాని ఈ పిల్లి ఎంతో జాగ్రత్తగా ఉన్నా కూడ ఉచ్చులో పడింది. ఎలుక ఆహారం కోసం బయటకు వచ్చి వెతుకుతుండగా, వేటగాడు పన్నిన వలలో చిక్కిన పిల్లి దానికి కనబడింది. అది చూచి ఎలుక నవ్వసాగింది. ఈలోగా అంతదూరాన ఉన్న ముంగిసపై దానిచూపు పడింది. ఎలుక ఉన్నదని గ్రహించి ఆ ముంగిస తన కలుగులోనుండి వెలుపలికి వచ్చింది. ఎలుక వైపు ఆశగా చూస్తోంది. ఏమిచేయాలిరా దేవుడా అని పైకి చూసే సరికి దాని పైప్రాణాలు పైనే పోయాయి. పైన ఉన్న గుడ్లగూబ ఆశగా ఎలుకవైపే చూస్తోంది. ఎలుకకు సంకట పరిస్థితి ఎదురైంది. నేలపై ముంగిస, చెట్టుపై గుడ్లగూబ వీటినుండి ఎలా తప్పించుకోవాలోనని ఆలోచనలో పడింది.

ఎలుక అనేక రకాలుగా ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చింది. ఈ బోయవాడి వలపై ఇలాగే ఉంటే గుడ్లగూబ ఎత్తుకు పోగలదు. నేలపైకి వచ్చి పరుగెత్తుదామంటే ముంగిస కొరికి వేయగలదు. కనుక వలలో ఉన్న పిల్లి నాకు శత్రువైనా సరే ఇప్పుడు ఆపదలో వుంది. కనుక దీనితో ఒప్పందం చేసుకోవాలి. అలా ఆలోచించి ఎలుక పిల్లితో ఇలా అన్నది. 'సోదరా! ఈ వలను కొరికి నీకు ముక్తిని ప్రసాదిస్తాను. కాని నాకు ప్రమాదం పొంచి వుంది. క్రింద వున్న ముంగిస నన్ను అందుకోవాలని చూస్తున్నది. పైన ఉన్న గుడ్లగూబ నన్ను ఎగరేసుకు పోవాలని చూస్తోంది. అందుకని నేను నీ పొట్ట క్రింద దాగుకోటానికి అనుమతి కావాలి.'

పిల్లి ఇలా అన్నది. 'సోదరా! నేను స్వయంగా ఆపదలో వున్నాను. వల కొరికి నాకు ప్రాణదానం చేస్తానన్న నిన్ను అక్కున చేర్చుకొంటాను. నావల్ల నీకెలాంటి హాని జరగదు.'

ఎలుక వెళ్ళి పిల్లి ఒడిలో నిశ్చింతగా పడుకొంది. పిల్లి కూడ ఎలుకను ఎత్తుకొని రక్షించసాగింది. ముంగిస, గుడ్లగూబ ఈ దృశ్యం చూచి ఆశ్చర్యంగా, ఇక ఎలుక లభ్యం కాదని తెలుసుకొని వెళ్ళిపోయాయి. ఆ పిదప ఎలుక వలను కొరక సాగింది. పిల్లి తొందరగా కోరకమని ఎలుకను తొందర పెట్టసాగింది.

అప్పుడు ఎలుక 'సోదరా! వలను పూర్తిగా కొరికివేసిన మరుక్షణమే నీవు బయటికి వచ్చి నన్ను తినే ప్రమాదం ఉంది. ఇప్పటికే సగం కొరికాను. ఇంకొక్క ముడి కొరికితే, నీవు సులభంగా బయటికి రావచ్చు. వేటగాడు అంతదూరం నుండి వచ్చేలోపు మిగిలిన ముడిని కొరకగలను. నీవు త్వరగా చెట్టు ఎక్కగలవు. నేను

నా కలుగులోకి దూరగలను. అలాకాకుండా నిన్ను ఇప్పుడే బయటకు పంపితే, నాకు ప్రమాదముంది.' అని చెప్పింది. ఈలోపుగా వేటగాడు భయంకర రూపంలో వస్తున్నాడు. ఎలుక మిగిలిన ముడిని కొరికి కలుగులోకి దూరింది. పిల్లి చటుక్కున వలను త్రెంచుకొని బయటకు వచ్చి చెట్టుపైకి చేరింది.

వేటగాడు ఆశ్చర్యపోయి విచారించాడు. వలను అటూ యిటూ త్రిప్పి, నిరాశతో వెళ్ళిపోయాడు. చెట్టుపైన పిల్లి, కలుగులో వున్న ఎలుకతో ఇలా అన్నది. 'మిత్రమా! నీవల్ల నా ప్రాణాలు దక్కాయి. నిన్ను సన్మానించ దలచాను. చెట్టుపైకి రా.' అనగానే ఎలుక 'సోదరా! నీ స్పందనకు నా జోహార్లు. నీతిశాస్త్రం ప్రకారం సహజ శత్రువులను నమ్మకూడదు.'. పిల్లి 'మిత్రమా! నేను మిత్రద్రోహం చేసేవాణ్ణి కాదు. నీ బంధువులంతా నిన్ను చూడాలని ఆశతో వున్నారు.' అని అన్నది. జవాబుగా ఎలుక 'మిత్రమా! నిన్ను నమ్మినా, నీ బంధువులను ఎలా విశ్వసించేది? ఈ విషయంలో రాక్షసుల గురువు శుక్రాచార్యుడు రెండు విషయాలు చెప్పాడు. మొదటిది ఇద్దరు శత్రువుల పైనా ఒకేమాదిరి ఆపద వచ్చి, దానినుండి ముక్తులైనపుడు ఆ ఇద్దరిలో బలవంతుని నమ్మకూడదు. రెండవది అవిశ్వాసపాత్రునిపై విశ్వాసం వుంచకూడదు. అవసరం తీరేంతవరకు ఓడ మల్లన్న, పిదప బోడి మల్లన్న అవుతాడు. అలాగే అక్కర ఉన్నంతవరకు అక్క, అక్కర తీరాక కుక్క విధం అవుతుంది.' అని చెప్పింది. ధర్మరాజా! దీనిని నీవు బాగా అర్థం చేసుకోమని భీష్ముడు చెప్పాడు.

ధర్మరాజు 'పితామహా! శత్రువును నమ్మరాదనే సిద్ధాంతం చెప్పారు. అలాంటప్పుడు రాజ్యవ్యవస్థ ఎలా నడుస్తుంది?'

భీష్ముడు – 'ఈ విషయంలో బ్రహ్మదత్తునకు మరియు ఒక పక్షికి మధ్య జరిగిన సంభాషణ చెపుతాను. విను.

పూర్వం కాంపిల్య నగరంలో మానవ భాషలో మాట్లాడగల ఒక పక్షి కూడ వుంటూ వుండేది. కొంతకాలానికి ఆ పక్షికి ఒక కుమారుడు జన్మించాడు. అదే రోజు రాణికి కూడ ఒక కుమారుడు జన్మించాడు. ఆ పక్షి ప్రతిరోజు సముద్ర తీరానికి పోయి రెండు పండ్లు తీసికొని వచ్చి, ఒకటి రాకుమారునికి, మరొకటి తన కుమారునికి ఇచ్చి వాటిని పోషిస్తూ వుండేది. ఆ పక్షి తెచ్చే పండ్లు మధురంగానే కాకుండా, తేజస్సును, శక్తిని కలిగించేవి. ఆ పండ్లు రాకుమారుడు తిని తిని బలవంతుడుగా తయారైనాడు.

ఒకరోజు చెలికత్తె ఆ రాకుమారుని ఎత్తుకొని అటూ ఇటూ తిరుగుతోంది. చిన్న బాలుడు కనుక చెలికత్తె ఒడిలోనుండి దిగి, పక్షి పిల్లతో ఆటలాడ సాగాడు. అలా ఒక రోజు ఆట ఆడుతూ, ఆ పక్షిపిల్లను చంపివేశాడు. తరువాత రాకుమారుడు చెలికత్తె చంక ఎక్కాడు. పక్షి ఈ ఘాతుకాన్ని చూచి ఏడ్వసాగింది. క్షత్రియులను నమ్మరాదని తన మనసులో అనుకొంది. శోకం స్థానంలో దానికి కోపం వచ్చింది. దెబ్బకు దెబ్బ కొట్టాలని తలంచి, తన వాడి గోళ్ళతో రాకుమారుని కండ్లు పెరికివేసింది.

అదిచూచిన బ్రహ్మదత్తుడు 'ఓ పక్షీ! రాకుమారుడు చేసిన పనికి దెబ్బకు దెబ్బ కొట్టావు. వంతుకు వంతు తీరిపోయింది. నీవు ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు. ఇక్కడనే వుండు' అని అన్నాడు.

పక్షి 'రాజా! మనిద్దరి మధ్య విరోధం నెలకొంది. అందుచేత మనం పరస్పరం విశ్వసించుకోవడం తగని పని. బాధితులు మీవలె విశ్వసనీయులని నేను అనుకోను. వెంటనే నేను ఇక్కడి నుండి వెళ్ళిపోవాల్సిందే' అన్నది.

అపుడు బ్రహ్మదత్తుడు 'ఓ పక్షీ! అపకారానికి అపకారము చేయడం నేరం కాదు. అందుచేత నీవు సంతోషంగా ఇక్కడే వుండు.' అని అన్నాడు. అందుకు పక్షి 'ఓ రాజా! మాటల ద్వారా అలా అనుకొన్నప్పటికీ, మనసులో నుండి అది చెరిగిపోదు.' బ్రహ్మదత్తుడు మళ్ళీ ఇలా అన్నాడు. 'ఓ పక్షీ! అయినాసరే వారిద్దరి మధ్య స్నేహం కల్పించవచ్చు.' పక్షి 'ఓ రాజా! నేను మిమ్మల్ని నమ్మి ఇక్కడనే ఉన్నట్లయితే, నేను నా ప్రాణాలను పోగొట్టుకునే ప్రమాదం వుంది.' అని చెప్పి ఎగిరి వెళ్ళిపోయింది.

ధర్మరాజు భీష్ముని 'చనిపోయిన వ్యక్తి పునర్జీవితుడగుట మీరు ఎప్పుడైనా చూచారా' అని అడిగాడు. దానికి భీష్ముడు ఇలా చెప్పాడు.

పూర్వం నైమిశారణ్య క్షేత్రంలో ఒక బ్రాహ్మణుడికి అతి కష్టం మీద ఒక బాలుడు జన్మించాడు. అంతలోనే ఆయుష్షు తీరి చనిపోయాడు. అల్పవయస్సులోనే బాలుడు చనిపోయినందుకు ఇంటిలోని వారందరు ఏడ్వసాగారు. బాలుడు ఎంతో ముద్దుగా ఉన్నాకూడ శ్మశానానికి వెళ్ళటం తప్పదు కదా! ఆ బాలుని వదలి మళ్ళీ ఇంట్లోకి వెళ్ళటం కూడ వారికి ఇష్టం లేకపోయింది. ఆ తల్లిదండ్రుల ఏడ్పులు విని అక్కడకు ఒక గద్ద వచ్చి 'మీరు ఇలా ఏడ్చినట్లయితే చనిపోయిన బాలుడు తిరిగి రాడు. పుట్టిన ప్రతి జీవి చావక తప్పదు. సూర్యాస్తమయం కావచ్చింది. శ్మశానం భయంకరంగా ఉంటుంది. కనుక మీరు బాలుడిపై ప్రేమను చంపుకొని ఇంటికి వెళ్ళండి.' అని అనగా, ఆ గ్రద్ద మాటలు వినిన బాలుని బంధువులందరూ ఇంటివైపు వెళ్ళారు. అంతలోనే అక్కడికి ఒక నక్క వచ్చింది. అది బంధువులను ఉద్దేశించి, 'ఓ మానవులారా! మీరెంత దుర్మార్గులు. ఇంత చిన్న బాలుని వదలి ఇంటికి వెళ్ళడం తగిన పనికాదు. పిల్లవాడు ఏ క్షణంలోనైనా ప్రాణంతో లేచే అవకాశం ఉంది.' అన్నది. ఈ మాటలు వినిన బంధువులందరూ మళ్ళీ బాలుని మృతదేహం దగ్గరకు వచ్చారు.

అది చూచి గ్రద్ద – 'ఓ బుద్ధిలేని మానవులారా! నక్క మాటలు నమ్ముతున్నారా? తండ్రి కర్మలతో కుమారునికి, కుమారుని కర్మలలో తండ్రికి ఎలాంటి సంబంధం వుండదు. అందరూ ఎవరి పాపపుణ్యాల బంధంలో వ్యక్తిగతంగా ఉంటారు. చివరకు మృత్యుమార్గంలోకి వెళ్ళక తప్పదు. అందరిని కాలమే శాసించేది. అది అందరిని ఏక సూత్రంతోనే చూస్తుంది. మీరు ఇక ఆలస్యం చేయకుండా, ఇక్కడి నుండి వెళ్ళిపొండి' అని అన్నది. అది వినిన నక్క 'ఓ మానవులారా! మీరు కనీసం ఇక్కడ సూర్యుడు అస్తమించేవరకు ఉండండి లేదా ఈ బాలుని మృత దేహాన్ని తీసుకు వెళ్ళండి' అని అన్నది.

చివరకు భీష్ముడు ధర్మరాజుతో 'ధర్మరాజా! గ్రద్ద మరియు నక్క కూడా తమ తమ వ్యూహాల మేరకు చాకచక్యంగా మాట్లాడుతున్నాయి. ఈలోగా పార్వతి ప్రేరణ చేత అక్కడకు వచ్చిన పరమేశ్వరుడు బాలుని బ్రతికించాడు. అలా కథ సుఖాంతమైంది.'

తరువాత ధర్మరాజు దుష్టులు, శిష్టుల గురించి వివరించమని భీష్ముని అడిగాడు.

భీష్ముడు 'ఈ విషయంలో నీకొక ప్రాచీన చరిత్ర చెపుతాను. విను. అంగరాజ్యంలోని ఒక బ్రాహ్మణుడు వేదాధ్యయనం లేకుండానే, ఒక ధనిక గ్రామానికి వెళ్ళి భిక్షాటన చేయాలని నిర్ణయించుకొన్నాడు. అతడు ఒక ధనిక యజమాని ఇంటికి వెళ్ళి భిక్ష అడిగాడు. ఆ ఇంటి యజమాని చాల దాతృత్వ స్వభావం కలవాడు కావడం చేత – ఈ బ్రాహ్మణునికి ఒక ఇల్లు, ఒక సంవత్సరానికి సరిపోయే ఆహార పదార్థాలు, కొత్త వస్త్రాలు, సేవ చేయుటకు ఒక యువతిని సమకూర్చుదామని తలంచాడు. బ్రాహ్మణుడు ఎంతో సంతోషంగా ఆ యువతితో

సుఖపడుతూ వున్నాడు. ఇంటి యజమాని వేటగాడు కనుక ఈ బ్రాహ్మణునకు కూడ వేటాడటం వచ్చింది. ప్రతిరోజూ బ్రాహ్మణుడు అడవికి వెళ్ళి హంసలను వేటాడసాగాడు. అతని మనస్సు కూడా కఠినంగా తయారయింది. అలా వేటాడడం వల్ల అతడు ఒక దోపిడీదారుగా తయారయ్యాడు. ఇలా కొంతకాలానికి, అతని గ్రామం నుండే మరొక బ్రాహ్మణుడు ఇక్కడికి వచ్చాడు. అతడు పవిత్రుడు, వినయ సంపన్నుడు, నియమాలు పాటించేవాడై వున్నాడు. అంతేకాదు, అతడు వేదాంగ పండితుడు. బ్రహ్మచారి కూడ. ఆ ఊరిలో తనకు ఒక బ్రాహ్మణుని ఇంటికోసం గాలిస్తుంటే, ఈ బ్రాహ్మణునికి ఆ పాత బ్రాహ్మణ వేటగాడి విషయం తెలిసింది. అక్కడికి వెళ్ళాడు.

ఈ బ్రాహ్మణుడు వెళ్ళే సమయానికి, ఆ బ్రాహ్మణ వేటగాడు ఒక చనిపోయిన హంసను భుజాన వేసుకొని, చేతిలో ధనుర్బాణాలతో ఉన్నాడు. రాక్షసాకారంలో కన్పించిన ఆ బ్రాహ్మణ వేటగాడిని చూచి 'అయ్యయ్యో! ఎంత పని చేశావు. బ్రాహ్మణుడవై ఉండి వేటగాడివిగా మారావే! వేదవిద్యా విశారదులైన మీ పూర్వీకుల వంశానికి అప్రతిష్ఠ తెచ్చావు. ఇప్పటికైనా మించి పోలేదు. ఈ దుర్గుణములను వదలివేసి, బ్రాహ్మణోచిత గుణము, శాస్త్రజ్ఞానం, సంయమనము మరియు సద్గుణములు అలవాటు చేసుకొని నాగరికునిగా మారిపో" అన్నాడు.

ఈ మాటలతో బ్రాహ్మణ వేటగాడి మనస్సులో కొంచెం మార్పు వచ్చి, ఇలా అన్నాడు. 'నేను బ్రాహ్మణుడనై కూడ, ధనంకోసం ఇలా మారిపోయాను. ఈరోజు నా ఆతిథ్యం స్వీకరించండి. నేను రేపు ఉదయం ఈ స్థలం వదలి వెళ్ళిపోతాను. కాని ఆ అతిథి దేవుడు ఆ ఇంటిలో ఏ వస్తువు తాకకుండా జాగ్రత్తపడి, తెల్లవారక ముందే వెళ్ళిపోయాడు.బ్రాహ్మణ వేటగాడు కూడ ఉదయమే సముద్ర తీరానికి చేరాడు. వెళ్ళగా వెళ్ళగా ఒక అందమైన వనం కన్పించింది. పుష్పఫలభరితంగా ఉండినందున వనంలా శోభాయమానంగా ఉంది. యక్షులు, కిన్నెరులు కూడ విహరిస్తుంటారు. పక్షుల కిలకిలారావాలు వినసొంపుగా ఉన్నాయి. అతని దృష్టి దాపులో వున్న ఒక మండలాకారంలో అందంగా ఉన్న చెట్టుపై పడింది. ఆ వృక్షము చందన మిశ్రిత జలముతో పరిమళభరితంగా ఉన్నది. అతడు ఆ చెట్టు వద్దకు వెళ్ళి, ప్రశాంతతను పొంది, అచటనే మేను వాల్చాడు. ఆపాటికి సూర్యాస్తమయమై పోయింది.

అదే సమయంలో బ్రహ్మలోకం నుండి ఒక పక్షి తన విశ్రాంత స్థలమైన అదే చెట్టు దగ్గరకు వచ్చింది. దానిపేరు నాధీజంఘుడు. బ్రహ్మకు మిత్రుడు మరియు కశ్యపుని కుమారుడు. భూలోకంలో మాత్రం రాజధర్మ అనే పేరుతో ఖ్యాతికెక్కాడు. కశ్యపునకు, దేవకన్యకు జన్మించడం చేత అతను దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నాడు. చెట్టు దిగువన ఉన్న ఆ బ్రాహ్మణ వేటగాడు ఆ పక్షిని చంపి తినాలని ఆలోచనలో వున్నాడు. ఆ వేటగాడి మనసులోని మాటను కనిపెట్టలేని ఆ రాజధర్మ ఇలా అన్నాడు. 'ఓయీ! నీవు నా ఇంటికి వచ్చావు. కనుక నీవు నా అతిథివి. నిన్ను స్వాగతిస్తున్నాను. సూర్యాస్తమయం అయిపోయింది. కనుక రేపు ఉదయం నా ఆతిథ్యం స్వీకరించి వెళ్ళు. నేను కశ్యప మహర్షి కుమారుడను. నా తల్లి దక్ష ప్రజాపతి కుమార్తె.' అలా అని ఆ పక్షి పూలపాన్పు రూపొందించి కూర్చోపెట్టింది. ఆ తర్వాత చేపలు తెచ్చి, కాల్చి ఇచ్చింది. ఆ బ్రాహ్మణ వేటగాడు పూలపాన్పుపై పడుకోగానే తన రెక్కలు విప్పి గాలి విసిరాడు రాజధర్మ.

కొద్దిసేపు తర్వాత రాజధర్మ ఆ వేటగాని వివరాలు కొన్ని అడిగాడు. అతడు ధన సంపాదన కొరకు బయలుదేరానని చెప్పాడు. రాజధర్మ అతనితో 'ఓయీ! బృహస్పతి చెప్పిన ప్రకారం నాలుగు విధాల ధనం చేకూరుతుంది. ఒకటి వంశపారంపర్యంగాను, రెండవది దైవానుగ్రహంతోను, మూడవది పనిచేయడం వలన, నాలుగవది స్నేహితుని వలన. నేను నీ మిత్రుణ్ణి కనుక నీకు ధనం ఎలా లభిస్తుందో చెప్తాను. విను.

నీవు ఇక్కడినుండి మూడు యోజనాల దూరం వెళ్ళు. అక్కడ నా మిత్రుడైన రాక్షసరాజు మేరుప్రజ నగరాన్ని పాలిస్తున్నాడు. నీ కోరికలన్నీ తీర్చమని అడుగు.' అని చెప్పింది. ఈ సలహా ప్రకారం ఆ బ్రాహ్మణ వేటగాడు మేరుప్రజ నగరానికి బయలుదేరాడు. నగరానికి చేరుకొన్నాడు. రాక్షస రాజు స్వాగతించి, ఆసనంపై కూర్చుండబెట్టి, వివరాలు అడిగాడు. ఆ వేటగాడు అడిగిన కోరికలన్నీ జుగుప్సాకరంగా ఉన్నప్పటికీ, రాజధర్మ స్నేహితుడు కనుక చేరదీశాడు.

ఆరోజు కార్తీక పౌర్ణమి. వేలాది బ్రాహ్మణులు విరూపాక్షుని వద్దకు భోజనానికి వస్తారు. వారితోపాటు, ఈ బ్రాహ్మణ వేటగాడిని కూడ ఆ విరూపాక్షుడు సత్కరిస్తాడని అనుకొన్నాడు. దేశం నలుమూలల నుండి వచ్చిన బ్రాహ్మణులకు దివ్యంగా మృష్టాన్నం వడ్డించి, తృప్తి పరచాడు రాక్షసరాజు. రత్నాలరాసులు పోయించి, తమ తమ శక్తి మేరకు తీసికొని వెళ్ళమని చెప్పాడు. బంగారు పళ్ళేలను కూడ వారికే ఇచ్చేశాడు. ఈ బ్రాహ్మణ వేటగాడు కూడ శక్తికి మించిన ధనాన్ని మోసుకుంటూ, మళ్ళీ అదే చెట్టు దగ్గరకు వచ్చాడు. అలసిపోయిన వేటగాణ్ణి రాజధర్మ చూచి, చేపలు తెచ్చి వంటచేసి ఆకలి తీర్చాడు. విశ్రాంతి తీసికొంటూ ఆ బ్రాహ్మణ వేటగాడు ఇలా ఆలోచించ సాగాడు. 'ఈ రత్నాల మూటతో నేను దూర ప్రయాణం చేయవలసి వుంది. మళ్ళీ ఆకలి అయితే నేను ఏం చేయాలి? ఈ రాజధర్మను చంపి వెంట తీసికొని వెళితే బాగుంటుందన్న నిర్ణయానికి వచ్చాడు. తక్షణమే చెంతనే నిద్రిస్తున్న రాజధర్మను చంపి, అక్కడనే మంటలో కాల్చి, రత్నాల మూటతోపాటు, దానిని వెంట తీసికొని ఇంటి దారి పట్టాడు.

రెండవరోజు రాక్షసరాజు (విరూపాక్షుడు) తన కుమారునితో ఇలా అన్నాడు. 'నాయనా! కుమారా! రాజధర్మ ఎప్పటిలాగ కనిపించడం లేదు. ప్రతిరోజు బ్రహ్మకు నమస్కరించటానికి వెళ్ళి, తిరుగు ప్రయాణంలో నన్ను కలిసి వెళ్ళే రాజధర్మకు ఏమైంది? ఆ బ్రాహ్మణ వేటగాడు విశ్వసనీయుడిగా కనిపించ లేదు. కీడు శంకిస్తోంది. నీవు వెంటనే రాజధర్మను చూచి రా' అని అన్నాడు. తండ్రి ఆజ్ఞ మేరకు అతడు వెళ్ళి జరిగినది గ్రహించి, ఆ బ్రాహ్మణ వేటగాడిని పట్టుకొని, రెక్కలు కట్టి, రాక్షసరాజు దగ్గరకు తెచ్చాడు. రాజధర్మ యొక్క కాలిన శరీరాన్ని చూచి విరూపాక్షుడు భోరుమని విలపించాడు. ఆ తర్వాత తేరుకొని, ఆ బ్రాహ్మణ వేటగిణ్ణి చంపమని ఆజ్ఞాపించాడు. రాక్షసులందరు అతని శరీరాన్ని తినమని ఆదేశించాడు. కాని వారు నిరాకరించారు. కనుక శరీరానికి అంత్యక్రియలు చేయటానికి నిర్ణయించాడు. అదే సమయంలో దక్ష కన్యయైన సురభి దేవి ఆకాశంలోనుండి చూడసాగింది. ఆమె ముఖము నుండి పాలనురుగు రాజధర్మ మృతదేహంపై పడి, రాజధర్మ పునర్జీవించాడు. ప్రాణం రాగానే రాజధర్మ విరూపాక్షుని దగ్గరకు ఎగిరి వెళ్ళి విరూపాక్షుని చూచి కౌగలించుకున్నాడు. ఇంద్రుడు కూడ అక్కడికి వచ్చి, వారిని అభినందించాడు. రాజధర్మ ఇంద్రుని కోరి, బ్రాహ్మణ వేటగాణ్ణి బ్రతకింపచేశాడు. ఈ కథను నారదుడు భీష్మునికి చెప్పాడని ధర్మరాజుతో అన్నాడు.

మనం ఇప్పుడు జపము మరియు జపం యొక్క మహిమను గురించి తెలుసుకొందాం.

పై విషయాన్ని గురించి ధర్మరాజు పితామహుని అడుగుతాడు. అందుకు భీష్ముడు ఇలా చెప్పాడు. 'ఈ విషయం గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే ప్రాచీనమైనది, సంవాద రూపంలో దీన్ని ఒక ఉదాహరణను గురించి చెప్తాను. విను.

పూర్వం హిమాలయ ప్రాంతంలో ఒక యశస్వి మరియు ధర్మాత్ముడైన బ్రాహ్మణుడు ఉన్నాడు. అతడు

కౌశిక వంశంలో జన్మించిన పిప్పలాదుని కుమారుడు. వేదవేదాంగాలను అభ్యసించినవాడు. అటువంటి ఈ బ్రాహ్మణుడు గాయత్రి మంత్రం జపిస్తూ తపస్సులో లీనమైపోయాడు. అలాగ వేయి సంవత్సరాలు తపస్సు చేశాడు.

సావిత్రీ దేవి ప్రసన్నురాలై కోరిక ఏమిటి అని అడిగింది. ఆ బ్రాహ్మణుడు తన కోరికను ఇలా వెల్లడించాడు. 'దేవీ! ఈ మంత్రజపంలో ఉన్న నా ఏకాగ్రత ఇంకా బలీయంగా ఉండునట్లు వరమియ్యి' అని అడగగానే వరమిచ్చి, నీకు బ్రహ్మధామం ప్రాప్తించునని చెప్పింది. ధర్మము నీ దగ్గరకే స్వయంగా వస్తుంది. ఆ తరువాత కాలము, మృత్యువు మరియు యముడు కూడ వస్తారు. ధర్మము గురించి మీ మధ్య సంవాదం జరుగుతుంది' అలా చెప్పిన సావిత్రీ దేవి, తన ధామానికి వెళ్ళిపోయింది. సత్యము తోడైన ఆ బ్రాహ్మణునికి ధర్మము ప్రత్యక్షమై, 'ఓ బ్రాహ్మణుడా! నావైపు చూడు. నీ దర్శనం కోసం వచ్చాను. నీ తపోబలంతో నీవు దేవలోకం, పైలోకాలకు కూడ వెళ్ళగల సమర్థుడవైనావు. ఇక నీ శరీరాన్ని వదలి, నీవు కోరుకొనే లోకానికి వెళ్ళిపో' అనగా బ్రాహ్మణుడు 'ఓ ధర్మమా! నేను శరీరమును విడిచి స్వర్గంలో ఉండటానికి ఇష్టపడను. గాయత్రి మంత్రం జపిస్తూ, ఆనందంగా ఇక్కడే ఉంటాను.' అనగా ధర్మము 'విప్రవర్యా! నీవు ఈ శరీరము విడువనన్నచో, అదిగో చూడు. కాలము, మృత్యువు మరియు యముడు వస్తున్నారు. వారు నిన్ను తప్పక వారితో తీసుకొని వెళతారు' అని అదృశ్యమైంది. ఆ తర్వాత ఆ ముగ్గురూ బ్రాహ్మణుని వద్దకు వచ్చారు. అందులో మొదట యముడు ఇలా అన్నాడు. 'ఓ ద్విజవర్యా! నేను యమున్ని. నీ కఠోర తపస్సుకు ఫలము ప్రాప్తించింది.' తర్వాత కాలము 'నీ జపము యొక్క ఉత్తమ ఫలితం వచ్చింది. స్వర్గానికి వెళ్ళే సమయం వచ్చింది.' అన్నది. చివరగా మృత్యువు 'ఓ ధర్మజ్ఞా! నేను మృత్యువును. కాలము యొక్క ప్రేరణచే నేను నిన్ను తీసికొని పోవటానికి వచ్చాను.' అని చెప్పారు. వీరి మాటలు వినిన బ్రాహ్మణుడు ఇలా అన్నాడు. 'సూర్యపుత్రుడవైన ఓ యమధర్మరాజా! మహాత్ముడవైన కాలుడా, మృత్యువా మరియు ధర్మమా! మీకు స్వాగతం చెపుతున్నాను. మీకు ఏ సేవలు కావాలో ఆజ్ఞాపించండి.' అని అన్నాడు. ఈలోపుగా తీర్థయాత్రలకు బయలుదేరిన ఇక్ష్వాకుడను రాజు అక్కడకు వచ్చాడు. రాజర్షియైన ఇక్ష్వాకురాజు అందరికీ నమస్కరించి, ప్రతినమస్కారం అందుకొన్నాడు. బ్రాహ్మణుడు ఇక్ష్వాకుని పూజించి, ఏమి కావాలో కోరుకోండి అని అన్నాడు. రాజు ఇలా అన్నాడు. 'నేను రాజును కాబట్టి, మీరెంత ధనం కోరుకొన్నా, నేను ఇస్తాను.' అని అన్నాడు. అపుడు బ్రాహ్మణుడు 'ఓ రాజా! బ్రాహ్మణులు రెండు విధాలుగా ఉంటారు. కొందరు ప్రవృత్తిమార్గంలో మరికొందరు నివృత్తి మార్గంలో ఉంటారు. మొదటి మార్గంలోని వారు దానం స్వీకరిస్తారు. నేను నా తపోబలంచే మీ కార్యాన్ని సఫలీకృతం చేయగలుగుతాను. ఏమికావాలో కోరుకోండి.' అన్నాడు. అపుడు రాజు ఇలా అన్నాడు. 'మీ వంద సంవత్సరముల తపోఫలాన్ని నాకు ఇవ్వండి' అనగా బ్రాహ్మణుడు 'ఏవమస్తు' అంటూ జపము యొక్క ఉత్తమ ఫలమును స్వీకరించండి' అని అన్నాడు. అపుడు రాజు 'నేనడిగిన జపము యొక్క ఫలం నాకు అవసరం లేదు. కాని ఆ జపము యొక్క ఫలితమేమిటో చెప్పండి చాలు' అని అనగా, బ్రాహ్మణుడు 'అదేమిటో నాకు తెలియదు కాని నా తపోఫలం మీకు ఇచ్చాను. ఇదిగో ఇచ్చట దేవతలు సాక్షిగా వున్నారు.' అని అన్నాడు. అపుడు రాజు ఇలా అన్నాడు. 'ఓ బ్రాహ్మణుడా! ఆ అజ్ఞాత తపోఫలం నాకు ఎలా పనికి వస్తుంది? ఆ సందిగ్ధ ఫలం నాకు వద్దు. నీవే ఉంచుకో' అని అన్నాడు. అపుడు బ్రాహ్మణుడు 'ఓ రాజా! ఆ జప ఫలం మీకు ఇచ్చి ఉన్నాను. ఇపుడు రెండవ మాట కుదరదు. మనం మన మాటలకు కట్టుబడి ఉండాలి.' అనగా రాజు ఇలా అన్నాడు. 'ఓ బ్రాహ్మణుడా! క్షత్రియులను దాతలు అని అంటారు. ఆ దశలో నేను నీ ఫలము ఎలా స్వీకరించగలను?' అనగా, బ్రాహ్మణుడు 'ఓ రాజా! నేను దానము ఇచ్చుటకు మీ ఇంటికి రాలేదు. స్వయంగా

మీరే వచ్చి అడిగారు. ఇప్పుడు ఎలా తిరస్కరించ గలరు?' అన్నాడు. అపుడు రాజు 'ఓ విప్రవర్యా! మీ జప ఫలమును ఇచ్చుటకు నిశ్చయించుకొన్నచో, నా పుణ్యఫలం కూడా కలిపి, ఇద్దరమూ సమముగా అనుభవిద్దాం' అన్నాడు.

తరువాత ఇద్దరూ మహా సంకల్పస్థితులై, సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. మొదటి బ్రాహ్మణుని బ్రహ్మరంధ్రం నుండి ఒక తేజస్సు వెలువడి స్వర్గం చేరుకొంది. బ్రహ్మ స్వయంగా ఎదురేగి తనలో ఐక్యం చేసుకొన్నాడు. తరువాత ఇక్ష్వాకుని తేజస్సు కూడ బ్రహ్మలో లీనమైంది.

దీనివల్ల మనకు స్పష్టంగా తెలియవచ్చే దేమంటే – యోగులకంటే జపం చేసినవారు శ్రేష్ఠులుగా పరిగణింప బడతారు అని. శ్రీమహావిష్ణువే అవినాశియై కూడ, వరాహావతారం ఎందుకు ఎత్తవలసి వచ్చిందని ధర్మరాజు, భీష్ముని అడుగుతాడు. అదేమిటో తెలుసుకుందామా!

భీష్ముడు – 'ధర్మరాజా! నేనొకసారి వేటాడుతూ, మార్కండేయ మహర్షి ఆశ్రమానికి వెళ్ళాను. నన్ను స్వాగతించారు. నేను వారిని అభినందించాను. అక్కడు ఉన్న కశ్యపమహర్షి ఒక ఉదంతం చెప్పాడు. అదేమిటంటే – పూర్వ కాలంలో నరకాసురుడు మొదలైన వేలాదిమంది రాక్షసులు క్రోధం, మదం, లోభంతో గర్విస్తూ చెలరేగి పోయారు. వారి వెంటనున్న రాక్షస సైన్యం యుద్ధం కోసం ఉవ్విళ్ళూరుతోంది. దేవతలు, దేవర్షులు దాక్కోవడం మొదలు పెట్టారు. వీరి బరువుతో, భయంకర ఆకృతుల బరువుతో భూమి వ్యాకులపడి, బ్రహ్మతో మొరపెట్టుకొంది.

బ్రహ్మ ఇలా అన్నాడు. 'ఈ ప్రమాదం నుండి బయటపడటానికి నేను ముందే ఒక ఉపాయం ఆలోచించి పెట్టాను. ఈ సమయంలో రాక్షసులు వరాలు పొంది రెచ్చిపోతున్నారు. అవ్యక్తుడైన విష్ణువు మాత్రం భయపడటం లేదు. విష్ణువు వరాహావతారం ధరించి ఉన్నాడు. ఈ భూమి క్రింద వేల సంఖ్యలో రాక్షసులు గుమిగూడి ఉన్నారు. కనుక విష్ణువు వరాహావతారంలో అక్కడికి వెళ్ళి, వాళ్ళను చంపుతాడు. ఈ విషయం విని అందరూ సంతోషించారు. మహా తేజశ్శాలి శ్రీమహావిష్ణువు వరాహావతారంలో భూమి క్రిందకు వెళ్ళి, రాక్షసులను భయభ్రాంతులను చేయుటకు భయంకరమైన శబ్దం చేయసాగాడు. ఆ గంభీర ధ్వనికి, గర్జనలకు లోకాలు ప్రతిధ్వనించాయి. ఇంద్రాది దేవతలు కూడ భయపడ్డారు. ఆ గర్జనలతో రాక్షసులు కూడ స్పృహ కోల్పోసాగారు. శ్రీమహావిష్ణువు తన వికృతావతారంతో రాక్షసులను నానా విధాలుగా హింసిస్తూ వారిని చంపివేశాడు. దేవతలు కూడ బ్రహ్మ వద్దకు వెళ్ళి, ఆ భయంకర శబ్దాన్ని గురించి చెప్పారు ఈలోగా విష్ణువు భూమి క్రింద నుండి పైకి వచ్చాడు. ఋషులు ఆ స్వామిని స్తుతించ సాగారు.

బ్రహ్మ ఇలా అన్నాడు. 'ఓ దేవతలారా! రాక్షసుల నందరిని సంహరించిన శ్రీమహావిష్ణువే ఈ చరాచర ప్రపంచం యొక్క రచయిత, పాలకుడు మరియు సంహారకర్తయై కూడ ఉన్నాడు. లోకాల్ని కాపాడటం కోసం ఈ మహాశబ్దం చేశాడు.'అని వారితో అన్నాడు. ఇలా శ్రీమహావిష్ణువు గురించిన వృత్తాంతాన్ని వినిపించిన భీష్మునితో ధర్మరాజు 'పితామహా! ధర్మము కంటె శీలమును ఎక్కువగా ప్రశంసిస్తుంటారు కదా! దాని లక్షణాలు ఏమిటో తెలియజెప్తారా?'

భీష్ముడు – 'ధర్మరాజా! నీవు ఇంద్రప్రస్థంలో రాజసూయ యాగం చేసినపుడు, దుర్యోధనుడు ఈర్ష్యపడి తండ్రికి చెప్పి బాధపడ్డాడు. అపుడు ధృతరాష్ట్రుడు కుమారునితో 'కుమారా! నీవు కూడ గొప్ప రాజ్యలక్ష్మిని పొందాలంటే, మొదట నీవు శీలవంతుడవు కావాలి. శీలమనే గుణమే కాకుండా స్వభావం కూడ గొప్పదీ,

ఉత్తమమైనదిగా ఉండాలి. శీలం ఎలా ప్రాప్తిస్తుందని దుర్యోధనుడు తండ్రిని అడుగగా, ధృతరాష్ట్రుడు ఇలా చెప్పాడు. 'ప్రాచీన కాలంలోని ఒక కథను చెప్తాను విను. శీలం గురించిన ప్రసంగం వచ్చినపుడు నాకు నారదుడు చెప్పాడు.

ప్రాచీన కాలంలో దైత్యరాజు అయిన ప్రహ్లాదుడు తన శీలము చేత ఇంద్రపదవిని తీసికొని, ముల్లోకాలను తన అధీనంలో ఉంచుకొన్నాడు. ఆ సమయంలో ఇంద్రుడు, బృహస్పతి దగ్గరకు వెళ్ళి ధనప్రాప్తికి ఉపాయం చెప్పమన్నాడు. ఈ విషయంలో విశేషమైన జ్ఞాన ప్రాప్తి కొరకు శుక్రాచార్యుని వద్దకు వెళ్ళుటకుగాను అనుమతి ఇచ్చాడు. ధనప్రాప్తి, ఐశ్వర్యప్రాప్తి అనగా శ్రేయప్రాప్తులను అర్థం వస్తుంది. శ్రేయమనగా మంగళకరమైన లేక పుణ్యకరమైన లేక కీర్తికరమైన అనే అర్థం వస్తుంది. ఇంద్రుడు శుక్రాచార్యుని వద్దకు వచ్చి అదే విషయాన్ని అడిగాడు. 'ఓ ఇంద్రా! ఈ విషయంలో ప్రహ్లాదునకు విశేషమైన జ్ఞానం ఉంద'ని శుక్రాచార్యుడు చెప్పాడు.

ఇంద్రుడు బ్రాహ్మణ వేషం ధరించి ప్రహ్లాదుని దగ్గరకు వెళ్ళి 'రాజా! నాకు యశస్సును. ప్రాప్తించుకొనే ఉపాయం చెప్పి, పుణ్యం కట్టుకోండి' అని అన్నాడు. ప్రహ్లాదుడు 'విప్రవర్యా! ముల్లోకాల్ని పరిపాలించే బాధ్యతతో నేను తలమునకలుగా వున్నాను. కనుక నీకోసం సమయం వెచ్చించలేను.' అన్నాడు.

బ్రాహ్మణ వేషధారియైన ఇంద్రుడు 'రాజా! మీకు సమయం దొరికినపుడే, నాకు ఉపదేశించండి' అని అన్నాడు. బ్రాహ్మణుని తపన, నిష్ఠ గుర్తెరిగిన ప్రహ్లాదుడు ప్రసన్నుడై జ్ఞానం యొక్క తత్త్వాన్ని వివరించేటపుడు, సమయం దొరికినప్పుడల్లా ఒక ప్రశ్న మళ్ళీ మళ్ళీ అడుగుతున్నాడు. ఆ ప్రశ్న – 'త్రిభువనాల మీద సామ్రాజ్యం మీకెలా దక్కింది?' అని.

ప్రహ్లాదుడు చివరకు ఇలా చెప్పాడు. 'విప్రవర్యా! నేను రాజును అయినను సద్గుణులను ఎప్పుడూ నిందించను. వారు నాకు శుక్రనీతిని బోధిస్తారు. అన్నివేళలా వారి ఆజ్ఞలను శిరసావహిస్తుంటాను. శుక్రాచార్యుని నీతిని అనుసరిస్తాను. ఇతరుల దోషములను ఎన్నను. ధర్మంపట్ల ఏకాగ్రచిత్తంతో ఉంటాను. కోపమును జయించి, ఇంద్రియనిగ్రహంలో ఉంటాను. చంద్రుడు ఎలా నక్షత్రాలను శాసిస్తుంటాడో, అలాగే నేను పరిపాలన సాగిస్తుంటాను. శుక్రాచార్యుల నీతి శాస్త్రమే ఈ భూమండలంలోనికి అమృతభాండమై ఉన్నది. అదియే యశస్సు ప్రాప్తించుకొనుటకు ఉత్తమ ఉపాయంగా వున్నది.' ఇలా ప్రహ్లాదుని ద్వారా ఉపదేశం పొంది కూడ బ్రాహ్మణుడు అక్కడినుంచి కదలకుండా, నిరతంరత ప్రహ్లాదుని సేవలు చేస్తూ ఉన్నాడు. ప్రహ్లాదుడు ప్రసన్నుడై 'విప్రవర్యా! నీ నడవడికతో నాకు సంతోషం కల్గింది. కనుక నీకు వరం ఇవ్వాలనుకొంటున్నాను. నీవు కోరుకున్న వరాన్నిచ్చి పరిపూర్ణం చేస్తాను.' అన్నాడు. అపుడు బ్రాహ్మణ వేషధారియైన ఇంద్రుడు 'మహారాజా! మీరు ప్రసన్నులై నాకు ప్రియము చేయుటకంటే నాకు మీ యశస్సును గ్రహించాలని ఉంది. ఈ వరమే నాకివ్వండి.'

ఇలాంటి వరం కోరుకోవడం ప్రహ్లాదుని ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రహ్లాదుడు ఇలా ఆలోచించాడు. 'ఇతడు సామాన్యమైన మానవుడు కాదు.' అనుకొని 'తథాస్తు' అని వరమిచ్చాడు. వరం ప్రాప్తించుకొనిన బ్రాహ్మణ వేషధారియైన ఇంద్రుడు వెళ్ళిపోయాడు. కాని ప్రహ్లాదుని మనస్సు చిన్నబోయింది. అదే సమయంలో ప్రహ్లాదుని శరీరము నుండి ఒక తేజోపుంజం బయటకు వచ్చింది. ఎవరు నీవు అని ప్రహ్లాదుడు అడిగాడు. 'నేను శీలమును (యశస్సును) అని తేజోపుంజం చెప్పింది. ఇంకను 'ఓ ప్రహ్లాదా! నీవు నన్ను వదలివేశావు. ఇంతకాలం నేను నీకు సేవ చేస్తూ ఉన్నాను. ప్రస్తుతం నేను వెళ్ళి ఇంద్రుని శరీరంలో ప్రవేశించవలసి వున్నది' అని అదృశ్యమైంది.

ఆ తరువాత ఇంద్రుని శరీరంలో ప్రవేశించింది.

మరొక తేజోపుంజం బయటకు వచ్చింది. 'నేను ధర్మాన్ని, శీలమును అనుసరిస్తున్నాను.' అని చెప్పింది. తరువాత మరొక తేజోపుంజం బయటకు వచ్చి 'నేను సత్యమును. నేను ధర్మమును అనుసరిస్తున్నాను.' అని అన్నది. తరువాత మరొక తేజోపుంజం బయటకు వచ్చి 'నేను సదాచారాన్ని, నేను సత్యమును అనుసరిస్తున్నాను' అని చెప్పింది. పిమ్మట మరో తేజోపుంజం బయటకు వచ్చి 'నేను బలమును. నేను సదాచారాన్ని అనుసరిస్తున్నాను.' అని అన్నది. ఆ తరువాత ప్రహ్లాదుని నుండి ఒక తేజోమయమైన దేవి ఉద్భవించింది. 'నేను లక్ష్మిని. నేను బలమును అనుసరిస్తూ ఉంటాను.' అని అన్నది. ప్రహ్లాదుడు ఆశ్చర్యపడి 'ఓ దేవీ! ఆ శ్రేష్ఠుడైన బ్రాహ్మణుడు ఎవరు? దయచేసి నాకు ఆ రహస్యం చెప్పండి.' అన్నాడు.

దేవి ఇలా చెప్పింది. 'నీవు ఎవరికైతే ఉపదేశం చేశావో, ఆ బ్రాహ్మణుడు సాక్షాత్తూ ఇంద్రుడు. ముల్లోకాల్లో ఆధిపత్యం చెలాయించడానికి ఇంద్రుడు నీ శీలమును అపహరించాడు. ధర్మము, సత్యము, సదాచారము, బలము మరియు ధనం శీలమును అంటిపెట్టుకొని ఉంటాయి.' ఇలా చెప్పి లక్ష్మి కూడ అదృశ్యమైంది.' అని దుర్యోధనునితో ధృతరాష్ట్రుడు అన్నాడు.

ఈ విషయమంతా నారదుడు ధృతరాష్ట్రునికి చెప్పగా, ధృతరాష్ట్రుడు దుర్యోధనునికి చెప్పాడు. ఆకళింపు చేసుకొన్న భీష్మ పితామహుడు ధర్మరాజుకు చెప్పాడు.

ధర్మరాజు – పితామహా! రాజ్యం కోల్పోయినా, సుఖంగా ఉండుటకు ఉపాయమేది?

భీష్ముడు – ధర్మనందనా! నీవడిగిన విషయం నీకు తెలియాలంటే, నీవు ఇంద్రునికి మరియు బలి చక్రవర్తికి మధ్య జరిగిన సంవాదాన్ని వినాలి. నేను చెప్తాను. విను.

పూర్వం దేవాసుర సంగ్రామంలో రాక్షసుల మరియు దేవతల సంహారం విపరీతంగా జరిగింది. వామనావతారంలో శ్రీమహావిష్ణువు ముల్లోకాలను ఆశ్రయించి అధికారం సొంతం చేసుకున్నాడు. వంద యజ్ఞాలు చేసిన ఇంద్రుడు దేవతలకు రాజుగా ఉన్నాడు. దేవతలకు బాగా పూజలు జరుగుతూ ఉండేవి. త్రిభువనముల అభ్యుదయం జరిగింది. అందరూ సుఖంగా ఉండటం చూచి, బ్రహ్మ సంతోషించాడు. అదే సమయంలో ఒకసారి ఇంద్రుడు తన గజరాజు ఐరావతాన్ని ఎక్కి ముల్లోకాలు తిరిగి రావడానికి బయలుదేరాడు. ఇంద్రునితోపాటు అశ్వనీ కుమారులు, వసువులు, ఆదిత్యుడు, ఋషిగణం, గంధర్వులు, నాగులు, సిద్ధులు మరియు విద్యాధరులు మున్నగువారు ఉన్నారు. పర్యటన చేస్తూ, సముద్ర తీరానికి వచ్చారు వారందరు. అక్కడ ఒక పర్వత గుహిలో బలిచక్రవర్తి ఉన్నాడు. బలిపై దృష్టిపడగానే ఇంద్రుడు చేతిలోకి వజ్రాయుధం తీసుకొని బలి దగ్గరకు వచ్చాడు.

ఎంతో అట్టహాసంగా ఇంద్రుడు ఐరావతాన్ని ఎక్కి దేవతల మధ్య ఉన్నా కూడ బలి ఏమాత్రం బాధపడ లేదు. అతడు నిర్భయంగా లేచి నిల్చున్నాడు. ఆ సమయంలో ఇంద్రుడు ఇలా అన్నాడు. 'ఓయీ బలీ! నీ శత్రువు యొక్క అభివృద్ధిని చూచి నీవు బాధపడటం లేదు. దానికి కారణ మేమిటి? పరాక్రమవంతుడవై వృద్ధపురుషులకు సేవచేయుట చేతనా లేక తపస్సు చేత అంతఃకరణము శుద్ధి యైనందుననా, నీకు శోకము కల్గుట లేదు. నీవు స్వర్గము నుండి భ్రష్టుడవై వుండికూడ నీకు శోకము లేదు. పూర్వం తాతముత్తాతల సింహాసనంపై కూర్చొని మహారాజు అనిపించుకొన్నావు. నీ రాజ్యం శత్రువులు కాజేసినా, నీవు శోకించడం లేదు. త్రిభువనములను

కోల్పోయి, నీవలె బ్రతుకవలెననుకొనే వారెవరైనా ఉంటారా?' ఇలా అనేకమైన కటు వచనములు ఇంద్రుడు పలుకగా, బలి ఇలా అన్నాడు. 'ఓ ఇంద్రా! నేను ఇక్కడ కాలానికి బాధ్యుడనై ఉన్నాను. నాముందు నీ వీరాలాపనలు తగవు. పూర్వం నీవు నాముందు నిలబడలేని స్థితిలో ఉండినావు. ఇపుడేమో పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నావు. నీలాగా మరెవ్వరు ఇలా వ్యర్థపు మాటలు పలుకలేరు. నీ బలపరాక్రమాలతోనే జయించానని భ్రమపడవద్దు. ఇపుడు నీ దశ ఉన్నతంగా ఉంది. నా స్థితి విపరీతంగా ఉంది. దానికి కారణం మన ప్రయత్నం కాదు. అందుచేత నీవు నన్ను అవమానించకు. సమయానుకూలంగా జీవులకు కష్టసుఖాలు ప్రాప్తిస్తాయి. కాలమనునది మాత్రమే నిన్ను సింహాసనంపై కూర్చుండబెట్టింది. రేపటి రోజు ఆ ఉన్నత స్థితి నాకు ప్రాప్తించవచ్చు. సమయం మనది కానపుడు విద్య, తపం, దానం, మిత్రులు, బంధువులు ఎవరూ కూడ రక్షించలేరు. ఓయీ ఇంద్రా! నీ ఈ ఉన్నత స్థితికి నీవే కర్తవనుకొంటే, అది నీ దుఃఖానికి కారణమవుతుంది. సర్వాంతర్యామియే లోకైక కర్త అని తెలుసుకో.

ఓయీ ఇంద్రా! నీకు సంస్కారం లోపించినందున, జరగబోవు నష్టాన్ని ఊహించుకోలేక పోతున్నావు. నావలెనే నీవు కూడ రాన్ను కాలంలో కాలమునకు కట్టుబడి ఉండక తప్పదు. ఈ నీ సంగతిని ఇంతకు ముందు ఎందరో నిర్వహించారు, మాయమై పోయారు. ఇది నీకు శాశ్వతం కాదు. నేనేమిటో నీకు తెలుసు, నీవేమిటో నాకు తెలుసు. నేను రాజుగా ఉండి, పురుషార్థం నిర్వహించినపుడు, నీవు చూచావు. అనేకర యుద్ధాల్లో నా పరాక్రమాన్ని చవిచూచావు. ఇప్పుడు కూడ నీచేతిలో వజ్రాయుధం వున్నా కూడ నేను నా ఒక్క పిడిగుద్దుతో నిన్ను మట్టికరిపించ గలను. కాని ఇది సమయం కాదు. ఇలాంటి సమయాల్లో క్షమించుటయే నేనెరుగుదును.

ఓయీ ఇంద్రా! మనిషి పశువును బంధించి కట్టడి చేసినట్లు, భయంకరమైన కాలం నన్ను బంధించింది. మానవునకు కష్టసుఖాలు, జననమరణాలు, కామక్రోధాలు, లాభనష్టాలు అన్నీ కాలం వల్లనే ప్రాప్తిస్తాయి. ఎవరైతే కాల ప్రభావాన్ని తెలుసుకుంటారో, వారిని కష్టనష్టములు చుట్టుముట్టినను వారు శోకించరు. శోకించడం వల్ల ఆపద దూరం కాదు.'

బలియొక్క ఈ కథనం విన్న పిదప, ఇంద్రుని కోపం చల్లారి, శాంతంగా ఇలా అన్నాడు. 'ఓ దైత్యరాజా! నా చేతిలో వజ్రాయుధాన్ని చూచి, మృత్యువు కూడ భయపడుతుంది. అలాంటిది, మీరు ధైర్యంగా ఉండగలిగారు. మీరు చెప్పినట్లు కాలమునకు వేరే పరిహారం కాని ప్రత్యామ్నాయం కాని లేదు. కాలాన్ని ఎవరూ ఉల్లంఘించలేరు. ఎదగటమంటే క్రిందికి జారుటయే. జన్మిస్తే, మృత్యువు తప్పదు. నేను మీలాంటి జ్ఞానిని కాను. మిమ్మల్ని బంధనములో పెట్టి హింసించ దలచలేదు. నా వల్ల మీకు ఎలాంటి నష్టం జరగదు. మీరు నిశ్చింతగా, ఆరోగ్యంగా, సుఖజీవితం గడపండి.' అలా చెప్పిన ఇంద్రుడు గజరాజైన ఐరావతంపై కూర్చొని, తన పరివారంతో సహా వెళ్ళిపోయాడు.

మానవులు ప్రగతి మరియు పతనము ఎలా జరుగుతుందని ధర్మరాజు భీష్ముని అడుగుతున్నాడు.

భీష్ముడు – 'ధర్మరాజా! ఎవరి ప్రగతి, పతనం ఏదైనా కాని మనస్సును బట్టి తెలుసుకోవచ్చు. ఈ విషయం స్పష్టం కావాలంటే నీవు ఇంద్రుని మరియు లక్ష్మీదేవి మధ్య జరిగిన సంవాదాన్ని తెలుసుకోవాలి. చెప్తాను. విను.

ఒకానొక సమయంలో నారద మహర్షి పవిత్ర గంగానదిలో స్నానం చేయటానికి వచ్చాడు. ఉదయమే వెళ్ళి నదిలోనికి ప్రవేశించాడు. ఆ సమయంలోనే ఇంద్రుడు కూడ వచ్చాడు. ఇద్దరూ స్నానమాచరించి, పరస్పరం

అభివాదం చేసుకొని, గాయత్రి మంత్ర పఠన చేశారు. ఆ తర్వాత గంగాతీరంలో కూర్చొని, పూర్వం ఋషులు చెప్పుకొన్న ఉదంతాలను పరస్పరం చెప్పుకుంటూ ఉన్నారు. ఈలోగా సూర్యోదయం కాగా ఇద్దరూ లేచి భక్తితో సూర్య నమస్కారాలు చేశారు. అదే సమయంలో వారిద్దరికి ఆకాశంలో ఒక దివ్య జ్యోతి కనిపించింది. అది క్రమక్రమంగా వారిని సమీపిస్తున్నట్లు తోచింది.

ఆ వస్తోంది విమానము. దాని కాంతిపుంజంలో ముల్లోకాలు శోభాయమానంగా వెలుగొందుతూ వున్నాయి. ఆ విమానంలో సాక్షాత్తూ లక్ష్మీదేవి కూర్చున్నట్లు వారిద్దరూ గమనించారు. ఆ దేవి కమల పుష్పము మధ్యలో కూర్చొని వన్నది. సర్వలోకాల్లోని సుందర స్త్రీలలో శ్రేష్ఠమైన లక్ష్మీదేవి విమానం దిగి వీరిద్దరి దగ్గరకు వచ్చింది. ఇంద్రుడు నారదుడు ఎదురేగి నమస్కరించారు. ఆ తర్వాత తమను తాము పరిచయం చేసుకొని పూజాదికాలు నిర్వహించి ఇలా అడిగారు. 'దేవీ! నీవెవరు? ఎక్కడి నుండి వస్తున్నావు? ఎక్కడికి వెళుతున్నావు.' అందుకు లక్ష్మీదేవి ఇలా అంది. 'ఓ ఇంద్రా! ముల్లోకాల్లోని చరాచర ప్రాణులు నా రూపమును సంతరించుకొని పరమాత్మలో లీనమగుటకు ప్రయత్నం చేస్తూ వుంటారు. ఈ దివ్య ప్రాణులకు ఐశ్వర్యమును ప్రసాదించటానికి, నేను సూర్య కిరణముల చేత వికసితమయ్యే కమలంలో ప్రకటితమైనాను. ప్రజలు నన్ను పద్మ అని, శ్రీ అని, పద్మమాలిని అని ఇలా వివిధ నామాలతో పిలుస్తారు. నేనే లక్ష్మిని, శ్రద్ధను, మేధను, విజితిని, స్థితిని, ధృతిని, సిద్ధిని, సమృద్ధిని, స్వాహాను, స్వధను, నియతిని, మరియు స్మృతినియై వున్నాను. ధర్మశీలురైనవారు దేశాల్లో, నగరాల్లో మరియు ఇళ్ళలో నివాసముంటాను. నేను ధర్మమునకు, సత్యమునకు కట్టుబడి మొదట్లో నేను రాక్షసులకు బాసటగా ఉన్నాను. కాని వారిప్పుడు ధర్మవిరుద్ధంగా వున్నారు. కనుక దేవతల వద్ద ఉండాలనుకుంటున్నాను.' అని అన్నది.

అపుడు ఇంద్రుడు 'దేవీ! మొదట రాక్షసుల వ్యవహారం ఎలా ఉండేది? వారిని వదలి దేవతల వద్దకు రావలసిన అవసరం ఎందుకు వచ్చింది?' అని అడిగాడు. అపుడు లక్ష్మీదేవి ఇలా చెప్పింది. 'ఎవరైతే ధర్మాన్ని ఆచరిస్తారో, ధైర్యాన్ని కలిగియుంటారో, అలాంటివారిని నేను అంటిపెట్టుకొని వుంటాను. మొదట్లో రాక్షసులు కూడ దానము, యజ్ఞము, అధ్యయనాల్లో నిమగ్నులై ఉండేవారు. దేవతల, పితరుల, గురువుల మరియు అతిథుల పూజలు చేస్తుండేవారు. వారు సర్వ కాలములందును సత్యమే పలికేవారు, శ్రద్ధ గలవారు, కోపముండేది కాదు. ఈరకమైన ఉత్తమ గుణములు గల రాక్షసుల వద్ద నేను సృష్టి కాలం నుండి ఇప్పటివరకు అనేక యుగముల నుండి ఉంటూ వచ్చాను.

కాలక్రమంలో వాళ్ళలో మార్పులు వచ్చాయి. ధర్మం లోపించి, కామక్రోధాలకు వశులైపోయారు. ఆ కారణంగా నేను దేవతల వద్ద నివసించాలనుకొంటున్నాను.

ఈ మాటలు వినిన దేవేంద్రుడు మరియు నారదుడు లక్ష్మీదేవిని అభినందించారు. చివరకు భీష్ముడు ధర్మరాజుకు ప్రగతి మరియు పతనం గురించి సమగ్రంగా బోధ చేశాడు.

ధర్మరాజు – 'పితామహా! యుగాన్ని అనుసరించి ధర్మంలో మార్పు వస్తుందా? సత్పురుషులు, శాస్త్రవేత్తలూ వేదాలనే ధర్మానికి ప్రామాణికంగా తీసికొన్నారు కదా! అయినా యుగాలను బట్టి, వేదాలు కనుమరుగవుతున్నట్లు తోస్తోంది. సాధుపురుషుల ధర్మాన్ని, సత్పురుషుల ధర్మాన్ని అంతగా లెక్కలోకి తీసుకొన్నట్లు కనిపించడం లేదు. ఈ విషయంలోనా అనుమానం తీర్చండి.' అని అడిగాడు. అపుడు భీష్ముడు 'ధర్మరాజా! ఈ విషయంలో వైశ్యుడైన తులాధారునికి మరియు జాజిలి ఋషికి మధ్య జరిగిన సంభాషణను ఉదాహరణగా చెప్పాలి.

ఒక బ్రాహ్మణుడైన జాజిలి ఋషి తన తపోబలంతో ముల్లోకాలను చూడగలిగి వుండేవాడు. ధర్మరాజు – 'పితామహా! పూర్వకాలంలో జాజిలి ఋషి ఎలాంటి తపస్సు చేసి ఉత్తమ స్థితిని ప్రాప్తించుకొన్నాడు' అని అడిగాడు. భీష్ముడు – 'కుమారా! పూర్వం జాజలి ఋషి ఒక కీకారణ్యంలో కఠోర తపస్సు చేశాడు. ప్రతినిత్యం వానప్రస్థ నియమాల్లో నిమగ్నుడయ్యేవాడు. వర్షాకాలంలో వానల్లో, ఎండాకాలంలో ఎండల్లో, చలికాలంలో చలిలోనే ఉంటూ తపస్సు చేసేవాడు. అందుచేత అతని తలవెండ్రుకలు జడలు కట్టి జటాజూటధారి అయినాడు. ఒకసారి అలాగే నిలబడి తపస్సులో లీనమై ఉన్నాడు. స్థిరంగా నిలబడి ఉండటం చూచిన పక్షులు దానిని చెట్టుగా భావించి, అతని జడలపై గూళ్ళు కట్టుకోనారంభించాయి. ఆ ఋషి గమనించినా, ఏమీ అనలేదు. ఆ పక్షుల విశ్వాసం అధికమైంది. ఆ తర్వాత అవి కామప్రకోపానికి వచ్చాయి. సమాగమంలో పాల్గొన్నాయి. తత్ఫలితంగా ఆ ఋషి తలపై నున్న జుట్టులోనే గ్రుడ్లు పెట్టాయి. ఇన్ని విషయాలను గమనిస్తూనే, ధర్మమునందే మనసును నింపుకొన్నవాడై, తేజశ్శాలియైన ఆ జాజలి ఋషి, కొయ్యబొమ్మలా తపస్సులోనే నిమగ్నుడైనాడు. ఆ పక్షులు రోజంతా ఆహారం కొరకై వెళ్ళి సాయంత్రం వచ్చి హాయిగా విశ్రమించేవి. గ్రుడ్లు పిల్లలుగా మారాయి. ఋషి జాజలి ఆ పిల్లలకు ఏ కష్టమూ కలుగకుండా జాగ్రత్తగా ఉండేవాడు. తగిన సమయంలో ఆ పిల్లలకు రెక్కలు వచ్చాయి. ఋషి చాల సంతోషించాడు. పక్షి పిల్లలు కూడ ఆహారానికి బయటకు వెళ్తూ, సాయంత్రం తిరిగి వస్తూ హాయిగా ఉన్నాయి. తల్లి పక్షులు గూటిని వదలి వెళ్ళిపోయాయి.

ఈ పిల్ల పక్షులు ఒక్కోసారి వెళ్ళిపోయి, అయిదారు రోజులు తిరిగి వచ్చేవి కావు. ఋషి జాజలి స్థిరంగా ఉండేవాడు. ఒకసారి నెలరోజుల వరకు రాలేదు ఆ పిల్ల పక్షులు. ఋషి జాజలి అలాగే నిల్చుని ఉన్నాడు. చివరకు తాను సిద్ధుడైనానని పొంగిపోయాడు. ఆ తరువాత నదికి వెళ్ళి స్నానం చేసి, ఉదయాన్నే సూర్యునికి నమస్కరించాడు. తన తలపై పక్షులు చేసిన పనులన్నీ గుర్తు తెచ్చుకొని, తాను మహా ధర్మాత్ముడనని తలంచాడు. ఆకాశం వైపు గర్వంగా చూస్తూ, 'నేను ధర్మాన్ని ప్రాప్తించుకొన్నాను.' అని ఎలుగెత్తి అరచాడు. అంతలోనే ఆకాశవాణి ఇలా పలికింది. 'ఓ జాజలీ! నీవు ధర్మాన్ని అర్థం చేసుకోవడంలో తులాధారునితో సమానుడవు కావు.' అని చెప్పింది. కాశీపురంలో తులాధారుడనే మహా బుద్ధిమంతుడైన వైశ్యుడు వున్నాడు. గొప్ప ధర్మాత్ముడు. కాని నీవు అంటున్నట్లు, అతడు ఎప్పుడూ అనలేదు.'

ఆకాశవాణి మాటలు విన్న జాజలి ఆశ్చర్యపడ్డాడు. అతడు తులాధారుని కలుసుకునేందుకు చాల రోజులు ప్రయాణం చేసి, కాశీపురానికి చేరి, చివరకు అతన్ని కలుసుకొన్నాడు. అతడు ఒక దుకాణంలో సరుకులు అమ్ముకొంటున్నాడు. ఆ తులాధారుడు జాజలిని చూచి లేచి నమస్కరించి, సత్కారాలు చేశాడు.

తులాధారుడు 'ఓ విప్రవర్యా! నీవు ఎందుకు వచ్చావో, నాకు తెలిసిపోయింది. ఆకాశవాణి మాటలు విని వచ్చావు. చెప్పండి, మీకు ఏమి మేలు చేయగలను?' జాజలి 'వైశ్యవర్యా! ఒక దుకాణంలో కూర్చొని, అమ్మకాలు జరుపుకొంటున్న మీకు ధర్మనిష్ఠతో ఉన్న బుద్ధి ఎలా వచ్చింది?' తులాధారుడు ఇలా చెప్పాడు. 'మునివర్యా! నేను మొదట పరమ ప్రాచీన సనాతన ధర్మము యొక్క రహస్యాన్ని తెలుసుకొన్నాను. ఎవరిని కూడ మోసం చేయకుండా జీవించడం శ్రేష్ఠమైన ధర్మం అనబడుతుంది. సరుకులు అమ్ముతున్నప్పుడు కొన్నవారి విశ్వాసాన్ని వమ్ము చేయరాదు. మనసా, వాచా, కర్మణా అందరి హితం కోరువారే నిజానికి ధర్మాలు పాటించిన వారవుతారు. ఒక నదీప్రవాహంలో కొట్టుకుపోతున్న గడ్డిపరక అదే ప్రవాహంలోని ఒక దుంగతోపాటు ప్రయాణం చేయవచ్చు. ఈ ప్రపంచలో కూడ ప్రాణుల సంయోగ వియోగాలు దైవేచ్ఛవల్లనే జరుగుతుంటాయని గ్రహించాలి. అందరినీ తన వలెనే చూడటం,

మరియు వారిని ఆత్మభావంతో చూడటం వల్ల వారు బ్రహ్మస్వరూపులౌతారు. ఇదే ధర్మతత్త్వమని తెలుసుకోవాలి.'

తరువాత ధర్మరాజు 'పితామహా! ఒక్కోసారి గురువులు చెప్పిన కఠోరమైన కార్యాలను శీఘ్రంగా చేయటం ఉత్తమమా లేక ఆలస్యంగా చేయటం మంచిదా? నాకు తెలియజేయండి' అని అడిగాడు.

భీష్ముడు : 'నాయనా! దీని విషయమై ఒక ప్రాచీన కథ వుంది. అంగిరస కులంలో జన్మించిన చిరకారి గురించినది. చిరకారి అనే పేరుగల వాడు గౌతమ మహర్షి కుమారుడు. గొప్ప బుద్ధిమంతుడు. అతడు కుంభకర్ణుని వలె ఎక్కువకాలం నిద్రించేవాడు. అలాగే ఎక్కువకాలం మెళుకువలో ఉండేవాడు. ఏదేని సమస్యను పరిస్కరించాలనుకుంటే, ఎక్కువ కాలం ఆలోచించేవాడు. అన్ని కోణాలనుండి ఆలోచించి, ఆలస్యంగానైనా, ఒక కేంద్రబిందువును ఆవిష్కరించి, పరిష్కరించేవాడు. అందుకే అతనిని అందరూ చిరకారి అని పిలిచేవారు. దూరదృష్టి లేనివారు అతనిని మందబుద్ధి అని, సోమరి అని, తెలివి లేనివాడని భావించేవారు.

ఒకసారి గౌతముడు (మేధాతిది) తన భార్య వ్యభిచరించడం చూచి, కోపంతో, చిరకారిని చూస్తూ ఇలా అన్నాడు. 'కుమారా! నీవు ఈ పాపాత్ములాలైన తల్లిని చంపివేయి.' ఇలా అని వనంలోకి వెళ్ళిపోయాడు. సరేనని చెప్పినప్పటికి, ఈ విషయాన్ని గురించి చిరకారి దీర్ఘంగా ఆలోచించసాగాడు ఇలా. 'నేనేమి ఉపాయం చేయాలి. నేను చేసే ఉపాయం యొక్క ప్రభావం చేతన తండ్రియొక్క ఆజ్ఞను శిరసావహించినట్లు, తల్లిని చంపకుండా ఉండాలి. ధర్మాచరణం సాకుతో నాకు పెద్ద సంకట పరిస్థితే దాపురించింది. తండ్రి ఆజ్ఞను పాటించుట పరమధర్మమై వున్నది. అలాగే తల్లిని రక్షించుకోవడం కూడ నాకు పరమ ధర్మమై ఉన్నది. పుత్రుడు తల్లిదండ్రుల అధీనంలో ఉంటాడు. తండ్రి పోషిస్తూ, సంరక్షిస్తూ, విద్యాబుద్ధులు నేర్పించేవాడు. కనుక తండ్రియే కుమారునికి ప్రథమ గురువు. అలాంటి తండ్రి ఏది ఆజ్ఞాపిస్తే, అది ధర్మం క్రింద శిరసావహించవలసిందే. వేదములలో కూడ ఇది నిశ్చితమై వుంది.

తరువాత, తన తల్లిని గురించి ఇలా ఆలోచించసాగాడు. 'ఏరకంగానైతే సమిధ నుండి అగ్ని ఉత్పన్న మగుచున్నదో, అదే విధంగా నేను నా తల్లి గర్భంనుండి ఈ పాచంభౌతిక రూపాన్ని పొందాను. తల్లినుండి ఎంతో ఓదార్పు లభిస్తుంది. తల్లి లేకపోతే అనాధ అంటారు. ఎంతగొప్పవారైనా, తల్లిదగ్గర వినయ విధేయతలతో ఉంటాడు. పుత్రుడు సమర్ధుడైనా, అసమర్ధుడైనా, బలిష్ముడైనా, బలహీనుడైనా, తల్లి పుత్రుని రక్షిస్తూనే ఉంటుంది. తల్లి సంరక్షణలో వున్న సుఖం మరెక్కడనూ లేదు, లభించదు. తల్లిని మించిన ఆధారము దొరకదు.

తల్లి గర్భం మోస్తుంది కనుక 'ధాత్రి' అని అంటారు. జన్మనిస్తుంది కనుక 'అంబ' అని, శుశ్రూష చేస్తుంది కనుక 'శుశ్రూ' అని అనబడుతుంది. అలాంటి తల్లిని ఎవరు చంపగలరు? పిల్లవాడి లాలన పోషణ చేయడంలో తల్లి సుఖాన్ని అనుభవిస్తూ, ఆస్వాదిస్తుంది. తన భర్తకంటె కూడ పుత్రునిపై తన అపారమైన స్నేహాన్ని వ్యక్త పరుస్తుంది. వాస్తవంగా, నిశితంగా పరిశీలిస్తే, స్త్రీయొక్క అపరాధం వుండదు. వ్యభిచారమనే మహాపాపమును పురుషుడే చేస్తాడు. కనుక పూర్తి పాపము పురుషునిదే అయివున్నది. స్త్రీ తన భర్తను దైవంగా భావించి, సేవిస్తుంది. ఇంద్రుడే స్వయంగా నాన్నగారి రూపం ధరించి, నా తల్లి దగ్గరకు వచ్చాడు. అందుచేత ఆమె తన పతియే యనుకొని ఆత్మ సమర్పణ చేసుకొంది. ఇక్కడ పురుషుల దోసమే కాని వేరొకటి కాదు. ఈ అపరాధమునకు మూలము పురుషుడే అని తేలుతున్నది.

స్త్రీలు అబలలు కనుక పురుషుల అధీనంలో ఉంటారు. స్త్రీల ప్రమేయం లేకుండానే వారు దోషులుగా

పరిగణింపబడుతున్నారు. తండ్రి కంటె ఎక్కువగా తల్లిని గౌరవించాల్సి ఉంది. నా తల్లి స్త్రీ కనుక ఆమె వధ్యురాలు కాదు, పూజ్యురాలు. ఆలస్యం చేయడం చిరకారి యొక్క స్వభావం కనుక ఇలా ఆలోచిస్తూ ఉండిపోయాడు.

ఈలోపుగా గౌతమ (మేధాతిథి) మహర్షి వనం నుండి తిరిగి వస్తూ, పశ్చాత్తాప పడుతూ, తన మనసులోనే ఇలా అనుకొన సాగాడు.'అయ్యో! ఎంత పనైపోయింది. ముల్లోకాల ప్రభువు ఇంద్రుడు నా రూపాన్ని ధరించి ఇంటికి వస్తే, నేను స్వాగతించాను. ఆశ్రయమిచ్చాను. కనుక కామము ప్రకోపించి, నిందనీయమైన పనిని చేశాడు. ఇందులో స్త్రీ దోషమేమియు లేదు. ఈర్ష్య వల్ల నేను పాపంలో పడిపోయాను. పతివ్రతయైన నా భార్య నాకు సర్వావస్థల్లో భాగస్వామిగా ఉండేది కదా! అలాంటి నా భార్యను నేనే హత్య చేయించాను. ఇపుడు నన్ను ఆ పాపాం నుండి ఎవరు ఉద్ధరిస్తారు? ఒకవేళ చిరకారి ఆలస్యం చేసి, తన పేరును సార్థకం చేసుకొంటే, నేను ఈ స్త్రీహత్యాపాతకం నుండి తప్పించుకోగలను.' ఇలా దుఃఖిస్తూ ఆశ్రమానికి చేరుకొన్న గౌతమ మహర్షి పాదములపై చిరకారి పడ్డాడు. పుత్రుడు కాళ్ళపై పడటం చూచి, అల్లంత దూరాన సిగ్గుచేత, భీతిలో వున్న భార్యను చూచి, మహర్షి అత్యంత ప్రసన్నుడైనాడు. కుమారుని లెవనెత్తి బుజ్జగించాడు.

భీష్ముడు 'ధర్మరాజా! ఏ పని చేయడానికైనా తగినంత సమయం తీసికొని సిద్ధపడాలి' అని చెప్పాడు.

ధర్మరాజు – 'పితామహా! వేదాల్లో ధర్మార్థకామాల గురించి విస్తృతంగా పేర్కొనబడింది. అందులో ఏది ప్రశస్తమైనదో, దానిని నాకు తెలియజేయండి.' అని అడిగాడు.

భీష్ముడు : 'రాజా! ఈ విషయం స్పష్టం కావాలంటే కుండధారుడను పేరుగల మేఘము యొక్క కథను తెలుసుకోవాల్సి ఉంది. చెప్తాను. విను.

పూర్వకాంలలో పేదవాడైన ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. యజ్ఞయాగాదులు చేయాలంటే డబ్బు కావాలి. కనుక తపము చేయనారంభించాడు. ఆ పేద బ్రాహ్మణుడు భక్తితో దేవతలను ఉద్దేశించి పూజ చేశాడు. కాని డబ్బు లభించలేదు.

కాని ఒకనాడు దేవతల సమీపముననే కుండధారుడు అను మేఘము వచ్చి నిల్చుని ఉండుటను చూచాడు. చూడగనే అతనిపై భక్తిభావం పెచ్చింది. అతడు తనకు ధనం ఇస్తాడనే ఆశ కలిగింది. ఇలా ఆలోచించి, ఆ బ్రాహ్మణుడు ధూన, దీప, చందన, పుష్పాలతో మరియు నైవేద్యం ద్వారా ఆ మేఘాన్ని పూజించాడు. మేఘుడెంతో సంతసించాడు. ఆ తరువాత దర్భలతో చేసిన శయ్యపై పడుకొన్నాడు. ఇలా అతడు శమదమాదులతో, తపముతో, భక్తిభావంతో సంపన్నుడై పరిశుద్ధ హృదయం కలిగి వున్నాడు.

పేదబ్రాహ్మణుడు కలలో అనేకమంది దేవతలను చూచాడు. అందులో నుండి భద్రుడనే దేవశ్రేష్ఠుడు ఇతర దేవతల సమక్షంలో యాచకులకు రకరకాల వస్తువాహనాలను ఫలరూపంలో ఇస్తున్నాడు. ఈలోపుగా, కుండధారుడు దేవతలకు ఎదురుగా వచ్చి వినయంగా నిల్చున్నాడు. అపుడు మణిభద్రుడు కుండధారుని ఏమి కావాలో కోరుకో అని అన్నాడు. అపుడు కుండధారుడు – 'ఈ బ్రాహ్మణుడు నా భక్తుడు. మీరు నాపట్ల ప్రసన్నులై ఉంటే, నేను ఈ బ్రాహ్మణునికి ధనంపై వ్యామోహం ఉంటే, కావలసినంత ధనం ఇవ్వు' అన్నాడు. అపుడు కుండధారుడు ఇలా ఆలోచించాడు. 'మానవ శరీరము చంచలము, నశించునది, అందుచే వేరే వరం కోరుతానని తలంచి, 'ఈ బ్రాహ్మణుని బుద్ధి తపమునందు విలీనమగు గాక' నీవు నా భక్తునకు రత్నగర్భయైన దేశాన్ని కాని,

రత్నరాసులను కాని ఇవ్వాలనుకోవడం లేదు. కేవలం ఇతడు ధార్మికుడవాలని కోరుకంటున్నాను.' అపుడు మణిభద్రుడు 'రాజ్యం మరియు ఇతర సౌఖ్యాలు ధర్మము యొక్క ఫలములై ఉన్నాయి. అందుచేత ఈ బ్రాహ్మణుని నేరుగా ఫలము అనుభవించనిమ్ము. అందులో ఎలాంటి శారీరక క్లేశాలు ఉండవు.' అన్నాడు.

భీష్ముడు ఇలా అన్నాడు. 'ధర్మరాజా! మణిభద్రుడు ఎన్ని రకాలుగా ప్రలోభాలు చూపెట్టినా కూడ, కుండధారుడు ధర్మము కొరకే పట్టుబట్టాడు. మణిభద్రుడు సంతోషించాడు. ఆయన ఆశీర్వాదం మేరకు బ్రాహ్మణుడు ధర్మాత్ముడగునట్లు మరియు అతని బుద్ధి ధర్మములోనే స్థిరమగునట్లు అనుగ్రహించాడు. ఇతరులకు అసాధ్యమైన పనిని కుండధారుడు బ్రాహ్మణునకు చేసిపెట్టి సఫల మనోరథుడైనాడు.'

అంతలోనే ఆ బ్రాహ్మణుని ఇంటిలో పట్టు పీతాంబరాలు మున్నగునవి ఆమూల్యమైనవి కనిపించాయి. వాటిని చూచి ఆ బ్రాహ్మణుడు తన మనసులో ఇలా అనుకొన్నాడు. 'నా తపస్సు యొక్క లక్షణాలు చెప్పినప్పటికీ, కుండధారునకు తెలియలేదు, ఇతరులెవరు కనుక్కోగలరు? ఇక నేను అడవిలోకి వెళ్ళి ధర్మమయ జీవితం గడపటమే ఉత్తమం' అనుకొన్నాడు.

భీష్ముడు ఇంకా ఇలా చెప్పాడు. 'ధర్మరాజా! ఆ రకంగా ఆ బ్రాహ్మణుడు అడవికి వెళ్ళి ఘోరతపస్సు చేయనారంభించాడు. అతిథులకు ఇవ్వగా మిగిలిన కందమూల ఫలాలను తినేవాడు. ఆ తర్వాత ఆకులు మాత్రమే తినటం ప్రారంభించాడు. ఆ పిదప నీరు మాత్రమే తాగి తపము చేయసాగాడు. ఆ విధంగా ధర్మంపై దృష్టిపెట్టి శ్రద్ధగా భీకర తపస్సు చేయడంవల్ల, ఆ బ్రాహ్మణునకు దివ్యదృష్టి వచ్చింది. తనకు ఎలా అనిపించ సాగిందంటే తాను ప్రసన్నుడనై ఎవరికైనా ధనము లేక రాజ్యం ప్రాప్తిస్తుందనంటే, తన మాట వ్యర్థం కాదనిపిస్తోంది.

అంతలోనే అక్కడ కుండధారుడు ప్రత్యక్షమైనాడు. బ్రాహ్మణుడు అతనిని శ్రద్ధతో పూజించాడు. కుండధారుడు ఇలా అన్నాడు. 'విప్రవర్యా! నీకిపుడు దివ్యదృష్టి వచ్చింది. నీవిపుడు రాజుల స్థితిగతులు, భిన్నమైన లోకాల్ని దర్శించవచ్చు.' బ్రాహ్మణుడు తన దివ్యనేత్రాలతో చూడగా రాజులందరూ నరకంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు.

కుండధారుడు ఇలా అన్నాడు. 'నీవు ఎంతో భక్తితో నన్ను కొలిచావు కనుక నీవు ఏ ధనమో, రాజ్యమో తీసికొంటే, అధోగతి పాలవుతావని తలంచి, నీ మనస్సును ధర్మమునందే స్థిరమవాలని కోరుకొన్నాను. సర్వ ప్రాణులు కామక్రోధలోభ మదమోహములతో పతనమైపోతున్నారు.'

బ్రాహ్మణుడు సవినయంగా ఇలా అన్నాడు. 'మీరు నాపై కురిపించిన అపార కృపాకటాక్షవీక్షణాలను తెలుసుకోలేక పోయాను. నేను కోరిన విధంగా ధనము ఇచ్చిన యెడల, నేను నరకంలో పడిపోయేవాడిని. నా మనస్సును ధర్మము వైపు మళ్ళించి, పుణ్యం కట్టుకొన్నారు. కనుక నేను మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి.'

కుండధారుడు బ్రాహ్మణుని ఆలింగనం చేసుకొని, ఆశీర్వదించి, అదృశ్యమై పోయాడు. బ్రాహ్మణుడు తపస్సు ద్వారా పొందిన సిద్ధితో ఆకాశమార్గాన అభీష్ట లోకమునకు వెళ్ళసాగాడు.

దక్షయజ్ఞ విధ్వంసం గురించి తెలుసుకొందాం:

ఇది ప్రాచీన కాలం నాటి విషయం. హిమాలయాలకు సమీపంలో గంగానదీ ముఖద్వారం దగ్గర ఎక్కడైతే ఋషులు, సిద్ధులు నివశిస్తుంటారో, అక్కడ ప్రజాపతియైన దక్షుడు యజ్ఞం ప్రారంభించాడు. శ్రేష్ఠ

ధర్మాత్ములైన ఋషుల మధ్యన దక్షుడు కూర్చొని ఉన్నాడు. ముల్లోకాల్లోని వారందరు దక్షుని యజ్ఞంలో సేవలో పాల్గొంటున్నారు. రాక్షసులు, పిశాచులు, సర్పాలు, దానవులు, తుంబురుడు, విశ్వావసుడు మరియు విశ్వసేనుడు మొదలైన గంధర్వులు, అప్సరసలు, ఆదిత్యుడు మరియు మరుత్ గణములతో పాటు ఇంద్రాది దేవతలు కూడ యజ్ఞంలో పాల్గొనటానికి వచ్చారు. బ్రహ్మయొక్క శుభాగమనం కూడ జరిగింది. దేవతలు తమ స్త్రీలతో పాటు వస్తూ ఎంతో శోభాయమానంగా వెలుగొందుతున్నారు. మహాముని దధీచి కూడ అక్కడే ఉన్నాడు. దధీచి యజ్ఞ మండపాన్ని చూడగా, అందరూ ఉన్నారు కాని శంకరుడు మాత్రం కనిపించలేదు. శంకరుని ఆహ్వానించ లేదేమోననే కోపంతో దధీచి ఇలా అన్నాడు. 'ఓ సజ్జనులారా! ఏ యజ్ఞములో శివుని పూజ జరుగదో అది యజ్ఞం అనబడదు. ధర్మం కూడ కాదు. అలాచేస్తే, నాశనం జరుగుతుంది. అలా అనిన దధీచి ధ్యానమగ్నుడై చూడగానే అతనికి శంకరుడు, పార్వతి, నారదుడు కనిపించారు. సంతోషించాడు. అపుడు దధీచి తన మనస్సులో ఇలా అనుకొన్నాడు. వీరందరు కావాలనే శంకరునికి ఆహ్వానం పంపలేదని తలంచి, యజ్ఞశాల నుండి ప్రక్కకు వైదొలగుతూ ఇలా అన్నాడు. 'పూజనీయుని విస్మరిస్తే, వినాశం తప్పదు. శంకరుడు సకల జగత్తును సృష్టించి, రక్షించువాడు. నా దృష్టిలో శంకరుని మించిన దేవుడు లేడు. నేను చెప్పినది సత్యమే అయిన యెడల, దక్షుని యొక్క ఈ విశాల వేదిక ధ్వంసం అగు గాక!' అని అనగా దక్షుడు – 'ఓ మహర్షీ! ఈ సువర్ణ పాత్రలో ఉన్న హవిస్సును శ్రీమహావిష్ణువునకు సమర్పించుటకు ఉన్నాను. నా దృష్టిలో విష్ణువే సమర్థుడు, వ్యాపకుడు మరియు యోగ్యుడు.' అదే సమయంలో కైలాస పర్వతంపై నున్న పార్వతి, శంకరునితో ఉదాసీనంగా ఇలా అన్నది. 'నాథా! యజ్ఞభాగం మీకు దక్కకపోవటం నన్ను బాధిస్తోంది.' అపుడు శంకరుడు 'దేవీ! సంపూర్ణ యజ్ఞం యొక్క ఈశ్వరుణ్ణి నేను. యజ్ఞంలో నా స్తుతియే జరుగుతుంది. సామగానం చేసే బ్రాహ్మణులు నా మహిమనే గానం చేస్తారు. వేదవేత్తలైన ఋత్విక్కులు నాకు యజ్ఞభాగాన్ని అందిస్తారు. ఓ దేవేశ్వరీ! ఏ కారణం చేత నీకు దుఃఖం కలుగుతున్నదో, దానిని రూపుమాపుటకు ఒక వీరపురుషుని సృష్టిస్తున్నాను'. అలా అని శంకరుడు వెంటనే తన ముఖమునుండి భయంకరములైన భూతములను ప్రకటించాడు. శంకరుడు దక్షయజ్ఞాన్ని నష్టపరచుమని ఆజ్ఞాపించాడు. సింహం వలె పరాక్రమవంతుడైన పురుషుడు పార్వతి కోపాన్ని చల్లార్చుటకుగాను, ఆమె చూస్తుండగానే ప్రజాపతి యజ్ఞాన్ని ధ్వంసం చేసేశాడు.

ఆ వీరపురుషుని పేరు వీరభద్రుడు. అతని రూపం, బలం, శౌర్యం శంకరుని తలపిస్తోంది. కోపమునకు, బల పరాక్రమాలకు హద్దులు లేవు. రుద్రుని వలె భయంకరుడై వున్నాడు. అతడు యజ్ఞాన్ని ధ్వంసం చేస్తున్నపుడు, అతని వెంట వేలాది వీరులు సహకరించారు. వారి కేకలతో ఆకాశం మారుమ్రోగింది. దేవతలు వణికిపోయారు. పర్వతాలు కూడ పెళ్ళగిల్లాయి. భూమి కంపించింది. సూర్యచంద్రుల కాంతి సన్నగిల్ల జొచ్చింది. అంధకారము ఆవరించింది. దేవతలు, ఋషులు దాక్కున్నారు. దక్షుని అవమానమునకు కోపంతో భూతాలు మొదట యజ్ఞశాలకు నిప్పుపెట్టి, యజ్ఞ సామగ్రిని చిందరవందర చేస్తూ, రక్షకులను చావమోదసాగారు. కాలాగ్ని సమమైన ఆ భయంకర రుద్రగణం దేవతలను భయపెడుతున్నది. వీరభద్రుడు స్వయంగా గర్జన చేస్తూ, సమస్త జీవుల్ని భయభ్రాంతులకు గురిచేశాడు.

ప్రజాపతి దక్షుడు రెండు చేతులు జోడించి 'మీరెవరు?' ని అడిగాడు. 'రుద్రుని కోపంతో ఆవిర్భవించిన వీరభద్రుణ్ణి నేను, ఈ భద్రకాళి పార్వతియొక్క కోపంతో ఆవిర్భవించింది. శంకరుని ఆజ్ఞ మేరకు ఈ విధ్వంసానికి పూనుకొన్నాం. ఓ విప్రవర్యా! మీరు శివుని శరణు వేడుకోండి. అతని కోపము కూడా ఇతరులు ఇచ్చే వరంకంటే గొప్పది.'

దక్షుడు వెంటనే శివుని స్తుతతిస్తూ 'ఓ శాసకా! ఓ పాలకా! నేను నిన్ను శరణు వేడుకొంటున్నాను' అని అనగానే శివుడు యజ్ఞగుండం నుండి బయటకు వచ్చి, నీకేమి ప్రియకార్యం కావాలో చెప్పు అని అన్నాడు. అదే సమయంలో బృహస్పతి కూడ శివుని స్తుతించాడు.

దక్షుడు ఇలా అన్నాడు. 'దేవా! భూతగణము ద్వారా నష్టపడిన యజ్ఞసామగ్రి యొక్క ఫలితము దక్కునట్లు అనుగ్రహించండి.' శివుడు 'తథాస్తు' అన్నాడు. (ఈ ఉదంతం ఉత్తర భారతంలో బాగా ప్రాచుర్యంలో వుంది).

శుకదేవుని జన్మవృత్తాంతం:

ధర్మరాజు – 'పితామహా! వేదవ్యాసునకు శుకదేవుడు ఎలా జన్మించాడు? అతనికి బాల్యావస్థలోనే సూక్ష్మ జ్ఞానం ఎలా వచ్చింది?'

భీష్ముడు ఇలా చెప్పాడు – 'పూర్వం ఒకరోజు శంకరుడు మేరుపర్వతంపై భూతగణాలతో కలిసి విహరిస్తున్నాడు. అక్కడ పర్వత రాజ పుత్రిక యైన ఉమ వుంది. ఆ రోజుల్లోనే వేదవ్యాస మహర్షి ఆ పర్వతం పైనే తపస్సు ప్రారంభించాడు. అతని కోరిక ఏమంటే – అగ్ని., భూమి, జలం, వాయువు మరియు ఆకాశం అంతటి ధైర్యశాలియైన పుత్రుడు కావాలి. ఈ వరంకోరి వంద సంవత్సరాల వరకు కేవలం వాయువును భక్షిస్తూ శంకరుని ఆరాధిస్తూ ఉన్నాడు. విసుగులేని ఈ తపస్సుకు ముల్లోకాలు ఆశ్చర్యపడ్డాయి. ఈ వృత్తాంతం నాకు మార్కండేయ మహర్షి చెప్పాడు.

ఈ తపస్సును గమనించిన శంకరుడు ప్రసన్నుడై వ్యాసుని కోరిక తీర్చుటకు సిద్ధపడ్డాడు. 'వేదవ్యాసా! నీవు కోరుకున్నట్లే నీకు బలశాలియైన కుమారుడు జన్మిస్తాడు. అతడు భగవద్భావములో లీనమౌతాడు. భగవానునిలోనే అతని బుద్ధి నిక్షిప్తమై వుంటుంది.' భగవానుడే అతని ఆత్మ, భగవానుడే తన ఆశ్రయమని అతడు భావిస్తాడు.'

ఈ ఉత్తమ వరాన్ని ప్రాప్తించుకొన్న వేదవ్యాసుడు ఒకనాడు అగ్నిని ప్రజ్వరిల్ల చేయ ప్రయత్నించినపుడు అతని దృష్టి పరమ సుందరియైన ఘృతాచిపై పడింది. ఆమె అప్సరస. ఆకర్షింపబడ్డాడు. అకస్మాత్తుగా అతని వీర్యం సమిధలో పడింది. తద్వారా మహాతపస్వియైన శుకదేవుడు జన్మించాడు. అప్పుడే అతను తేజోవంతంగా వెలుగొందుతున్నాడు. అదే సమయంలో శ్రేష్ఠమైన గంగానది మానవాకారంతో మేరుపర్వతంపైకి వచ్చి తన జలంతో అతనిని అభిషేకించింది. శుకదేవుని కొరకు ఆకాశంనుండి దండము మరియు కృష్ణాజిన మృగచర్మం దిగివచ్చాయి. దేవతలు, గంధర్వులు స్తుతింపసాగారు. ఇంద్రాది దేవతలు, దేవర్షులు, బ్రహ్మఋషులు కూడ వచ్చారు. వాయుదేవుడు పుష్పవర్షాన్ని కురిపించాడు. పార్వతీ పరమేశ్వరులు స్వయంగా వచ్చి యజ్ఞోపవీత సంస్కారం చేశారు. ఇంద్రుడు కమండలం, దివ్య వస్త్రాలు ఇచ్చాడు.

శుకదేవుడు బ్రహ్మచారియై అక్కడే ఉండసాగాడు. శుకదేవునికి వేదాలు కరతలామలమకలయ్యాయి. బృహస్పతిని గురువుగా భావించి అన్ని విద్యలు అభ్యసించి ఇంటికి తిరిగి వచ్చాడు. బాల్యావస్థలోనే ఋషుల యొక్క, దేవతల యొక్క సందేహాలను తీర్చేవాడు.

భీష్ముడు ఇలా అన్నాడు. – 'ధర్మరాజా! వ్యాసపుత్రుడైన శుకదేవుడు కైలాస శిఖరం చేరుకొని సమతల ప్రదేశంలో కూర్చొని సంపూర్ణ శరీరంతో ఆత్మను ధరించాడు. కొద్ది సమయంలోనే సూర్యుడు ఉదయించాడు. కనుక తూర్పు దిక్కుకు వెళ్ళి, యోగంలో లీనమైనాడు. ఆ తరువాత దేవర్షియైన నారదుని దగ్గరకు పోయి,

ఆయనకు ప్రదక్షిణం చేసి, తన యోగాన్ని గురించి ఇలా చెప్పాడు. 'ఓ తపోధనా! నాకు మోక్షమార్గం దర్శనమైంది. మీకు కళ్యాణమగు గాక! నేను వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నాను. మీ దయతో నేను కోరుకొన్న గతి ప్రాప్తించుకొంటాను.'

నారదుని ఆజ్ఞ తీసికొని, నమస్కరించి, మళ్ళీ యోగంలో స్థితుడై శిఖరం నుండి ఎగిరి ఆకాశమార్గాన ప్రయాణం చేస్తూ వాయువు రూపం ధరించి, అంతరిక్షంలో సంచరించ సాగాడు. ఆ సమయంలో శుకదేవుని తేజస్సు అగ్నివలె మరియు సూర్యుని వలె ఉద్దీప్తమవుతూ వుంది. నిర్భయంగా, ఏకాగ్రచిత్తంతో పైపైకి వెళ్ళుటకు చూచిన దేవతలు శుకదేవునిపై పుష్పవర్షం కురిపించారు. సముద్రాలు, నదులు, పర్వతాలు, అడవుల యొక్క దేవతలు పరస్పరం ఇలా తలచాయి. 'ఈ శుకదేవుడు అద్భుతమైన ఏకాగ్రచిత్తంతో పితృభక్తుడై వున్నాడు. ఇతని తండ్రియైన వేదవ్యాసుడు కూడ తన కుమారుని ఎంతో ప్రేమించేవాడు. ఎలా ఇలా వెళ్ళనిస్తున్నా'డని అనుకోసాగారు.

ఈ మాటలు వినిన శుకదేవుడు వారితో 'ఓ దేవతలారా! ఒకవేళ మా నాన్నగారు ఇటువైపు వచ్చి ఎలుగెత్తి నన్ను పిలిస్తే, మీరు జాగ్రత్తగా సమాధాన మివ్వండి. మీకు నాపై ప్రేమ ఉంది కనుక ఈ మాత్రం సాయం చేయండి. వారందరు మీ ఆజ్ఞను శిరసావహిస్తామన్నారు.

శుకదేవుడు సిద్ధి పొందటానికై నిత్యుడై, నిర్గుణుడై, లింగరహితుడై, బ్రహ్మచర్యంలో స్థితమైనాడు. ఆ సమయంలో అతని తేజస్సు అగ్ని వలె దేదీప్యమానంగా ఉంది. ఆ తరువాత ఊర్ధ్వలోకానికి వెళ్ళుచున్న శుకదేవునకు గంగయొక్క దర్శనం అయింది.

వేదవ్యాసుడు శుకదేవుని వెదకుచూ, ఆ అడవిలో తన కుమారుని బిగ్గరగా పిలిచాడు. అదివిన్న శుకదేవుడు 'ఏకాక్షర వైధోవి' అని జవాబు ఇచ్చాడు.

శోకాకుల చిత్తుడై వున్న వేదవ్యాసుని ఓదార్చడానికి శంకరుడు వచ్చి, ఇలా అన్నాడు. 'ఓ మహర్షీ! నీవు శోకించవద్దు. ఈ ప్రపంచం ఉన్నంతవరకు నిన్ను, నీ కుమారుని అందరూ కీర్తించగలరు. అక్షయమైన కీర్తిప్రతిష్ఠలు మీ సొంతం' అని చెప్పాడు.' అన్నాడు భీష్ముడు.

ధర్మరాజు – 'పితామహా! హయగ్రీవావతారాల పూర్వాపరాలు తెలుపుతారా?

భీష్ముడు – 'ధర్మరాజా! పూర్వకాలంలో ఈ ప్రపంచమంతా జలమయమై ఉంది. ప్రపంచం ('పృథ్వి) జలంలో, జలము తేజస్సులో, తేజస్సు వాయువులో, వాయువు ఆకాశములో, ఆకాశము మనస్సులో, మనస్సు వ్యక్తములో, వ్యక్తము అవ్యక్త పురుషంలో (బ్రహ్మ) మరియు పురుషుడు సర్వవ్యాపక పరమాత్మలో లీనమై ఉన్నాయి. ఆ సమయంలో అంతటా అంధకారమే తప్ప మరేమీ లేదు. ఆ స్థితిలో విద్యాసంపన్నుడైన శ్రీహరి యోగనిద్రను ఆశ్రయముగా తీసికొని, కారణరూప జలములో శయనించాడు. అనేకానేక గుణములతో ఉత్పన్నం కోసమే సృష్టిని గురించి ఆలోచించ సాగాడు. ఒక మహత్తరమైన గుణము గుర్తుకు వచ్చింది. దానితోనే అహంకారం ప్రకటితమైంది. ఆ అహంకారమే నాలుగు ముఖములు గల బ్రహ్మ ఐనాడు. అన్ని లోకముల పితామహుడుగా, హిరణ్యగర్భుడుగా ప్రఖ్యాతి గాంచాడు. ఆ సమయంలో శ్రీహరి నాభినుండి ఒక కమలం ప్రకటితమై, అందునుండి కమలలోచనుడైన బ్రహ్మ ఆవిర్భవించాడు.

అమిత తేజశ్శాలియైన బ్రహ్మ వంద రేకులు గల కమలములపై విరాజమానుడై అటునిటూ చూడగా

సర్వం జలమయమై కన్పించింది. అపుడు బ్రహ్మ తత్త్వగుణుడై సృష్టికార్యాన్ని ప్రారంభించాడు. బ్రహ్మ ఏ కమలములపై కూర్చొని ఉన్నాడో, ఆ కమలములు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ఆ కమలముల యొక్క రేకులపై (ఆకులు) శ్రీహరి యొక్క మహిమచే, రెండు నీటి చుక్కలు పడి ఉన్నాయి. అవి రజోగుణమునకు, తమోగుణమునకు ప్రతీకలుగా ఉన్నాయి. ఆద్యంతాలు లేని ఆ శ్రీహరి ఆ రెండు నీటి చుక్కలపై తన దృష్టిని నిలిపాడు. అందులోనుండి ఒక చుక్క తమోగుణముతో మధు అను రాక్షసునిగాను మరొక చుక్క రజోగుణముతో కైటభుడు అను రాక్షసునిగా ఉత్పన్నమైనాడు. ఆ ఇద్దరు రాక్షసులు కూడ మిక్కిలి బలవంతులు. అలా ఉద్భవించిన మధుకైటభుల దృష్టి బ్రహ్మపై పడగానే అటువైపు పరుగెత్తారు. బ్రహ్మ దగ్గర వున్న నాలుగు వేదాలు దొంగిలించి వెంటనే సముద్రం లోపల ఉన్న రసాతలంలోకి వెళ్ళిపోయారు. వేదాలు దొంగిలించబడినందున బ్రహ్మ దిగులుతో తన మనస్సులో ఇలా పరమాత్మకు విన్నవించ సాగాడు. 'దేవా! వేదములే నా ఉపాస్య దైవం. ఆ వేదాలను ఇద్దరు రాక్షసులు ఎత్తుకుపోయారు. అవి లేకుండా, నేను అంధకారంలో ఉన్నట్లుంది. వేదాలు లేకుండా నేను ప్రపంచ సృష్టి ఎలా చేయాలి? అయ్యో! నాకు సంకట పరిస్థితి దాపురించింది కదా! ఈ విధంగా చింతించి, అనేక విధాల శ్రీహరికి మొర పెట్టుకోసాగారు. 'దేవా! మీరు మా పూర్వీకులు, వేదాలు మీ హృదయమై ఉన్నాయి. అలాంటి సర్వశ్రేష్ఠులైన మీకు నమస్కారము. నేను మీ ప్రసాదములోనే ఉత్పన్నమైనాను. మీరు నాకు వేదరూపంలోనున్న నేత్రములను ప్రసాదించి వున్నారు. వాటిని రాక్షసులు దొంగిలించారు. వేదాలు లేకుటే, నేను అంధుణ్ణి. అందుచేత మీరు దయతో వాటిని తీసుకొనివచ్చి నాకు ఇవ్వండి. నేను మీ ప్రియభక్తుణ్ణి. మీరు నా ప్రియస్వామియై వున్నారు.'

ఇలా స్తుతించేసరికి శ్రీహరి యోగనిద్రనుండి మేల్కొని, వేదములను ఉద్ధరించుటకు సిద్ధమైనాడు. శ్రీహరి చంద్రుని సమానమైన అశ్వము యొక్క తలను పోలిన రూపమును ధరించాడు. అందులోనే అనేక రూపాల్ని నిక్షిప్తం చేసి, హయగ్రీవునిగా అవతారమెత్తి, అక్కడినుండి అదృశ్యమై, రసాతలంలోనికి ప్రవేశించి, సామవేదగానం చేయడం ప్రారంభించాడు. ఆ మధురగానం రసాతలంలో నలువైపులా వ్యాపించింది. ఆ గానాన్ని విన్న మధుకైటభులు వేదాల్ని కట్టకట్టి ఒక చోట భద్రపరచి, ఆ గానమాధర్యం వెలువడిన వైపు వెళ్ళారు. వెంటనే హయగ్రీవుడు వేదములు భద్రపరిచిన చోటికి వచ్చి, వేదములను తీసికొని, బ్రహ్మకు ఒప్పచెప్పి, తన నిజరూపంలో ఓ శేషపాన్పుపై పడుకొన్నాడు. మధుకైతభులకు వేదగానం వినిపించిన చోట ఎవరూ కనిపించక, మరల తాము వేదాలను భద్రపరచిన స్థలానికి వచ్చారు. అక్కడ వేదములు లేకపోవడంతో, మధుకైటభులు ఆగ్రహావేశాలతో రసాతలం నుండి బయటకు వచ్చారు. శేషనాగునిపై యోగనిద్రలో ఉన్న విష్ణువును చూచి ఇతడే వేదాలను దొంగిలించాడని తలంచి, హాస్యం చేస్తూ, విష్ణువును లేపారు. ఆ ఇద్దరు మధుకైటభులు యుద్ధమునకు సిద్ధమవటం చూచిన శ్రీహరి బ్రహ్మ యొక్క స్థాయిని నిలబెట్టుటకు రజో, తమో గుణములతో ప్రధావితమైన మధుకైటభులను సంహరించాడు. వేదములను తిరిగి పొందిన బ్రహ్మ శ్రీహరి దయతో సమస్త జగత్తును సృష్టించాడు.

ధర్మరాజు – 'పితామహా! ఉత్తమమైన ఆశ్రమ ధర్మాన్ని గురించి ఉపదేశించండి.'

భీష్ముడు – 'ధర్మరాజా! గంగానది దక్షిణ తీరంలో మహాపద్మము అనే ఉత్తమ నగరమొకటి ఉండేది. అక్కడ ధర్మారణ్యుడు అనే ఒక బ్రాహ్మణుడుండే వాడు. అతడు అగ్నిహోత్రంలో జన్మించాడు. వేదాధ్యయనము చేసిన ఆ బ్రాహ్మణుడు సందేహరహితుడుగా ఉండేవాడు. అతడు ధర్మపరాయణుడై, నిత్యసంతుష్ముడై, జితేంద్రియుడై, సత్యవాదియై తపము చేస్తూండేవాడు. న్యాయసమ్మతంగా సంపాదించిన ధనం అతని ఇంటిలో ఉండేది. ఇంటిలో మనుషులు ఎక్కువగానే ఉండేవారు.

బ్రాహ్మణోచిత శీలసంపద మెండుగా ఉండేది. ఆ బ్రాహ్మణుడు ఒకసారి, వేదోక్త ధర్మం. శాస్త్రోక్త ధర్మం మరియు శిష్టాచార ధర్మం గురించి విపరీతంగా ఆలోచించి, ఆలోచించి, దేనిని ఆశ్రయించాలో తేల్చుకోలేక పోయాడు. అదే సమయానికి, అతని వద్దకు ఒక అతిథి వచ్చాడు. ధర్మాత్ముడైన ఆ అతిథిని సత్కరించిన పిదప, ధర్మారణుడు ఇలా అడిగాడు. – 'అయ్యా! నేను ఈ గృహస్థ ధర్మం వదలి ఏ ధర్మం ఆచరించాలో చెప్పగలరా?' అని అడిగాడు. అపుడు ఆ అతిథి ఇలా చెప్పాడు. 'ఓ బ్రాహ్మణోత్తమా! ఈ విషయం నాకు కూడా తెలియదు. నైమిశారణ్యంలో గోమతీ నదీతీరంలో నాగపురం అనే నగరం ఉంది. అక్కడ పద్మనాభుడు అను పేరుగల ధర్మాత్ముడైన నాగరాజు వున్నాడు. నీవు అక్కడికి వెళ్ళి నీ సందేహం తీర్చుకోవచ్చు.' అని చెప్పి అక్కడినుండి వెళ్ళిపోయాడు.

ఈ బ్రాహ్మణుడు నాగరాజు వద్దకు బయలుదేరాడు. నాగరాజు ఇంటికి వెళ్ళి నాగరాజు భార్యను అడుగగా, అతడు సూర్యరథం లాగడానికి వెళ్ళాడని, తిరిగి రావటానికి కొన్ని రోజులు పట్టవచ్చునని చెప్పింది. బ్రాహ్మణుడు – 'దేవీ! నీవెంతో ఉత్తమురాలుగా కన్పిస్తున్నావు. నాగరాజు రాగానే, నేను వచ్చిన విషయం తెలియజేయండి.' అని చెప్పి తిరుగు ప్రయాణమయ్యాడు. నాగరాజు తిరిగి వచ్చిన తర్వాత ఆయన భార్య బ్రాహ్మణుని విషయం చెప్పగా, నాగరాజు గోమతీ తీరానికి వెళ్ళి అతణ్ణి కలుసుకొన్నాడు. అపుడు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు. 'నాగరాజా! నేను నీ దర్శనం కోరి వచ్చాను. ఒక ప్రశ్న ఉంది. పరిష్కరించండి. మీరు సూర్యుని యొక్క ఒక చక్రంగల రథాన్ని లాగేందుకు వెళ్తుంటారు కదా! అక్కడ మీరు ఏదైనా ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూచి ఉంటే, నాకు చెప్పండి' అని అడిగాడు. అపుడు నాగరాజు 'ఓ బ్రాహ్మణోత్తమా! అనేక ఆశ్చర్యాలకు సూర్యభగవానుడే కేంద్రబిందువు. పరమాత్మ స్వయంగా సూర్యునిలో స్థితుడై ఉన్నాడు. ఒక ఆశ్యర్యకరమైన విషయం చెప్తాను. వినండి. ప్రాచీన కాలంలో ఒక రోజు సూర్యుడు మధ్యాహ్నం నిప్పులు చెరుగుతున్నట్లు ప్రకాశిస్తున్నాడు. ఆ సమయంలో సూర్యసమానుడైన ఒక తేజశ్శాలియైున పురుషుడు కన్పించాడు. ఆ పురుషుడు ముల్లోకాలను వెలుగులతో నింపుతూ, ఆకాశమును చీలుస్తూ సూర్యుని వైపు రాసాగాడు. సూర్యుడు కూడ అతనికి స్వాగతం పలికాడు. ఆ పురుషపుంజము సూర్యునితో కలిసి, సూర్యుని యొక్క ఏకాకారమును సంతరించుకొంది. అదిచూచిన మేము భయపడి సూర్య భగవానుని ఇలా అడిగాము. 'దేవా! ఆ పురుషుడు ఎవరు?' సూర్యుడు ఇలా చెప్పాడు. 'ఆ వ్యక్తి సిద్ధిని పొంది దివ్యలోకాన్ని ప్రాప్తించుకొన్నాడు. కేవలం కందమూల ఫలాలను తింటూ, తన మనస్సును స్వాధీనమునందుంచుకొని, సర్వసంగ పరిత్యాగియై, పొలములో పండిన ధాన్యమును సేకరించుకొని, బ్రతుకీడుస్తున్నాడు'. ఈ విషయం వినగానే, బ్రాహ్మణుడు తన సందేహం నివృత్తి అయిందని, తృప్తితో వెళ్ళిపోయాడు.

-o0o-

13. అనుశాసనిక పర్వం

ధర్మరాజు 'పితామహా! నాకు శాంతి లభించడానికి అనేక ఉపాయాలు చెప్పారు. అయినా నా హృదయం శాంతించలేదు. మీరు నాకు ఇంకను శాంతి లభించుటకు ఉపదేశించాలి.'

భీష్ముడు : ధర్మరాజా! శుభాశుభ కర్మలకు నీవు కారణము కాదు. ఈ విషయాలు బాగా అర్థం కావాలంటే, ఒక బ్రాహ్మణ స్త్రీ యొక్క కథను చెప్తాను. విను.

పూర్వకాలంలో గౌతమి అనే పేరు గల ఒక వృద్ధ బ్రాహ్మణ మహిళ ఉండేది. ఆమె ఎల్లవేళల శాంతిసాధనలోనే ఉండేది. ఒకరోజు ఆమె ఏకైక కుమారుని పాము కాటువేయగా అతను చనిపోయాడు. అంతలోనే ఒక వేటగాడు ఆ పామును పట్టుకొని, ఆ వృద్ధ మహిళ వద్దకు వచ్చాడు. అతడు 'అమ్మా! ఈ పాము నీ కుమారుని కాటువేసి చంపింది. దీన్ని నేను ఎలా చంపాలో చెప్పు. అగ్నిలో వేయమంటావా? లేక ముక్కలు ముక్కలు చేయమంటావా? వెంటనే చెప్పు అన్నాడు. అప్పుడు ఆ మహిళ 'ఓయీ! నీవింకా మారలేదు. ఆ పామును వదలిపెట్టు. దానిని చంపకూడదు. ఈ పామును చంపినంత మాత్రాన, నా కుమారుడు బ్రతికిరాడు కదా! ఒక ప్రాణిని చంపి నరకంలో పడటం మంచి పని కాదు.' అన్నది. వెంటనే వేటగాడు 'ఓ మాతా! వయోవృద్ధులు ఇలానే అంటారు. నేను మాత్రం రాజీపడలేను. ఈ పామును ఇప్పుడే చంపేస్తాను. నీవు కూడా శోకాన్ని త్యజించవచ్చు.' అనగా ఆ వృద్ధ మహిళ 'సజ్జనులు ధర్మాన్ని పాటించాలి. నా కుమారుని మరణము ఈ పాముతో నిశ్చితమై వుంది. కనుక అలా జరిగింది. ఆ పామును వదలిపెట్టు.' అని చెప్పింది. కాని వేటగాడు 'శత్రువులను చంపాలి గాని విడిచి పెట్టకూడదు అని పెద్దలన్నారు.' అని అన్నాడు. అప్పుడు ఆ వృద్ధ మహిళ 'ఆ పామును నీవు నిర్బంధించి చంపడం వల్ల ఏ ప్రయోజనమూ లేదు. మోక్షప్రాప్తి పొందుటలో నేనెందు వంచితురాలనవ్వాలి?' అని అడిగింది. అందుకు వేటగాడు ఇలా అన్నాడు. 'అమ్మా! ఈ పామును వదలిపెట్టినచో, మరెందరినో కాటు వేస్తుంది. కనుక దానిని చంపటమే మంచిది కదా!'

భీష్ముడు ఇలా అన్నాడు. 'ధర్మరాజా! బ్రాహ్మణ స్త్రీ, వేటగాడి సంభాషణ విన్న ఆ పాము మానవ భాషలో ఇలా అన్నది. 'ఓయీ! వేటగాడా! మృత్యువు ప్రేరేపించుటచే కాటు వేశాను తప్ప, అందులో నా దోషమేమీ లేదు.' వేటగాడు 'ఓ సర్పమా! నీవు మృత్యువు యొక్క అధీనంలో వుండి పాపము చేసినను, నీవు శిక్షార్హురాలివే' అని పాముతో అన్నాడు. ఆ పాము 'ఓయీ! చక్రము, మట్టి మొదలగు ఉపకరణములతో కుమ్మరి కుండలు చేస్తాడు. ఆ ఉపకరణములు కుమ్మరి అధీనంలో ఉన్నట్టుగానే నేనూ మృత్యువు అధీనంలో వున్నాను.' అని చెప్పింది. వేటగాడు 'ఏది ఏమైనప్పటికిని వృద్ధ బ్రాహ్మణ మహిళ కుమారుని మరణం నీవల్లనే జరిగింది. కనుక నీవు చంపదగిన దానవే కదా!' అనగా పాము 'ఓయీ! ఋత్విక్కులు చేయు యజ్ఞఫలము కేవలము యజమానులకే చెందుతుంది. అలగే ఈ పాపము మృత్యువుకే చెందుతుంది.' అని అన్నది.

భీష్ముడు ఇదంతా చెప్పి ఇలా అన్నాడు. 'ధర్మరాజా! ఆ సర్పము మృత్యువుపై నెపము నెట్టగానే, మృత్యువు వచ్చి ఇలా అన్నది. 'ఓ సర్పమా! కాలము యొక్క ప్రేరణ చేత, నేను నిన్ను ప్రేరేపించాను. ఇందులో నా తప్పు లేదు, నీ తప్పూ లేదు.' అని చెప్పగా, పాము 'ఓ మృత్యువా! నీవు దోషివని లేక నిర్దోషివని నేను నిర్ణయించలేదు. నీవు నన్ను ప్రేరేపించి కాటు వేయించావు.' అని అన్నది. ఆ పిదప సర్పము వేటగానితో తనను బంధవిముక్తం

చేయమని కోరింది. వేటగాడు మాత్రం ఆ ఇద్దరిని దోషులుగా పేర్కొన్నాడు. ఈలోగా పాము అక్కడికి వచ్చిన వారిని ఉద్దేశించి ఇలా అన్నది. 'మేమెవ్వరము దోషులము కాము. ఆ వృద్ధ బ్రాహ్మణ స్త్రీ యొక్క కుమారుని కర్మల ననుసరించి మృత్యువు కబళించింది. ఈ విషయం అర్థం చేసికొన్న వేటగాడు పామును వదిలి వేశాడు. అక్కడ చేరినవారందరు వెళ్ళిపోయారు.

భీష్ముడిలా అన్నాడు. 'ధర్మరాజా! ఈ కథతోనైనా, నీవు శాంతిని పొందుము.

ధర్మరాజు – 'పితామహా! ఎవరైనా ధర్మమును ఆధారంగా చేసికొని మృత్యువును జయించగలిగారా? తెలియజేయండి.

భీష్ముడు – 'ధర్మనందనా! ప్రాచీనకాలంలో ప్రజాపతి అయిన మనువు యొక్క మునిమనుమడు జితేంద్రియుడై, ధర్మాత్ముడై, మృదుభాషియై, కోమల స్వభావుడై మరియు పరాక్రమశీలియై ఉన్నాడు. ఒకసారి దేవనదియైన నర్మద, ఆ పురుషసింహునిపై అనురాగవతియై అతనిని వివాహమాడింది. ఆ కారణంగా వారికి సుందరియైన కన్య జన్మించింది. ఆమె పేరు సుదర్శిని. రాజకుమార్తె అయిన సుదర్శినిపై సాక్షాత్తూ అగ్నిదేవుడే ఆసక్తుడైనాడు. బ్రాహ్మణ వేషంలో వచ్చి, రాజును ఒప్పించి, ఆమెను వివాహమాడాడు. రూపవతి, శారీరక శోభను చూచి ప్రసన్నుడై, అగ్నిదేవుడు గర్భదానం చేశాడు. వారికి జన్మించిన వాని పేరు సుదర్శనుడు. బాల్యదశలోనే అతనికి బ్రహ్మజ్ఞానం అబ్బింది. ఆరోజుల్లో ఓధవానుడనే రాజుండేవాడు. అతనికి దేవకన్యలాంటి సుందరియైన ఓధవతి అను కూతురుండేది.

ఓధవానుడు తన కుమార్తె ఓధవతిని సుదర్శనునికిచ్చి వివాహం చేశాడు. సుదర్శనుడు ఓధవతితో బాటు కురుక్షేత్రంలో ఉంటూ, గృహస్థ ధర్మాన్ని పాటిస్తూ, కాలం గడుపుతున్నాడు. అతడు బుద్ధిమంతుడే కాదు, తేజశ్శాలి కూడ. అతడు తన మనస్సులో ఇలా ప్రతిజ్ఞ చేసుకొన్నాడు 'నేను గృహస్థ జీవితంలో ఉన్నా కూడా మృత్యువును జయిస్తాను.' అని.

ఒకరోజు భార్యయైన ఓధవతితో ఇలా అన్నాడు. 'కళ్యాణీ! నీవెపుడైనా అతిథి కోరికకు విరుద్ధంగా వ్యవహరించకూడదు. అతిథి ఏది కోరినా, సంతోషంగా ఇవ్వాలి. ఒకవేళ శరీరము త్యాగం చేయాల్సిన అగత్యం వచ్చినా, మనస్సులో ఏ ఇతర ఆలోచనలకు తావు ఇవ్వకూడదు.ఎందుకంటే గృహస్థులకు అతిథి సేవ కంటే మించిన ధర్మం ఏదీ లేదు. నా ఈ మాట నీకు శిరోధార్యమైన యెడల ఈ మాటను గుర్తుపెట్టుకో.' ఓధవతి 'ప్రాణనాథా! మీరు ఆజ్ఞాపించిన ప్రతి కార్యం నేను శిరసా వహిస్తాను.' అని మాట ఇచ్చింది.

ఆ తరువాత ఒకరోజు అగ్నిదేవుని పుత్రుడైన సుదర్శనుడు సమిధలు తీసుకొని రావటానికి బయటకు వెళ్ళాడు. అదే సమయంలో ఒక బ్రాహ్మణుడు అతిథి రూపంలో వచ్చి, ఓధవతితో ఇలా అన్నాడు. 'ఓ సుందరీ! నీవు గృహస్థోచిత ధర్మాన్ని ఆచరించే దానివైతే, నన్ను సత్కరించు.' ఆ మాట వినగానే రాజకన్యయైన ఓధవతి, ఆసనముపై కూర్చుండబెట్టి పూజించి ఇలా అడిగింది. 'ఓ విప్రవర్యా! మీకు ఏ వస్తువు యొక్క అవసరముంది? మీకేమి కానుక కావలయునో సెలవివ్వండి.' అని ఆ బ్రాహ్మణుని అడిగింది. అందుకు బ్రాహ్మణుడిలా అన్నాడు. 'కళ్యాణీ! నాకు నీతోనే పని ఉంది. ఒకవేళ నీ గృహస్థ ధర్మమునకు నీవు గౌరవం ఆపాదించే పక్షంలో, నీ శరీరమును దానము చేయి. నాకు ప్రియమైన కార్యము చేసి పెట్టు.' అని ఆమెతోఅన్నాడు.

ఓధవతి 'ఇంకేదైనా మీకు ఇష్టమైన వస్తువును కోరుకోండి.' అని ఎంత ప్రాధేయపడినా, ఆ బ్రాహ్మణుడు ఆమె శరీరాన్నే కోరుకున్నాడు. అప్పుడు ఓధవతికి తన భర్త అన్న మాటలు గుర్తుకు వచ్చి, సరేనన్నది.

ఆ తరువాత బ్రాహ్మణుడు చిరునవ్వుతో ఇంటిలోపలికి ప్రవేశించాడు. కాసేపటికి సుదర్శనుడు సమిధలు తీసుకొని వచ్చి, ద్వారం దగ్గర నిలబడి భార్యను ఎలుగెత్తి పిలిచాడు. పదే పదే పిలిచినా ఆ రాజకుమారి పతికి ఏ సమాధానం ఇవ్వలేక పోయింది. అతిథి రూపంలో బ్రాహ్మణుడు తన రెండు చేతులతో స్పృశిస్తూ ఉన్నాడు. కనుక తాను దోషిగా భావిస్తోంది. భార్య ఎదురుగా వచ్చి పలుకరించేది, రాలేదని సుదర్శనుడు మధన పడసాగాడు.

ఆశ్రమంలో కూర్చొని ఉన్న బ్రాహ్మణుడు ఈ మాటలు విని ఇలా సమాధానం ఇచ్చాడు. 'ఓ అగ్నికుమారా! నేను ఒక బ్రాహ్మణుడను. అతిథిగా మీ ఇంటికి వచ్చాను. నీ భార్య నాకు అతిథి సత్కారం చేసి, నా కోరిక తీరుస్తానని మాట ఇచ్చింది. అందుచే నేను ఆమెనే కోరుకొన్నాను. ఆ సుముఖి నా సేవలో ఉంది. ఇప్పుడు నీకేది ఉచితమని తోస్తే, అదే ఆచరించు.' అని పలికాడు.

సుదర్శనుడు నిజానికి తన మనస్సును, వాణిని, నేత్రాలను, ఈర్ష్యను మరియు క్రోధాన్ని త్యాగం చేశాడు. సుదర్శనుడిలా అన్నాడు. 'విప్రవర్యా! మీరు మీ అభిష్ఠసిద్ధిని పొందండి. నేను సంతోషంగానే ఉన్నాను. ఇంటికి వచ్చిన అతిథిని స్వాగతించి, పూజించుట గృహస్థుల ప్రధాన ధర్మం. నా ప్రాణము, నా స్త్రీ మరియు నా దగ్గర ఉన్న సంపద అంతా అతిథి కొరకేనని ప్రతిజ్ఞ చేసి ఉన్నాను.ఈ పృథ్వి, ఈ వాయువు, ఆకాశము, జలము, తేజస్సు, బుద్ధి, ఆత్మ, మనస్సు, కాలము మరియు దిశలు అను ఈ పదిమంది దేవతలు ప్రాణుల శరీరంలో ఉండి సర్వకాల సర్వావస్థలయదు పాపపుణ్యములపై దృష్టి సారించి ఉంటారు.

సుదర్శనుడు ఇలా అనగానే, నాలుగు దిశలు ప్రతిధ్వనించేలా గంభీర స్వరంతో ఆకాశవాణి ఇలా పలికింది – 'నీ కథనం సత్యం, అందులో ఏమాత్రం కూడ అసత్యం లేదు.' ఆ తరువాత అతిథియైన ఆ బ్రాహ్మణుడు ఆశ్రమం నుండి బయటకు వచ్చి, ధీరగంభీర స్వరంతో, ధర్మాత్ముడైన సుదర్శనుని సంబోధిస్తూ ఇలా అన్నాడు. 'ఓ అగ్నికుమరా! నీకు కళ్యాణమగు గాక! నేను ధర్మాన్ని. సత్యపరీక్ష చేయుటకు ఇక్కడకు వచ్చాను. నీవు సత్యవంతుడవు. నీవు తప్పటడుగు వేయగా, నిన్ను మృత్యువు కబళించడానికి నీ వెంట నున్నది. కాని నీవు మృత్యువును జయించావు. అది ఇప్పుడు నీ అధీనంలో వున్నది. ఓ నరశ్రేష్ఠా! నీ భార్య పతివ్రత అయిన సాధ్వి. ముల్లోకాలలో ఏ పురుషుడూ ఈమెను కన్నెత్తి చూడలేడు. బ్రహ్మవాదిని అయిన ఈ స్త్రీ ప్రపంచమును పునీతము కావించుటకు తన అర్ధ శరీరమును ఓధవతి అను శ్రేష్ఠమైన నదిగాను, మరియు మిగతా అర్ధ శరీరంతో నీకు సేవలు చేస్తుంది. నీ శరీరముతో పాటు నీ భార్యను తీసికొని పోయి, నీ తపోబలముతో సనాతన లోకములలో విహరించగలవు. నీ గృహస్థ ధర్మమును ఆచరించు వలననే, నీవు కామక్రోధాలను జయించగలిగావు. రాకుమారి కూడ నీకు చేసిన సేవల ఫలితంగానే ఆసక్తిని, రాగాన్ని, సోమరితనాన్ని, మోహాన్ని మరియు ద్రోహాన్ని జయించింది.' అని చెప్పి అదృశ్యమైనాడు.

భీష్ముడు ఇలా చెప్పాడు. 'ధర్మరాజా! తరువాత దేవరాజు అయిన ఇంద్రుడు ఉత్తమ రథముపై వచ్చి, సుదర్శనుని కలిసి వెళ్ళాడు.

ధర్మరాజు – 'పితామహా! మహాత్ములైన విశ్వామిత్రుడు క్షత్రియుడు అయివుండి కూడా బ్రహ్మర్షి ఎలా అయినాడు?

భీష్ముడు – 'ధర్మరాజా! చెప్తాను. విను. పూర్వకాలం భరతవంశంలో కుశికుడు అన ఇంద్రసముడైన రాజు ఉండేవాడు. కుశికుని కుమారుని పేరు గాధి. గాధి మహారాజుకు సంతానం లేకపోవడంతో అరణ్యంలో యజ్ఞం చేయటం ప్రారంభించాడు. ఆ యజ్ఞం నుండి అతనికి ఒక కన్య లభించింది. ఆమె ప్రపంచంలోనే అనుపమ సుందరి. ఆరోజుల్లో ఉన్న చ్యవన కుమారుడైన ప్రఖ్యాత తపస్వి ఋచీక ముని ఆ కన్య కొరకు రాజును అర్థించాడు.దానికి గాధి ఇలా చెప్పాడు. 'మీరు నాకు కన్యాశుల్కము క్రింద వేయి అశ్వాలను ఇవ్వండి. అవి పున్నమి చంద్రుని కంటె కాంతి గలిగి, వాయువేగము కలిగి మరియు వాటి ఒక చెవి శ్యామవర్ణం కలిగి ఉండాలి.'.

ఇది వినిన ఋచీక ముని వరుణుని వద్దకు వెళ్ళి, 'దేవశ్రేష్ఠా! శ్యామవర్ణంతో ఒక చెవు కలిగి, చంద్రుని సమాన కాంతి కలిగి, వాయువేగం కల వెయ్యి అశ్వాలను నాకు భిక్షగా ప్రసాదించండి.' అని అడిగాడు.

వరుణుడు 'సరే, మంచిది. మీకు ఇష్టమైన ప్రదేశంలో మీరు కోరుకొన్నపుడు అలాంటి అశ్వాలు ప్రకటితమౌతాయి.' అని సమాధానమిచ్చాడు.

ఆ తర్వాత ఋచీకుడు నియమిత స్థలానికి వెళ్ళి అశ్వాలను తలంచాడు. తలంచగానే ఒక వేయి అశ్వాలు కోరినరీతిలో గంగానదినుండి బయటకు వచ్చాయి. ఋచీకుడు సంతోషించి ఆ అశ్వాలను కన్యా శుల్కంగా గాధి మహారాజుకు అప్పగించాడు. వాటిని చూచిన రాజు ఆశ్చర్యంతో సంతోషించి, వెంటనే తన కుమార్తెను ఋచీకునికి ఇచ్చి పెండ్లి జరిపించాడు. సత్యవతి అను ఆ కన్య కూడ బ్రహ్మర్షి అయిన ఋచీకుని భర్తగా పొంది సంతోషించింది. సత్యవతి ప్రవర్తనతో సంతోషించిన ఋచీకుడు వరం ఇవ్వాలని సంకల్పించాడు. రాజకుమారి ఈ విషయాన్ని తన తల్లికి చెప్పింది. అదివిన్న ఆ తల్లి 'బిడ్డా! నీ భర్త నాపై కూడ దయచూపవలసిన వున్నది. అతనితో చెప్పు నాకు కూడ పుత్రుని ప్రదానం చేయమని. ఎందుకంటే అతను గొప్ప తపశ్శాలి. అతడు ఎంతటి ఘనకార్యమైనా చేయగలడు.' తల్లి చెప్పిన మాటలను సత్యవతి తన భర్తతో చెప్పింది. ఆ మాటలు విన్న ఋచీకుడు 'ప్రేయసీ! మీ తల్లికి గుణవంతుడైన పుత్రుడు ప్రాప్తిస్తాడు. అలాగేనీకు కూడ గుణవంతుడైన పుత్రుడు ఉదయిస్తాడు. ఋతుస్నానమైన తరువాత మీ తల్లి రావిచెట్టును, నీవు మేడి చెట్టును కౌగిలించుకోవాలి. దానివల్ల మీ ఇద్దరికి పుత్రసంతానం కలుగుతుంది. మీ ఇద్దరి కొరకు మంత్రపూతమైన యజ్ఞాన్నాన్ని తయారుచేశాను. మొదటిది నీకు, రెండవది మీ తల్లికి అందించు.' అన్నాడు. సత్యవతి ఎంతో సంతోషించి, విషయం తల్లికి చెప్పింది. సత్యవతి తల్లి ఇలా అంది. 'ఓ బిడ్డా! నీ స్వామి అభిమంత్రించి యిచ్చిన యజ్ఞాన్నాన్ని మనం మార్చుకొందాం. అలాగే వృక్షాల కౌగిలింతలు కూడ మార్చుకొందాం.' అన్నది.ఆ ఇద్దరూ అలాగే చేశారు. దానితో వారికి గర్భం కలిగింది. మహర్షి ఋచీకుడు దివ్యదృష్టితో విషయాన్ని గ్రహించి, 'ఓ శుభాంగీ! మీరిద్దరూ మార్చుకొన్నట్లున్నారు. నాకు తెలుస్తోంది. నా యజ్ఞాన్నంతో సంపూర్ణంగా నా బ్రాహ్మణత్వాన్ని ఇమిడ్చి పెట్టాను. అలాగే మీ తల్లి అన్నంలో క్షత్రియ తత్వాన్ని విలీనం చేశాను. మీరు మార్చుకోవడంతో నీకు క్షత్రియుడు, నీ తల్లికి బ్రాహ్మణుడు జన్మిస్తారు. మాతృవాత్సల్యంతో నీవు చేసిన పని సరియైనది కాదు.' అన్నాడు.

తన భర్త మాటలు విన్న సత్యవతి ఎంతో దుఃఖించి, ఆయన పాదాలపై పడింది. 'ఓ బ్రహ్మర్షీ! నేను మీ భార్యను. మిమ్మల్ని ప్రసన్నులుగా చూచుకోవడం నా ధర్మం. నాపై దయచూపి నాకు బ్రాహ్మణ పుత్రుడు కలిగేలా వరం ప్రసాదించండి.' అని వేడుకొంది. తదనంతరం సత్యవతికి జమదగ్ని అను ఉత్తమ కుమారుడు జన్మించాడు.

గాధిరాజు భార్య ఋచీక ముని కృపతో విశ్వామిత్రునికి జన్మనిచ్చింది. విశ్వామిత్రుడు జన్మతః క్షత్రియుడై వుండి కూడ బ్రాహ్మణ ధర్మాన్ని పాటించాడు. విశ్వామిత్రుని యొక్క పుత్రులు తపశ్శాలురు, బ్రహ్మవేత్తలు మరియు ప్రవర్తకులుగా ప్రఖ్యాతి గాంచారు.

విశ్వామిత్రుని పుత్రులలో కొందరి పేర్లు ఇలా ఉన్నాయి. మధుచ్ఛందు, యాజ్ఞవల్క్యుడు, ఉలూకుడు, గాలవుడు, సాలంకాయనుడు, అశ్వలాయనుడు, గార్గ్యుడు, జాబాలి, కపిలుడు మరియు విభూతి.

ధర్మరాజు – 'పితామహా! దయగల భక్తుల గురించి తెలుసుకోవాలని ఉంది.

భీష్ముడు – 'ధర్మరాజా! ప్రాచీన కాలంలో ఒకానొక చిలుక మరియు ఇంద్రుని మధ్య జరిగిన సంభాషణను విందాం.

ఇది కాశీరాజు రాజ్యం చేస్తున్న రోజుల్లో జరిగింది. ఒకసారి ఒక వేటగాడు విషపూరిత బాణాలతో జింకలను వేటాడుటకు వెళ్ళాడు. దట్టమైన అడవిలోనికి వెళ్ళిన తరువాత అటూఇటూ జింకలు కనపడ్డాయి. ఒక జింకకు గురిపెట్టిన బాణము దానికి తగలకుండా, వెళ్ళి ఒక వృక్షకాండంలోనికి వెళ్ళింది. బాణంలోని విషం వల్ల ఆ చెట్టుకు గల ఫలాలు, ఆకులు ఎండిపోసాగాయి. కాలక్రమంలో ఆ చెట్టు మ్రోడువారిపోయింది. ఆ చెట్టుకు ఉన్న ఒక తొఱ్ఱలో ఒక చిలుక నివాసముండేది. ఆ వృక్షం ఎండిపోయినా, ఆ చిలుక చాలకాలం అక్కడే ఉండుటచేత అలాగే ఉండసాగింది. ఆ తొఱ్ఱనుండి బయటకు రాకుండా ఆహారం కూడ మానేసింది. కాలక్రమంలో ఆ చిలుక నీరసించి, కదలికలు లేకుండా ఉండిపోయింది. ధర్మాత్మురాలైన ఆ చిలుక ఆ చెట్టుకు తన కృతజ్ఞతను ప్రకటించుకొనే నిమిత్తం, తన శరీరాన్ని కృశింప చేసుకొంటోంది.

ఆ చిలుక యొక్క ఉదార స్వభావం, ధైర్యం, సుఖదుఃఖాలలో సమదృష్టి చూచిన ఇంద్రునికి ఆశ్చర్యం వేసింది. తరువాత ఇంద్రుడు ఒక బ్రాహ్మణ వేషంలో చిలుక దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. 'ఓ చిలుకా! నేను నిన్ను ఒక మాట అడుగుతాను. ఎండి మోడువారిని ఈ వృక్షాన్ని నీవు ఎందుకు వదిలిపెట్టడం లేదు?'. చిలుక తన తలను వంచి ఇలా అన్నది. 'ఇంద్రా! మీకు స్వాగతము. నేను నా తపోబలంతో మిమ్మల్ని గుర్తుపట్టాను.' అన్నది. ఆ చిలుక భక్తి, జ్ఞానసంపత్తిని మనసులో మెచ్చుకొని ఇలా అడిగాడు. 'ఓ చిలుకా! ఈ చెట్టుపై ఫలములు, ఆకులు, ఇతర పక్షులు లేవు. ఇక్కడ ఇంత అడవి ఉన్నది. ఈ ఎండిన చెట్టునే ఎందుకు అంటిపెట్టుకొని వున్నావు?' చిలుక ఇలా చెప్పింది. 'దేవరాజా! ఇంద్రా! నేను ఈ చెట్టుపైనే జన్మించాను. మంచి గుణములు నేర్చుకొన్నాను. ఈ చెట్టు నన్ను రక్షించింది శత్రువుల నుండి కాపాడింది ఈ వృక్షంపై నాకు భక్తి ఏర్పడింది. దీనిని వదలి ఎక్కడికీ వెళ్ళను. నేను దయారూప ధర్మమును పాటిస్తున్నాను.'

చిలుక మాటలకు ప్రసన్నుడైన ఇంద్రుడు చిలుకను ఏదైన వరాన్ని కోరుకోమన్నాడు. చిలుక 'దేవా! పూర్వంవలె ఈ చెట్టుకు నవనవోన్మేషంగా రూపొందించు.' అని కోరింది. ఇంద్రుడు 'తథాస్తు' అని అన్నాడు.

జనమేజయునితో వైశంపాయనుడు ఇలా చెప్పాడు. 'ఓ జనమేజయా! బుద్ధిలో బృహస్పతి, క్షమలో బ్రహ్మ, పరాక్రమంలో ఇంద్రుడు, తేజస్సులో సూర్యసముడైన భీష్ముడు శరశయ్యపై ఉండి, ధర్మరాజు సందేహాలను తొలగిస్తున్నాడు. ఆ సమయంలో అత్రి, వశిష్ఠుడు, భృగు, పులస్త్యుడు, గౌతముడు, అంగిరా, అగస్త్యుడు, విశ్వామిత్రుడు, బృహస్పతి, శుక్రాచార్యుడు, వ్యాసుడు, చ్యవనుడు, కశ్యపుడు, ధృవుడు, దుర్వాసుడు, జమదగ్ని, మార్కండేయుడు, భరద్వాజుడు, కణ్వుడు, నారదుడు, ధౌమ్యుడు, పరశురాముడు మరియు కచుడు మొదలైన

దివ్య మహర్షులందరు భీష్ముని దర్శనం కోరి వచ్చారు.

ధర్మరాజు తన సోదరులతో పాటు, వారినందరిని పూజించి, సుఖాసీనులను గావించాడు. వారు భీష్మ సంబంధిత అనేక విశేషాలు చెప్పి, భీష్మున్ని ఆనందింపచేసి అదృశ్యమైపోయారు.

ధర్మరాజు ఇలా అడిగాడు – 'పితామహా! ఏ దేశము, ఏ ప్రాంతాలు, ఏ ఆశ్రమాలు, ఏయే పర్వతాలు, ఏయే నదులు శ్రేష్ఠమైనవో చెప్పండి. వింటాను.'

భీష్ముడు ఇలా చెప్పాడు. 'ఈ విషయంలో ఒక ప్రాచీన ఇతిహాసం చెప్తాను. విను.'

ఒక సిద్ధపురుషుడు అనేకసార్లు ప్రపంచాన్ని చుట్టివచ్చి, ఒకసారి ఒక శ్రేష్ఠుడైన గృహస్థు ఇంటికి చేరాడు. ఆ గృహస్థుడు ఈ సిద్ధపురుషునికి సకల మర్యాదలు చేసి పూజించగా ప్రసన్నుడై, ఆ ఇంట్లోనే విశ్రాంతి తీసుకొన్నాడు. మరునాడు ఉదయం, వారు వేదాంత విషయక చర్చల్లో ఉండగా, గృహస్థ బ్రాహ్మణుడు 'ఏయే దేశాలు, జనపదాలు, ఆశ్రమాలు, పర్వతాలు, నదులు సర్వోతమైనాయో చెప్పండి.' అని ఆ సిద్ధపురుషుని అడిగాడు.

సిద్ధుడు ఇలా అన్నాడు. 'ఓ బ్రాహ్మణోత్తమా! ఏ దేశముల నుండి, జనపదముల నుండి, ఏ పర్వతాల నుండి గంగానది ప్రవహిస్తుంటుందో, అవి అత్యంత శ్రేష్ఠవంతమైనవిగా పరిగణించబడ్డాయి. గంగానదిని సేవించుట ద్వారా, తపస్సు, బ్రహ్మచర్యము, యజ్ఞాలు మరియు త్యాగము ద్వారా లభించు ఉత్తమగతుల కంటె మిక్కిలిగా లభిస్తాయి. ఏ దేహధారుడైతే గంగాస్నానం చేస్తాడో, ఎవరి అస్థికలు గంగలో కలుపుతారో, అటువంటివారు స్వర్గస్థాయినుండి దిగువకు రారు. జీవితంలోఎవరైతే పాపకార్యములు చేసి వుంటారో, వారు కూడ గంగాస్నానంలతో ఉత్తమ గతిని ప్రాప్తించుకొంటారు.

ఎంతకాలం మానవుడి అస్థికలు గంగానదిలో ఉంటాయో, అంతకాలం అతడు స్వర్గంలో ఉంటాడు. గంగానది లేని దేశము శోభించదు. ఒంటికాలి మీద 1000 సం॥లు తపస్సు చేసిన తాపసి, ఒక నెల పాటు గంగాస్నానం చేసిన పురుషునితో సమానమవుతాడో లేదో సందేహాస్పదమే. ఏవిధంగా బ్రహ్మలోకం అన్ని లోకములకంటె శ్రేష్ఠమైనదో, అదేవిధంగా గంగానది అన్ని నదులలోనూ శ్రేష్ఠమైనది.

దుఃఖంలో మునిగి మరణ సమయం ఆసన్నమైన వారు కూడ, గంగానది దర్శనం చేత ఆయువు పెంచుకొంటారు. ఎవరైతే గగానది మహత్తును వింటారో, అక్కడికి వెళ్ళి దర్శనం చేసుకుంటారో, ఆ జలం త్రాగుతారో, స్పర్శిస్తారో, ఆ గంగలో మునుగుతారో, వారందరు ఉద్ధరింపబడతారు.' అని చెప్పాడు సిద్ధ పురుషుడు. 'ఓ గృహస్థ బ్రాహ్మణుడా! గంగానది యొక్క సంపూర్ణ గుణముల గురించి చెప్పగల శక్తి నాకు లేదు.' అని కూడా అన్నాడు.

భీష్ముడు ఇలా అన్నాడు. 'ధర్మరాజా! ఈ విషయాలు చెప్పి సిద్ధపురుషుడు అక్కడినుండి వెళ్ళిపోయాడు.'

వైశంపాయనుడు ఇలా చెప్పాడు. 'ఓ జనమేజయా! భీష్ముని ద్వారా చెప్పబడిన ఈ వృత్తాంతంతో ధర్మరాజు సంతోషించాడు.'

ధర్మరాజు – 'పితామహా! క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఏ విధంగా బ్రాహ్మణత్వం పొందవచ్చునో తెలుపుతారా?'

భీష్ముడు – 'నాయనా! ఈ మూడు వర్ణాల వారు బ్రాహ్మణత్వం పొందటం అంత సులువైన విషయం కాదు. చాల కఠినమైన విషయం.'

ధర్మరాజు – 'తాతగారూ! విశ్వామిత్రుడు క్షత్రియుడైనా బ్రాహ్మణత్వం పొందాడని మీరే చెప్పారు. అలాగే వీతహవ్యుడను రాజు బ్రాహ్మణత్వాన్ని పొందాడని విన్నాం. ఆ విషయాలు తెలియజేస్తారా?

వీతహవ్యుడు ఎలా బ్రాహ్మణత్వాన్ని పొందాడో చెపుతాను, విను.

పూర్వకాలంలో వీతహవ్యుడను రాజుకు పదిమంది భార్యలున్నారు. వారి ద్వారా వందమంది పుత్రులు ఉదయించారు. వారందరు శూరవీరులే. ఆ రోజుల్లో హర్యశ్వుడను రాజు ఉండేవాడు. వీతహవ్యుని కుమారులు అతనిపై యుద్ధం చేసి, ఆ రాజును చంపేశారు. ఆ తర్వాత హర్యశ్వుని కుమారుడు సుదేవుడు రాజ్యం చేపట్టబోగా, అతనిని కూడ వీరు చంపేశారు. ఆ తరువాత సుదేవుని కుమారుడు దివోదాసు రాజైనాడు. మహా తేజస్వియైన దివోదాసు వీతహవ్యుని కుమారుల పరాక్రమ విశేషలను తెలుసుకొన్నవాడై, ఇంద్రుని సాయంతో వారణాసి అనే పట్టణాన్ని నిర్మించాడు. అది ఇంద్రుని యొక్క అమరావతి వలె శోభిస్తోంది. అపుడు వీతహవ్యుని కుమారులు వారణాసిపై దండెత్తారు.

మహాబలశాలియైన దివోదాసు వారినందరిని ఎదుర్కొన్నాడు. వీరిద్దరి మధ్య వెయ్యిరోజులు పోరు కొనసాగింది. చివరకు దివోదాసు ఓడిపోయే స్థితికి చేరుకున్నాడు. అశక్తుడై యుద్ధం నుండి పారిపోయి భరద్వాజుని శరణు వేడుకొన్నాడు. బృహస్పతి కుమారుడైన భరద్వాజుడు దివోదాసు యొక్క పురోహితునిగా వున్నాడు. భరద్వాజుడు 'రాజా! విషయం పూర్తిగా చెప్పండి. మీకు ఇష్టమైన కార్యం చేస్తాను.' అన్నాడు.

రాజు – 'దేవా! వీతహవ్యుని కుమారులు నా రాజ్యాన్ని ఆక్రమించారు. నేను పదవీచ్యుతడనై, మీ శరణు కోరియున్నాను.'

భరద్వాజుడు – 'రాజా! నీవేమీ భయపడవద్దు. నేను ఒక యజ్ఞం చేస్తాను. నీకు పుత్ర ప్రాప్తి కలుగుతుంది. అతడు వీతహవ్యుని కుమారులను జయించగలడు.'

అలా అనిన భరద్వాజుడు రాజు కొరకు యజ్ఞం చేశాడు. దానితో రాజుకు ఒక కుమారుడు జన్మించాడు. అతడు ప్రతర్ధనుడను పేరుతో వర్ధిల్లాడు. ప్రతర్ధనుడు జన్మించిన కొద్ది కాలంలోనే పెరిగిపోయి, సంపూర్ణ వేదాలు మరియు ధనుర్వేదం జీర్ణించుకొన్నాడు. భరద్వాజ ముని అతని శరీరంలో యోగశక్తిని నింపి, తేజస్సును పూరించాడు. ఆ తరువాత ప్రతర్ధనుడు వీతహవ్యుని కుమారులందరిని చంపుటకు బయలుదేరాడు. ఇద్దరి మధ్య జరిగిన భీకర పోరులో, ప్రతర్ధనుడు చాకచక్యంతో ఆ వీరుల నందరిని చంపివేశాడు. వారి సైన్యాన్ని కూడ పారద్రోలాడు. వీతహవ్యుడు పోయి భృగు మహర్షిని ఆశ్రయించాడు. ఋషి అభయమిచ్చాడు. వీతహవ్యుని వెంటాడుతూ వచ్చిన ప్రతర్ధనుడు భృగుమహర్షితో తన శత్రువును అప్పగించాలని కోరాడు. ఇక్కడ క్షత్రియులు ఎవరూ లేరని చెప్పాడు భృగుమహర్షి. భృగు మహర్షి సత్యవాది. కనుక ఆయన మాటలు విని ప్రతర్ధనుడు 'దేవా! నాకు విషయం అర్థమైంది. నా పరాక్రమానికి జడిసి వీతహవ్యుడు తన జాతిని త్యాగం చేయవలసి వచ్చింది. ఇక నేను వెళ్తాను' అని చెప్పి వెళ్ళిపోయాడు. ఇలా, భృగుమహర్షి యొక్క వచన మాత్రముననే, వీతహవ్యుడు బ్రాహ్మణత్వాన్ని సంపాదించుకొన్నాడు.

ధర్మరాజు – 'పితామహా! ప్రాణులను రక్షించుటచే ఎలాంటి ఫలితము ప్రాప్తిస్తుందో తెలుపండి.'

భీష్ముడు – 'శరణాగత రక్షణ వలన గొప్ప ఫలితం లభిస్తుంది.

గతంలోనూ చక్రవర్తులలో శిబి చక్రవర్తి వంటివాడు మరొకడుండడు, ఆయనకు ఆయనే సాటి. శిబి తల్లి పేరు మాధవి, తండ్రి పేరు ఉశీనరుడు. ఉశీనర రాజ్యానికి రాజు. శిబి అజాతశత్రుడని పేరుపొందిన చక్రవర్తి. అతని దానగుణం విని ఇంద్రుడు అతనిని పరీక్షించ దలచాడు. తాను డేగరూపం దాల్చగా, అగ్నిదేవుడు పావురంగా మారి శిబి చక్రవర్తి యజ్ఞంచేస్తున్న సభాస్థలికి వెళ్ళి ఆయన ఒడిలో వ్రాలాడు. మానవ భాషలో శిబితో 'రాజా! నన్ను తరుముకు వస్తున్న డేగనుండి కాపాడండి.' అన్నాడు. అంతలో అక్కడికి వచ్చిన డేగ, 'రాజా! ఈ పావురం ఈరోజు నాకు ఆహారంగా దొరికింది. దాన్ని నాకు వదలిపెట్టు. నాకు తీరని ఆకలిగా వుంది. ఆ పావురాన్ని తిని ఆకలి తీర్చుకుంటా'నని మానవ భాషలో పలికింది. అపుడు శిబి 'నీవు ధర్మాధర్మాలు తెలిసినదానవుగా వున్నావు. ప్రాణరక్షణ కోసం నన్ను శరణు కోరిన పావురాన్ని విడిచి, వేరే ఆహారం వెదుక్కో' అన్నాడు. కాని డేగ తన నోటిముందు ఆహారాన్ని తనకు దక్కకుండా చేయవద్దంది. అందుకు శిబి అంగీకరించకపోయేసరికి, డేగ శిబి శరీరంలో పావురం బరువుకు తగ్గ మాంసాన్ని ఇవ్వమని అడిగింది. సరేనని శిబి తన కుడి తొడలోని కొంత మాంసాన్ని ఒక త్రాసులో ఒకవైపు కోసి వుంచాడు. రెండవ వైపు పావురాన్ని వుంచగా అది తూగలేదు. మరికొంత మాంసాన్ని వేశాడు. కాని త్రాసు తూగలేదు. అప్పుడు తన శరీరాన్ని పూర్తిగా త్రాసులో వుంచాడు. అదిచూచిన ఇంద్రుడు, అగ్ని తమ నిజరూపాలను ధరించి, ఆయన దానగుణాన్ని వేనోళ్ళ పొగిడి, ఆయనకు వరాలిచ్చి, ఆయన శరీరాన్ని యధాతథంగా మార్చి, వారిని దీవించి వెళ్ళారు. ఆ విధంగా శిబి చక్రవర్తి శరణాగత రక్షకునిగా మరింత పేరు సంపాదించాడు." అని చెప్పాడు.

ధర్మరాజు – 'పితామహా! ఈ ప్రపంచంలో తరుణీ స్త్రీల రక్షణ ఎలా చేయాల్సి ఉంది? చంచలమైన స్త్రీల రక్షణ సాధ్యమా? తెలుపండి.'

భీష్ముడు – 'ధర్మరాజా! నీవడిగిన విషయాలను గురించి, ఒక ప్రాచీన వృత్తాంతం చెపుతాను, విను. మహాత్ముడైన విపులుడు గురుపత్నిని ఎలా రక్షించాడో చెపుతాను. నిజానికి తరుణ వయస్సులో నున్న స్త్రీలు జ్వలించే అగ్నిసమానులు, కత్తియొక్క పదును, విషసర్పము మరియు అగ్ని ఒక వైపు పెట్టి మరొకవైపు స్త్రీని తూచవచ్చును.

పూర్వకాలంలో దేవశర్మ అను ప్రసిద్ధమైన మరియు సౌభాగ్యశాలియైన ఋషి ఉండేవాడు. అతని భార్య పేరు రుచి. అద్వితీయ సౌందర్యవతి. ఆమె అందాన్ని చూచిన దేవతలు, గంధర్వులు, అసురులు మైమరచిపోయేవారు. ఇంద్రుడు ఆమెపై మిక్కిలి ఆసక్తి చూపుతున్నాడు. దేవశర్మకు స్త్రీల స్వభావం గురించి బాగా తెలుసు అందుచేత అతను తన భార్యను గురించి ప్రత్యేక శ్రద్ధ, జాగ్రత్తలు తీసికొనేవాడు.

మహాముని దేవశర్మకు యజ్ఞం చేయాలని ఆలోచన వచ్చింది. ఇలా ఆలోచించసాగాడు. 'నేను యజ్ఞ నిర్వహణలో నిమగ్నుడనైతే, నేను నా స్త్రీ రక్షణ ఎలా చేయాలి?' అని ఆలోచించి, ఆలోచించి, తన ప్రియ శిష్యుడైన భృగు గోత్రంలో జన్మించిన విపులుని పిలిచి, 'నాయనా! నేను యజ్ఞం చేయబోతున్నాను. నా భార్య రుచి రక్షణ బాధ్యత నీదే' అని చెప్పాడు. 'నీవు చాల జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఆమె పొందు కోసం ఇప్పటికే ఇంద్రుడు ఎదురుచూస్తున్నాడు, మాయావి అయిన ఇంద్రుడు ఏదో రూపంలో వచ్చి, సంగమించేందుకు

తీవ్ర ప్రయత్నం చేయగలడు. కనుక నీవు చాల జాగ్రత్తగా కనిపెట్టి ఉండాలి.' అన్నాడు.

విపులుడు జితేంద్రియుడు, తపస్వి, ధార్మికుడు మరియు సత్యవాది. గురువుగారి ఆజ్ఞను మన్నించాడు. విపులుడు గురువును ఇలా అడిగాడు. 'మునివర్యా! ఇంద్రుడు ఏ రూపంలో రావచ్చు, రంగు, తేజస్సు ఏ స్థితిలో వుంటాయి? మీరు వివరించ గలరా!' అపుడు దేవశర్మ 'ఇంద్రుడు మహా మాయావి, ఎన్నెన్ని రూపాలు మారుస్తుంటాడో చెప్పలేము. ఒక్కోసారి తలపై కిరీటము, చేతిలో వజ్రాయుధం మరియు ధనుస్సుతో, చెవులకు కుండలాలు, మరియొకసారి మరీ నిమ్నజాతివాని లాగ మారిపోతాడు. ఒక్కోసారి ఆజానుబాహువుగా మరొకసారి దుర్బలుడుగా, శరీరం రంగులు కూడ అనేకంగా మారుస్తుంటాడు. అనేక వయస్సుల్లోనూ కన్పిస్తాడు. పక్షుల రూపంలో కూడ చిలుకగా, సింహంగా, కాకిగా, కోయిలగా ఇంకా ఏనుగుగా ప్రకటితమౌతుంటాడు. ఈగగా, దోమగా కూడ మారటానికి సంకోచించడు. సృష్టికర్త పరమాత్మ కూడ ఇతన్ని కట్టుబాటులో ఉంచలేక పోతున్నాడు. ఇంద్రుని మనం జ్ఞానదృష్టితోనే చూడగలం. ఇలాంటి నక్కజిత్తులమారి ఇంద్రుని నీవు కనిపెట్టి ఉంటూ, నా భార్యను రక్షించాలి. ఆ ఇంద్రునకు అంశమైన పర స్త్రీల మీద వ్యామోహం మెండు. నీవు సావధానుడవై ఉంటేనే ఆమె రక్షించబడ గలదు.' ఇలా అన్ని జాగ్రత్తలుచెప్పి, దేవశర్మ యజ్ఞం చేసేందుకు వెళ్ళిపోయాడు.

విపులుడు గురువు భార్యను రక్షించు నిమిత్తం బహు సావధానుడై కళ్ళల్లో వత్తులు పెట్టుకుని గమనిస్తూ ఉన్నాడు. అయినా తృప్తి కలుగలేదు. పరిపరి విధాల ఆలోచించ సాగాడు. ఇంద్రుడు మాయావే కాదు పరాక్రమవంతుడు, దుడుకు స్వభావి కూడ. ఆశ్రమం తలుపులు వేసినంత మాత్రాన అతనిని ఆపలేము. వాయురూపంలో వచ్చి అరాచకాన్ని సృష్టించగల దిట్ట. నా బలంతో నేను ఇంద్రుని ఆపలేను. కనుక నేను రుచి యొక్క శరీరంలో ప్రవేశిస్తాను. నా యోగబలంతోనే నేను గురుపత్నిని రక్షించగలను. ఆమె అవయవములలోనికి నా సూక్ష్మ శరీరాలు ప్రవేశిస్తాయి. ఇలా నేను ఒక ఆశ్చర్యకరమైన కార్యం చేయగలను. తామరాకు మీది నీటిబొట్టు వలె నిర్లిప్త భావంతో గురుపత్ని శరీరంలో నివశిస్తాను. నేను రజోగుణ ముక్తుణ్ణి. కనుక నావల్ల ఏ అపచారం జరుగదు. ఒక బాటసారి ధర్మశాలలో ఆశ్రయం పొందినట్లు, నేను ఆమె శరీరంలో నివసిస్తాను. ఈ విధంగా ధర్మపరంగా, వేదశాస్త్రాల అంశాల పరంగా, గురువు తపోబలము మనసులో ఉంచుకొని, ఈ నిర్ణయానికి వచ్చాడు విపులుడు.

ఈ నిర్ణయాన్ని కార్యాచరణలో దింపుటకు, విపులుడు రుచి దగ్గరకు వెళ్ళి, తన నేత్ర కిరణాలను ఆమె నేత్ర కిరణాలలో కలిపి, అదే మార్గం ద్వారా రుచి శరీరంలోకి ప్రవేశించాడు. ఛాయలాగ ప్రవేశించి, నిశ్చేష్టుడై ఉన్నాడు. ఇలా ఆమెను రక్షించుటకు స్థిరమనస్కుడైనాడు.

ఇంద్రుడు రుచిని ప్రాప్తించుకోవటానికి ఇదే మంచి సమయమని భావించుకొని, మహాసుందరిగా ఆశ్రమంలోకి ప్రవేశించాడు. ఆమె శరీరంలో విపులుడు నిశ్చేష్టుడై పడి ఉండటం, సేతువులా స్థిరంగా ఉండటం చూచాడు. మరొకవైపు రుచి ంద్రముఖిలా కూర్చొని ఉండటం చూచాడు.

రుచి ఇంద్రుని అందాన్ని చూచి, ఆశ్చర్యపడి, లేచి నిల్చుందామనుకొన్నది. 'నీవెవరు' అని అడుగుదామనుకొన్నది. దీన్నంతా గమనిస్తున్న విపులుడు రుచిని కదలనీకుండా చేశాడు. అపుడు ఇంద్రుడు రుచి నుద్దేశించి, 'ఓ సుందరీ! నేను దేవతల రాజును. నీ కొరకే ఇంద దూరం వచ్చాను. నిన్ను స్మరించటం చేత కామదేవుడు నన్ను బాధపెడుతున్నాడు. అందుకని నీ దగ్గరకు వచ్చాను. ఇంక ఆలస్యం చేయకు, సమయం గడుస్తోంది' అనిన మాటల్ని విపులుడు ఆమెలో వున్నాడు కనుక విన్నాడు.

ఇంద్రుని చూచాడు. విపులునిచే స్తంభించబడిన రుచి ఇంద్రుని మాటలకు ఏ సమాధానం ఇవ్వలేకపోయింది. రుచి మనోభావాల్ని గమనించిన విపులుడు తన యోగమహిమ చేత ఆమెను నియంత్రణలో పెట్టి, ఆమె సమస్త ఇంద్రియాలను కట్టడిచేసి బంధించాడు. రుచి విపులుని యోగ మహిమతో నిర్వికారంగా ఉండటం చూచి ఇంద్రుడు నిరాశపడ్డాడు. ఇలా అన్నాడు. 'సుందరీ! రమ్ము, రమ్ము' అనగానే ఇంద్రునికి అనుకూలమైన సమాధానం ఇచ్చే ప్రయత్నంలో ఉండగా, విపులుడు ఆమె స్వరంలో మార్పులు చేశాడు. ఆమె నోటినుండి అప్రయత్నంగా 'నే నచటికి రావలసిన అవసరమేమున్నది?' పారవశ్యంతో ఉన్న రుచి నోటివెంట అప్రయత్నంగా వెలువడిన మాటలకు తనకు తాను బాధపడ్డది. ఇంద్రుడు కూడ ఉదాసీనుడైనాడు. ఇంద్రుడు ఆమె వైపు దివ్యదృష్టితో చూచాడు. ఆమెలోని భావపరివర్తనను గమనించాడు. ఆమె శరీరంలో విపుల ముని కూర్చొని వుండటం కూడ చూచాడు. ఆమ శరీరంలో విపుల ముని తపస్సులో స్థితుడై ఉండటం చూచి ఇంద్రుడు తొట్రుపడ్డాడు. శాపప్రమాదమును శంకించాడు. విపులుడు గురుపత్ని శరీరము విడిచిపెట్టి, ఇంద్రునితో ఇలా అన్నాడు.'ఓ పాపీ! ఇంద్రా! ఇంద్రియలోలుడా! నీ ఆటలు ఎక్కువ కాలం సాగవు. గౌతమ మహర్షి నీ శరీరం నిండా భగచిహ్నాలుపెట్టి, నిన్ను ప్రాణాలతో విడిచిపెట్టిన విషయం మరచావా? చంచల మనస్కుడా! నా తేజంతో నిన్ను భస్మం చేయగలను. వెంటనే వెళ్ళిపో. నా గురువు నిన్ను చూచాడంటే, అతని దృష్టిలో నీవు మసైపోతావు.' అని గద్దించాడు. అపుడు ఇంద్రుడు సిగ్గుపడి, అక్కడినుండి అదృశ్యుడైనాడు.

అదే సమయంలో దేవశర్మ వచ్చి విషయం తెలుసుకొని, విపులుని మెచ్చుకొంటూ, వరము కోరుకోమన్నాడు. 'నా మనస్సు ధర్మము నుండి విచలితము కాకుండునట్లు వరమివ్వండి' అని కోరాడు. ఆ తరువాత విపులుడు తపస్సులో మునిగిపోయాడు.

ధర్మరాజా! విపులుడు గురువు పత్నిని రక్షించటం, తపస్సు చేయుట ద్వారా ఇలా అనుకోసాగాడు. 'నేను రెండు లోకాలు జయించాను.' కొంత సమయం తర్వాత ఒక రోజు ఒక దివ్యలోక సుందరి, మనోహరంగా అలంకరించుకొని ఆకాశమార్గాన వెళుతోంది. ఆమె శరీరం నుండి దివ్య సుగంధభరిత సుందర పుష్పాలు దేవశర్మ ఆశ్రమంపై నుండి నేలపై పడ్డాయి. అక్కడనే ఉన్న రుచి ఆ పుష్పాలను తీసికొంది. రుచి సోదరి ప్రభావతి అంగరాజైన చిత్రరథుని వివాహం చేసుకొంది. ప్రభావతి ఆహ్వానించగా, రుచి ఆ పుష్పాలను అలంకరించుకొని వెళ్ళింది. ఆ పరిమళ భరిత దివ్యపుష్పాలకు పరవశురాలైన ప్రభావతి తనకు కూడ అటువంటి పుష్పాలను తెప్పించి యివ్వమని కోరింది. ఆశ్రమానికి వచ్చిన రుచి తన సోదరి కోరికను భర్తకు చెప్పింది. దేవశర్మ విపులుని పిలిచి అటువంటి సుగంధభరిత పుష్పాలను స్వర్గంనుంచి తెమ్మని చెప్పాడు. మహాతపస్వియైన విపులుడు అటువంటి సుగంధభరిత పుష్పాలను తీసికొని వచ్చుటకు సిద్ధపడ్డాడు.

ముందుగా, అంతకుముందు ఆశ్రమం సమీపంలో స్త్రీలు వచ్చిన చోటికి విపులుడు వెళ్ళాడు. అక్కడ మరికొన్ని పూలున్నాయి. అవి ఇంకను విరబూసే వున్నాయి. విపులుడు సంతోషపడి ఆ పూలు తీసికొని పోతుండగా, ఒక చెట్టు క్రింద తగవులాడుకొంటున్న స్త్రీపురుషులను చూచాడు.

వారిద్దరూ ఇలా శపథం చేస్తున్నారు. 'మన ఇద్దరిలో ఎవరు అసత్యం పలికి ఉంటే, వారికి పరలోకంలో విపులునికి పట్టిన దుర్గతి పట్టుగాక!' ఆ తరువాత ఒక చెట్టు క్రింద ఆరుగురు సభ్యులు బంగారు పాచికలతో జూదం ఆడుతూ కనిపించారు. వారుకూడ అదే శపథం చేసికొని, ఆడుతున్నారు. అపుడు విపులుడు తనను గురించే లక్షించి ఎందుకు వీరు ఇలా ఆడుతున్నారని, తన జీవితాన్ని అవలోకనం చేయసాగాడు. కాని ఎక్కడా

తాను పాపము చేసినట్లుగా కనిపించలేదు. అందుచేత అతడు కలతపడసాగాడు. చివరకు ఈ మధ్య జరిగిన ఉదంతం గుర్తుకు వచ్చి, అందులో పాపము కలిగి ఉండెనా అని తలంచాడు. ఆమెను రక్షించుటకు మాత్రమే, నేను ఇంద్రియములను ఆమె ఇంద్రియములలో ప్రవేశపెట్టాను. కాని ఈ విషయం గురువుకు చెప్పకుండా దాచిపెట్టాను.'

భీష్ముడు – 'ధర్మరాజ! విపులుడు రుచిని సంపూర్ణంగా ఆవహించుటయే పాపము కాబోలు అని తలంచాడు. నిజానికి అదియే పాపముగా పరిణమించినది.'

విపులుడు తెచ్చిన పూలను గురువుకు అర్పించి, గురువుకు పూజ చేశాడు. ఆ పిదప దేవశర్మ విపులుని మార్గమధ్యంలో నీవు ఏమి చూచావు అని అడిగాడు. విపులుడు ఇలా చెప్పాడు. 'బ్రహ్మర్షీ! గురూ! ఒకచోట నేను ఒక స్త్రీని, ఒక పురుషుని చూచాను. ఆ తర్వాత ఆరుగురు పురుషులు పాచికల ఆట చూచాను. నాకు వారెవరో తెలియదు కాని వారు నన్ను ఎరిగినట్లు మాట్లడుకొన్నారు.'

దేవశర్మ ఇలా అన్నాడు. 'విపులా! నీవు ఏ స్త్రీపురుషులను చూచావో వారిని దివారాత్రములంటారు. పాచికలాడే ఆరుగురు పురుషులు ఆరు ఋతువులుగా భావించాలి. వారు కూడ నీవు చేసిన పాపాన్ని చూచారు. ఏ మానవుడైనా ఏకాంతంలో రహస్యంగా చేస్తున్న పాపాలను ఈ దివారాత్రాలు, ఋతువులు చూస్తూనే ఉంటాయి. నీవు చేసిన పాపకార్యాన్ని గురువైన నాతో చెప్పకుండా దాచావు. ఈ విషయాన్ని గురించే వారు అలా మాట్లాడారు. దివము, రాత్రి, ఆరు ఋతువులు సర్వకాల సర్వావస్థలయందు మానవులు పాపపుణ్యములన తెలుసుకొంటూనే, చూస్తూనే ఉంటాయి.

నీవు చేసిన పనిని నీవు నాకు చెప్పలేదు. కావున నీకు పాపకర్మ చేసినవారికి దక్కే పరలోకం నీకు దక్కేది. ఏ తరుణీ స్త్రీనైనను పాపకార్యము నుండి రక్షించుట నీ వశములో లేదు. అయినా, నీవేమి పాపం చేయలేదు. అందుచే నీపట్ల ప్రసన్ననిగా ఉన్నాను. నీ దురాచారము నేను చూచి ఉంటే నిన్ను శంకించేవాడను. కాని యథాశక్తి నీవు నా భార్యను రక్షించావు. అందుకే నేను సంతోషంగా ఉన్నాను. నీవు సుఖంగా స్వర్గానికి వెళ్ళవచ్చును.' అని విపులునితో దేవశర్మ ఈ విషయాన్ని చెప్పి, ప్రసన్న చిత్తంతో తాను భార్యతో సహా మరియు తన ప్రియ శిష్యునితో సహా స్వర్గానికి వెళ్ళాడు.

ధర్మరాజు – 'పితామహా! గోవుల మహిను గురించి చెప్తారా?

భీష్ముడు ఇలా చెప్పాడు. 'ధర్మరాజా! పూర్వకాలంలో భృగు వంశంలో జన్మించిన చ్యవన మహర్షి ఒక వ్రతం చేయ సంకల్పించి, నీటిలో ఉండటం ప్రారంభించాడు. కోపాన్ని, అహాన్ని, శోకాన్ని వదలి 12 సంవత్సరములు అలాగే జలంలో ఉన్నాడు. గంగ, యమున సంగమంలో అలాగే స్థిరంగా ఉన్నాడు. ఆ నదుల జలాలు అతనికి ఏ శ్రమ కలుగచేయకుండా, అతనిని పరిక్రమిస్తూ, ప్రవహిస్తున్నాయి. మహర్షికి ఇందువలన జలచరములతో సాన్నిహిత్యం హెచ్చింది.

ఒకసారి ఒక మత్స్యకారుడు చేపలు పట్టేందుకు వల విసరగా, చేపలతో పాటు, మహర్షి కూడ అందులో చిక్కుకున్నాడు. తన వలన తప్పు జరిగిందని, మహర్షిని చూచిన, వేటగాడు సాగిలబడి నమస్కరించాడు. అపుడు చ్యవన మహర్షి ఇలా అన్నాడు. 'నీటినుండి బయటకు వచ్చిన ఈ చేపలు బ్రతికితేనే, నేనూ బ్రతికి ఉంటాను. లేనిచో నేను ప్రాణాన్ని వదులుతాను.' ఈ మాటలు విన్న మత్స్యకారుడు భయపడి, రాజుయైన నహుషునికి ఈ

విషయం అంతా చెప్పాడు. విషయం తెలుసుకొని, నహుషుడు పురోహితుని తీసికొని, చ్యవన మహర్షి వద్దకు వచ్చాడు.

నహుషుడు మహర్షికి నమస్కరించి, పూజాదికాలు నిర్వహించి ఇలా అన్నాడు – 'విప్రవర్యా! మీకు ప్రియమైన ఎటువంటి పని చేయమందురో సెలవియ్యండి'.

చ్యవన మహర్షి 'రాజా! ఈ చేపలు పట్టేవారు ఎంతో కష్టపడ్డారు. వారికి నా యొక్కయు, ఈ చేపల యొక్కయు విలువ కట్టి ఇవ్వండి.' అని అన్నాడు.

నహుషుడు వెంటవున్న పురోహితునితో – 'దేవా! చ్యవన మహర్షి చెప్పినట్లు, ఈ చేపలవానికి ఒక వెయ్యి బంగారు నాణేలు ఇవ్వండి.' అన్నాడు.

వెంటనే చ్యవనుడు 'రాజా! వేయి నాణేలు సరియైన విలువ కాదు. కొంచెం సముచితంగా ఇవ్వండి.' అన్నాడు. నహుషుడు పురోహితునితో లక్ష బంగారు నాణేలు ఇవ్వమని చెప్పి, చ్యవన మహర్షితో 'సరిపోయాయా మహర్షీ! లేక ఇంకా ఎక్కువ కావాలా?' అని అడిగాడు. అపుడు చ్యవనుడు 'రాజా! నా విలువ లక్ష నాణేలు అని నిర్ణయించకండి. మీ మంత్రులతో ఆలోచించి, నిర్ణయం తీసికోండి.' అని అన్నాడు. నహుషుడు 'ఒక కోటి నాణేలు ఇవ్వండి, అవసరమైతే ఇంకా ఎక్కువ ఇవ్వండి.' అన్నాడు.

చ్యవనుడు 'రాజా! ఒక కోటి అంతకు ఎక్కువ నాణేలు సరిపోవు. మీరు బ్రాహ్మణులతో ఆలోచించి నిర్ణయం తీసికోండి.' అని అన్నాడు. నహుషుడు 'విప్రవర్యా! అలాగైతే నా అర్ధరాజ్యం తీసికొని, చేపల వేటగాళ్ళకివ్వండి. ఇదే సరియైన మూల్యమని భావిస్తాను.' అని చెప్పగా, చ్యవనుడు 'రాజా! నీ అర్ధరాజ్యం, పూర్తి రాజ్యం సరితూగదు. మీరు ఋషులతో ఆలోచించి నిర్ణయం తీసికోండి.' అని అన్నాడు.

అపుడు భీష్ముడు ధర్మరాజుతో – 'ధర్మరాజా! మహర్షి చెప్పిన మాటలకు నహుషుడు ఎంతో దిగులుపడి మంత్రిపురోహితులతో సమాలోచన చేయసాగాడు.అంతలో ఒక వనవాసియైన ముని రాజు దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. 'మహరాజా! ఆ ఋషిని సంతోష పెట్టే ఉపాయం నీ దగ్గర ఉంది. నేను అతనికి త్వరగానే నచ్చచెపుతాను.' నహుషుడు – 'ఓ మహర్షీ! చ్యవన మునికి ఎంత మూల్యం చెల్లించాలో చెప్పి, నాకు సాయం చేయండి.' అని కోరాడు.

భీష్ముడు ఇంకా ఇలా చెప్పాడు. 'నహుషుని మాటలు వినిన ముని, రాజును, మంత్రులను ఉద్దేశించి ఇలా అన్నాడు. 'మహారాజా! బ్రాహ్మణులు అన్ని వర్ణాల్లో కెల్లా ఉత్తములు. వారికి దానంచేసే గోవులకు వెలకట్ట లేము. అందుచేత అతని విలువలో భాగంగా ఒక గోవును ఇవ్వండి.' వెంటనే నహుషుడు మంత్రులు, పురోహితులతో పాటు చ్యవన ముని వద్దకు వెళ్ళాడు. 'బ్రహ్మర్షీ! ఈ ఆవును మీకిచ్చి, మీ మూల్యం చెల్లించాను. ఇది మీకు తగిన మూల్యమని భావిస్తాను. ఇక లేవండి.' చ్యవనుడు 'రాజా! నేను లేస్తాను. నాకు తగిన మూల్యం ఇచ్చి, నన్ను కొన్నారు. ఈ ప్రపంచంలో గోదానాన్ని మించిన దానం ఏదియు లేదు. గోవులను కీర్తించుట, దానం చేయుట, గుణములను వినుట మున్నగునవి శ్రేష్ఠమైనవి. గోవులు పాపాలను నశింపచేస్తాయి. లక్ష్మీ స్వరూపమైనవి. మానవులకు అన్నము ఇచ్చి, దేవతలకు హవిస్సును అందించునవి గోవులే. 'స్వాహా' ప్రతిష్ఠితమై ఉండేది గోవులోనే. యజ్ఞాల యొక్క ముఖము గోవు. పాలు అమృతం. స్వర్గానికి మెట్లలాంటివి గోవులు. గోవును

గురించి పూర్తిగా చెప్పటం మానవతరం కాదు.' అపుడు చేపలు పట్టేవాడు ఇలా అన్నాడు. 'ఋషీశ్వరా! ఈ గోవును తీసికోండి. మమ్మల్ని కూడ ఉద్ధరించండి.' చ్యవనుడిట్లన్నాడు – 'మీరు చెప్పినట్లే నేను ఈ గోవును తీసికొంటాను. ఈ గోదాన ప్రభావంతో మీరు, మీ చేపలతోబాటు స్వర్గానికి వెళ్ళండి'.

భీష్ముడు ఇలా అన్నాడు. 'ధర్మరాజా! చ్యవన ముని ప్రభావం వల్ల జాలరులు స్వర్గానికి వెళ్ళుట చూచి, నహుషుడు ఆశ్చర్యపడ్డాడు. చ్యవనుడు నహుషుని వరం కోరుకోమన్నాడు. తన మనస్సును ధర్మమునందు స్థితమై ఉండునట్లు వరం కోరుకొన్నాడు నహుషుడు. 'తథాస్తు' అన్నాడు చ్యవన ముని.

'ఈ రాజభవనము మొదలు అన్నీ మీవి ఆనే భావించండి. మీరే రాజు అనుకొని పాలించండి. నేను మీ ఆజ్ఞలను శిరసా వహించే సేవకుణ్ణి మాత్రమే' అన్నాడు నహుషుడు. చ్యవనుడు సంతసించి 'ఓ రాజా! నాకు రాజ్యం, గోవుల మీద ఆసక్తి లేదు. నా మాట విను. మీరిద్దరు అనుసరించి ఉంటానంటే, నేనొక నియమం ప్రారంభించ బోతున్నాను. మీరు సావధానంగా నా సేవ చేస్తూ ఉండాలి.' అన్నాడు.

నహుషుడు భార్యాసమేతంగా చ్యవన ముని నియమాలన్నీ అంగీకరించి, మహర్షిని రాజ మహలు లోని ఒక అందమైన గదిలోకి తీసికొని వెళ్ళి ఇలా అన్నాడు. 'ఓ తపోధనా! ఇక్కడ పడక ఉన్నది. మీరు విశ్రాంతి తీసికోండి. మేము మా శక్తి మేరకు మిమ్మల్ని సంతోషింప చేయటానికి ప్రయత్నిస్తాం.' ఇలా ఉండగా, సూర్యాస్తమైంది. అన్నపానాదులు తెమ్మని మహర్షి ఆదేశించాడు. రాజు వెళ్ళి అప్పటికే సిద్ధంగా వున్న ఆహారమును తీసికొని వచ్చాడు, అర్పించాడు. మహర్షి భోజనం చేసి ఇలా అన్నాడు. 'నాకు నిద్ర వస్తోంది. నేను పడుకొంటాను. మీరిద్దరు మెళుకువగా ఉండి సర్వకాల సర్వావస్థల యందు నా కాళ్ళు వత్తుతూ ఉండాలి.' ఆ విధంగా మహర్షి 21 రోజులు పడుకొని ఉన్నాడు. రాజదంపతులు నిద్రాహారాలు మానుకొని, మహర్షి సేవ చేస్తూ ఉన్నారు. సేవలో ఆనందంగా ఉన్నారు.

ఇరువది రెండవ రోజున మహర్షి నిద్ర లేచి, మహలు నుండి బయటకు వెళ్ళిపోయాడు. రాజదంపతులు చిక్కిశల్యమై కూడ మహర్షిని అనుసరించారు. మహర్షి వారి వైపు చూడకుండానే, కొంతసేపటిలో అదృశ్యమై పోయాడు. రాజ దంపతులకు దిక్కు తోచలేదు. ముని కొరకు వెదకి వెదకి చివరక రాజ దంపతులు రాజ మహలుకు వచ్చారు. వచ్చి చూడగా చ్యవన మహర్షి తన పడక మీద పడుకొని ఉండటం చూచి ఆశ్చర్య చకితులైనారు. మామూలుగానే మునికి సేవచేస్తూ ఉన్నారు అక్కడనే. మహాముని మళ్ళీ 21 రోజులు పడుకొని నిద్ర లేచాడు. రాజ దంపతులు విపరీతంగా అలసిపోయి వున్నారు. వారితో మహర్షి ఇలా అన్నాడు. 'ఇప్పుడు నేను స్నానం చేస్తాను. నా శరీరానికి నూనెతో మర్ధన చేయండి.' అన్నాడు. రాజదంపతులకు ఏమాత్రం శక్తి లేకపోయినా వారు ముని శరీరానికి నూనెతో మర్ధన చేయసాగారు. మహర్షి మర్ధన పూర్తి చేసుకొని, స్నానాగారానికి వెళ్ళి, అక్కడనే అదృశ్యమైనాడ. తిరిగి స్నానం చేసి, ప్రత్యక్షమైనాడు. రాజ దంపతులు సంతోషించి 'దేవా! భోజనం సిద్ధంగా ఉంది. అని చెప్పగా, ముని తీసికొని రమ్మన్నాడు. వనవాసులు తీసికొనే భోజనాన్ని తెచ్చిపెట్టారు. మహర్షి ఆ భోజనాన్ని, శయ్యపై ఉన్న వస్త్రాలను మూటగా కట్టి తగుల బెట్టాడు. వెంటనే అంతర్ధానమయ్యాడు. అయినా రాజదంపతులు మౌనంగా అక్కడే ఉన్నారు. ఆ తర్వాత మహర్షి ప్రత్యక్షమై తాను రథంలో కూర్చుంటానని, ఆ రథాన్ని మీరు లాగండి అని వారితో అన్నాడు. రథంమీద వీథుల్లో వెళ్ళేటప్పుడు పంచటానికి ధనం, తన చేతికి ఒక కొరడా ఇవ్వమని ఆదేశించాడు.

పాపం, రాజ దంపతులు అవన్నీ సమకూర్చి, కొరడా దెబ్బలు తింటూ, రథం లాగుతూ వున్నారు. పురజనులు కూడ భయంతో ఉన్నారు శాపభయంతో.

భీష్ముడిలా అన్నాడు. 'ధర్మరాజా! రాజ దంపతులలో ఏమాత్రం లోపమనేది లేకపోయినా చ్యవన మహర్షి వారిని ముక్తులుగా చేసి, ఆశీర్వదించగానే, వారి గాయాలన్నీ మాయమైపోయాయి. అప్పుడు మహర్షి ఇలా అన్నాడు. 'రాజా! నీ పట్ల నేను ప్రసన్నుడ నైనాను. నేను ఈ గంగాతీరంలో నా వ్రతం కొనసాగిస్తాను. వీరు మెళ్ళి భోజనం చేసి, విశ్రాంతి తీసుకొని రేపు రండి.'

భీష్ముడు ఇంకా ఇలా చెప్పాడు. 'ధర్మరాజా! చ్యవనుడు మరురోజు భార్యతో కలిసి చ్యవన మహర్షి తపోవనానికి వెళ్ళాడు. అక్కడ ఆశ్చర్యమైన అద్భుత కట్టడాన్ని చూచాడు. అది బంగారుతో నిర్మించి, రత్నాలతో తాపడం జరిగి, గంధర్వ నగరాన్ని మించి ఉంది. అంతేకాదు, వెండి శిఖరాలు, కమల పుష్పాలతో సరోవరాలు, చిత్రశాలలతో శోభిల్లుతోంది. మామిడి, జాజి, విరజాజి, మల్లె, మొల్ల, సంపంగి, చేమంతి, గులాబి, బంతి మున్నగు వాటితో చెట్లు విరబూసి వున్నాయి. వివిధ వర్ణాలతో, అందమైన భవనాలు ఎన్నో ఉన్నాయి. వాటినన్నింటిని చూచిన రాజు తన మనస్సులో ఇది కలయా, యదార్ధమా అని పరిపరివిధాల ఆలోచించసాగాడు.

ఇలా ఆలోచిస్తున్నంతలో, అల్లంత దూరాన రాజుకు చ్యవనుడు కనిపించాడు. ఆ మహర్షి విమానములో దివ్యమైన శయ్యపై పడుకొని వున్నాడు. రాజు, రాణి ఆ దృశ్యాన్ని చూచి, ఆనందంతో మహర్షి దగ్గరకు వెళ్ళారు. అంతలోనే మహర్షి శయ్యతో సహా అదృశ్యమై పోయాడు. అచటి అందాలు, అద్భుతాలు కూడ మాయమైపోయాయి. రాజు మహర్షిని వెదకగా, మహర్షి ఒక కుశాసనంపై మహాద్భుతం చేస్తూ జపంలో కనిపించాడు. అపుడు రాజు భార్యతో 'కళ్యాణీ! చ్యవన ముని దయతో ఆద్భుత దృశ్యాలు చూచాము. తపోబలాన్ని మించినది మరేదీ లేదు. మనస్సులో ఆలోచన రాగానే అది సాక్షాత్కరిస్తోంది. తపస్సే శ్రేష్ఠమైనది. తపశ్శక్తితో మోక్షం కూడ లభిస్తుంది. చ్యవన ముని ప్రభావం అమోఘం, శ్లాఘనీయం.'

ఆ తరువాత చ్యవనుడు రాజును చూచి, దగ్గరకు పిలిచి, ఇలా అన్నాడు. 'రాజా! నీవు అయిదు జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను, మనస్సును జయించావు. నీవు నన్ను ఆరాధిస్తూ, ఏ అపరాధం లేకుండా సేవలు చేశావు. నేనిక వెళ్ళిపోవటానికి, సిద్ధమవుతున్నాను. ఏదైన వరము కోరుకో' అని అనగానే రాజు 'మహర్షీ! మీరు నా పట్ల ప్రసన్నులైనందుకు సంతోషిస్తున్నాను. ఇంతకు మించిన వరము లేదు. దయచేసి, నాకున్న కొన్ని సందేహాలను తీర్చండి. మీరు ఏ ప్రయోజనము కోరి నావద్ద వున్నారు. చిత్రవిచిత్రంగా వ్యవహరించారు. ఈ అద్భుత వ్యవహారాలు మీరు నడిపించుటకు కారణమేమి?' చ్యవన మహర్షి ఇలా చెప్పాడు. 'రాజా! నేను మీ దగ్గరకు ఎందుకు వచ్చానో చెపుతాను. విను. పూర్వం ఒక రోజు దేవతల సభలో బ్రహ్మ ఇలా అన్నాడు.

'భృగు వంశపు కన్య ద్వారా బ్రాహ్మణులలో క్షత్రియ వంశపు తేజస్సు సంచరించదు.' దాన్ని నిరర్ధకం చేయటానికి, మీ వంశమును నాశనం చేయటానికి నేను వచ్చాను. మీ దంపతుల వల్ల ఏ అపరాధమూ జరుగలేదు. మీకు కోపం తెప్పించాలని చిత్రవిచిత్ర కార్యాలను చేశాను. ఆఖరుకు మిమ్ములను కొరడా దెబ్బలు కొట్టి, మీచేత రథం లాగించాను. అయినను మీ ఓర్పు నశించ లేదు. అందుచేత, మీకు గంగానదీ తీరంలో ఇలా స్వర్గాంశ చూపించాను. నిజానికి బ్రాహ్మణుడగుట దుర్లభం. ఋషి అవటం మరీ దుర్లభం. తపస్వి అవటం ఇంకా దుర్లభం. ఇప్పుడు నీ మనోభిలాష ప్రకారం వరం కోరుకో. నేను తీర్థయాత్రలకు వెళ్ళిపోవాలి.'.

నహుషుడిలా అడిగాడు. 'మునివర్యా! నా పౌత్రుడు బ్రాహ్మణుడు ఎలా అవుతాడో చెప్పండి.' చ్యవనుడు ఇలా అన్నాడు. 'ఓ నరశ్రేష్ఠా! మీ వంశంలో జన్మించిన ఋచీకుడను వాడు ధనుర్వేదంలో నిష్ణాతుడై, అందులో తన కుమారుడైన జమదగ్నికి శిక్షణ ఇస్తాడు. జమదగ్ని మీ వంశంలోని గాధి కుమార్తెను, నీ మనవరాలిని పెళ్ళి చేసుకొని, క్షత్రియ ధర్మము ఆచరించి, మరియు బ్రాహ్మణ ధర్మము పాటించి, బృహస్పతి యొక్క తేజస్సును సంతరించుకొని విశ్వామిత్రుని కుమారునిగా పొందుతాడు. ఈ విధంగా బ్రాహ్మణ కులంలో క్షత్రియుడు, క్షత్రియ కులంలో బ్రాహ్మణుడు ఉత్పన్నమగుటకు ఇద్దరు స్త్రీలు కారకులవుతారు. ఇదంతా బ్రహ్మ ప్రేరణచే జరుగుతుంది.'

భీష్ముడిలా అన్నాడు. 'ధర్మరాజా! చ్యవన మహర్షి మళ్ళీ రాజును వరము కోరుకోమన్నాడు. రాజు 'మునివర్యా! మా కులంలో బ్రాహ్మణులు ఉద్భవించునట్లు చూడుము.' అని కోరాడు. మహర్షి సరే అని అన్నాడు. తత్ఫలితంగా, పరశురాముడు, విశ్వామిత్రుడు జన్మించారు.'

ధర్మరాజు – 'పితామహా! ఏ దానము చేయుట వలన దాతకు పుణ్యం లభిస్తుంది?'

భీష్ముడు ఇలా చెప్పాడు. 'ధర్మరాజా! సంపూర్ణ జీవులకు అభయదానం చేయాలి, ఆపదలో వున్నవారికి దయను దానం చేయాలి, కోరిన వస్తువులను దానం చేయాలి. మరియు దప్పిక అయినవారికి జలదానం చేయాలి. అయినను, సువర్ణదానం, భూదానం మరియు గోదానం పవిత్ర దానములని చెప్పబడుతున్నాయి. వీటితో దాత తెలిసి గాని, తెలియక గాని చేసిన అన్ని పాపములు నశించిపోతాయి.

ఎదుటివారి యోగ్యతను బట్టి ఆలోచించి దానం చేయాలి. అడిగి దానం తీసుకొని చెడు అలవాట్లకు ఖర్చు పెట్టే వారిని గమనించి దానం నిర్ణయించాలి. కుమారా! అన్ని దానముల కంటె భూదాన మహిమ గొప్పది. భూమి అచలము మరియు అక్షయమై ఉంది. మానవుని అన్ని కార్యములను నిర్వహిస్తుంది. వస్త్రాలు, రత్నాలు, పశువులు, ధాన్యం మొదలైనవన్నీ పృథ్వినుండే ఉత్పన్నమౌతున్నాయి.

భూదానం చేసిన వ్యక్తి దీర్ఘకాలం సమృద్ధశాలియై, సుఖాన్ని అనుభవిస్తాడు. భూదానం చేసిన వ్యక్తి కీర్తి ఇనుమడిస్తూనే ఉంటుంది. ఈ ప్రపంచంలో భూదానాన్ని మించినది మరియొకటి లేదు. ఎవరైతే భూదానం చేస్తారో, వారు మరుజన్మలో భూస్వాములుగా జన్మిస్తారు. ధర్మశాస్త్రం ప్రకారం మానవుడు ఏ దానం చేస్తే అలాంటి ఫలితమే లభిస్తుంది. పరమ పవిత్రమైన బావిని దానం చేసిన వ్యక్తి దానిచేత అక్షయ లోకాల్ని ప్రాప్తించుకొంటాడు. భూదానమునకు సమానమైన దానము, తల్లికి సమానమైన గురువు, సత్యమునకు సమానమైన ధర్మము, దానమునకు సరియైన ధనాగారము ఈ లోకంలో లేనే లేదు.

సువర్ణదాన మహిమ: సాధారణంగా పాపంచేసిన వ్యక్తి భూదానం, గోదానం, ధనదానం చేసిన యెడల పాప విముక్తుడు కాగలడు. కాని సువర్ణ దానము ఎంతో పవిత్రమైనది. దాని ఉనికి, ఆకార, ప్రకారాలు ఎంతో దివ్యమై అద్భుతంగా ఉంటాయి.

పూర్వకాలంలో అగ్నిదేవుడు అన్ని లోకములను భస్మీపటలం చేసి, తన వీర్యము చేత సువర్ణాన్ని ఉత్పన్నం చేశాడు. కనుక అలాటి సువర్ణాన్ని దానం చేస్తే కోరికలన్నీ నెరవేరుతాయి. జగత్తంతటిని చిలికి ఏ తేజోరాశిని ఉద్భవింపచేశారో అదియే సువర్ణం. అన్ని రత్నాల్లో సువర్ణం ఉత్తమమైంది. అందుచేతనే, దేవతలు, గంధర్వులు, రాక్షసులు, నాగులు, పిశాచులు, మానవులు ప్రయత్నం చేసి సువర్ణాన్ని ధరిస్తుంటారు. ప్రపంచంలోని అన్ని

పవిత్రమైన వస్తువులలో కెల్ల అతి పవిత్రమైంది సువర్ణం. భూమి, ఆవు మరియు రత్నం కంటె సువర్ణం ఉత్తమ మైంది. పై రెండు దానాల వలె గోదానం కూడ ప్రశస్తమైంది. దీనిని గురించి మన్ముందు విశదీకరిస్తాను.'

ధర్మరాజు – 'పితామహా! మీరు ఏ వ్రతము చేయువారిని పూజిస్తారు?

భీష్ముడు– 'ధర్మరాజా! మహావ్రతధారియైన శ్రీకృష్ణ భగవానుని పూజ చేయుట వలన ఎన్నో లాభాల్ని పొందాను. మున్ముందు, మీకేమైనా సందేహాలుంటే శ్రీకృష్ణ భగవానుని అడిగి తెలుసుకోండి. నేనిప్పుడు క్రమంగా అంతిమ దశకు చేరుకొంటున్నాను.'

శ్రీకృష్ణ భగవానుడు మాత్రమే ఈ భూమిని, ఆకాశాన్ని, స్వర్గాన్ని సృష్టించాడు. భయంకరమైన వరాహావతార మెత్తాడు. ఈ పురాణపురుషుడే పర్వతాలను, దిశలను ఉత్పన్నం చేశాడు. అంతరిక్షం, స్వర్గం, నాలుగు దిశలు మరియు నాలుగు కోశాలు ఇవన్నీ శ్రీకృష్ణ భగవానుని కంటె ఉన్నతమైనవి కావు. అతడే ప్రాచీన విశ్వాన్ని సృష్టించాడు. సృష్టి ఆరంభంలో ఆయన నాభినుండే కమలం ఉత్పన్నమైంది. అందులోనుండి అత్యంత తేజశ్శాలి యైన బ్రహ్మ పుట్టాడు. సమస్త జీవరాశి ఆయననుండే ఉద్భవించింది.

ఎప్పుడైతే ధర్మం నశిస్తుందో, అప్పుడు శ్రీకృష్ణుడు తగిన అవతారమెత్తి అధర్మమును నశింపజేసి, ధర్మాన్ని స్థాపిస్తాడు. అతడే విశ్వకర్మ. విశ్వరూపుడు, విశ్వ భోక్త, విశ్వవిధాత మరియు విశ్వ విజేత. ఆయనే ఒక చేతిలో త్రిశూలం, రెండవ చేతిలో రక్తసిక్తమైన పుఱ్ఱె పట్టుకొని, భయంకరంగా కనిపిస్తాడు. శ్రీకృష్ణుని అందరూ ప్రశంసిస్తారు. వందలాది గంధర్వులు, అప్సరసలు మరియు దేవతలు సర్వకాల సర్వావస్థలలోను అతని సేవలో ఉపస్థితులై వుంటారు. యజ్ఞాల్లో స్తుతించేది ఆయన్నే. అతడే వాయువు, సూర్యుడు, చంద్రుడు. సమస్త రాజులను జయించింది ఆయనే. ముల్లోకాలను పాలించేది ఆయనే. ఉత్తర దక్షిణాయనాలు ఆయన మార్గాలే. శ్రీకృష్ణుడే సర్వలోకాలన ధరించి ఉన్నాడు. అతడే అద్వితీయమైన పురాతన ఋషి అనబడుచున్నాడు. సంవత్సరాలు, ఋతువులు, పక్షములు, దివారాత్రాలు అన్నీ శ్రీకృష్ణుని స్వరూపాలే. ఈ ప్రపంచంలో జన్మించే ప్రతి ప్రాణి యొక్క కారకుడు మరియు అవినాశియైన పరమాత్ముడు శ్రీకృష్ణ భగవానుడేనని తెలుసుకో.

ధర్మరాజు శ్రీకృష్ణుని వైపు తిరిగి – 'ఓ శ్రీకృష్ణా! భీష్మ పితామహుడు మీ గురించి సమ్మోహనమైన విషయాలు చెప్పారు. కాని ప్రస్తుతం మీద్వారా శంకరుని గురించి తెలుసుకోవాలని ఇష్టపడుతున్నాను.'

శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు. – 'ధర్మరాజా! భీష్ముడు నన్ను గురించి చెప్పినవన్నీ సత్యాలే. నీవు కోరావు కనుక శంకర భగవానుని మహిమల గురించి చెపుతాను, విను.

పండితులైనవారు మహాదేవుని అగ్ని అని, స్థాణువు అని, మహేశ్వరుడని, ఏకాక్షుడని, త్రయంబకుడని, విశ్వరూపుడని మరియు శివుడని అనేక పేర్లతో పిలుస్తారు. కాని వేదాలలో ఇతనికి రెండు స్వరూపాలున్నాయి. ఒకటి భయంకరమైనది, రెండవది (శివం) శుభంకరమైనది అని ముందుగా తెలుసుకోవాలి. ఈ రెండింటిలో కూడ అనేక భేదాలున్నాయి. ఇతని ఘోరరూపంలో భయాన్ని కలిగించే తత్త్వం ఉంది. ఇందులో భాగంగా అగ్ని, విద్యుత్తు మరియు సూర్యుడు మొదలైన అనేక రూపాలున్నాయి. దీనికి భిన్నంగా శివంలో పరమ శాంతమైన, మంగళకరమైన రూపాలుంటాయి. ధర్మము, జలము మరియు చంద్రుడు మున్నగు అనేక రూపాలు, మహాదేవుని అర్ధశరీరం అగ్ని అయితే, మిగతా అర్ధ శరీరం సోమ (చంద్రుడు) అంటారు. ఆయనలో ఉన్న శివం బ్రహ్మచర్యాన్ని

పాటిస్తే, భయంకర రూపం జగత్తును సంహరిస్తూ ఉంటుంది. అతనిలో మహిమ మరియు ఈశ్వర తత్త్వం ఉండటం వల్ల మహేశ్వరుడైనాడు. అత్యంత తీక్షణమై, ఉగ్రుడై, ప్రతాపవంతుడై ఉండటం వల్ల రుద్రుడైనాడు. అతను దేవతలలో కెల్ల మహిమాన్వితుడు, జగద్రక్షకుడు అయివున్నాడు. అందుచేత మహాదేవుడని పిలుస్తాం. అన్ని కర్మల ద్వారా అందరి క్షేమాన్ని, ఉన్నతిని పరిరక్షించేవాడు కనుక అతనిని 'శివుడు' అని అంటాం. అతడు ఊర్ధ్వ భాగంలో స్థితుడై, దేహాదుల ప్రాణాలను నాశనం చేస్తుంటాడు. స్థిరముగా ఉన్నాడు కాబట్టి స్థాణువు అయినాడు. అన్ని కాలాలలో అనేక రూపాల్లో ప్రకటితమవుతూ ఉంటాడు కనుక 'బహురూపుడు' అయినాడు. ఆయనలో పరివార దేవతల యొక్క నివాసం ఉంది.

ఆయన నేత్రముల నుండి తేజస్సు అంతం లేకుండా ప్రసారమవుతుంటుంది కనుక 'సహస్రాక్షు'డైనాడు. 'అజితాక్షుడు' మరియు 'సర్వలోకమయుడు' అని కూడ అంటారు. ఆయన అనేక రకములైన పశువులను పరిపాలిస్తుంటాడు. వాటితో పాటే తన సౌఖ్యం అని భావిస్తాడు కనుకనే బుద్ధితో శివలింగాన్ని పూజిస్తే, భక్తులకు సుఖాల్ని ప్రసాదిస్తాడు. శంకర భగవానుడే అగ్నిరూపంలో మృతదేహాలను దగ్ధం చేస్తూ, శ్మశాన భూమిలోనే నివాస ముంటాడు. వేదంలో శతరుద్రీయ ప్రకరణంలో శంకరునికి వందలాది పేర్లున్నాయి. ఈ మహా విశ్వం ఆయన స్వరూపంగా చెప్పబడింది. ఆయన నానా విధ గ్రహబాధల నుండి విముక్తి ప్రసాదిస్తాడు. తనను శరణు కోరిన ఏ భక్తుడినైనా రక్షించగల శరణాగతవత్సలుడు. మానవులకు కావలసిన సర్వసౌభాగ్యాలను, భోగభాగ్యములను ప్రదానం చేసి, మళ్ళా వాటిని లాక్కునే తత్త్వం కలవాడు. సమస్త కోరికలను తీర్చువాడు కనుక ఆయనకు 'మహేశ్వరుడు' అని పేరు వచ్చింది.

ఒక పతివ్రతా స్త్రీ గురించి తెలుసుకొందాం.

ఒకరోజు ధర్మరాజు పతివ్రతా స్త్రీలను గురించి చెప్పమని మార్కండేయ మునిని కోరాడు.

మార్కండేయ మహర్షి ఇలా చెప్పాడు.

"ధర్మరాజా! పూర్వం కౌశికుడు అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు గొప్ప తపస్వి, ధర్మాత్ముడు కూడ. వేదవేదాంగాలు, ఉపనిషత్తులు అధ్యయనం చేసి వున్నాడు. ఒకరోజు కౌశికుడు ఒక చెట్టు క్రింద కూర్చొని వేదపఠనం చేస్తున్న సమయంలో, ఆ చెట్టు మీద కూర్చొన్న కొంగ కౌశికుని మీద రెట్ట వేసింది. మహర్షి ఆ పక్షిని కోపంతో చూడసాగాడు. ఆయన తీవ్రమైన దృష్టితో ఆ పక్షి మలమల మాడి క్రిందపడిపోయింది. దీనిని చూచిన కౌశికుని హృదయంలో కరుణ ఉదయించింది. అతని నోటినుండి అనుకోకుండానే ఈ మాటలు వచ్చాయి. "అయ్యయ్యో! నేను క్రోధమునకు బానిసనై చేయరాని పని చేసితిని కదా!"

ఆ తరువాత కౌశికుడు ఊరిలోనికి భిక్షాటనకు బయలుదేరి, ఒక ఇంటి ముందు నిలబడి, "భవతీ భిక్షాందేహి" అని అడిగాడు. ఆ సమయంలో ఆ ఇల్లాలు పాత్రలు శుభ్రం చేసుకొంటూ ఉంది. 'ఆగండి, ఇప్పుడే వస్తాను' అని చెప్పింది. ఇంతలో ఆమె భర్త అలసిపోయి ఆకలితో ఇంటికి రాగా, ఆమె భర్తకు సేవలు చేస్తూ, భోజనం వడ్డిస్తూ, బయట వేచివున్న కౌశికుని సంగతి మరిచిపోయింది.

పతినే ప్రత్యక్ష దైవంగా భావించే ఆ ఇల్లాలు, భర్త మిగిల్చిన ఆహారాన్నే తాను తిని, ఆయనకు సేవలు చేస్తూ, చటుక్కున బ్రాహ్మణుడు గుర్తుకు వచ్చి, భిక్ష తీసికొని అనుమానంతో బయటకు వచ్చింది.

బయట వేచివున్న కౌశికుడు ఆలస్యం తాళలేక ఆగ్రహంతో ఆ ఇల్లాలిని చూచి 'దేవీ! ఇప్పుడే వస్తాను అని చెప్పిన నీవు ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చావు?' అని అడిగాడు. అపుడు ఆ ఇల్లాలు శాంతంగా "పండితవర్యా! నా పతియే నాకు దైవసమానుడు. నేను ఆయన సేవకు అంకితమై యున్నాను.' అన్నది.

కౌశికుడు కోపంతో 'ఏమంటివి, ఏమంటివి? నీకు ఈ బ్రాహ్మణుని కంటె పతియే గొప్పవాడనుకొంటివా. నీకు బ్రాహ్మణ శక్తియుక్తులు తెలియవు. మేమనుకొంటే ఈ ప్రపంచాన్ని భస్మం చేయగలం తెలుసునా?' అన్నాడు.

అపుడు ఆ ఇల్లాలు ఇలా అన్నది."ఓ తపస్వీ! కోపగించకు. నేనేమి నీ చూపుల తాకిడికి మాడి మసైపోయిన కొక్కెరను కాను. గుడ్లురిమి ఎందుకు చూస్తున్నావు? నేను బ్రాహ్మణులను అవమానించ దలచుకోలేదు. జరిగిన ఆలస్యానికి క్షమించమని కోరుతున్నాను. మొదట మీరు మీ క్రోధాన్ని జయించుకోండి. ఎవరి ధర్మమేమిటో తెలుసుకోవాలనుకంటే, మిథిలా నగరంలో ఉన్న ధర్మవ్యాధుని వద్దకు వెళ్ళంది" అనగా, కౌశికుని కోపం నశించి, శాంతచిత్తుడైనాడు. శుభము కలుగు గాక! అని దీవించి, మిథాలా నగానికి బయలుదేరాడు. తాను భస్మము చేసిన పక్షిని గురించి ఆ ఇల్లాలికి ఎలా తెలిసిందనే విసయం గురించి చింతించ సాగాడు.

కౌశికుడు మిథిలా నగరమునకు చేరి, ధర్మవ్యాధుడున్న స్థలానికి చేరి, మౌనంగా కూర్చొని ఉన్నాడు. అక్కడ ధర్మవ్యాధుడు మాంసం విక్రయిస్తూ కనిపించాడు. కౌశికుని గమనించిన ధర్మవ్యాధుడు, బయటకు వచ్చి, ఆయనకు నమస్కరించి పతివ్రతా శిరోమణి పంపగా వచ్చారు కదా అని చెప్పి, తన ఇంటికి తీసుకొని పోయాడు. దానికీ కౌశికుడు ఆశ్చర్య పడినాడు. మాంసం విక్రయించడం బాధగా వున్నదని కౌశికుడు అనగా, ధర్మవ్యాధుడు ఇలా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా! ఈ కులవృత్తి నాకు అనాదిగా వచ్చింది. ధర్మబద్ధుడనై, నా తల్లిదండ్రులను సేవించుకొంటున్నాను. సత్యమునే పలుకుతాను, యధాశక్తి దానం చేస్తాను." ఆ తరువాత కౌశికుడు అడిగిన అనేకానేక ధర్మసూక్ష్మాలు, తత్త్వవివేచన గురించి ధర్మవ్యాధుడు సవిస్తరంగా వివరించాడు.

తల్లిదండ్రుల యెడల భక్తితాత్పర్యాలు ఎలా ఉండాలో ధర్మవ్యాధుడు ప్రత్యక్షంగా చూపించాడు.

ఆశ్చర్యచకితుడైన కౌశికుడు ఇలా అన్నాడు. "ధర్మవ్యాదా! నీవు శూద్రడవై వుండికూడ బ్రాహ్మణుడవేనని నేను విశ్వసిస్తున్నాను." అని చెప్పి, తృప్తితో తిరిగి వెళ్ళాడు కౌశికుడు.

పరమపవిత్ర స్త్రీధర్మ విచారణ

శ్రీకృష్ణుని కోరిక మేరకు నారద మహర్షి శివపార్వతుల గురించి చెప్తాడు. ఆ తరువాత శివుని కోరిక మేరకు పార్వతి స్త్రీధర్మాన్ని గురించి చెప్పడం మనం భారతంలో గమనించవచ్చు. ఇది ఒక ప్రాముఖ్యమైన విశేషం కావడం చేత ఇక్కడ వివరించడం జరుగుతోంది.

ధర్మరాజు సందేహాలన్నీ భీష్ముడు తీరుస్తాడు. ఒక ముఖ్యమైన, మనోహరమైన ఉదంతం చెప్తానంటాడు భీష్ముడు. ఇలా చెప్పాడు. – "కుమారా! పూర్వం శ్రీకృష్ణుని యొక్క మరియు మహాదేవుని యొక్క ప్రభావం గురించి విన్నాం. అదే విషయాల మీద శివపార్వతుల మధ్య జరిగిన సంవాదం కూడ విన్నాను. అదేమిటంటే శ్రీకృష్ణుడు చాలాకాలం క్రితం అంటే 12 సం॥ల ఒక వ్రతం చేస్తున్నాడు. ఈయన దర్శనార్థం నారదుడు, వ్యాసుడు, ధౌమ్యుడు మరియు కశ్యపుడు మొదలైన ఋషులు, మహాఋషులు శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చారు.

శ్రీకృష్ణుడు వారిని సత్కరించి, ధార్మిక అంశాల మీద చర్చ ముగిసిన తర్వాత "తాపసులారా! మీరు ముల్లోకాల్లో సంచరిస్తూ వుంటారు కదా! ఏదైనా చెప్పుకోదగ్గది, వినదగ్గది అయిన అంశం ఉంటే, నాకు చెప్పండి." అని వారిని అడిగాడు.

అపుడు నారదుడు ఇలా ప్రారంబించాడు. "దేవా! ఎక్కడైతే సిద్ధ చారణులు తిరుగుతుంటారో, అప్సరసలు గుంపులు గుంపులుగా నడుస్తుంటారో, ఎక్కడైతే కరాళనృత్యహేలలు జరుగుతుంటాయో, అలాంటి పరమ పావనమైన హిమాలయ పర్వతం పైన, దేవాధిదేవుడైన శంకరుడు తపస్సు చేస్తుండగా, ఆ సమయంలో పార్వతీదేవి శంకరుని సమీపించి ఇలా అడిగింది : "దేవా! సమస్త భూతములకు మీరు స్వాములు. సమస్త ధర్మవేత్తలలో శ్రేష్ఠులు. కనుక నా సందేహాలను నివృత్తి చేయండి." ఆ విధంగా పార్వతి అడిగిన సర్వధర్మ సూక్ష్మాల్ని విస్తారంగా చెప్పిన శంకరుడు పార్వతి నుండి సమాధానమును వినగోరి ఇలా అన్నాడు. "దేవీ! నీవు అన్నీ తెలుసుకొన్నదానవు. ధర్మతత్వ జ్ఞానం కూడ ఉంది. స్వయంగా ధర్మాచరణ చేయగలవు. కనుక నీనోటి నుండి స్త్రీధర్మాన్ని గురించి వినాలనుకుంటున్నాను." అపుడు పార్వతి ఇలా చెప్పసాగింది. "దేవా! మీరు సకల భూతములకు స్వాములు. మీ ప్రభావం నా వాక్కులో ఆవహించాలని కోరుకొంటున్నాను.

ఇటు చూడండి. ఈ నదులన్నీ తీర్థ స్థలములు జలమును తీసికొని మీ పాదస్పర్శతో మీ సేవకు వస్తున్నాయి. ఈ నదులను సంప్రదించి మీరు కోరినట్లు స్త్రీధర్మము చెప్పటానికి ప్రయత్నిస్తాను. ఇదిగో ఇదే పరమ పవిత్ర సరస్వతీ నది. శ్రేష్ఠమైనది. మరియు సంపూర్ణ తీర్థ జలములతో సుసంపన్నమైన ఈ దేవనది గంగానదియై వున్నది. ఇది ఆకాశం నుండి భూతలానికి దిగివచ్చింది." మహాదేవునితో ఇలా చెప్పిన పార్వతీ దేవి, శ్రేష్ఠమైన నదులతో చిరునవ్వుతో "ఓ నదులారా! శంకర భగవానులు స్త్రీధర్మం గురించి నన్ను చెప్పమంటున్నారు. మిమ్మల్ని సంప్రదించి చెప్తానన్నాను." అన్నది. ఇది విన్న నదులన్నీ తమలో తాము సంప్రదించుకొని గంగానదిని చెప్పమని కోరినాయి. గంగా నది చిరునవ్వులతో పార్వతీదేవితో ఇలా అన్నది."దేవీ! ధర్మానుష్ఠానంతో ఈ జగత్తుకు పూజనీయురాలవైనావు. ఒక నదియైన నన్ను చెప్పమనటంలో నన్ను ఆదరించినట్లైంది. కానీ నీవు దివ్యజ్ఞాన సంపన్నురాలవు. కనుక నీవే మాకు స్త్రీధర్మాన్ని గురించి ఉపదేశించాలి." అపుడు పార్వతీదేవి సంతసించి ఇలా చెప్పసాగింది. "వివాహమునకు పూర్వం వధువుకు స్త్రీధర్మం గురించి చెప్పి అత్తారింటికి పంపుతారు. స్వభావం, మాటతీరు, ఆచరణ ఉత్తమంగా ఉండాలి. భార్యను చూచి భర్త ప్రస్నుడయేలా ఉండాలి. పరపురుషుల యెడ ఆసక్తి ఉండరాదు. తన భర్తను దేవతుల్యుడుగా ఏ స్త్రీ భావిస్తుందో, ఆమె ధర్మఫలంలో భాగస్వామి అవుతుంది. పతిసేవ చేస్తూ, వ్రతపాలన చేస్తూ నియమిత ఆహారం తీసికొంటూ, స్వామిని అపురూపంగా భావించే సాధ్వి స్త్రీధర్మచారిణి అనబడుతుంది. అనురాగంతో ప్రస్న చిత్తంతో, సుందర వేషధారణతో, ప్రసన్న వదనంతో స్వామి అధీనంలో ఎవరైతే ఉంటారో, వారే స్త్రీధర్మచారిణులుగా పిలువబడుతారు. భర్త కోపంతో చూచినా, ఎవరైతే ప్రసన్న చిత్తంతో చిరునవ్వు ముఖంతో వుంటారో వారు పతివ్రత లనబడతారు. భర్త పేదవాడైనా, రోగియైనా, దీనుడైనా సేవచేసిన స్త్రీకి పరిపూర్ణ ధర్మఫలం దక్కుతుంది. ఏ స్త్రీ హృదయం శుద్ధంగా వుంటుందో, గృహకార్యాలను తెలివితేటలతో చేసుకుంటుందో, పతినే తన ప్రాణంగా భావిస్తుందో ఆమె స్త్రీధర్మఫలాల్ని పొందటానికి అర్హురాలవుతుంది. భర్త యెడల తన హృదయంలో ఉన్న అనురాగం స్త్రీకి కామము, భోగము, ఐశ్వర్యము, సుఖమునందు కూడ ఉండదు. ప్రతి దినము దేవతలను పూజించి, అతిథి సత్కారాలు చేసి, అత్తమామల సంరక్షణ

చూచుకొని, ఇంటిలో అందరిని సంతుష్టాంతరంగులుగా చేసిన యెడల, ఆ స్త్రీ నారీధర్మపాలన చేసినట్లవుతుంది. తన తల్లిదండ్రులను కూడ భక్తిశ్రద్ధలతో ఆదరించిన యెడల ఆమె తపస్విని అనబడుతుంది. అలాగే అందరినీ ఆదరిస్తే పతివ్రతాధర్మం లభిస్తుంది. పతియే దేవత, బంధుబాంధవుడు మరియు గతియని భావించినచో, అదియే స్వర్గమనవచ్చును.

ఓ ప్రాణనాథా! మహేశ్వరా! ఏదైనా అవస్థలో యోగ్యము కాని పని చెప్పినను, అధర్మమైనను, ఆత్మత్యాగము చేయమనినను ఆపద్ధర్మంగా భావించి, నిస్సంశయంగా చేస్తాము. దేవా! నాకు తెలిసిన స్త్రీధర్మమును ఇలా చెప్పినాను."

ఇదంతా వినిన మహాదేవుడు హృదయపూర్వకముగా పార్వతీదేవిని ప్రశంసించి, అభినందించి, అక్కడ ఉన్న భూతగణాన్ని నదులను, గంధర్వులను, అప్సరసలను తమ తమ స్థానములకు వెళ్ళుటకు అనుమతించెను.

భీష్ముని ఆదేశం ప్రకారం, ధర్మరాజు పరివారంతో హస్తిన చేరుట గురించి తెలుసుకొందాం.

ధర్మరాజుకు అన్ని రకాల ఉపదేశములు ముగిసిన తర్వాత, అక్కడ వున్న వారందరు మౌనం దాల్చారు. తర్వాత వేదవ్యాసుడు భీష్మునితో ఇలా అన్నాడు. 'నరశ్రేష్ఠా! ఇంతవరకు ధర్మరాజు తన సోదరులతో, రాజులతో మరియు శ్రీకృష్ణ భగవానునితో పాటు మిమ్మల్ని పరివేష్టించి, ప్రస్తుతం శాంతమనస్కుడైనారు. వారు ఇప్పుడు హస్తినకు వెళ్ళుటకు అనుమతి ఇవ్వండి.

వేదవ్యాసుని మాటలు విని భీష్ముడు ధర్మరాజుతో 'నాయనా! ఇక నీవు పరివారంతో కూడి హస్తినకు వెళ్ళు. క్షత్రియ ధర్మం మేరకు సుపరిపాలన సాగించు. ఆ తరువాత సూర్యుడు దక్షిణాయనము పూర్తి చేసుకొని, ఉత్తరాయణములో అడుగు పెట్టగానే, మళ్ళీ నా దగ్గరకు రండి.'

భీష్ముని మాటలు శిరోధార్యంగా భావించి, ధృతరాష్ట్రుడు, గాంధారి, ఋషిగణం, సోదరులు, శ్రీకృష్ణ భగవానుడు మరియు మంత్రులు వెంటరాగా ధర్మరాజు హస్తినాపురంలో ప్రవేశించాడు.

వైశంపాయనుడు ఇలా చెప్పాడు – ధర్మరాజు హస్తినాపురమునకు చేరుకొన్న తర్వాత రాజ్య సింహాసనంపై అభిషేకం చేశారు. ధర్మరాజు ఏబది రోజులు హస్తినాపురంలో వున్న తర్వాత సూర్యుడు దక్షిణాయనం నుండి ఉత్తరాయణానికి వచ్చాడు.

భీష్ముని యొక్క అంతిమ కార్యక్రమం నిమిత్తం, యజ్ఞాలు చేసే బ్రాహ్మణులు, నేయి, మాలలు, సుగంధ పుష్పాలు, పట్టు వస్త్రాలు, చందనం, అగరువత్తులు, అనేక రకాల రత్నాలు, మున్నగు సామగ్రిని పంపించడం జరిగింది. ఆ తరువాత ధర్మరాజు స్వయంగా ధృతరాష్ట్రుని, గాంధారిని, కుంతిని, సోదరులను, శ్రీకృష్ణుని, సాత్యకిని తీసుకొని భీష్ముని వద్దకు బయలుదేరాడు.

వీరందరు భీష్ముని వద్దకు చేరేసరికి, వేదవ్యాసుడు, దేవర్షియైన నారదుడు అక్కడ కూర్చొని వున్నారు. ధర్మరాజు భీష్ముని వద్దకు వెళ్ళి ఇలా అన్నాడు. 'పితామహా! మీ చరణములకు ప్రణామములు ఆచరిస్తున్నాను. మేమందరం మీరు కోరిన విధంగా ఉత్తరాయణం ప్రారంభం కాగానే మీ వద్దకు వచ్చాము. కన్నులు తెరచి చూడండి.' అని ప్రార్థించాడు. భీష్ముడు కళ్ళు తెరచి చూచి, ధర్మరాజు చేతిని పట్టుకొని ఇలా అన్నాడు.

‘నాయనా! నేను ఈ శరశయ్యపై పండుకొని నేటికి 88 రోజులైంది. ఇక నేను శెలవు తీసుకొనవలసిన సమయం ఆసన్నమైంది.’ అని ధృతరాష్ట్రుని కూడ పలకరించి, శ్రీకృష్ణ భగవానునితో వినయంగా ఇలా అన్నాడు. ‘శ్రీకృష్ణా! నీవు దేవతలకే దేవుడవు. వారే కాదు అసురులు కూడ నీ చరణాలకు నమస్కరిస్తారు. ముల్లోకాలను మూడడుగులతో కొలిచిన వాడవు. నీకు ప్రణామములు చేయుచున్నాను. కమలనయనుడవైన ఓ పురుషోత్తమా! ఇక నాకు అనుమతివ్వండి. మీ శరణులో ఉన్న ఈ పాండుపుత్రులను సర్వదా కాపాడండి. దేవా! నీవు నాకు తెలుసు. పురాతన ఋషివైన నారాయణుడవు, నరునితోపాటు చిరకాలం బదరికాశ్రమంలో నివాసముంటూ వచ్చావు. దేవర్షియైన నారదుడు, వేదవ్యాసుడు నాతో ఈ శ్రీకృష్ణార్జునులే నరనారాయణులై ఉన్నారని అన్నారు’.

అపుడు శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. ‘భీష్మా! మీకు అనుమతి ఇస్తున్నాను. మీరు వసులోకమునకు వెళ్ళండి. ఈ లోకంలో మీ ద్వారా అణుమాత్రము కూడ అపసవ్యమైన కార్యములు జరుగలేదు. ఓ రాజర్షీ! మీరు మార్కండేయుని వలె పితృభక్తులు. అందుకే మృత్యువు మీ అధీనంలో ఉంది.’ ఆ తర్వాత భీష్ముడు పాండవులతో మరియు ధృతరాష్ట్రుడాదిగా గల వారందరితో ఇలా అన్నాడు. ‘ఇంక నేను ప్రాణత్యాగం చేయదలచుకొన్నాను. మీరందరు దీనికి అనుమతించండి.’

అంతలో ఏకాదశి ఘడియలు ప్రారంభమైనందున, భీష్ముడు ప్రాణత్యాగం చేయగా, అతని తల్లి గంగాదేవి శోకించడం, శ్రీకృష్ణ భగవానుడు అనునయించడం గురించి తెలుసుకొందాం.

భీష్ముడు యోగక్రియ ద్వారా, తన ప్రాణమును అంతకంతంకు ఎగసిపోవుటకు అనుమతించాడు. ఆ సమయంలో అక్కడ వారందరు ఒక మహాద్భుతమైన, ఆశ్చర్యకరమైన దృశ్యం చూచారు. అక్కడ వున్న సిద్ధులు, వేదవ్యాసుడు మరియు ఇతర మహాత్ములు ఔరా అని అనుకొన్నారు.

భీష్ముడు తన యోగ ప్రక్రియ ద్వారా ఒక్కొక్క అంగమును త్యజిస్తూ, పైకి వెళ్ళిన కొలదీ, ఆయా అంగములలో నాటుకుపోయిన బాణములు నేలపై పడుతూ, ఆ అంగములలోని గాయాలు మానుతూ వున్నాయి. అందరూ కన్నార్పకుండా ఈ దృశ్యాన్ని చూచారు. భీష్ముని శరీరం బాణరహితమై కన్పించింది. భీష్ముడు తన శరీరంలోని అన్ని ద్వారములను బంధించి ప్రాణాన్ని నిలిపాడు. అందుచేత ఆ ప్రాణం అతని తలను ఛేదించుకొని బ్రహ్మరంధ్రం గుండా నింగి కెగిరిపోయింది. ఆ ప్రాణము ఒక ఉల్క వలె ఆకాశమున కెగసి క్షణంలో ఆకాశంలో విలీనమైంది.

ఆ తరువాత, దుంగలతో, సుగంధ ద్రవ్యాలతో, పాండవులు, విదురుడు మరియు యుయుత్సుడు చితిని ఏర్పాటు చేశారు.

ఆ తర్వాత ధర్మరాజు, విదురుడు భీష్ముని భౌతిక కాయాన్ని చితిపైకి చేర్చి, పట్టు వస్త్రాలతో, పూలతో కప్పారు. అనంతరం పాండవులు విధివిహితంగా పితృమేధం చేశారు. పండితులైన బ్రాహ్మణులు సామవేద గానం చేస్తుండగా, ధృతరాష్ట్రుడు గంధపు చెక్కలతో మరియు ఇతర సుగంధిత వస్తువులతో కప్పి, చితికి నిప్పు పెట్టాడు. చితికి ప్రదక్షిణం చేసి, ఋషులు, మునులు మరియు స్త్రీలతో పాటు భాగీరథీ తీరానికి చేరారు. వేదవ్యాసుడు, నారదుడు, శ్రీకృష్ణ భగవానుడు మరియు నగరవాసులు వెంట వెళ్ళారు. అందరూ అక్కడికి చేరి, విధివిహితంగా, మహాత్ముడైన భీష్మునికి జలాంజలి అర్పించారు. ఆ సమయంలో, తన పుత్రుడైన భీష్మునికి

జలాంజలి పూర్తి అయిన తర్వాత భాగీరథీ నదినుండి గంగ నీటిపైకి వచ్చి, శోకంతో ఇలా పలికింది. 'ఓ నా ప్రియపుత్రులారా! నా మాట వింటారా? భీష్ముడు రాజోచిత సదాచారంతో సంపన్నుడై ఉన్నాడు. పవిత్రుడై ఉత్తమ కులంలో జన్మించాడు. తన తండ్రి పట్ల అపార భక్తి కలిగియున్నాడు. గొప్ప వ్రతం తలపెట్టి సఫలీకృతుడైనాడు. పరశురాముని దివ్యాస్త్రాలకు కూడ పరాజితుడు కాలేదు. అంతటి మహాపరాక్రమశాలి శిఖండి చేతిలో ఓడిపోవటమే దుఃఖకరం. కాశీపుర స్వయంవరంలో సమస్త క్షత్రియ రాజులను ఒంటరిగా పోరి గెలిచిన ధీరుడు. ఈయనంతటి శక్తిశాలి ప్రపంచంలోనే లేదు.' అని దుఃఖిస్తున్న ఆమె విలాపం వారందర్నీ కదలించివేసింది. ఆ ఆవేదనాభరిత వాతావరణాన్ని తేలిక పరచుటకు, శ్రీకృష్ణ భగవానుడు గంగను ఓదారుస్తూ ఇలా అన్నాడు.

'ఓ కళ్యాణీ! ధైర్యంగా ఉండు. శోకించవద్దు. నీ కుమారుడు అత్యంత ఉత్తమ లోకాల్ని ప్రాప్తించుకొన్నాడు. అతడు గొప్ప వసువు. వశిష్ట ముని శాపం వల్లనే మానవ జన్మ నెత్తాడు. నీవు శోకించ తగదు. శిఖండి చేతిలో పరాభవం కాలేదు. ప్రారబ్ధ వశాన ఆ పని అర్జునుని చేతిలో జరిగింది. దేవీ! నీ పుత్రుడు చేతిలో ధనుర్బాణాలను ధరించినప్పుడు, ఇంద్రుడు కూడ అతనిని జయించ లేడు. నీ కుమారుని కోరిక మేరకే దేహత్యాగం చేసి వసువు స్వరూపాన్ని పొందాడు. కనుక నీవు చింతించవలసిన పని లేదు.' శ్రీకృష్ణుని ఈ పలుకులు విన్న తర్వాత గంగాదేవి శోకం వీడి నీటిలోనికి వెళ్ళిపోయింది. అందరూ గంగను సత్కరించి, ఆమె అనుమతితో అక్కడినుండి హస్తినకు తిరుగు ప్రయాణమయ్యారు.

-o0o-

14. అశ్వమేధ పర్వం

భీష్మునికి జలాంజలి అర్పించిన తరువాత ధర్మరాజు తొట్రుపాటుతో క్రిందపడిపోయాడు. అన్యుల సహాయంతో లేచి, భీష్ముని గురించి కలవరపడసాగాడు. అదంతా గమనించిన శ్రీకృష్ణుడు, 'రాజా! చనిపోయిన వారిని గురించి ఇంతగా శోకించకూడదు. ఏది ఎలా జరగాలో, అది అలాగే జరిగి తీరుతుంది. జరిగిపోయిన దాని గురించి శోకించతగదు.'

ధర్మరాజు ఇలా అన్నాడు. 'ఓ కృష్ణా! నేను తపోవనానికి పోవాలనుకుంటున్నాను. అనుమతిస్తే, సంతోషిస్తాను.' ధర్మరాజు మాటలకు విసిగిపోయి, వేదవ్యాసుడు 'బిడ్డా! నీ బుద్ధి ఇంకను శుద్ధి కాలేదు. చాపల్యం నిన్ను వీడలేదు. నిన్నటివరకు భీష్ముడు నీకు ఎన్నియో ధర్మసూక్ష్మాలు చెప్పాడు. అయినా యుద్ధంలో చిపోయినవారి బాధ్యత నీదిగా భావిస్తున్నావు. నీవు కుదుట పడాలంటే అశ్వమేధ యాగం చేయి. నీకు మనస్సు స్థిరపడుతుంది.' అని అన్నాడు.

ధర్మరాజు – 'మహర్షీ! అశ్వమేధ యాగం చేస్తే, నేను పవిత్రుణ్ణి అవుతాను. సందేహం లేదు. కాని నా దగ్గర యజ్ఞం చేసేటంత ధనం లేదు.'

వేదవ్యాసుడు ఇలా అన్నాడు. 'ధర్మరాజా! నీకు ధనం లభించే ఉపాయం చెబుతాను. విను.

ప్రాచీన కాలంలో మరుత్తుడనే రాజు ఒక గొప్ప యజ్ఞం చేసి, బ్రాహ్మణులందరికి వారికి కావలసినంత బంగారం తీసికొని వెళ్ళమని వారికి స్వేచ్ఛ నిచ్చాడు. వాళ్ళు మోయగల్గినంత బంగారం తీసికొని వెళ్ళిపోయారు. అయినా ఇంకా మిగిలిపోయిన బంగారపు నిల్వలు నేడు కూడ హిమాలయ పర్వతాలపై నిక్షిప్తమై వున్నాయి. వాటిని తెప్పించుకొని యజ్ఞం చేయి.'

ధర్మరాజు – 'మహర్షీ! మరుత్తుడు ఇంత బంగారాన్ని ఎలా సంపాదించాడు? అతని వృత్తాంతమేమిటి?'

వేదవ్యాసుడు ఇలా చెప్పాడు. 'కుమారా! సత్యయుగంలో వైవస్వత మనువు ప్రసిద్ధి చెందిన రాజుగా వున్నాడు. అతని కుమారులు, మనుమలు వేలాది సంవత్సరాలు పాలన చేశారు. చివరకు త్రేతాయుగ ప్రారంభంలో అవిక్షిత్తుడను రాజు ఇంద్రసమానుడై వెలుగొందాడు. ప్రపంచంలోని రాజులందరు అతని అధీనంలో ఉండేవారు. ఎల్లప్పుడూ యజ్ఞాలు, దానాలు, ధర్మాలు చేస్తూ, జితేంద్రియుడై ఉన్నాడు. అతడు తేజశ్శాలిగా, క్షమాశీలుడుగా, బద్ధిమంతుడుగా ప్రసిద్ధి చెంది స్థిరుడై ఉన్నాడు. తన మనస్సుతో, మాటతో, కర్మతో, మనోనిగ్రహంతో, సంయమనంతో ప్రజల మనస్సులను ఆనందంతో నింపినాడు. అతడు ఒక వంద అశ్వమేధ యాగాలు చేశాడు. సాక్షాత్తూ అంగిరా మునియే వాటిని నిర్వహించేవాడు. అటువంటి వాని కుమారుడే మరుత్తుడు. ఇతడు అన్ని విషయాల్లో తండ్రిని మించినవాడు. అతడు సాక్షాత్తూ రెండవ విష్ణువుగా చెలామణిలో వున్నాడు. యాగం కొరకు బంగారు పాత్రలను చేయించాడు. హిమాలయాలకు ఉత్తర దిక్కున మేరుపర్వతం దగ్గర ఒక గొప్ప సువర్ణమయ పర్వతం ఉంది. అక్కడనే యజ్ఞశాల నిర్మించాడు. స్వర్ణమయ యజ్ఞ కుండములను, ఆసనాల్ని, పాత్రలను పళ్ళెరాలను అసంఖ్యాకంగా చేయించాడు. తరువాత యజ్ఞం చేసేవాడు.

ధర్మరాజు – 'తపోధనా! మరుత్తుడు అంత బంగారాన్ని ఎలా ప్రాప్తించుకొన్నాడు? అది ఎక్కడిది? దానిని మేము ఎలా పొందగలం? చెప్పండి.

వేదవ్యాసుడు – 'నీకు అది అర్థం కావటానికి ఒక వృత్తాంతం చెపుతాను. విను.

మహర్షి అంగిరాకు ఇద్దరు పుత్రులు. మొదటివాడు మహాతేజస్వియైన బృహస్పతి. రెండవాడు మహాతపస్వియైన సంవర్తనుడు. ఇద్దరూ పరస్పరం కలహించుకొనే వారు. బృహస్పతి కలిగించే బాధలకు తట్టుకోలేక సంవర్తనుడు దిగంబరుడై అడవిలో ఉండసాగాడు. ఇంద్రుడు బృహస్పతిని తన పురోహితునిగా నియమించుకొన్నాడు. అంగిరా ముని మరుత్తునికి వంశపారంపర్య పురోహితునిగా ఉన్నాడు.మరుత్త రాజు ఇంద్రసమానుడు. ఇంద్రుడు ఏనాడూ మరుత్తని మించి పోలేదు.

ఇంద్రుడు బృహస్పతిని పురోహితునిగా నియమించుకొన్నాడు. మరుత్తునికి ఎలాంటి యజ్ఞ నిర్వహణకు సాయం చేయకూడదని చెప్పాడు. ఈలోపుగా, మరుత్తు మహారాజు ఒక యజ్ఞం తలపెట్టి, బృహస్పతి వద్దకు వెళ్ళి యజ్ఞ నిర్వహణ బాధ్యత తీసికోమన్నాడు. కాని బృహస్పతి నిరాకరించాడు. దుఃఖంతో తిరిగి వెళ్ళుతున్నప్పుడు మార్గమధ్యంలో నారద మహర్షి కనిపించి, దుఃఖానికి కారణం అడిగాడు. మరుత్తుడు జరిగినదంతా చెప్పగా, నారదుడు 'రాజా! అంగిరా యొక్క రెండవ పుత్రుడు సంవర్తనుడు ఎంతో ధార్మికుడు. దిగంబరుడై సంచరిస్తూ వున్నాడు. అతని దగ్గరకు వెళ్ళు. అతడు నీ యజ్ఞమును సమర్థవంతంగా నిర్వహిస్తాడు. మరుత్తుడు సంతోషించి, సంవర్తునితో ఎలా వ్యవహరించాలో చెప్పండని అడిగాడు.

అపుడు నారదుడు – 'రాజా! కాశీపురంలో విశ్వనాథ దర్శనం కొరకు ఒక పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. నీవు ఆ చోట ద్వారం దగ్గర ఒక మృతదేహాన్ని పెట్టు. ఉదయం దర్శనం కొరకు వచ్చే భక్తుల్లో ఎవరు మృత దేహాన్ని చూచి వెనక్కు వెళ్ళిపోతారో వారే సంవర్తకులని గ్రహించి, అతనిని వెంబడించు.'

నారదుని మాటల ప్రకారం మరుత్తుడు కాశీకి వెళ్ళి, మృతదేహం పెట్టి, దాన్ని చూచి తిరిగి వెళ్ళిపోయే సంవర్తకుని వెంట వెళ్ళసాగాడు. దీన్ని గమనించిన సంవర్తనుడు అడవిలో ఒక చెట్టు నీడన కూర్చొని మరుత్తుతో ఇలా అన్నాడు. 'రాజా! నీవు నన్ను ఎలా గుర్తించావు? ఎవరు చెప్పారో నిజం చెప్పు. లేకపోతే నీ తల పగిలిపోతుంది.' అని పలికాడు.

మరుత్తుడు – 'మునివర్యా! మీ గురించి నారదుడు అన్ని విషయాలు చెప్పాడు. మీరు మా గురువులైన అంగిరా పుత్రులని తెలిసి, నేను చాల సంతోషిస్తున్నాను.' అని అన్నాడు.

సంవర్తనుడు ఇలా అన్నాడు. 'నిజమే. నేను యజ్ఞం చేయగలనని నారదునికి తెలుసు. కాని ఎవరి స్వభావం కూడ వేరొకరికి లోబడి ఉండేది కాదు. నేను నా ఇష్టం ప్రకారం చేస్తాను.'. బృహస్పతితో ఎందుకు చేయించడం లేదన్న ప్రశ్నకు మరుత్తుడు 'విప్రవర్యా! బృహస్పతి మరియు ఇంద్రుడు కూడ నాపై పగబట్టారు. మరణ ధర్మమున్న నాకు యజ్ఞం చేయనని బృహస్పతి ఖచ్చితంగా చెప్పాడు. అందుకే నేను మీ శరణు కోరుతున్నాను.' అని అన్నాడు.

అపుడు సంవర్తనుడు 'రాజా! నేను ఋత్విజునిగా ఉండి, నీకు యజ్ఞ నిర్వహణ చేస్తాను. అక్షయ ధనప్రాప్తికి ఉపాయం కూడ చెప్తాను. గంధర్వ సహిత దేవతలను, ఇంద్రుణ్ణి కూడ మించిపోగలవు.'

ఓ రాజా! హిమాలయ పృష్టభాగంలో మృంజవాన్ అను పర్వత సమీపంలో శంకర భగవానుడు తపస్సు చేస్తుంటాడు. అక్కడ అనేకమైన సువర్ణ శిఖరాలున్నాయి. కుబేరుని అనుయాయులు వాటిని సర్వకాలాల్లో రక్షిస్తుంటరు. అక్కడికి వెళ్ళన తర్వాత శంకరునకు నమస్కరించి, ఇలా ప్రార్థించాలి. 'దేవా! దుఃఖ కారణము దూరం చేయు రుద్రా! పురుషుడవైన అంతర్యామీ! తేజశ్శాలివైన సువర్చా! భయంకరరూప కరాళా! భక్తులకు వరములిచ్చు వీరుడా! దక్షమహారాజు గజారూపుడవైన శివా, కళ్యాణకారకుడవైన శంకరా! స్థిరుడవైన స్థాణువా! సంసార సాగరాన్ని తరింపచేయు భాస్కరుడా! పవిత్ర తీర్థరూపుడవైన సుతీర్థా! వేగవంతుడవైన దేవదేవుడా! వేలాది నేత్రములు గల సహస్రాక్షా! పర్వతముపై నివసించు గిరీశా! సంయమనవంతుడవైన యతీ! అందరినీ శిక్షించే సర్వదండధరా! పినాకమను ధనుస్సును ధరించు ధన్వీ! ప్రపంచాన్ని ఉత్పత్తిచేయు భవా! తుష్మడవైన వీరా! సువర్ణసుందర బాహువులు గల హిరణ్యబాహూ! భయంకరుడవైన ఉగ్రా! ధర్మస్వరూపుడవైన పశుపతీ! సేనానివైన కార్తికేయరూపా! అందరినీ పాలించే పతీ! జన్మరహితుడవైన భార్గవా! అగ్నిరూపుడవైన విరూపాక్షా! సువర్ణముకుటడవైన సచ్చిదానంద స్వరూపా! త్రయంబకుడవైన త్రినేత్రధారీ! మీకు నా ప్రణామములు'. ఈ రకంగా స్తుతించి, ఆయన పాదములపై తలపెట్టినంత మాత్రాన సువర్ణం ప్రాప్తిస్తుంది. ఆ బంగారాన్ని తీసికొని వచ్చుటకు సేవకులను కూడా తీసుకు వెళ్ళు.' అని ఉపాయం చెప్పాడు.

సంవర్తనుడు చెప్పిన ప్రకారం చేసి, యజ్ఞ సన్నాహాలు ఘనంగా సాగించాడు మరుత్తుడు. ఈ విషయాలన్నీ తెలిసిన బృహస్పతి కోపంతో, అసూయతో రగిలి పోతున్నాడు. బృహస్పతి యొక్క ఈ బాధను తొలగించుటకు, ఇంద్రుడు నిశ్చయించుకున్నాడు.

అపుడు బృహస్పతి ఇలా అన్నాడు.'ఇంద్రా! నా శత్రువైన సంవర్తనుడు సమృద్ధశాలి అవటం నాకు ఏమాత్రం రుచించటం లేదు. మీరు ఎలాగైనా చేసి, ఆ యజ్ఞానికి నన్ను ఋత్విజునిగా నియమింప చేయండి, లేదా మరుత్తుని, సవవర్తనుని బంధించి చెరసాలలో వేయించండి.' ఇంద్రుడు సరేనని చెప్పి, మరుత్తుని యజ్ఞానికి అగ్నిదేవుని దూతగా పంపాడు. అగ్నిదేవుడు మరుత్తునితో 'రాజా! మీరు యజ్ఞము చేయుటకు బృహస్పతిని నియమించవలసినదిగా ఇంద్రుడు ఆదేశించాడు.' అని అన్నాడు. మరుత్తుడు 'అగ్నిదేవా! సంవర్తనుడు మాత్రమే నా యజ్ఞం పూర్తి చేయగలడు. నేను బృహస్పతిని అంగీకరించను' అని అన్నాడు. అందుకు అగ్నిదేవుడు 'రాజా! బృహస్పతి మీ యజ్ఞం నిర్వహిస్తే, మీకు దివ్యలోకాలు ప్రాప్తిస్తాయి.' అని చెప్పాడు. సంవర్తనుడు ఇలా అన్నాడు.'ఓయీ! అగ్నిదేవా! నీవు రాజును ప్రలోభ పెట్టవద్దు. నీవు మళ్ళీ బృహస్పతి దూతగా వచ్చావంటే నిన్ను నా కోపంతో భస్మం చేస్తాను జాగ్రత్త!' అని అన్నాడు.

ఆ మాటలకు భయపడి అగ్నిదేవుడు వెంటనే ఇంద్రలోకానికి వెళ్ళి మరుత్తుడు అంగీకరించని విషయం చెప్పాడు. ఇంద్రుడు అగ్నిదేవుని మరొక్కసారి వెళ్ళమన్నాడు.

అగ్నిదేవుడు 'మహేంద్రా! సంవర్తనుడు నన్ను దహించి వేస్తానన్నాడు. మీరు గంధర్వరాజును దూతగా పంపండి. సరిపోతుంది.'

ఇంద్రుడు – 'అగ్నిదేవా! నీ మాటలు నమ్మలేకున్నాను. అందరిని దహించే శక్తి మీ దగ్గరనే ఉంది. మీరు భయపడుతున్నారేమిటి?'

అగ్నిదేవుడు – 'మహేంద్రా! మీరు ఒక పర్యాయం శర్యాతి చేయించిన యజ్ఞాన్ని జ్ఞాపకం చేసుకోండి.

చ్యవన ముని యజ్ఞం ఇష్టం లేక మీరు అడ్డుకున్నారు. అయినా చ్యవన ముని నిర్విఘ్నంగా చేయించాడు కదా! కోపగించిన మీరు వజ్రాయుధాన్ని ప్రయోగించబోతే, చ్యవన ముని తన తపోబలముచే ఆ వజ్రాయుధాన్ని మీ భుజానికి అతుక్కునేటట్లు చేశాడు. మీరు చివరకు చ్యవన మునినే శరణు కోరారు కదా! క్షాత్రబలము కంటె బ్రహ్మబలం గొప్పది, శ్రేష్ఠమైంది. బ్రహ్మబలాన్ని మించినది ఏదీ లేదు. నాకు బ్రహ్మ తేజము యొక్క అపార బలమును గురించి నాకు తెలుసు. కనుకనే నేను సంవర్తనుని జయించాలనే సాహసం చేయలేక పోతున్నాను.' అని చెప్పాడు.

అపుడు ఇంద్రుడు గంధర్వరాజును దూతగా పంపాడు. గంధర్వరాజు కూడ బృహస్పతిని నియమించుకోమని మర్తుతుతో చెప్పాడు. మరుత్తుడు తిరస్కరించటం గమనించిన ఇంద్రుడు అట్టహాసంగా ఆకాశమార్గాన రావటం గమనించిన గంధర్వుడు మరుత్తును హెచ్చరించాడు. మరుత్తుడు సంవర్తముని శరణు వేడాడు. సంవర్తనుడు 'రాజా! ఇంద్రుని వజ్రాయుధానికి నీవు భయపడవద్దు. నేను ఇంద్రుణ్ణి స్తంభింప చేస్తున్నాను. దేవతలందరి ఆయుధాలు క్షీణింప సాగాయి. నీవు నానుండి ఏమైనా వరం కోరుకో.' అని అభయమిచ్చాడు.

మరుత్తుడు ఇలా అన్నాడు. 'ఓ బ్రహ్మర్షీ! మన యజ్ఞాన్ని వ్యతిరేకించిన ఇంద్రుడు దేవతలతో సహా సోవపానము చేయునట్లు అనుగ్రహించండి.' అని ప్రార్థించాడు. సంవర్తనుడు అలాగేనని అందరిని తన తపోబలముచే రప్పించాడు. సానుకూలంగా యజ్ఞం ముగిసింది.

వేదవ్యాసుడు చెప్పిన ఈ వృత్తాంతానికి ధర్మరాజు సంతోషపడ్డాడు. మరియు ఆ ధనాన్ని తెప్పించుకొని, యజ్ఞం చేయటానికి నిశ్చయించుకొన్నాడు.

మరుత్తుని ధనరాశి ఎక్కడ వున్నదో చెప్పిన తరువాత, ధర్మరాజు సోదరులతో సమాలోచన చేశాడు. భీముడు 'మనం ఆ ధనం సంపాదిస్తే, మన యజ్ఞం నిర్విఘ్నంగా జరుగుతుంది. శంకర భగవానునికి ప్రణామం చేసి, స్తుతించి, ఆ ధనం తీసికొని వద్దాం.' అన్నాడు. ఈ మాటలకు సోదరులందరూ సమ్మతించారు.

ధర్మరాజాదులు, సైనికులు కూడ కలిసి బయలుదేరారు. చాల కష్టపడి ఆ ప్రాంతానికి చేరుకొన్నారు. అక్కడ అనుకూలమైన ప్రదేశం చూచుకొని, వేదవేదాంగ పారంగతులకు, ధౌమ్యునికి గుడారాలలో పూజాదికాలు నిర్వహించారు. ధర్మరాజు బ్రాహ్మణుల ఆజ్ఞ మేరకు శివునికి నైవేద్యం సమర్పించాడు. ఆ తరువాత ధర్మరాజు బ్రాహ్మణులకు గోదానం చేశాడు.

దేవాధిదేవుడైన మహాదేవుని స్థలము ధూపదీప నైవేద్య పరిమళాలతో, పూలమాలాలంకృతంతో ఎంతో వైభవంగా అలరారుతోంది. సువర్ణ రాశి ఉన్న చోటికి ధర్మరాజు చేరుకొన్నాడు. అక్కడ కుబేరునికి పూజ నిర్వహించాడు. సమస్త నిధి పాలకులకు పూజచేశాడు.. తర్వాత ధనం కోసం త్రవ్వడం ప్రారంభమైంది. కొద్ది సమయంలోనే అసంఖ్యాకమైన బంగారు పాత్రలు, అనేక ఆకారాల్లో బయట పడసాగాయి. వాటిని భద్రపరచుటకు గొప్ప భోషాణాలు తేబడ్డాయి. ఆ ధనరాశులను మోసుక పోవడానికి రథ తురగ పదాతి దళాలు వచ్చి వున్నాయి. 60 వేల ఒంటెలు, 120 లక్షల అశ్వాలు, ఒక లక్ష గజరాజులు, ఒక లక్ష రథములు, ఒక లక్ష కచ్చురములు మరియు బరువులు మోయు గాడిదలకు, మనుషులకు లెక్కలేకుండా వున్నాయి. ధర్మరాజు ఎంతబంగారాన్ని తరలించాడనే దానికి ఇదే ప్రమాణంగా భావించవచ్చు. ఒక్కో ఒంటెపై ఎనిమిది వేలు, కచ్చురముపై 16 వేలు, ప్రతి ఏనుగుపై 24 వేలు, సువర్ణమును మరియు అశ్వాలు, మనుషులు, గాడిదలపై సువర్ణాన్ని ఎత్తారు. ధర్మరాజు

మరల మహాదేవుని పూజించి, ధౌమ్యముని ముందు నడువగా, పాండవులందరు హస్తినాపురం బాట పట్టారు.

జనమేజయుని తండ్రి పరీక్షిత్తు పుట్టుకతోనే చేష్టాహీనుడై బ్రహ్మాస్త్ర పీడితుడై మృతరూపంలో జన్మించాడు. అంతఃపుర స్త్రీలు శోకంలోమునిగిపోయారు. శ్రీకృష్ణునికి ఈ విషయం తెలియగానే, సాత్యకిని తీసికొని అంతఃపురానికి వెళ్ళాడు. అక్కడ వాతావరణం చూచి శ్రీకృష్ణుడు కలత చెందాడు. కుంతి, ద్రౌపది, సుభద్ర వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. కుంతి శ్రీకృష్ణుని చూచి, 'వాసుదేవా! నీవు ఉండి కూడ ఇంత అనర్థం జరిగినది. అభిమన్యుడి కుమారుడు అశ్వత్థామ చేసిన అపకృత్యం వల్ల విగతజీవుడుగా జన్మించాడు. నీవు నీ దయా వీక్షణాలతో మేలు కలుగజేయి. వారి శోకాన్ని చల్లార్చు.' అని శ్రీకృష్ణుని కాళ్ళపై పడింది. శ్రీకృష్ణుడు శాంతచిత్తుడై 'ఒకవేళ నాలో సత్యము, ధర్మము నిరంతరము స్థితమై ఉంటే, అభిమన్యుని కుమారుడు జీవితుడగు గాక!' అని మనస్సులో తలచాడు. శ్రీకృష్ణుని ఈ మాటలతోనే మృత బాలునిలో చైతన్యం వచ్చి, శ్వాసతీసికోవడం మొదలైంది. ఆ తరువాత శ్రీకృష్ణుడు ఆ బాలునకు పరీక్షిత్తు అని పేరుపెట్టాడు.

ధనరాశులతో పాండవులు హస్తినాపుర సమీపానికి వచ్చినారనే వార్త తెలియగానే, శ్రీకృష్ణుడు మంత్రులను, మిత్రులను వెంటబెట్టుకొని ఎదురుగా వెళ్ళాడు. అందరూ ఒకరినొకరు పరామర్శించుకొని హస్తినలోకి ప్రవేశించారు. అక్కడ ధృతరాష్ట్రుని, గాంధారిని, కుంతిని, విదురుని మరియు యుయుత్సుని ప్రేమగా పలకరించారు. శ్రీకృష్ణుడు అభిమన్యుని కుమారుని బ్రతకించాడనే విషయం తెలుసుకొని అందరూ సంతోషించి, శ్రీకృష్ణుని వేనోళ్ళ పొగిడారు.

ఆ తర్వాత కొన్ని రోజులకు వేదవ్యాస మునీంద్రుడు హస్తినకు వచ్చాడు. పాండవులు యథోచిత రీతిలో పూజలు చేసి, సేవలు చేయసాగారు.

ధర్మరాజు – 'దేవా! మీ కృపవల్ల బంగారు రాశులు తెచ్చాం. వాటిని అశ్వమేధ యజ్ఞంలోఉపయోగించ దలచాము. అనుమతి ఇవ్వండి.' అని అన్నాడు.

వేదవ్యాసుడు – 'రాజా! విధివిహితంగా దక్షిణలు ఇచ్చి అశ్వమేధ యజ్ఞ అనుష్ఠానం చేయి'.

తర్వాత ధర్మరాజు శ్రీకృష్ణుని యజ్ఞ దీక్ష తీసుకోమని కోరాడు. కాని శ్రీకృష్ణుడు సున్నితంగా తిరస్కరించి, ధర్మరాజును తీసికోమని కోరాడు. కారణం – ధర్మరాజు దీక్ష తీసికోవడం వల్ల భీమార్జున, నకులసహదేవులకు కూడ యజ్ఞానుష్ఠాన ఫలం దక్కుతుంది.

శ్రీకృష్ణుని మాట మేరకు ధర్మరాజు వేదవ్యాసునితో సరైన సమయంలో మాచే యజ్ఞము ప్రారంభింప జేయండి అని అడిగాడు.

వేదవ్యాసుడు 'రాజా! యజ్ఞం ప్రారంభించవలసిన సమయం కాగానే, నేను మరియు యాజ్ఞవల్క్యుడు మొదలైన వారందరం కలిసి యజ్ఞాన్ని సుసంపన్నం చేస్తాము. యజ్ఞాశ్వము వెంట శ్రేష్ఠ ధనుర్ధారి, సహనశీలుడడు, ధైర్యశాలియైన అర్జునుని పంపండి.

యజ్ఞాశ్వము వెంట అర్జునుడు సైన్యాన్ని తీసికొని బయలుదేరాడు. ఆ అశ్వం భూమండలం అంతా తిరుగుతూ త్రిగర్త దేశంలో ప్రవేశించింది. కురుక్షేత్ర సంగ్రామంలో అనేకమంది త్రిగర్తీయులు అర్జునుని చేతిలో చనిపోయారు. త్రిగర్త వీరులు ఆ కారణంగా కోపంతో అర్జునుని చుట్టుముట్టారు. అలాగే అశ్వాన్ని కూడ

బంధించే ప్రయత్నం మొదలైంది. అర్జునుడు చెప్పిన మంచి మాటలు వారికి తలకెక్క లేదు. అందుచేత అర్జునునకు తప్పనిసరిగా పోరాడవలసి వచ్చింది. ఆ యుద్ధంలో అనేకమంది త్రిగర్త వీరులు మరణించగా మిగిలినవారు లొంగిపోయారు.

ఆ తరువాత అశ్వము ప్రాగ్జ్యోతిష పుర పరిసరాల్లో తిరగటం మొదలైంది. ఆ రాజ్యాన్ని భగదత్తుని కుమారుడు వజ్రదత్తుడు పరిపాలిస్తున్నాడు. గత శత్రుత్వాన్ని పురస్కరించుకొని వజ్రదత్తుడు యజ్ఞాశ్వాన్ని తరలించుకు పోదలచగా, అర్జునుడు వెంటనే గాండీవ ధనస్సును ఎక్కుపెట్టి వదిలాడు. ఆ శబ్దానికి చెవులు గింగుర్లెత్తగా, వజ్రదత్తుడు అశ్వాన్ని వదలి, తన సైన్యాలతో మళ్ళీ వచ్చి అర్జునుని ఎదుర్కొన్నాడు. వారి పోరు మూడు రోజులు జరిగింది. నాలుగవ రోజు వజ్రదత్తుడు ఓడిపోయాడు. అతనిని చంపకుండా, అశ్వమేధ యాగానికి రమ్మని ఆహ్వానించి ముందుకు సాగాడు అర్జునుడు.

ఆ తర్వాత అశ్వము సింధు దేశంలోకి ప్రవేశించింది. సింధువీరులు మూకుమ్మడిగా అర్జునుని చుట్టుముట్టి బాణవర్షం కురిపించారు. మొదట కొద్దిగా తడబడినా, అర్జునుడు ఆ సింధువీరులను ఊచకోత కోయసాగాడు. ఈ మారణకాండను నివారించడానికి రంగంలోకి సైంధవుని భార్య దుస్సల వచ్చింది.

ఈ దుస్సల ధృతరాష్ట్రుని కుమార్తె మరియు అర్జునుని సోదరి. కురుక్షేత్రంలో సైంధవుడు (జయద్రధుడు) చనిపోయాడు. ఈ దుస్సల వచ్చి 'ఓ సోదరా! నావెంట ఉన్న ఈ బాలుడు నా కుమారుని కుమారుడు, నీ మనుమడు. వీడికి నీ ఆశీస్సులు కావాలి.' అని అన్నది. ఆ పాటికే వేలాది మందిని చంపిన అర్జునుడు యుద్ధం విరమించాడు. సైంధవ వీరులు బ్రతుకు జీవుడా అని అనుకొన్నారు. పిమ్మట అర్జునుడు అశ్వం వెంట వెళ్ళడం ప్రారంభించాడు.

అర్జునునికి బభ్రువాహనునకు మధ్య యుద్ధం, అర్జునుడు పడిపోవటం ఉలూపి వచ్చి బ్రతికించటం ఎలా జరిగిందో తెలుసుకుందాం.

మణిపురం యొక్క రాజు బభ్రువాహనుడు తన తండ్రియైన అర్జునుడు వస్తున్నాడనే వార్త తెలుసుకొని స్వాగత సన్నాహాలు చేయసాగాడు. ఆ తరువాత నగరం బయటకు వచ్చి అర్జునుని దర్శనార్థం వేచివున్నాడు.

అర్జునుడు వచ్చి, 'కుమారా! నీవు చేసే పని నాకు నచ్చటం లేదు. ఈ అశ్వరక్షణకై ఆయుధాలను ధరించి వచ్చిన నాతో యుద్ధం చేయాలి కాని ఇలా శాంతిస్థాపన కాదు.' అని ఇలా చెప్తుండగానే, నాగకన్య అయిన ఉలూపి భూమిని చీల్చుకొని బయటకు వచ్చింది. తన స్వామియైన అర్జునుడు బభ్రువాహనునితో అలా మాట్లాడటం సహించలేక పోయింది. ఉలూపి 'నాయనా! నేను నీ పినతల్లియైన నాగకన్యను, ఉలూపిని, ఈ తండ్రియైన ఈ అర్జునుడు శ్రేష్ఠపురుషుడై, యుద్ధమదంతో, ఉన్మత్తుడైన వీరుడైనాడు. నీవు ఆయనతో యుద్ధము చేయుటయే, నీవు ఆయనకు చేయు సత్కారం.' అని పలికింది.

ఉలూపి మాటలను విన్న బభ్రువాహనుడు యుద్ధానికి సుసజ్జితుడై, సింహధ్వజంతో సుశోభితమైన రథంపై యుద్ధానికి బయలుదేరాడు.

మొదట బభ్రువాహనుడు అశ్వనిపుణులచే యజ్ఞాశ్వమును బంధింపచేసి, ముందుకు సాగాడు. బభ్రువాహనుని పురోగమనాన్ని అర్జునుడు నిలువరింపసాగాడు. బభ్రువాహనుని ఒక తీవ్ర బాణముతో అర్జునుడు

పడిపోయాడు. కొంచెం సేపటిలోనే కోలుకొని, అర్జునుడు బభ్రువాహనుని హెచ్చరిస్తూ శరపరంపరను కురిపించ సాగాడు. ఆ తర్వాత అశ్వాలను చంపి, అతనిని రథహీనునిగా చేశాడు. అయినా బభ్రువాహనుడు వీరోచితంగానే పోరాడాడు. అర్జునుడు అతని పరాక్రమాన్ని చూచి, సంతోషించి, తన పరాక్రమాన్ని తగ్గించుకొన్నాడు. బభ్రువాహనుడు ఇది గమనించకుండా బాల్యచాపల్యంతో ఒక విష తుల్యమైన బాణాన్ని ప్రయోగించాడు. ఆ బాణము అర్జునుని మర్మస్థానాన్ని ఛేదించుటచే అర్జునుడు అచేతనంగా నేలమీద పడిపోయాడు.

అంతకుముందే అర్జునుని బాణాల వల్ల తీవ్ర గాయాలైన బభ్రువాహనుడు కూడ మూర్ఛిల్లాడు. ఇలా తండ్రీకొడుకులు మూర్ఛిల్లటం చూచి తల్లియైన చిత్రాంగద రణభూమికి వచ్చినవారిని చూస్తూ, రణభూమిలో అర్జునుడు విగతజీవుడై నేలమీద పడివుండటం చూచి భోరుమని విలపించసాగింది. చిత్రాంగద పతివియోగ దుఃఖంతో విలపిస్తూ మూర్ఛిల్లింది.

మెలకువ వచ్చి చూసేసరికి, నాగకన్యయైన ఉలూపి దివ్యరూపధారణతో తన ఎదుట నిల్చుని ఉంది. ఆమెతో చిత్రాంగద 'ఉలూపీ! చూచావా! నీవు చెప్పటం వల్లనే వారిద్దరి మధ్య యుద్ధం జరిగి ఫలితం ఇలా పరిణమించింది. స్వామిని బ్రతికించే శక్తియుక్తులు నీకు వున్నాయి.' అని అన్నది.

ఈలోపుగా భభ్రువాహనునకు కూడ మెలకువ వచ్చి అర్జునుడు విగతజీవుడై పడివుండటం చూచి విలపించ సాగడు. చిత్రాంగద మరియు బభ్రువాహనుడు ఇద్దరూ కూడ అనశన వ్రతం చేసి ప్రాణాలను వదులుకోవడానికి సిద్ధమైనారు.

అపుడు ఉలూపి సంజీవి మణిని స్మరించింది. నాగసర్పముల జీవములకు ఆధారభూతమైన మణి స్మరించినంత మాత్రముననే ఉలూపి చేతిలోకి వచ్చింది. వెంటనే బభ్రువాహనుని ఉద్దేశించి – 'కుమారా! లే, శోకించకు. అర్జునుడు నీ వల్ల ఓడిపోలేదు. అర్జునుడు మానవులకు అజేయుడు. దేవతలు కూడ ఆయన్ని జయించలేరు. మీ నాన్నగారికి ప్రియమొనర్చుటకే, నేను మోహినీ మాయను ప్రదర్శించాను. ఈ మహాత్ముడు నరుడు, పురాతన ఋషి, సనాతనుడు మరియు అవినాశియై ఉన్నాడు. యుద్ధంలో ఇంద్రుడు కూడా ఇతనిని ఓడించలేడు. ఇదిగో, ఈ మణిని మీ నాన్నగారి ఛాతీమీద వుంచు.' అని తన చేతిలోని మణిని బభ్రువాహనునికి యిచ్చింది. బభ్రువాహనుడు ఆమె చెప్పిన ప్రకారం అలా ఆ మణిని పెట్టగానే వెంటనే అర్జునుడు గాఢనిద్ర నుండి మెలకువ వచ్చినట్లుగా లేచి కూర్చున్నాడు.

తన చుట్టూవున్నవారిని చూచి 'మీరందరు ఇక్కడ వుండుటకు కారణమేమి? అని అర్జునుడు వారిని అడిగాడు. జరిగినదంతా ఉలూపి చెప్పి, 'మహాభారత యుద్ధం జరిగినపుడు శిఖండి చాటునుండి భీష్మునిపై వాడి బాణములు వేసిన పాపము శాంతించుటకై వసువులు చెప్పిన ఉపాయము అనుసరించాను. భీష్ముని దహనసంస్కారాలు ముగిసిన పిమ్మట దేవతలు మరియు వసువులు గంగాస్నానం కొరకు వెళ్ళి అక్కడ ముచ్చట్లు చేయసాగారు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు భీష్మునికి చేసిన అన్యాయమునకు ప్రతీకారంగా శపించతలచి గంగామాత అనుమతి కూడ పొందారు.

దీన్నంతా నేను రహస్యంగా గమనించి, మా నాన్నగారైన నాగరాజుతో చెప్పాను. శాపవిమోచనములో భాగముగా బభ్రువాహనుని చేతిలో విగతజీవుడగునట్లు చూచాను. ఆ రకంగా మీ పాపం నశించింది. ఇదంతయు విని, అర్జునుడాదిగా గలవారందరు సంతోషించారు. ఆ తర్వాత అర్జునుడు వారినందరిని అశ్వమేధ యజ్ఞానికి

రావలసినదిగా ఆహ్వానించి ముందుకు సాగాడు.

అర్జునుడు మగధ, చేది, కాశి, కోసల మొదలగు దేశములను జయించి, గాంధార దేశంలో ప్రవేశించాడు. అక్కడికి ప్రవేశించే ముందు, యజ్ఞాశ్వాలు రాజగృహమను నగరానికి వెళ్ళింది. అక్కడ సహదేవుని పుత్రుడు మేఘసంధి అనువాడు రాజ్యమేలుతున్నాడు.

క్షత్రియ ధర్మం ప్రకారం, మేఘసంధి యుద్ధంచేసి ఓడిపోయాడు. అయినను, అర్జునుడు అశ్వమేధ యాగానికి రావలసిందని ఆహ్వానించాడు.

తరువాత యజ్ఞాశ్వము గాంధార రాజ్యంలోనికి ప్రవేశించింది. అక్కడ శకుని పుత్రుడు రాజ్యమేలుతున్నాడు. అతడు అశ్వాన్ని ఎదుర్కొనదలచి అపార సైన్యంతో సిద్ధమైనాడు. అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు మొత్తం సైన్యాన్ని నాశనం చేశాడు. ఈలోపుగా, గాంధార రాజు తల్లి, మంత్రులతో యుద్ధరంగానికి వచ్చి, పుత్రుని మందలించి, అర్జునుని ప్రసన్నం చేసుకొంది. వారిని కూడ అశ్వమేధ యజ్ఞానికి రావలసిందిగా ఆహ్వానించి, ముందుకు సాగాడు అర్జునుడు.

అనేక దేశ రాజులు యజ్ఞ వేదికను దర్శించుట గురించి తెలుసుకొందాం.

ధర్మరాజు – 'భీమసేనా! అర్జునుడు యజ్ఞాశ్వము వెంట వస్తున్నాడు. యజ్ఞం ప్రారంభించే సమయం దగ్గరపడింది. వేదపారంగతులను పిలిపించి ఆ పనులు ప్రారంభించు.' అని అన్నాడు.

భీముడు కుశలురైన బ్రాహ్మణులను తీసికొని యజ్ఞ భూమికి వెళ్ళాడు. శాస్త్రీయ పద్ధతిలో నిర్మాణాలు సాగుతున్నాయి. ఆ తరువాత భీమసేనుడు భూమండలంలోని రాజులందరిని ఆహ్వానించమని దూతలను పంపాడు. రాజులందరు రత్నరాసులను, అశ్వాలను మరియు అస్త్రశస్త్రములను తీసికొని కూర్చొని ఉన్నారు. వసతులు సమకూర్చబడ్డాయి. అనేకమంది బ్రహ్మవాదీ మునులు కూడ వచ్చారు. వచ్చిన వారందరు భీమునిచే పర్యవేక్షిం బడుచున్న యజ్ఞ వేదికను చూడసాగారు. బంగారంతో రూపొందించబడిన తోరణాలు, పడకలు, ఆసనములు మరియు కలశములు మున్నగునవి చూచి అందరూ ఆశ్చర్య చకితులైనారు. ప్రతి రోజు ఒక లక్షమంది బ్రాహ్మణులు భోజనం చయటానికి ఏర్పాట్లు జరిగాయి. అన్నపు రాశులు, పెరుగు కాలువలు, నేతి చెరువులు చూచేకొద్దీ దిగ్భ్రాంతి కొల్పుతున్నాయి. యజ్ఞానికి వచ్చిన వారందరికి రాజోచితమైన భోజనాలు ఏర్పాటు చేయబడింది.

ఇదే సమయంలో బభ్రువాహనుడు తన ఇద్దరు తల్లులతోబాటు యజ్ఞశాలకు చేరుకున్నాడు. అక్కడ వున్న కురుకుల వృద్ధులకు, అన్య రాజులకు నమస్కరించి వారిచే ఆశీర్వాదములు పొంది, తరువాత కుంతియొక్క అందమైన భవనమును చేరుకొన్నాడు. అక్కడ బభ్రువాహనుడు కుంతి పాదములకు నమస్కరించాడు. ఆ తరువాత బభ్రువాహనుడు పాండవుల వద్దకు వెళ్ళాడు. వారందరు ప్రేమతో ఆలింగనం చేసుకొన్నారు. కావలసినంత ధనం ఇచ్చి సత్కరించారు. శ్రీకృష్ణుడు అత్యంత విలువైన రథాన్ని ఇచ్చాడు. దానికి దివ్యమైన అశ్వాలు పూన్చబడి వున్నాయి.

మూడవ రోజు వేదవ్యాస మహర్షి వచ్చి యజ్ఞం ప్రారంభించమని ధర్మరాజుకు చెప్పాడు. ఇది సర్వాంగ పూర్ణ యజ్ఞమనబడుతుంది. అంతేకాదు బ్రాహ్మణులకు మూడు రెట్లు సువర్ణదానం చేయడం వల్ల మూడు అశ్వమేధముల ఫలం లభిస్తుంది. దాయాదులకు చెందిన పాపము నశిస్తుంది. వేదవ్యాస మహర్షి చెప్పిన ప్రకారం,

ధర్మరాజు దీక్ష తీసుకొని యజ్ఞాన్ని ప్రారంభించాడు.

వేదవిదులు, యాజకులు, కర్మలన్నింటిని చేశారు. వారు యజ్ఞమండపం నలువైపులా తిరుగుతూ పర్యవేక్షిస్తున్నారు. సోమపానం చేయు శ్రేష్ఠులైన బ్రాహ్మణులు శాస్త్రీయ పద్ధతిలో సోమలత రసం తీస్తున్నారు. ధర్మరాజు ఆజ్ఞ మేరకు, భీమసేనుడు భోజనాదిక ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాడు.

యజ్ఞమండపంలో అగ్ని రాజేయటానికి నాలుగు వేదికలను నిర్మించారు. అన్నిటి పొడవు 18 మూరలు. అవన్నీ గరుడాకారంలో తీర్చిదిద్ద బడి, బంగారు రెక్కలు కలిగివున్నాయి.. అలాంటి వేదికలపై త్రికోణాకారంలో అగ్ని కుండాలు ఏర్పాటు చేయబడ్డాయి. అందులోనే అగ్నిస్థాపన జరిగింది. అక్కడ ఉన్న కిన్నెర, కింపురుషులు యజ్ఞశాల శోభను ఇనుమడింప జేస్తున్నారు. వారికి నలువైపులా సిద్ధ పురుషులు మరియు ఉత్తమ బ్రాహ్మణులు కూర్చొని వున్నారు. సకల శాస్త్రాలలో ఆరితేరిన, వేదవ్యాస శిష్యులు యజ్ఞంలో సదస్యులై వున్నారు. దేవర్షి నారదుడు, తుంబురుడు, విశ్వావసుడు, చిత్రసేనుడు, గానవిద్య నిపుణులైన గంధర్వులు కూడ అక్కడ ఉపస్థితులై వున్నారు. గంధర్వులు ప్రతిదినం అక్కడ ఉన్నవారిని నాట్యంతో, గానంతో అలరించేవారు.

ఇలా అశ్వమేధ యజ్ఞం శోభాయమానంగా పరిపూర్తి అయింది. వేదవ్యాసుని యొక్క శిష్యులకు ధర్మరాజు, ఒక వేయి కోటి బంగారు నాణేలు దక్షిణగా యిచ్చి, వేదవ్యాసునకు సంపూర్ణ భూమండలాన్ని దానం చేశాడు.

అపుడు వేదవ్యాసుడు ఇలా అన్నాడు. 'రాజా! మేము రాజ్యాన్ని తీసుకొని ప్రయోజనం లేదు. ఈ భూమండలం అంతా మీ అధీనంలోనే ఉంచుకోండి.' అయినా ధర్మరాజు వినకుండా, అర్జునుడు జయించిన ఆయా దేశాలను సమర్పించుకున్నాడు.

యజ్ఞశాలలో వున్న బంగారు తోరణాలు, పాత్రలు, వివిధ వస్తువులు బ్రాహ్మణులు తీసికోగా, మిగిలినవి క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు తీసికొన్నారు. అయినా ఇంకా మిగిలి వున్నాయి. ఈ విషయంలో ధర్మరాజు మరుత్తుడిని మించిపోయాడు.

ఆ తరువాత యజ్ఞానికి వచ్చిన రాజులకు కూడ రత్నరాశులు, ఏనుగులు, అశ్వములు, ఆభూషణాలను, స్త్రీలను, వస్త్రములను, బంగారు నాణేలను కానుకగా ఇచ్చాడు. ఆ విధంగా నీళ్ళలా ప్రవహించిన ధనము, బంగారు నాణెములతో తృప్తిపడిన అతిథులు ధర్మరాజుకు శుభములు కలుగు గాక! అని కోరుకుంటూ వెళ్ళిపోయారు. చివరకు శ్రీకృష్ణ భగవానుడు, బలరాముడు కూడ తమకు అర్పించిన కానుకలను తీసుకొని ద్వారకకు వెళ్ళిపోయారు.

ధర్మరాజు చేసిన అశ్వమేధ యజ్ఞంలో జరిగిన ఆశ్చర్యకరమైన సంఘటన గురించి తెలుసుకొందాం.

అశ్వమేధ యజ్ఞం పూర్తి కావడంతోనే ఒక ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు, రాజులకు, సంబంధికులకు మరియు ఇతరులకు పుష్కలంగా బంగారు నాణేలు ఇచ్చిన తర్వాత, ధర్మరాజుపై పూలవర్షం కురిపించసాగారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఒక ముంగిస నీలి కళ్ళతో యజ్ఞశాలలోకి ప్రవేశించి గంభీరంగా మానవ భాషలో ఇలా అంది. 'ఓ రాజులారా! మీరు నిర్వహించిన ఈ యజ్ఞం, ఒక పేద బ్రాహ్మణుడు చేసిన సామాన్య దానమునకు కూడ సరితూగదు.' అన్నది. సభికులు విని ఆశ్చర్య పడ్డారు. శాస్త్ర నిపుణులైన బ్రాహ్మణులు ఆ ముంగిసను చుట్టుముట్టి 'నీవు ఎందుకు ఇలా అన్నావు? క్రమ ప్రాతిపదికగానే

దానాలు జరిగాయి. యజ్ఞం కూడ శాస్త్ర ప్రకారమే జరిగింది. నీవు ఇలా అనడానికి కారణమేమి?' అని అన్నారు.

బ్రాహ్మణుల మాట విన్న ముంగిస నవ్వి ఇలా చెప్పింది. 'ఓ ఉత్తమ విప్రబృందమా! నేను చెప్పింది నిజమే. ఒక పేద బ్రాహ్మణుడు దానం చేసిన ఒక శేరు సత్తుపిండి యొక్క పుణ్యఫలమునకు మానము కాదు మీ యజ్ఞం. మీకు చెప్పాల్సిన అవసరం ఉంది. శాంతంగా వినండి.

కురుక్షేత్ర నివాసి మరియు భిక్షాటన చేసి జీవించే బ్రాహ్మణుడు చేయు దానము ఉత్తమము మరియు అద్భుత ఫలితాన్నిచ్చింది. ఆ బ్రాహ్మణుడు కేవలం రోటి దగ్గర చెదిరిపోయిన వడ్ల గింజలను ఒక్కొక్కటిగా న్యాయపరంగా ఏరుకొనేవాడు. చాల కాలం క్రితం జరిగింది ఈ వృత్తాంతం.

ఆ బ్రాహ్మణుడు ఉంఛవృత్తి ద్వారానే జీవిస్తుండేవాడు. దానితోనే కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. వాని కుటుంబంలో అతని భార్య, కొడుకు మరియు కోడలు ఉండేవారు. వారు ధర్మాత్ములై, జితేంద్రియులై, శుద్ధ ఆచార వ్యవహారాలు కలిగినవారు. తపస్సులో లీనమై ఉండేవారు. ప్రతిరోజూ సాయంత్రం ఒక్కపూటే భోజనం చేసేవారు. ఆవేళ దాటిపోతే మరల తెల్లవారి ఆ సమయం వరకు వేచి ఉండేవారు.

ఒకసారి కరువు కాటకాల వల్ల, వారికి బియ్యపు గింజలు దొరికేవి కావు. నిరాహారులై, కృంగి కృశించ సాగారు. ఒకరోజు చాల కష్టపడి ఒక శేరు జొన్నలు సేకరించి సత్తు పిండి చేసుకొని, ఆ నలుగురు సమభాగాలు చేసికొని, తినుటకు ప్రారంభిస్తుండగా, ఒక అతిథి వారింటికి ఆకలితో వచ్చాడు. అతిథి దర్శనంతో వారి హృదయాలు ఉప్పొంగిపోయాయి సంతోషంతో.

బ్రాహ్మణుడు అతిథితో ఇలా అన్నాడు. 'దేవా! న్యాయపరంగా ఆర్జించిన ఈ సత్తుపిండిని స్వీకరించి నన్ను కృతార్థుణ్ణి చేయండి.' ఆ అతిథి దానిని స్వీకరించి తృప్తిపడక పోవడం, ఆ స్త్రీ, కొడుకు, కోడలు వరుసక్రమంగా తమ వంతు గల సత్తుపిండిని అతిథికి సమర్పించారు. ఆ బ్రాహ్మణ కుటుంబం త్యాగం చూచి, ఆ అతిథి సాక్షాత్తూ ధర్మదేవత కాబట్టి, వారిపై పైనుండి పూలవర్షం కురిపించింది.

ధర్మదేవత ఇలా అంది. 'ఓ విప్రవర్యా! మీరు బ్రహ్మధామమును చేరుకొను యోగ్యత సాధించారు. అదిగో దివ్య విమానం సిద్ధంగా ఉంది. పదండి.'

ముంగిస చివరకు ఇలా అన్నది. 'వారు బ్రహ్మలోకమునకు వెళ్ళిపోయిన తర్వాత అతిథి భోజనం చేసిన తావులోనే నేను పొర్లాడగా, నా శరీరంలోని అర్ధ భాగం బంగారుమయమైపోయింది. మిగతా అర్ధ శరీరమును బంగారు మయం చేసుకోవటానికి ఇక్కడికి వచ్చాను. కాని ఇక్కడ నాకు ఆ భాగ్యం దక్కలేదు. అందుకే నేను నవ్వి, ఈ మీ యజ్ఞమ ఒక శేరు సత్తుపిండి సమానం కాదన్నాను.'

అగస్త్య మహర్షి యొక్క విశేషాలు చూద్దాం:

జనమేజయుడు ఇలా అన్నాడు. 'విప్రవర్యా! న్యాయంగా సంపాదించిన సత్తుపిండిని దానం చేసి ఫలప్రాప్తి పొందిన బ్రాహ్మణుని వలె, ప్రతి యజ్ఞం న్యాయంగా సంపాదించిన ధనంతో చేయాలంటే సాధ్యమవుతుందా?'

అపుడు వైశంపాయనుడు ఇలా చెప్పాడు. 'ఓ రాజా! కావలసినంత ధనం లేకపోయినా యజ్ఞం చేయవచ్చు. పూర్వం అగస్త్యుడు చేసిన యజ్ఞం అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

తేజశ్శాలియైన అగస్త్యముని ఒక సమయంలో 12 సం॥ యజ్ఞం తలపెట్టాడు. ఆ యజ్ఞం నిర్వహించటానికి అగ్ని శిఖల్లాంటి హోతలు ఉన్నారు. అదులో కేవలం కందమూలం భుజించే యతులు, భిక్షువులు కూడా ఉన్నారు. వారందరూ జితేంద్రియులు. సర్వకాల సర్వావస్థలయందు సదాచార సంపన్నులు. ఇతర మునులు, ఋషులు కూడ ఆ యజ్ఞంలో పాల్గొన్నారు. ఇలా అగస్త్య మహర్షి యజ్ఞాన్ని సహించలేని ఇంద్రుడు వర్షాన్ని ఆపేశాడు. ఋషులందరు తమలో తాము చర్చించుకొన్నారు, అగస్త్య మునికి శుభాలు జరగాలని కోరుకొన్నారు.

ఈ విషయం గమనించిన అగస్త్య మహర్షి 'ఓ మునులారా! మీరేమీ బాధపడకండి. ఒకవేళ ఇంద్రుడు ఈ 12 సం॥ఉ వర్షాలు ఆపేస్తే, నేను సంకల్ప మాత్రాన యజ్ఞం చేస్తాను. అలాకాకపోతే, స్పర్శ మాత్రం చేసి, దేవతలను సంతృప్తి పరుస్తాను. ఇదికూడ సనాతన విధి. అదీ కాని పక్షంలో, నేనే ఇంద్రుడనై సర్వ ప్రాణులను కాపాడతాను. విశేష రీతిలో ఆహారాన్ని సమకూర్చగలను. ముల్లోకాల్లోని బంగారం ఇచ్చటికి వచ్చు గాక! దివ్యమైన అప్సరసలు, గంధర్వులు, కిన్నెరలు, విశ్వావసుడు, ఇతర స్వర్గవాసులు నేను చేయు యజ్ఞమును ఉపాసింతురు గాక! దేవతలు మరియు ధర్మదేవత ఇక్కడకు వచ్చెదరు గాక!' అని అనగా, ఆయన కోరినట్లుగానే జరిగింది. ఇదిచూచి అందరూ ఆశ్చర్యపడ్డారు. అగస్త్య మహర్షి తపోబలమును చూచి ఇంద్రుడు వర్షం కురిపిస్తూ, బృహస్పతిని వెంట తీసికొని యజ్ఞ ప్రాంగణానికి వచ్చాడు. ఆ పిదప అగస్త్య మహర్షి యజ్ఞాన్ని పరిసమాప్తి చేసి, మహర్షులందరిని పూజించి, వీడ్కోలు పలికాడు.

ధర్మరాజు అశ్వమేధ యాగాన్ని పూర్తి చేసిన తర్వాత, వెలుగుచూచిన సందేహాలన్నింటిని శ్రీకృష్ణుడు తీర్చి ఉపదేశం చేశాడు.

వైశంపాయనుడు ఇలా అన్నాడు. 'ఓ జనమేజయా! సాక్షాత్తూ విష్ణు స్వరూపుడు మరియు జగద్గురువు అయిన శ్రీకృష్ణ భగవానుని ముఖము నుండి అద్భుతమైన దర్మప్రసంగం విని పాండవులందరు ప్రసన్నులై భగవానునికి ప్రణామ మాచరించారు.

ఆ తర్వాత శ్రీకృష్ణుడు నాలుగు అశ్వాలు పూన్చిన రథముపై ద్వారకకు ప్రయాణమైనాడు. ప్రేమవశమున ధర్మరాజు, భీమార్జున నకుల సహదేవులు శ్రీకృష్ణుని వెంట ఇరువది నాలుగు మైళ్ళు వెళ్ళారు.

శ్రీకృష్ణుడు వారిని అడ్డుకొని, ఆలింగనం చేసుకొని, వీడ్కోలు పలికాడు. శ్రీకృష్ణుడు చెప్పిన ఉపదేశమును మననం చేసికొంటూ, ఆ దేవుని తమ మనసులో నిలుపుకొంటూ పాండవులు హస్తినకు చేరారు.

-o0o-

15. ఆశ్రమవాస పర్వం

పాండవులకు రాజ్యాధికారము చేతికి వచ్చినా కూడా వారు ధృతరాష్ట్రునితో ప్రేమ, గౌరవంతోనే ఉన్నారు. విదురుడు, సంజయుడు, యుయుత్సుడు అహర్నిశం ధృతరాష్ట్రుని సేవలో నిమగ్నులై ఉన్నారు. పాండవులు కూడ ప్రతి విషయాన్ని ఆయన సలహా మేరకే చేసేవారు. ఈ విధంగా పదిహేను సంవత్సరాలు రాజ్యపాలన జరిగింది. కుంతి కూడ గాంధారికి సేవ చేస్తూ ఉండేది. ద్రౌపది మరియు సుభద్ర ఇతర స్త్రీలతోపాటు గాంధారి మరియు కుంతిల సేవ సమాభావంతో చేసేవారు. మహాధనుర్విదుడైన కృపాచార్యుడు కూడ ధృతరాష్ట్రుని వెంట ఉండేవాడు. ధృతరాష్ట్రుని విషయంలో ధర్మరాజు తన సోదరులకు ఇలా చెప్పేవాడు. 'ధృతరాష్ట్రుడు తన కుమారుల నందరిని కోల్పోయాడు. ఆయన మనస్సు నొప్పించకూడదు.' ఈ మాటలు భీమసేనునికి మాత్రం రుచించలేదు. కారణం ఆయన స్వార్థబుద్ధిని భీమసేనుడు మరువ లేకున్నాడు. అయినా ధృతరాష్ట్రునికి ఆన్ని సౌకర్యములు నిరభ్యంతరంగా జరుగుతూ ఉండేవి.

ప్రజలు ధర్మరాజును మరియు ధృతరాష్ట్రుని చూచుటకు వచ్చేవారు. కాని భీమసేనుడు మాత్రం క్లేశం పొందేటట్లు చేసేవాడు. ధృతరాష్ట్రుడు మరియు గాంధారి వినునట్లు ఒకసారి భీముడు తన మిత్రులతో ఇలా అన్నాడు. 'మిత్రులారా! నేను నా శౌర్యరాక్రమాలతో, నా భుజబలంతో దుర్యోధనాదులను అందరిని యమపురికి పంపాను.' ఈ మాటలు పెద్దవారికి ముల్లుల్లా గుచ్చుకున్నాయి. ఆ తరువాత ధృతరాష్ట్రుడు మిత్రులను పిలిపించుకొని 'మిత్రులారా! కౌరవ నాశనం ఎలా జరిగిందో మీ అందరికీ తెలుసు. నేను దీనికి ప్రధాన కారణం. దుర్యోధనునిలో దుర్మార్గాన్ని నేను నివారించలేక పోయాను. శ్రీకృష్ణుని మాటలు కూడా నేను లెక్కపెట్టలేదు. విదురుడు, భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, వేదవ్యాసుడు మొదలైనవారు మరీ మరీ చెప్పారు. నేను లెక్కచేయ లేదు. సంజయుడు, గాంధారి ఎంతగానో నచ్చచెప్పారు. అయినా పెడచెవిన పెట్టాను. నేను చేసిన వేలాది తప్పులు నన్ను వెంటాడుతున్నాయి, హింసిస్తున్నాయి. ఈ పదిహేను సంవత్సరాల తర్వాత నా కళ్ళు తెరిపిన పడ్డాయి. నేను నా పాప ప్రక్షాళన కొరకు బ్రతకటానికే ఒక పూట మాత్రమే భోజనం చేస్తున్నాను. ఇది గాంధారికి మాత్రమే తెలుసు. నన్ను అనుసరిస్తూ గాంధారి కూడా నేలపైనే పడుకొంటున్నది.' ఇవన్నీ చెప్పి ధర్మరాజుతో 'కుంతీనందనా! నీకు కళ్యాణమగు గాక! నేను మరియు గాంధారి పుణ్యకర్మలాచరించుటకు అడవులకు వెళ్ళటానికి అనుమతించు.' అనగా ధర్మరాజు 'మహారాజా! మీరు ఇక్కడ సుఖముగా ఉన్నారని అనుకుంటున్నాను. ఒకపూట భోజనం తెలియదు. వీటన్నింటికి నేనే కారణము. అందుచేత నేను అడవుల్లోకి వెళ్ళిపోతాను. మీరు స్వయంగా కాని లేక యుయుత్సునకు గాని రాజ్యభారం అప్పగించండి. మీర నన్ను విడిచి వెళితే, నేను మిమ్మల్న అనుసరిస్తూ, మీ సేవలో ఉంటాను.' అని అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు. 'నాయనా! నీవు నన్ను ఇబ్బంది పెట్టవద్దు. నా మనస్సు శోకంతో ఉంది. మేము అడవులకు వెళ్ళుటకు అనుమతించు. దుఃఖాన్ని వదలి, రాజ్యపాలన చేసుకో.' అని అన్నాడు.

ఇలా ధృతరాష్ట్రుడు అడవులకు వెళ్ళుటకు సిద్ధపడి, పాండవులను పిలిపించుకొని, వారిని అభినందించాడు. నారవస్త్రాలు, చర్మము ధరించి, సేవకులకు దానములిచ్చి, అందరికీ వీడ్కోలు చెప్పి, రాజభవనం నుండి బయటకు వచ్చాడు. ఆ సమయంలో ధర్మరాజు చేతులు జోడించి, నమస్కరిస్తూ, ఏడ్వసాగాడు. భీమార్జున నకులసహదేవులు, విదురుడు, సంజయుడు, యుయుత్సుడు, కృపాచార్యుడు, ధౌమ్యుడు మరియు బ్రాహ్మణులు, నగరవాసులు ధృతరాష్ట్రుని వెంట నడువసాగారు. కుంతి, గాంధారి చేతిని పట్టుకొని నడువసాగింది. ధృతరాష్ట్రుని వెంట

ద్రౌపది, సుభద్ర, చిత్రాంగద మున్నగు వారందరు నడువసాగారు.

ఆ తరువాత హస్తినాపుర పౌలిమేరలు దాటిన తర్వాత జనసమూహాన్ని హెచ్చరించి, వీడ్కోలు పలికారు. విరుదుడు, సంజయుడు, ధృతరాష్ట్రుని వెంట వెళ్ళుటకు నిశ్చయించుకొన్నారు. ధృతరాష్ట్రుని ఆజ్ఞ మేరకు ధర్మరాజు అంతఃపుర స్త్రీలను తీసికొని వెళ్ళిపోవుటకు సిద్ధపడి, తల్లియైన కుంతిని రమ్మని కోరాడు. కుంతి 'నాయనా! నేను కూడ గాంధారితో పాటు తపస్సు చేస్తూ శాంతిని వెతుక్కుంటాను. కర్ణుని పేరు మీద కూడ దానాలు చేయండి. భీమార్జున నకుల సహదేవులను జాగ్రత్తగ చూచుకో' అని చెప్పి, కంటనీరు పెడుతూ వెళ్ళిపోయింది.

ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, విదురుడు, సంజయుడు మరియు ఇతర సహచరులు అడవిలోనికి ప్రవేశించగా, పాండవులు భారమైన హృదయాలతో, కుంతిని వదలి నగరంవైపు బయలుదేరారు. ఆనాటి హస్తిన ఆనంద, ఉత్సాహశూన్యమై, ఉదాసీనమై నిలిచిపోయింది.

ఆరోజు చాల దూరం నడిచి, ధృతరాష్ట్రుడు గంగాతీరాన విడిది చేశాడు. వేదవిదులైన బ్రాహ్మణులు విధివిహితంగా అగ్నిని ప్రజ్వరిల్ల జేస్తున్నారు. ఆ తరువాత విదురుడు, సంజయుడు కుశలతో శయ్యలను పరిచారు. ఒకదానిపై ధృతరాష్ట్రుడు, మరియొక దానిపై గాంధారి, కుంతి నిద్రించారు. విదురుడాదిగా గలవారు అల్లంత దూరంలో, కూతవేటు దూరంలో, పడుకొన్నారు. వెంటవచ్చిన బ్రాహ్మణోత్తములు కూడ వారి వారికి అనువైన స్థలాల్లో నిద్రించారు. అగ్ని ప్రజ్వరిల్లుతూ అడవి ఆనందదాయకంగా కనిపించ సాగింది. మరునాటి ఉదయం అందరూ లేచి వారి వారి పనులలో నిమగ్నులైనారు. అందరూ ఉపవాస దీక్షలో వున్నారు. ఆ తర్వాత ధృతరాష్ట్రుడు వేదవ్యాస ఆశ్రమమునకు వచ్చి, వనవాస దీక్ష తీసికొని నియమబద్ధమైన విధితో తపస్సు చేయనారంభించాడు.

ఆప్తులను అడవిలో వదలి, తల్లి కుంతిని అడవుల్లో వదలి, పాండవులు రాజభోగాలు అనుభవించటం, వారికి మిక్కిలి బాధాకరంగా ఉంది. క్రూరమృగాలతో నిండివుండే అడవిలో సుకుమారియైన తన తల్లి కుంతి ఎన్ని ఇక్కట్లు అనుభవిస్తున్నదోనని వారు తల్లడిల్ల సాగారు. సహదేవుడు, ద్రౌపది తమ తీవ్రమైన కోరికను వ్యక్తీకరించగా, ధర్మరాజు పరివారం తగిన సైన్యంతో అడవుల్లోకి బయలుదేరారు.

కురుక్షేత్రమునకు చేరుకొన్న పాండవులు, అక్కడి మునులను కుంతీ, గాంధారీ, ధృతరాష్ట్రులను గురించి అడుగగా, వారు నీరు తేవడానికి యమునా నదికి వెళ్ళారని చెప్పారు. పాండవులు వడివడిగా వారికి ఎదురేగారు. సహదేవుడు పరుగెత్తుకొనిపోయి తల్లి కుంతి పాదాల మీద పడి నమస్కరించాడు. కుంతి సహదేవుని దగ్గరకు తీసుకొంది. మిగతా వారందరు పాదాభివందనం చేశారు. ధృతరాష్ట్రుడు అందరినీ ఆశీర్వదించాడు. అక్కడినుండి మాట్లాడుకొంటూ, అందరూ ఆశ్రమానికి చేరారు. దేశవిదేశాలనుండి తపస్సు చేసికొనుటకు అక్కడికి వచ్చిన మునులకు, ఋషులకు పాండవులను పేరు పేరున పరిచయం చేశారు.

ధృతరాష్ట్రుడు – 'ధర్మనందనా! నీవు, సోదరులు అందరూ క్షేమమే గదా? నీ పాలనలో ప్రజలందరూ సుఖంగా వున్నారా?' అని అడుగగా, ధర్మారాజు ఇలా అన్నాడు. 'రాజా! మేమంతా కుశలమే. మీ సద్గుణ సంపద వల్ల, మేమదరం సుఖంగా ఉన్నాం. సంజయుడు తపస్సు చేస్తూ కనిస్తున్నాడు. కాని విదురుడు కనిపించటం లేదే.' ధృతరాష్ట్రుడు ఇలా చెప్పాడు. 'కుమారా! విదురుడు కుశలమే. అతడు కఠినమైన తపస్సు చేస్తున్నాడు.

నిరంతరం ఉపవాసంతో వాయుభక్షణలో వున్నాడు. కనుక దుర్బలుడై పోయాడు.' ఇలా అంటున్నంతలోనే, దూరాన్నుండి మస్తున్న విదురుడు అకస్మాత్తుగా వెనుకకు తిరిగి వెళ్ళిపోయాడు. విదురా! విదురా! అంటూ ధర్మరాజు అతని వెంటపడ్డాడు. విదురుడు కన్పిస్తూ, మాయమౌతూ, దట్టమైన అడవిలోకి వెళ్ళి, ఒక చెట్టుబోదెకు ఆనుకొని నిల్చుండిపోయాడు. కృంగి, కృశించి కంకాళరూంలో ఉన్న విదురుని పోల్చుకోవడం కష్టంగా వుంది. అయినా ధర్మరాజు 'విదురా! నన్ను గుర్తుపట్ట లేదా?' అని అడిగాడు. విదురుడు ఏమీ మాట్లాడకుండా, ఏకాగ్రచిత్తంతో, ధర్మరాజును చూస్తూ, కళ్లలో కళ్ళు, శరీరంలో శరీరం, ప్రాణంలో ప్రాణం కలిపి ఏకాకారుడై పోయాడు. చెట్టుకు అంతకు ముందు ఆనుకొని వున్న విదురునిలో చలనం లేకపోయింది.

ధృతరాష్ట్రుని ఆశ్రమానికి వచ్చిన వేదవ్యాస మహర్షి చేసిన చమత్కారం ఏమిటో తెలుసుకొందాం.

వేదవ్యాస మహర్షి ఆశ్రమానికి వచ్చి ధృతరాష్ట్రునికి చక్కని ఉపదేశంతో సాంత్వన చేకూర్చాడు. తరువాత అక్కడి వారి నుద్దేశించి ఇలా అన్నాడు. 'పూర్వకాలం నుండి ఇప్పటి వరకు ఏ ఋషి చేయలేని చమత్కారపూర్ణ కార్యాన్ని నేను చేసి చూపెడతాను. నా తపోబలం మీకు ఋజువు చేస్తాను. మీరు నా నుండి ఏమి కోరుతున్నారో చెప్పండి. మీలో ఎవరైనా చూడాలనుకొంటున్నారా? మాట్లాడ దలచుకొంటున్నారా! లేక వారిని స్పర్శించాలనుకొంటున్నారా, చెప్పండి. నిరభ్యంతరంగా మీ కోరిక తెలిపితే, నేను తీర్చగలను.' అనిన తర్వాత జరిగినది.

ధృతరాష్ట్రుడు పాండవులందరు గాంధారి, కుంతి, ద్రౌపది, సుభద్ర మున్నగువారు తాము కోల్పోయిన వారిని చూడాలని తహతహలాడుతున్నారు. ధృథరాష్ట్రుడు, గాంధారి తమ కుమారులను, కుంతి ప్రధానంగా కర్ణుని, ద్రౌపది మరియు సుభద్ర అభిమన్యుని మరియు ద్రుపద రాజకుటుంబాన్ని చూడాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

ఆ తర్వాత వేదవ్యాస మహర్షి అందరినీ తీసికొని, గంగా తీరానికి వెళ్ళాడు. వారి వారి స్థాయిని బట్టి ఆ తర్వాత వారి వారి స్థాయిని బట్టి తగు ప్రదేశాల్లో కూర్చొన్నారు. కురుకుల స్త్రీలందరు గాంధారితో పాటు కూర్చున్నారు. తరువాత వహతేజశ్శాలియైన వేదవ్యాస మహర్షి గంగానది పవిత్ర జలాల్లోకి ప్రవేశించి, పాండ, కౌరవ పక్షాల్లోని సమస్త యోధులను ఆవాహన చేశాడు. ఆ సమయంలో వారందరు ఏకమౌతున్నట్లు శబ్దము వినిపించ సాగింది. కొద్ది సేపట్లోనే, భీష్మ పితామహుడు, ద్రోణాచార్యుడు మున్నగు వేలాది మంది సైనికులతో బాటు గంగానది నుండి బయటకు వచ్చారు. కుమారులు మరియు సైన్యంతో పాటు విరాటరాజు, ద్రుపదుడు, ద్రౌపది అయిదుగురు కుమారులు, అభిమన్యుడు, ఘటోత్కచుడు, కర్ణుడు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు మున్నగు కౌరవ సంతానం అంతా, భగదత్తుడు, శకుని, శల్యుడు, లక్ష్మణ కుమారుడు, దృష్టధ్యుమ్నుడు మొదలగు చాలమంది వీరులు దేదీప్యమాన శరీరములతో నీటిలోనుండి పైకి వచ్చారు. ఆ సమయంలో వారిలో వైరం, అహంకారం, క్రోధం మరియు మాత్సర్యం మచ్చుకైనా లేవు.

వేదవ్యాస మహర్షి ప్రసన్నుడై, ధృతరాష్ట్రునకు దివ్య నేత్రాలు ప్రదానం చేశాడు. గాంధారి కూడ దివ్యజ్ఞానంతో సంపన్నురాలైంది. గాంధారి, ధృతరాష్ట్రుడు కూడ తమ తమ బిడ్డలను చూడగలిగారు. అది ఒక మహోద్భుతమైన దృశ్యమై వెలుగొందింది. అందరి శరీరాలు జలదరించ సాగాయి.

ఆ తర్వాత గంగానది నుండి బయటకు వచ్చి పాపశూన్యులైన నరశ్రేష్ఠులందరు తమ తమ వారిని ప్రేమ పూర్వకంగా పలుకరించుకొని, అందరూ సంతోషంగా, ఉల్లాసంగా ఉన్నారు. కుమారులు తల్లిదండ్రులతో పాటు,

సోదరులు సోదరులతో పాటు మరియు మిత్రులు మిత్రులతో పాటు కలవసాగారు. పాండవులు అభిమన్యుని మరియు ద్రౌపది ద్వారా కలిగిన అయిదుగురు పుత్రులను హర్షంతో ఆలింగనం చేసుకొన్నారు. ఆ తరువాత కర్ణుని కలిసి సోదర ప్రేమను తెలియజేశారు. ఇంకా కూడ గురువులు, బంధువులను మరియు వారి పుత్రులను కలుసుకొన్నారు. ఆ రాత్రి అంతా ఇదేవిధంగా ప్రేమపూర్వక సల్లాపాల్లో పరస్పరం అందరూ తేలియాడుతూ ఉన్నారు. అపుడు ఎవరి హృదయంలో కూడ శోకం, భయం, ఉద్వేగం, అపయశం తొంగిచూడలేదు. అక్కడకు వచ్చిన స్త్రీలు కూడ తమ తమ తల్లిదండ్రులను, సోదరులను, భర్తలను కలుసుకొని సంతోషాంతరంగులైనారు. ఇలా అందరి మానసిక దుఃఖం పటాపచలైంది. ఆ వీరులు ఆ ఒక్క రాత్రి భార్యలతో ఒకరి వెంట ఒకరు వుండి, చివరకు పరస్పరము ఒకరి అనుమతి మరొకరు తీసికొని, ఎవరి స్థానాలకు వారు వెళ్ళుటకు సిద్ధపడ్డారు.

వేదవ్యాస మహర్షి అందరినీ తన ధ్యానములో విసర్జించుకోగానే అందరూ చూస్తుండగానే వారందరు ఒక్క క్షణంలో గంగానదిలో మునిగి అదృశ్యమై పోయారు. వారందరు అదృశ్యమైన తరువాత, వేదవ్యాస మహర్షి పవిత్ర గంగానదిలో నిల్చుని వితంతు స్త్రీలను ఉద్దేశించి ఇలా అన్నాడు. 'పుణ్యస్త్రీలారా! మీలోనుండి ఎవరైనా తమ భర్తల లోకానికి వెళ్ళాలనుకుంటే, ఈ గంగానది పవిత్ర జలాల్లో స్థిరచిత్తులై ప్రవేశించండి.' ఈ మాటలు శ్రద్ధగా విన్న కొందరు స్త్రీలు గంగానదిలో దూకి తమ భర్తలను చేరుకొని, దివ్య శరీరధారులైనారు.

వేదవ్యాస మహర్షి దివ్య ఆశీస్సులు, ప్రేమాధిక్యత వల్ల, రణరంగంలో ప్రాణాలు కోల్పోయినవారి దర్శన భాగ్యం లభించిందన్న విషయం అందరికీ తెలిసి, సంభ్రమాశ్చర్యాలకు లోనైనారు. ఈ సంగతి విన్నవారికి, చదివిన వారికి ప్రియవస్తు లబ్ధి చేకూరుతుంది. ఈ విషయాన్ని వ్యాప్తిచేసిన ఉత్తమ మానవులకు ఇహలోకంలో యశస్సు, పరలోక సద్గతి ప్రాప్తిస్తుంది.

పాండవులు తపోవనం నుండి తిరిగి వచ్చి రెండు సంవత్సరాలు గడిచాయి. ఒకరోజు నారదుడు ధర్మరాజు కొలువుకు రాగా, రాజు పూజాదికాలు నిర్వహించి ఇలా అడిగాడు – 'దేవా! మీ దర్శనభాగ్యంతో మేము పునీతుల మైనాము. మీరు ఎక్కడెక్కడ పర్యటించి వస్తున్నారో తెలపండి.' నారదుడు ఇలా చెప్పాడు. 'రాజా! చాలాకాలం తర్వాత మిమ్మల్ని కలిశాను. ఇప్పుడు నేను తపోవనం నుండి వస్తున్నాను. గంగాదేవి దర్శనం కూడ చేసుకొన్నాను.'

ధర్మరాజు – 'దేవా! గంగాతీరంలో ధృతరాష్ట్రుడు కఠోర తపస్సు చేస్తున్నారని విన్నాం. మీకు ఆయన తటస్థ పడినారా? దయచేసి ఆ వివరాలు చెప్పండి.'

నారదుడు – 'రాజా! మీరు తపోవనం నుండి తిరిగి వచ్చాక, ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీ గంగానది ముఖద్వారం (హరిద్వార్) వద్దకు వెళ్ళారు. సంజయుడు మరియు బ్రాహ్మణులు అగ్నిహోత్ర సామగ్రితో ఆయన వెంట వెళ్ళారు. ధృతరాష్ట్రుడు అక్కడికి చేరుకొని, నోటిలో బండరాయి పెట్టుకొని, వాయువే ఆహారంగా, మౌనంగా తపస్సు చేయనారంభించాడు. ఆరు నెలల్లో ఆయన బక్కచిక్కి ఎముకల గూడుగా తయారైనాడు. గాంధారి కేవలం మంచినీరు తాగుతూ ఉండిపోయింది. కుంతీదేవి నెలకొకసారి భోజనం చేస్తుండేది. సంజయుడు మూడు రోజుల కొకసారి భోజనం స్వీకరిస్తూ వుండినాడు. ఒక్కోసారి కనపడుతూ, మరొకమారు అదృశ్యమవుతూ వుండేవాడు. గాంధారి, కుంతి, సంజయుడు అనుసరిస్తూ ఉండేవారు.

ఒకసారి తీవ్రమైన అగ్నిజ్వాలలు వీరున్న వైపు రాసాగాయి. వీటిని చూచి ఏమాత్రము భయపడకుండా, తూర్పు ముఖము చేసుకొని ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి కూర్చొని వున్నారు. సంజయునికి శక్తి వున్నది

కావున దూరంగా వెళ్ళమని చెప్పి, ఈ ముగ్గురూ అగ్నికి ఆహుతి అయ్యారు.

మీరు వెళ్ళి, ఆ ముగ్గురికి జల తర్పణం చేసి రండి' అని నారదుడు చెప్పగా, ధర్మరాజు సోదరులతో పాటు గంగాతీరానికి వెళ్ళి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించాడు.

కురుక్షేత్ర యుద్ధం పరిసమాప్తమైన పిదప, ధృతరాష్ట్రుడు 15 సంవత్సరాలు హస్తినాపురంలో, మూడు సంవత్సరాలు తపోవనంలో వుండి, అసువులు బాశాడు.

-o0o-

16. మౌసల పర్వం

మహాభాత యుద్ధం తర్వాత 36వ సంవత్సరం ప్రారంభంలో ధర్మరాజుకు అనేక అపశకునాలు అగుపించడం ప్రారంభమైంది.

ప్రచండమైన గాలి వీయడం, రాళ్ళవర్షం కురవడం, ఆకాశం నుండి ఉల్కలు రాలడం, సూర్యచంద్రుల తేజస్సు తగ్గిపోవడం మున్నగు భయోత్పాతమైన సూచనలు కన్పడసాగాయి.

ముసలము (రోకలిబండ) పుట్టడం వల్ల యాదవ కులం యావత్తూ నశించిపోయింది. కేవలం శ్రీకృష్ణుడు, బలరాముడు మాత్రమే బయటపడ్డారు. ద్వారాక సముద్రంలో మునిగిపోయింది. ఈ విషయం తెలిసిన పాండవులు అచేతనులై, శోకతప్త హృదయాలతో వున్నారు.

యాదవకుల నాశనం ఎలా జరిగిందో తెలుసుకొందాం.

కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తర్వాత చాలకాలానికి, విశ్వామిత్రుడు, కణ్వుడు, నారదుడు ద్వారకకు వచ్చారు. దైవప్రేరితమైన యాదవ యోధుడు సారణుడు మున్నగువారు వీరుడైన సాంబునికి స్త్రీవేషం వేయించి, మహర్షుల వద్దకు తీసికొని వెళ్ళి ఇలా అన్నారు. – 'ఓ మహర్షులారా! ఈమె మహా తేజశ్శాలియైన బభ్రువాహనుని భార్య. పుత్రుడు కావాలని తీవ్రంగా ఆశపడుతున్నది. మీరు మీ దివ్యదృష్టితో ఏం జరుగుతుందో చెప్పండి' అని అడుగగా, మహర్షులు వారి వంచనను గ్రహించి ఇలా అన్నారు 'మూర్ఖులారా! శ్రీకృష్ణుని పుత్రుడైన ఈ సాంబునికి ముసలం (రోకలి) పుట్టి పరస్పర కలహంతో కొట్టుకొని చస్తారు. దీని ప్రభావం శ్రీకృష్ణుని మీదగాని, బలరాముని మీద గాని వుండదు. బలరాముడు శరీరాన్ని వదలి సముద్రంలో కలిసిపోతాడు. శ్రీకృష్ణుడు నగరం వదలి దూరంగా వున్న అడవిలో పడుకొని వుండగా, ఒక వేటగాని బాణమునకు బలి అవుతాడు. ఈ ద్వారకా నగరం సముద్రంలో కలిసిపోతుంది.' అని వారిని గద్దించారు. ఈ విషయాన్ని మహర్షులు శ్రీకృష్ణునికి కూడ చెప్పారు. శ్రీకృష్ణుడు యాదవులకు చెప్పాడు. ఈ అంత్యకాలాన్ని మార్చాలని శ్రీకృష్ణుడు తలంచలేదు. కాని ద్వారకలోని ప్రజలందరిని అక్కడి నుండి ప్రభాసతీర్థానికి వెళ్ళిపొమ్మని మాత్రం చెప్పాడు.

రెండవరోజు సాంబుని కడుపు చీల్చుకొని ఇనుప రోకలి ఉత్పన్నమైంది. ఈ విషయాన్ని యాదవులు ఉగ్రసేన మహారాజుకు చెప్పారు. రాజు ఎంతో దుఃఖించి, ముసలాన్ని చూర్ణం చేసి సముద్రంలో కలిపించాడు.

ఈ విపత్తును తొలగించుటకుగాను, ఉగ్రసేనుడు, శ్రీకృష్ణుడు, బలరాముడు మరియు బభ్రువాహనుడు సమావేశం ఏర్పాటు చేసుకొని, నగరవాసులకు కొన్ని నియమాలు పాటించాలని చాటింపు వేయించాడు. సురను తయారు చేయరాదు, సురాపానం చేయరాదు, క్రోధం జయించాలని హితవు పలికారు. కాని యమదేవతలు యాదవుల ఇళ్ళలో కరాళ నృత్యం చేయసాగారు. మేటి యాదవ ధనుర్ధరులు వాళ్ళపై బాణవర్షం కురిపించినా, ఫలితం శూన్యం. ప్రతిదినం ఉధృతమైన గాలి వీస్తోంది. ఎలుకలు పెద్ద ఆకారాల్లో వీధుల్లో తిరుగుతూ జనాన్ని కరుస్తున్నాయి. గుడ్లగూబలు ఇళ్ళలో చేరి భయపెడుతున్నాయి. వికృత ఆకారాల్లో పావురాళ్ళు సంచరిస్తున్నాయి. భయంకరమైన రీతిలో ఆవులకు గాడిదలు, కుక్కలకు పిల్లులు, ముంగిసలకు ఎలుకలు ఇలా విపరీతంగా పిల్లలు జన్మించ సాగాయి. అపుడు శ్రీకృష్ణుడు ఇలా ఆలోచించ సాగాడు. యదువంశీయులకు గాంధారి ఇచ్చిన శాపం

కార్యరూపం దాల్చబోతున్నది అనుకొని అందరూ కలిసి ప్రభాసతీర్థానికి రావాలని ఆదేశించాడు.

ఇది ఇలా ఉండగా, ద్వారకలో ఉన్న స్త్రీలందరికి స్వప్నంలో ఒక భయంకరమైన వికృతాకారంలో ఉన్న స్త్రీ వచ్చి, అందరినీ పట్టుకొని జుట్టు పీకి, బొట్టు చెరిపి వేస్తున్నట్లు కనిపించ సాగింది. నగరంలో నడవసాగింది. ఇక పురుషులకేమో ఒక పెద్ద ఆకారం గల గద్ద ముక్కున తమను కరుచుకొని తింటున్నట్లు కనబడసాగింది. ఇక ద్వారకలో వుండటం క్షేమం కాదని గ్రహించి అందరూ శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా ప్రభాసతీర్థానికి తరలివెళ్ళారు.

ఒకరోజు యాదవుల సమావేశం జరుగుతోంది. సాత్యకి ఆవేశంతో కృతవర్మను నిందించసాగాడు. ప్రద్యుమ్నుడు కూడ అందుకు వంతపాడాడు. కృతవర్మ కోపంతో సాత్యకిని అపహాస్యం చేసి దురుసుగా మాట్లాడినందున, సాత్యకి కోపం హద్దు మీరి, కత్తి తీసుకొని ఊగిపోతూ వెళ్ళి కృతవర్మ తలను శరీరంనుండి వేరుచేశాడు. ఇతర వీరులను కూడ చంపసాగారు. అపుడు భోజవంశీయులు, అంధక వంశీయులు సాత్యకిని చుట్టుముట్టారు.

సాత్యకిని రక్షించటానికి ప్రద్యుమ్నుడు భోజవంశీయులను ఎదుర్కొన్నాడు. సాత్యకి అంధక వంశీయులను తరిమి కొట్టసాగాడు. వీరిద్దరు ఎంత పరాక్రమశాలురైనా కూడా, శత్రువుల సంఖ్య వేలల్లో ఉన్నందున, చివరకు సాత్యకి మరియు ప్రద్యుమ్నుడు ప్రాణాలు కోల్పోయారు. ఇది చూచిన శ్రీకృష్ణుడు కోపంతో సముద్ర తీరాన పెరిగిన తుంగను పెరకగానే, అది వజ్రసమానమైన, భయంకరమైన ఇనుప రోకలి అయింది. ఎదురుగా వచ్చిన వారినందరిని దానితో మోది చంపసాగాడు. మిగతా యాదవులు కూడ తుంగను పెరుకగా అది ముసలమై భీభత్సాన్ని సృష్టించసాగింది.

ఆ యుద్ధంలో శ్రీకృష్ణుని కుమారులైన సాంబుడు, అనిరుద్ధుడు కూడ చనిపోయారు. ఇదిచూచిన శ్రీకృష్ణుడు పట్టరాని కోపంతో శంఖ చక్ర గదాధారుడై మిగిలిన యాదవులనందరినీ యమలోకానికి పంపించాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన బభ్రువాహనుడు శ్రీకృష్ణునితో 'దేవా! ఇక శాంతించండి. యావత్ యాదవకులం నాశనమైంది. ఇపుడు బలదేవుడు ఎటు వెళ్ళాడో తెలుసుకోవాల్సి వుంది.' అని అన్నాడు.

శ్రీకృష్ణుడు, బభ్రువాహనుడు మరియు దారుకుడు బలరాముని పాద చిహ్నాలను చూస్తూ వెళ్ళి, ఒక చెట్టు క్రింద కూర్చున్న బలరాముని చూచారు. హస్తినాపురమునకు వెళ్ళి అర్జునుని తీసుకొని రావలసినదిగా శ్రీకృష్ణుడు బభ్రువాహనునికి చెప్తున్న క్షణంలోనే ఎక్కడినుండో ముసలం వచ్చి బభ్రువాహనుని మీద పడగా, అతడ చనిపోయాడు.

శ్రీకృష్ణుడు బలరామునితో 'అన్నా! బలరామా! నేను తిరిగి వచ్చేవరకు మీరు ఇక్కడనే వుండండి అని హుటాహుటిన ద్వారకకు వెళ్ళి అర్జునుడు వచ్చేంతవరకు స్త్రీలను రక్షించమని వసుదేవునికి చెప్పి, శ్రీకృష్ణుడు బలరాముని వద్దకు వచ్చాడు. బలరాముడు యోగముద్రలో ఉన్నాడు. అతని ముఖంనుండి తెలుపు రంగులో వేలాది ముఖములు కలిగివున్న ఒక పాము బయటకు వచ్చి, సముద్రంవైపు వెళ్ళసాగింది. సముద్రుడు స్వయంగా ప్రత్యక్షమై, స్వాగతం పలికి, పరంధామమునకు తీసుకొని వెళ్ళాడు.

ఒంటరివాడైన శ్రీకృష్ణుడు అడవిలో తిరుగుతూ అలసిపోయి ఒక చోట పడుకున్నంతలో 'జర' అను

పేరుగల వేటగాడు మృగమనుకొని చంపడానికి బాణం వేశాడు. అది శ్రీకృష్ణుని కాలి బొటనవ్రేలికి తగులుకొంది. ఇంద్రాది దేవతలు వచ్చి, తేజోమయమైన శ్రీకృష్ణునికి స్వాగతం పలికారు.

అర్జునుడు ద్వారకకు వచ్చి వసుదేవుని కలవగా, వసుదేవుడు శ్రీకృష్ణుని సందేశము చెప్పి, తాను అసువులు బాశాడు.

తరువాత అర్జునుడు యాదవుల సభ ఏర్పాటు చేసి అందరిని ఇంద్రప్రస్థానికి తీసికొని వెళ్తామని చెప్పి, సిద్ధం కావలసినదని చెప్పాడు. అర్జునునితోపాటు, పిల్లలు, స్త్రీలు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రుల మరియు శ్రీకృష్ణుని పదహారు వేల మంది స్త్రీలు, ఇతర వితంతు మహిళలందరూ రథములపై వెళ్ళసాగారు. వారు ద్వారకను దాటగానే, రత్నగర్భయైన సముద్రంలో ద్వారక కలిసిపోయింది.

ఈ మహాద్భుతమైన దృశ్యాన్ని చూచిన అర్జునుడు, తన బృందం వేగాన్ని పెంచారు. అనేకమైన ప్రదేశాలను, అతి కష్టంతో దాటుతూ, విశ్రమిస్తూ ముందుకు సాగారు. వారు అలా పంచనద దేశం చేరుకోగానే అక్కడ వున్న దొంగలు, దోపిడీదారులు, అర్జునుని రక్షణలో ఇంతమంది వెళ్ళడం సహించలేక ఆక్రమణ చేశారు. వారు ధనం దోచుకోవడం, స్త్రీలను అపహరించడం మున్నగు దుర్మార్గాలు చేయసాగారు. అర్జునుడు మొదట హెచ్చరించినా ప్రయోజనం లేనందున, బాణప్రయోగానికి సిద్ధపడ్డాడు. తన దివ్యాస్త్రం గాండీవాన్ని ఎక్కుపెట్ట ప్రయత్నించి విఫలుడై అతి కష్టం మీద ఎక్కుపెట్టినా కూడా దివ్యాస్త్రములు స్మరణకు రాకపోవడంతో అర్జునుడు తన స్థితికి సిగ్గుపడ్డాడు. అర్జునుని వెంట వున్న కాల్బలం మరియు ఇతర యోధులు దోపిడీదారులను నిలువరించ లేకపోయారు. ఆ దుర్మార్గులు స్త్రీలను జుట్టుపట్టుకొని లాక్కుపోతున్నారు. అర్జునుడు తన సైనికులతోశరపరంపర కురిపిస్తూ వారిని భయభ్రాంతులను చేస్తున్నాడు. అర్జునుని అమ్ములపొది ఖాళీ అయింది. గాండీవ ధనుస్సుతోనే మోదుతూ వారిని చంపుతున్నాడు. అర్జునుని భుజబలం, శౌర్యం క్షీణించ సాగింది. అర్జునుడు మిగిలిన రత్నరాసులను తీసుకొని స్త్రీలను తీసుకొని హస్తిన చేరాడు. రుక్మిణి, జాంబవతి అగ్నిప్రవేశం చేశారు. సత్యభామ మున్నగువారు తపస్సు చేయుటకు అడవులకు వెళ్ళారు.

అర్జునుడు దిక్కుతోచక ధర్మవేత్తయైన వేదవ్యాస మహర్షి వద్దకు వెళ్ళి, ఆయన పాదాలపై పడి, ఊపిరి నెమ్మదిగా తీస్తున్నాడు. వేదవ్యాసుడు – 'నాయనా! అర్జునా! నీవెందుకు అశాంతితో బాధపడుతున్నావు?' అని ప్రేమగా అతని తలపై నిమురుతూ అడిగాడు.

అర్జునుడు ఇలా చెప్పాడు. 'దేవా! యాదవులందరితో పాటు, శ్రీకృష్ణుడు, బలరాముడు కూడ పరంధామానికి చేరారు. శ్రీకృష్ణుడు లేకుండా నేను ఈ భూప్రపంచంలో ఉండలేను. ఎందరో వీరాధివీరులను జయించిన నేను దోపిడీగాండ్ర చేతిలో పరాభవం చెందాను. వారిని నిలువరించలేక పోయాను. దేవా! ఏదైన ఉపదేశించి నన్ను శాంతచిత్తునిగా చేయండి.'

వేదవ్యాస మహర్షి – 'బిడ్డా! శ్రీకృష్ణుడు సాధారణ మానవుడు కాదు. సాక్షాత్తూ శంఖచక్రగదాధారియైన సనాతన ఋషియైన నారాయణుడు. ఆ దేవదేవుడు కనుమరుగవుతూనే నరుడవైన నీ శక్తియుక్తులు కనుమరుగైనాయి' అని అన్నాడు.

ఈ రకంగా వేదవ్యాస మహర్షి చేత అర్జునుడు ఉపశమనం పొందినవాడై, ఈ విషయాలన్నీ ధర్మరాజుతో చెప్పాడు.

17. మహాప్రస్థాన పర్వం

ద్రౌపది సమేతంగా పాండవుల మహాప్రస్థానం ఏవిధంగా సాగిందో తలుసుకుందాం.

శ్రీకృష్ణుడు పరంధామమును చేరుకొన్నాడనే వార్త తెలియగానే, ధర్మరాజుకు కూడా ప్రస్థానం చేయాలనే తలంపు వచ్చింది. అందుకు భీమార్జున నకులసహదేవులు సమ్మతించటంతో, యుయుత్సునకు పట్టాభిషేకం చేశారు. తన సింహాసనంపై పరీక్షిత్తును అభిషేకించారు. అలాగే యదువంశమునకు శ్రీకృష్ణుని మనుమడైన వజ్రుని రాజుగా చేశారు.

ఆ తరువాత శ్రీకృష్ణ, బలరాములకు, వసుదేవునికి ధర్మరాజు సోదరులతోకలిసి జలతర్పణం చేసి, శ్రాద్ధ కర్మలను విధివిహితంగా నిర్వహించారు. ఆ తర్వాత పాండవులందరు ద్రౌపదితో సహా నారబట్టలు ధరించి మహాప్రస్థానం చేయనారంభించటంతో నాగకన్య ఉలూపి గంగలో ప్రవేశించింది. చిత్రాంగద మణిపురానికి వెళ్ళింది. వెంటవచ్చిన నగర ముఖులు తిరిగి నగరానికి వెళ్ళిపోయారు.

ఆ పిదప పాండవులందరు ద్రౌపదితో సహా ఉపవాసం చేస్తూ తూర్పు దిశగా ప్రయాణమై, ధర్మరాజు ముందు నడువగా ఆ తర్వాత వరుసక్రమంలో నడుస్తూ వున్నారు.

దేశదేశాలు తిరుగుతూ ఎట్ట సముద్రం తీరం చేరుకోగానే, సాక్షాత్తూ అగ్నిదేవుడు వారి మార్గాన్ని అడ్డుకొన్నాడు. ఏడు రకాల అగ్ని శిఖలతో శోభిల్లుతున్న అగ్నిదేవుడు ధర్మరాజుతో 'ధర్మరాజా! సోదరులారా! నేను అగ్నిదేవుణ్ణి అని గుర్తించి నేను చెప్పే విషయాలను శ్రద్ధగా వినండి.

నేను నరనారాయణుల సహకారంతోనే ఖాండవ వనాన్ని దహించాను. ఆ సమయంలో నరనారాయణులకు నేను సుదర్శన చక్రాన్ని, దివ్య గాండీవ ధనుస్సును, అక్షయ తూణీరాన్ని ప్రసాదించాను. నీ సోదరుడు అర్జునుడు తన గాండీవ ధనస్సును ఇక్కడే వదలిపెట్టి వెళ్ళాలి. ఇక మీకు దానితో పనిలేదు. అన్ని ధనస్సులలో ఇది శ్రేష్ఠమైనది. దీనిని వరుణదేవుని నుండి తీసుకొని రావలసి వచ్చింది. కనుక మరల వరుణ దేవునికే అప్పగించాల్సి వుంది.'

ఈ వృత్తాంతం వినిన సోదరులందరు అర్జునుని గాండీవాన్ని ఇచ్చివేయమని చెప్పారు. అర్జునుడు వ్యామోహంతో ఉంచుకొన్న గాండీవాన్ని, మరి రెండు తూణీరాలను నీటిలో వదలి వేశాడు. వెంటనే అగ్నిదేవుడు అంతర్ధానమైనాడు. ఆ తర్వాత పాండవులు పశ్చిమ దిశన ముందుకు సాగి, సముద్రంలో మునిగిపోయిన ద్వారకా నగర ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడినుండి ఉత్తర దిశగా ప్రయాణం సాగించి, హిమాలయాలకు చేరుకున్నారు. పాండవులు నియమపాలన చేస్తూ, హిమాలయాల్లో ప్రయాణించి శ్రేష్ఠమైన సుమేరుగిరిని దర్శించుకొన్నారు. పాండవులు ఏకాగ్రచిత్తంతో వేగంగా నడుస్తుండగా, వనుక వస్తున్న ద్రౌపది నేలవాలిపోయింది. ఇది చూచిన భీముడు ధర్మరాజుతో 'సోదరా! తన జీవితకాలంలో ఏ పాపం చేయని ద్రౌపది క్రింద ఎలా పడిపోయింది?' అని అడిగాడు.

ధర్మరాజు – నరశ్రేష్ఠా! ద్రౌపది మనస్సులో అర్జునుని యెడల వ్యామోహం వుంది. కనుక ఆ ఫలం అనుభవిస్తోంది. అంతే!' ధర్మరాజు ఇలా అని, ద్రౌపది ముఖం చూడకుండానే, ఏకాగ్ర చిత్తంతో ముందుకు నడువ సాగాడు. కొంత దూరం వెళ్ళిన తర్వాత సహదేవుడు పడిపోవటం చూచిన భీముడు మళ్ళీ ధర్మరాజును

అడిగాడు. అందుకు ధర్మరాజు – తనంతటి విద్వాంసుడు లేడని సహదేవుడు విఱ్ఱవీగేవాడు. అందువలన క్రింద పడిపోవాల్సి వచ్చింది. వీరిద్దరు పడిపోవటం చూచిన నకులుడు వ్యాకుల చిత్తంతో క్రింద పడిపోయాడు. దానికి ధర్మరాజు – నకులుడు తనకు తాను రూపవంతుడనని గర్వపడేవాడు. కాబట్టి పడిపోయాడు అని చెప్పాడు. కొంతదూరం వెళ్ళిన తర్వాత ఈ ముగ్గురూ పడిపోవడంతో శోకించిన అర్జునుడు కూడా క్రింద పడిపోయాడు. దీనికి ధర్మరాజు – ఒక రోజులో శత్రువులను భస్మీపటలం చేస్తానని చెప్పి, మాట తప్పాడు. కనుక కర్మఫలం అనుభవిస్తున్నాడు అని చెప్పి ముందుకు సాగిపోయాడు. అలా వారిద్దరూ చాల దూరం వెళ్ళిపోయిన తర్వాత హఠాత్తుగా భీముని కేక వినిపించింది. వెనుతిరిగి చూస్తే, భీముడు నేలమీద వ్రాలిపోయి కనిపించాడు. అపుడు ధర్మరాజు భీమునితో 'భీమసేనా! నీవు తీసికొనే ఆహారానికి కొలమానం లేకుండా వుండేది. పైగా నీకున్న బలపరాక్రమాలకు పదిరెట్లు చేసి చెప్పేవాడవు. కనుక నీవు పడిపోయావు' అని చెప్పి, తానొక్కడే ముందుకు సాగిపోతున్నాడు. ఒక కుక్క మాత్రం ధర్మరాజును వెంబడిస్తూ ముందుకు సాగుతోంది.

ఆ తరువాత దేవరాజైన ఇంద్రుడు రథం తీసుకొని వచ్చి, ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'కుంతీనందనా! నీవు ఈ రథాన్ని అధిరోహించు' అని అన్నాడు. ధర్మరాజు క్రిందపడిపోయిన తనవారిని చూపిస్తూ, ఇంద్రునితో ఇలా అన్నాడు. 'దేవేశ్వరా! నా సోదరులు అక్కడక్కడ పడివున్నారు. వారిని కూడా తీసుకొనివచ్చే ఏర్పాటు చేయండి. ద్రౌపదిని కూడా అనుమతించే పక్షంలో మాత్రమే నేను మీతో వస్తాను.' ఇంద్రుడు 'ఓ భరతశ్రేష్ఠా! నీ సోదరులు, ద్రౌపది అందరూ తమ శరీరాలను త్యాగం చేసి స్వర్గం చేరుకొన్నారు. కాని నీవు నీ శరీరంతో పాటే రావచ్చును.' అని అన్నాడు. అపుడు ధర్మరాజు తన వెంట వున్న కుక్కను చూపిస్తూ 'దేవా! ఈ శునకం నన్ను భక్తితో కొలుస్తూ తోడుగా వస్తున్నది. దానిని కూడా నా వెంట రానివ్వండి.' అని కోరాడు. అపుడు ఇంద్రుడు 'రాజా! నీకు నావలె స్వర్గీయ సుఖం దక్కుతుంది. దానిని వదిలి రండి.' అన్నాడు. అందుకు ధర్మరాజు 'దేవా! భక్తులనుకాదని, వదలి రాలేను.' అని అన్నాడు. ఇంద్రుడు అపుడు 'ధర్మరాజా! శునకాలతో వచ్చేవారికి స్వర్గంలో చోటు ఉండదు. కనుక దానిని వదలిపెట్టు.' అన్నాడు. కాని ధర్మరాజు అందుకు ఒప్పుకోక 'మహేంద్రా! భక్తుని త్యజించినచో పాపం అంటుకుంటుంది. కనుక నేను ఆ పని చేయలేను. అన్నాడు. ఇంద్రుడు 'వీరవరా! నీ సోదరులను, ద్రౌపదిని కూడ త్యాగం చేసిన వాడవు. ఈ శునక వ్యామోహంలో ఎలా పడిపోయావు?' అని అడిగాడు.

అందుకు ధర్మరాజు 'దేవా! నేను నా సోదరులను, ద్రౌపదిని జీవితావస్థలో త్యాగం చేయలేదు (బ్రతికి వుండగా వారిని త్యజించ లేదు. కాని ఈ శునకము జీవితావస్థలో బ్రతికి వుండగా దీనిని వదలి రాలేకున్నాను. కనుక దీనిని వదలి వచ్చే ప్రసక్తే లేదు.' అని సమాధానమిచ్చాడు.

విశేషం: శునక రూపంలో వచ్చిన యమధర్మరాజు ప్రత్యక్షమై తన కుమారుడైన ధర్మరాజును ఎంతో ప్రశంసించాడు. ఆ తర్వాత యమధర్మరాజు, ఇంద్రుడు, మరుత్ గణాలు, అశ్వనీ కుమారులు, దేవతలు మరియు దేవర్షులు అందరూ స్వాగతం పలికి, ధర్మరాజును సశరీరంగా స్వర్గానికి తీసుకొని వెళ్ళసాగారు.

మహాతపస్వి యైన నారదుడు దేవమండలంలో స్థితులై వున్నవారితో ఇలా అన్నాడు. 'ధర్మరాజు తన కీర్తిలో, తేజస్సులో సదాచార రూప సంపత్తితో ముల్లోకాల్లో ప్రవేశిస్తూ, భౌతిక శరీరంతో స్వర్గానికి రావడం ఎంతో స్ఫూర్తి దాయకమైనది. నారద మహర్షి పలుకులు విన్న ధర్మరాజు వారి అనుమతి తీసుకొని ఇలా అన్నాడు. 'ఇది స్వర్గం అయినప్పటికిన్నీ, నా సోదరులు మరియు సత్త్వగుణ సంపన్నురాలైన ద్రౌపదీ దేవి లేని చోట నేనుండలేను.' అనగా ఇంద్రుడు వారినందరినీ ధర్మరాజుకు చూపించాడు.

-o0o-

18. స్వర్గారోహణ పర్వం

జనమేజయుడు – 'మునివర్యా! పాండవులు మరియు కౌరవులు స్వర్గం చేరుకొన్న తర్వాత వారు ఏయే స్థానాల్ని ఆక్రమించారు?'

వైశంపాయనుడు – 'రాజా! ధర్మరాజు స్వర్గం చేరుకొన్న తర్వాత అక్కడ దుర్యోధనుడు స్వర్గీయ శోభతో దివ్యమైన సింహాసనంపై కూర్చొని ఉండటం చూశాడు. వెంటనే వెనుకకు వచ్చి 'ఓ దేవతలారా! నిండు సభలో ద్రౌపదిని అవమానించిన దుర్యోధనుడు ఉన్న సభలో నేనుండటానికి ఇష్టపడను' అన్నాడు. ఆ మాటలు వినిన నారద మహర్షి 'ఓ ధర్మరాజా! స్వర్గం చేరుకొన్న తర్వాత మానవ లోకంలో ఉండే వైరం, విరోధం, మాత్సర్యం ఎక్కడా ఉండదు.' అని చెప్పాడు. అపుడు ధర్మరాజు ఇలా అడిగాడు. 'ఓ మహర్షీ! మహావ్రతధారులు, సత్యప్రతిజ్ఞలు, విశ్వవిఖ్యాతులు, సత్యవాదులైన నా సోదరులకు ఏలోకం ప్రాప్తించింది? కర్ణుని, దృష్టధ్యుమ్నుని, సాత్యకిని చూడాలని వుంది. ఇంకా విరాటుడు, ద్రుపదుడు, పాంచాల రాకుమారులు, శిఖండి, ద్రౌపది యొక్క ఐదురుగు పుత్రులు మరియు అభిమన్యుడు మొదలైనవారిని కలుసుకోవాలని ఉంది. వారు లేని లోకములలో నేనుండలేను. భీమార్జున నకులసహదేవులు మరియు నా కొరకు వీరస్వర్గం చేరిన వీరులు, సూర్యపుత్రుడైన కర్ణుని పాదాలు నా తల్లి కుంతి పాదాలను పోలి ఉండటం చూచిన నేను అపుడు కర్ణుని అనుసరించలేక పోయానని పశ్చాత్తాప పడుతున్నాను. వారు నరకంలో వున్నా సరే, నేను కూడా వారితోనే వుండటానికి ఇష్టపడతాను.' దేవతలు అపుడు ఇలా అన్నారు. 'ఓ రాజా! మీ కోరిక అదేయైనచో రండి. వారున్న చోటికి మిమ్మల్ని తీసికొని వెళ్తాం. ఇంద్రుని ఆజ్ఞతో మీకు ప్రియము కూర్చుట మా కర్తవ్యం అయి వున్నది.'

దేవతలతోపాటు ధర్మరాజు, భీముడు మొదలగువారున్న శైలానికి పోసాగారు. ముందు దేవదూత నడువగా, వెనుక ధర్మరాజు నడుస్తున్నాడు. వారిద్దరు నడుస్తుండగా, క్రమంగా ఒక కంటకప్రాయమైన త్రోవ వచ్చింది, నడవటం కష్టమైంది. ఆ మార్గంలో పాపకర్ములు నడుస్తున్నారు. అంతా చీకటిగా వుంది. మార్గం ఇరువైపులా మృతదేహాలు, వాటినుండి వచ్చు దుర్గంధం వ్యాపించింది. ఎముకలు, వెంట్రుకలు రాసులు రాసులుగా పడివున్నాయి. ఇనుప ముక్కులు కలిగిన కాకులు, గెద్దలు తిరుగుతున్నాయి. ప్రేతాలు సూదుల్లాంటి ముఖాలతో ఇష్టానుసారం సంచరిస్తున్నాయి. ఆ ప్రేతముల శరీరాల నుండి రక్తం కారుతోంది.

తెగిపడిన అవయవాలు వికృతంగా కనిపిస్తున్నాయి. ఎంతో వికృతమైన మార్గంలో అలా ధర్మరాజు నడుస్తూ వున్నాడు. అక్కడ ప్రవహిస్తున్న నదిలోని నీరు సెగలు, పొగలు క్రమ్ముతూ ప్రవహిస్తోంది. దానిని దాటివెళ్ళడం అతి కష్టం. మరొకవైపు సలసలకాగే కుళాయిలలో నూనె ఉంది. అక్కడే పాపులైన వారిని శిక్షిస్తూ వుంటారు. అటువైపు ధర్మరాజు దృష్టి పడింది. అపుడు ధర్మరాజు ఆ దేవదూతను ఇలా అడిగాడు – 'ఇలాంటి మార్గంలో మనం ఇంకెంత దూరం ప్రయాణించాలి? నా సోదరులు ఎక్కడ వున్నారు?' ధర్మరాజు ఈ ప్రశ్నను వినిన దేవదూత 'ఇంతవరకే మీరు రావాల్సి ఉంది.' 'దేవతలు నాకు ముందే తమరు అలసిపోయేంతవరకు తీసికొని వెళ్ళి అక్కడినుండి వెనుకకు తీసికొని రావాల్సిందని చెప్పారు. కనుక ఇపుడు మిమ్మల్ని మళ్ళీ స్వర్గానికి తీసుకొని వెళ్తాను. మీరు అలసిపోయి ఉంటే నాతోరండి' అని ఆ దేవదూత చెప్పాడు.

ధర్మరాజు దేవదూతతోపాటు వెనుకకు కదిలే సమయంలోనే, నలుదిక్కులనుండి దుఃఖితుల ఆర్తనాదాలు వినిపించ సాగాయి. ఇలా 'ఓ ధర్మనందనా! మీరు దయతో మరి కొంచెంసేపు ఇక్కడే ఉండండి. మీరు ఇటు

రాగానే అతి పవిత్రమైన మరియు పరిమళభరితమైన వాయువు వీయడంవల్ల మాకు ఎంతో సుఖం లభించింది. ఓ కుంతీనందనా! చాలాకాలానికి మీ దర్శన భాగ్యం లభించింది. కనుక కాసేపు ఇక్కడనే ఆగిపొండి. మీరిచ్చట ఉండటం వల్ల వీరు మమ్మల్ని పెట్టే బాధలు మమ్లల్ని బాధించడం లేదు.' ఈ దుఃఖితుల మాటలు విని , ధర్మరాజుకు దయకల్గి అక్కడనే ఉండిపోయాడు. మళ్ళీ మళ్ళీ ఆర్తనాదాలు వినవస్తున్నాయి. అవి ఎవరి గొంతులో అర్థం కావడం లేదు, వాటిని పోల్చుకోలేక పోయాడు. అందుచేత ఆ జీవులను సంబోధిస్తూ – 'మీరు ఎవరు? ఇక్కడ ఎందుకున్నారు?' అని అడగగానే, నలుదిశల నుండి ఇలా వినిపించింది. 'నేను కర్ణుని, నేను భీమసేనుణ్ణి, నేను అర్జునుణ్ణి, నేను నకులుణ్ణి, నేను సహదేవుణ్ణి, నేను దృష్టధ్యుమ్నుణ్ణి, నేను ద్రౌపదిని, మేము ద్రౌపదీ పుత్రులం అంటూ తమ తమ పరిచయాలను ఇస్తూ విలపించసాగారు. వారి విలాపాన్ని వింటూ, ధర్మరాజు తన మనసులో ఇలా ఆలోచించ సాగాడు. 'దైవం యొక్క విధానమేమిటి మహాత్ములైన నా సోదరులు, కర్ణుడు, ద్రౌపది పుత్రులు వీరంతా ఏమి పాపము చేసినారని,, ఇలాంటి నరకంలో పడి వున్నారు? నా సోదరులందరు ధర్మసూక్ష్మాలు తెలిసినవారే, శూరవీరులే, సత్యవాదులే, శాస్త్రానుకూల వర్తనలే, యజ్ఞాలను చేసినవారే, దానధర్మాలు చేసినవారే, అయినా వీరికి ఈ దుర్గతి ఎలా ప్రాప్తించింది? నేను చైతన్యంలో ఉన్నానా? నిద్రపోతున్నానా? కలలో వున్నానా? ఈరకంగా ఆలోచించినవాడై ధర్మరాజు, దేవదూతతో ఇలా అన్నాడు. 'ఓయీ! నీవెవరి దూతవో వారి దగ్గరకు వెళ్ళిపో. అక్కడికి నేను రాను. మీ యజమానులకు చెప్పు, ధర్మరాజు అక్కడనే వుంటానన్నాడని, నేను ఇచ్చట వుండటం వల్లనా సోదరులకు మరియు బంధువులకు సౌకర్యంగా వుంటుంది.'

ధర్మరాజు అలా చెప్పగానే దేవదూత, దేవరాజైన ఇంద్రుని దగ్గరకు వెళ్ళి, ధర్మరాజు యొక్క మాటలను యథారీతిగా నివేదించాడు.

ధర్మరాజు ఆ స్థలంలోనే వున్న ముహూర్త కాలం గడవక ముందే, ఇంద్రుడు దేవతలనందరిని తీసికొని అక్కడకు వచ్చాడు. సాక్షాత్తూ యమధర్మరాజు కూడ శరీరాన్ని ధరించి వచ్చాడు. వారందరి తేజస్సుతో అక్కడి అంధకారం పూర్తిగా తొలగిపోయింది. శీతల సుగంధ వాయువులు నెమ్మదిగా వీస్తున్నాయి. ఇంద్రునితోసహా మరుత్ గణములు, వసువులు, అశ్వినీ కుమారులు, సాధ్యులు, రుద్రులు, ఆదిత్యులు మరియు స్వర్గవాసులైన సిద్ధులు, మహర్షులు – వీరందరు మహాతేజస్వియైన ధర్మరాజు చుట్టూ చేరారు.

ఇంద్రుడు ధర్మరాజును సాంత్వనపరుస్తూ ఇలా అన్నాడు. 'ధర్మరాజా! ఇంతవరకు జరిగిందేదో జరిగిపోయింది. ఇక మీకు కష్టము అవసరం లేదు. మీరు మాతో రండి. మీకు సిద్ధి ప్రాప్తించింది. అక్షయ లోకాల ప్రాప్తి కూడా లభించింది. మీరు వెళ్ళివచ్చిన నరకం గురించి ఆగ్రహించవద్దు. మానవులు సాధారణంగా శుభాశుభ కర్మల ఫలాలను సంచితం చేసుకొంటారు. ఒక నియమము ననుసరించి, మీ మేలు కొరకే నరక దర్శనం చేయించాను. మీరు అశ్వత్థామ చనిపోయాడని, ద్రోణాచార్యునికి విశ్వాసం కలిగించారు. అందుచేతనే మీకు కపటోపాయంతో నరకం చూపించాం.

ధర్మరాజా! మీ పక్షాన యుద్ధంలో అమరవీరులైన వారందరు ఈ పాటికే స్వర్గం చేరుకొన్నారు. ఉత్తమ సిద్ధిని పొందిన శ్రేష్ఠుడైన కర్ణుడు, నీ సోదరులు, ఇతర రాజులు వారి వారి యోగ్యస్థానాలను పొంది వున్నారు. వారందరినీ చూద్దురుగానీ నాతో రండి.

మహారాజా! అదిగో, త్రిభువనములను పవిత్రం చేయు దేవనదియైన మందాకినిలో నీవు స్నానం చేసి దివ్యలోకాలకు వెళ్ళవచ్చును. నీవు అందులో మునక వేయగానే నీ మానవ స్వభావం అంతరించి, శోకము,

వైరము మున్నగు దోషములన్నియు మాయమౌతాయి.'

అప్పుడు అచటికి వచ్చిన యమధర్మరాజు ఇలా అన్నాడు. 'నాయనా! నేను నిన్ను ఎన్నోసార్లు పరీక్షించాను. నీలో పాపం ఇసుమంతైనా లేదు. నీ సోదరులు అనుభవిస్తున్న నరకం, ఆ దృశ్యం కేవలం ఇంద్రుని యొక్క మాయ అని గ్రహించుకో. భరతశ్రేష్ఠా! రమ్ము. నాతోపాటు వచ్చి త్రిలోకగామినియైన గంగను దర్శించుకో.

ఆ తరువాత, మునిజనవందిత, పరమపావని, దేవనదియైన గంగలో స్నానం చేయగానే మానవ శరీరం నశించిపోయి, దివ్యశరీరం వచ్చింది. అచటినుంచి వైరము వీడి ఆనంద లోకాల్లో ఉన్న కర్ణుడు మరియు పాండవులు వున్న స్థలానికి వెళ్ళారు.

ఆ తరువాత దేవతలు, ఋషులు, మరుద్గణము ధర్మరాజును ప్రశంసిస్తూ భీమసేనుడు విరాజమానుడై ఉన్న స్థలానికి తీసికొని వచ్చాడు. ఆ సర్వాంతర్యామి పరంధామంలో స్వయంగా శ్రీకృష్ణ భగవానుడు ఆసీనుడై ఉన్నాడు. అతని దివ్యరూపం నుండి అత్యంత కాంతివంతమైన వెలుగులు వెదజల్లబడుతున్నాయి. ఆ దేవదేవుని శంఖం, చక్రం, గద, దేవతల్లాంటి రూపాలు ధరించి పరంధాముని సేవలో నిమగ్నులై వున్నారు. అక్కడే కూర్చున్న తేజశ్శాలి, వీరశూరుడయిన అర్జునుడు శ్రీకృష్ణుని ఆరాధిస్తూ ఉన్నాడు. అక్కడికి చేరుకొన్న ధర్మరాజును శ్రీకృష్ణుడు మరియు అర్జునుడు గౌరవించారు.

ధర్మరాజు మరొకవైపు తన దృష్టిని సారించగా, అక్కడ కాంతులీనుతూ కర్ణుడు కూర్చొనియున్నాడు. భీమసేనుడు వాయుదేవుని వద్ద కూర్చొని వున్నాడు. నకుల సహదేవులు అశ్వినీ కుమారుల వద్ద కూర్చుండి వున్నారు. ఆ తరువాత, ఇంద్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'ధర్మరాజా! లోక కమనీయ రూపము గలిగి, సుగంధభరితమైన దేవి అగుపిస్తున్నది, చూడు. ఆమెయే సాక్షాత్తూ భగవతి లక్ష్మియై వున్నది. ఈమె అంశలోనే, మానవ లోకంలో అయోనిజ ద్రౌపదిగా అవతరించింది. ఆదిదేవుడే స్వయంగా ఈమెను మీ సంతోషం కొరకు ద్రుపదుని కుమార్తెగా జన్మింపజేశాడు. ఇదిగో! ఇటు చూడు! అగ్నిసమాన తేజస్సుతో వెలుగొందుతున్న ఐదుగురు గంధర్వులను అగుపిస్తున్నారు. వారు ద్రౌపదీపుత్రులైన ఉపపాండవులు. అదిగో సూర్యునితోపాటు వెళుతున్న కర్ణుని చూడు. యుద్ధంలో ఎన్నటికి పరాజితుడు కాని మేటి ధనుర్ధరుడు, సుభద్ర కుమారుడైన అభిమన్యుని చూడు, చంద్రునితోపాటు ఆసీనుడై వున్నాడు. భీష్మ పితామహుడు వసువులతో, ద్రోణాచార్యుడు బృహస్పతితో కూర్చొని వున్నారు.'

జనమేజయుడు వైశంపాయనుని ఒక ప్రశ్న అడిగాడు. 'విప్రవర్యా! వీరందరు స్వర్గలోకంలో ఎంతకాలం కలిసి వున్నారు?'

వైశంపాయనుడు – 'రాజా! ఈ విషయం అత్యంత రహస్యమైంది. అగాధమైన జ్ఞానం కలిగిన, సర్వజ్ఞుడైన, మహావ్రతధారియైన, పురాతన మునియైన వేదవ్యాస మహర్షి నాతో చెప్పిన ప్రకారం వారందరు వారి వారి మూలరూపాల్లో కలిసిపోయారు.

భీష్ముడు వసువు రూపంలో, ద్రోణాచార్యుడు బృహస్పతిలో లీనమైనారు. కృతవర్మ మరుద్గణాల్లో, ధృతరాష్ట్రుడు కుబేరుని లోకంలోకి, గాంధారితో పాటు వెళ్ళాడు. పాండురాజు, కుంతి, మాద్రిలతోపాటు ఇంద్ర లోకం చేరారు. విరాటుడు, ద్రుపదుడు, అక్రూరుడు, సాంబుడు, కంసుడు, ఉగ్రసేనుడు, వసుదేవుడు, ఉత్తరుడు విశ్వేదేవతలలో కలిసిపోయారు. చంద్రుని యొక్క మహాతేజశ్శాలియైన పుత్రుడు 'వర్చా' అనువాడు నరశ్రేష్ఠుడైన

అర్జునుని పుత్రుడు అభిమన్యునిగా ఖ్యాతి గాంచాడు.

అలాగే ధృతరాష్ట్రుని కుమారులందరు రాక్షసులలో కలిసిపోయారు. విదురుడు మరియు ధర్మరాజు ధర్మసాయుజ్యాన్ని పొందారు. బలరాముడు రసాతలంలోకి వెళ్ళాడు. శ్రీకృష్ణుడు తన మూల స్వరూపంలోనికి మారిపోయాడు. జనమేజయా! ఈ విధంగా, వారి వారి యోగ్యతను బట్టి తగిన స్థానాలకు వెళ్ళిపోయారు.'

సౌతి ఇలా అన్నది – 'బ్రాహ్మణోత్తములారా! జనమేజయుడు వైశపాయనుని ద్వారా మహాభారతమును విని ఆశ్చర్యపడ్డాడు. తదనంతరం సర్పయాగం ముగించుకొని ముని యైన ఆస్తేకుడు ప్రసన్నుడైనాడు. జనమేజయ మహారాజు యజ్ఞ సంబంధ బ్రాహ్మణులకు భూరి విరాళాలు ఇచ్చి, తక్షశిల నుండి హస్తినాపురం వెళ్ళిపోయాడు.

ఈ విధంగా జనమేజయుని సర్పయాగంలో వేదవ్యాస మహర్షి అనుజ్ఞ మేరకు, వైశంపాయనుడు ఏ మహాభారతమును చెప్పెనో, అది మీకు యథాతథంగా చెప్పాను. ఈ పుణ్యమయమైన చరిత్ర చాల పవిత్రమైనది మరియు ఉత్తమమైంది.

సత్సంగుడు, సర్వజ్ఞుడు, ధర్మజ్ఞుడు, సాధువు, జితేంద్రియుడు, శుద్ధుడు, తపోప్రభావం చేత అంతఃకరణ శుద్ధి కలవాడు, యోగవిద్వాంసుడు, పెక్కు శాస్త్ర పారదర్శి, మునివరుడైన వేదవ్యాసుడు తన దివ్యదృష్టి చేత చూసినవాడై, మహాత్ములైన పాండవుల మరియు అన్యరాజుల యొక్క చరిత్రను వ్రాశాడు.

ఏ విద్వాంసుడైతే ప్రతి కావ్యమును ఇతరులకు వినిపిస్తాడో, లేక చదవటానికి అందుబాటులోకి తెస్తాడో, అటువంటి వారి పాపములన్నియు నశిస్తాయి. అటువంటి వారు స్వర్గాధిపత్యము గ్రహించుటకు మరియు బ్రహ్మభావమును అందుకోవటానికి యోగ్యత కలిగివుంటారు.

శ్రీకృష్ణద్వైపాయనుని (వేదవ్యాస మహర్షి) ద్వారా ప్రకటితమైనందున, దానిని పంచమవేదం అన్నారు.

ఎవరైతే ఏకాగ్ర చిత్తంతో ఈ మహాభారత ఇతిహాసాన్ని వినెదరో, చదివెదరో, వారందరూ బ్రహ్మహత్యా దోషము కూడ పరిహరింపబడిన వారగుదురు.

శ్రాద్ధకర్మలలో ఇందులోనుండి ఏ అంశం వినిపించినను, పితరులు సంతుష్ట లౌతారు. ఇందులో భరత వంశీయుల జన్మ, కర్మల యొక్క వర్ణన వుంది. కనుక దీనిని మహాభారతం అని అంటున్నాం. ఇవి విశాలకాయము కలిగి ఉంది. కావున మహాభారతం అని అంటున్నాం. వేదవిద్య యొక్క మహాసాగరము మరియు 18 పురాణాలు, సంపూర్ణ ధర్మశాస్త్రాలు, నాలుగు వేదాలు మరియు ఆరు వేదాంగాలు ఒకవైపు మరియు కేవలం మహాభారతం రెండవ వైపు పెట్టి తూచినచో ఒకే ఒక మహాభారతం జ్ఞానంలో సమానంగా తూగుతుంది.' మునివర్యుడైన శ్రీకృష్ణద్వైపాయనుడు మూడు సంవత్సరాలలో సంపూర్ణ మహాభారతాన్ని రచించాడు.

ఏదైతే 'జయ' అను పేరుతో వుందో, అటువంటి ఈ మహాభారత ఇతిహాసాన్ని సర్వకాల సర్వావస్థల యందు భక్తిపూర్వకంగా వింటారు, చదువుతారో, వారిని శ్రీ (లక్ష్మి), కీర్తి, విద్యాప్రాప్తి వరిస్తుంది. ధర్మార్థ కామ మోక్షాలను గురించి మహాభారతంలో ఉన్నదే, ఇతర గ్రంథాల్లో ఉంది. ఇందులో లేనిది, మరెందులోనూ లేదు, ఉండదు.

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే

హరే రామ హరే రామ రామ రామ హరే హరే॥

శ్రీ మహాభారతం సంపూర్ణం

।।స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయేన మార్గేణ మహీంమహీశాః।
గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు।।

కాయేనవాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్వభావాత్।
కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి।।

శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేఽర్థినాం।
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం।।

-: శ్రీకృష్ణార్పణమస్తు :-